ప్రాచీన తాళపత్ర నిధులలోని

సాంప్రదాయిక శాస్త్ర పీఠం

ఆచార, ధర్మములు - ఆలోచనలు



తాళపత్రనిధి
పుస్తకముతో
ఈ పుస్తకం ఉచితం

93180

బ్రహ్మశ్రీ గుత్తికొండ వేంకటేశ్వర శర్మ

ప్రాచీన తాళపత్ర నిధులలోని సాంప్రదాయక శాస్త్రపీఠం

ఆచార, ధర్మములు - ఆలోచనలు

ద్విభాషాకవి

బ్రహ్మశ్రీ గుత్తికొండ వేంకటేశ్వర శర్మ

భాషాప్రవీణ, తెలుగు పండిట్



తాళపత్రనిధి
పుస్తకముతో
ఈ పుస్తకం ఉచితం

ప్రచురణ కర్తలు

గొల్లపూడి వీరాస్వామి సన్

పబ్లిషర్స్ అండ్ బుక్ సెల్లర్స్

కోటగుమ్మం - రాజమండ్రి - 533 101

ప్రాచీన తాళపత్ర నిధులలోని సాంప్రదాయికశాస్త్రపీఠం

ఆచార, ధర్మములు - ఆలోచనలు

రచన

బ్రహ్మశ్రీ గుత్తికొండ వేంకటేశ్వర శర్మ

శరణ బసవేశ్వర కాలనీ, సేవాభారతీ స్కూల్ వెనుక,
సింధనూరు, రాయచూరు జిల్లా.
కర్ణాటక - 584 128, సెల్: 09449432351

390
గ్రంథ-ప్రశ్న

ప్రథమముద్రణ :
విజయవాడ పుస్తక మహోత్సవము -
శ్రీసర్వజిత్ నామ సం॥రము 2008 -ఫిబ్రవరి

ద్వితీయముద్రణ :
విజయవాడ పుస్తక మహోత్సవము -
శ్రీవిరోధినామ సం॥రము 2010 -జనవరి

ముఖచిత్రాలు :
కె.బి. క్రియేషన్స్
రాజమండ్రి - 533 103.

గ్రంథ ముద్రణ :
చైతన్య ఆఫ్‌సెట్ ప్రింటర్స్
విజయవాడ

ముఖచిత్ర ముద్రణ :
ఈశ్వర్ గ్రాఫిక్స్
రాజమండ్రి - 533 103.

C-14011

ఈ గ్రంథ రచనలోని
అభిప్రాయాలు రచయిత
వ్యక్తిగతమైనవి.
ప్రచురణకర్తలు వీటికి బాధ్యత
వహించజాలరు.

ఈ పుస్తకములోని
మీకు కలిగే సందేహాలకు
ఈ రచయితనే
సంప్రదించండి!

సర్వహక్కులు ప్రకాశకులవి

ప్రకాశకులు :
గొల్లపూడి వీరాస్వామి సన్
కోటగుమ్మం - రాజమండ్రి - 533 101.

Acc. No. 93180

శాస్త్రపీఠం

హిందూమతం ఆచారాల పుట్ట! కులాలగుట్ట!

ఒక్కొక్క కులానికి ఒక్కొక్క ఆచారం!

ఒక్కొక్క ఆచారానికి ఒక్కొక్క శాస్త్రం

ఎన్నో వేలకువేల సంవత్సరాలనుండి మన పూర్వీకులందరూ ఆచరిస్తూ, నుసరిస్తూ, అభిమానిస్తూ వచ్చిన ఈ సంప్రదాయాలలోని లోగుట్టు ఏమిటి? ఈ వారాలలోని అంతరార్థమేమిటి?

ఈ దిశగా సాగిన చిన్న ప్రయత్నమే ఈ రచన.

ప్రతి ఆచారంవెనుక ఒక అంతరార్థం వుంది. ఒక ప్రయోజనం వుంది. ఒక పరమార్థం వుంది. ఒక మూఢత్వం కూడా వుంది. ప్రతి మతానికి కొన్ని ఆచారాలు సంప్రదాయాలు వుండటం సహజమే! కాని హిందువులకున్నన్ని ఆచారాలు నమ్మకాలు మరొకరికి లేవేమో! అనటం తప్పుగాదు. ఒక్కొక్క దేవునికి ఒక్కో ఆచారం వుంది.

శాస్త్రాలనూ, ఆచారాలనూ, ఆనవాయితీలనూ, మన పూర్వీకులందరూ గంగిరెద్దులా తల ఆడించి పాటించారా? గానుగెద్దులా అనుసరించారా? గ్రుడ్డి వారిలా ఆచరించారా?

లేదు! లేదు!!

ప్రతి ఆచారం వెనుకా ఒక శాస్త్రీయ కారణం వుంది.

మంచి వివేచన వుంది.

మన ఆచార శాస్త్రాలలోని గొప్పదనాన్నీ, ఆలోచననూ, వివేకాన్నీ, విజ్ఞాన దృష్టినీ, బుద్ధికుశలతనూ, తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. నాగరికత నెపంతో మన ఆచారాలను "పాత చింతకాయ పచ్చడి"గా చూడటం మంచిదా? మంచిదికాదు.

"పురాణ మిత్యేవ నసాధుసర్వమ్"

ప్రాచీన ఆచారాలు మంచివి అనిగానీ, ఈనాటి పద్ధతులు చెడ్డవి అనిగానీ కాదు. పాత ఆచారాలలో కొన్ని చెడ్డవి కూడా వున్నాయి. అధునాతన ఆచారాలలో చాలా మంచివి కూడా వున్నాయి. పూర్వాచారాలను తులనాత్మక దృష్టితో వివరించి విప్పి చెప్పటమే ఈ రచన ముఖ్యోద్దేశ్యం. నా దృష్టికి అందని నాకు తెలియని ఇంకెన్నో ఆచారాలు ఎన్నెన్నో విషయాలున్నాయి. మరచిపోతే మన్నించండి.

"నేను సైతం జ్ఞానజ్యోతికి తైలబిందువుపోసి మ్రొక్కేను"

- టి.వి.శర్మ

కృతజ్ఞతలు

శ్రీ గొల్లపూడి వీరాస్వామిగారు

నన్నయ మహాకవి ఆంధ్రమహాభారతాన్ని రచించిన
రాజమహేంద్రవరం గడ్డమీద
ఎన్నో దశాబ్దాలనుండి ప్రాచీన దివ్య సాహితీ వనాన్ని
పుణ్యగోదావరీ తీర్థాలతో
పెంచి పోషిస్తున్న
సన్మాన్య శ్రీ 'గొల్లపూడి' వారికి

కృతజ్ఞతాభి వందనాలు

రచయిత

అంకితం

మాటలురాని ఆనాటి మానవజాతి మొత్తం
నేటికి యింతటి పరిణామస్థితి చెందటానికి
కారణమెవరు??

నాటి ప్రభువులుకాదు !
వారి అధికార ముద్రలుకాదు !
యుద్ధలాలస, అధికారకాంక్ష కాదు !
మరెవరు?

జనావాసాలకు దూరంగా వుండి.
ఋషి జీవితం గడుపుతూ
సమగ్రమానవుని సమున్నతికోసం
అహరహమూ అనుక్షణమూ తపించి
శోధించి గాలించి సాధించి అందించిన
భారతీయ మహర్షుల విజ్ఞానమే కారణం !
ఆ మహాత్ముల దివ్యచరణాలకు అభివందనం !

తెలియని భాషలోవున్న నాటి నిక్షిప్త నిధులను
తరతరాలుగా మనవాళికి అందిస్తూ వున్న
ఎందరెందరో నాటి-నేటి భారతీయ రచయితలకూ
అంజలి ఘటిస్తున్నాను.

అలనాటి మహర్షులకు, ఈ నాటి రచయితలకు

నా ఈ శాస్త్రపీఠాన్ని

పూజాపుష్పంగా
అంకితం చేస్తున్నాను.

- రచయిత

విషయ సూచిక

1.	ఆచారము అంటే ఏమిటి?	13
2	వర్ణాశ్రమధర్మం అంటే ఏమిటి?	14
3.	కులాలు ఎపుడు పుట్టాయి?	18
4.	స్త్రీ పురుషులకు వివాహం తప్పనిసరియా?	19
5.	భార్యాభర్తల్లో పురుషునికి పెద్దవయస్సు ఎందుకు?	26
6.	కులాంతర - మతాంతర వివాహాల్లో ఏది మంచిది? ఏడడుగుల సంబంధమంటే ఏమిటి?	30
7.	'ధర్మం' అంటే ఏమిటి?	38
8.	'బ్రాహ్మణుడు' అంటే ఎవరు?	45
9.	స్త్రీలకు "పిత్రార్జిత ఆస్థిహక్కు" శాస్త్ర సమ్మతమా?	47
10.	'కుంకుమ'ను ఎందుకు ధరించాలి?	49
11.	దేవాలయాలు ఎందుకు?	50
12.	మన దేవాలయాలమీద బూతు బొమ్మలెందుకు?	52
13.	సన్యాసుల చేతిలో పొడవైన కర్ర ఎందుకు?	55
14.	వేదాలు నాలుగు కదా! ఆయుర్వేదం ఏమిటి?	56
15.	ఆలయ గోపురం ఎత్తుగా ఎందుకు కట్టాలి?	58
16.	విగ్రహారాధన సనాతనమా?	59
17.	మంత్రాలు సంస్కృత భాషలో ఎందుకు?	62
18.	భోజనానికి ముందు కాళ్ళు ఎందుకు కడుక్కోవాలి?	63
19.	శకునాలు చూడటం మంచిదా?	65
20.	స్నానం చేయకుండా పూజ చేయకూడదా?	66
21.	పండుగలు ఎందుకు?	68
22.	మాతాపితృకర్మలు తప్పనిసరిగా చేయాలా?	71
23.	శవాన్ని పూడ్చటం మంచిదా! కాల్చటం మంచిదా?	72
24.	వరదక్షిణ - కన్యాశుల్కం ఈ రెండు అవసరమా?	74
25.	మన వివాహ వ్యవస్థ ఎపుడు ప్రారంభమైంది?	75
26.	క్రొత్త దంపతులు ఆషాఢమాసాన్ని పాటించాలా?	77

27. [illegible]
కొడుకును గొప్పగా చూస్తారేమిటి? 78
28. 'పెళ్ళినాటి ప్రమాణాలు' అంటే ఏమిటి? 81
29. స్త్రీలు బహిష్టు సమయాల్లో దూరంగా వుండాలా? 82
30. భార్య లేనివాడు దైవకార్యాలకు పనికిరాడా? 84
31. భర్త మరణించిన తరువాత
పూలు కుంకుమలను స్త్రీలు వదిలేయాలా? 85
32. దేవుని పేరున జరిగే పూజాదికాలను నమ్మవచ్చా? 87
33. పంచేంద్రియాలలో ఏది గొప్పది? 90
34. పతియే ప్రత్యక్ష దైవమా! సతి ప్రత్యక్ష దేవత కాదా! 91
35. మనువు "నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అనటం న్యాయమా ! 93
36. కర్మసిద్ధాంతం అంటే ఏమిటి? 96
37. మంత్రాలతోనే దేవుని పూజించాలా? 97
38. చేతబడులు నిజంగా వున్నాయా? 99
39. సుముహూర్తం తిథి, రాహుకాలం, నమ్మవచ్చా? 100
40. అక్క - మేనత్త - మేనమామ బిడ్డల్ని వివాహమాడవచ్చా? 102
41. రామాయణ - భారత కథలు యదార్థమా? 103
42. పెండ్లిని 'పాణిగ్రహణం' అంటారెందుకు? 108
43. కలలు ఎందుకొస్తాయి ! కలలు నిజమౌతాయా? 109
44. సమాజం నాలుగు వర్ణాలుగా ఎందుకు అయింది? 111
45. రాముడు సీతను పరిత్యజించటం న్యాయమా? 115
46. శ్రీకృష్ణునికి అంతమంది భార్యలు ఏమిటి? 118
47. దైవభక్తి మంచిదేనా? 121
48. మహమ్మదీయ మతధర్మం ఏమిటి? 122
49. క్రైస్తవ మత ధర్మం ఏమిటి? 124
50. 'జంతుబలి' శాస్త్ర సమ్మతమా? 125
51. దెయ్యాలు వున్నాయా? 127
52. దైవ ప్రార్థనలో శృంగారం సమంజసమా? 128
53. దైవ విగ్రహానికి అమూల్యాభరణాలు వుండాలా? 132
54. దేవదాసీలు దేవాలయాలకు అవసరమా? 134
55. మొక్కులు తీర్చకుంటే, కష్టాలు కల్గుతాయా? 137

56.	శ్రీహరిశ్చంద్రుడు భార్యను అమ్మటం న్యాయమా?	138
57.	తిరునాళ్ళు జాతరలు ఎందుకు?	143
58.	గురుకులం అంటే ఏమిటి?	144
59.	విద్య, వేదము, అన్నము విక్రయించకూడదా?	146
60.	మరణం ప్రాణులకు ఆవశ్యకమా?	147
61.	ఒకే యింటి అక్కచెల్లెళ్ళను అన్నదమ్ములు వివాహమాడవచ్చా?	149
62.	బిడ్డలు కలుగనివారు నాగశిలను పూజిస్తారేమిటి?	151
63.	గోవును భూలోక దేవతగా పూజిస్తారెందుకు?	152
64.	దేవాలయాల్లో రావిచెట్టు, వేపచెట్టు ఎందుకుంటాయి?	154
65.	దశావతారాలలో కృష్ణావతారమే గొప్పదా?	155
66.	జ్యోతిష్యం నమ్మదగినదా?	157
67.	సృష్టికి మొదటి దంపతులు ఎవరు?	159
68.	విజయదశమికి శమీపూజ చేస్తారేమిటి?	160
69.	హిందూమతం పితృస్వామ్య ప్రధానమా?	162
70.	భర్త అసమర్థుడైతే భార్య మరొకరితో సంతానం పొందవచ్చా?	163
71.	భార్యను వివస్త్రగా చూడటం పాపమా?	165
72.	హిందూమతం స్త్రీకి స్వేచ్ఛను ఇవ్వలేదా?	166
73.	ఒక్కస్త్రీకి ఒక పురుషుడు అనే ధర్మం సనాతనమా?	169
74.	రాజులకు భార్యలు ఎందరైనా వుండవచ్చా?	171
75.	దానధర్మాలవల్ల పుణ్యం కల్గుతుందా?	173
76.	ఆడపిల్ల ప్రథమ రుతుమతికి వేడుకలు చేస్తారెందుకు?	174
77.	తొమ్మిదవ 'అంకె' గొప్పదంటారేమిటి?	176
78.	గంగానది పరమ పవిత్రమా?	177
79.	వ్యాసమహర్షి దైవ స్వరూపుడా?	179
80.	కలికాలం అంటే, కానికాలమా?	180
81.	అంతిమ సంస్కారంలో మొలత్రాడు కూడా వుండకూడదా?	183
82.	కొడుకులు లేనివారికి శ్రాద్ధ కర్మలు ఎవరు చేయాలి?	185
83.	ఆడపడుచుచేతనే పెండ్లికొడుకును చేయిస్తారెందుకు?	186
84	గృహిణికి కాలిమెట్టెలు నల్లపూసలు ఎందుకు? తాళిబొట్టుకి అర్థమేమిటి?	188
85.	వాస్తు శాస్త్రం నిజమా?	189
86.	దీపావళికి పటాసులు కాల్చాలా?	191

87. శుభకార్యాలు మాఘమాసంలోనే వుంటాయేమిటి? 192
88. "దేవహో దేవాలయః" అంటే ఏమిటి? 194
89. లక్ష్మీదేవి కమలంలో వుండి ప్రక్కనే ఏనుగులు వుంటాయేంటి? 198
90. సరస్వతి రాతిమీద కూర్చుంటుందేమిటి? 200
91. వధూవరులకు అక్షింతలువేసి నమస్కరిస్తారెందుకు? 201
92. దేవాలయానికి వెళ్ళినపుడు కొంతసేపు కూర్చొని రావాలా? 204
93. మంచివారికి కష్టాలు, చెడ్డవారికి సుఖాలు వుంటున్నాయెందుకు? 206
94. దేవాలయాలు తప్పని సరిగా వుండాలా? 207
95. ప్రభవ-విభవ సంవత్సరాలు అరవై మాత్రమే ఎందుకున్నాయి? 209
96. పూర్వకాలంలో వేశ్యావాటికలను ఎందుకంగీకరించారు? 210
97. ఒకే గోత్రీకుల మధ్య వివాహాలు ఎందుకు చేయరాదు? 213
98. పితృదేవతలకు శ్రాద్ధకర్మలు, సంవత్సరీకాలు చేయవల్సిందేనా? 215
99. 'మనుస్మృతి' మను ధర్మాలు అంటే ఏమిటి? మనువు ఎవరు? 218
100. కళాజీవనం దరిద్రమా? 233
101. "దుఃఖం" ఒక యోగమా? 235
102. హిందువులు 'విడాకులు' తీసికొనవచ్చా? 236
103. బ్రాహ్మణులు మాంసం ఎందుకుతినరు? 238
104. శివుని మాత్రమే లింగరూపంలో దర్శించారెందుకు? 239
105. "కర్మయోగం"అంటే ఏమిటి? 241
106. అన్ని విషయాలలోనూ "సత్యమే" చెప్పాలా? 242
107. "ధర్మోరక్షతి రక్షితః" అంటే ఏమిటి? 245
108. దేవుడు ఎక్కడుంటాడు? 246
109. తల విరబోసుకొని తిరుగకూడదా? 248
110. ఇంటిముందు కలాపి ఎందుకు చల్లాలి? 249
111. ఏడ్చేమగవానినీ, నవ్వే ఆడదానినీ నమ్మకూడదా? 250
112. శ్రీ కృష్ణుని తలమీద నెమలి పింఛం ఎందుకుంటుంది? 251
113. "వైద్యో నారాయణో హరిః" అంటే ఏమిటి? 252
114. గణేశచవితి గణపతిని నిమజ్జనం చేయాలా? 254
115. దేవుళ్ళకు జంతు వాహనం ఏమిటి? 255
116. కోర్కెలతో దేవుని పూజించటం మంచిదా? 257

117. నాగులచవితికి పుట్టలో పాలు పోయాలా? 258
118. దానాలు బ్రాహ్మణులకు మాత్రమే చేయాలా? 260
119. కుక్కను కొట్టకూడదా? 261
120. స్త్రీలు - శూద్రులు 'వేదాలు' చదువకూడదా? 263
121. గుడిలోని పూజారికి కానుక లివ్వాలా? 264
122. భార్య భర్తకు ఎడమవైపుగానే ఎందుకుండాలి? 266
123. భోజనం మౌనంగా చేయాలా? 267
124. దైవబలం లేకుంటే మానవశక్తి సహకరించదా? 268
125. సంక్రాంతికి 'పశుపూజ' ఎందుకు చేస్తారు? 269
126. "మడి" అనే పద్ధతి ఏమిటి? 270
127 పాతివ్రత్యం స్త్రీలకు మాత్రమే ఎందుకు? 272
128 మాతృభూమి, మాతృభాష, అన్నిటికీ తల్లిపేరే ఎందుకు పెట్టారు? 273
129. పార్వతీదేవిని "దుర్గ" అని ఎందుకంటారు? 275
130. వేదాలు ఎందుకు? ఏ వేదం ఏం చెబుతుంది? 276
131. మనుస్మృతి సంస్కృతి మంచిదా? 278
132. స్వర్గ - నరకాలు నిజంగా వున్నాయా? 279
133. పూర్వం దశావతారాల్లో 'బుద్ధావతారం' లేదా? 281
134. లక్ష్మికి వున్నంత గౌరవం సరస్వతికి లేదేమిటి? 282
135. అలిగి అత్తవారింటికి వెళ్ళకూడదా? 284
136. ద్వైత - అద్వైత మతాల వ్యత్యాసమేమిటి? 285
137. తండ్రిదొక కులం, తల్లిదొక కులమైతే బిడ్డదే కులం? 287
138. బాబాలు, స్వాములు, దేవుని దూతలా? 288
139. రుద్రాక్షల మహిమ ఏమిటి? 290
140. ఈనాటి స్మృతి శాస్త్రాలు ఎవరు రచించారు? 291
142. నవరాత్రుల విశిష్టత ఏమిటి? 293
143. విజాతి వివాహాలకు సనాతన మన్నన వున్నదా 294
144. రావణుడు మహాపండితుడా? 296
145. దేవునికి కొబ్బరికాయనే ఎందుకు కొట్టాలి? 297
146. విశ్వకర్మ ఎవరు? 299
147. ముఖ జ్యోతిష్యం అంటే ఏమిటి? 302

148. 'అంతర్వాణి' అంటే ఏమిటి	303
149. షష్టిపూర్తి వేడుక ఎందుకు?	305
150. మరణించినవారిని వూరేగిస్తారెందుకు?	306
151. రామాయణ భారతాల నీతి ఏమిటి?	308
152. గాయత్రీ మంత్రార్థమేమిటి?	309
153. విబూదికి, నామాలకు, మూడు గీతలు ఎందుకు?	311
154. బుద్ధుని 'అష్టాంగమార్గం' అంటే ఏమిటి?	312
155. ఉత్తరాయణం పుణ్యకాలమా?	314
156. ద్రౌపది ధర్మవిజితయా?	315
157. ఇంటికి 'సున్నం' ఎందుకు వేస్తారు?	317
158. చనిపోయినవారింటి దీపాన్ని చూడకూడదా?	318
159. ఇంటిముందు తులసికోట ఎందుకు?	320
160. ఇంటిపెద్ద మరణిస్తే శివాలయనిద్ర చేయాలా?	321
161. బ్రహ్మముహూర్త సమయం ఎపుడు	323
162. గోళ్ళను యింటిలోపల తీయకూడదా?	324
163. ఉపవాసాలు దైవప్రియమా?	326
164. నాస్తికవాదం పాపమా?	327
165. ప్రాచీన శాస్త్రగ్రంథాలు ఎవరు వ్రాశారు?	329
166. గురువుదేవునితో సమానమా?	332
167. ప్రతి పూజకూ ఆవుపాలు కావాలా?	333
168. రకరకాల దేవుళ్ళ పటాలు వుండకూడదా?	335
169. మంగళసూత్రం బంగారానిదే వుండాలా?	336
168. దేవుడెందుకు కనిపించడు?	338
169. ఉప్పును దొంగిలించ కూడదా?	340
170. పాలను త్రొక్కితే పాపమా?	341
171. అద్దం పగిలితే అరిష్టమా?	342
172. మంగళ శుక్రవారాలు డబ్బును ఎవరికీ ఇవ్వకూడదా?	343
173. ఊళ్ళు తిరుగని మగవాడు, తిరిగే ఆడది, చెడిపోతారా?	344
174. మనుషులు దిగంబరంగా జీవించకూడదా?	345
175. పితృఋణం అంటే ఏమిటి?	346
176. సృష్టిలో మానవుడే గొప్ప ప్రాణియా?	348

ఒక్కమాట

ఈనాటి యువతరంవారిని గానీ, ఆనాటి వృద్ధతరంవారిని గానీ చిన్నబరచే వుద్దేశ్యంతో వ్రాయుటం జరగలేదని మనవి! కాలం మారుతూంది. మనుషులు మారుతున్నారు. అభిరుచులు కూడా మారుతున్నాయి. వ్యక్తిత్వాలు వ్యక్తివిలువలు మారుతున్నాయి.

మార్పు సృష్టి సహజం

నిజమే!

ఈనాడు మనందరి మధ్య వున్న అనుబంధాలన్నీ కేవలం ఆర్థికావసరాలే గాని అచ్ఛమైన అనురాగాలు వుండకపోవటం బాధ గదా! కన్నబిడ్డలు పెద్దవారై ప్రయోజకులైన తరువాత కని పెంచి పెద్దజేసి తమ ఉన్నతికి కారణమైన కారకులైన ముసలి తల్లిదండ్రులను నెలకింత డబ్బుపడవేసి వృద్ధాశ్రమాల్లో చేర్చటం నాగరికత లక్షణమా? ఇటువంటి మార్పు అభిలషణీయమా!

మార్పుకావాలి ! మార్పు రావాలి !

కానీ !

మన ఆలోచనలు, మన దారులు, మన ఆశలు కల్మషం కారాదు!

మన పురాణాలను, ఇతిహాసాలను, మనకావ్యాలను, మనభాషనూ మనమే వెక్కిరించుకొంటూ కువిమర్శలు చేసికొంటూ ఆనందపడే గుణం కేవలం మన హిందువులకు మాత్రమే వుంది.

ఎంత బాధాకరం!

దేవుడా! నా మతాన్నీ, నా హిందూ బంధువులను రక్షించు !! అంటూ

ఈ శాస్త్ర పీఠాన్ని

ఈ చిన్ని రచనను

మీ చేతుల కందిస్తున్నాను !

చదవండి! ఆలోచించండి! ఆదరించండి!

నమస్సుమాలతో - జి.వి.శర్మ

శాస్త్రీపరం

ఆచారము అంటే ఏమిటి?

కాల గమనంలో ఆచారాలు కొన్ని వికృతరూపం దాల్చాయి. ఆచారాల పేరుతో దురాచారాలు చోటు చేసుకున్నాయి. ఇది దురదృష్టం! ఆచారాలు, ఆనవాయితీలు, సంప్రదాయాలు, కులధర్మాలు మొదలైనవన్నీ ద్వాపరయుగం నుండే ఎక్కువగా మనకు సంక్రమించాయి అంటారు కొందరు.

> ఆచరణీయమైనదానిని ఆచారము అంటారు.బుద్ధివంతులు, మేధావులు, పండితులు, ధర్మ వేత్తలు, కులొ ఎద్దలు, ఆగమ కోవిదులు ఎందరెందరో ఆలోచించి, తర్కించి, మనిషిని మహోన్నతుని చేయుటానికీ, దురాచారం నుండి దూరం చేయటానికి ప్రవేశ పెట్టిన ఆలోచననే ఆచారం అనవచ్చు!

శ్రీరాముని కాలంలో ధర్మం వుంది. ఆచారాలింతగా లేవు. త్రేతాయుగంలోనే ధూమపానం, మద్యపానం వున్నట్లుగా తెలుస్తోంది. మనుష్యుల వృత్తినిబట్టి, ప్రవృత్తినిబట్టి వర్ణవిభజన జరుగుతూ వున్న సమయమది! నాలుగంటే నాలుగే కులాలు వున్న హిందూసమాజంలో ఇన్ని కులాలు ఇన్ని తెగలు అపుడు లేవు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అన్న నాలుగు వర్ణాలు మాత్రమే వుండేవి. ఒక్కొక్క వర్ణంవారికి ఒక్కొక్క ఆచారం వుండేది. కాలక్రమంలో శూద్రవర్ణం వివిధ రకాల మార్పులకు, వివిధమైన విభాగాలకు, లోనైపోయింది. ఫలితంగా నూరారు తెగలుగా విడిపోయి ఎవరికి ఇష్టమైన ఆచారాలను వారు స్థిరపరచు కొన్నారు. ఒక్కొక తెగకు ఒక్కొక గురువు (కులపెద్ద) వుండటంవల్లనే రకరకాల ఆచారాలను నెలకొల్పటం జరిగింది.

గమనించవలసిన విషయమేమంటే శూద్రవర్ణం ఒక్కటే వివిధ కులాలుగా విడిపోవటం జరిగింది. కారణమేమంటే ఆనాటి శూద్రులు విద్యావంతులు కారు. సమిష్టి జీవనానికి వుండే బలం విలువ వారికి తెలియవు. బ్రాహ్మణ,

క్షత్రియ, వైశ్య వర్ణాలు ఎక్కువ తక్కువగా ఒకే రకమైన ఆచారాలు నియమాలు పాటించారు. అతిజన సంఖ్యాబలం వున్న శూద్ర వర్ణం వారందరూ వివిధ కులాలుగా మార్పు చెంది రకరకాల ఆచారాలనూ, సంప్రదాయాలనూ కట్టడి చేసుకొన్నారు.

అయితే కొన్ని ఆచారాలు అన్ని వర్ణాలకూ ఒక్కటిగానే వుండేవి. బాధాకరమైన విషయమేమంటే ఆచారాలన్నీ ఎక్కువగా స్త్రీలకే, స్త్రీలకోసమే వుండేవి అని చెప్పక తప్పదు.

చాలా ఆచారాలు కట్టుబాట్లకోసమే సృష్టింపబడ్డాయి.

✦☆✦

వర్ణాశ్రమధర్మం అంటే ఏమిటి?

వర్ణాశ్రమ ధర్మం అంటే సాంఘిక జీవనం సాఫీగా సాగటానికీ, ఒకే వృత్తిని అందరూ అవలంబించకుండా వుండటానికీ, మానవ సదుపయోగానికీ వర్ణాశ్రమ ధర్మం ప్రవేశ పెట్టటం జరిగింది.

1. వర్ణధర్మ ప్రారంభం ఎలా జరిగిందంటే, సూక్ష్మబుద్ధి, సాత్విక యోచన వున్నవారినీ, పాపభీతి అహింసాప్రవృత్తి, వున్నవారినీ, కాయకష్టం చేయలేని బలహీనుల్ని, ఒక భాగంగా విభజించారు. వీరే బ్రాహ్మణులు". అయితే ఈ విభాగంలోనివారు ధర్మప్రవృత్తికి కట్టుబడి, తమ వృత్తికి లోబడి వుండకపోతే వాళ్ళను బ్రాహ్మణులుగా పరిగణించేవారు కాదు. సంఘ బహిష్కారం జరిగించేవారు. క్రూరమృగాలున్న అడవులకు నెట్టేవారు.

2. ధైర్యసాహసాలు, దేహశక్తి, పోరాటపటిమతో పాటు రక్షణా శక్తి గలిగిన వారిని నాయకులుగా నియమించుకొన్నారు. వీరే "క్షత్రియులు". తన గుంపులోనివారికి మరొక గుంపువారినుండి ఏ ఆపదా రాకుండా కాపాడటం, క్రూర జంతువుల బారినుండి స్త్రీలకు, వృద్ధులకు, పసివారికీ రక్షణ కల్పించటం ఈ వర్ణంవారి బాధ్యత.

3. తెలివితేటలు, ధర్మబుద్ధి, న్యాయవివక్ష కలిగి వినిమయ దక్షత కలిగినవారిని ఆహార పదార్థాలు అందరికీ, అన్నీ అందటంకోసం వస్తుమార్పిడి జరగటం కోసం నియమించబడినవారే "వైశ్యులు". ఎవరు ఏ విధమైన ఆహార పదార్థాలు సేకరించినా అవి అందరకూ వస్తుమార్పిడి పద్ధతిలో అందేట్లు చేయటం వీరి కర్తవ్యం.

4. ఒక గుంపులో వేయిమంది జనంవుంటే పదిమందిని నాయకులుగానూ, ఇద్దరిని ఆహార వస్తువుల మార్పిడికిగానూ, ఇద్దరిని (బ్రాహ్మణులను) న్యాయరక్షణకు గానూ, నియమించుకొని మిగిలిన వారందరూ వ్యవసాయ వృత్తికీ, అడవులలోని కందమూలాలకూ ఫలసేకరణకూ వెళ్ళేవారు. అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణానికి చెందినవారు పదిమంది వుంటే మిగిలిన తొంభైమంది శూద్రవర్ణంవారు వుండేవారు.

అందరూ నియమానికి కట్టుబడివుండేవారు.

గుంపులు గుంపులుగా వుండి బ్రతుకు సాగించే ఆనాటి జనంలో ఒక దురాచారం వుండేది. ఎదుటి గుంపులోని స్త్రీలను మాటువేసి అపహరించుకొని పోయేవారు. శాశ్వతంగా తమవద్దనే వుంచుకొనేవారు. అబలలైన స్త్రీలు దౌష్ట్యానికి తలవంచి జీవించేవారు. తమ గుంపులోని స్త్రీలను ఎదుటి గుంపువారు అపహరించుకొని పోవటం అవమానంగానూ, చేతగానితనంగానూ భావించే వారు. సమయం చూచి మాటువేసి అవతలి గుంపువారి ఆడవారిని బలాత్కరంగా ఎత్తుకొచ్చి స్వంతం చేసుకొనేవారు.

ఈ విధంగా సాగుతూండేది వారి జీవనం.

ఈ పరిస్థితుల్లోనే

రక్షణకు క్షత్రియవర్ణం, ధర్మన్యాయ నిర్ణయానికి బ్రాహ్మణ వర్ణం, అందరికీ అవసరమయ్యాయి. ఈ రెండు వర్ణాలవారు పెద్దలయ్యారు.

అయితే

ఎవరూ ధర్మం తప్పి చరించేవారు కాదు!

బుద్ధిచాతుర్యం, నియమపాలన, శాకాహార నియమం కలిగిన బ్రాహ్మణ వర్ణం అందరి అభిమానాన్నీ, మెప్పునీ సాధించారు. క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలను శాసించేస్థితికి ఎదిగారు. నాలుగు వర్ణాలలో వీరే అగ్రస్థానం

సాధించారు. చాలా నియమబద్ధంగా కూడా వుండేవారు. పర స్త్రీలవంక కన్నెత్తి చూచేవారు కాదు. ఒక స్త్రీతోనే నియమబద్ధంగా వుండటం శూద్ర క్షత్రియ వైశ్యవర్ణాలవారిని ఎంతో ఆకర్షించింది. అందరూ బ్రాహ్మణ వర్ణాన్ని అగ్రవర్ణంగా అభిమానించి గౌరవించటం మొదలు పెట్టారు.

అప్పటికి భాషవున్నా, లిపి లేదు.

చతుర్వర్ణాలలో బుద్ధివంతులైన బ్రాహ్మణవర్ణమే భాషకు లిపిని సమకూర్చారు. క్షత్రియ వైశ్యవర్ణాలవారికి లిపిని నేర్పించి విద్యావంతులను చేయటమే కాకుండా న్యాయ నీతి ధర్మ సూత్రాలు రచించారు. అవన్నీ అందరికీ ఆమోదయోగ్యం అయ్యాయి.

బుద్ధికుశలత వున్న బ్రాహ్మణ వర్ణం అగ్రవర్ణం అయింది.

(ఈనాడు మనం చూస్తున్న బ్రాహ్మణవర్ణానికీ, ఆనాటి బ్రాహ్మణవర్ణానికీ ఏ విధమైన సారూప్య సంబంధాలు లేవంటే లేవని చెప్పటం దుస్సాహసమే అవుతుంది. క్షమించాలి.)

ఆనాటి బ్రాహ్మణ వర్ణానికి వర్ణ వివక్ష యింత నీచంగా లేదు. వుండివుంటే పరమ బ్రహ్మర్షి సద్బ్రాహ్మణుడైన వశిష్ఠమహర్షికి పంచమ జాతికన్య అయిన అరుంధతి భార్యగా అయ్యేది కాదు గదా!

ఆ ॥ పాపవర్తనుండు బ్రాహ్మణుండయ్యును,
నిజము శూద్రుకంటె నీచ తముడు
సత్యశౌచ ధర్మశాలి శూద్రుండయ్యు
అతడు సద్విజుండయనిరి మునులు (శ్రీమహాభారతం పంచమాశ్వాసం అరణ్యపర్వం 137

గౌతముని శాపంవల్ల బ్రాహ్మణులు ధర్మదూరులై అపమార్గాన్ని అవలంబించి, సదాచారానికి దూరమై, ధనలోభానికి లొంగిపోయారు. శాస్త్రాలను తలక్రిందులు చేశారు. అసంబద్ధ ఆచారాలను అక్రమ సాంప్రదాయాలను అమాయక జనసామాన్యుల్లోకి చొప్పించారు. ఇది త్రేతాయుగంలో చివరి భాగాన జరిగిందని అంచనా.

అయితే అందరూ గమనించవలసిన విషయం ఒక్కటుంది. శ్రీ మద్రామాయణం వ్రాసిన వాల్మీకి బ్రాహ్మణుడు కాదు. భారతీయులు మాత్రమే కాదు బ్రాహ్మణవర్ణం ఆరాధించి పూజించే అయోధ్య రాజైన శ్రీరాముడ

బ్రాహ్మణుడు కాదు. శ్రీకృష్ణుడు బ్రాహ్మణుడు కాదు. బ్రహ్మర్షి విశ్వామిత్రుడు బ్రాహ్మణుడు కాదు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా వుంది!!

బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య - శూద్ర జాతులే కాక ఐదవ జాతిగా (పంచమజాతి) కొందరిని విభజించటం జరిగింది. వారే మాల మాదిగలుగా ఊరికి దూరంగా ప్రత్యేకంగా వుంటూ వచ్చారు. మాంసాహారం వీరికి ప్రధానాహారం. చెప్పులు కుట్టటం చర్మ సాధనాలు తయారుచేయటం, కూలిపని చేయటం వీరికి ముఖ్యవృత్తిగా శాసించటం జరిగింది. స్మశానాలను కాపలా కాయటం కూడా వీరి బాధ్యతే !!

పంచమజాతి వారికి ఆలయ ప్రవేశం వుండేది కాదు. వారికి ప్రత్యేక ఆచారాలు, ప్రత్యేక దేవతలు, ప్రత్యేక వస్త్రధారణ వుండేవి. మారెమ్మ, మహం కాళమ్మ, పోతమ్మ, కంకాళమ్మ మొదలైన దేవతలను కొలవటం, మాంసాహారులు కావటంవల్ల జంతు బలులు ఇవ్వటం వారికి ఆచారమయింది.

అన్నదమ్ములైన హిందువులు కులాల పేరుతో విడిపోయి హిందూ శక్తినీ, హిందూ మతాన్నీ, హిందూ ఆదర్శాన్నీ, హిందూ తత్వాన్నీ కకావికలు చేశారు. ప్రపంచ దేశాలలో ఎక్కువ కులాలు వున్న దేశంగా భారతదేశం నమోదు అయింది.

హిందీ భాషను భారతీయుల భాషగా చేయాలనీ, భారతీయు లందరికీ ఒకే భాష వుండాలనీ ఎంతో మంది ప్రయత్నం చేశారు. కానీ మాతృ భాషా వ్యామోహం వున్న మన భారతీ యులు అంగీకరించలేదు. దురదృష్టం!

వర్ణాశ్రమ ధర్మం కాలక్రమంలో నశించిపోయింది. ధనసంపాదన జీవిత ధ్యేయంగా మారి అన్ని వర్ణాలవారూ అన్ని ధర్మాలనూ మన్నిస్తున్నారు.

> మానవ కల్యాణంకోసం నియమించు కొన్న వర్ణాశ్రమ ధర్మం వెర్రితలలు వేసి వికృతరూపం దాల్చి, విషపు కోరలు చాచి హిందూమతాన్ని వేయి ముక్కలుగా చేసింది. ప్రపంచ నాగరి కతలో పేరుపొందిన హిందువులు వర్ణధర్మంతో విడిపోయారు. శూద్ర వర్ణం వ్రక్కలైపోయి వివిధ కులాలుగా మారిపోవటం జరిగింది. ఇప్పుడు మన కులాలసంఖ్య మూడువేలు వుంది.

శుభం సర్వేజనాః సుఖినోభవంతు.

✦☆✦

కులాలు ఎప్పుడు పుట్టాయి?

ఈ కులాల ప్రస్తావన వేదాల్లో లేదు.

మొదట మనకు వర్ణాలే గాని కులాలు లేవు.

బ్రాహ్మణ -క్షత్రియ - వైశ్య - శూద్ర వర్ణాలలో నాల్గవ వర్ణమైన శూద్రవర్ణం సంఖ్యాపరంగా బలంగా వుండేది. అతిజనసంఖ్య గల్గిన శూద్రవర్ణం గుంపులు గుంపులుగా విడిపోయారు. ముఠాలవారిగా విడిపోయిన వారందరూ ఒక్కొక కులంగా మార్పు చెందారు. త్రేతాయుగం మధ్య దశలో ఇది జరిగి వుండవచ్చు.

అంటే ఇరవై లక్షల సంవత్సరాలనాడే కులాలకు అంకురార్పణ జరిగిందను కోవచ్చు. ఈనాడు రాజకీయ పార్టీలు ఏ విధంగా క్రొత్తక్రొత్త పేరులతో పుడుతు న్నాయో ఆనాడు కూడా ఇలాగే ఒక్కొక్క గుంపు ఒక్కొక్క కులంగా పేర్లు పెట్టుకొన్నాయి. మనకు స్వాతంత్ర్యం రాకముందు భారతదేశంలో ఇన్ని పార్టీలు లేవు. ఇపుడు వందల సంఖ్యలో పార్టీలు వున్నాయి గదా! శూద్రవర్ణం కూడా ఈ విధంగానే తెగలు తెగలుగా విడిపోయి బహు కులమయం అయింది.

అయితే పంచమజాతిగా చెప్పబడే (మాలలు మాదిగలు) దళితులు ఏర్పడింది మాత్రం కలియుగ ప్రారంభంలోనే! అంటే ఐదువేల సంవత్సరాలకు లోపు అన్నమాట. గ్రామాలకు దూరంగా పూరిగుడిసెల్లో వుంటూ శ్రీమంతులకు వ్యవసాయకూలీలుగా వుంటూ, చదువు సంధ్యలకు, సంస్కార జీవనానికీ దూరమయ్యారు. వారికి వారే చిత్ర విచిత్ర ఆచారాలనూ ఆనవాయితీలనూ కల్పించుకొన్నారు.

ఇదిలా వుంటే -

నాగరిక జీవనానికి దూరంగా అడవుల్లో నివసిస్తూ గుహల్లో వుంటూ అడవి జంతువులను వేటాడి బ్రతికే తెగ ఒకటి వుంది. వీరిని ఆదిమవాసులు అంటుంటాం. అందరిలా పుట్టిన వీరు చాలా దురదృష్టానికి లోనయ్యారు. జంతువుల చర్మాలను మొలకు చుట్టుకొని జీవించేవారు. వీరికి క్రమబద్ధమైన జీవితం లేదు. మరణానికి భయపడరు. బంధాలకు తలవంచరు. ఆటవిక న్యాయం వీరిది. బలమున్నవాడే నాయకుడు. బలమున్నవాడిదే రాజ్యం. లక్షల

సంవత్సరాలనుండి నాగరికతకు దూరంగా పంచమవర్ణంతో సమానంగా దైన్య జీవితం గడుపుతుండటం మనసున్న వారిని బాధిస్తుంది. కన్నీరు తెప్పిస్తుంది.

వేల సంవత్సరాలకు ముందున్న 'కులకట్టడి' ఇపుడు లేదు. సర్వకుల సమానత్వం వస్తున్నది. రాబోతున్నది.

ఒకరకంగా ఇది హర్షణీయమే గదా!

✦☆✦

స్త్రీ పురుషులకు వివాహం తప్పనిసరియా?

మనిషికి వివాహం ఒక సాంఘిక సదాచారం.

జీవనావశ్యకమైన కేశఖండనము, చౌలము ఉపనయనము, విద్యాభ్యాసము మొదలైన మానవ సంస్కారాలన్నిటిలో వివాహ సంస్కారం ప్రధానమైంది.

సంస్కారం అంటే మనిషిలో వున్న ప్రజ్ఞనూ శక్తినీ హెచ్చరించి నిద్రలేపి సమాజాభివృద్ధికీ ప్రజాపురోగతికీ నడిపించటం అన్నమాట! వివాహంవల్ల దేవఋణం - పితృఋణం - ఋషిఋణం ఈ రుణత్రయం నుండి పురుషునికి విముక్తి దొరుకుతుందని ఆర్యోక్తి!

దైవఋణం అంటే?

గాలి - నీరు - ఆహారం - అగ్ని - పగలు - రాత్రి - సూర్యుడు - చంద్రుడు - భూమి - ఓషధులు - వృక్షాలు మొదలైన ప్రకృతి ప్రసాదించిన సమస్త సౌలభ్యాలకు ప్రతిగా తన ఋణాన్ని తీర్చుకోవటం, కృతజ్ఞతా భావనతో ప్రకృతిసంపదను కాపాడటం 'దైవఋణం'.

పితృఋణం అంటే?

తనకు జన్మనిచ్చి, తనలో రక్తమాంసాదుల నింపి, మల మూత్రాదులను కడిగి, వైద్యసేవలు చేసి, అన్నపానీయాదుల్ని సమకూర్చిపెట్టి, పెద్దజేసి, మాటనేర్పి, విద్యాబుద్ధుల్ని నేర్పించి ప్రయోజకునిగా చేసి, గృహక్షేత్ర ధనాదుల నిచ్చిన తల్లిదండ్రులను వార్ధక్య జీవితంలో సేవించి కాపాడటం "పితృఋణం".

ఋషిఋణం అంటే?

ఈ సృష్టిలోని సకలసౌకర్యాలను మనం మాత్రమే కనిపెట్టలేదు. మనకంటె ముందుగా జన్మించిన పరోపకారబుద్ధులైన మహర్షులెందరో ఎంతోకాలం శ్రమించి, గణిత, ఖగోళ విజ్ఞానాన్ని మనకు అందించారు. మనం తినే ఉప్పు, చింతపండు దగ్గరనుండి శరీరానికి శక్తిని అందించే కూరగాయల వరకూ వారి దయాభిక్షే! ఆయుర్వేద వైద్యం నుండి పసుపు వెల్లుల్లి, ఆవాలు, జీలకర్ర వరకూ వాటి పోషక విలువల్ని తెలుసుకొని మనకు అందించింది ఋషులే! కాబట్టి సనాతనులైన వారందరి ఋణాన్నీ విద్యార్జన చేయటం ద్వారా వారు రచించిన గ్రంథాలను చదివి గ్రహించి సమస్త ప్రజలకు తెలుపటం ద్వారా ఋషిరుణాన్ని తీర్చుకోవాలి. ఇదే "ఋషి ఋణం".

ఈ ఋణత్రయం తీర్చుకోవటానికి వివాహం తప్పనిసరిగదా! ఎందుకంటే ఒంటరిగా ఒక్కడే అన్ని పనులను చేయలేడు. తోడు కావాలి. ఆ తోడు ఆత్మీయతతో కూడి వుండాలి. ఆ ఆత్మీయతకు శాశ్వతత్వం కావాలి. అందుకే పురుషునికి భార్య అవసరం ఎంతో, ఎంతెంతో వుంది. వివాహానికి కూడా అంతే ప్రాధాన్యత వుంది.

మనిషికి నాగరికత వివేకం లేని రోజుల్లో స్త్రీ పురుషుల మధ్య వివాహాలు లేవు. పశువుల్లా యథేచ్ఛగా వుండేవారు. పిల్లలను కనటం పోషించటం ఆడవారి వంతు అయ్యేది. అంతేకాక స్త్రీని అనుభవించటంకోసం పురుషులు తమలో తాము కొట్లాటలకు దిగేవారు. బలహీనులైనవారు ఈ పోట్లాటలో మరణిస్తుండే వారు. బలం కలవాడు బలహీనులతో యుద్ధంచేసి చాలామంది స్త్రీలను తానొక్కడే అనుభవిస్తుండేవాడు. స్త్రీల పోషణాభారం కానీ, పిల్లల పెంపకంగానీ పురుషునికి సంబంధం వుండేదికాదు. స్త్రీలకు రక్షణ అనేది ఏ మాత్రమూ వుండేది కాదు.

ఇది త్రేతాయుగ విషయం

సరిగ్గా ఈ సమయంలో జ్ఞానవంతులైన సనాతనులు. ఋషులు ఆరోగ్య వంతమైన సలక్షణమైన ప్రజోత్పత్తికి స్త్రీ రక్షణ ముఖ్యమని గుర్తించారు. విశృంఖల కాముకత్వాన్ని నిషేధించారు. ఒక స్త్రీకి ఒక పురుషుడు ఒక పురుషునికి ఒక

స్త్రీ వుండాలని చెబుతూ స్త్రీల రక్షణకోసమే పాతివ్రత్య ధర్మాన్ని ప్రవేశపెట్టారు. స్త్రీలను ఈ పాతివ్రత్య ధర్మంతో కట్టడి చేయగలిగారేగాని పురుషులను మాత్రం నిర్బంధించలేకపోయారు. స్త్రీలు ఋతు సమయంలో వున్నపుడు గర్భవతులుగా వున్నపుడు పురుషులు పరస్త్రీ వ్యామోహానికి పాల్పడటం జరుగుతుండేది. స్త్రీలకు మాత్రం ఒకే భర్త. పురుషులకు అనేకమంది భార్యలు వుండేవారు.

సద్ధర్మపరులైన ఆర్య ఋషులకు పురుషాధిక్యం మింగలేని మెతుకులా అయింది. పురుషులందరినీ కట్టడి చేయాలని ఆలోచించి "వివాహం" అనే ధర్మకార్యాన్ని ప్రవేశ పెట్టారు. కాని క్షత్రియుల శక్తి శౌర్యాలకు భయపడ్డారేమో! బ్రాహ్మణ, వైశ్య, శూద్ర వర్ణాలవారికి ఏకపత్నీ వ్రతాన్ని సంధానించారు. క్షత్రియులకు ఈ ధర్మంలో స్వతంత్రత నిచ్చారు.

ఈ సమయంలో ఏకపత్నీ వ్రతాన్ని పాలించినవాడు శ్రీరాముడు.

అవకాశంవున్నా, అవసరం వున్నా, ఆవశ్యకతవున్నా శ్రీరాముడు ఏకపత్నీ వ్రతాన్ని దాటి చరించలేదు. శ్రీరాముని తండ్రియైన దశరథునికి మూడువందల మంది భార్యలు ముగ్గురు రాణులు వున్నారని తెలుస్తోంది. అయినా శ్రీరాముడు ఏకపత్నీ వ్రతాన్నే పాలించాడు. అందుకే ఆయన ఆర్యులకు ఆరాధ్య దైవమయ్యాడు.

(ఈనాటి ఆడవారికి శ్రీరాముడు సీతను పరిత్యజించాడన్న ఒక్కవిషయం మాత్రమే తెలుసుగాని, అంతటి వియోగంలోనూ శ్రీరాముడు పరస్త్రీ పరిగ్రహణం చేయని సుగుణ వంతుడని తెలియక పోవటం విచారకరం).

స్త్రీ పురుషులకు వివాహం అనేది ఒక అభయం! ఒక రక్షణ! ఒక మర్యాద! ఒక గౌరవం! ఒక సుసాంప్రదాయం! నవీన నాగరికతలో వివాహం లేకుండానే కేవలం కామసుఖాలకోసం, ధనతాపత్రయం కోసం జీవిస్తున్నవారు పట్టణాల్లో కోకొల్లలున్నారు. ఇది తప్పు! అనాగరికం! అధర్మం! అసంస్కృతి! అమర్యాద! అరాచకం!

ఏ మతంవారైనా, ఏ కులంవారైనా, ఏ ధర్మంవారైనా ఎవరి ధర్మాన్ని వారు పాటించాలి. ఎవరి మతాన్ని వారు గౌరవించుకోవాలి. ఏ మతమైనా ఏ

02180

ధర్మమైనా చెడుమార్గాన్ని బోధించదు. పాశ్చాత్యులు విశృంఖల శృంగారం అనుభవిస్తారను కోవటం అవుతుంది. వారికి కూడా సమాజనియమాలు కట్టుబాట్లు వున్నాయి. అయితే ఆర్య మతానికీ పాశ్చాత్య మతానికీ ఒక పెద్ద వ్యత్యాసం వుంది. భారతీయులుగా పుట్టినవారు ఏ కులంవారైనా సంఘ నియ మాలకు భయ పడతారు. పాశ్చాత్యులు "లా అండ్ ఆర్డర్"ని ఉప యోగించుకొని లాభపడతారు.

ఆర్యులు ధర్మానికి భయపడతారు.

మన ఆర్యస్త్రీలకు చట్టాలు తెలుసు. విడిపోయి వెళ్ళిపోవటం తెలుసు. వెళ్ళి బ్రతకగల దారులు తెలుసు. కాని భర్తలను విడచి వెళ్ళరు! ఎంతటి అసమర్థుడైనా, ఎంతటి నికృష్టుడైనా, ఎంతటి పాశ వికుడైనా కట్టుకొన్న వాడితోనే జీవితం సాగిపోవాలని కోరుకొంటారు.

ఆర్యవనితా ! నీకు పాదాభివందనం !
సహనమూర్తీ ! నీకు సహస్రాభివందనం !!

ప్రపంచంలో ఆర్యస్త్రీలవంటి స్త్రీలు వుండరు. ఆర్యమతంవంటి మతం వుండదు. ఆర్య సంప్రదాయంవంటి సంప్రదాయం వుండదు. ఆర్యులకు కన్నబిడ్డలు ప్రాణంతో సమానం. ఈ బిడ్డ పోతే మరొక బిడ్డను కనవచ్చు అని అనుకోరు. కన్నబిడ్డలకోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతారు. ఈ దేశంలో బంధాలమధ్య చట్టాలకు విలువ లేదు. ఇక్కడ బంధమే గొప్పది. చట్టం గొప్పదిగాదు.

ఇదే మన భారతీయుల పుణ్యం.
దేవుడా! మరుజన్మవుంటే నన్ను ఇక్కడే పుట్టించు!

మనమిపుడు ధనానికి దాసోహమవుతున్నాం. ఎలా సంపాదించావన్నది ముఖ్యం కాదు. ఎంత సంపాదించావన్నది మాత్రం ముఖ్యం. మన సంస్కృతినీ, మన భాషనీ, మన వున్నతినీ, మన సంప్రదాయాన్నీ, మన ధార్మికతనూ, మరచిపోయి విశృంఖలత్వానికి పరవ్యామోహానికీ మనం బానిసభావం వహించటం భరతమాత దురదృష్టం.

వివాహ పద్ధతి ప్రారంభమై ఎనిమిదివేల సంవత్సరాలయింది.

స్త్రీ పురుషులిద్దరినీ బంధించి బ్రతికించేది వివాహమే. వివాహ సంస్కారంలో వరుడు అగ్నికి నమస్కరించి వధువును చేతిని పట్టుకొంటూ -

"పూషా త్వేతో నయతు హస్తగృహ్యా అశ్వినౌ త్వా
ప్రవహతాం రథేన గృహానాగచ్ఛ గృహపత్నీ !
యథా సోవశినీ త్వం విదథం అవధాసి"

అని అంటాడు.

ఓ గృహపత్నీ! నా యింటికి యజమానురాలివై పెత్తనం వహించి గృహమును తీర్చిదిద్దుకొనుటకై దేవతయగు పూషాదేవి నా యింటికి నిన్ను తోడ్కొని వచ్చుగాక! అశ్వినీ దేవతలు రథముపై నిన్ను నా వద్దకు చేర్చుదురు గాక అని అర్థం.

"ధృవంతే రాజా వరుణో
ధృవం తేనో బృహస్పతిః
ధృవంత ఇంద్రశ్చ అగ్నిశ్చ రాష్ట్రంధారయతాంధ్రువమ్" -

అంటూ వేదమంత్రపూర్వకంగా పురోహితుడు వధూవరులిద్దరికీ బ్రహ్మముడి వేస్తాడు. ఓ నవదంపతులారా! క్రొత్తగా దాంపత్య సామ్రాజ్యము వహించబోవు మీకు ఇంద్రుడు, వరుణుడు, అగ్ని, బృహస్పతి దేవతలు శాశ్వతత్వము చేయుదురు గాక అని అర్థం.

"శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం
ధర్మప్రజా సంపత్యర్థం
స్త్రియం ఉద్వహే"

'కన్యాదాన సమయంలో వరుడు కన్యను స్వీకరిస్తూ శ్రీపరమేశ్వరుని ప్రీతికోసం ధర్మబద్ధ

ఈ భూమిలో తల్లిదండ్రులు
దేవుళ్ళకంటే గొప్పవారు.
అమెరికా కంటే
ఈ దేశం గొప్పది కాదా!
ఈ సంస్కృతి గొప్పది గాదా!
ఈ భూమి గొప్పదిగాదా! కోట్ల
సంవత్సరాల
ఈ ఋషి సంస్కృతికి మించిన
సంస్కృతి
ఈ ప్రపంచంలో ఎక్కడా
మరెక్కడా లేదు.
వుండదు. వుండబోదు.

సంతాన సంపదకోసం ఈ కన్యను వివాహం చేసికొను చున్నాను' అని పెద్దలందరి సమక్షంలో చెబుతాడు.

అంతేకాకుండా

వివాహానికి 'మహాసంకల్పం' ఇలా జరుగుతుంది.

"ఆద్యంతములు లేని శ్రీమదాది నారాయణుని శక్తిచే మహాజలరాశి నడుమ వుండి, ఆధార, కూర్మ, వరాహ, వైష్ణవ, అనంత, నాగ, శేష, తక్షక మొదలగు అష్టదిక్కుల అష్టదివ్యశక్తులపై నిలబడియుండి, ఐరావత, పుండరీక, వామన, కుముదా, అంజనాది అష్టదిగ్గజాలచే రక్షింపబడుచుండి, ఇంద్ర, అగ్ని, నిఋతి, వరుణ, వాయు, కుబేర, యమ, ఈశానులను అష్టదిక్పాలురచే పరిపాలింప బడుచుండి, సప్తకుల పర్వతాలచే అధిష్ఠింపబడియుండి, శ్రీరామ, శిబి, రంతి, గయ, అంగ, సుహోత్ర, పృథు, భగీరథ, పరశురామాది పదహారుమంది మహారాజులచే పాలింపబడి యుండి, కార్తవీర్య, సగర, పురూరవ, పురుకుత్స, నల, హరిశ్చంద్రాది షట్చక్రవర్తులచే అధిష్ఠింపబడియుండి, అనేక దేశభాషలతో విరాజిల్లుతూ భాగీరథీ గౌతమీ వంటి పుణ్యనదులతో నిండియుండి, శ్రీశైలాది పుణ్యతీర్థములతోనూ, జంబూద్వీపం, ప్లక్ష, శాల్మల, కుశ, క్రౌంచ, శాక, పుష్కర ద్వీపాది సప్తద్వీపాలతో, భారత, కింపురుష, ఇలావృత, కురు, భద్రాశ్వరమణక, హిరణ్యక, కేతుమాలా, హర్య, మొదలగు నవఖండమండితమై యుండి, యాభై కోట్ల యోజన విస్తీర్ణముగల భూమండలమున, లక్షయోజనముల విస్తీర్ణమున్న జంబూద్వీపమున, బ్రహ్మదేవుని అనంతాయుష్షులోని యాభై ఒకటవ సంవత్సరమున మొదటి [illegible] మొదటివారం మొదటి దినమునందు, తొమ్మిది కల్పాలలో ఒకటైన శ్వేతవరాహ కల్పంలో పధ్నాలుగు మనువులలో ఏడవ మనువైన వైవస్వతుని మన్వంతరంలో దశావతారములలో తొమ్మిదవ అవతార మైన బుద్ధావతారమున, ఆరు శకాలలో మూడవదైన శాలివాహన శకంలో, ఎనిమిదవ మహాయుగంలో, నాలుగు లక్షల ముప్పైరెండువేల సంవత్సరాల కలియుగ మొదటి భాగంలో, జంబూద్వీపమున, భరతవర్ష భరత ఖండంలో మేరుపర్వతమునకు దక్షిణమునగల గంగా కావేరీ నదుల మధ్యనున్న

ఆంధ్రదేశమున, సమస్త గురుబంధు, మిత్ర, బాంధవ సమక్షంలో శుభ ముహూర్తంలో, మా పూర్వీకులైన పదితరాల తాతముత్తాలకు శాశ్వత బ్రహ్మలోక నివాసం కల్పించటానికీ, ఉత్తమ సంతానమనియెడు శాశ్వత సంపద కోసం, ఈ కన్యకామణిని ధర్మములోనూ, ధనములోనూ, శరీర సుఖములోనూ, మోక్షములోనూ సగభాగమునిచ్చి అర్ధాంగిగా గౌరవిస్తున్నాను."

అని చెప్పి 'చేసుకొనే' వివాహం గొప్పది కాదా!

ఇది హిందూ వివాహ వ్యవస్థ గొప్పదదనం కాదా!

పెండ్లికుమారుని దైవస్వరూపునిగా భావించి కాళ్ళుకడగటం, పూజించటం కన్యాదానం చేసి ఉత్తమ సంతానాన్ని కనమనీ, నూరు సంవత్సరాలు సుఖంగా అన్యోన్యంగా జీవించమని ఆశీర్వరించే "మామగారు' హిందువులకే స్వంతం. హిందూ వివాహపద్ధతిని గౌరవించే యువకులకే స్వంతం.

చివరిగా ఒక్కమాట!

'లవ్ మార్యరేజ్' తప్పుగాదు. కానీ కన్నవారి ఆశీస్సులతో వైదిక పద్ధతిలో మాత్రమే వివాహం చేసుకోవాలి. పెద్దల అనుమతితో చేసుకొనే వివాహమే స్థిరంగా వుంటుంది. జీవితానికి హాయిని ఇస్తుంది. గౌరవప్రదంగా వుంటుంది. మిమ్ములను కని పెంచి పోషించి పెద్దవారినిగా చేసిన తల్లిదండ్రులకు సంతోషాన్ని కల్గిస్తుంది. అంతేకాదు సుమా! మీ బిడ్డలకు రక్షణ, మీకు అభివృద్ధి కలుగుతుంది. శుభం భవతు!

✦☆✦

భార్యాభర్తల్లో పురుషునికి పెద్దవయస్సు ఎందుకు?

వైదికమతం మనుషులకు కొన్ని నియమనిబంధనలు విధించింది. అయితే కొందరు వైదికమతం పురుష పక్షపాతంతో నిండి వుందని వాదించేవారున్నారు. ఇది కేవలం భ్రమ మాత్రమే! ఇది దృష్టిలోపమే గాని సృష్టిలోపం కాదు. దీని గూర్చి ముందు ప్రశ్నల్లో సవివరంగా తెలియపరుస్తాను.

అన్ని మతాలకన్నా హిందూమతానికి లక్షల సంవత్సరాల చరిత్ర వుంది. మానవ జీవితాన్ని సమూలంగా అధ్యయనం చేసిన సనాతన ఋషులు మనుషుల భద్రతకోసం కొన్ని నియమాలను విధించారు. అటువంటి నియమాలలో స్త్రీ పురుషుల వైవాహిక బాంధవ్యానికి పురుషునికి ఎక్కువ వయస్సు స్త్రీకి తక్కువ వయస్సు వుండాలని నిర్ణయించారు. వైవాహిక ఆచారాలన్నీ ఒక్కసారిగా నియమించినవి కాదు. ఒకొక్క విషయాన్నీ అనుభవ పూర్వకంగా గుర్తించి విధించటం జరిగింది.

రామాయణకాలం నాటికి స్త్రీపురుషుల వయస్సులతో నిమిత్తం వుండేది కాదని తెలుస్తున్నది. ద్వాపరయుగంనాటికి భార్యకంటే భర్తకు ఎక్కువ వయస్సు వుండాలని గుర్తించి వుంటారు.

అన్ని మతాలవారు ఈ సిద్ధాంతాన్నే అమలుపరుస్తున్నారు.

పురుషునికన్నా ఎక్కువ వయసుగల స్త్రీతో శారీరిక సంబంధాలు కల్గి వుంటే పురుషునికి శక్తి తగ్గిపోతుందనీ, నపుంసకుడు అవుతాడనీ, ఆయుర్దాయం తగ్గిపోతుందని చెప్పేమాటలు నిజంకాదు! కానీ, ఇటువంటి అశాస్త్రీయ అధార్మిక అసంబద్ధ సంబంధం మంచిది కాదు.

జన్మతః సామాజిక కారణాలవల్ల స్త్రీలకు సిగ్గు ఎక్కువ. వివాహానంతరం భార్యాభర్తల మధ్య జరిగే శృంగార కార్యకలాపాల్లో ఎక్కువ చొరవ తీసికొన వల్సింది పురుషుడే! భార్యను లాలించి ప్రేమతో బుజ్జగించి, స్వంతం చేసుకో వల్సిన బాధ్యత కూడా పురుషునిదే! ఈ దృష్టితో కూడా పురుషునికి ఎక్కువ వయస్సు వుండాల్సిందే.

పుట్టుకతో పురుషుడు స్త్రీ కంటే బలవంతుడు. ఇది మనుష్యులలోనేకాదు పశువులలోనూ పక్షులలోనూ జంతువులలోనూ పురుషశక్తిని మనం గమనించ వచ్చు. ఎద్దులకు వున్నంత శరీరబలం ఆవులకు వుండదు. కోడిపుంజుకు వున్నంత దేహబలం కోడిపెట్టకు వుండదు. పొట్టేలుకి వున్నంత దేహపటిమ గొర్రెలకు వుండదు. దున్నలకు వున్న శరీరశక్తి గేదెలకు వుండదు. ఇది సృష్టి సహజం. స్త్రీ పురుషుల్లో సంభోగానికి ముందు ఆహ్వానించవల్సింది మగవాడే! అన్ని ప్రాణులలోనూ ఇదే పద్ధతి వుంటుంది. గమనించండి. శృంగార కార్య కలాపాలను, రతిశాస్త్ర మెళకువలను పురుషుడు గమనించినంతగా స్త్రీలు గమనించలేరు. శృంగారకేళిలో కూడా పురుషునిదే ప్రధాన పాత్ర వుంటుంది. స్త్రీ నిమిత్త మాత్రంగా వుంటుంది. ఉరుములు మెరుపులు, వర్షించే ప్రకృతికేగాని భూమికి కాదుగదా! ఈ కారణంగా పురుషునికి పెద్ద వయస్సు వుండాలి.

సంసారిక బాధ్యతల్లో కష్టించి పోషించాల్సిన బాధ్యత మగవానిదే. ఆర్థిక స్థితిగతులన్నీ పురుషుడే చూచుకోవాలి. గృహబాధ్యతలు, సంతానాన్ని సక్రమంగా పెంచటం, పురుషుడు కష్టించి తెచ్చిన ధనధాన్యాదులను సక్రమంగా వినియోగిం చటం, పొదుపుగా గుప్తంగా కాపురం కొనసాగించటం మాత్రమే స్త్రీ కర్తవ్యం.

స్త్రీ శరీర నిర్మాణం పురుషుని శరీర నిర్మాణానికంటే భిన్నంగా వుంటుంది. స్తనాల బరువు కూడా వారికి ఆటంకమే కలిగిస్తుంది. ప్రతినెలకూ ఋతుక్రమం రావటం, గర్భం ధరించటం, పసిబిడ్డలకు ఆహార సదు పాయాలు చూడటం, స్త్రీలదే కదా ముఖ్యపాత్ర. అయితే ఆడదంటే పిల్లల్ని కనే యంత్రమా? అని ప్రశ్నిస్తున్నారు యువ తరపు స్త్రీలందరూ! ఇది తప్పు ఆలోచన. స్త్రీ అంటే పిల్లల్ని కనే యంత్రమూ కాదు, పురుషుడంటే కుటుంబాన్ని పోషించి పెంచే బానిస కాదు!

> భార్యాభర్తల్లో పురుషుడు చిన్నవాడైతే కుటుంబ పోషణా భారం స్త్రీ మీద పడుతుంది. స్త్రీలు కష్టించి పనిచేయుటం కుదరదు. అప్పటి కాలంలో వ్యవసాయమే అందరికీ ప్రధాన వృత్తి. మనుషులే కష్టించి పని చేయాల్సి వుండేది. ఇప్పటిలా యంత్రపరికరాలు అప్పుడు లేవుగదా!

ఈనాటి యువతరం ఎందుకిలా ఆలోచిస్తున్నది???

ఈ ప్రశ్నకు దొరికే సమాధానం ఒక్కటే. బంధాన్ని భూతద్దంలో నుండి చూస్తున్నారు. పాశ్చాత్య నాగరికతనూ, సంప్రదాయాన్నీ తమకు తాము వర్తింప జేసుకొంటున్నారు. తినే ఆహారానికి పదిరూపాయలు కావల్సివుంటే దాబు దర్పాలకోసం తొంభైరూపాయలు ఖర్చుచేసే స్థితికి వచ్చాం. ధన సంపాదనే అందరికీ ముఖ్యధ్యేయంగా అయింది. అవసరాలకు మించిన ఖర్చుకి అలవాటు పడిపోతున్నాం. మితిమీరిన స్వేచ్ఛను కోరుతున్నాం.

జీవితం చలనచిత్ర మాధ్యమం అయిపోతోంది.

మన ఆలోచనలన్నీ టి.వి.కే అంకితం చేస్తున్నాం.

అశ్లీలానికి అందరమూ ఎగబడుతున్నాం.

మనల్ని పాలించి శాసించే పాలకులకు ప్రజాజీవితాలమీద, సంస్కృతి మీదా, ప్రజల భవిష్యత్తుమీదా అభిమానం లేదు. ప్రజలను విభజించి పాలిస్తున్నారు. కులాల మతాల ముద్రతో ఓట్ల పంట పండిస్తున్నారు.

భార్యాభర్తల్లో పురుషుడే పెద్దగా వుండాలని చెప్పటంలో మరొక రహస్యం కూడా దాగి వుంది. సంసారాభివృద్ధికోసం అహరహం శ్రమించిన పురుషుడు త్వరగా శక్తిహీనుడై అనేక దేహ సమస్యలకు రోగాలకు దారితీస్తాడు. కాబట్టి అపుడు పురుషునికి సేదదీర్చి ఆదరించి అక్కున జేర్చుకొనే భార్య అవసరం ఎంతైనా వుంది. ఇద్దరూ సమాన వయస్సువారైతే ఒక్కసారే ఇద్దరూ వార్ధక్యాన్ని అనుభవించాల్సి వుంటుంది గదా అని పూర్వీకులు ఆలోచించారేమో!

అంటే పురుష స్వార్థంకోసమే వయోబేధం కల్పించారంటారా?

లోకంలో అతి తేలికైన పని విమర్శించటమే!

విమర్శ మనందరి జన్మహక్కు.

పురుషుడు భార్య లేకుండా బ్రతకలేడు. భార్యను పోగొట్టుకొన్న పురుషుడు తన యింటిలో వున్నా పరాయి కొంపలో బ్రతుకుతున్నట్లే. భర్త మరణించినా ఆడది జీవించ గలదు. ఆమె అవసరం పిల్లలకువుంది. వుంటుంది. కావాలంటే

మీరు మన సమాజంలో పరికించి చూడండి. భార్యను పోగొట్టుకొన్న మగవానికీ, భర్తను పోగొట్టు కొన్న ఆడదానికీ ఎంత వ్యత్యాసం వుందో, ఎంత నరకంగా వుంటుందో మీకే తెలుస్తుంది. సమస్యల గురించి ఉపన్యాసాలు దంచటం, రచనలు చేయటం వేరు, సమస్యను అను భవించటం వేరు.

అందుకే వివాహ బంధానికి స్త్రీ కంటే పురుషుడే పెద్దవాడుగా వుండాలని నిర్ణయించిన పూర్వీకుల దూరదృష్టిని వేనోళ్ళ పొగడటంలో తప్పులేదు. అవునుగదూ!

మన సంప్రదాయాలు ఊరకూరకనే పుట్టుకొని రాలేదు. పూర్వీకుల అనుభవ సారం మన సంప్రదాయాలు! ముందు తరం వారికి ముసలితరం వారిచ్చిన అపూర్వ కానుకలు!

విమర్శించటం తప్పుగాదు.

ఆలోచించలేక పోవటమే తప్పు

విమర్శనే అలవాటుగా వుంచుకోవటం మహా తప్పు.

తల్లి పాలలోని తీపిదనాన్ని గురించి, చిక్కదనాన్నిగురించి, క్వాలిటీ గురించి విమర్శించి చెప్పేవాడిని ఏమనాలి! ఏమని పిలవాలి?

అది మీ ఇష్టానికే వదలి వేస్తున్నాను.

మీరు కూడా ఆలోచించండి.

అతి విమర్శలు మంచిది కాదు.

పడక గదిలోని సుఖాన్నీ, కన్నబిడ్డల యవ్వనాన్నీ, కన్నతల్లి అందాన్నీ కూడా విమర్శించవచ్చు. కాని.... విమర్శించగలమా! విమర్శించటం న్యాయమా!!

✦☆✦

కులాంతర-మతాంతర వివాహాల్లో ఏది మంచిది? ఏడడుగుల సంబంధమంటే ఏమిటి?

బ్రాహ్మ్య, దైవ (ఆర్షం) ప్రజాపత్య, రాక్షస, అసుర, కన్యాశుల్క, గాంధర్వ పైశాచిక మని వివాహాలు ఎనిమిదైనా, ఆర్యధర్మ ప్రకారం వివాహాల్లో నాలుగు రకాలు ప్రఖ్యాతం.

1. బ్రాహ్మ్మ వివాహం.
2. గాంధర్వ వివాహం
3. క్షాత్ర వివాహం
4. రాక్షస వివాహం.

ఈ నాలుగు వివాహాల్లో 'బ్రాహ్మ్మవివాహం' విశిష్టమైనది.

- బ్రాహ్మ్మ వివాహం -

ఋషి సంప్రదాయ బద్ధమైన బ్రాహ్మ్మ వివాహం ఆర్యసమ్మతమైన వివాహం. వధూ వరుల కులపెద్దలు. తల్లిదండ్రులు అనుమతించి అంగీకరించి, ఆశీర్వదించి వైదిక విధితో ఆచారయుక్తంగా జరిపించేది. బ్రాహ్మ్మ వివాహం. ఇది సనాతన జన సమ్మతం! సత్సంప్రదాయం.

- గాంధర్వ వివాహం -

యువతీ యువకులిద్దరూ యుక్తవయస్సు గలవారైయుండి, ఒకరినొకరు ఇష్టపడి, పెద్దలెవరి అంగీకారమూ లేకుండా, తమంతట తాముగా రహస్యంగా కానీ, వేరొకచోటికి పారిపోయిగానీ చేసుకొనే వివాహం గాంధర్వ వివాహం. ఈ వివాహం బ్రాహ్మ్మ వివాహమంత గొప్పదిగాదు పవిత్రమైనదీ కాదు. శకుంతల దుష్యంతుని ఈ విధంగానే పెండ్లాడి కష్టాల పాలైంది.

- క్షాత్ర వివాహం -

కన్యామణి అంగీకారం లేకుండా కన్య తరుపువారి పెద్దల అనుమతి లేకుండా వరుడు తన శౌర్య సాహసాలను ప్రదర్శించి కన్యను బలప్రదర్శనతో ఎత్తుకెళ్ళి తన స్వజనుల సమక్షంలో వివాహం చేసుకోవటం క్షాత్ర వివాహం.

ఇది కేవలం క్షత్రియ కులంవారికి మాత్రమే! అందునా క్షత్రియ కన్యను మాత్రమే ఈ విధంగా పెండ్లాడే అవకాశముంది. ఇతర వర్ణాలవారికి ఈ అవకాశం లేదు.

- రాక్షస వివాహం -

చతుర్విధ వివాహాల్లో ఇది నీచమైన వివాహం. ఈ వివాహానికి బ్రాహ్మణ వైశ్య కులాలవారికి అనుమతి లేదు. ఎవరికీ తెలియకుండా, దొంగతనంగా, మోసంతో, ఇష్టంలేని కన్యను అపహరించుకొనిపోయి బలవంతంగా వివాహం చేసుకోవటం రాక్షస వివాహం. శూద్ర క్షత్రియ వర్ణాలవారికి మాత్రమే ఈ వివాహం చెల్లుబాటు !

ఈ నాలుగు రకాల వివాహాలు ధర్మసమ్మతమే అయినా పెద్దల అనుమతితో జరిగే బ్రాహ్మీ వివాహం మాత్రమే పవిత్రమైనది.

ఇక కులాంతర, మతాంతర వివాహాల విషయం

మతాంతర వివాహంకంటే కులాంతరమే మంచిది.

"స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మోభయావహః" అన్నాడు గీతాచార్యుడు ధర్మభ్రష్టత కన్నా కులభ్రష్టతే మంచిది. అంటే హిందువుగా పుట్టి హిందూ ధర్మం వారిని పెండ్లియాడటం ఒక రకంగా క్షమార్హమేగాని, హిందువు క్రైస్తవులనుగాని, ముస్లిం మతంవారిని గాని, వివాహం చేసికోవటం వల్ల ఆ వివాహానికి శాశ్వతత్వం వుండదు. ఏదో కారణంగా, ఏదో విషయానికి పేచీలు రావటం విడిపోవటం జరిగి తీరుతుంది. ఖచ్చితంగా జరిగే తీరుతుందని గాదు. జరిగే అవకాశాలెక్కువ.

హిందూ మతంలోని శూద్రవర్ణంలో మూడువేలపైచిలుకు కులాలు వున్నాయి. అంటే శూద్రవర్ణం వేలాది కులాలుగా విడిపోయిందన్నమాట. ఈ రకంగా చూస్తే కులాంతర వివాహం తప్పుగాదు.

నిష్ఠూరంగా చెప్పే ఒక విషయం!

ఏమిటంటే, నూటికి తొంభై ప్రేమ వివాహాలు మంచి ఫలితాన్ని ఇవ్వటం లేదు. యవ్వన ఉద్రేకాన్నీ, సహజంగా యవ్వనంలో వుండే ఆకర్షణను ప్రేమ

అనుకొని పారబడిపోయి ఎందరో తమ జీవితాలను పాడుచేసుకోవటం చూస్తున్నాం. ఆత్మహత్యలు చేసుకోవటం దినపత్రికల్లో చదువుతున్నాం. ఆర్థిక ఇబ్బందులు రానంతవరకు కల్సివుంటారు. ఒకరికోసం ఒకరం పుట్టాం అనుకొంటారు. ఆర్థిక సమస్యలు మొదలు కాగానే ఇద్దరిమధ్యా గొడవలు ప్రారంభమవుతాయి. నీవల్ల నా జీవితం పాడైపోయిందంటే నీవల్ల బ్రతుకు పాడుచేసుకొన్నానని పరస్పర నిందారోపణలు చేసుకోవటం మొదలవుతుంది. మాట పట్టింపులు వస్తాయి. కన్నీరు త్రాగుతూ సమస్యలనే ఆహారంగా తినాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఎక్కువగా నష్టపోయేది ఆడదే! కారణమేమంటే పురుషునికున్న స్వేచ్ఛా స్వతంత్రాలు ఎన్నటికెన్నటికీ స్త్రీకి లభించవు. దీనికి కారణాలు చాలా వున్నాయి. ప్రేమ పాఠాలు వల్లించినంత తీయగా జీవన పాఠాలు ఎవరూ వల్లించలేరు. ప్రేమించే రోజుల్లో మగవాడు త్యాగమూర్తిగా సినిమాహీరోగా ఆడపిల్లకు అనిపిస్తాడు. ఆకర్షణా ప్రభావం అది! ఎన్ని చట్టాలు వున్నా, ఎన్ని కోర్టులు వున్నా, ఎందరు న్యాయవాదులున్నా శిక్ష విధించేటందుకు పనికి వస్తారే గాని జీవితం చక్కదిద్దలేరుగదా!

> యవ్వనదశ చాలా
> ప్రమాదకరమైనది.
> యవ్వనమంటే ఒరిపిడి కల్గితే
> భగ్గున మండే అగ్గిపుల్లలాంటిది.
> మండటం మొదలయ్యాక
> పూర్తిగా మండు మొత్తం
> కాలేవరకు ఆగదు!
> యవ్వనదశకూడా అంతే!
> అగ్గిపుల్లతో వంట చేసుకోవచ్చు!
> ఒళ్ళు కాల్చుకోనూవచ్చు.
> వినియోగ పరచుకొనేవారి
> వివేకం అది.

కనిపెంచిన వారిని కాలదన్ని తోడబుట్టినవారిని త్రోసవేసి ప్రేమ పేరుతో పిచ్చి వ్యామోహంలో వడి జీవితాలు నరకం చేసుకోవటం ఏ కుల వారికీ, ఏమతం వారికీ మంచిది కాదు.

ఎంతటి మేధావులైనా ప్రేమ విషయంలో బుద్ధిహీనులౌతారు. ఇది చరిత్ర చెబుతున్న నిత్యసత్యం.

ప్రేమించి పెళ్ళి చేసుకోవటమంటే మనం చూస్తున్న సినిమా కథలా వుండదు. జీవితంలో ఏది జరుగదో దాన్ని సినిమాకథలో, జరిగినట్లుగా చూపిస్తారుఅసాధ్యాలను సుసాధ్యాలుగా చూపిస్తేనే, చూచే ప్రేక్షకుడికి థ్రిల్‌గా

వుంటుంది. అపుడే ఈలవేసి చప్పట్లు కొడతారు. కలల లోకంలో ప్రతికే యువతీ యువకులకు సినిమా కథలన్నీ నిజంగానే అనిపిస్తుంటాయి.

యవ్వనదశను ఎవరు సక్రమంగా ఉపయోగించుకొంటారో, వారు అభివృద్ధి చెందుతారు. ఆశలు తీర్చుకొంటారు. ఉన్నతిని సాధిస్తారు. ఈ సమాజానికి ఎంతో సేవ చేయకల్గుతారు.

ఇక ఏడడుగుల బంధం గురించి తెలుసుకొందాం.

వివాహ సమయంలో వధూవరులచేత "సప్తపది" జరిపిస్తారు. కొందరు పురోహితులు సప్తపదిని తప్పించివేస్తుంటారు. గబగబా వివాహం అయి పోయిందనిపించుకొని మరొక ముహూర్తానికి పరుగులు తీయటం మనం అన్నిచోట్లా చూస్తున్నాం.

ఆర్యవివాహం జరిగినంత శాస్త్రబద్ధంగా ద్రావిడ వివాహం జరుగదు. తాళికట్టటం ఒక్కటే వివాహ ముఖ్య కర్తవ్యం అనుకొంటారేమో! మనం మన బంధువుల వివాహానికి వెళ్ళినపుడు మీరు గమనించే వుంటారు. "పంతులు గారూ! త్వరగా కానివ్వండి. అవతల టయం అవుతోంది" అంటూ తొందర చేస్తుంటారు. ఇది మంచి పద్ధతికాదని అందరూ గుర్తించాలి. పెళ్ళిని నూరేళ్ళ పంటగా అందరూ చెబుతూ వుంటారు. అటువంటి జీవిత శుభకార్యాన్ని పరుగులు తీస్తూ చేయించటం వివేకం కాదు. వివాహాన్ని ఎప్పుడూ ఆదరా బాదరాగా జరిపించ కూడదు. కట్నంకోసం వరుడి తల్లిదండ్రులు - బాధ్యత దింపుకోవటం కోసం వధువు తల్లిదండ్రులు - పెండ్లి త్వరగా ముగిస్తే త్వరగా ఇంటికి చేరుకొందామని అరగంట కొకసారి వాచీలు చూచుకొనే బంధువులు - పెండ్లి పీటలమీద కూర్చొని యాంత్రికంగా పురోహితుడు చెప్పింది చేస్తూ మొదటి రాత్రి గురించి ఆలోచిస్తూ, ఫ్రెండ్స్ కోసం అటుఇటు చూచే పెండ్లి కుమారుడు - పెండ్లికి కట్టుకొన్న పదివేల రూపాయల చీర అందరికీ నచ్చిందో లేదోనని, పెండ్లికి చేయించుకొన్న బంగారు హారం సరిగా లేదనీ ఆలోచించే పెండ్లికూతురు - ఇలా జరిగేదాన్ని పవిత్ర వివాహమంటారా?

పట్టుచీరల గరగరలు, బంధువుల పలకరింపులు, కుర్రకారు చూపు వేటలు, పెళ్ళింటివారి ఉరుకుపరుగులు-వరసైనవారి నవ్వులాటలు, పెళ్ళి కొడుకు తరపువారి మూతిబిగింపులు, ఇవి కాదు వివాహమంటే! అసలు పెళ్ళి వచ్చినవారు 'వివాహ కార్యక్రమం' చూడటమే లేదు. ఉద్యోగవిషయాల రాజకీయాలు, పిల్లల విషయాలు ముచ్చటించుకోవటంతోనే సరిపోతూవు – ఇది వివాహ పవిత్రతను, ఆర్షసంప్రదాయ విశిష్టతను చిన్నబుచ్చటమే కద ఇతర మతస్థుల వివాహాలకెపుడైనా మీరు వెళ్ళారా!

ముస్లిం, క్రైస్తవ వివాహాలు ఈ విధంగా జరుగనే జరుగవు.

వివాహ సమయంలో నిశ్శబ్దంగా వుంటారు.

దేవుని ప్రార్థనలో అందరూ పాల్గొంటారు.

మరి మన ఖర్మ ఎందుకిలా అవుతున్నది? మన ఆచార సంప్రదాయాల మన చేతులారా మనమే ఎందుకు కించపరచుకొంటున్నాం! వీరినందరి ఎవరు మార్చాలి? మార్చగలిగిన మనసుంటే ఈ బాబాలు, గురూజీల స్వాములు మార్చగలరు. కాని వారికంత సమయమేది! సత్కారాలకు సంభావనలకే వారికి సమయం చాలటం లేదు.

పెండ్లికుమారుడు కల్యాణమండపానికి వచ్చిన తరువాత మొదట విఘ్నేశ్వరపూజ జరుగుతుంది. కల్యాణదీక్షా కంకణం కడతారు. పురోహితుడ మహాసంకల్పం చెబుతాడు. తరువాత కన్యాదాతలు వరపూజచేసి, కాళ్ళు కడి తీపి తినిపించి తియ్యని నీరు త్రాగిస్తారు. కన్నబిడ్డను అలంకరించి మండపాని తీసికొస్తారు. ధర్మార్థకామ మోక్షాలలో ఈ కన్యామణిని ఎన్నటికీ వదలిపెట్టన ప్రమాణం చేయించి కన్యాదానం చేయిస్తారు. మధుపర్కం సమర్పించి వరుని కానుకలు మామగారిచేత ఇప్పిస్తారు. వివాహ ముహూర్తానికి జీలకర్ర బెల్ల కలిపి శిరస్సునవుంచి పెండ్లి ప్రమాణాలు చేయిస్తారు. తరువాత మాంగల్య ధారణ జరుగుతుంది. పురోహితుడు వధూవరులిద్దరికీ రక్ష కడతాడు తలంబ్రాలు పోయిస్తాడు. వధూవరులిద్దరి కొంగులు కలిపి బ్రహ్మముడి వేస్తాడు అగ్ని వెలిగించి అగ్నిసాక్షిగా ఈనాటినుండి మీరిద్దరూ ఒక్కటిగా వుండాల

మంత్రపూర్వకంగా ఇద్దరిచేత ప్రమాణాలు చేయిస్తాడు తరువాత వధూవరు లిద్దరూ ఒకరిచేయిని మరొకరు పట్టుకొంటారు. ఇక ఇపుడు జరిగేది సప్తపది.

"సప్తపది అంటే ఏడడగులు కల్సి నడవటం"

"సఖాసప్తపదాభవ"

ఇద్దరు ఏడడుగులు కలిసివేస్తే మిత్రత్వం కల్గుతుందని శాస్త్రం!

పెద్దలు దీన్నే ఏడడగుల సంబంధం అంటారు.

వధూవరులు ఏడడుగులు ఎందుకు నడుస్తారో చూద్దాం !

వరుడు వధువు నడుముపై చేయివేసి దగ్గరగా తీసికొని అగ్నిహోత్రమునకు దక్షిణవైపున నిలబడి తూర్పుదిక్కువైపుగా ఇద్దరూ ముందుగా కుడి అడుగుపెట్టి ఏడడుగులు నడవాలి. ఒక్కొక్క అడుగుకి ఒక్కొక్క అర్థం వచ్చే మంత్రం చెబుతాడు పురోహితుడు.

- మొదటి అడుగు -

"ఏకం ఇషే విష్ణుః త్వా అన్వేతు"

ఈ మొదటి అడుగుతో విష్ణువు మనిద్దరినీ ఒక్కటి చేయుగాక!

- రెండవ అడుగు -

"ద్వే ఊర్జే విష్ణుః త్వా అన్వేతు"

ఈ రెండవ అడుగుతో మనిద్దరకు శక్తి లభించునట్లు చేయుగాక!

- మూడవ అడుగు -

"త్రీణి వ్రతాయ విష్ణుః త్వా అన్వేతు"

ఈ మూడవ అడుగు వివాహవ్రతసిద్ధికోసం విష్ణువు అనుగ్రహించుగాక!

- నాలుగవ అడుగు -

"చత్వారి మయోభవాయ విష్ణుః త్వా అన్వేతు"

ఈ నాలుగవ అడుగు మనకు ఆనందమును విష్ణువు కల్గించుగాక!

- ఐదవ అడుగు -

"పంచ పశుభ్యో విష్ణుః త్వా అన్వేతు"

ఈ ఐదవ అడుగు మనకు పశుసంపదను విష్ణువు కల్గించుగాక!

- ఆరవ అడుగు -

"షడృతుభ్యో విష్ణుః త్వా అన్వేతు"

ఈ ఆరవ అడుగు ఆరు ఋతువులు మనకు సుఖమిచ్చుగాక !

- ఏడవ అడుగు -

"సప్తభ్యో హోతాభ్యో విష్ణుః త్వా అన్వేతు"

ఈ ఏడవ అడుగు గృహస్థాశ్రమ ధర్మ నిర్వహణకు విష్ణువు అనుగ్రహించుగాక!

ఇక సప్తపది మంత్రార్థం చూద్దాం!

"సఖాసప్తపదాభవ! సఖాయౌ సప్తపదా బభూవ । సఖ్యంతే గమేయం సత్యాత్ । తేమాయోషం సఖ్యాన్మే మాయోష్మాః సమయావః సంప్రియౌ రోచిష్ణూ సుమన సుమానౌ । ఇష మూర్జం అభిసంపసానౌ సం నౌమ నాంసి సంవ్రతా సమచిత్తాన్యాకరం"

"ఓ నా అర్ధాంగీ! ఏడడగులతో నీవు నా మిత్రురాలివయ్యావు! నీవు నా స్నేహమును వీడకు. నాతో నాకు సహవాసిగావుండిపో. మనం మంచి ప్రేమగలవారంగా వుందాం. మంచి మనసుతో జీవించుదాం. మనం ఇద్దరమూ సమచిత్తంతో మెలుగుదాం. సమానమైన ఆలోచనలు కలిగి వుందాం. నీవు నన్నెన్నటికీ విడువవద్దు' అంటాడు పెళ్ళికొడుకు.

"సాత్వమసి అమూహం । అమూహమస్మి । సాత్వం ద్యౌః । అహం పృథివీ। త్వంరేతో అహంరేతో భృత్। త్వంమనో అహమస్మివాక్ । సామాహ మస్మి । ఋక్త్వం సా మాం అనువ్రతాభవ ।" అని వరునికి చెబుతుంది వధువు.

"ఓ ప్రాణమిత్రుడా! నీవు ఎప్పుడూ ఏ పొరపాటు లేకుండునట్లుగా వుండు. నేను కూడా ఏ పొరపాటు చేయక నీతో వుంటాను. నీవు ఆకాశమైతే నేను భూమిని! నీవు శుక్రమైతే నేను శోణితాన్ని! నీవు మనస్సైతే నేను మాటను! నేను సామవేదమైతే నీవు నన్ను అనుసరించే ఋక్కువు! మనిద్దరిలో వ్యత్యాసం లేదు. మనమిద్దరమూ ఒక్కటే. కష్టసుఖాలలో ఒకరికొకరం తోడు నీడగా కల్సివుందాం" అని పెండ్లికుమారునికి భరోసా ఇస్తుంది పెండ్లికుమార్తె!

చివరిగా ఇలా అంటాడు వరుడు

"పుంసే పుత్రాయ వేత్తవేశ్రియై ఉత్తరయ వేత్తావయేహి సూనృతే"

ఓ సద్గుణవతీ! మన వంశాభివృద్ధికోసం, మనకు ఉత్తమస్థితి కలుగటం కోసం, మంచి బలముగల, ధైర్యముగల, ప్రజ్ఞావంతులైన వంశహితాన్ని రక్షించగల, న్యాయమార్గం అనుసరించే ఉత్తమ పుత్రులను నాకు ప్రసాదించు" అని సమాదరిస్తాడు వరుడు.

ఎంత చక్కని మనోహరమైన సన్నివేశమిది!

వివాహంలో ఇది సప్తపది మాత్రమే! వివాహకార్యక్రమంలో జరిపించే ఒక్కొక్క కార్యక్రమం ఎంతో మనోహరంగానూ హృదయంగమంగానూ వుంటుంది.

పూర్వీకులు వంశంకోసం, వంశాభివృద్ధికోసం, వంశకీర్తికోసం, ఎంతెంతగా పరితపించిపోయారో వివాహ మంత్రాలలో తెలుస్తుంది. భార్యను భర్త ఏ విధంగా ఆదరించాలో, భర్తను భార్య ఏ విధంగా గౌరవించాలో వివాహ మంత్రాల్లో చక్కగా వుంది.

వివాహం పవిత్ర కార్యంగా చెప్పారు మన ఋషులు.

విడాకులు అనేవి హిందూ సంస్కృతిలో లేవు.

కష్టసుఖాలను కలబోసి అనుభవిస్తూ జీవించటమే వివాహధర్మం. కలసి వున్నపుడు కలతలు సహజం! సర్దుకుపోవటమే జీవితం.

భార్యాభర్తల అనుబంధం మాటల్లో చెప్పలేనిది.

వర్ణించి వ్రాయలేనిది.

వివరించి విడమర్చి చెప్పలేనిది.

✦☆✦

'ధర్మం' అంటే ఏమిటి?

ఇది చాలా సంక్లిష్టమైన ప్రశ్న! అడిగినవెంటనే గభాలున వివరించి చెప్పటానికి కుదరని గంభీర ప్రశ్న! ఎందుకంటే ధర్మం అనే రెండక్షరాల శబ్దానికి చాలా లోతువుంది. చాలా సంక్లిష్టత వుంది. చాలా నిగూఢత వుంది. చాలా విశాలత వుంది.

"ధర్మంతు సాక్షాత్ భగవత్ ప్రణీతమ్"

ధర్మాలన్నియు సాక్షాత్ పరమాత్ముని నుండి లభించాయి.

ధరించునదిగాబట్టి ధర్మము అని ధర్మ శబ్దానికి ఉత్పత్తి అర్థము. (ధృ-ధారణే). ధర్మము నిత్యసత్యమై వుండేదైనా దేశకాల ప్రాంతాదుల ననుసరించి ధర్మం మారుతుంటుంది.

ధర్మము - సామాన్యధర్మం, విశేషధర్మం అని రెండు రకాలు.

శ్లో॥ ధృతిః క్షమా దమో஽స్తేయం, శౌచమింద్రియ నిగ్రహః।
హ్రీర్విద్యా సత్య మక్రోధః, ఏతత్ ధర్మస్య లక్షణమ్ ॥

"ధృతి - క్షమ - దమం - అస్తేయం - శౌచం - ఇంద్రియ నిగ్రహం - హ్రీః (సిగ్గు) - విద్య - సత్యం - అక్రోధం", ఈ పది లక్షణాలు కల్గియున్నది ధర్మమని శాస్త్రం చెబుతోంది.

అంటే;

1. మానవుడు ఏదైనా పని ప్రారంభిస్తాడు. తనకు సంబంధించినది కానివ్వండి, కుటుంబానికి సంబంధించినది కానివ్వండి, సమాజానికి సంబంధించినది కానివ్వండి! ప్రారంభించేటపుడు ఏ సమస్యలు వుండవు. కాని ప్రారంభించిన కొన్ని రోజులకే నూటొక్క సమస్యలు ప్రారంభ మౌతాయి. కువిమర్శలు ప్రారంభమౌతాయి. ఎన్నెన్నో అడ్డంకులు కలిగి నిరాశ కల్గుతుంది. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆత్మబలంతో అకుంఠిత దీక్షతో 'ధృతి' చెడకుండా ముందుకి సాగిపోవాలి. 'ఇది ధర్మం'.

2. మనిషి ఏ విషయంలోనైనా, ఏ పనిలోనైనా ఓర్పు కలిగి వుండాలి. క్షమాగుణంతో వుండాలి. ప్రతిదానినీ ప్రతివారినీ, ప్రతి విషయాన్నీ, క్షమాశక్తితో ఎదుర్కొనాలి. కోపగించుకోకూడదు. ఓర్పుగుణం వున్నవారిని ఏ శక్తులూ ఏమీ చేయలేవు. 'ఇది ధర్మం'.

3. మనం ఒక పని చేసేటపుడు మన మనస్సు సంపూర్ణంగా ఆ విషయంలోనే లగ్నం కావాలి. ఒక పనిచేస్తూ మరొక దానిని గురించి ఆలోచించకూడదు. ఏ విషయంలోనైనా ఏకాగ్రత ముఖ్యం. చదువుతున్నా, వింటున్నా, పని చేస్తున్నా, మాట్లాడుతున్నా, మనస్సును పరిపరిమార్గాలకు పోనివ్వకుండా వుండాలి. 'ఇది ధర్మం'.

4. తనకు తెలియని విషయాలను తాను తెలిసికొనక, పెద్దలు, పూర్వులు, చెప్పినదానిని అంగీకరించక, స్వతంత్ర నిర్ణయం తీసికొనలేక, నిస్తేజంగా నిర్వికారంగా, నిరాశగా, నిర్లిప్తతగా, నియమరహితుడుగా, వుండకూడదు. 'ఇది ధర్మం'.

5. మనిషి ఎల్లపుడూ మనస్సునూ, శరీరాన్నీ, మాటనూ ఆలోచననూ, సంసారాన్నీ, ఇంటినీ, పరిసరాన్నీ, ధరించే వస్త్రాలనూ పరిశుభ్రంగా శుచిగా వుంచుకోవాలి. మనసు పరిశుభ్రంగా వుండాలి. మాట పరిశుభ్రంగా వుండాలి. మనిషి పరిశుభ్రంగా వుండాలి. 'ఇది ధర్మం'.

6. చదువువున్నా, సంపదలున్నా, కీర్తివున్నా, బలంవున్నా ఇంద్రియ నిగ్రహం లేనివానికి ఏదో ఒకరోజు పతనం తప్పదు. కాబట్టి మనస్సును దాని యిష్టానికి దాన్ని వదిలివేయకుండా మన చెప్పుచేతల్లో వుంచుకోవాలి. 'మనస్సును గెలిచినవాడు దేవేంద్రునైనా గెలుస్తాడు' మనస్సును తమ చెప్పుచేతల్లో ఎవరుంచుకొంటారో వారిని భూతప్రేతాలుగాని, దెయ్యాలు గాని, యక్షకిన్నర కింపురుషులుగాని, గ్రహాలు గాని, రోగాలు గాని, కష్టసుఖాలుగానీ, మరణంగానీ, వశంలో వుంటాయి. కాబట్టి మనస్సును, మాటను, దృష్టిని, శరీరాన్నీ, చేతలనూ అదుపుచేయాలి "ఇది ధర్మం".

7. ప్రతి విషయానికీ సంకోచపడటం, సిగ్గుపడటం, అనుమానపడటం, తనను తాను తక్కువగా భావించటం కూడదు "ఇది ధర్మం"

8. మనిషి సత్యవ్రతం కలిగివుండాలి. అకారణంగా, అనవసరంగా, ఒకరి మెప్పుకోసం, ఒకరిని మెప్పించటంకోసం, తన పనిని సాధించుకోవటం కోసం, తాను ఏ విధంగానైనా ప్రయోజనం పొందటంకోసం, తనవారిని తృప్తిపెట్టటంకోసం అబద్ధాలు చెప్పకూడదు. అబద్ధం దరిద్రాన్ని కల్గిస్తుంది. అబద్ధం అల్పసుఖాన్ని మాత్రమే కల్గిస్తుంది. అబద్ధం మరొకనాటికి అవమానం పాలు చేస్తుంది. అబద్ధం మనిషి విలువను మట్టిచేస్తుంది. మన శక్తినీ, మనకీర్తినీ, మన గొప్పదనాన్నీ పాతాళానికి త్రొక్కివేస్తుంది. కాబట్టి సాధ్యమైనంతవరకూ సత్యధర్మాన్ని వదలకూడదు. 'ఇది ధర్మం'.

9. మానవునికి ఆహారం ఎంత ముఖ్యమో, వివేకం కూడా అంతే ముఖ్యం. వివేకవంతుడు కావాలంటే విద్యావంతుడు కావాలి. శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు విన్నంత మాత్రాననే వివేకం సిద్ధించదు. విన్న విషయాలను స్వానుభవానికి మళ్ళించుకోవాలంటే మనిషికి విద్య కావాలి. "విద్యా విహీనః పశుః" అని ఆర్యవాణి. మనిషిగా పుట్టి మట్టిబొమ్మగా జీవితం గడుపకూడదు. ఎంతటి పేదతనం పెనవేసుకొనివున్నా, స్థితిగతులు ఎంతటి బాధాకరమై వున్నా, భిక్షమెత్తి అయినా చదువుకోవాలి అని ఋషి వాక్యం. విద్య ప్రతి వ్యక్తికీ నిర్బంధంగా వుండాలి. 'ఇది ధర్మం'.

10. పగ, హింస, కోపం, ప్రతీకార మనస్తత్వం ఇవన్నీ మనిషిని పతనావస్థకు నెడతాయి. పగ, ప్రతీకారాలు మనిషిని అశాంతికి గురిచేసి అనారోగ్యాన్ని కల్గిస్తాయి. తన అభివృద్ధికి తానే ఆటంకంగా నిలవాల్సివస్తుంది. తనను కన్నవారికీ, తాను జన్మనిచ్చిన వారికీ, తనను నమ్మి బ్రతికేవారికీ అన్యాయం కల్గుతుంది.

అకారణంగా సాటి ప్రాణుల్ని హింసించట, ఆహారం తింటూవున్న ప్రాణుల్ని, నీరు త్రాగుతున్న ప్రాణుల్ని, ఆడమగ కలుస్తున్న జంటల్ని హింసించటం, భయపెట్టటం, రాళ్ళతో కర్రతో హింసించటం, తన దారిన తాను వెళుతున్న ప్రాణుల్ని భయపెట్టి పరుగెత్తించటం మంచిది కాదు.

కోపాన్ని జయించితే మనుష్యుల్ని జయించవచ్చు. సమస్యల్ని అధిగమించవచ్చు. కోపం ఎప్పుడూ మనకే నష్టాన్ని కల్గించి ఎదుటివారికి లాభాన్ని

కల్గిస్తుంది. కోపం ఆత్మీయుల్ని దూరం చేస్తుంది. కోపం భవిష్యత్తును ఛిద్రం చేస్తుంది. కోపం జీవితాన్ని పతనం చేస్తుంది. కోపాన్ని అదుపులో ఎల్లపుడూ వుంచుకోవాలి. 'ఇది ధర్మం'.

వీటినే ధర్మంగా గుర్తించారు పెద్దలు.

ఇదిగో! ఇవి విశేష ధర్మాలంటారు.

సామాన్య ధర్మాల విషయానికి వస్తే చెప్పవల్సిన ధర్మాలు ఎన్నో వున్నాయి. సామాన్య ధర్మాలు అంటే శాస్త్రాలు చెప్పనివి చెప్పనక్కరలేని చెప్పినవి కూడా సామాన్య ధర్మాల క్రిందకే వస్తాయి.

విజ్ఞానాన్ని దాచుకోకుండా బోధించటం గురుధర్మం!

భయభక్తులతో విద్యను నేర్చుకోవటం శిష్యధర్మం!

న్యాయమార్గంగా సంపాదించి సంసారాన్ని పోషించటం యజమాని ధర్మం!

భర్త సంపాదనను సక్రమంగాపెట్టి గృహాన్ని నడపటం ఇల్లాలి ధర్మం!

సైనికుడుగా వుండి దేశాన్ని ప్రజలను కాపాడటం సైనిక ధర్మం!

వృద్ధులైన తల్లిదండ్రుల్ని ఆదరించి పోషించటం పుత్రధర్మం!

తాను జన్మనిచ్చిన బిడ్డల్ని ప్రయోజకుల్ని చేయటం తండ్రి ధర్మం!

తన ఇంటికీ, తనను కన్నవారికీ పేరు ప్రతిష్ఠలు తేవటం బిడ్డలందరి ధర్మం!

తన వృత్తి ఎటువంటిదైనా వృత్తిని గౌరవించటం ప్రతివాని ధర్మం!

తాను సంపాదించినదాన్ని తనవారితో పంచుకొని తినటం సంసార ధర్మం!

అసహాయులను కాపాడటం మానవతా ధర్మం!

చెప్పిన మాటను నిలుపుకోవటం సత్య ధర్మం!

ధర్మసాక్షిగా పెండ్లాడిన భార్యను వదిలివేయకుండా వుండటం వివాహ ధర్మం!

తన భర్త అందహీనుడైనా, స్థితిపరుడుకాకున్నా, నమ్మివుండటం భార్య ధర్మం!

నమ్మిన మిత్రునికి అపకారం చేయకుండటం మిత్ర ధర్మం!

సోమరితనం లేకుండటం పురుష ధర్మం!

- ఇలా చెప్పుకుంటూ వెళితే చాలా ధర్మాలున్నాయి.

"అమ్మా! తల్లీ! ధర్మం చేయి తల్లీ" అని మనం యింటిముందు నిలబడి భిక్షకోసం అరుస్తుండటం ప్రతిరోజూ చూస్తుంటాంగదా! ఇదేంటి 'ధర్మాన్ని చేయటం' ఏమిటి అని మీకెపుడూ అన్పించలేదా!

> "ధర్మం చేయండి" అని యాచించటంలో ఒక ధార్మిక విషయం దాగివుంది. మనిషి సంఘజీవి. సంఘశ్రేయస్సే మనిషికి శ్రేయస్సు! సంఘ సుఖమే మనిషికి సుఖం! సంఘం ఆరోగ్యంగా వుంటేనే మన ఆరోగ్యంగా వుంటాం!

ధర్మాన్ని చేయమని చెప్పి యాచించటం ఎందుకంటే మనిషి సంఘజీవి కాబట్టి మనకు వున్నదాన్ని ఎంతో కొంత లేనివారికి దానం చేయటం సామాజిక ధర్మంగా పూర్వ కాలం నుండీ మన ఆచారంగా వస్తోంది. బహుజన సుఖం, బహుజనహితం భారతీయ ధర్మంగా అనాదికాలంనుండి ఋషులు మనకు బోధించారు. నీదగ్గర వున్నదాన్ని నీవొక్కడవే తినటం ధర్మంకాదు. నీవు నివసిస్తున్న సమాజంతో సమానంగా పంచుకోవాలి. ఆహారం అందరికీ అందాలి. ఎవరూ పస్తులతో వుండకూడదు. సమాజంలో ఆకలి బాధలు ఆకలిచావులు వుంటే అరాచకత పుడుతుంది. దొంగతనాలు, దోపిడీలు, హత్యలు తయారై మానవకులాన్ని కలుషితం చేస్తాయి. అందుకే ఆర్యులు 'అతిథి దేవోభవ' అని చెప్పారు.

అందువల్ల "దానం చేయటం కూడా ఒక ధర్మం" అని గుర్తించాలి. ఆకలిబాధ ఎంతటి దుర్మార్గాన్ని అయినా చేయిస్తుందిగదా! నీకు శక్తివుంటే, నీవు దానం చేయగల స్తోమతవుంటే, నీ కడుపు నిండివుంటే లేనివారికి ఎంతోకొంత సాయం చేయటం మానవధర్మం. మనిషికి ఏం లేకపోయినా పర్వాలేదు. ఆకలిబాధ మాత్రం వుండకూడదు గదా! ఆహారం నిద్ర అందరికీ అవశ్యకమే. వేదం కూడా ఇదే చెబుతుంది.

"స్వస్తి ప్రజాభ్యం పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ
మహీం మహీశా: । గో బ్రాహ్మణేభ్య: శుభమస్తు నిత్యం
లోకా: సమస్తా: సుఖినోభవంతు । అపుత్రా: పుత్రిణ: సంతు ।
పుత్రిణ స్సంతుపౌత్రిణ: । లోకోయం క్షోభరహిత: ।
అధనా: సధనా: సంతు । జీవన్తు శరదశ్శతమ్ ॥"

"పాలకులు ప్రజలను న్యాయమార్గమున ధర్మబద్ధంగా పరిపాలించుగాక! గోసంతతికి పండితులకు శుభం కలుగుగాక! సంతతి లేనివారికి సంతతి కల్గుగాక! సంతతి వున్నవారికి మనుమ సంతతి కల్గుగాక! ప్రపంచం శాంతితో నిండియుండుగాక! దరిద్రులు ధనమును పొందుదురుగాక! అందరూ ఏ ఆపదలు కల్గియుండక నూరు సంవత్సరాలు జీవించుదురు గాక!" అని చెబుతుంది వేదం.

పూర్వకాలం'దానధర్మం' ఒక కర్తవ్యంగా వుండేది. బ్రాహ్మణ వర్ణంవారికి ఇల్లు తప్ప, స్థిరాస్థులు వుండేవికాదు. విద్యార్జన చేయటం, సమాజానికి హితాన్ని బోధించటం, ప్రజలకు విద్య బోధించటం వారి పని. బ్రాహ్మణ బ్రహ్మచారులు ఇంటింటికీ భిక్షమెత్తుకొని వచ్చి గురువుకి సమర్పించేవారు. ఆ విధంగా యాచకం చేస్తూ చదువుకోవాలి. విద్య నేర్పుతున్నందుకు గురువు ఏ విధమైన ప్రతిఫలం ఆశించటం తప్పుగా వుండేది. అప్పటి ఆ కాలంలో మనకు అల్లోపతి వైద్యంలేదు. ఆయుర్వేద వైద్యం అందరికీ ఉచితంగా అందుతుండేది. బ్రాహ్మణులే ఈ పనిని చేస్తూ వుండాలి. విద్య, వైద్యం, వేదం, జ్ఞానం ఎవరూ అమ్మకూడదు. ఎవరూ కొనకూడదు. పొరపాటు జరిగితే శిక్షకు గురికావల్సిందే!

ఈనాటికీ బౌద్ధమత ప్రచారకులు "దానధర్మం"తో జీవిస్తూ ధర్మప్రచారం చేస్తున్నారు. బౌద్ధసూక్తి మీకు తెల్సుగదా!

"ధర్మం శరణం గచ్ఛామి!
సంఘం శరణం గచ్ఛామి!
బుద్ధం శరణం గచ్ఛామి!"

ధర్మాన్ని శరణు పొందుతున్నాను! సంఘాన్ని శరణు పొందుతున్నాను. బుద్ధుని (జ్ఞానాన్ని) శరణు పొందుతున్నాను. అంటూ 'ధర్మయానం' చేస్తుంటారు.

"ధర్మోరక్షతి రక్షితః"

"ధర్మాన్ని నీవు రక్షించితే ధర్మం నిన్ను సర్వదా రక్షిస్తూ వుంటుంది". నీవు ఎపుడు ధర్మాన్ని నిర్లక్ష్యం చేస్తావో ధర్మం నిన్నెపుడూ రక్షించదు."

ధర్మాన్ని నమ్మాలి – ధర్మాన్ని ఆచరించాలి.

ధర్మాన్ని ఆశ్రయించాలి – ధర్మమార్గాననే నడవాలి. ధర్మాన్ని గౌరవించాలి. శ్రీరాముడు ప్రభుధర్మంకోసమే సీతా పరిత్యాగం చేయవల్సి వచ్చింది. ధర్మ మార్గాన నడవటం వల్లనే యుధిష్ఠిరుని ధర్మరాజు అని పిలుస్తున్నాం.

"యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారతా!
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥"

– అని చెప్పాడు యోగీశ్వరుడైన శ్రీకృష్ణపరమాత్ముడు. పాండవులు ధర్మపరాయణులు కాబట్టే కృష్ణుడు పాండవపక్షాన నిలిచి వారికి సహకరించాడు. అధర్మంతోనే త్రొక్కివేశాడు.

అధర్మపరులను అధర్మంతో ఎదుర్కొనవచ్చు. తప్పుగాదు. ధర్మపరులను అధర్మంతో దెబ్బతీయకూడదు. ఇది పాపకార్యం. ఋతుధర్మంవల్లనే వర్షాలు వస్తున్నాయి. చెట్లు పండ్లు ఫలాలను ఇస్తున్నాయి. కాలధర్మం వల్లనే మనిషి మరణిస్తున్నాడు. సంయోగ ధర్మంవల్లనే మళ్ళీ జన్మిస్తున్నాడు. "ధర్మోరక్షతి రక్షితః"

✦☆✦

'బ్రాహ్మణుడు' అంటే ఎవరు?

'బ్రహ్మ జ్ఞానవాంస్తు బ్రాహ్మణః' అని బ్రాహ్మణునికి నిర్వచనం చెప్పారు సనాతనులైన పూర్వీకులు.

ఆ॥ పాపవర్తనుండు బ్రాహ్మణుండయ్యును
నిజముశూద్రుకంటె నీచతముడు
సత్య శౌచధర్మశాలి శూద్రుండయ్యు
నతడు సద్విజుండ యనిరి మునులు - 'శ్రీమహాభారతం'

సీ॥ ఎవ్వడు సత్యంబు నెప్పుడు బల్కు, హింసావిదూరుడు గురుజనహితార్థి
యింద్రియంబులనోర్చి ఎల్లవారల దనయట్ల జూచు ధర్మాధిరతుడు
కామంబు తగులండు కర్మంబులారును, సముచిత సంప్రయోజతనొనర్చు
అట్టి పుణ్యాత్ముని అనఘుబ్రాహ్మణుడని యనిశంబు గీర్తింతురమరవర్య

ఆ॥ లార్జవంబు శమము నధ్యయనంబును
పరమధనముసువ్వె బ్రాహ్మణునకు
ధర్మగతికి నవియు తగు సాధనంబులు
వేదవిహితముఖ్యవిధులు నెనయె - శ్రీమహాభారతం - అరణ్యపర్వం

శ్లో॥ జన్మనా బ్రాహ్మణోజ్ఞేయః, సంస్కారైః ద్విజఉచ్యతే ।
విద్యత్వాచ్చాపి విప్రత్వం త్రిభిశ్శ్రోత్రియ ఉచ్యతే ॥ - 'ధర్మశాస్త్రం'

"చాతుర్వర్ణం మయాసృష్టం
గుణభేద విభాగశః"

'భగవద్గీతా"

శూద్రునకు జన్మించినవాడు శూద్రుడు కాగలడుగాని బ్రాహ్మణునికి జన్మించినంత మాత్రాన బ్రాహ్మణుడు కాలేదు అంటున్నది ధర్మశాస్త్రం. వేదమూ, పురాణాలు, శ్రుతులు, స్మృతులు కూడా ఇదేమాట చెబుతున్నాయి

బ్రాహ్మణుని "ద్విజుడు" అని కూడా అంటారు. ద్విజుడు అంటే రెం సారులు జన్మించినవాడు అని అర్థం. మొదటి జన్మ తల్లి గర్భం నుండి జరిగి రెండవ జన్మ సంస్కారం వల్ల జరుగుతుంది. జన్మవల్ల శూద్రత్వం లభిస్తే కర్మవల్ల బ్రాహ్మణత్వం లభిస్తుంది.

బ్రాహ్మణుడుగా పుట్టటం గొప్పకాదు.

బ్రాహ్మణుడుగా జీవించటం గొప్ప ।

సర్వశాస్త్రాలు, సమస్త హైందవ ధర్మమూ ఈవిషయాన్ని నొక్కి చెప్పా

సమస్త బ్రాహ్మణకులానికి గాయత్రీ మంత్రాన్ని రచించి చెప్పి శ్రీ విశ్వామిత్ర మహర్షి బ్రాహ్మణ కులంలో జన్మించలేదు. సనాతన బ్రాహ్మ కులమంతా నమస్కరించి గౌరవించే శ్రీరాముడు బ్రాహ్మణ కులంలో జన్మిం వాడు కాదు! శ్రీకృష్ణుడు కూడా బ్రాహ్మణ కులస్థుడు కాదు. మత్స్య- కూర్మ వరాహ - నారసింహాది అవతారాలేవీ బ్రాహ్మణత్వం కాదు.

వేదాలలో ఎక్కడా కులప్రసక్తి లేదు.

జనహితం జనసుఖం బ్రాహ్మణుని లక్ష్యం.

బ్రాహ్మణుడు సౌందర్యాభిలాషి కాకూడదు. ఎక్కువసార్లు అద్దంలో ప్రతిబింబాన్ని చూచుకోకూడదు. ప్రతినిత్యం క్షురకర్మ చేయించుకొనకూడదు బహుభార్యాత్వాన్ని కలిగి వుండరాదు. సుఖాభిలాష వుండకూడదు. పాదరక్ష ధరించకూడదు. మద్యపానం చేయకూడదు. మాంసాహారం ముట్టకూడదు విదేశప్రయాణం చేయకూడదు. ఇతర ఆహారపదార్థాలు భుజించకూడదు. ఇ సంస్కృతిని అన్యదేశ వస్తువులను వ కూడదు. అశ్లీల శబ్దాలను వుపయోగి కూడదు. ఏ పరిస్థితిలోనూ కోపాన్ని యించకూడదు. అబద్ధం చెప్పకూడదు ధనాన్ని, సుఖాలనూ అభిలషించకూడదు స్త్రీలవంక నిశితంగా చూడకూడదు. వి

> బ్రాహ్మణత్వం అంటే సత్యం!
> బ్రాహ్మణత్వం అంటే నియమం!
> బ్రాహ్మణత్వం అంటే నీతి!
> బ్రాహ్మణత్వం అంటే ధర్మం!
> బ్రాహ్మణత్వం అంటే విజ్ఞానం!
> బ్రాహ్మణత్వం అంటే జ్ఞానం!
> బ్రాహ్మణత్వం అంటే నిష్ఠ!

ఆహారాలనూ, వస్తువులనూ, కాఫీ వంటి విదేశ పానీయాలను ముట్టకూడదు. తాను అభ్యసించిన వేదవిద్యను ధనాశకు వినియోగించకూడదు. ప్రాణులను కర్రతోగానీ, రాయితోగానీ కొట్టకూడదు. ఏ విధమైన వ్యాపారాలు చేయకూడదు. గోష్పాదం (పిలక) లేకుండా వుండకూడదు. సినిమా నాటకాలు మున్నగునవి చూడకూడదు. ఏకపత్నీ వ్రతాన్ని తప్పక పాటించాలి. సర్వజన శాంతి సుఖాల కోసం దేవుని ప్రార్థించాలి. దైవప్రార్థనలో తన స్వార్థం విడచి జనహితాన్ని కోరుకోవాలి. జనహితంకోసమే తన జీవితాన్ని ఖర్చు చేయాలి. మనస్సు, మాట, శరీరం, పని, లోకహితార్థమై వుండాలి. నేలమీదనే నిద్రించాలి. కోరికలను త్యజించాలి – బ్రాహ్మణునికి ఇన్ని నియమ నిబంధనలు వున్నాయి. ఈ నియమాలను పాటించిన ధర్మమూర్తినే బ్రాహ్మణుడు అని భావించి గౌరవించి నమస్కరించాలి.

ధార్మిక లక్షణాలున్నవారెవరైనా బ్రాహ్మణులే!

"బ్రాహ్మణ్యం' కులసంకేతపదం కాదు. గుణసంకేత పదం.

'బ్రాహ్మణాయ నమోనమః'

బ్రహ్మజ్ఞానాయ నమోనమః

✦☆✦

స్త్రీలకు "పిత్రార్జిత ఆస్థిహక్కు" శాస్త్ర సమ్మతమా?

అవును!

స్త్రీలకు పిత్రార్జిత ఆస్థిహక్కు సనాతన శాస్త్రసమ్మతమే!

యాజ్ఞవల్క్య మహర్షి రచించిన 'స్మృతి'లో దీన్ని గురించి వివరంగా వుంది. ఇండియన్ లా అండ్ ఆర్డర్"లో యజ్ఞవల్క్య స్మృతిని ఆధారంగా చేసుకొని కొన్ని చట్టాలు చేయటం కూడా జరిగింది. 'భారతీయశిక్షాస్మృతి' ప్రాచీన ఋషి సంస్కృతితోనే వ్రాయటం జరిగింది. ఆశ్చర్యకరమైన గొప్ప విషయం ఏమంటే "భారతీయ శిక్షాస్మృతి" పంచమ కులస్థుడైన ఒక విద్యావంతుని పర్యవేక్షణలో వ్రాయటం జరిగింది. ఆయనే డా॥ అంబేద్కర్!

కుంకుమ ధరించటం పవిత్రతకు, ఆస్తికత్వానికి ధార్మికత్వానికి పురుషులకు సంకేతమైతే, స్త్రీలకు ఐదవ తనానికీ, సౌభాగ్యానికీ, స్థిరబుద్ధికీ సంకేతంగా చెప్పవచ్చు. మానవుడు నాగరికత నేర్చినదగ్గరనుండీ కుంకుమను ముఖ్య అలం కారంగా కూడా భావించినట్లు కొన్ని గ్రంథాలలో వుంది.

భర్తను కోల్పోయిన స్త్రీలు పరులెవ్వరికీ అందంగా తాము కన్పించకూడదు అన్న వుద్దేశ్యంతోనే కుంకుమ ధారణను త్యజిస్తారు. కుంకుమ భారతీయుతక చెరుగని ముద్ర. పాశ్చాత్య నాగరికత మనమీదకు దాడిచేసిన తరువాత పురుషులందరూ కుంకుమధారణ మరిచిపోయారు. ఇంకొంతకాలానికి స్త్రీలు కూడా మరచిపోవచ్చునేమో! దేవుళ్ళు మాత్రమే మిగుల్చుకుంటారేమో! ఎవరికి తెల్సు?

కాలం తెచ్చే మార్పులు వింత సంతగా వుంటాయి.

✦☆✦

దేవాలయాలు ఎందుకు?

మీకు తెలుసా? పరాయి పాలకుల హింసకూ, ఇతర మతాల దోపిడికి, ఆక్రమిత ధర్మాల అక్రమాలకూ హిందూమతం ఛిన్నాభిన్నమై ఛిద్రమై పోయిందొకప్పుడు. ఎందరో హిందువులు పరాయిమతాల పాలైపోయారు. తమ ఆడబిడ్డల్ని పరాయిమతం వారికి కన్యాదానం చేశారు. కొంతమంది తాము గూడా మతం మార్చుకొని పరాయి మతపుకూటికి చేతులు చాచారు. చేరువైపోయారు.

బాధగావున్నా ఇది నగ్నసత్యం!

ఈనాడు ముస్లిములుగా చెప్పుకొంటున్నవారు. ఈనాడు క్రైస్తవులుగా చెప్పుకొంటున్నవారు, ఎందరో ఒకప్పుడు హిందువులే! అగ్రవర్ణాలైన బ్రాహ్మణ వర్ణాలచేత ఛీదరింపబడినవారు, ధనికస్వాముల దౌర్జన్యానికి గురైనవారు, దరిద్రాన్ని భరించలేనివారు, అంగబలం లేనివారు. ఎందరెందరో ...

దారికోసం పరాయి మతాల పాలైపోయారు. ఆ స్థితిలో మనకు దేవాలయాల అవసరం కల్గింది. హిందుపులందరిని ఐక్యత పరచటంకోసం, ఒక్కచోట చేర్చటంకోసం, స్నేహసంబంధాలు నెలకొల్పటంకోసం, హిందువులందరూ ఒక్కటేనని చెప్పటంకోసం, మనకు దేవాలయాల నిర్మాణం అవసరం అయింది.

అయినా పంచమ జాతివారు దూరంగానే నిలిచిపోయారు.

వివిధ పర్ణాలుగా, వివిధ కులాలుగా, విభాగాలుగా ముక్కలైపోయిన హిందూ (భరత) సంజాతులందరినీ ఒక్కతాటిమీద నిలిపింది ఈ దేవాలయాలే!

దేవునికి విశ్వమే ఆలయం! సకల చరాచర జీవనాధారుడైన దేవునికి ఆలయం (ఇల్లు) కావాలా? అక్కర్లేదు. కానీ... మనకు కావాలి! మన సమైక్యతను కాపాడుకోవటానికి కావాలి! మనమందరం ఒక జాతి వారమని తెలియజెప్పు కోవటానికి కావాలి! కమ్మ, రెడ్డి, నాయుడు, కుమ్మరి, జాలరి, మంగలి, చాకలి మొదలైన వారందరూ ఒక్క మతం కన్నబిడ్డలమేనని గుర్తుచేసుకోవటానికి మరచిపోకుండటానికి మనకు దేవాలయాలు కావాలి! హిందువులందరు బంధువులేనని తెలుసుకోవటానికి మనకు దేవాలయాలు కావాలి! బాంధవ్యాలు బూడిదపాలై, మమతలు మట్టిపాలై, మనసు చెదరి, బ్రతుకు బరువై, జీవితం శూన్యమనిపించినపుడు సేదదీర్చుకొని గుండెను గట్టిపరచుకోవటానికి దేవాలయాలు కావాలి! ఏ ఒక్కరిదీకాని, ఏ ఒక్కరికీ సంబంధించని, ఏ ఒక్కరి అధికారం వుండని, దేవాలయాలు అభాగ్యులకు అనాధలకు, ఆర్తులకు, ఆశ్రయం ఇచ్చి ఆదరించటానికి కావాలి! ఎవరులేకున్నా నాకు దేవుడున్నాడనే నమ్మకం దిక్కులేనివారందరికీ కావాలి! కావాలి! కావాలి!!!

మన దేవాలయాలమీద బూతు బొమ్మలెందుకు?

దేవాలయం అంటే పవిత్రమైనది గదా! దేవాలయం గాలిగోపురంమీద వివిధ భంగిమల్లో శృంగార శిల్పాలు వుండటం ఏమిటి? చూచేవారికి అసభ్యంగా వుండదా? అని మనకందరకూ అనిపిస్తుంది.

దేవాలయాలమీద (గాలిగోపురం మీద) శృంగార శిల్పాలను నిర్మించటం వెనుక ఒక సునిశితమైన ఆలోచన వుంది. మరొక ప్రయోజనం కూడా వుంది.

మన పూర్వీకుల జీవితం మన జీవితంలాగ అతివేగంగా (ఫాస్ట్‌గా) వుండేది కాదు. నిశ్చలంగా, నిబ్బరంగా వుండేవారు. చాలామంది ప్రతిదినమూ దేవాలయానికి వెళ్ళి వస్తుండేవారు. పెద్దవాళ్ళతో పాటుగా యుక్తవయస్సులో వున్నవారు కూడా దేవాలయానికి ప్రతిదినమూ వెళ్ళి రావటం పరిపాటిగా వుండేది. పురుషుడైన ప్రతివాడు "ధర్మ -అర్థ - కామ - మోక్ష" అనే చతుర్విధ పురుషార్థాలనూ తప్పక సాధించుకోవాలనే నియమం వుండేది.

మొదటిదిగా ధర్మసాధన చేయాలి. అంటే చదువుకోవటం గానీ, వృత్తి విద్య నేర్చుకోవటంగాని చేయాలి. రెండవది ధనాన్ని సంపాదించాలి. ధనమంటే ఈనాటి రూపాయినోట్లు కాదు. ఆ కాలంలో ఎవరికైనా ఎన్ని పశువులు వుంటే అంతటి ధనవంతులక్రింద లెక్క! మూడవది వివాహం చేసుకొని ఎక్కువమంది పిల్లల్ని కనాలి. ఎంతమంది సంతానం వుంటే అంత గొప్పన్న మాట! నాల్గవది చివరిగా మోక్షమార్గం అనుసరించి జీవితం ముగించాలి. ఈ నాల్గింటిని పుణ్యపురుషార్థాలు అంటారు. మనిషికి ఈ నాలుగు పురుషార్థాలూ అవసరమే. "కామిగాక మోక్ష కామిగాదు" అంటాడు వేమన. మనం తెల్సుకోవల్సిన విషయం ఇంకొకటి కూడా వుంది.

> ప్రతి నిత్యమూ దేవాలయానికి వెళుతూ దైవధ్యానంలో పడి సృష్టి కార్యాన్ని విస్మరించకూడదన్న హెచ్చరిక చేయటానికే దేవాలయాలమీద శృంగార శిల్పాలను నిర్మించారు మన పూర్వీకులు.

శృంగారం పాపకార్యం కాదు. సృష్టికి మూలం శృంగారమే గదా! అంతేకాదు; మనం భార్యలతో కలసివున్న దేవుళ్ళనే పూజిస్తుంటాం. మనం చదివే మంత్ర శ్లోకాలలో కూడా శృంగారం వుంది గదా!

ధర్మం ఎంత గొప్పదో శృంగారమూ అంతే!

సంపాదన ఎంత ముఖ్యమైనదో శృంగారమూ అంతే!

మోక్షమెంతటి గొప్పదో శృంగారమూ అంతే!

వశిష్ఠాది మహాబ్రహ్మర్షులకు కూడా భార్యాబిడ్డలు వున్నారన్న విషయం విస్మరించ కూడదు. భార్యతో కూడిన సృష్టి కార్యం పవిత్ర ధర్మంగా గుర్తించాలి. కాని పరస్త్రీ వ్యామోహం మాత్రమే మహాపాపం.

పూర్వకాలంలో 'సంతానమే సంపత్తు'గా వుండేది. ఎక్కువ సంతానం వున్నవారికి సమాజంలో ఎక్కువ గౌరవం వుండేది. ఎక్కువ సంతానం వున్న వారికి శత్రువులు భయపడేవారు. ఆనాడు వ్యవసాయమే అందరికీ ప్రధానవృత్తి. ఎక్కువ ధాన్యాన్ని పండించాలంటే ఎక్కువ కృషి చేయాలి ఎక్కువ కృషి చేయాలంటే ఎక్కుమంది బిడ్డలు కావల్సి వచ్చేది. కాబట్టి 'సెక్స్' ఆనాటి ప్రజల జీవనానికి ముఖ్యచేతనం చేయాలి కాబట్టి గుడి గోపురాలమీద బూతుబొమ్మలు సృష్టించాల్సిన అవసరం కల్గివుంటుంది.

ఈనాడు మనం సుఖాన్ని రకరకాలుగా అనుభవిస్తున్నాం. సినిమాలు, టివి, కార్లు, ఎ.సి.రూములు, హోటల్స్, బార్‌లు ఇలాంటివెన్నో మనకు సుఖాన్ని కల్గిస్తున్నాయి. ఆనాటి వారికి ఇవేమీ లేవు. వారికి సుఖాన్ని కల్గించేవి మూడే మూడున్నాయి. ఆహారం, నిద్ర, శృంగారం. ఈ మూడే వారికి ప్రధానాంశాలు! కాబట్టి శృంగారం ఆనాటి జనజీవితాలకు ప్రధానాంశంగా భావించారేమో!

దేవాలయాలే ప్రజలకు వినోదకేంద్రంగానూ, విలాస కేంద్రంగానూ వుండేవి. ఊరివారందరికీ దేవాలయం ఉమ్మడి ఆస్థిగావుండేది. దేవుని ఉత్సవాలు, జాతరలు, తిరునాళ్లు మాత్రమే ఆనాటివారికి వున్న ఉమ్మడి వినోదం. వూరివారందరూ ఒకేచోట కల్సుకొని ఆత్మీయతలు పంచుకొనేవారు. ఇంతకు

మించిన వినోదవిహారాలు వాళ్ళకేమీ వుండేవి కాదు. కష్టించి పనిచేయటమే వారికి తెల్సిన విద్య. కడుపునిండా దొరికింది తినటమే వారికి తెల్సిన తృప్తి. ఒక్కొక్క యింటిలో వందలమంది సభ్యులు వుండేవారు. ఈ కారణంగా వారిలోవున్న లైంగిక ఆసక్తి అణగిపోతూవుండేది. చాలామంది యువకులు దేవాలయాలలోనే విశ్రాంతి పొందుతుండేవారు. రాత్రిళ్ళుకూడా అక్కడే నిద్రపోతుండేవారు. యువతను నిద్రాణం కాకుండా చూడటానికీ, శృంగార మనోవృత్తిని మేల్కొలుపటానికీ దేవాలయాలమీద బూతు బొమ్మలను నిర్మించేవారు.

అంతేకాదు;

శృంగారం పాపవృత్తికాదనీ పవిత్రమైనదనీ దీని వుద్దేశ్యం

శివలింగం కూడా శృంగార సంకేతమే గదా!

ఆనాటి లైంగిక బంధాలు సంతానోత్పత్తికోసమే వుండేవి. ఈనాటిలా భోగప్రవృత్తిగా వుండేవికాదు. అంతేకాదు ప్రతి పున్నమిరాత్రికీ "కంచుకోత్సవాలు" జరిగేవి. భర్త కారణంగా పిల్లలు లేని (కలుగని) స్త్రీలందరూ పున్నమిరాత్రులలో అపరిచిత పురుషులతో సంసారం చేసి పుత్రవతులు అయ్యే సంప్రదాయం ఆనాటి ధర్మంగా వుండేది. తన భార్యకు పరపురుషుని వల్ల కలిగిన కొడుకుని క్షేత్రజుడు అంటారు. క్షేత్రజుడు కూడా పుత్రునితో సమానమైనవాడే! కుంతీదేవి ఈ నియోగ పద్ధతిలోనే పాండవులను కన్నది. పాండురాజుకి నియోగపద్ధతిలో జన్మించినవారే ధర్మ - భీమార్జునులు.

దయచేసి ఆశ్చర్యపోవద్దు!

ధర్మం కాలానుగతంగా మార్పు చెందుతుంది. అంతే!

✦☆✦

సన్యాసుల చేతిలో పొడవైన కర్ర ఎందుకు?

వైరాగ్యానికీ, తాత్వికతకూ, ద్వైత, అద్వైత భావానికీ పొడవైన కర్ర గుర్తుగా పెట్టుకొంటారు సన్యాసులు! (యతులు).

'Y' ఆకారంగల పద్దెనిమిది అంగుళాల పొడవున్న 'యోగదండ'మనే పేరుగల దండాన్నీ, కమండలాన్నీ పట్టుకొని వుండేవారిని 'తాపసులు' అంటారు. 'ఋషులు' అని కూడా అంటారు.

గాలి – నీరు – భూమి – అగ్ని – ఆకాశం అనే పంచభూతాల సమ్మేళనమే మనిషి గాబట్టి ఐదు అడుగుల పొడవైన చేతి కర్రను ధరిస్తారు. ఇందులో ఏకదండి, ద్విదండి, త్రిదండి అని మూడు విధాలు వున్నాయి. ఒకే ఒక కర్రను ధరించి వుండేవారు అద్వైత సిద్ధాంతం కలవారు. అద్వైతం అంటే జీవుడు దేవుడు (శ్రీ శంకరాచార్యమతం) ఒక్కటేననే సిద్ధాంతం మనిషిలోనే దేవుడున్నాడు. పరబ్రహ్మాత్వమే మనిషిని నడిపిస్తున్నది. స్వర్గము నరకము ఇక్కడే వున్నాయి. అంతరాత్మకు (పరమాత్మకు) విరుద్ధంగా, దైవత్వాన్ని మరుగున పెట్టి, అక్రమ మార్గాన చరిస్తే, ఆ పాపఫలితాన్ని మనం ఏదో ఒక రూపంలో ఇక్కడే అనుభవించాల్సి వస్తుంది అంటుంది అద్వైతం. ఈ అద్వైతం సిద్ధాంతం బోధించేవారి వద్ద ఒకే ఒక్క కర్ర వుంటుంది. జ్ఞానానికి సంకేతమైన అశ్వత్థ వృక్షం (రావిచెట్టు) నుండి సేకరించుకొంటారు.

రెండు కర్రలను కలిపి ఒక్కటిగాకట్టి చేతధరించి బోధనలు చేసేవారు ద్వైత సిద్ధాంతం కలవారు. వీరిని 'ద్విదండి' అంటారు. దేవుడు వేరు జీవుడు వేరు (జీవాత్మ పరమాత్మ వేరువేరు) అని బోధిస్తారు. వీరందరూ వైష్ణవ భక్తులే. ఈ సిద్ధాంతాన్నే భారతయుద్ధంలో శ్రీకృష్ణుడు అర్జునునికి బోధిస్తాడు. ద్వైత సిద్ధాంతానికున్న ప్రాచుర్యం అద్వైతానికి అంతగా లేదు. రామానుజాచార్యులు మొదలైన వారెందరో ఈ మతానికి ప్రాణంపోసి ప్రాముఖ్యతను కల్గించారు. ఈ మతంవారిని 'జీయరు'లని అంటారు.

మూడు కర్రలను ఒకే కట్టగా కట్టి భుజాన పెట్టుకొనే వారు కూడా వున్నారు. దీన్ని 'తత్వత్రయం' అంటారు. జీవాత్మ, పరమాత్మ, ప్రకృతి ఈ మూడింటినీ నారాయణ తత్వంగా భావిస్తూ బోధనలు చేస్తారు.

పొడవైన ఈ దండాలతో దుష్టప్రాణులనుండి రక్షణ కల్పించుకొంటారు. ఫలపుష్పాలను ఈ దండం సహాయంతో సేకరించుకొంటూ భగవధ్యానంతో జీవితం గడుపుతుంటారు.

ఋషుల చేతిలో వుండే 18 అంగుళాల యోగదండం జపం చేసుకోవటానికి వుపయోగపడుతుంది. రుద్రాక్షమాల నేలపైబడి అపవిత్రం కాకుండా 'y'ఆకారంగల కర్రపై కుడిచేతిని పెట్టి జపమాల త్రిప్పుతుంటారు. ఈ యోగదండం కూడా ఆత్మరక్షణకు యోగీశ్వరత్వానికి వుపయోగపడుతుంది.

✦☆✦

వేదాలు నాలుగు కదా! ఆయుర్వేదం ఏమిటి?

అవును

ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం ఈ నాలుగు వేదాలు!

ఈ ఆయుర్వేదం ఏమిటి?

ఇదే కదండీ, మీకు వచ్చిన అనుమానం!

తెలుసుకొందాం పదండి

కృతయుగంలో దేవతలు రాక్షసులు ఒకటిగా చేరి క్షీరసాగరాన్ని మధించారు. ఆ సాగరమధనం నుండి శ్రీమహాలక్ష్మి, కౌస్తుభమణి, ఐరావతం, కల్పవృక్షం, కామధేనువు, చంద్రుడు, దివ్యరత్నరాశులు. ఉచ్చైశ్రవము, అమృతము పుట్టాయి. అన్నిటికంటె ముందుగా పుట్టింది హాలాహలం. అమృతంతో తరువాత 'ధన్వంతరి' జన్మించాడు. ఈయనను మహావిష్ణువు అవతారంగా భావిస్తారు. ధన్వంతరి జన్మిస్తూనే ఒక చేతిలో అమృతభాండాన్నీ మరొక చేత ఆయుర్వేదాన్నీ, పట్టుకొని ప్రత్యక్షమై వచ్చాడు. ఈ ఆయుర్వేదమే

సకల మానవకోటికి ఆరోగ్యాన్ని ప్రసాదించే జీవనవేదం. ఈ ఆయుర్వేదాన్ని అధర్వణవేదానికి ఉపవేదంగా చెబుతారు.

శ్రీమహావిష్ణువు ప్రతిరూపమైన ధన్వంతరియే రోగ మరణభయంలేని అమృతాన్ని దేవతలకు యిచ్చి అజరామరులుగా చేసాడు. పంచమవేదంగా ఆయుర్వేద భాండారాన్ని బ్రహ్మదేవునికి ఇచ్చాడు శ్రీధన్వంతరి.

ఈ ఆయుర్వేదం బ్రహ్మదేవునినుండి దక్షప్రజాపతికి లభించింది. దక్ష ప్రజాపతినుండి సురలోక వైద్యులైన అశ్వినీ కుమారులకు సంక్రమించింది.

ఈ ఆయుర్వేదం భూలోకానికి ఎలా వచ్చిందంటే :

ఒకసారి వశిష్ఠ, భరద్వాజ, అంగీరస, అత్రి, దుర్వాస, భృగు, విశ్వామిత్రాది మహర్షులందరూ హిమవత్పర్వతంమీద సమావేశమైనపుడు, మానవాళి రోగాల బారినపడి నిశ్శేషమైపోతున్న విషయం చర్చకు వచ్చింది. దేవలోకంనుండి ఆయుర్వేదాన్ని భూలోకానికి రప్పించాలని అందరూ నిశ్చయించుకొన్నారు. భరద్వాజ మహర్షి దేవలోకం వెళ్ళి ఆయుర్వేదాన్ని అభ్యసించి వచ్చి 'ఆత్రేయుడు' అనే మహర్షికి బోధించాడు. ఈ మహర్షి తదనంతరం "అగ్నివేశ మహర్షికి ఉపదేశం చేశాడు. ఆత్రేయునివద్ద నేర్చుకొన్న ఆయుర్వేద రహస్యాలను మహా శాస్త్రంగా రచించాడు అగ్నివేశుడు. దీనినే "అగ్నివేశతంత్రం" అంటారు. ఈ అగ్నివేశతంత్రం (క్రీపు 2000-1000) "చరకసంహిత"గా రూపుదిద్దుకొంది. ఈ చరకుడినే మన ఆయుర్వేదానికి ఆదిగురువుగా ఇపుడు పూజిస్తున్నాం.

శ్లో॥ నమామి ధన్వంతరి మాదిదేవం, సురాసురైర్వందిత పాదపద్మం
లోకేజరారుగ్భయ మృత్యునాశం, ధాతారమీశం వివిధౌషధీనాం"

✦☆✦

ఆలయ గోపురం ఎత్తుగా ఎందుకు కట్టాలి?

దేవాలయం అంటే లక్షోపలక్షల భక్తుల పుణ్యధామం. ఆగమశాస్త్రబద్ధంగా దేవాలయాలను నిర్మించవల్సి వుంటుంది. ఆలయనిర్మాణం దేవుడు పడుకున్నట్లు శయనరీతిలో నిర్మిస్తారు. ఆలయ గోపురమే భగవంతుని పాదాలు. గర్భగుడి భగవంతుని శిరస్సు. ఆలయ మంటపం భగవంతుని కడుపు. దైవదర్శనం అంటే గుడిలోకి వెళ్ళి స్వామిని చూచి గంటకొట్టి నమస్కరించాలి అను కొంటుంటాం. ఆ పద్ధతినే పాటిస్తుంటాం. కాని దూరంగా వుండి కూడా ఆలయగోపురానికి నమస్కరించినా స్వామి పాదాలకు నమస్కరించినట్లే అవుతుంది.

కాబట్టి ఆలయగోపురం ఎత్తుగా వుండాలి

అంతేకాకుండా

దేవాలయం ఒక వ్యక్తికీ ఒక కుటుంబానికీ సంబంధించి వుండదు. సార్వజనిక ఆస్థిగా పరిగణింపబడుతూ, పోషింపబడుతూ, రక్షింపబడుతూ, దర్శింపబడుతూ వుండాలి. దాతలెవరైనా దేవాలయానికి దానాదికాలను చేయవచ్చు. పోషకులుగా వుండవచ్చు. వేశ్యలు కూడా దేవాలయాలను కట్టించిన దాఖలాలు ఎన్నో వున్నాయి. సర్వజనానీకానికీ, పొరుగువూరివారికీ, పరదేశ వాసులకూ, క్రొత్తగా వచ్చినవారికీ దేవాలయం ఎక్కడ వున్నదో సులభంగా తెలుసుకోవటానికి బాగుంటుంది.

కాబట్టి ఆలయగోపురం ఎత్తుగా వుండాలి.

> దేవుడు గొప్పవాడు!
> ఉన్నతమైన వాడు!
> అందనివాడు! అందరి వాడు!
> అని చెప్పటం కోసమే ఆలయ
> గోపురం చాలా ఎత్తుగా
> నిర్మిస్తారు.

దేవాలయ గోపురమే కాదు దేవాలయం కూడా ఎత్తుమీద వుండటం హితదాయకం. అందుకే ఎన్నో దేవా లయాలు కొండలు గుట్టలు చూచుకొని మరీ నిర్మిస్తారు. ఎందు కంటే, మానవు డెంతటి తెలివికలవాడైనా ప్రకృతిని జయించగల శక్తివంతుడు కాలేదు! కాలేడు! వరదబీభత్సాలు,

తుఫానులు మొదలైన ప్రకృతి వైపరీత్యాలకు మనిషి భయపడి తీరవల్సిందే. అటువంటి ప్రకృతి ప్రళయసమయాలలో ప్రాణాలు కాపాడగల్గిన స్థలం దేవాలయమే!

దేవుడు సర్వోన్నతుడు! ఈ సర్వోన్నత భావం దేవాలయాన్ని దర్శించిన ప్రతిసారీ మనిషికి, మనస్సుకీ బోధపడటానికి దేవాలయాన్నీ దేవాలయగోపురాన్నీ ఎంత వీలైతే అంతగా ఎత్తుకి నిర్మిస్తారు. హిందూదేవాలయాలేకాదు. మసీదుకి కూడా పొడవైన స్తంభం (మినార్) నిర్మిస్తారు. చర్చికి కూడా ముందుభాగంలో ఎత్తుగా దూరానికి కన్పించే విధంగా అంతస్థు నిర్మించి గంటను కడతారు.

✦☆✦

విగ్రహారాధన సనాతనమా?

లక్షలాది సంవత్సరాలక్రిందట, మానవుడు పశుప్రాయుడై వున్న దశలో, పచ్చిమాంసాన్ని, పచ్చిదుంపలను, తింటూ జీవిస్తున్నస్థితిలో అగ్నిపుట్టటం చూచాడు. సమస్తాన్నీ హరించివేయటం చూచాడు. భయపడిపోయాడు. ఆశ్చర్యచకితుడయ్యాడు. అగ్ని ప్రతాపానికి బెదిరిపోయి పరుగులు తీశాడు. పంచభూతాలైన భూమి, నీరు, వాయువు, అగ్ని - ఆకాశం ఈ ఐదింటిలో 'అగ్ని' తప్ప మిగిలిన నాలుగు సహజంగానే కోరుకోకుండానే, కష్టపడకుండానే లభిస్తాయి. ఆదిమానవునికి ఈ నాలుగు మాత్రమే తెలుసు. అగ్నిని చూచిన తరువాత దానినే దేవునిగా ఆరాధించటం జరిగింది.

మనకు ఆదిదేవుడు అగ్నిదేవుడే!

అందుకే మన చతుర్వేదాలలో మొదటిదైన ఋగ్వేదం "అగ్నిమీళే పురోహితం యజ్ఞస్యదేవమృత్విజమ్ । హోతారం రత్నధాతమమ్॥" అంటూ ప్రారంభం జరుగుతుంది. అందుకే హోమాలు చేసి అగ్నిని పూజించేవారు. అగ్నిని పుట్టించే 'అగ్గిపెట్టెలు' ఆనాడు లేవుగదా! మూడు నాలుగు వందల సంవత్సరాలక్రితం కూడా మనకు 'నిప్పుపెట్టె' తెలియదు. చెకుముకి రాళ్ళతో నిప్పు పుట్టించటమే తెల్సు.

కేవలం పదిహేనువందల సంవత్సరాలనుండే మనకు విగ్రహారాధన ప్రారంభం అయిందనవచ్చు. దేవునికి రూపంలేదు! పేరులేదు! రంగులేదు! దేవాలయ నిర్మాణం కూడా విగ్రహారాధన తరువాతనే జరిగిందని చరిత్రకారుల అభిప్రాయం కూడ.

విగ్రహారాధన సనాతనం కాదు
ఆధునికం మాత్రమే!

విద్యాపీఠాలు, శక్తిపీఠాలు మాత్రం వేలాది సంవత్సరాలనుండీ వున్నాయి.

మొట్టమొదటి మనకంటికి కనిపించే దేవుడు అగ్నిదేవుడుగా గుర్తించిన తరువాత సృష్టిసంకేతమైన శివలింగం మనకు ఆరాధ్యమైంది. త్రేతాయుగంనాడే మనకు శివలింగాలు వున్నట్లుగా చరిత్రాధారాలు వున్నాయి. శివభక్తుడైన రావణబ్రహ్మ శివలింగపూజ చేసేవాడు. శ్రీరాముడు కూడా లింగప్రతిష్ఠ చేసినట్లుగా రామాయణంలో వుంది. అయితే దేవుడిని బొమ్మగా చేసి వాలుగు, ఆరు, పదిచేతులు పెట్టి, బంగారు ఆభరణాలు తొడిగి, గుడిలోపలపెట్టి, తాళాలు వేసి, తలుపులు మూసే పద్ధతి క్రీస్తుశకం నుండే మొదలయింది. ఈ విగ్రహారాధనకు బ్రాహ్మణాచార్యుల మద్దతు కూడా వుండటంతో పామర ప్రజానీకం అనుసరించింది. పదిహేను పందల సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఈ విగ్రహారాధనను పందొమ్మిదవ శతాబ్దంలో కొందరు వ్యతిరేకించారు.

ఇప్పటికి మూడువేల సంవత్సరాలనాటి కాలాన్ని వేదయుగం అని చెబుతారు. యాగాలు హోమాలు చేస్తూ అగ్నిదేవుని పూజించేవారు. గౌతమ బుద్ధుడు ఈ యాగాలను నిరసించాడు.

కష్టించి పండించిన ఆహార ధాన్యాలను నిప్పులో వేసి (హోమాలలోవేసి) బూడిద చేయటాన్నీ, దేవునికి జంతువులను బలి ఇవ్వటాన్ని కూడా బౌద్ధ మతస్థులెవరూ అంగీకరించలేదు. బౌద్ధమతం ఆనాటి భారతదేశంలో చాలా బలంగా వుండేది. బౌద్ధం అందరినీ ఆకర్షించింది.

యాగాలు హోమాలు క్రమంగా నిలిచిపోయాయి.

తరువాత

విగ్రహారాధన ప్రారంభం అయింది.

విగ్రహారాధన లేకుంటే శైవ, వైష్ణవ మతాలు ఈనాటికి క్షీణించివుండేవి!

విగ్రహారాధనకోసం దేవాలయాల నిర్మాణం జరిగింది

విగ్రహ ప్రతిష్ఠ జరిగింది.

క్రొత్త క్రొత్త పురాణాలు, కథలు పుట్టుకొచ్చాయి.

రకరకాల దేవుళ్ళు, రకరకాల దేవాలయాలు పుట్టుకొచ్చి ఒకరకంగా హిందువుల ఐక్యతనూ హిందూత్వాన్నీ బలహీనం చేసాయి. హిందూదేశం 'ఇండియా'గా మారిపోయింది. పరాయి మతాలు హిందూదేశానికి వచ్చి బలపడ్డాయి. హిందూమతం అంటే ఏమిటో, హిందూమతం గొప్పదనమేమిటో, సరిగా వివరించేవారు లేరు. ఇంకా కొత్త కొత్త దేవుళ్ళు పుదుతూనే వున్నారు. తినే తిండిలోనూ, ధరించే బట్టలోనూ, మాటాడే భాషలోను ఆచార వ్యవహారాల లోనూ మాత్రమే కొత్తదనం కాదు, పూజించే దేవుళ్ళులోనూ కొత్తదనం కోరుతున్నారు నేటి జనం.

విగ్రహారాధన మొదలైన తరువాతనే దేవుళ్ళలో గొప్ప దేవుళ్ళు, మామూలు దేవుళ్ళు మొదలయ్యారు. దబ్బులతో దైవ దర్శనాలు జరుగుతున్నాయి. శ్రీమంతు లకే అగ్రస్థానం లభించటం జరుగు తోంది.కానుకలు తప్పనిసరి అయ్యాయి. ఇందుకు సంతోషించాలో, విచారించాలో అర్థం కావటంలేదు.

> దేవాలయాలు అంటే ఎవరైనా, ఏ సమయంలోనైనా, నేరుగా దేవుని దర్శించుకొనే విధంగా వుండాలి. డబ్బులిచ్చి టిక్కెట్లుకొని దర్శించు కొనే చెడ్డవిధానం మారాలి. మన మతాన్నీ మన సాంప్రదాయాన్నీ ఇతరులు ఎగతాళి చేస్తుంటే భరించ గలమా!

శివునికీ విష్ణువుకీ అయ్యప్ప పుట్టాడంటే నముతున్నాం.

నల్లబట్టలు వేసుకొని తిరుగుతున్నాం

అయ్యయ్యో! ఎంతటి హాస్యాస్పదం ఇది !

హిందూమతానికి ఎంతటి దరిద్రం పట్టింది !

దేవుడా! రక్షించు హిందూమతాన్ని !

✦☆✦

మంత్రాలు సంస్కృత భాషలో ఎందుకు?

వేదాలు 'అపౌరుషేయాలు' అంటారు. అపౌరుషేయాలు అంటే ఏ పురుషుడూ వ్రాయనివి అని అర్థం. వేదాలను సంస్కృతంలో ఎందుకు వ్రాశారు! అంటే వేదాలు పుట్టినపుడు తెలుగుభాష పుట్టలేదు. అంతెందుకు వేయి సంవత్సరాలక్రితం అంటే పదకొండవ శతాబ్దం వరకు తెలుగు భాషకు వ్యాకరణమే పుట్టలేదు.

వేయి సంవత్సరాలక్రితం ఆంధ్రదేశంలో ప్రాకృతభాష మాట్లాడేవారు.

ఆంధ్రులు నాగజాతివారనే వాదం కూడా ఒకటుంది.

కర్ణాటకదేశంవాడైన నన్నయభట్టు మొట్టమొదటగా "ఆంధ్రశబ్దాను శాసనమ్" అనే వ్యాకరణం వ్రాసేవరకు తెలుగుభాషకు ఒక రూపం లేదు. అలాంటపుడు మంత్రాలు తెలుగులో ఎలా వుంటాయి? లక్షోప లక్షల సంవత్సరాల చరిత్ర మన వేదాలది! తెలుగులో వుండటానికెలా సాధ్యం?

> భారతీయ భాషలన్నిటికీ సంస్కృతమే మూలం. సంస్కృతం నుండే భారతీయ భాషలన్నీ పుట్టాయి. కానీ మనమిప్పుడు సంస్కృతభాషను మృతభాష (చచ్చి పోయిన భాష) అంటున్నాం. ఇంకొంత కాలానికి భారతీయ భాషలన్నీ మృత భాషలై పోయే రోజు రాబోతూ వుంది. ఇంగ్లీషు భాష భారతీయ భాషలను మింగి వేయబోతూ వుంది. అపుడు మన దేవాలయా లన్నీ 'చర్చి'లుగా మారినా ఆశ్చర్య పడనక్కరలేదు.

వేదానికి ఒక నాదం వుంది. వేదానికి ఒక స్వరం వుంది. వేదానికి ఒక ఛందస్సు వుంది. స్వరయుక్తంగా వేదం చదువుతూ వుంటే ఎంత మధురంగా వుంటుంది! ఎంత హాయిగా వుంటుంది!! ఎంతటి అనిర్వచనీయమైన ఆనందం కల్గుతుంది!!

పవిత్ర ఖురానుగ్రంథం అరబ్బిక్ భాషలో వుంది. ఆ భాషను ముస్లిం మతస్థులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. బౌద్ధమతం పాళీభాషలో వుంది. బౌద్ధులు పాళీభాషను దైవసమానంగా చూస్తారు. క్రైస్తవమత బోధకులు

మనదేశంలో బోధనలు చేసినా ఇంగ్లీషు భాషలోనే బోధనలు చేస్తారు. ఏ మతంవారు ఆ మత భాషను గౌరవిస్తారు. ప్రేమిస్తారు. పూజిస్తారు. మనం తప్ప!

కొంతమంది స్వప్రయోజకులు, మంత్రాలనే జీవనాధారంగా చేసుకొని, ఆచరణలు మాత్రమే మిగుల్చుకొన్న మూర్ఖులు, అగ్రవర్ణమని చెప్పుకొనే ఛాందసులు, వేదాలకూ, వేదమంత్రాలకూ తీరని ఆరని అపచారం అపకారం చేశారు! చేస్తున్నారు! వేదాలు ఎవరికీ తెలియకుండా చేశారు. ఎవరూ చదవకుండా చేశారు. వేదం అంటే పెళ్ళిళ్ళకూ, శ్రాద్ధాలకూ, పూజలకూ చదివే శ్లోకాలు కాదు. మానవునికి దిశానిర్దేశం చేసేది వేదం! వేదం ఒక కులానికి, ఒక మతానికి, ఒక భాషకు చెందినది కాదు. శూద్రులు వేదం చదవకూడదని ఏ వేదమూ చెప్పలేదు. బ్రాహ్మణులు ఈ విషయంలో మానవాళికి అన్యాయమే చేశారు.

✦☆✦

భోజనానికి ముందు కాళ్ళు ఎందుకు కడుక్కోవాలి?

"అన్నం పరబ్రహ్మస్వరూపం" అని ఆర్యవాక్యం.

మనిషి మాటలు నేర్చి, వివేకం తెలిసి, వికసించి విజ్ఞానవంతుడైన తరువాత ఆహారానికి వున్న విలువను గుర్తించాడు. మానవుని ప్రాథమిక అవసరాలన్నిటిలోకి ఆహారమే ముఖ్యమైనదని తెల్సిన తరువాత సహజంగానే భక్తిభావం పెరిగింది.

"ఆహార ఉపాహారాల యిష్టత లేనివానికి సుఖాపేక్ష వుండదు. సుఖాపేక్ష లేనివానికి సంతుష్టత వుండదు. ఆహారాన్ని సక్రమంగా తీసికొననివానికి ఏ కోరికలు వుండవు" అని చెబుతుంది 'భగవద్గీత'.

పూర్వకాలంలో భోజనశాలను ప్రతినిత్యం ఆవుపేడతో అలికి సున్నంతో నాలుగువైపులా గీతలు (ముగ్గులు) వేసేవారు. దీనివలన సూక్ష్మక్రిములు భోజన

శాలలోనికి ప్రవేశించేవి కావు. మనుషులకు హానిచేసే సూక్ష్మక్రిములను చంపే శక్తి (పెన్సిలిన్) ఆవుపేడలోనూ, ఆవు మూత్రంలోనూ వుంది భోజనం చేసిన తరువాత క్రిందపడిన ఆహారపదార్థాలను తీసివేసి మరలా నీటితో అలికి శుభ్రపరిచేవారు. చీమలు మొదలైన కీటకాలు రాకుండా వుండేవి.

మనకు శక్తిని ప్రసాదించి, మన ప్రాణాలను కాపాడి, మనలను చైతన్య వంతులను చేసి నడిపించే ఆహారాన్ని దైవసమంగా భావించి గౌరవించి పూజించటంలో తప్పులేదుగదా!

> మనం బయట ఎక్కడెక్కడో తిరుగుతాం. తెలియకుండా అశుద్ధ పదార్థాలను త్రొక్కుతాం. అదే కాళ్ళతో భోజనశాలలోనికి రావటం వల్ల కుటుంబంలోని అందరి ఆరోగ్యాలకూ హాని జరుగుతుంది కదా! ముఖ్యంగా పసిబిడ్డలకు మరింత హానిదాయకం గదా!

చేతులు కడుక్కోకపోతే నీ ఆరోగ్యం మాత్రమే చెడుతుంది. కాళ్ళు కడుక్కోకపోతే కుటుంబంలోని వారందరి ఆరోగ్యం చెడి పోతుంది. బయటనుండి ఇంటిలోనికి ప్రవేశించే ముందు తప్పనిసరిగా కాళ్ళు కడుక్కోవటం కూడా మన ఆచారాల్లో ఒకటి. ఎవరైనా బంధువులు ఇంటికి వచ్చి నపుడు ముందుగా కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళు (పాద్యం) ఇస్తారు. తరువాత త్రాగ టానికి మంచినీరు (అర్ఘ్యం) ఇస్తారు. ఇది మన సత్సాంప్రదాయం.

ఇపుడు మనం ప్రశాంతంగా తీరికగా అన్నం తింటున్నామా! కాలిబూట్లతో, స్పూన్లతో అన్నం తింటున్నాం. పరుగులు తీస్తున్నాం. "బిజీ! బిజీ!! బిజీ!" అనవసరమైన అవసరాలకోసం అర్థంలేని జీవితం గడుపుతున్నాం. కాళ్ళు కడుక్కోవటం విషయం అటుంచి చేతులు కూడా కడుక్కోలేని బిజీ అయి పోతున్నాం. ఇక ఆహారాన్ని గౌరవించే ఓపికా తీరికా ఎవరికుంది?

✦☆✦

శకునాలు చూడటం మంచిదా?

మనిషికి జరుగబోయే శుభాశుభాలను దేవుడు ముందుగానే తెలియ పరుస్తుంటాడని హిందువుల విశ్వాసం. అందువల్లనే చాలామంది శకునాలు చూస్తుంటారు. రాహుకాలం చూచుకొని పనులు ప్రారంభిస్తుంటారు.

అయితే;

నక్షత్రం రాహుకాలం చూచుకొని మనం జన్మించం! ముహూర్తం చూచుకొని మరణించం! మనిషికి ఆత్మబలం సన్నగిల్లినపుడే ఇవన్నీ దగ్గర చేరతాయి. అంతే తప్ప శకునాలు చూడటం మంచిదికాదు.

మన బస్సులు, రైళ్ళు, విమానాలు శకునాలు చూచుకొని బయలుదేరవు.

విధిమీద నమ్మకంలేనివాళ్ళే శకునాలు చూస్తారు.

దేవుని గుడ్డిగా నమ్మిన వాళ్ళే మూఢాచారాలు పాటిస్తారు.

మనిషి తనలోని లోపాలను కప్పిపుచ్చుకోవటానికి, తన తప్పులను దాచుకోవటానికీ శకునాలను అడ్డుపెట్టుకోజూస్తున్నాడు. అంతే! అంతకుమించి మరేమీలేదు.

మనం కర్మసిద్ధాంతాన్ని నమ్మినంత తేలిగ్గా కృషి సిద్ధాంతాన్ని నమ్మం!

పూర్వ ఋషులు ఎవరూ శకునశాస్త్రాలు వ్రాయలేదు. మనలను సదా నడిపించే శక్తి ఒకటి వుందని నమ్మినపుడు, తల్లిగర్భంలో వున్నపుడే మన తలవ్రాత వ్రాయబడిందని అనుకొంటున్నపుడు ఈ శకునాలతోనూ దుర్ముహూర్తాలతోనూ పనేముంది! జయాపజయాలు సుఖదుఃఖాలు మనుషులకు సహజమే కదా! దేవుడైనా, దెయ్యమైనా నమ్మ గల్గినవారికే!

> చిత్తశుద్ధి, సంకల్పబలం, ఆత్మవిశ్వాసం వున్నవారిని ఏ శకునాలు ఏమీ చేయవు. దుర్ముహూర్తాలు, రాహుకాలాలు ఏమీ చేయలేవు. ఆత్మబలంతో అన్నిటినీ ఛేదించవచ్చు.

ప్రశాంతంగా కూర్చుని పంచాగాలు చూచుకొనే రోజులు పోయాయి. ప్రతిపనిలోనూ పోటీతత్వం వచ్చేసింది. గెలవగల్గిన గుర్రానికే గుగ్గిళ్ళు పెడుతున్నారందరూ. ఇది లోకం విషయంలోనే కాదు. కుటుంబంలో కూడా ఇప్పుడిలాగే వుంది. ఇంట్లో ఎవరిమాట చెల్లుబాటు అవుతుంటుందో కుటుంబ సభ్యులందరూ వారికే వంతపాడుతుండటం మనం చూస్తూనేవున్నాం కాలంకన్నా ముందుగా పరుగులు తీస్తున్న ఈ రోజుల్లో శకునాలు చూచేవారి సంఖ్య తగ్గిపోయింది. ఇపుడు డబ్బును చూస్తున్నారేగాని శకునాలు కాదు. లాభాలు చూచుకొంటున్నారేగాని రాహుకాలాలు చూడటం లేదెవ్వరూ.

కాలం మారుతూవుంది.

మనమూ మారకపోతే ఎగతాళి చేస్తారు అందరూ!

"కాలాయ తస్మై నమః"

✦☆✦

స్నానం చేయకుండా పూజ చేయకూడదా?

శరీర మాలిన్యాలను తొలగించేది స్నానం. స్నానమనేది శుచి శుభ్రతల సంకేతమే గాని పవిత్ర కార్యం కాదు. పూజ చేయటానికీ స్నానం చేయటానికీ సంబంధం లేదు. కాని; స్నానం చేసిన తరువాతనే పూజ చేయటంలో ఒక అంతరార్థం వుందని చెప్పవచ్చు! మామూలు స్నానం కానీ, శిరస్నానంకానీ, అభ్యంగన స్నానంకానీ చేసినతరువాత శరీర మాలిన్యాలన్నీ తొలగింపబడి మనసు ప్రశాంతంగా వుంటుంది.

"ఆత్మశుద్ధిలేని ఆచారమదియేల
భాండశుద్ధిలేని పాకమేల
చిత్తశుద్ధిలేని శివపూజలేలరా" అన్నాడు యోగి వేమన.

దేవుడు కానుకలకు. దొంగపూజలకు లొంగడు.

ఒకవేళ లొంగితే వాడు దేవుడే కాదు

అటువంటి దేవుణ్ని పూజించనక్కర్లేదు కూడ!

వైదికమతం భారతదేశంలో పుట్టి మూడు వేల సంవత్సరాలకుపైగా అయింది. పండితులైన వైదిక గురువులు హిందువులను, కోతులను ఆడించినట్లుగా ఆడించారు. చిత్రవిచిత్ర ఆచారాలను పుట్టించి హైందవ మతాన్ని నాశనంవైపుగా నడిపించారు. వృత్తి ప్రాదిపదికగా ఏర్పడ్డ వర్ణాశ్రమధర్మం క్రమ క్రమంగా వెర్రితలలు వేసింది. ఫలితంగా కులాలు పుట్టాయి. మనకు కులాలు పుట్టి దాదాపుగా రెండున్నరవేల సంవత్సరాలు అయింది. హిందూమతంలో ఎపుడైతే కులవ్యవస్థ వచ్చిందో అప్పుడే మతపతనం ప్రారంభం అయింది. హిందువుల ఐక్యత పోయింది. అన్నదమ్ములుగా జీవించవల్సిన హిందువు లందరూ కులాల చిచ్చుతో కొట్టుకోవటం మొదలయింది. హిందువులు మూడు వేల కులాలుగా విడిపోయారు. అర్థం పర్థంలేని ఆచారాలు పుట్టాయి. వేలకువేలుగా దేవుళ్ళు సృష్టింపబడ్డారు.

> దైవపూజకు కావల్సింది
> అలంకరించుకొన్న దేహం
> కాదు! అంకితభావంగల
> మనస్సు కావాలి.
> పరమాత్ముని పూజకు
> ముఖ్యమైంది మనస్సు.
> దేవుడు
> ఆడంబర పూజలను
> అంగీకరించడు.
> భగవద్గీతలో
> గీతాచార్యుడు కూడా ఇదే
> విషయం చెబుతాడు.
> దేవుడ్ని
> హృదయ కమలంతో
> పూజించాలేగాని,
> డాబుదర్పాలతోనూ,
> ధూపదీపాలతోనూ,
> నేతిప్రసాదాలతోనూ కాదు.

వేదాలను, వేదసంప్రదాయాలను
మరచిపోయాం.

చిల్లర దేవుళ్ళకు పూజచేస్తున్నాం.

పిచ్చిపిచ్చి ఆచారాలను పాటిస్తున్నాం.

ఎప్పుడైనా విచారవంతమైన ఆచారమే సదాచారం.

✦☆✦

పండుగలు ఎందుకు?

మన పండుగలన్నీ గ్రామీణ కర్షక కార్మికులకోసం సృష్టింపబడ్డాయి. సంవత్సరాంతం పంట పొలాల్లోనూ పశుపోషణతోనూ సతమతమౌతూ శారీరకంగా నలిగిపోయే కర్షకవర్గం కోసమే ముఖ్యంగా ఈ పండుగలను నిర్దేశించారు మన పూర్వీకులు.

వడ్రంగి - కమ్మరి - కుమ్మరి - సాలె - మొదలైన వారందరికీ అమావాస్య పున్నమి దినాలు శలవుదినాలుగా వుండేవి. అన్నదాతలై పంటలు పండించే కర్షకులకు ప్రత్యేకంగా శలవుదినాలు వుండేవికాదు. ఆనందంగా గడిపే తీరిక వుండేది కాదు. కాబట్టే కర్షకవర్గాన్ని దృష్టిలో వుంచుకొని పొలాలలో పని వుండని సమయంలో పండుగలు వచ్చేటట్లుగా చేశారు. ఈనాడు మనం చూస్తున్నట్లుగా కాలువలు వుండేవికాదు. కాలువల ద్వారా నీరు నడిపించుకొని వ్యవసాయం చేయటం ఆనాటివారికి తెలియదు. కేవలం వర్షాధారంగానే పంటలు పండించుకొనేవారు. ఆరేడువందల సంవత్సరాల నుండే మనకు కాలువల ద్వారా నీరు నడిపించి వ్యవసాయం చేయటం మొదలైంది. అంతకు ముందు భావులు తీసి ఏతంవేసి వ్యవసాయం చేసే పద్ధతి వుండేది. చెరువులలో నీటిని నిల్వచేసి వ్యవసాయం చేసే పద్ధతి కూడా వుండేది.

ముఖ్యమైన పండుగలు వ్యవసాయ క్షేత్రాల్లో పనివుండే కాలాల్లో రావు. సంక్రాంతి మనకు ముఖ్యమైన పండుగ. ఒకరకంగా ఈ పండుగ వ్యవసాయ దారుల పండుగ. రైతుల యింటినిండా ధాన్యలక్ష్మి కళకళలాడుతూ వుండేది యిపుడే! పశువులు మేతమేసి చక్కగా పాలను యిచ్చేది కూడా యిపుడే. మనమిపుడు ధనం అంటే కరెన్సీకట్టలే' అనుకొంటున్నాం. 17వ శతాబ్దంనుండి మాత్రమే రూపాయి నాణేలు ప్రారంభమయ్యాయి. అంతకుముందు వస్తుమార్పిడి పద్ధతివుండేది. వస్తుమార్పిడి పద్ధతి అంటే మనదగ్గర వున్న ధాన్యాన్ని ఇచ్చి, మనకు కావల్సిన ధాన్యాన్నిగానీ వస్తువులను గానీ తీసుకోవటాన్ని వస్తుమార్పిడి పద్ధతి అంటారు.

1757లో భారతదేశంలో నాణేలు వచ్చాయి. మెల్లమెల్లగా వస్తుమార్పిడి విధానం ఆగిపోయింది. 1862లో మనదేశంలో కాగితపు కరెన్సీ ప్రారంభం అయింది.

మన పండుగలన్నింటిలోకి సంక్రాంతికి ఒక ప్రత్యేకత వుంది. ఈ పండుగ తెలుగువారి పండుగ. రైతుబాంధవులందరూ పేదసాదలకు తప్పకుండా విరివిగా ధాన్యాన్ని దానాలు చేసేవారు. ఎంత చిన్న రైతు అయినా కనీసంగా రెండు బస్తాల ధాన్యం దానం చేయటం స్వానుభవంగా నాకు తెల్సు. అఆలు దిద్దించే అయ్యవారి దగ్గరనుండి మంగలి, చాకలి, వడ్రంగి, కమ్మరి, మాదిగ, దాసరి మొదలైన వారికందరికీ సంవత్సర జీతంగా ధాన్యాలు ఇచ్చేవారు. ఎంత నిరుపేద అయినా ఈ పండుగకు క్రొత్తబట్టలు వేసుకొని పరమాన్నాలు తినేవారు. అందరి కళ్ళలోనూ ఆనందం పొంగువారేది ఈ పండుగకే!

నెలరోజులు జరుపుకొనే పండుగ యిది.

హరిదాసుల సంకీర్తనలతో, రకరకాల రంగురంగుల రంగవల్లికలతో, గంగిరెద్దుల వూరేగింపులతో, నోరూరించే పిండివంటలతో, పడుచుపిల్లల గొబ్బెమ్మల పాటలతో హాయినిచ్చే పండుగ ఈ సంక్రాంతి.

అలాగే 'విజయదశమి' కూడ.

తొమ్మిది రోజులు జరిగే విజయదశమి వుత్సవం శక్తి సంకేతం. ధనం మాత్రమే మనిషికి సుఖాన్ని ఇవ్వలేదు; విద్య వుండాలి! విద్యమాత్రమే మనిషిని రక్షించలేదు; శక్తి వుండాలి! శక్తిలేని విద్య, సంపదలు వ్యర్థంగదా! అందుకే **"తిండిగలిగితె కండ కలదోయ్, కండగలవాడేను మనిషోయ్"** అని గురజాడ వారు అన్నారు. శారీరక బలంవుంటేనే సుఖాలను అనుభవించగలం. సుఖాలను అనుభవించలేనపుడు ధనం వుండి ప్రయోజన మేముంటుంది. తొమ్మిదిరోజులు జరిగే ఈ దేవీ నవరాత్రులలో మనిషికి విజ్ఞానంతో పాటు వినోదాన్ని పంచి ఇచ్చే పురాణాలు, హరికథలు, నాటకాలు, బొమ్మలాటలు ఎన్నెన్నో వుంటాయి.

ఇదే విధంగానే అన్ని పండుగలు కూడ!

జీవితంలో కష్టాలు, సుఖాలు సహజమని చెబుతూ వేపపువ్వులో బెల్లంవేసి తినే ఉగాది పండుగ! హిందువులందరూ ఐక్యంగా వుండాలని హిందూమతస్థులందరూ (శైవులు - వైష్ణవులు) కలసి చేసుకొనే గణపతి పండుగ! క్రొత్తక్రొత్త వర్షాలకు పుట్టివచ్చే క్రిమికీటకాలను గంధకం పొగలతో నాశనం చేసే దీపావళి పండుగ! దేవునిపేర జరిగే తిరునాళ్ళు! జాతరలు! అన్నీ మనిషికి మనోల్లాసం కల్గించేవే.

మనం ఇపుడు మన పండుగలను మరచిపోతున్నాం. జనవరి ఒకటవ తారీకును క్రొత్త సంవత్సరంగా ఆచరిస్తూ రాత్రి అంతా మేల్కొంటున్నాం. "వాలంటైన్స్‌డే" (ప్రేమికులరోజు) వంటి వికారపు పండుగలు చేసుకొంటున్నాం. పాశ్చాత్య ప్రభావానికి తలలు వంచుతున్నాం. మన పండుగలను 'దండుగ'లనుకొని భారతీయ నాగరికతను కించపరుస్తున్నాం. తృణీకరిస్తున్నాం.

హోటళ్ళు వచ్చిన తరువాత ప్రతి రోజూ మనకు విందు భోజనమే! సినిమాలు, టి.వి.లు వచ్చిన తర్వాత ప్రతిగంటా వినోద కాల క్షేపమే! ఆలనాటి వారికి ఈనాటి సుఖాలు లేవు కాబట్టి పండుగలు, పర్వ దినాలు వుండేవి. పండుగ సమయాలలోనే ఆత్మీయులతో, బంధు వర్గాలతో, కన్నబిడ్డలతో, కాలం గడిపే వారందరికీ పండుగలు కావాలంటే కావాలి! తప్పక కావాలి!

ఆనాటి మన పూర్వీకులకు సండే హాలిడేలు లేవు! సినిమాలు లేవు! టి.వి.లు తెలియవు! పండుగ దినాలే వాళ్ళకు శలవు రోజులు పండుగ వినోదాలే వాళ్ళకు కాలక్షేపాలు. పండుగరోజుల్లోనే వాళ్ళకు పప్పు భోజనాలు, క్రొత్త బట్టలు! ఆనాటి జనం పండుగ కోసం ఎదురుచూచే వాళ్ళు రోజులు లెక్కించుకొంటూ నిద్ర పోయేవాళ్ళు!

✦☆✦

మాతాపితృకర్మలు తప్పనిసరిగా చేయాలా?

"మాతృదేవో భవ !
పితృదేవోభవ !
ఆచార్యదేవోభవ !
అతిథిదేవో భవ !" - అని చెబుతున్నది ఆర్యవాణి

జన్మనిచ్చి, పోషించి, పెంచి, తప్పటడుగులు దగ్గరనుండి తప్పు అడుగుల వరకు సరిదిద్ది, పెద్దజేసి, విద్యాబుద్ధులు నేర్పించి, మనల్ని మనుషులుగా సమాజంలో నిలబెట్టిన తల్లిదండ్రులు మరణించిన తరువాత శ్రాద్ధ కర్మలు తప్పనిసరిగా చేయాలా అంటే ఏం చెప్పాలి?

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య వర్ణాలవారు ప్రతి సంవత్సరమూ తిథుల ప్రకారం సంవత్సరీకాలు పెడుతుంటారు. శూద్ర వర్ణం వారందరూ ఎక్కువగా సంక్రాంతికి పెద్దలను స్మరించుకొని బట్టలు పెడుతుంటారు. పెద్దల పేరుమీద దానధర్మాలు చేస్తుంటారు. ఇది మన సంప్రదాయం. సంక్రాంతికే పెద్దలను స్మరించుకొని పూజించుకోవటమెందుకంటే, సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించేది పుష్య మాసంలో కాబట్టి! ఉత్తరాయణ పుణ్యకాలం కూడా ఇపుడే ప్రారంభమౌతుంది గనుక ఇపుడే స్వర్గద్వారాలు తెరుస్తారనీ, ఈ పుణ్యకాలంలో మరణించినవారికి స్వర్గప్రాప్తి కల్గుతుందని, హిందువుల విశ్వాసం. స్వర్గ ద్వారాలు తెరిచే సమయం లోనే సంక్రాంతి వస్తుంది కాబట్టి భోగినాడు పితృదేవతలను పూజించే సంప్రదాయం వచ్చింది.

అసలు పుత్రుడు అంటే అర్థం ఏమిటో తెలుసా!

"పున్నామ నరకాత్‌త్రాయతే ఇతి పుత్రః" పున్నామనరకం నుండి రక్షించు వాడు పుత్రుడు అని అర్థం. పున్నామ నరకంనుండి రక్షింపబడితేనే స్వర్గం లభిస్తుంది.

తల్లిదండ్రులు సంపాదించుకొన్న ఆస్థిపాస్తుల్లో భాగం కావాలి. పుణ్య కార్యాల్లో భాగంవద్దా? తండ్రుల ఆస్తులకోసం కోర్టుకెక్కిన కొడుకు లెందరో వున్నారు. కొడుకు అన్నం పెట్టటంలేదని కోర్టుకెక్కిన తండ్రిని ఎక్కడైనా చూచారా!

చాలామంది కొడుకు కావాలని ఎందుకు కోరుకొంటారో తెల్సా! ఆడపిల్ల అయితే పెండ్లికాగానే ఇల్లు విడిచి పరాయి చోటికి వెళ్ళిపోతుంది; కొడుకు అయితే మనదగ్గర వుంటాడు; ముసలితనంలో ఆదరిస్తాడు; మన వంశం పేరు (ఇంటిపేరు) నిలుపుతాడు. చచ్చిన తరువాత కర్మకాండల పుణ్యకార్యం చేస్తాడు అని ఆశపడతారందరూ.

"తల్లిదండ్రులమీద దయలేని పుత్రుండు

పుట్టనేమివాడు గిట్టనేమి" – అన్నాడు వేమన

మనకు జన్మనిచ్చినవారిని సంవత్సరానికొకసారైనా తలచుకోవటం కొడుకుల బాధ్యత కాదా! అలా తలచుకోవటం పుణ్యప్రదం కాదా!

✦☆✦

శవాన్ని పూడ్చటం మంచిదా! కాల్చటం మంచిదా?

ఆర్యులు శవాన్ని కాలుస్తారు. వీరందరూ వైష్ణవ మతస్థులు! ద్రావిడులు శవాన్ని భూస్థాపితం చేస్తారు. వీరందరూ శైవమతస్థులు! అయితే శైవులకు వైష్ణవులకు స్మశానం మాత్రం ఒకటే.

క్రైస్తవ మతస్థులు కూడా భూస్థాపితం చేస్తారు.

ముస్లిం మతస్థులు కూడా భూస్థాపితం చేస్తారు.

శవదహనం ఖర్చుతో కూడుకొన్నది. శ్రీమంతులకు మాత్రమే ఇది చెల్లుబాటు. భూస్థాపితానికి అంతగా ఖర్చుకాదు. కాని స్థలం సమస్య వుంటుంది. అందరూ ఇటుకలతో సమాధులు కడితే సమస్యే గదా మరి! ఇటుకలతో సమాధి నిర్మించకపోయినా జ్ఞాపకంగా గుర్తుకోసం ఒక రాయిని పాతి వేస్తుంటారు. సంవత్సరానికొకసారి వెళ్ళి పూజచేసి వస్తుంటారు. దహనం చేసినవారు దహనానంతరం అస్థికలను భద్రం చేసి పవిత్రనదుల్లో కలుపుతారు. ఈ విధంగా చేయటంవల్ల మరణించిన వారికి సద్గతులు లభిస్తాయని విశ్వాసం. నదీ నిమజ్జనాన్ని వేదధర్మం అంగీకరించదు.

వైష్ణవులు ఎందుకు శవదహనం చేస్తారంటే -

ఈ శరీరం పాంచభౌతికమైనది. **"పృథివి అప్ తేజోవాయు రాకాశ నిర్మితం యత్తత్ పాంచభౌతికం"** భూమి - నీరు - అగ్ని - గాలి - ఆకాశమనే ఐదింటితో ఈ శరీరం నిర్మితమౌతుంది. అని వైష్ణవుల నమ్మకం. కాబట్టి మరణించిన తరువాత అగ్నిసంస్కారం చేస్తే భూమి భూమిలో, అగ్ని అగ్నిలో, గాలి గాలిలో కలిసిపోయి జీవునికి ముక్తి లభిస్తుందని వైష్ణవుల విశ్వాసం. దాదాపుగా ఆర్యులలో వైష్ణవులే·చాలామంది!

శైవులందరూ భూస్థాపితం ఎందుకు చేస్తారంటే - పుట్టటమనేది ఏది వున్నా అది భూమి నుండే పుడుతుంది. శూన్యం నుండి కాదు. ఆహారం భూమినుండే లభిస్తుంది. ఆహారపోషణవల్లనే శరీరం నిలబడుతుంది. ఆహార పోషణవల్లనే శుక్రశోణితాల వుత్పత్తి జరుగుతూవుంది. శుక్ర - శోణితాల కలయికవల్లనే శిశువు జన్మిస్తుంది. భూమియే మనకు అన్నిటినీ ఇస్తున్నది గాబట్టి, మనిషి మరణించిన తరువాత భూస్థాపితం చేయటం ధర్మసమ్మత మంటారు శైవమతస్థులు! దాదాపుగా వీరందరూ ద్రావిడులు. వేల సంవత్సరాల క్రితం ఆర్యులకు ద్రావిడులకు యుద్ధాలు జరుగుతూ వుండేవి. వారికి వీరికి వింధ్యపర్వతమే సరిహద్దుగా వుండేది.

కాల్చటం మంచిదా! పూడ్చటం మంచిదా! అంటే ఏం చెప్పాలి. ఎవరి విశ్వాసం వారిది. ఎవరి ఆచారం వారిది. తరతరాల సంప్రదాయాలను మార్చటమంటే మాటలు కాదు. అయితే ఒక్క విషయం గుర్తించితే మంచిది. దీర్ఘ రోగాలతో (ఎయిడ్స్ మొదలైనవాటితో) మరణించిన వారిని దహనం చేయటమే మంచిది అంటున్నారు చాలామంది వైద్యనిపుణులు.

✦☆✦

వరదక్షిణ-కన్యాశుల్కం ఈ రెండు అవసరమా?

వాడుకగా ప్రారంభమైంది కన్యాశుల్కం ।

వేడుకగా ప్రారంభమైంది వరదక్షిణ !

రామాయణ కాలంనుండి ఈ వరకానుకలు వున్నట్లుగా తెలుస్తోంది

శ్రీమంతులు పూర్వకాలంనాడు కన్నకూతురిమీద మమకారంతో దాస దాసీలను, గోగణాలను, ధనరాశులను అల్లునికి కానుకగా ఇచ్చేవారని తెలుస్తూ వుంది. కాని పేదవారు కన్యాశుల్కం తీసికొని తమ ఆడబిడ్డల్ని ఎంత వయ సున్నవారికైనా కన్యాదానం చేసేవారట. ఇపుడుకూడా కొన్ని ఆటవిక జాతుల్లోను, బంజారి జాతుల్లోను, (స్థిరనివాసం లేకుండా వూళ్ళు తిరుగుతూ వృత్తులు చేసుకొనే వారిని బంజారీలు అంటారు) మరికొన్ని ఆదిమజాతుల్లోను ఈ కన్యాశుల్క పద్ధతి సజీవంగా వుంది.

> గమనించదగిన ముఖ్య విషయం ఏమిటంటే, విద్యావంతులే ఈ వరదక్షిణభూతాన్ని పెంచి పోషి స్తున్నారు. విద్యావంతులైన యువకులే వర దక్షిణకు ఆశ పడుతున్నారు. అమ్మాయిల తల్లి దండ్రులు కూడా ఎంత ఎక్కువ కట్నమిచ్చి పెళ్ళి చేస్తే అంత గొప్పగా భావిస్తున్నారు. ఈ స్థితిలో ఈ సమస్య పరిష్కార మయ్యేదెలా?

"అష్టవర్షా భవేత్ కన్యా" అన్న మనువాడి ప్రకారం కొన్ని సంవత్సరాల క్రితం ఎనిమిది సంవత్సరాల వయసుకే ఆడపిల్లలకు పెండ్లిళ్ళు జరిపించేవారు. పన్నెండు సంవత్సరాలకే సంసారానికి పంపేవారు. అందరూ ఈ విధంగా చేసే వారనికాదు; కొన్ని పేద జాతుల వారిలోనే ఎక్కువగా ఆడపిల్లలు అన్యాయానికి గురయ్యేవారని చెప్పక తప్పదు. ఇటు వంటి వివాహాలకే ఎక్కువగా కన్యాశుల్కం వుండేది. ఎవరు ఎక్కువ వరహాలనిస్తే (వరహా అంటే నాలుగు రూపాయలు) వారికి పిల్లనిచ్చి పెండ్లి చేసేవారు. వరుని వయస్సునీ, యోగ్యతను చూచేవారు కాదు. కన్యాశుల్కమే ముఖ్యం.

శ్రీమంతుల్లో వరదక్షిణ, పేదవర్గాల్లో కన్యాశుల్కం, రెండూ వుండేవి.

అగ్రవర్ణాలలోనే వరదక్షిణ అధికంగా వుండేది.

రానురాను కన్యాశుల్కం పోయింది. అన్ని కులాలవారికీ వరదక్షిణ భూతం పట్టుకొంది. కన్యాశుల్కమైనా వరదక్షిణ అయినా స్త్రీలపాలిట శాపమే. ఈ శాపానికి విముక్తి ఎప్పుడో యువతరమే చెప్పాలి.

ఈ సమస్యను దేవుడు కూడా పరిష్కరించలేడు.

కాబట్టి

మనుషులే మారాలి. మనసులే మారాలి.

అప్పటివరకు యింతే !

ఇంతే !!

✦☆✦

మన వివాహ వ్యవస్థ ఎప్పుడు ప్రారంభమైంది?

చరిత్ర చెబుతున్న విధంగా -

ఎనిమిదివేల సంవత్సరాలక్రితం వివాహపద్ధతి మొదలైంది

ఐదువేల సంవత్సరాలనుండి స్థిరీకరింపబడింది.

మానవజాతి పురోభివృద్ధికీ, ఆరోగ్యవంతమైన జాతి నిర్మాణానికీ, సమైక్యతా భావనకూ, మహోదాత్తమైన అనుబంధాలకూ వివాహ వ్యవస్థను కల్పించారు పూర్వీకులు! ఎంతో దూరదృష్టితో ఎంతో సదాలోచనతో ఈ వివాహ సంప్రదాయం మొదలైందని చెప్పాలి.

త్రేతాయుగంనుండే వివాహ వ్యవస్థ వుందని పురాణాలు చెబుతున్నాయి.

ఏదిఏమైనా -

చిన్నచిన్న పురుగులు మొదలుకొని పక్షులు పశువులకేగాక ప్రతి ప్రాణికీ కామసుఖం కావల్సిందే ! ఎవరికైనా కామాన్ని జయించటం తేలికకాదు.

జితేంద్రియులైన మహర్షులు సైతం ఒక్కొకసారి కామానికి లొంగిపోయిన సంఘటనలు పురాణాల్లో వున్నాయి.

వివాహం ఒక సాంఘిక సంప్రదాయం !

వివాహం ఒక సామాజిక సదాచారం !

మనుషులకు వివాహవ్యవస్థ అనేది సృష్టింపబడకుంటే పశువులకూ మనిషికీ తేడా వుండేది కాదు. బంధాలు అనుబంధాలు వుండేవికాదు లైంగిక రోగాలతో మానవజాతి మట్టిలో కల్సివుండేది. వివాహవ్యవస్థవల్లనే మనమింతటి పురోభివృద్ధిని సాధించగలిగాం.

ప్రాణులన్నిటిలోకి మానవునికి ఒక ప్రత్యేకత వుంది. పశుపక్ష్యాదులు ఒక నిర్ణీత సమయంలో, గర్భధారణ సమయంలో మాత్రమే లైంగిక సంపర్కానికి అంగీకరించి ఆడమగ కలుస్తాయి. కాని మానవప్రాణి అలాకాదు. మనిషి తన జీవితకాలంలో సగటు రెండువేలసార్లకు పైగా రతిక్రియల్లో పాల్గొంటాడని అంచనావుంది. (ఈ లెక్క ఆరోగ్యవంతుడైన మనిషికి మాత్రమే).

ఒక స్త్రీకి ఒక పురుషుడు, ఒక పురుషునికి ఒక స్త్రీ, అన్న నిబంధనతోనే వివాహ పద్ధతిని ప్రారంభించారు పూర్వీకులు. స్త్రీ పురుషుల లైంగిక సంపర్కమే లేకుంటే సృష్టి నిలిచిపోతుంది. అలాగని విచ్చలవిడితనం మంచిదికాదు. విచ్చలవిడితనంవల్ల అనేక సుఖరోగాలతో జాతికిజాతే నాశనం అయ్యే ప్రమాదం వుంది.

కాబట్టి;

స్త్రీ పురుషులకు వైవాహిక జీవితం తప్పనిసరి. మన దేవుళ్ళందరికీ భార్యలను సృష్టించుకొని పూజించే విధానం కూడా వైవాహిక బంధం గొప్పదని చెప్పటానికే!

ఋషి సాంప్రదాయంనుండే ఈ వివాహ వ్యవస్థ ప్రారంభమైంది.

✦☆✦

క్రొత్త దంపతులు ఆషాడమాసాన్ని పాటించాలా?

చైత్ర వైశాఖాది పన్నెండు మాసాల్లో ఆషాఢాన్ని అశుభమాసంగా పరిగణించారు పూర్వీకులు. ఆషాఢం అనారోగ్య మాసం అని కూడా మనందరికీ తెల్సు. విపరీతమైన ఈదురుగాలులతో పుల్లచినుకులు పడే సమయం ఈ ఆషాఢమాసమే. కాలువలలోనూ, నదులలోనూ, ప్రవహించే నీరు పరిశుభ్రంగా వుండదు. చెరువులలోనికి వచ్చి చేరిన నీరు మలినంగా వుండి మనుషుల ఆరోగ్యాలకు హాని కల్గిస్తూ వుంటుంది.

వ్యవసాయ ప్రధానవృత్తిగా వున్న దేశం మనది. పొలం పనులన్నీ ఈ మాసంలోనే మొదలు పెడతారు రైతన్నలు. చైత్ర - వైశాఖ మాసాలలో వ్యవసాయపు పనులు వుండవు. కాబట్టే ఈ సమయంలోనే వివాహాది శుభముహూర్తాలు ఎక్కువగా వుంటాయి. ఆ రోజుల్లో క్రొత్తగా పెండ్లి అయిన యువకులు ఆరునెలలకాలం అత్తగారి ఇంటిలో వుండే సంప్రదాయం వుండేది. కష్టపడి వ్యవసాయపు పనులు చేయవల్సిన యువకులు అత్తవారింట్లో కూర్చొని వుంటే, సకాలంలో జరుగాల్సిన పనులు జరుగవు. వర్షాలకు తగినట్లుగా విత్తనాలు చల్లుకొనే రోజులు అవి. ఇప్పటిలాగ కాలువల ద్వారా నీరు లభించేది కాదు. సరైన సమయంలో విత్తనాలు చల్లకపోతే ఆ సంవత్సరమంతా దారిద్ర్యంతో బాధపడవల్సిందే గదా! అందుకే క్రొత్తకోడలు పుట్టింటిలోనే వుండాలి. అల్లుడు అత్తవారింటికి వెళ్ళకూడదు అనే నియమం విధించారు పెద్దలు. క్రొత్త పెళ్ళాం దగ్గరవుంటే పొలంపనులమీద ధ్యాస వుండదు. ఇంటిధ్యాసతో పనులు సరిగా చేయరని ఆషాఢమాస నియమం పెట్టారు.

అంతేకాకుండా

అనారోగ్యమాసం ఆషాఢం. క్రొత్తనీరు త్రాగటంవల్ల చలిజ్వరాలు, విరోచనాలు, తలనొప్పి మొదలైన రోగాలు వచ్చే సమయం. స్త్రీలు గర్భం ధరించటానికి మంచి సమయంకాదు. అనారోగ్య దినాలలోనూ, అశుభ సమయాలలోనూ గర్భధారణ జరిగితే ఉత్తమ సంతానం కలుగదనే నమ్మకం కూడా వుంది.

ఇన్ని కారణాలవల్ల ఆషాఢం నిషిద్ధం చేశారు పెద్దలు.

ఒకరకంగా వియోగం కూడా క్రొత్త దంపతులకు మంచిదే. గాఢమైన ప్రేమ వియోగంనుండే పుడుతుంది. ఎదురుచూపుల్లో వుండే తీయదనం ఏమిటో ఎదురుచూచినవారికే తెలుస్తుంది. రాత్రి పగలు కలలుకంటూ ఊహల్లో తేలిపోవటం కూడా మధురమే గదామరి!

ఎవరెన్ని ఆంక్షలు పెట్టినా దొంగచాటుగా, ఏదో రకంగా క్రొత్తపెళ్ళాన్ని కలుసుకొనే మగరాయుళ్ళు చాలామంది వున్నారు.

అదొక మధురానుభూతి !

✦☆✦

బిడ్డలందరూ సమానమే గదా! కొడుకును గొప్పగా చూస్తారేమిటి?

"యత్రనార్యస్తు పూజ్యంతే రమంతేతత్ర దేవతాః" అని మనుస్మృతి. ఇదే మనువు స్త్రీలకు స్వాతంత్ర్య మివ్వటానికి అంగీకరించలేదు. కారణమేమంటే ఆనాటి స్త్రీలు విద్యావంతులు కారు. కేవలం ఈ ఒక్క కారణంచేతనే స్త్రీ స్వాతంత్ర్యానికి అడ్డుగోడ కట్టాడు మనువు. అయితే స్త్రీలను గౌరవించాలనీ, ప్రేమించాలనీ, పూజించాలనీ చెప్పాడు.

ఇది వేల సంవత్సరాల నాటి ధర్మశాస్త్రం.

"ముదితల్ నేర్వగరాని విద్య గలదే ముద్దార నేర్పించినన్" అని అన్నది మహా కవయిత్రి మొల్ల. నిజంగానే యిపుడు విద్యావంతులైన యువతులు అన్ని రంగాలలోనూ మగవారికి దీటుగా పనిచేస్తుండటం హర్షణీయం.

అయితే ఇక్క గమనించవల్సినదేమంటే -

- ఆడది అబలకాదు సబల అని ఎన్ని ఉపన్యాసాలు చెప్పినా, ఎన్ని వ్యాసాలు వ్రాసినా స్త్రీలకు ఒరగబెట్టిందేమీ లేదు. స్త్రీ జీవితం ఎన్ని మలుపులు తిరిగినా చివరి దశకు అబలగానే మిగిలిపోతున్నది. స్త్రీల సమస్యల్లో చాలావాటికి

స్త్రీలే కారణమౌతున్నారు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో "స్త్రీకి స్త్రీయే శత్రువు" అనే నానుడి నిజమనిపిస్తున్నది.

"బిడ్డలందరూ సమానమే గదా! మరి కొడుకును మాత్రమే గొప్పగా చూస్తున్నారేమిటి' అనేది ఇపుడు మన ముందున్న ప్రశ్న!

నిష్ఠూరమైన నిజమొకటి మనం గమనించాల్సి వుంది. పశుపక్షుల్లోగానీ, మనుషుల్లోగాని స్త్రీ - పురుషుల సృష్టిలోనే చాలా భేదం వుంది. ఎద్దుకు వున్నంత బలం ఆవుకి వుండదు. మగవానికి వున్నంత శక్తి ఆడవానికి వుండదు. ఇది సృష్టిధర్మం అని అంగీకరించి తీరాల్సిందే మనం.

తల్లిదండ్రులు మగబిడ్డను ఆడబిడ్డను ఎందుకు తేడాగా చూస్తారు? మగబిడ్డకున్నంత స్వాతంత్ర్యం ఆడపిల్లకు ఎందుకివ్వరు? ఈ వివక్ష భారత దేశంలోనేకాదు అన్ని దేశాలలోనూ ఇప్పటికీ వుంది ముస్లిందేశాలలో (సౌదీ అరేబియా-కువైట్ - ఒమెన్ -నౌజీరియా మొ॥ దేశాలు) స్త్రీలకు ఈ నాటికీ ఓటువేసే హక్కులేదు. కృషి కార్మిక రంగాల్లో పురుషుని ఆదాయము రు.100-00 వుంటే ఆడవారిజీతం రు. 60-00 గా వుంటోంది. నేటికి గూడ జపాన్ - ఫ్రాన్స్ - నార్వే - పశ్చిమ జర్మనీ -బ్రిటన్ - పోర్చుగల్ మొదలైన దేశాలు కూడా ఇంతే. ఫ్రాన్స్ - ఇటలీ -జపాన్ - స్పెయిన్ మొదలైన దేశాల్లో స్త్రీలు గర్భవతులైవుంటే ఉద్యోగమునుండి తీసివేయటం జరుగుతూవుంది.

ఏమిటిది? ఎందుకిలా?

అభివృద్ధిచెందిన దేశాలే స్త్రీల విషయంలో వివక్ష చూపిస్తున్నాయి మరి పేద దేశాలలో స్త్రీల గతేంటి? ఈ శతాబ్దంలో కూడా ఈ వివక్ష న్యాయమా? బోర్డు తగిలించుకొన్న మహిళాసంఘాలు ఏం చేస్తున్నాయి? ఏం చూస్తున్నాయి?

తల్లిదండ్రులు తమ బిడ్డల్లో అబ్బాయికే అధికారమివ్వటానికి కారణమే మంటే - ఆడపిల్లకు వివాహం కాగానే భర్తవెంట అత్తవారింటికి వెళ్ళటం - విద్యావంతురాల్ని చేసి ఉద్యోగం ఇప్పించినా సంపాదన మాత్రం భర్తకు, లేదా భర్త తరుపువారికి అందించటం-కన్నతల్లిదండ్రుల్ని చూచే బాధ్యత

సాంఘికపరంగా ఆమెకు లేకపోవటం -ఇంటి ఆస్థిలో కట్నం రూపంలో కొంత తీసికెళ్ళటం - ఇరవై సంవత్సరాలు పెంచినా చివరకు చుట్టంలాగా మిగిలి పోవటం - తల్లిదండ్రుల కష్టాల్లో ఏ విధమైన భాగం పంచుకోలేక పోవటం - ఈ కారణాలన్నీ ఆడపిల్లను చిన్నచూపు చూశాయి. చిన్ననాటినుండే ఆడపిల్లను ఎవరికో చెందిన పరాయి పిల్లలాగ చూడటం చేస్తున్నారు కుటుంబ సభ్యులందరూ.

ఇపుడు కాలం మారిపోయింది.

ఈనాటి ఆడపిల్లలు చదువు సంధ్యలు లేని ఆనాటి వాళ్ళు కాదు.

అన్ని బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఉద్యోగాలు చేస్తూ వేలకువేల రూపాయలు ఆర్జిస్తున్నారు.

కొడుకుల బాధ్యతల్ని తాము నెత్తికెత్తుకొని 'శభాశ్' అనిపిస్తున్నారు.

కొడుకు గొప్పవాడా! కూతురు గొప్పదా! అన్నది చర్చనీయాంశం కాదు. పిల్లలు ఎవరైనా బుద్ధివంతులుగా పెరిగితేనే (పెంచితేనే) వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు ఆశ్రయం ఇవ్వగలుగుతారు. పాశ్చాత్యదేశాల మాదిరిగా ఈనాటి తల్లిదండ్రులు మారి పోతున్నారు. వార్ధక్య జీవితానికి ముందుగానే జాగ్రత్త పడుతున్నారు. కన్నబిడ్డల దయా దాక్షిణ్యంకోసం ఎదురుచూడటం లేదు. లైఫ్ ఇన్సూరెన్స్‌లు వచ్చిన తరువాత జీవన విధానంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రతి నగరంలోనూ వృద్ధాశ్రమాలు వెలుస్తున్నాయి. ఇపుడు విద్యావంతులెవరూ 'కొడుకే గొప్ప' అనుకోవటం లేదు.

> ఆడపిల్లలు ఇపుడు తల్లి దండ్రులకు భారం కాదు. కొన్ని కుటుంబాలలో మగపిల్లలే తల్లి దండ్రులకు భారంగా వుంటు న్నారు. అయితే చాలా ఇండ్లలో తల్లులే ఆడపిల్లల్ని కించ పరుస్తూ మగబిడ్డను నెత్తి కెక్కించుకొంటున్నారు. ఆడ వాళ్ళ అభివృద్ధి మార్గం వైపు నడవాలంటే ఆడవాళ్ళే సహ కరించాల్సి వుంది అన్నది నగ్న సత్యం.

పూర్వకాలం మాదిరిగా 'పుత్రుడంటే' పున్నామనరకం నుండి రక్షించేవాడు' అని

అనుకోవటం లేదు. కాలం మారింది. కాలంతోపాటుగా విలువలు కూడా మారుతున్నాయి.

అయితే; పాత వాసనలింకా పూర్తిగా పోలేదు. ఏ మార్పు అయినా ఒక్క సారిగా ఒక్కనాటితోనే జరుగదు. కాలక్రమేణా మార్పు సంభవిస్తుంది. యాభై ఏండ్లనాటి నమ్మకాలు, పద్ధతులు, ఆచారాలు ఇపుడున్నాయా! లేవు. గుడ్డి నమ్మకాలు ఒక్కొటొక్కటి పారిపోతున్నాయి. ఆలోచనలలో మార్పు వచ్చింది. వస్తూవుంది.

✦☆✦

'పెళ్ళినాటి ప్రమాణాలు' అంటే ఏమిటి?

వివాహ విషయంలో హిందూధర్మంలో ఒక ప్రత్యేకత వుంది. కేవలం శారీరిక సుఖాలకోసం, లైంగిక ఆనందంకోసం వివాహం చేసికొనటాన్ని హిందూధర్మం అంగీకరించదు. వివాహం అనేది జీవన సంస్కారంగా భావిస్తారు హిందువులు. సృష్టి కార్యంకోసం జరిగే పవిత్రకర్మగా కూడా భావిస్తారు.

అందుకే వధూవరులు ఇద్దరూ వివాహ సమయంలో ప్రమాణాలు చేస్తారు.

"ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ నాతిచరామి" అని వరుడు ప్రమాణం చేస్తాడు. అంటే 'ధర్మమునందుగానీ, సంపదల విషయమునందుగానీ, శారీరిక సుఖవిషయము లందుగానీ, దానధర్మములవల్ల లభించు మోక్షవిషయములందు గానీ నిన్ను విడచి నడువను.' అని వధువును పరిగ్రహించేముందు వరునిచేత ప్రమాణం చేయిస్తారు.

తరువాత మాంగల్యధారణ సమయంలో కూడ ప్రమాణంలాంటి మంత్రాన్నే ఈ విధంగా చెబుతాడు వరుడు. "మాంగల్య తంతునానేన మమజవన హేతునా కంఠే బధ్నామిసుభగే త్వం జీవశరదశ్శతం" అనే మంత్రానికి అర్థం ఏమిటంటే 'ఓ మాంగల్యమా! నా జీవనానికి కారణభూతురాలైన ఈ సౌభాగ్యవతి కంఠానికి నిన్ను అలంకరిస్తున్నాను. నీవు నూరు సంవత్సరాలు ఈమె కంఠము నందే వుండువుగాక" అని చెప్పి మాంగల్యాన్ని వధువు మెడలో మూడుముళ్ళ

వేసి కడతాడు. ఈ మూడే ముళ్ళు ఎందుకు వేయిస్తారంటే త్రిమాతలైన లక్ష్మీ, పార్వతీ, సరస్వతీ దేవతలకు అంకితంగా నన్నమాట!

సప్తపదిలో కూడా "ఏకం ఇషే విష్ణుత్వాం అన్వేతు" అనే మంత్రాలతో ఏడడుగులు వేయిస్తారు. మొదటి అడుగు శక్తికోసం-రెండవ అడుగు బలం కోసం-మూడవ అడుగు వ్రతం కోసం -నాల్గవ అడుగు ఆనందం కోసం ఐదవ అడుగు ఇంద్రియబలం కోసం-ఆరవ అడుగు రుతువుల కోసం ఏడవ అడుగు గృహధర్మాలకోసం. ఇద్దరూ కల్సి జీవితాంతం ఇలాగే కలసి నడుస్తామని అగ్నిసాక్షిగా ప్రమాణం చేస్తూ నడుస్తారు. ఈ సప్తపదితో వధువు యింటిపేరు మారిపోతుంది. వివాహానికి ఈ కార్యక్రమమే ముఖ్యమైనది.

(ఇపుడు చాలామంది 'సప్తపది' కార్యక్రమం జరిపించుటలేదు.)

ఈ పెళ్ళినాటి ప్రమాణాలను పురుషుడు తప్పకుండా అనుసరించి పాటించిననాడే పవిత్రమైన వివాహం పరమార్థస్థితిని చేరుకొంటుంది. భార్యకు భర్త భర్తకు భార్య తోడునీడగా, అన్యోన్యంగా అరమరికలు లేకుండా, అర్ధనారీశ్వర తత్వంతో బ్రతికినప్పుడే ఈ ప్రమాణాలకు ఒక విలువ వుంటుంది.

కీచులాటలతో, వివాదాలతో, నిత్యసమస్యలతో, నిండుజీవితాలను బండల పాలు చేసుకొనే వారికి ఈ ప్రమాణాలవిలువ తెలియదు. వివాహ ప్రయోజనం అర్థంకాదు.

✦☆✦

స్త్రీలు బహిష్టు సమయాల్లో దూరంగా వుండాలా?

ఇరువది ఎనిమిది రోజులకొకసారి అండం విడుదల కాబోయేముందు స్త్రీలు రజస్వల కావటం సృష్టినియమం. మూడురోజుల నుండి ఐదురోజులవరకు రజస్వలా సమయంగా పాటించటం జరుగుతూవుంది. ఈ దినాలలో స్త్రీలు అనారోగ్యంగా వుండటం సహజమే. కడుపునొప్పి, తలనొప్పి, వళ్ళునొప్పులు, జ్వరంతగిలినట్లుగా వుండటం, చిరాకు, కోపం, విశ్రాంతికోరటం వంటివి వుంటాయి. శరీరమంతా బరువుగా భారంగా కూడా వుంటుంది. అందుకే ఈ

నాలుగు రోజులు స్త్రీకి విశ్రాంతి కల్పించే వుద్దేశ్యంతో ఇంటిపనులకు దూరంగా వుంచారు పూర్వీకులు. అంటుకోకూడదనే నియమం కూడా విధించారు.

ఒకరకంగా ఇది స్త్రీలకు వరమే!

ఈ నిషిద్ధ సమయంలో స్త్రీలు ఇంటిపనులకు వంటపనులకు దూరంగా వుండటమే కాదు, భర్తకు, పడకగదికి కూడా దూరంగా వుండాలి. పూర్వకాలంలో ఉమ్మడి కుటుంబాలే ఎక్కువగా వుండేవి. ఎప్పుడూ ఎవరో ఒకరు రజస్వలగా వుండేవారు. అందుకని స్త్రీల కోసమే రజస్వలాగది ఒకటి ప్రత్యేకంగా వుంచేవారు. ఆ గదిలో వారికి కావలసిన సదుపాయాలన్నీ వుండేవి.

> పూర్వీకులు దూరదృష్టితో సదుద్దేశ్యంతో కొన్ని ఆచారాలను విధించారు. మూఢాచారాలను వదిలివేసి శాస్త్రీయ ఆచారాలను పాటించటం మంచిదే. 'పురాణ మిత్యేవన సాధుసర్వమ్' అన్నట్లు గానే పాత ఆచారాలన్నీ చెడ్డవి కాదు. కొత్త ఆచారాలన్నీ మంచివి కాదు. ప్రతిదానిలోనూ మంచి చెడులు వుంటాయి.

ఈ సమయంలో స్త్రీ, పురుషుల కలయిక నిషిద్ధం. ఈ కారణంవల్ల కూడా స్త్రీలను ఋతుసమయంలో ముట్టరాదన్న కట్టడి చేశారేమో! ఏదిఏమైనా ఈ సమయంలో స్త్రీలకు విశ్రాంతి నివ్వటం చాలా మంచి విషయం.

ఆనాటి స్త్రీలందరూ గృహిణులే. ఈనాటి స్త్రీలు ఎందరో ఉద్యోగాలు చేస్తున్నారు గదా. ఈనాటివారికి ఇవన్నీ కుదరవు. ఉద్యోగ ధర్మం మరచి ఇంట్లో కూర్చుంటే కుదరదు. ఉమ్మడి కుటుంబాలు పోయా యిప్పుడు. ఎవరికివారు స్వేచ్ఛగా వేరు వేరుగా వుండే ఈ రోజుల్లో పూర్వాచారాలకు చెల్లుచీటీ వచ్చింది.

పూర్వకాలంలో, ఋతుక్రమం ప్రారంభమైన ఐదవనాటి రాత్రి భార్యతో భర్త కలసి నిద్రించవల్సిందే! ఇది ఆనాటి నియమం. ఎందువలననంటే ఆ కాలంలో ఎక్కువమంది సంతానాన్ని కనటమే గొప్పగా వుండేది.

బహుసంతానవతులైన స్త్రీలను అందరూ దేవతగా గౌరవించి పూజించేవారు. సంతానమే ఆస్తిగా భావించే రోజులు పోయి పరిమిత కుటుంబమే మంచిది అనే రోజులు వచ్చాయి గదా. నాటి ఆచారాలు నేడు అపహాస్యమై పోతున్నాయి.

✦☆✦

భార్య లేనివాడు దైవకార్యాలకు పనికిరాడా?

అవును!

బ్రహ్మచారి, భార్యాహీనుడు దైవకార్యాలకు పనికిరాడు.

ధర్మశాస్త్రం అంగీకరించదు.

భర్తను పోగొట్టుకొన్న స్త్రీ శుభకార్యాలకు ఏ విధంగా పనికిరాదో భార్యలేని పురుషుడు కూడా శుభకార్య నిర్వహణకు పనికిరాదన్నది శాస్త్రం. దీనికి ముఖ్యకారణమేమంటే -పురుషుడు వివాహసమయంలో వధువును తన దాన్నిగా చేసుకొనే సమయంలో, గురు బంధు మిత్రుల సమక్షంలో, దైవసాక్షిగా "ధర్మేచ - కామేచ - మోక్షేచ నాతిచరామి" అన్న ప్రమాణమే.

> భర్త మరణించిన వితంతువును ఏ శుభకార్యాలకు పిలువరని మాత్రమే మనకు తెలుసు. భార్య మరణించిన పురుషునికి కూడా ఏ ధర్మకార్య నిర్వహణకూ పనికి రాదని కొద్ది మందికి మాత్రమే తెల్సు. హిందూ ధర్మ వ్యవస్థలో ఆలుమగల అను బంధానికి పవిత్రతకు ఎంతో పెద్ద పీట వేశారు. అందుకే ఈ భూమి గొప్పది! మన ధర్మం గొప్పది! మన సంప్రదాయం గొప్పది!

ఈ కారణంగానే ధర్మపరులైన స్త్రీ పురుషులు ద్వితీయ వివాహానికి అంగీ కరించరు. కష్టాలతో కాపురం చేయటాని కైనా ఇష్టపడతారుగాని, మరొక పెండ్లికి అంగీకరించరు. ఈనాటి నాగరిక ప్రపంచం ఈ విష యాన్ని 'పాత చింతకాయపచ్చడి' అంటూ కొట్టిపారేస్తారు గాని దీర్ఘంగా ఆలోచిస్తే వివాహ ధర్మంలోని నిజా యితీ ఏమిటో అర్థం అవు తుంది.

త్రేతాయుగంలో శ్రీరాముడు ప్రజాహితంకోసం అశ్వమేధ యాగం చేయవల్సి వచ్చింది. అప్పటికే శ్రీరాముడు సీతను పరిత్యజించాడు. అందువల్ల అశ్వమేధం చేయటానికి అంగీకరించలేదు రాముడు. ఆ క్లిష్టసమయంలో కులగురువులైన వశిష్ఠుడు, బావగారైన ఋష్య శృంగమహర్షి ధర్మశాస్త్రాలను శోధించి స్వార్థరహితమైన ప్రజాకార్యం కాబట్టి ప్రజాధనంతో స్వర్ణప్రతిమను చేయించి

ఆ ప్రతిమను ప్రక్కనే వుంచుకొని అశ్వమేధం చేయమని చెప్పారు. ఈ రామాయణ కథ మనకందరకు తెల్సిందేగదా.

"ఏ దేశమేగినా ఎందు కాలిడినా - ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
పొగడరా నీతల్లి భూమి భారతిని - నిలుపరా నీజాతి నిండు గౌరవము
లేదురా ఇటువంటి భూదేవి ఎందు - లేరురా మనవంటి పౌరులింకెందు
మంచిపూవులన్ పూజించినావో - నినుమోసే నీతల్లి కనక గర్భమున"

అన్న కవి మాటలు అక్షరసత్యం! నూటికి నూటపదిపాళ్ళు నిజం! నిజం!

✦☆✦

భర్త మరణించిన తరువాత పూలు కుంకుమలను స్త్రీలు వదిలేయాలా?

ఇది భార్యాభర్తల అనుబంధానికీ, అనురాగానికీ, ఆత్మానుబంధానికి సంబంధించిన విషయం. వివాహబంధాన్ని గౌరవించే విషయం.

మరణించిన భార్యకోసం 'తాజమహల్' కట్టించిన భూమి యిది.

భార్య భాగమతికోసం భాగ్యనగరం (హైదరాబాద్) వెలసిన చోటు ఇది.

పరిత్యజించిన సీతకోసం పరితపించాడేగాని పునర్వివాహానికి అంగీకరించని శ్రీరాముని కన్న భూమి యిది. తాళి కట్టిన భార్యకోసం సర్వం త్యాగం చేసి సన్యాసం స్వీకరించినవారు, ఆత్మాహుతి చేసుకొన్నవాళ్ళు, ఎందరో చరిత్రకందని వాళ్ళు వున్నారని చెప్పటం అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. ఈ విషయం ఈ ప్రశ్నకు సంబంధించినది కాకపోయినా ఈ భూమి, నీరు, గాలి గూర్చి చెప్పక తప్పలేదు.

భర్త మరణించిన తరువాత స్త్రీలు పూలను కుంకుమను వదలివేయటంలో ఒక ఆత్మార్పణా భావం వుంది. దాదాపు నలభై సంవత్సరాలు తనతో మమేకంగా జీవించి, కష్టసుఖాలలో భాగం పంచుకొని తమకోసం పగలు రాత్రి శ్రమించిన

భర్త మరణించిన తరువాత సౌందర్యసూచకమైన కంకుమను, సౌఖ్యసూచకమై పూలను, రంగురంగుల వస్త్రాలను త్యజించి దేహదండన నిమిత్తంగా ఒక పూట భోజనం చేసేవారు. ఇది ఆనాటి స్త్రీల సంప్రదాయం. అయితే సదా చారంగా ప్రారంభమైన ఈ పద్ధతి దురాచారంగా మార్పు చెందింది. వయో భేదంతో ముడిపడివున్న ఈ పద్ధతిని ఛాందసవాదులు అందరూ కల్పి లోకమే తెలియని బాలికలను సైతం ఆచారం పేరుతో బలత్కారంగా కట్టుబొట్టులను మార్పించేవారు. గుండుగీయించి మూలన కూర్చోబెట్టేవారు. వంటగదికి మాత్రమే పరిమితం చేసేవారు. ఇది చాలా అనాగరిక దురాచారం గదా!

1929లో శారదా చట్టం వచ్చింది. ఇది ఆడపడుచులందరికీ మహావరంగా చెప్పవచ్చు. తరువాత ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కృషితో 1856వ సంవత్సరంలో వితంతు వివాహ చట్టం అమలులోకి వచ్చింది. ఆంధ్రాలో కందుకూరి వీరేశ్వ లింగంపంతులు వితంతు వివాహాలను జరిపించి స్త్రీ జాతికి చెప్పరాని ఉపకారం చేశాడు.

ఎపుడైతే వితంతు వివాహాలు ప్రారంభమయ్యాయో, అప్పటినుండి పోయిన కుంకుమ సౌభాగ్యం స్త్రీలకు మరలా వచ్చింది. ఈ కట్టు బొట్టుల పట్టు మెల్లగా సడలిపోయింది. వితంతువులు సైతం ఇపుడు కుంకుమను ధరిస్తున్నారు. వివాహిత స్త్రీలకు వితంతువులకు వ్యత్యాసం లేదిప్పుడు.

దీనిని మనమందరం హర్షిద్దాం.

స్త్రీలనందరిని అభిమానించి గౌరవిద్దాం.

ఆచారాలు వుండాలి. కాని దురాచారాలు వుండకూడదు.

దారి చూపలేని ధర్మాలవల్ల ప్రయోజనం లేదు.

"కలకంఠి కంట కన్నీరొలికిన సిరియింటనుండ నొల్లదు సుమతీ"

దేవుని పేరున జరిగే పూజాదికాలను నమ్మవచ్చా?

"దేవుడు ఉన్నాడా?" అనే ప్రశ్న తరతరాలుగా మనిషిని వేధిస్తున్న సమాధానం లేని ప్రశ్న! మహాభాగవత కర్త పోతనా మాత్యుడు కూడా "కలడు కలండనెడువాడు కలడో లేడో" అనే తర్కంలో పడిపోయాడు. దేవుని నమ్మగల్గినపుడే దైవనిమిత్తంగా జరిగే కార్యక్రమాలను నమ్మగలరు. దేవుని నమ్మటమా మానటమా అనేది వారివారి వ్యక్తిగతవిషయం.

వేలవేల సంవత్సరాలనుండీ అన్ని మతాలవారు, అన్ని దేశాలవారు, అన్నిభాషలవారు దేవుడున్నాడని నమ్ముతూ వస్తున్నారు. అయితే, హిందూ మతంలో పిచ్చిపిచ్చి పురాణాలు, పిచ్చిపిచ్చి కథలు పుట్టి హైందవ దైవత్వాన్ని అపహాస్యం పాలు చేశాయన్నది నిర్వివాదమైన నిజం. హిందువులకు చతుర్వేదాలే ప్రామాణిక గ్రంథాలు. వేదాలు సంస్కృత భాషలో నిక్షిప్తమై వున్నందువల్లనూ, బ్రాహ్మణ వర్ణంవారికి తప్ప ఇతర వర్ణాలవారికి సంస్కృతభాష తెలియనందు వల్లనూ హిందూమతం ఇతర మతాలవారికి లోకువైపోయింది. 'దేవుడు ఒక్కడే' అని చెబుతూనే వేలాదిమంది దేవుళ్ళను సృష్టించారు మన పూర్వీకులు. ఈ పాతదేవుళ్ళు చాలదన్నట్లు సంవత్సరానికి ఒక బాబా పుట్టుకొస్తూ కొత్త దేవుళ్ళు తయారవుతున్నారు. ఇంతమంది దేవుళ్ళు ఇన్ని కులాలు వుండటంవల్లనే హిందూమతం నిర్వీర్యం అవుతున్నది. దైవదర్శనానికి దైవసేవకు డబ్బుపెట్టి టిక్కెట్టు కొనుక్కొనే చెడుపద్ధతి కేవలం హిందూమతంలోనే వుంది. ఇది చాలా విచారకరం. ఈనాడు భారతదేశంలో వుంటున్న ముస్లింలుకానీ, క్రైస్తవులు కాని ఒకప్పుడు హిందూమతంనుండి ఆ మతంలోనికి వెళ్ళినవారేనని తెలిసి నప్పుడు నిజమైన హిందువుకి మనసు చివుక్కుమనక మానదు. పెద్దపెద్ద పేరు పొందిన హిందూ దేవాలయాలలో ఎంతోదూరంనుండి శ్రమకోర్చి దైవదర్శనానికి వచ్చిన భక్తులకు ఇంటికి దైవప్రసాదం కూడా యివ్వరు. డబ్బులు పెట్టి కొనుక్కో వల్సిందే! ఇటువంటి విషయాలనెవరూ ప్రశ్నించరు. పెంచిపోషిస్తున్నారు. ప్రశ్నించితే గనుక దేవుడేం చేస్తాడేమోనని భయం.

పండుగలకు దేవుని పేరుమీద దాంభిక ప్రదర్శనకోసం ధార్మికత పేరుమీద ప్రజలనుండి దాదాగిరీ చేసి రౌడీతనంతో చందాలు వసూలు చేయటం, దబ్బులివ్వకపోతే వేధించటం మనం చాలాచోట్ల చూస్తున్నాం. ఇది హర్షణీయమా! హిందూ ధర్మానికిది మాయని మచ్చకాదా! వినాయక చవితికి శ్రీరామనవమికి, విజయదశమికి, యిటువంటివి జరగటం షరా మామూలే! దేవుని పేరుమీద జరిగే ఇటువంటి ఉత్సవాలు ఎవరికి ప్రయోజనకరం? ఎంతమందికి హితకరం? దేవుని ఉత్సవాలలో అశ్లీలమైన సినిమాపాటలకు నడుం వూపుతూ డాన్సులు చేయటం, కేకలు, ఈలలు వేయటం ఎవరికి ఆనందం? ఇది ఏ సత్సంప్రదాయం? దీనికి అడ్డుకట్ట వేయాల్సిందెవరు? ప్రజలే?

యోనహృష్యతి, నద్వేష్టి, నశోచతి, నకాంక్షతి ।
శుభాశుభపరిత్యాగీ, భక్తిమాన్, యః సమేప్రియః"

అన్నాడు గీతాచార్యుడు.

సుఖదుఃఖాలను సమంగా చూచేవాడు, దుఃఖించనివాడు, కోరికలు లేనివాడు, శుభాలను, అశుభాలను పరిత్యజించినవాడు, భక్తివంతుడైనవాడే నా భక్తుడు అని గీతాచార్యుడు భక్తునికి ఒక 'సర్టిఫికెట్' ఇచ్చాడు.

ఇటువంటి భక్తులెంతమంది వున్నారిపుడు?

ఆడంబరాన్ని దేవుడు స్వీకరించడు; మన్నించడు.

> దేవుని పేరుమీద జరిగే ఆడంబరపూజలు అనావశ్యక వ్యయాలు గొప్పలకోసమే గాని చిత్తశుద్ధి కోసం కాదు. ఇటువంటివి దేవునికి అంగీకారం కాదు.

దేవుడు శ్రీమంతుల ఇండ్లలో వుండడు! ఆకలితో "అమ్మా" అని అరిచే దరిద్రుని ఆర్తనాదంలో వుంటాడు. అసహాయ స్థితిలో ఆపన్నహస్తం కోసం చేయిచాచే నిర్భాగ్యు లలో వుంటాడు. దీనులలో వుంటాడు. దుఃఖితులలో వుంటాడు. నిస్సహాయులలో వుంటాడు. దేవుడుండేదిక్కడే! దేవాలయాల్లో కాదు. తీర్థస్థానాల్లో కాదు.

కానుకలిచ్చి దేవుడిని తృప్తిపరచాలనుకోవటం అవివేకం! దేవుడు లంచాలు స్వీకరించడు. కానుకల కోసం వరాలనిచ్చేవాడు దేవుడైతే ఆ దేవుడు నిజంగా దేవుడే కాదు.

వెంకటేశ్వరస్వామి తిరుపతిలో మాత్రమే వుండడు. మన పూజా మందిరంలో కూడా వుంటాడు. గుడి గోపురాల్లో దేవుడు వుండడు. సత్యంలో దేవుడు వుంటాడు. ధర్మంలో దేవుడు వుంటాడు. శీలంలో దేవుడు వుంటాడు. నీతిలో దేవుడు వుంటాడు. న్యాయంలో దేవుడు వుంటాడు. ప్రేమలో దేవుడు వుంటాడు. కరుణలో దేవుడు వుంటాడు. ప్రియమైన మాటలో దేవుడు వుంటాడు.

దాంభిక పూజల్లోనూ, పెద్దగా అరచే
మంత్రాల్లోనూ దేవుడు లేడు.

దేవుడంటే ఒక నమ్మకం!
నమ్మకం
మనిషిని నడిపిస్తుంది.
నమ్మకం విజయాన్ని యిస్తుంది.
నమ్మకం మనిషికి శక్తినిస్తుంది.
నమ్మకం ఎల్లవేళలా తోడుగా
వుంటుంది.
దేవుడు వరాల నిస్తాడో లేదో
తెలియదుగాని
దేవుడున్నాడనే నమ్మకం మాత్రం
మనల్ని విజయాలవైపు
నడిపిస్తుంది. ఇది నిజం.

కులవ్యవస్థ ప్రారంభమైనపుడు మేధావివర్గమైన వారిని బ్రహ్మజ్ఞానులుగా భావించి, బ్రాహ్మణులని పేరుపెట్టి, వారి జీవనోపాధికోసం మంత్ర తంత్రాలు, దేవస్థానాల నిర్వహణలు, పూజా పునస్కారాలు కులవృత్తిగా చేసుకోమని చెప్పటం జరిగింది. అంతేగాని కేవలం మంత్రాలవల్ల దేవుడు ప్రసన్నుడు కాడు. దేవునికి కావల్సింది నిర్మలమైన మనస్సు. అంకిత బావంగల భక్తి. అచంచలమైన నమ్మకం. అనన్యమైన భావన. అంతేగాని పూలు, పళ్ళు, హారతి, అగరువత్తులు కాదు.

అసంబద్ధమైన కోరికల్ని భగవంతుడు నెరవేర్చడు.

✦☆✦

పంచేంద్రియాలలో ఏది గొప్పది?

ఘ్రాణం – రసము – చక్షువు – త్వక్ – శ్రోత్రము.

ఈ ఐదు పంచేంద్రియములు లేదా జ్ఞానేంద్రియములు అంటారు. (ముక్కు – నోరు – కన్నులు – శరీరము – చెవులు) ఈ ఐదింటిలో ఘ్రాణేంద్రియము (ముక్కు) గొప్పదిగా చెప్పవచ్చు. ఎందుకంటే మనిషి మరణానికి చేరువ కాబోతున్నపుడు చెవులు వినిపించవు. కన్నులు దృష్టిని కోల్పోతాయి. శరీరం స్పర్శను పోగొట్టుకొంటుంది. నోరు మాటను కోల్పోతుంది. కాని ముక్కు మాత్రం తన శ్వాసక్రియను కొనసాగిస్తూనే వుంటుంది. మనిషి మరణం పొందేవరకు తోడుగా నిలిచి వుండే ఇంద్రియం ఘ్రాణేంద్రియం ఒక్కటే. అన్ని మతాల మహిళలు ముక్కును కుట్టించుకోవటంలోని సదుద్దేశ్యం ఇదే!

ఘ్రాణేంద్రియానికి మంచి సువాసన కావాలి. లేకుంటే మిగిలిన ఇంద్రియాలను ప్రేరేపించి మనిషిని దూరంగా నడిపిస్తుంది చివరకు మనిషి తినే ఆహారమైనాసరే, ముందుగా ముక్కుకి నచ్చాలి. తరువాత కళ్ళకు నచ్చాలి. తరువాత నోటికి నచ్చాలి. అందుకే మనం భుజించే ఆహార పదార్థాలలో సువాసనా ద్రవ్యాలను తప్పకుండా వాడుతుంటాం. సువాసన లేని నేతిని ఎవరైనా ఇష్టపడతారా!

మంచి పరిమళం ముక్కుకి తగిలిన వెంటనే నరనాడులు వికసిస్తాయి. శరీరం ప్రశాంతతను అనుభవిస్తుంది. కన్నులు విప్పారుతాయి. మనిషి మొత్తం చైతన్యవంతుడౌతాడు. నాడీమండలమంతా ఉత్తేజితమైపోతుంది. కాబట్టి పంచేంద్రియాలలో ముక్కు గొప్ప ఇంద్రియం. మనిషి అందమంతా ముక్కులోనే వుంటుంది.

వాత్స్యాయన మహర్షి చెప్పిన విధంగా స్త్రీలలో నాలుగు రకాలవారున్నారు. 1. పద్మిని 2. హస్తిని 3. శంఖిని 4. చిత్తిని ఈ నలుగురిలో పద్మినీజాతి స్త్రీల శరీరాలకు ఒకరకమైన సువాసన వుంటుందట. ఈ సువాసన ఘ్రాణేంద్రియానికి తగిలినవెంటనే పురుషునికి కామోద్దీపనం కల్గుతుందని చెబుతాడు వాత్స్యాయనుడు.

ఘ్రాణేంద్రియం ఉల్లాసంగా వుంటే శరీరం మొత్తం హుషారుతో వుంటుంది. అందుకే మనం పరిమళం వుంటే సబ్బులను, పౌడర్లను ఇష్ట పడుతుంటాం. చాలామంది మనస్సుకి మత్తెక్కించే సెంట్‌లను వాడుతూ వుంటారు. పడకగదిలో పరిమళ ద్రవ్యాలదే పైచేయి మరి.! మల్లెపూల వాసన తగలగానే యువదంపతులు తీయని కోర్కెలతో పరవశించి పోతుంటారు. స్వానుభవంగా ఇది అందరెరిగిన విషయమే.

పంచేంద్రియాలకూ మనస్సుకీ ఎంతో సంబంధం వుంది. మంచి సువాసన తగిలినా, మంచి సంగీతం విన్నా, మంచి సన్నివేశం చూసినా చల్లని గాలి వీచినా, రుచికరమైన పదార్థాలు ఆరగించినా మనస్సుకి ఎంతో సంతోషం కల్గుతుంది. తన్మయత్వం అనుభవిస్తుంది.

✦☆✦

పతియే ప్రత్యక్ష దైవమా! సతి ప్రత్యక్ష దేవత కాదా!

ఈ సృష్టి పురుష ప్రధానంగా జరిగింది.

దైహికంగా పురుషుడు బలవంతుడు కాబట్టి గృహానికి అతడే ముఖ్యస్థానం పొందాడు. ఏ రకంగానైనాసరే సంపాదించి స్త్రీని పోషించాల్సిన బాధ్యత పురుషునికే వుంది. దైహికంగా స్త్రీలు బలవంతులు కారు. అంతేకాక గర్భవతులు కావటం పిల్లల్ని కనటం పెంచటం స్త్రీల బాధ్యతగా అయింది.

వేల సంవత్సరాలకు పూర్వం మానవులు గుంపులు గుంపులుగా జీవి స్తుండేవారు. స్థిరనివాసం వుండేది కాదు. అప్పటికింకా 'గ్రామాలు' పుట్టలేదు. ఒక గుంపులోని ఆడవాళ్ళను మరొక గుంపువారు ఎత్తుకెళ్ళి పోతుండేవారు. తమవద్దనే శాశ్వతంగా వుంచేసుకొనేవారు. ఈ స్థితిలో పురుషులకు ఆడవారిని రక్షించుకొనే అదనపు బాధ్యత కూడా వుండేది. పగలు ఆహారం సంపాదించటం రాత్రిళ్ళు కాపలా కాయటం పురుషుల కర్తవ్యంగా వుండేది.

ఆహారమిచ్చి రక్షించేవాడు ప్రత్యక్ష దైవమేగా మరి!

ఈ విధంగా పురుషారాధన ప్రారంభమైంది. భరించేవాడు భర్తకాబట్టి దైవసమానుడుగా గౌరవించారు భార్యలు. ఇక్కడొకమాట చెప్పాలి. మానవ ధర్మాలను మూర్ఖంగానో గుడ్డిగానో ప్రవేశపెట్టటం జరగలేదని గుర్తించాలి. ప్రతి ధర్మం వెనుక ఒక ప్రయోజనం వుంది. ప్రతి ఆచారం వెనుకా ఒక ఆలోచన వుంది. మన హిందూమతమే కాదు ప్రతి మతంలోనూ ధర్మ ప్రయోజనం వుంది.

"పతియే ప్రత్యక్ష దైవమా! సతి ప్రత్యక్షదైవంకాదా!" అంటే సతి కూడా దేవతా సమానురాలే! ఏ ధర్మశాస్త్రముభార్యను తక్కువగా చూడమని చెప్ప లేదు. అన్ని విషయాల లోనూ స్త్రీలకు ఆధిపత్యాన్ని కల్పించారు పూర్వులు. ధనానికి అధిదేవత లక్ష్మీదేవి. విద్యకు అధిదేవత సరస్వతీదేవి! శక్తికి అధిదేవత పార్వతీదేవి! వేదశాస్త్రాలకు అధిదేవత గాయత్రీ దేవి.!

స్త్రీలకు ఇవ్వవల్సిన స్థానమేమిటో చెప్పకుండానే చెప్పింది హిందూమతం. బ్రహ్మదేవుడు సరస్వతిని తన వాక్కులో దాచుకొన్నాడు. విష్ణువు తన హృదయం లోను, శివుడు తన అర్ధ శరీరంలోను దాచుకొన్నారు.

మరి స్త్రీ దేవత కాదా!

లక్షల సంవత్సరాలనాటి త్రేతా యుగంలో శ్రీరాముడు సీతను అరణ్యానికి పంపాడనీ, హరిశ్చంద్రుడు ఆలిని అమ్మే శాడనీ, ద్వాపరయుగంలో ధర్మరాజు పెళ్ళాన్ని పణంగా పెట్టాడనీ చెబితే ఎలా! ద్వాపరయుగం గతించి ఐదువేల సంవత్సరాలకు పైగా అయింది. హరిశ్చంద్రుడు భార్యను అమ్మటంలోని అంతరార్ధమేమిటో, ధర్మరాజు ద్రౌపదిని ఏ స్థితిలో పందెం కాశాడో చెప్పటానికి అవకాశం లేదు మరి. భార్య అంటే అర్ధాంగి అన్నారు పెద్దలు. అర్ధాంగి అంటే పురుషునిలో సగభాగం అన్నమాట. మాతృభూమి, మాతృభాష అనటం స్త్రీని గౌరవించటమే!

భర్త దేవుడైతే అర్ధాంగి దేవతయే గదా మరి!

✦☆✦

మనువు "నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి" అనటం న్యాయమా!

ధర్మశాస్త్ర ఇతిహాసకారుడైన 'పి.వి.కాణె'గారి అభిప్రాయ ప్రకారం భారతీయ స్మృతులు నూటికి పైగా వున్నాయని తెలుస్తోంది. ఈ నూరు స్మృతులలో మనుమహర్షి వ్రాసిన 'మనుస్మృతి' ఒకటి.

శ్లో॥ కృతేతుమానవాధర్మాస్త్రేతాయాం గౌతమస్మృత: ।
ద్వాపరే శంఖలిఖితా:, శ్చకలౌ పారాశర స్మృత: ॥

మనుస్మృతి కృతయుగంలోనూ, గౌతమస్మృతి త్రేతాయుగంలోనూ, శంఖలిఖిత స్మృతి ద్వాపరయుగంలోనూ, పరాశరస్మృతి కలియుగంలోనూ ఆచరింపదగినవి.

కృతయుగధర్మమైన మనుస్మృతిని ఈ కాలానికి అన్వయించటం మంచిదా?

మంచిది కాదని నా అభిప్రాయం.

"యస్తు కృతయుగే ధర్మో న కర్తవ్యం కలౌయుగే"

– 'ఆదిత్యపురాణం'

కృతయుగ ధర్మాలను కలియుగంలో ఆచరించకూడదని ధర్మగ్రంథాలు చెబుతున్నవి. అయినా మనుస్మృతిని ఒకసారి పరిశీలిద్దాం. మనువు స్త్రీకి స్వాతంత్ర్యత కూడదని చెప్పినమాట వాస్తవమే.

శ్లో॥ పితారక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే ।
రక్షంతి స్థవిరే పుత్రా: నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి ॥

మనుస్మృతి – 9-3

స్త్రీని బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వార్ధక్యంలో పుత్రులు రక్షించి పోషిస్తారు కాబట్టి స్త్రీకి స్వాతంత్రత అవసరంలేదు. (అర్థాలు కాదు)

స్వాతంత్ర్యం అంటే అర్థమేమిటి? ఆర్థిక స్వాతంత్ర్యమా! సామాజిక స్వాతంత్ర్యమా! గృహ స్వాతంత్ర్యమా! అలంకార స్వాతంత్ర్యమా! ఆహార స్వాతంత్ర్యమా! ప్రవాస స్వాతంత్ర్యమా! ఏ స్వాతంత్ర్యం వద్దని చెప్పాడు మనువు?

సరే; ఏ విధమైన స్వాతంత్రమూ వుండకూడదని చెప్పాడే అనుకొందాం. ఇది ఎన్నివేల సంవత్సరాలనాటి ధర్మశాస్త్రం. కలియుగానికి ఈ ధర్మశాస్త్రం పనికి రాదని చెప్పినా మనువును నిందించటం న్యాయమా?

ఈనాడు, కలియుగం వచ్చి ఐదువేల సంవత్సరాలు దాటినా మన యిండ్లలో మన ఆడవారికి మనమెంత స్వతంత్ర్యాన్ని ఇవ్వగలుగుతున్నాం. మన అమ్మాయి ఒంటరిగా పదిరోజులు దేశపర్యటన చేస్తానంటే అంగీకరిస్తామా! సినిమా హీరోయిన్‌లు వేసుకొనే బట్టలు వేసుకొని బజారు కెళతానంటే మనం ఒప్పుకొంటామా! బాయ్‌ఫ్రెండ్స్‌తో షికార్లు చేస్తుంటే అంగీకరిస్తామా! అతి స్వాతంత్ర్యం ఎవరికీ మంచిది కాదు. అందునా స్త్రీలకు మంచిదేకాదు. జరుగ రాని అకార్యం జరిగితే సంపూర్ణ బాధ్యత ఆడపిల్లే వహించాలి. స్త్రీ శరీర నిర్మాణం అలా వుంది. దీనికి మనువును నిందించటం అన్యాయమని నాకనిపిస్తున్నది.

అలాగని అన్ని విషయాల్లోనూ మనువును సమర్థించలేం.

కులవివక్షను గట్టిగా సమర్థించాడు మనువు.

జాతి వివక్ష ఆనాడు ఈనాడు ఏనాడూ సమర్థనీయం కాదు. క్షంతవ్యం కాదు. ఒకనాటి బ్రాహ్మణ సముదాయం ఎవరినైతే కడజాతివారుగా దూరంగా పెట్టిందో ఆ కడజాతివారికే కైమోడ్పు చేస్తున్నారు యిప్పుడు. రాజులు కింకరులై, కింకరులు రాజు కావటమంటే ఇదే గదా!

మనుస్మృతి ఆధారంగా భారతీయ శిక్షాస్మృతిని అప్పటి బ్రిటిష్ గవర్నమెంట్ తయారుచేసింది. అదే 'ఇండియన్ లా' ని కొద్ది మార్పులతో మనం ఇప్పటి చట్టాలను తయారుచేసుకొన్నాం.

మనువు స్త్రీలను తక్కువగా అంచనా వేసిన మాట వాస్తవమే అయినా -

శ్లో॥ యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతాః ।
యత్రైతాస్తు నపూజ్యంతే సర్వాస్తత్రా ఫలాః క్రియాః ॥

- మనుస్మృతి

శ్లో॥ శోచంతి జామయోయత్ర వినశ్యాశుతత్కులమ్ ।
న శోచంతి తు యత్రైతా వర్ధతే తద్ధి సర్వదా ॥ - మనుస్మృతి

శ్లో॥ సంతుష్టో భార్యయాభర్తా భర్త్రా భార్యా తథైవ చ ।
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్ర వై ధ్రువమ్ ॥
- మనుస్మృతి

'ఎక్కడైతే స్త్రీలు గౌరవించి పూజింపబడతారో అక్కడ దేవతలు నివసిస్తారు. ఎక్కడ స్త్రీలు గౌరవింపబడరో అక్కడ నిష్క్రియత్వం తాండవిస్తుంది. స్త్రీలు సంతోషంగా వుంటే కులవృద్ధి జరుగుతుంది. స్త్రీలు దుఃఖంతో వుంటే కుల వినాశనం జరుగుతుంది.

> సంతుష్టురాలైన భార్య సంతోషంగా వుండే భర్త ఎక్కడ వుంటారో ఆయింటిలో ఎప్పుడూ శుభమే వుంటుంది. సంపదలు స్థిరంగా వుంటాయి. స్త్రీలు మెచ్చే విధంగా పురుషులు ప్రవర్తించాలి. శుభకార్యాలు వచ్చినపుడు రత్నాభరణాలు పట్టువస్త్రాలు స్త్రీలకు ఇస్తుండాలి.

ఇటువంటి శ్లోకాలు మనుస్మృతిలో చాలా వున్నాయి. అన్నిటినీ ఉదహరించటం కుదరదు గదా! మనువు 'శూద్రకుల విరోధి' అన్నది నూటికి నూరుపాళ్ళు నిజం. కాని స్త్రీకుల విరోధి అంటే ఆలోచించాల్సిందే. స్మృతులు అన్నీ బ్రాహ్మణ పక్షపాతంతోనే వ్రాయబడ్డాయి. ప్రత్యేకంగా మనం మను మహర్షిని ఒక్కడినే నిందించటం నేరంగదా!

మనుస్మృతి చాలా ప్రాచీనమైంది. అదిప్పుడు ఆచరణయోగ్యం కానిది. కలి యుగానికి పనికిరానిది. కాబట్టి మనువును క్షమించేద్దాం.

✦☆✦

కర్మసిద్ధాంతం అంటే ఏమిటి?

శ్లో॥ కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।
మాకర్మ ఫలహేతుర్భూ, మాతే సంగోస్త్వ కర్మణి ॥ -భగవద్గీత

"నీకు కర్మాధికారమేగాని ఫలితాధికారం లేదు. కర్మఫలానికి నీవే కారణమని భావించరాదు. కర్మను విడచిపెట్టే మనస్సు నీకు రాకూడదు." అన్నాడు గీతాచార్యుడు. కర్మ అంటే కర్తవ్యం. కర్తవ్యపరునికి జయాపజయాల విశ్లేషణ హితాహితాల వివరణ వుండకూడదు. కర్తవ్య నిర్వహణ ఒక్కటే అతని గురిగా వుండాలి.

కర్మసిద్ధాంతం అంటే కర్తవ్య సిద్ధాంతం

పునర్జన్మ - కర్మ ఈ రెండు సిద్ధాంతాలతో హిందూమతం పుట్టింది.

కర్మసిద్ధాంతంతోనే వర్ణాశ్రమ ధర్మం వచ్చింది.

సామాన్యులకు గాని, గృహస్థులకు గాని ప్రతిఫలాపేక్ష విడచి కర్మాచరణ చేయటం కుదరదు. ఎలాగంటే, పాలకోసం పశువుల్ని, పండ్లకోసం చెట్లను పెంచుతాం. ప్రతిఫల మాశించకుండా కర్మాచరణ చేయటం మహాత్ములకే సాధ్యం కాని మామూలు మనుష లకు అసాధ్యం.

కురుపితామహుడైన భీష్ముడు కర్మ సిద్ధాంత పరాయణుడై కురుక్షేత్రానికి వచ్చాడు. తప్పని తెలిసీ దుర్యోధనుని పక్షాన నిలబడ్డాడు. అవక్రవిక్రమంతో పదిరోజులు యుద్ధం చేశాడు. మహాపండితుడైన భీష్ముడు కౌరవ పక్షాన నిలబడటానికి కారణం కర్మసిద్ధాంతమే.

> కర్మ - ధర్మం
> ఈ రెండు నాణేనికున్న
> బొమ్మబొరుసు లాంటివి.
> లాభనష్టాలు, ప్రతిఫలాపేక్ష
> ఛీత్కార సత్కారాలు
> మదితలచకుండా తన
> కర్మను (కర్తవ్యాన్ని) తాను
> నిర్వహించుటమే
> కర్మ సిద్ధాంతం.
> కర్మసిద్ధాంతికి
> సుఖదుఃఖాలు వుండవు.

కర్మసిద్ధాంతం అనుభవంలోకి రావాలంటే వయోపరిణతి వుండాలి. ఒడిదుడుకుల్ని చూడాలి. కష్టనష్టాలలో మ్రగ్గాలి. ఎత్తుపల్లాలు నడవాలి.

"ధారణాత్ ధర్మః ఇత్యాహుః ధర్మోధారయతి ప్రజాః"

సంస్కృతంలో "ధృ" ధాతువుకి ధరించుట / పోషించుట అనే రెండు అర్థాలున్నాయి. మనిషియొక్క సర్వతోముఖాభివృద్ధికీ, మరియు ఆత్మోన్నతికి ఏది సాధనమో అదియే "ధర్మం".

"ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా" - తైత్తరీయోపనిషత్తు
ధర్మే సర్వం ప్రతిష్ఠితమ్" - నారాయణోపనిషత్తు

కర్మాచార పరాయణునికి జయాపజయాల భయం వుండదు.

✦☆✦

మంత్రాలతోనే దేవుని పూజించాలా?

దేవతల భాష సంస్కృతం!

మన సంస్కృత భాషను దేవభాష అంటారు / దేవనాగరలిపి అంటారు.

11వ శతాబ్దానికి పూర్వం ఆంధ్రదేశంలో అందరూ సంస్కృతమే మాట్లాడేవారు.

భారతదేశ పండితులందరికీ సంస్కృతమే ప్రధాన భాష. కాబట్టి సనాతన సాహిత్యమంతా సంస్కృతభాషలో వుంది. మంత్రాలు కూడా సంస్కృత భాషలోనే వుండవల్సి వచ్చింది. సంస్కృతానికి ఆదికవి వాల్మీకి అయితే, తెలుగు భాషకు ఆదికవి నన్నయ భట్టారకుడు. ఈయన 11వ శతాబ్దంవాడు. అంటే మన తెలుగు భాషకు వేయి సంవత్సరాల చరిత్ర మాత్రమే వుంది. వేయి సంవత్సరాల క్రితం మన తాత ముత్తాతలందరూ ప్రాకృత భాష (సంస్కృతానికి ముందున్న భాష)లో మాట్లాడుకొనేవారు. పండితులందరి భాష సంస్కృతమే వుండేది. తెలుగు భాష పుట్టిన తరువాత ప్రజలందరూ తెలుగు భాషలోనే వ్యవహరించటం మొదలు పెట్టారు. పండితభాషగా వున్న సంస్కృతభాష నిదానంగా మరుగున పడిపోయి నేటికి మృతభాషగా మిగిలిపోయింది.

> మన వేదాలు, పురాణాలు, వేదసాహిత్యం మొదలైనవన్నీ సంస్కృత భాషలోనే వుండటం వల్ల దైవపూజలకు సంస్కృత మంత్రాలనే పఠిస్తున్నారు పురోహితులందరూ. మరొక విషయమేమంటే దేవతలందరి భాష సంస్కృతమేనన్న నమ్మకం వల్ల కూడా మంత్రాలను సంస్కృతం లోనే ఉచ్చరించటానికి ఇష్టపడుతున్నాం.

వేదానికి ఒక శాస్త్రీయమైన స్వరాలు వున్నాయి. స్వరయుక్తంగా మాత్రమే వేదపఠనం జరగాలి. అలా పఠించకపోయి నట్లయితే మనకు మంచి జరగటానికి బదులుగా చెడు జరిగే అవకాశం ఎంత గానో వుంది. ఈ విషయం చాలామందికి తెలియదు. ఈనాడు మనకు దొరికే బ్రాహ్మణు లందరూ పొట్టకూటి కోసం పూజలు చేయిస్తున్నవారే! ఇటువంటి బ్రాహ్మణులను 'జన్మ బ్రాహ్మణులు' అంటారు. వీరు 'కర్మ బ్రాహ్మణులు' కారు. కర్మబ్రాహ్మణుడే నిజమైన బ్రాహ్మణుడు. అయితే కర్మ బ్రాహ్మణుడు లక్షకు ఒక్కడు కూడా దొరకడేమో. ఇది బ్రాహ్మణజాతికి గౌతమ మహర్షి శాపం.

దేవుని పూజించటానికీ, నమస్కరించటానికీ, దర్శించటానికీ వేద మంత్రాలతో పనిలేదు. కానుకలతోను పండ్లతోను పనిలేదు. దేవుడు భక్తుని నుండి కోరుకొనేది చంచలత్వంలేని పవిత్ర మనస్సు మాత్రమే. మంత్రాలభాష మాత్రమే కాదు మూగవాని భాష కూడా దేవునికి తెలుసు. అయితే దేవుని గురించి మనకే తెలియదు. ఏం చేద్దాం?

శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు కశ్చిత్ యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్వతః ॥ 7-3

కోటి కోటి భక్తులు వున్నా పరిపూర్ణంగా దేవునిగురించి తెలిసినవాడు ఎక్కడో ఒక్కడే వుంటాడు అని చెబుతుంది భగవద్గీత.

✦☆✦

చేతబడులు నిజంగా వున్నాయా?

"న్యూరోసెస్" లేదా "సైకో న్యూరెసెస్" వ్యాధినే చేతబడిగా భావిస్తుంటారు.

చేతబడులు చేసేవారికన్నా చేయించేవారే పరమమూర్ఖులు.

అవిద్యావంతులు, అమాయకులు, బుద్ధిహీనులు మాత్రమే చేతబడులను నమ్ముతారు. చేతబడులను చేసేవారు కూడా విద్యావంతులుగా వుండరు. పెద్దబొట్టు, మెడలో రంగురంగుల పూసలదండలు చేతివ్రేళ్ళకు రంగురాళ్ళ వుంగరాలు, చూడటానికి భయం కల్గించేట్లుగా వుంటారు. చేతబడి చేయాల్సిన వారి వెంట్రుకలుగాని, గోళ్ళనుగాని, మరే యితర వస్తువుగాని తెప్పించి ముగ్గులు వేసి ఆ ముగ్గు మధ్యలో ఒక బొమ్మను పెట్టి, నోటికి వచ్చిన పిచ్చిపిచ్చి అక్షరాలను చదువుతూ వేప ఆకుల మండలతో ఆ బొమ్మను కొడతారు. ఆ బొమ్మకు సూదులు గ్రుచ్చుతారు. కొబ్బరికాయను తెప్పించి పసుపురాసి బొట్లు పెట్టి మంత్రాలు చదివి భూమిలో పాటిపెట్టవల్సిందిగా చెప్పి చేతికిస్తారు. రెండు మూడువేల రూపాయల దాకా డబ్బును కాజేసి యింటికి పంపుతారు. ఇదీ చేతబడి తతంగం.

చేతబడుల పేరుతో ఎక్కువ మోసపోయేది పల్లెటూరి జనం.

పల్లెటూరి వాళ్ళకు వైద్యవసతులు చాలా తక్కువ. ఏ కారణంగానైనా అనారోగ్యంతో ఎవరైనా చిక్కిపోయినా, అన్నపానీయాల మీద అయిష్టం కలుగుతున్నా, రాత్రిసమయాలలో నిద్ర సరిగా రాకపోయినా, ఎక్కువసార్లు జ్వరం తగులుతున్నా ఎవరో చేతబడి చేయించారన్న అపోహతో మంత్రాల వైద్యుడి దగ్గరకు పరుగెత్తేవాళ్ళు ఇంకా అక్కడక్కడా వున్నారు. అనారోగ్యంతో బాధపడే మనిషికి చేతబడి జరిగిందని చెప్పగానే మరింతగా భయంతో కృశించి పోతాడు. చీకటిలో చెట్టును చూచి దెయ్యం భూతం అనుకొంటూ మరింతగా బెదరిపోతుంటాడు. తనకిక దగ్గరలోనే మరణం వస్తుందని లేనిపోని కల్పనలతో అన్నం తినలేదు నిద్రపోలేదు బయటకు వెళ్ళలేదు. పిచ్చి ఆలోచనలతో మంచాన్ని అతుక్కొని పోతాడు. మానసిక ఆందోళనతో కొన్ని రోజులకు మరణించటం కూడా జరుగవచ్చు! అయితే మరొక మంత్రవాది దగ్గరకు తీసికొనివెళ్ళి

నిజంగా చేతబడులు వుంటే ఈనాటి రాజకీయవేత్తలు, మంత్రులు రోజుకొకడు చచ్చి పోయేవాడు. ప్రపంచంలో ఎక్కడా హత్యలు కనుపించేవి కాదు. ఎవరూ కొట్టుకొని చచ్చే వారు కాదు.

అతనిలోని అనుమానాన్ని తొలగించ గలిగితే మరలా మామూలు మనిషి అయ్యే అవకాశాలు వున్నాయి.

అనుమానమే మనిషిని నాశనం చేస్తుంది. నమ్మకమే మనిషిని బ్రతికిస్తుంది.

చేతబడులు అనేవి ఎప్పుడూ ఎక్కడా లేవు.

క్రీ.శ. 14-16 శతాబ్దాల మధ్య కాలంలో యూరప్‌ఖండంలో (ఇంగ్లాండ్ పారిస్ ఫ్రాన్స్‌లలో) 90 లక్షలమంది మంత్రవాదుల్ని చంపివేయటం జరిగింది.

చేతబడులను నమ్మవద్దు

✦☆✦

సుముహూర్తం తిథి, రాహుకాలం, నమ్మవచ్చా?

ఐదువేల సంవత్సరాలకు పూర్వం భారతీయ మహర్షులు సూర్యచంద్రుల గమనాన్ని అనుసరించి తిథి - వారం- నక్షత్రం - యోగం - కరణం మొదలైన ఐదింటితో పంచాగాన్ని రచించారు. చరిత్రకారుల అంచనా కూడ మనకు వారాలు, నెలలు, సంవత్సరాలు, తిధులు పుట్టి ఐదువేల సంవత్సరాలు! కాని పూర్వీకుల అంచనా ప్రకారం త్రేతాయుగం నుండి ఖగోళ విజ్ఞానం భారతీయు లకు వున్నట్లుగా చెప్పటం జరుగుతూవుంది.

ఏ తిథులు విధిని మార్చలేవు.

అయితే; ఏ పనిచేయటానికైనా ఒక నిర్ణీత సమయం నిర్ణీత దినం కావాలి. కాబట్టి విద్యావంతులైన పండితుల సలహా కావాలి. అలా ప్రారంభమైన ముహూర్త సమయాలు భారతీయుల్లో సుస్థిరస్థానం పొందాయి. మహాభారత యుద్ధానికి అమావాస్య ముహూర్తం పెట్టారు. అయినా పాండవులు విజయాన్ని

సాధించుకొన్నారు. సప్తమహర్షుల్లో విశిష్టుడుగా పేరొందిన బ్రహ్మర్షి వశిష్ఠుడు శ్రీరామ పట్టాభిషేకానికి పెట్టిన ముహూర్తం వ్యర్థమై పోయిందెందుకు? అష్టమి రోజున జన్మించిన శ్రీకృష్ణుడు దశావతార శ్రేష్ఠుడుగా వాసికెక్కాడేమిటి? సుముహూర్తాలవల్ల, తిథులవల్ల, మనిషి రాత మారిపోతే బ్రహ్మరాతకు అర్థమేముంది! మన తలవ్రాతను పంచాంగాలే నిర్ణయిస్తాయి గదా అపుడు.

మనిషి సహజంగా మనోదుర్బలుడు. తనమీద తనకే నమ్మకం తక్కువగాబట్టే సుముహూర్తాల వలలో పడిపోతుంటాడు. నిజంగా ముహూర్త బలం వుంటే ఎన్నో వివాహాలు విచ్ఛిన్నమైపోతున్నాయెందుకు? సుముహూర్తానికి ప్రారంభించిన ఎన్నో వ్యాపారాలు దివాళా తీస్తున్నాయెందుకు? కేవలం ముహూర్తాలవల్లనే మంచి జరుగదు! మనలో ఆత్మవిశ్వాసం - కృషి - నేర్పు- ఓర్పు - పట్టుదల వుంటే ఏ తిథితోనూ, ఏ రాహుకాలంతోనూ పని వుండదు.

> పట్టుదల - నమ్మకం
> నీలో కల్గినరోజే
> మంచి ముహూర్తం!
> అనుమానం - అపనమ్మకం
> కల్గిన రోజే దుర్ముహూర్తం!

ప్రతిరోజూ ప్రయాణించే విమానాలు - రైళ్ళు - బస్సులు రాహుకాలం చూచుకొనే బయలుదేరుతున్నాయా! అలా బయలు దేరటం కుదురుతుందా! మనం ప్రతిరోజూ పనిచేసే ఆఫీసులన్నీ రాహుకాలం చూచే తెరుస్తారా! లేదే! పూర్వకాలంలో విద్యావంతులైన పండిత బ్రాహ్మణవర్గానికి శారీరిక శ్రమ చేసి సంసార పోషించుకొనే శక్తి, సమయమూ వుండేవికావు. ఏ మనిషికైనా ఒక సమయంచెప్పి ఆ సమయాన్నే పని ప్రారంభిస్తే మంచి జరుగుతుందని నమ్మకం కల్గిస్తే ఆ నమ్మకమే అతనిని విజయవంతుని చేస్తుంది. చైత్రమాసం శుభకార్యాలకు మంచిదనీ; ఆషాఢమాసం ఏ శుభకార్యానికీ పనికిరాదని చెప్పటంలో ఒక ప్రయోజనం వుంది. పొలం పనులు చేసుకోవల్సిన సమయాల్లో పెండ్లి పనులు పెట్టుకోవటం మంచిది కాదు గదా!

✦☆✦

గ్రంథాలయ 21120

అక్క - మేనత్త - మేనమామ బిడ్డల్ని వివాహమాడవచ్చా?

అక్క కూతురిని, మేత్త కొడుకుని, మేనమామకూతుర్ని పెండ్లి చేసుకొనే పద్ధతి ఆంధ్ర - కర్ణాటక - తమిళనాడుల్లో మాత్రమే వుంది. ఉత్తర భారత దేశంలో ఈ సంప్రదాయం లేదు. అంటే ఈ సంప్రదాయం ద్రావిడ సంప్రదాయ మేగాని ఆర్య సంప్రదాయం కాదని తెలియవస్తోంది.

అయితే; అర్జునునికి సుభద్ర మేనమామ కూతురు! శ్రీకృష్ణుని అష్టభార్య లలో ఒకరైన 'భద్రాదేవి' కృష్ణుని మేనత్త శృతకీర్తి కుమార్తె! ఈ విధంగా చూస్తే ఆర్యులలో ఈ సంప్రదాయం వున్నట్లే గదా! కాని మహాభారత యుద్ధా నంతరం ఈ వరుసలు ఆర్యుల్లో మాసిపోయాయట! కృష్ణునివల్ల భద్రాదేవికి పుట్టిన పదిమంది సంతానం మూర్ఖులైపోయారనీ, సుభద్ర మేనత్త కొడుకుని చేసుకోవటం వల్లనే అభిమన్యుడు అర్ధాయుష్షుతో మరణించాడనీ; ఇప్పటికీ ఉత్తరభారతంవారు నమ్ముతారు.

> దగ్గర సంబంధాలు చేసుకోవటం వల్ల భార్యాభర్తల్లో అనురాగం వుండదు. కామప్రేరేపణాశక్తి కూడా బలహీనంగా వుంటుంది. దగ్గర సంబంధాల ఆలుమగలకు పుట్టే బిడ్డలు మందమతులు గానూ, అవయవలోపం గలవారు గాను, అ విద్యావంతులుగానూ వుంటారని పరి శోధకులు చెబుతు న్నారు.

తల్లి తరపున ఏడు తరాలు, తండ్రి తరపున ఏడుతరాలు వదలివేసి వివాహ సంబంధం కుదర్చాలని 'ధర్మసింధు' చెబుతున్నది. మనువు కూడ ఈ విషయాన్ని బలపరిచాడు. కాని, మన బిడ్డ మనకళ్ళ ఎదురుగా వుండా లనీ, ఆస్థిపాస్తులు పరాయి వారికి చెంద రాదనీ ఆలోచించి స్వార్ధ బుద్ధితో అక్క బిడ్డను పెండ్లి చేసుకోవటం, మేనత్త కూతుర్ని చేసుకోవటం జరుగుతూ వుంది. ఇది తప్పు.

అపరిచిత స్త్రీ పురుషుల్లో అనురాగమేకాదు, అవగాహన కూడా వుంటుంది. అంటే, నూటికి నూరుశాతం ఈ విధంగానే వుంటారని కాదుగాని ఎక్కువశాతం

దంపతులు సుఖంగా వుంటారని చెప్పవచ్చు! ఒక్క ఆరోగ్య విషయంలోనే కాదు; ఆర్థిక విషయాలలో గానీ, గౌరవ ఆదరాల విషయంలో గానీ, ఏ రకంగా ఆలోచించి చూచినా అక్కకూతురిని చేసుకోకపోవటం మంచిదిగా కన్పిస్తోంది. అలాగే మేనత్త కూతుర్ని, మేనత్త కొడుకునీ, తరువాత మేనమామ కూతుర్ని పెండ్లి చేసుకోక పోవటం కూడా మంచిది.

చాలామంది పెద్దవారికి కూతురి బిడ్డ అయితే తమను అభిమానంగా చూస్తుందనీ, వృద్ధాప్యంలో ఆదరిస్తుందనీ, పిచ్చి ఆలోచనలు చేస్తారు. ఇదంతా తప్పు. కోడలుగా వచ్చిన కూతురి బిడ్డ ఏంచేసినా సర్దుకుపోతాం. పాపం తెలియదులే అని మన్నిస్తాం. అదే పరాయి బిడ్డ కోడలిగా వస్తే ప్రతాపం చూపిస్తాం. పరాయి కుటుంబాన్నుండి వచ్చిన కోడల్ని కూతురులా చూచుకో గల్గితే, మనల్ని ఏ కోడలైనా ప్రేమగానే చూస్తుంది. అభిమానిస్తుంది. గౌరవిస్తుంది.

✦☆✦

రామాయణ - భారత కథలు యదార్థమా?

ఇటువంటి అనుమానాలను 'అగ్నాస్టిసిజం (అజ్ఞేయవాదం) అంటారు.

తరతరాలనుండి వేలాది సంవత్సరాలనుండీ మన భారతీయ జీవనంలో భాగమైపోయిన రామాయణ భారతాలను నమ్మాలా! వద్దా! అంటే ఇదమిద్ధంగా చెప్పటం కొంచెం కష్టమే. ఈ రెండూ ఇతిహాసాలే.

ఏ విషయమూ విమర్శలకు నిలబడదు.

హిందువులకు వున్నంత విమర్శనా స్వేచ్ఛ మరోమతానికి లేదు.

కొన్ని వందల సంవత్సరాలు క్రైస్తవులైన ఆంగ్లేయుల పాలనలోనూ వేల సంవత్సరాలు మహమ్మదీయుల పాలనలోనూ బ్రతుకు గడిపిన భారతీయులకు మతాభిమానం సన్నగిల్లి పోయిందేమో!

రామాయణంలో ఎక్కడా రాముడు తాను పర మాత్ముడనని చెప్పుకోలేదు. మనమే రామునిలోని సుగుణాలవల్ల రాముణ్ణి దేవుణ్ణిగా చేశాం. రామాయణ

రామాయణ భారతాలు హిందూ సంస్కృతిలో ఒక భాగం. ఏ స్థితిలోనూ, ఏ పరిస్థితిలోనూ హైందవ జన జీవనంనుండి వేరుకావటం జరగదు. రామాయణ భారత కథలు నిజమైనా అబద్ధమైనా ఎవరికి వచ్చే లాభ నష్టాలు ఏమీ లేవు. మన బిడ్డలకు మనం రూపాయి నోట్ల కట్టలు మాత్రమే ఇవ్వం. ధనంతో పాటుగా సంస్కృతినీ సాంప్రదాయా లనూ, ఆచారా లనూ, ఆలోచనలనూ మన సంతతికి మనం కానుకగా ఇస్తాం. కొన్ని విషయాలు మనకు వంట బట్టాలంటే కొంత వయో పరిపక్వత కావాలి. కొన్నిటిని స్వాను భవంగా మాత్రమే తెలుసుకోవాలి. యువ రక్తానికి ధార్మిక సూక్ష్మలు, కర్మ సిద్ధాంతం, వేదాంతం ఇవి అర్థం కావు. "దేనికైనా సమయం రావాలి గదా" అంటుంటారు పెద్దవాళ్ళు. ఆ మాటకు అర్థం ఇదేనేమో!

కథను నమ్మక పోవటానికి కథలో ఎక్కడా అతిశయోక్తి కన్పించదు. అయితే పురాణాలు ఏవీ ఈనాటి హేతువాదానికి నిలబడవు. పురాణాలను నమ్మటమూనమ్మక పోవటమూ వారివారి వ్యక్తిగత విషయం. పురాణాల వుద్దేశ్యం మనిషిని మంచిదారికి నడిపించటమే నని మాత్రం అంగీకరించి తీరాల్సిందే.

మీకొక విషయం తెలుసా! అమెరికాలోని 16 రాష్ట్రాలలో దేవుడు లేడని ఎవరు ప్రచారం చేసినా, మత పద్ధతులు పాటించక పోయినా, మూడు వేలనుండి ముప్పైవేల దాకా జరిమానా విధిస్తారు. లేదా మూడు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తారు. సృష్టి సిద్ధాంతంలో విప్లవం సృష్టించటమే కాక జీవశాస్త్రపరిణామాన్ని నిర్వచించిన 'డార్విన్' కూడా బైబిల్‌లోని సృష్టి సిద్ధాంతాన్ని అంగీకరించాడంటే పాశ్చాత్యదేశాలలో మతానికున్న నిర్బంధం ఎంతటిదో మనం గుర్తించవచ్చు!

మహాభారత కథ విషయానికివస్తే ఉత్తర భారతదేశంలో ఈ నాటికీ సాక్ష్యాలు వున్నాయి. కురుక్షేత్రం వుంది. పాండవుల అంతఃపురాలున్నాయి. కర్ణ దుర్యోధనుల మందిరాలున్నాయి. సముద్రంలో మునిగిపోయిన శ్రీకృష్ణుని

ద్వారకానగరం మొన్నమొన్న కనుగొన్న శ్రీ రాముని లంకావారధి విషయం అందరికీ తెల్సిందే.

'మహాభారత యుద్ధంలో పందొమ్మిది లక్షల అరవైఎనిమిదివేలమంది సైనికులు పాల్గొన్నారా? కురుక్షేత్రయుద్ధానికి ముందు శ్రీకృష్ణుడు అర్జునునికి అన్నివందల శ్లోకాలు బోధించాడా? మంత్రాలతో అస్త్రాల్ని ప్రయోగించారా! చిటికెనవ్రేలిమీద కృష్ణుడు గోవర్ధనగిరిని ఎత్తి నిలిపాడా?' ఇటువంటి ప్రశ్నలు వేసేవారికి మహాభారతహృదయం అర్థం కాదు. ఏ కవి అయినా ఒక విషయాన్ని కావ్యరూపంలో చెప్పాల్సినపుడు కొంత అతిశయోక్తిని కలపక తప్పదు. 'ఆమె ముఖం చంద్రబింబంలా వుంది' అంటే గుండ్రంగా బంతిలా వుందని కాదు. ఆహ్లాదకరంగా వుందని అర్థం. కథాగమనంలో కొన్ని సందర్భాల్లో అతిశయం మితిమీరినా తప్పుగాదంటారు లాక్షణికులు.

ప్రతిజీవిలోనూ దైవశక్తి (పరమాత్మ) వుందంటుంది వేదం.

'దైశక్తిని' అందరూ ప్రదర్శించలేరు.

వ్యాసుడు మహాభారతాన్ని వ్రాయబోయే ముందుగా ఒకమాట చెప్పాడు. "ఈ మహాభారత కథను ఎవరు ఏ విధంగా చూడగలుగుతారో వారికి ఆ విధంగానే కనబడుతుంది" అని! మహాభారతాన్ని నమ్మగూడని విధంగా చూస్తే నమ్మరాని కథలాగే కన్పిస్తుంది. తెలుగు భారతాన్ని వ్రాయబోయేముందు 'నన్నయ' కూడా ఈ మాటనే చెప్పాడు.

"యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్"

మహాభారతంలో వుండనిది ఎక్కడా వుండదు. లేనిదెక్కడా లేదు. అందుకే భారతాన్ని పంచమవేదంగా పరిగణించారు మహాపండితులు.

రామాయణంలోని రావణుడు సామాన్యుడుకాదు. పులస్త్యబ్రహ్మకు మనుమడు; విశ్వావసుబ్రహ్మకు పుత్రుడు; వేద వేదాంగ విద్యాపండితుడు; రాజనీతి దురంధరుడు; అకలంక శివభక్తుడు; సంగీత శాస్త్ర కోవిదుడు. ఇటు వంటి మహాధీశాలి కాముకుడు కావటం వల్లనే సర్వనాశన మయ్యాడు. "పరస్త్రీ ప్రియత్వం నాశన హేతువు" అన్న నీతి మనకు తెలుస్తోంది.

రామాయణకాలంలో బహుభార్యా పద్ధతి సర్వసహజంగా వుండేది. ఆ స్థితిలో కూడా ఏకపత్నీ వ్రతానికి కట్టుబడ్డాడు రాముడు. ఏ తప్పూ చేయకనే తండ్రిమాట కోసం పధ్నాలుగేండ్లు దారుణ అరణ్యవాసం అనుభవించాడు. ఇది నీతి కాదా!

మహాభారతం కూడా మనకెన్నో నీతిపాఠాలు చెబుతుంది. ఎంత బుద్ధిమంతునికైనా వ్యసన పరిచయం వుంటే ధర్మరాజులా జూదరిగా మారి సర్వసర్వాన్నీ పోగొట్టుకోవల్సి వస్తుంది. కాబట్టి వ్యసనాలు మంచిదికాదు. అని తెలియ చెబుతుంది. దాయాదులు ఎప్పుడూ స్నేహంతో వుండాలి గాని పగలు ప్రతీకారాలకు దిగితే దుర్యోధనునిలా నాశనమై పోవల్సిందేనన్న నీతి పాఠం మనకు బోధపడుతుంది. ధృతరాష్ట్రునివంటి అతిపుత్ర ప్రీతిగల తండ్రులు చివరకు పిండంవేసే దిక్కు కూడా లేకుండా పోతారనీ అతిప్రేమ మంచిది కాదని చెబుతుంది భారతం. బ్రాహ్మణుడైనవాడు సర్వజనహితం కోసం బ్రతకాలి. కాని సుఖాలకోసం శాస్త్రాలను వదలి శస్త్రాలను పట్టకూడదని ద్రోణాచార్యుని విషయంలో తెలుసుకొంటాం. తొమ్మిదివందల సంవత్సరాల తన జీవితకాలంలో ఏడువందల యాభై సంవత్సరాలు విద్యార్జనకోసం వెచ్చించిన భీష్మునివంటి వీరుడైనా సరే చెడుకి అండగా నిలబడితే శిఖండి వంటి అల్పుడుకూడా చంప గలడన్న నీతిని బోధిస్తున్నది. ఎన్నో దివ్యాస్త్రాలు కలిగియుండి మహాశక్తిమంత డైన అర్జునుడు కూడా కృష్ణుని యుక్తి లేకుంటే విజయుడయ్యేవాడు కాదు. మనిషికి కేవలం శక్తి మాత్రమే చాలదు యుక్తి కూడా వుండాలి అని భారతం మనకు చెబుతుంది. భీముని విషయంలో కూడా ఇదే నీతి వర్తిస్తుంది. మహా వీరుడైన కర్ణుడు కూడా చెడుస్నేహం వల్లనే చెడిపోయాడు గాని లేకుంటే కర్ణుడు మరొక సూర్యునిగా వెలుగొందేవాడన్న నీతి మనకు తెలుస్తుంది.

ద్రౌపది ఐదుమందికి భార్యయైవుండి కూడా అందరినీ సమస్థితిలోవుంచి అందరి మన్ననలందుకొంటూనే సమయం వచ్చినపుడల్లా భర్తలను రెచ్చగొడుతూ కౌరవద్వేషాగ్నిని చల్లారకుండాజేసి వస్త్రాపహరణంనాటి పగను దీర్చుకొన్న వీరపత్ని పాంచాలి నేర్పు ఓర్పు భారతీయ మహిళకు ఆదర్శం కాదా!

తనకు తెల్సిన సగం పాండిత్యాన్ని సంపూర్ణ పండితత్వంగా భావించుకొని పద్మవ్యూహంలోకి పరుగులు తీసిన అభిమన్యుని మరణం, గర్వం సర్వసమయ హితం కాదన్న నీతిని తెలియజేయటం లేదా! ఇక కీచకుని విషయానికి వస్తే; పరిచారికా వృత్తిలో వున్న ద్రౌపది వివాహితయని తెల్సికూడా ధనమదంతో గృహపరిచారికను అనుభవించబోయి కుక్కచావు చావటం నీతి కాదా. రక్షించవల్సిన యజమాని భక్షించచూస్తే నీచమరణం తప్పదని హెచ్చరించటం ఎంత గొప్పనీతి! ఇదే విధంగా విదురనీతులు - సంజయరాయభారం - భీష్మహితం - భగవద్గీత - ఎన్నెన్నో ధర్మాలు ఎన్నెన్నో సత్యాలు, ఎన్నెన్నో నీతులు, మనకు తెలియపరుస్తుంది శ్రీమహాభారతం. మహాభారతమంటే ఒక్క కురుపాండవుల కథమాత్రమే కాదు. ఇందులో వందలకొద్దీ అనేక ఉపకథలు వున్నాయి. ఎన్నో జీవన సందేశాలు వున్నాయి. రాజధర్మాలు గృహధర్మాలు సామాజిక ధర్మాలు సేవాధర్మాలు ఎన్నో చర్చించబడ్డాయి గాబట్టే మహాభారతం పంచమవేదం అయింది.

అక్రమ సంతానంవల్ల సమాజానికి అపకారం జరుగుతుందని కుంతీదేవికి పుట్టిన కర్ణుని ద్వారా మనకు విశదపడుతుంది. భారతయుద్ధం కర్ణుని కారణం గానే జరుగుతుంది. "కర్ణం వినా భారతం నాస్తి" అంటారు పెద్దలు.

ఈనాడు కాకపోయినా మరోనాటికి "తల్లిదండ్రుల్ని ఎందుకు గౌరవించాలి కామసుఖంకోసమే మమ్మల్ని కన్నారు గాబట్టి ఎందుకు పూజించి గౌరవించాలి? పుట్టిన బిడ్డల్ని కుక్కలు పందులు కూడా పెంచుతాయి. అలాగే మమ్మల్ని కూడా పెంచారు. అంతే"! అని ఈనాటి యువలోకం ప్రశ్నిస్తుందేమోనని మనసులో కలవరంగా వుంది.

" ఓ భగవాన్ ! నావారిని రక్షించు!"

✦☆✦

పెండ్లిని 'పాణిగ్రహణం' అంటారెందుకు?

కాలక్రమంలో వివాహానికీ, వివాహ పవిత్రతకూ విలువలు క్షీణిస్తున్నాయి. అర్థాలు మారిపోతున్నాయి. వివాహాన్ని పవిత్రవిధిగా ఎవరూ పాటించటంలేదు. లైంగిక జీవితానికి లైసెన్స్‌గా మారిపోయింది వివాహం.

'పెండ్లి' అనే తెలుగుపదానికి 'వివాహం' అనే సంస్కృతపదం సరైనది కాదు. 'పాణిగ్రహణం' అనే పదమే సరైన అర్థాన్ని యిస్తుంది. 'వాహ' అనే సంస్కృతశబ్దం నుండి "వివాహ" అనే పదం పుట్టింది. వివాహం అంటే సంస్కృతంలో 'ఎత్తుకుపోవటం' అనే అర్థం అన్నమాట. పెండ్లికుమార్తెను వరుడు తన యింటికి తీసికొనిపోయే తతంగాన్ని వివాహం అంటారు. వివాహానికి 'ఉద్వాహము' 'పరిణయము' 'ఉపయామము' 'పాణిగ్రహణము' అనే పేర్లు కూడా వున్నాయి. కల్యాణం అని కూడా వ్యవహరిస్తుంటారు.

"కులమగ్రే పరీక్షేత మాతృతః పితృతశ్చేతి" అంటే ఏడుతరాలు తండ్రి వంశీయులతోనూ, ఆరుతరాలు తల్లి వంశీయులతోనూ రక్త సంబంధం లేని స్త్రీ పురుషుల మధ్యనే వివాహం జరగాలి. వధూవరులు ఒకే గోత్రానికి చెందిన వారు కాకూడదు. అలా వున్నపుడే మంచి సంతతి కలుగుతుంది.

పదహారు వివాహ విధులు తప్పనిసరిగా చేయాలి 1. వరాగమనం 2. స్నాతకం 3. మధుపర్కం 4. మంగళస్నానం 5. గౌరి/గణపతిపూజ 6. కన్యావరణం 7. కన్యాదానం 8. సుముహూర్తం 9. మంగళసూత్రధారణ 10. తలంబ్రాలు 11. హోమం 12. పాణిగ్రహణం 13. సప్తపది 14. నక్షత్ర దర్శనం 15. స్థాలీపాకం 16. నాగవల్లి. ఈ పదహారు కార్యక్రమాలలో పాణిగ్రహణం సప్తపది అతిముఖ్యమైనవి. వేదధర్మ ప్రకారంగా మాంగల్య ధారణకు అంతగా ప్రాముఖ్యత కనిపించటంలేదు.

శ్రీరాముని కాలంలోనూ, శ్రీకృష్ణుని కాలంలోనూ మాంగల్యధారణ లేదు.

అసలు బంగారపుతాళి లేనేలేదు. తాళి అంటే తాటి ఆకుతో తయారుచేసే రూపాయి బిళ్ళ అంతటి ఆభరణం అన్నమాట. కాలక్రమేణ తాటిఆకు పోయి బంగారం వచ్చింది. బెంగాలీలు అసలు తాళినే కట్టరు. వివాహానికి పాణి

గ్రహణం ముఖ్యమైనది. తరువాత సప్తపది ముఖ్యమైనది. మంగళసూత్రం 11వ శతాబ్దినుండి మాత్రమే మొదలైంది.

"గృహ్ణామి తే సుప్రజాస్త్వసాయహస్త మయాపత్యా జరదష్టిర్యథాసహా" అని పాణిగ్రహణ మంత్రం. వరుడు తనకుడిచేతితో వధువు కుడిచేతిని పట్టు కొంటాడు. మొదట పుట్టబోయే బిడ్డ అబ్బాయి కావాలంటే వరుడి కుడిచేతి బొటనవ్రేలు పట్టుకోవాలి. అమ్మాయి కావాలంటే చూపుడువ్రేలు పట్టుకోవాలి. వరుడు ఆనాడు పట్టుకొన్న చేతిని జీవితాంతం వదలకూడదు.

వివాహ పురోహితుడు పండితుడై, వినయవంతుడై, సత్ప్రవర్తన గలవాడై, ధార్మికుడై, ధనాశ లేనివాడై వుండాలి. అపుడే శుభవివాహం అవుతుంది.

✦☆✦

కలలు ఎందుకొస్తాయి ! కలలు నిజమౌతాయా?

మనిషి మనోభావాలకు సక్రమ, అక్రమ రూపాలే కలలు! ఊహాలోకాలలో జీవించేవారికీ, అతిగా ఆలోచించేవారికీ, సమస్యలతో వున్నవారికీ, అతి కాముకులకీ కలలు ఎక్కువగా వస్తాయంటారు మనోశాస్త్రజ్ఞులు.

మనిషి నిద్రపోతున్నపుడు కూడా హృదయ వ్యవస్థ తన పనిని తాను చేస్తూనే వుంటుంది. నిద్రలో తనకు తెలియకుండానే నిద్రాభంగిమలు మార్చు కొంటూ రక్తప్రసరణకు అవకాశం కల్పిస్తుంటాడు మనిషి. అంతర్గతంగా మనిషిలో వుండే ఆరవ పరిజ్ఞానం (సిక్స్‌సెన్స్) మనిషిని కాపాడుతూ వుంటుంది. తెల్లవారు ఝామున నాలుగు గంటలకు నిద్రలేవాలి అనుకొంటూ నిద్రబోతే సరిగ్గా నాలుగు గంటలకే మెలకువ వస్తుంది. ఇదే ఆరవ పరిజ్ఞానం పని.

కొన్ని కలలకు అర్థమే వుండదు. కొన్ని కలలు అసలు జ్ఞాపకమే వుండవు. కొన్ని కలలు చెప్పుకోవటానికే సిగ్గుగా వుంటాయి. కొన్ని ఆలోచించటానికే నీచంగా వుంటాయి. ఇటువంటి కలలన్నీ యదార్థమైపోతే మనిషి మనుగడ ప్రశ్నార్థకంగా తయారవుతుంది.

కలలు ఎప్పుడూ నిజం కావు.
ఒక్కొకసారి యాదృచ్ఛికంగా కలలో వచ్చినట్లు జరుగవచ్చు.
కలలను తలచుకొని భయపడటం తప్పు.

శరీరం బాగా అలసిపోయి, శ్రమించి నిద్రించేవారికి కలలు రావట! దైహిక శ్రమ లేని వారికి, అనారోగ్యంతో బాధ పడేవారికీ, అశాంతితో నిద్రించే వారికీ, ఒంటరితనాన్ని అను భవించేవారికీ, ఆర్థిక మానసిక, సామాజిక సమస్యలున్న వారికీ, జీవితంలో సెక్స్ సుఖాలకు దూరమైనవారికీ, ఎక్కువగా కలలు వస్తుంటాయి.

కలలు కల్లలేగాని నిజంకాదు.

కలలో ఒక్కొకసారి మనం చని పోయినట్లు, లేదా మనం హత్యచేసి పోలీసులకు దొరికిపోయినట్లు, మనల్ని ఎవరో దుర్మార్గులు వెంటాడుతున్నట్లు, మనమీద ఏదో మహానేరం మోపబడి నట్లు, మహా సముద్రంలో పడి మునిగి పోతున్నట్లు, భయంకర విషసర్పాలు నోరు తెరుచుకొని మనల్ని వెంబడిస్తున్నట్లు, కొండమీదనుండి భయంకరమైన లోయ లోనికి పడుతున్నట్లు ఎన్నెన్నో కలలు వస్తుంటాయి. నిద్రాభంగం జరుగు తుంది. నోరు ఎండిపోతుంది. భయంతో మనసులో దేవుడ్ని తలచుకొంటూ, ఆంజనేయదండకం చదువుకొంటూ నిద్ర బోతుంటాం. ఇది అందరికీ మామూలు అనుభవమే.

ఎక్కువగా కలలు వచ్చేవారు ఒంటరిగా మంచంమీద నిద్రించకూడదు. తోడుగా మరొకరిని ప్రక్కన పరుండబెట్టుకొంటే కలలు రావు. ఒంటరితనం లోనూ, అభద్రతా భావనలోనూ మనస్సు కీడును శంకిస్తుంది. ఎక్కువగా ఒంటరితనం అనుభవించేవారు హాయిగా నిద్రపోలేరు. మరొక రహస్య విషయం ఏమంటే సెక్స్‌సుఖాలు ఎక్కువగా అనుభవించేవారికి కలలు రావంటారు మనోవిశ్లేషకులు.

✦☆✦

సమాజం నాలుగు వర్ణాలుగా ఎందుకు అయింది?

"చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః" 4-13 - భగవద్గీత

గుణముచేతను, కర్తవ్యముచేతను మానవ సమూహాన్ని నాలుగు భాగములుగా నారాయణ స్వరూపుడనైన నేనే సృష్టించాను అంటాడు శ్రీకృష్ణుడు. బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్య-శూద్రవర్ణాలుగా విభజింపబడ్డ సమాజం ఈనాడు ఎన్నో వర్గాలుగా మారి పోయింది.

> బ్రాహ్మణునికి పుట్టినవాడు బ్రాహ్మణుడు కాదు! శూద్రునికి పుట్టినవాడు శూద్రుడు కాదు! శూద్ర బ్రాహ్మణ గుణాలు పుట్టుక వల్ల సంక్రమించవు. సగం గుణాలు పరిసర ప్రభావంవల్ల, సగం గుణాలు పెంపకంవల్ల మనిషికి సంక్రమిస్తాయి. పుట్టుక వల్ల ఎవడూ బ్రాహ్మణుడు కాదు; ఎవడూ శూద్రుడు కాదు.

చతుర్వర్ణ విభజన ప్రకారం సాత్విక గుణమున్నవారిని బ్రాహ్మణులుగా, రజోగుణ మున్నవారిని క్షత్రియులుగా, రజోగుణ తమోగుణ మున్నవారిని వైశ్యులుగా, కేవలం తమోగుణమున్నవారిని శూద్రులుగా సమాజ పుద్ధారణకోసం, కర్తవ్య నిర్వహణ కోసం నాలుగు విభాగాలుగా విభజించటం జరిగిందని స్మృతులు, పురాణాలు చెబుతున్నాయి.

ఈ నాలుగు వర్ణాలవారు ఒక సమూహం లేదా ఒక వర్గంవారే!

ఒక తండ్రి బిడ్డలే అందరూ.

ఇపుడు మనమందరం జన్మవర్ణాన్నీ, లేదా జన్మకులాన్నీ అనుసరించి కులధృవీకరణ చేసుకొంటున్నాం. ఇది తప్పు. నీవు ఏ కులంవాడివైనా విచార వినిమయ జ్ఞానాన్ని స్వంతం చేసికొనగలిగితే బ్రాహ్మణత్వాన్ని పొందవచ్చు. బ్రహ్మత్వసిద్ధిని పొందవచ్చు. దీనికి ఎవరి అనుమతీ అవసరంలేదు. కుల మార్పిడికీ, మతమార్పిడికీ ఏ చట్టమూ అభ్యంతరం చెప్పటానికి వీలులేదు. అయితే వచ్చిన చిక్కు ఏమిటంటే బ్రాహ్మణులు క్రైస్తవులుగా మహమ్మదీయులుగా మారుతున్నారేగాని, శూద్రులు బ్రాహ్మణత్వానికి మారటానికి సిద్ధంగా లేరు.

ఎందుకని ? ? ?

శూద్రులు బ్రాహ్మణులుగా కాలేరా? కాగలరు !

మరెందుకు కావటం లేదు?

పూర్వకాలపు రుషులందరూ బ్రాహ్మణ వర్ణంవారు కాదు.

అయితే మరి; అభ్యంతరం ఏమిటి?

ఒకప్పుడు, అగ్రవర్ణమైన బ్రాహ్మణవర్ణం ఇపుడు భగ్నవర్ణంగా మారి పోయింది. రాజకీయ అవకాశాలు, ఉద్యోగాలు, రిజర్వేషన్లువంటి జీవ నావకాశాలు బ్రాహ్మణుల కిపుడు లేవు. అర్థంలేని ఆచారాలకు అంటుకు పోయారే గాని అవసరమైన ఆలోచనలు అలవర్చుకోలేదు. భోజన ప్రియత్వానికి అలవాటు పడ్డారేగాని బహుజన ప్రియులు కాలేకపోయారు.

బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య వర్ణాలవారు ఆనాటినుండి ఈనాటివరకూ అలాగే వుండిపోయారు. శూద్రవర్ణంవారే రకరకాలుగా విడిపోయి వందలకొద్దీ కులాలుగా అయ్యారు. ఒకనాటి అగ్రవర్ణమైన బ్రాహ్మణులు ఇపుడు మైనారిటీలుగా మార్పుచెందితే, శూద్రవర్ణమైన కమ్మ - రెడ్డి మొదలైనవారిపుడు అగ్రవర్ణంగా మార్పుచెంది (అభివృదిచెందిన వర్ణంగా మార్పుచెంది) వివక్షకు గురిఅవుతున్నారు. ప్రస్తుతం సమాజంలో గతంకన్నా ఇపుడే కులవివక్ష పెరిగిపోయింది.

వర్ణపద్ధతిపోయి కులపద్ధతి పెరిగిపోతూ వుందిప్పుడు.

దాదాపు మూడువేల సంవత్సరాలనాడు మనకు 'వర్ణపద్ధతి ప్రారంభ మయింది. 2500 సంవత్సరాలనుండి' కులపద్ధతి మొదలైంది. ఆదిలోనే వర్ణపద్ధతికి బదులుగా 'వృత్తిపద్ధతి' పెట్టివుంటే ఎలా వుండేదో ఏమో!

హిందువులలో నాలుగు తెగలు వున్నట్లుగానే క్రిస్టియన్స్‌లో రెండు తెగలు వున్నాయి. ముస్లిం మతంలో రెండు తెగలు వున్నాయి. మతవ్యాప్తికోసం ఏనాడూ యుద్ధాలు చేయని మతం హిందూమతం ఒక్కటే. ఇతర మతం తమ మతవ్యాప్తి నిరంతరంగా సాగటంకోసం వేలకువేలకోట్లు ఈనాటికీ ఖర్చుచేస్తోంది. ఎన్నెన్ని కోణాల్లోనుండి చూచినా హిందువులకు మత పిచ్చి చాలా తక్కువని తెలుస్తొ

వుంది. విశ్వహిందూపరిషత్ - శివసేన - భజరంగదళ్ భారతీయ జనతా పరివార్ (పార్టీ) లాంటివారు తప్ప మెజారిటీ హిందూ రాజకీయ పార్టీలకు హిందూ మతాభిమానం తక్కువని అంగీకరించవల్సిందే.

మన సమాజం నాల్గు వర్ణాలుగా ఎలా అయ్యిందో చూద్దాం.

ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములున్నారు. పెద్దవాడు విద్యావంతుడై వుద్యోగంలో చేరాడు. రెండవవాడు రాజకీయవేత్తగా మారి మంత్రి అయ్యాడు. మూడోవాడు వ్యాపారాలు చేస్తూ డబ్బుగడించాడు. నాల్గవవాడు వ్యవసాయవృత్తితో రైతుగా స్థిరపడిపోయాడు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు నాలుగు మార్గాలుగా స్థిరపడటంవల్ల ఒక్కొకరికి ఒక్కొకరకమైన మర్యాదలు లభించాయి. మొదటివాడు విద్యావంతుడు కావటంవల్ల గౌరవం లభించింది. రెండవవాడు రాజకీయ చతురుడు కావటం వల్ల అధికారం దొరికింది. మూడోవాడు వ్యాపారవేత్త కావటంవల్ల శ్రీమంతుడయ్యాడు. ఆఖరివాడు కృషికార్మికుడుగా అన్నదాతగా వుండిపోయాడు. ఈ నలుగురిలో ఎవరు గొప్ప? ఈ నలుగురూ గొప్పవారే! (1) విద్యలేకపోతే విజ్ఞానం వుండదు. విజ్ఞానం లేకపోతే సుఖాలు దొరకవు. (2) అధికారం లేకుండా రక్షణ వుండదు. రక్షణ లేనపుడు ఏంవున్నా నిష్ప్రయోజనమే. (3) వ్యాపార ప్రక్రియ లేకుంటే రకరకాల వస్తువులు ఆహారధాన్యాలు ఒక్కచోట దొరకవు. అన్ని ఆహార వస్తువులు లభించకుంటే ఉప్పుకారం పులుపు వంటి రుచులు ఏమీ వుండవు. (4) ఆహార వస్తువులే పండించకపోతే విద్య, అధికారం, డబ్బువల్ల వుపయోగం ఏమీ వుండదు. తిండివుంటే కండ వుంటుంది. పంటలు పండించకపోతే మళ్ళీ మనం ఆదిమానవులుగా మారిపోతాం. నలుగురూ వుండాలి కాబట్టే నాలుగువర్ణాలు!

ఈ నలుగురు అన్నదమ్ములే నాలుగు వర్ణాలవారన్నమాట.

పరమోద్దేశంతోనే వర్ణవిభజన జరిగింది. కాని విద్యావంతులైన బ్రాహ్మణ వర్ణం వారికి బలపరాక్రమవంతులైన క్షత్రియ వర్ణం బాసటగా నిలబడటంతో అవిద్యావంతులైన శూద్రవర్ణం, అగ్రవర్ణం వారికి తలవంచి నిలబడక తప్ప లేదేమోననిపిస్తున్నది. ఈ సమయంలోనే అసమానతలు చోటు చేసుకొన్నాయి.

మానవాభివృద్ధికోసం ప్రారంభమైన వర్ణాశ్రమధర్మం ముళ్ళకంపలా మారిపోయి రక్షించినవారి కాళ్ళకే గ్రుచ్చుకోవటం జరిగింది. సమాజాన్ని చైతన్యవంతం చేయాల్సిన ఆనాటి విద్యావంత గణం కృషి శ్రామిక వర్గానికి క్షమించరాని అపకారం చేసింది. ఆదికాలంలోనే అందరికీ విద్యా విజ్ఞానరంగాల్లో సమానావకాశాలు కల్పించివుంటే భారతదేశం ఇప్పటిలా దీనంగా వుండేది కాదు. ప్రపంచమే భారతీయులకు జేజేలు చెప్పివుండేది. భరద్వాజ మహర్షి రచించిన వైమానిక శాస్త్రం - ఆర్యభట్టు ఖగోళ శాస్త్రం చాణుక్యుని అర్ధశాస్త్రం - విష్ణుశర్మ నీతిశాస్త్రం ప్రపంచ ఖ్యాతి పొందేవి.

సమాజ ఉన్నతికోసం సృష్టించబడిన వర్ణధర్మం హిందువుల్ని భాగాలు చేసింది. దీనివల్ల హిందువులకు అంతర్గత శత్రుత్వం వచ్చింది. స్వంత అన్న దమ్ములు దాయాదులయ్యారు. ఫలితంగా వందలాది కులాలు పుట్టాయి. వేలాది దేవుళ్ళు సృష్టింపబడ్డారు. వర్ణాలు కులాలుగా మారిపోయి కులాలు శాఖలుగా మారిపోయి ఆత్మసంబంధీకులమధ్య అడ్డుగోడలు వెలిశాయి.

"ఏ దేశచరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం"

- శ్రీశ్రీ.మహాప్రస్థానం

జరిగిందేదో జరిగింది.

గతం త్రవ్వుకొని ఏడిస్తే ఒరిగేదేముంది! కలిగేదేముంది!!

మనముందు ఎంతో భవిష్యత్తు వుంది. గతం మరచిపోదాం! వర్తమానాన్ని ఆలోచిద్దాం! కులపు కోటల్ని పడగొట్టి నవశకానికి దారివేద్దాం! 'మనం హిందువులం. మనం బంధువులం' అన్న నినాదాన్ని జగతికి వినిపించుదాం!

ముదిమివచ్చి చేవచచ్చిన పాతవారిని పక్కనబెట్టి
సమ సమాజ సమున్నతికి శ్రమిద్దాం పదండోయ్ పదండి !!

చీకటిని తిట్టుకొంటూ కూర్చోవటంకన్నా, చిరుదీపం వెల్గించటం మంచిదికదా!

"స్వధర్మేనధనం శ్రేయః పరధర్మో భయావహః"

అన్నట్లుగా ఐహిక సుఖాలనిచ్చే పరధర్మంకన్నా ఆముష్మిక సుఖాలనిచ్చే స్వధర్మం గొప్పది. మన స్నేహితుని తల్లి అందంగా వున్నంత మాత్రాన అందం లేదని మన కన్నతల్లిని అసహ్యించుకోగలమా! మనకు జన్మనిచ్చిన తల్లి మనకు దైవసమానం కదా!

మనతల్లిని మనం గౌరవించుదాం

మన తల్లిభాషను మనం ప్రేమించుదాం

జై హిందూస్థాన్

జై భరత మాతా!

✦☆✦

రాముడు సీతను పరిత్యజించటం న్యాయమా?

రాముడిపుడు లేడు. వుండివుంటే "నా పెళ్ళాం నా యిష్టం" అనేవాడేమో!

అవును గదా!

కాదు! కాదు! రాముడు అలా అని వుండేవాడు కాదు! అనేవాడుకాదు!

భారతీయ జనజీవితంలో కల్సిపోయినవాడు శ్రీరాముడు.

శ్రీరాముడు తాను దైవాంశ సంభూతుడనని ఎక్కడా చెప్పలేదు. చతుస్సముద్ర ముద్రితమైన రఘువంశ కీర్తికి తనవల్ల మచ్చ వస్తుందని, జననిందకు భయపడిన సకల గుణాభిరాముడు శ్రీరాముడు! ప్రజారాముడు! సీతారాముడు!

సీతా పరిత్యాగంలోని ధర్మాధర్మాలను చూద్దాం.

త్రేతాయుగంలో బహుభార్యత్వం సర్వసామాన్యంగా వుండేది. "రాజానో బహు వల్లభాః"! రాజులకు ఎంతమంది స్త్రీలనైనా వివాహమాడగల సామాజిక ధర్మంకూడా ఆనాడు అమలులోవుంది. శ్రీరాముని తండ్రి దశరథుడు బహు భార్యాత్వం వున్నవాడే! అయినా శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడు. 'ఏక పత్నీవ్రతం' అంటే ఒకే స్త్రీని భార్యగా పొంది జీవితాంతం ఆమెతోనే జీవించాలన్న నియమం

కల్గివుండటం అన్నమాట! ఇంతటి కఠోర నియమం పెట్టుకొన్న రాముడు ప్రాణాధికంగా ప్రేమించే సీతను ఎందుకు పరిత్యజించాడు?

ఏ సీతకోసం సుగ్రీవునితో స్నేహంచేసి, వాలిని వధించి, లంకకు వంతెన నిర్మించి, రావణ కుంభకర్ణాదులను వధించి, అష్టకష్టాలను అడవిలో అను భవించాడో; ఆ సీతను రాముడెందుకు పరిత్యజించాడు?

మహారాజైనా, మామూలు మనిషైనా సమస్త సుఖభోగాలనూ కీర్తి ప్రశంస లనూ, ధర్మార్థాది పురుషార్థాలనూ భార్యతో కలసి అనుభవించాలను కొంటాడు. ఎన్ని పాపకార్యాలు చేసి అయినా భార్యను సుఖపెట్టాలని భావిస్తుంటాడు. మానవనైజాన్ని కాలదన్ని రాముడెందుకు సీతను పరిత్యజించాడు?

సీతా శీలంపై రామునికి అను మానం వుందా! రామునికి సీతపై ఆదరాభి మానాలు లేవా! రాముని విషయంలో సీత అవిధేయురాలా! మరెందుకు రాముడు సీతను పరి త్యజించాడు?

రాముడు తన కుటుంబానికి మాత్రమే చెందినవాడు కాదు. సమస్త ఆర్యసమాజానికి చెందిన ప్రజా రాముడు. రఘువంశానికి ఎటువంటి కళంకం అంటుకొన్నాదానికి బాధ్యుడు రాముడే! కకుత్స్థుడు, రఘువృ, దిలీ పుడు వంటి పవిత్ర చరిత్రుల నిష్కళం కవంశానికి "భార్యా విమోహత్వం" అనే చెడ్డపేరు వస్తుందని సీతా పరి త్యాగానికి తలవంచాడు.

ఆ యుగంనాటి భార్యాభర్తలు ఈనాటి భార్యాభర్తలవంటివారు కాదు. ఆనాటి భార్యలు ధర్మార్థ కామ మోక్షాది పురుషార్థాలలో మాత్రమే భాగస్వాములు కాదు; భర్తకు చెందిన కీర్తి ప్రతిష్ఠలోనూ భార్యకు భాగ ముండేది.

భార్యను 'అర్ధాంగి' అనేకారణం ఇదే!

రాజైన ప్రతివానికీ రాముడే ఆదర్శం. పాలకులు ప్రజలను ఎలా పరిపాలించాలో, ప్రజాపాలనలో ఎంతటి ధర్మబద్ధత వుండాలో, ప్రజా భిప్రాయానికి ఎంతటి గౌరవ మివ్వాలో తెల్సుకోవల్సిన పాలకు లందరికీ రామాయణమే ఆదర్శం. అందుకే ఈనాటికీ 'రామరాజ్యం' అనే పేరును తలుచుకొంటూ వుంటాం!

'శ్రీరామరక్ష' అనే మాటను తీసివేయగలమా! నిన్నమొన్నటివరకూ 'శ్రీరాముడు మంచిరాజు' అనే వాక్యాన్ని తెలుగు కాపీ రాయించేవారు. ఇంగ్లీషు సంస్కృతి వచ్చిన తరువాత హిందూ సంస్కృతి సంపూర్తిగా చచ్చిపోయింది. సంజీవిని తెచ్చినా, అమృతం పోసినా ఇక బ్రతుకదు.

హిందూ సంస్కృతి సజీవంగా వుండాలంటే ఏదో మహత్తు జరగాలి!
ఏ దేవుడో మహాత్ముడై అవతరించాలి!

మనకు కాన్వెంట్‌లు రాకపూర్వం హిందువులు, క్రైస్తవులు మహమ్మదీయులు అందరూ ఒకే పాఠశాలలో కలసి చదువుకొనేవారు. హిందూ చరిత్ర అన్ని మతాలవారికీ కరతలామలకంగా వుండేది. అందువల్లనే కోస్తా ఆంధ్రాలో హిందూ, ముస్లిం అనే వ్యత్యాసమే కన్పించదు.

రాముడు ప్రజలకోసం తన భార్యను కూడా పరిత్యాగంచేశాడు గనుకనే భారతీయులకు దేవుడయ్యాడు. ప్రతిగ్రామంలోనూ గుడికట్టి దేవునిగా హారతులిస్తున్నారు. రాముడే సీతను పరిత్యజించకుండా జనాపవాదాన్ని భరిస్తూ రాజాహంకారాన్ని ప్రదర్శించి ప్రజలనోరు నొక్కి వున్నట్లయితే మామూలు మహరాజులా చరిత్రలో వుండేవాడేమో! కాని దేవుడిగా ప్రతియింటి గోడమీద ఫోటోలలో వుండేవాడు కాదన్నది నిత్యనిజం.

"రామో విగ్రహవాన్ ధర్మః".

ఇపుడు మనముందున్న ప్రశ్న 'రాముడు సీతను పరిత్యజించటం ధర్మమా' అని గదా! సీత రాముని ధార్మిక ఆస్థి. సీతమీద సర్వాధికారాలు భర్తగా ఆయనకెపుడో లభించాయి. రాముడు ఏ స్థితిలోనూ ధర్మం తప్పడు. రాముడు అధర్మపరుడే అయితే క్షత్రియకులంలో పుట్టిన శ్రీరాముడ్ని అగ్రకులస్థులైన బ్రాహ్మణులు, వేదవేదాంగ పండితులు, విశ్వామిత్ర వశిష్ఠాది మహర్షులు చేయెత్తి నమస్కరించేవారు కాదుగాక కాదు!!

ఆనాటి, త్రేతాయుగంనాటి శ్రీరాముడ్ని కలియుగ రాజ్యాంగ చట్టం ప్రకారం నిందించటం వివేకమనిపించుకొంటుందా! పరిత్యాగురాలైన సీత కూడా ఏనాడూ రాముని నిందించి ఎరుగదు. అన్యోన్య జీవితానికీ, ఆలుమగల అనుబంధానికీ, అవ్యాజ అభిమానానికీ, ఆదర్శ దాంపత్యానికీ, ఇపుడు కూడా

సీతారాములనే చెబుతుంటారు మన పెద్దలు. మీరు వినలేదా! "యద్భావం తద్భవతి" అన్నట్లుగా ఎవరు ఏ విధంగా ఆలోచిస్తారో ప్రతిదీ వారికి ఆవిధంగానే కనబడుతుంది. 'నెగిటివ్'గా ఆలోచించేవారికి కొన్ని విషయాలు కొన్ని నియమాలు అర్థంకావు. దీనికి ఎవరుమాత్రం ఏం చేయగలం! నమస్కరించి ప్రక్కకు తప్పుకోవటమే మంచిది.

✦☆✦

శ్రీకృష్ణునికి అంతమంది భార్యలు ఏమిటి?

చాలామందికి కుతూహలం కల్గించే ప్రశ్న యిది.

దశావతారాలలో శ్రీకృష్ణావతారం తొమ్మిదవది. తొమ్మిదవ సంఖ్యను బ్రహ్మ సంఖ్యగా చెబుతారు. తొమ్మిదవ సంఖ్యకున్న విశేషత ఏ సంఖ్యకూ లేదని పూర్వకాలంనాడే గమనించారు ప్రాచీనులు. అపర నారాయణుడని కీర్తింపబడుతున్న వ్యాసమహర్షికి కూడా తొమ్మిదవ సంఖ్యమీద మమకారం ఎక్కువ. అందుకే మహాభారతాన్ని 18 పర్వాలుగా రచించాడు. కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొన్న అక్షౌహిణులు సంఖ్య 18. భారతయుద్ధం కురుక్షేత్రంలో జరిగింది 18 రోజులు. వ్యాసమహర్షి పురాణాలు రచించింది పద్దెనిమిది. 1+8 = 9.

ఏ యుగపు సంవత్సరాలనైనా మొత్తం కలిపితే తొమ్మిదవ సంఖ్య వస్తుంది.

శ్రీమన్నారాయణుని దశావతారాలలో తొమ్మిదవ అవతారమైన శ్రీకృష్ణావతారానికి వున్న విశేషత విశిష్టత మరే అవతారానికి లేదు. "నేనే దేవుడను" అని చెప్పుకొన్న అవతారం శ్రీకృష్ణావతారం మాత్రమే! కృష్ణునికి వున్నంతమంది భక్తులు ఎవరికీ లేరు. శ్రీరామునికి వున్నన్ని దేవాలయాలు ఎవరికీ లేవు. కృష్ణుడు జగద్గురువు! కృష్ణుడు రసికుడు! కృష్ణుడు యోగీశ్వరుడు! ఇతర దేశాలలో కూడా లక్షలాదిమంది కృష్ణభక్తులున్నారు.

కృష్ణుని అంతటి భోగి, కృష్ణుని అంతటియోగి మరొకరు లేరు.

శ్రీకృష్ణునికి ఎనిమిదిమంది పట్టపురాణులు కాక పదహారువేల మంది రాచకన్యలు భార్యలుగా వున్నారని విన్న ప్రతివారూ బుగ్గలు నొక్కుకోక మానరు. నోటిమీద చేయి వేసుకోవటం మరువరు. ఇది ద్వాపరయుగం విషయంగదా!

కలియుగ చరిత్రను కొద్దిగా పరిశీలిద్దాం.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దానికి చెందిన చైనాదేశపు చక్రవర్తి చిన్- షి - యాంగ్'కి పదమూడువేల నూట నలభైమంది భార్యలుండేవారు - 'సాలమన్' చక్రవర్తికి ఏడువందలమంది భార్యలు, మూడువందలమంది వుంపుడుగత్తెలు, మొత్తం వేయిమంది వుండేవారు-'అక్బర్ చక్రవర్తికి' ఐదువేల మంది ప్రియు రాండ్రు శాశ్వతంగా వుండేవారు-విజయనగర సామ్రాజ్యం పాలించిన రెండవ దేవరాయలు (క్రీ.శ 1420) పన్నెండువేలమంది భార్యలు వుండేవారు- మొరాకో చక్రవర్తి 'మౌలి ఇస్మాయల్'కి (క్రీ.శ. 1672-1727) ఐదువందల నలభైమూడు మంది భార్యలు వుండేవారు. తొమ్మిదివందల సంతానంతో 'మౌలి ఇస్మాయిల్' సరదాగా వుండేవాడట-మొన్న మొన్నటి హైదరాబాద్ నవాబ్‌గారికి మూడు వందలకు పైగా భార్యలుండేవారు. ఉంపుడుగత్తెలు ఎందరో వుండేవారట. (1940)

ఇంగ్లాండ్, అమెరికాల్లో బహు భర్తృత్వం సాధారణంగా వుంది.

భారతదేశంలోని 'లదక్'లో బహుభర్తృత్వం సర్వసాధారణం.

ఈనాటికీ మనదేశపు గిరిజనులలో బహుభార్యాత్వం మామూలు విషయమే.

ఆదిమవాసులు, హిమాలయప్రాంతంవారు బహుభార్యాత్వాన్ని గొప్పగా భావిస్తారట.

ఒకప్పటి న్యాయప్రకారం పోషించగలిగిన శక్తీ, అనుభవించగల సామర్థ్య వున్నవారెవరైనా బహుభార్యత్వాన్ని కలిగియుండటంలో తప్పులేదు. కాని... వ్యభిచారం చేయకూడదు. పరుల భార్యను కన్నెత్తియూ చూడకూడదు. వ్యభిచార నియంత్రణ, పరస్త్రీ రక్షణే ఈ న్యాయవ్యవస్థ వుద్దేశ్యం.

'నరకుడు' అనే దానవరాజు ప్రజాకంటకుడై, యువతీ అపహరణకారుడై, క్షుద్ర దేవతోపాసకుడై, సువిశాల భారతదేశాన్ని పీడిస్తున్నపుడు (సువిశాల భరతదేశం అంటే భారత్ - పాకిస్థాన్ - ఆఫ్ఘనిస్థాన్ - మాల్దీవులు - బంగ్లాదేశ్ - నేపాల్ - శ్రీలంక - టిబెట్ - బర్మా మొదలైన దేశాలన్నీ కలిపి భారతదేశం) శ్రీకృష్ణుడు సత్యభామా సమేతంగా యుద్ధానికి బయలుదేరి వెళ్ళాడు. నరకుడు మరణించిన తరువాత ఆ రాజ్యానికి వానికొడుకునే రాజుగా చేశాడు. నరకుడు

భైరవ పూజకు బలియివ్వటం కోసం నానారాజ్యలనుండి ఎందరో కన్యలను అపహరించి తీసికొనివచ్చి పాతాళమందిరంలో దాచివుంచాడు. ఆ కన్యలందరూ కలిపి పదహారువేలమంది వున్నారు. ఎన్నో సంవత్సరాలనుండి ఆ పాతాళ చెరలో మ్రగ్గిపోతున్నారు వాళ్ళందరూ. వారినందరినీ చెరవిడిపించి వారివారి దేశాలకు పంపదలిచాడు కృష్ణుడు. కాని ఆ కన్యలు తమ తమ ఇండ్లకు వెళ్ళ టానికి ఎంత మాత్రమూ అంగీకరించలేదు. కృష్ణుడెంతగా నచ్చచెప్పినా వినలేదు వాళ్ళందరూ. అప్పటికి న్యాయధర్మాలు ఎలావుండేవంటే; శత్రురాజులను ఓడించి విజయం పొందినవారికి పరాజయం పొందినవారి సర్వస్వమూ స్వంతమవు తుంది. ధన-ధాన్య-వస్తు-వాహనాలేకాక సమస్త దాసదాసీజనాలు కూడా విజయం పొందినవారికే చెందుతారు. ఈ ధర్మం ప్రకారం పదహారు వేలమంది కన్యలు కృష్ణునికి స్వంతమయ్యారు. గత్యంతరం లేక వారినందరినీ ద్వారకా నగరానికి తరలించవల్సి వచ్చింది. వారందరూ లౌకిక ప్రపంచానికి కృష్ణుని భార్యలుగా వున్నారుగాని నిజానికి ఆ యువతులందరూ కృష్ణ భక్తురాండ్రు అయ్యారు. వీరందరూ ఒక్కొకరు పదిమంది కొడుకుల చొప్పున కృష్ణునికి బిడ్డలను కన్నారు.

వందల సంవత్సరాలు భార్యలందరితోనూ శ్రీకృష్ణుడు కాపురం చేశాడు. క్రీ.పూ-3114 సంవత్సరం కృష్ణ జననం జరిగింది. నాలుగు వందల ఆరు సంవత్సరాలకు పైగా జీవించాడు శ్రీకృష్ణుడు.

కృష్ణుని సిగలో నెమలిపింఛం ఎందుకు వుంటుందో తెలుసా! అమలిన శృంగారానికి పింఛం గుర్తు! సృష్టిలోని సమస్త ప్రాణులలోకి నెమలిది ఒక ప్రత్యేక జీవితం. నెమళ్ళకు శారీరిక సంభోగంలేదు. మగనెమలి కంటినీరు ఆడనెమలి త్రాగి గుడ్డు పెడుతుంది. పరమశృంగార పురుషుడుగా కనిపించే శ్రీకృష్ణుడు పరమయోగి. పదహారువేలమందితో సంసారం ఎలా చేశాడు అని కొంటె సందేహం కలుగవచ్చు! శ్రీకృష్ణుడు ప్రతిరోజు ప్రతిరాత్రి ప్రతి నిముషం పదహారువేలమంది ఇండ్లలోనూ వుండేవాడు. అష్టభార్యల యిండ్లలోనూ వుండేవాడు. అందుకే ఆయన జగన్నాటక సూత్రధారి. లీలావేషధారి.

"వందే కృష్ణం జగద్గురుమ్!"

✦☆✦

దైవభక్తి మంచిదేనా?

భక్తి అంటే శ్రద్ధ –నిష్ఠ – అర్పణ అనే అర్థాలున్నాయి. ఆరాధనా భావంతో, సుఖ దుఃఖాలనూ, మంచి చెడులనూ భగవదర్పితం చేయగల దైవభక్తులు ఎందరున్నారీ ప్రపంచంలో? గుడి గోపురాల వెంట తిరుగుతూ రంగుబట్టలు ధరించేవారందరూ దైవభక్తులేనా? అందరూ దొంగభక్తులే! పిడికెడు గుండెలో సముద్రమంత ఆశలు పెట్టుకొని కోరరాని కోర్కెలు కొరగాని ఆశలతో హుండీలో కానుకలు వేస్తే దేవుడు తీరుస్తాడా? బస్తా కొబ్బరికాయలు కొడితే కోరికలు నెరవేరుతాయా? కొండకు వెళ్ళి గుండు గీయించుకొని వస్తే కొండదేవర కాసులు కురిపిస్తాడా?

భక్తునికుండవల్సింది కోరిక లేని మనస్సు! బోడిగుండు కాదు.

దేవునికి కావల్సింది నిర్గుణమైన భక్తి! కొబ్బరికాయలు కాదు.

దేవునికి నీవు ఏమిచ్చి సంతోషపెట్టగలవు! నీవు సమర్పించేవన్నీ ఆయనవే అయినపుడు ఇక నీవేం ఇవ్వగలవు! పట్టుబట్టలు కట్టి ముఖానికి పెద్దబొట్టు పెట్టి కర్పూర నీరాజనాలు త్రిప్పినంత మాత్రాన దేవుడు ప్రసన్నుడు కాదు. దేవునికి కావల్సింది సత్య నియమసాధనం, ధర్మబద్ధజీవనం; కర్మసిద్ధ జీవితం; దేవుని గ్రహించటానికీ, దేవుని దర్శించటానికీ ఇవి చాలు. ఇంకేవీ అక్కరలేదు.

దేవుడంటే కానుకలు పారవేస్తే కోరికలు తీర్చేవాడా! దేవుడంటే ఒక నమస్కారం విసిరేస్తే సంపదలు పంపించే వాడా! దేవుడంటే మనం పెట్టిన రెండు అరటికాయలు తిని, రెండు రూపాయల దక్షిణ తాంబూలం తీసుకొని మనల్ని అందలం ఎక్కించేవాడా! ఎవరు దేవు డంటే !!!? కష్టాలు వచ్చినపుడు తిట్ట టానికి వనికొచ్చేవాడా! అభయ హస్తం చూపేవాడా!

> గుడిలోనూ,
> గుండ్రాయిలోనూ దేవుడు లేడు.
> దైవభక్తి అంటే డాంబిక వేషాలు, కుంకుమ బొట్లు కాదు! గుండెల మీద జంధ్యం, నుదుటిమీద నామాలు కాదు! కాషాయ బట్టలు, నెత్తిమీద పిలకా కాదు!

ప్రియ, మృదు భాషణం - అహింస - పరోపకారం - సదాలోచన - నిస్వార్థబుద్ధి - సమదృష్టి - సదాచారం - సౌశీల్యం - శాంతిజీవనం. వీటితో భగవంతుని పూజిస్తే అది దైవభక్తి.! అపుడు దైవమే నీలోకి వస్తాడు. నీవు చేస్తున్న ప్రతి పనికీ విజయం సిద్ధిస్తుంది. జీవితాన్ని భగవదర్పితం చేసినవారికి దుఃఖమే వుండదు. కలతలు కన్నీళ్ళు దగ్గరకు రావు. కోరికలన్నీ నశించి పోతాయి. మరి దైవభక్తి మంచిదే గదా!

✦☆✦

మహమ్మదీయ మతధర్మం ఏమిటి?

మతం అనేది మండే మంట వంటిది. వంట చేయవచ్చు ఇల్లు కాల్చవచ్చు.

ఏ మతమైనా సమ్మతమైనదే మతం అని చెప్పవచ్చు. ప్రపంచంలోని అతిపెద్ద మతాలలో మహమ్మదీయమతం రెండవది. ఈ మతాన్నే 'ఇస్లాంమతం' అని కూడా అంటారు. క్రీ.శ. 622లో ఈ మతస్థాపన జరిగింది. అరేబియాదేశం ఈ మతానికి జన్మస్థలం. మహమ్మద్ ప్రవక్త ఈ మతాన్ని స్థాపించిన కారణంగా మహమ్మదీయమతం అనే పేరు వచ్చింది. 'ఇస్లామ్' అంటే సర్వము దేవుని అధీనమని అర్థం. వీరు దేవుని 'అల్లాహ్' అని అంటారు. క్రీ.శ. 632లో మహమ్మద్ ప్రవక్త మరణించిన తరువాత మహమ్మదీయులు సున్నీ-షియా అనే రెండు భాగాలుగా విడిపోవటం జరిగింది. ప్రపంచంలో వున్న ముస్లింలలో సున్నీలే ఎక్కువమంది వున్నారు. 40 దేశాలు ముస్లిం మతదేశాలున్నాయి. ప్రపంచంలోని 70 దేశాలలో ముస్లిం మతస్థులున్నారు. "ఖురాన్" వీరి మత నిర్దేశక పవిత్రగ్రంథం. భగవంతుడే మహమ్మద్ ప్రవక్తకు చెప్పిన విషయాలను ఖురాన్‌లో వ్రాయటం జరిగింది. 'మక్కా' వీరి పుణ్యక్షేత్రం. 'మదీనా' కూడా వీరి పుణ్యక్షేత్రమే. అన్ని మతాల కన్నా ఇస్లాంమతం అతివేగంగా వృద్ధిచెందింది. మతరక్షణకోసం (జిహాద్) మరణించటానికి కూడా ముస్లింలు వెనుకాడరు. వీరికున్న మతాభిమానం ఏ మతస్థులకు లేదు అని చెప్పవచ్చు. మహమ్మదీయ మతప్రకారం నలుగురు భార్యలుండటం తప్పుగాదు. చాలాదేశాలు ఈ పద్ధతిని

నిషేధించాయి. ముస్లిందేశాలైన సౌదీ అరేబియా - ఎమెన్ అరబ్ రిపబ్లిక్ కువైట్ - బహ్రెన్ - ఒమెన్ - నైజీరియా మొదలైన తొమ్మిది దేశాలలో ఈనాటికీ స్త్రీలకు ఓటు వేసే హక్కులేదు. భారతదేశంలో కూడా ముస్లింలకు ఒక ప్రత్యేక చట్టం వుంది. భారతీయ చట్టాలు వారికి వర్తించవు. సంసారిక జీవితంలో భర్తకు భార్య అయిష్టురాలైతే, పురుషుదు మూడుసార్లు 'తల్లాఖ్' అని చెబితే చాలు వారిద్దరి భార్యాభర్తల అనుబంధం త్రెగిపోతుంది.

మహమ్మదీయులు విగ్రహపూజను అంగీకరించరు.

మతాన్ని ప్రాణానికంటె గొప్పదిగా భావిస్తారు. మహమ్మదీయుడైన ప్రతివాడూ ప్రతిరోజూ తప్పకుండా 'నమాజ్' ఐదుమార్లు చేసి తీరవల్సిందే. జీవితకాలంలో ఒక్కసారైనా 'హజ్' యాత్ర (మక్కా సందర్శన) చేయాలి. వ్యభిచారం ఏ పరిస్థితిలోనూ చేయకూడదు. అన్యాయంగా సంపాదించకూడదు. జూదం లాంటి అక్రమార్జన చేయకూడదు. సంపాదించిన డబ్బులో కొంత బీదలకు, దిక్కులేనివారికీ దానం చేసి తీరవల్సిందే. రంజాన్ మాసంలో తప్పకుండా వుపవాసం వుండి తీరాలి. స్త్రీలందరూ 'ఘోషా' పద్ధతిని పాటించి తీరవల్సిందే. చెడుపనులు, అత్యాచారాలు, హత్యలు దేవుని దృష్టిలో మహా పాపాలు. కష్టించి తినే ఆహారమే దేవునికి ఇష్టమైనది. సంపాదనలో ఆరవభాగం తప్పకుండా దానం చేయాలి. మీ హక్కులకోసం మరణించినా దేవుడు సంతోషిస్తాడు. మతాన్ని గౌరవించండి. అని బోధిస్తుంది మహమ్మదీయ మతం.

జూదం, వ్యభిచారం, మద్యపానం, ఇస్లాం మతానికి ఎపుడూ పనికిరావు.

✦☆✦

క్రైస్తవ మత ధర్మం ఏమిటి?

ప్రపంచంలోని అన్ని మతాలలో క్రైస్తవ మతం పెద్దది.

ఈ మతప్రచారంకోసం ప్రతి ఏటా కొన్నివేల కోట్లు ఖర్చు జరుగుతోంది.

కన్యగానున్న 'మరియ'కు దేవుని వరం వలన పుట్టినవాడు క్రీస్తు! క్రీస్తు జన్మించినప్పటి రోజు, నెల, సంవత్సరాన్ని గుణించుకొనే మనం ప్రతిరోజూ తారీకు వేస్తూ వ్రాస్తున్నాం. అంటే మనం ప్రతిరోజు వేసే తారీకు క్రీస్తు పుట్టి ఎన్ని సంవత్సరాలు జరిగిందో తెలుపుతుంది.

4వ శతాబ్దంలోనే క్రైస్తవులు భారతదేశానికి వచ్చినట్లు చరిత్రవల్ల తెలుస్తున్నది. క్రైస్తవమతం మొదట కాలు పెట్టింది కేరళలో. (సిరియా దేశం నుండి) అప్పటి కేరళలోని బ్రాహ్మణులు గూడ క్రైస్తవమతం స్వీకరించారు.

'బైబిల్' క్రైస్తవుల పవిత్ర మతగ్రంథం. బైబిల్ గ్రంథంలో పాతనిబంధన, క్రొత్తనిబంధన అని రెండు భాగాలున్నాయి. పాతనిబంధనలో యూదుల జాతి గురించీ యూదుమతం గురించీ వ్రాయబడింది. క్రొత్త నిబంధన క్రీస్తు జీవితాన్ని, క్రీస్తు బోధనలను, ఆయన శిష్యులను గురించి వ్రాయబడింది. పాతనిబంధనలు హిబ్రూ భాషలోనూ, క్రొత్త నిబంధన గ్రీకు భాషలోనూ వ్రాయబడ్డాయి. క్రీస్తుమతంలో చేరటాన్ని 'బాప్టిజం' అంటారు. శిరస్నానం చేయించి క్రీస్తుదీక్ష ఇస్తారు. యూదులజాతికి చెందిన 'జీసెస్‌క్రైస్ట్'ను ఏసుక్రీస్తు అని అంటారు. ఆయన బోధనలనే క్రీస్తుమతం అంటారు. ఏసు దేవుని కుమారుడని అందరూ నమ్ముతారు.

క్రైస్తవమతం ఆరవ శతాబ్దంలోనే రోమన్ సామ్రాజ్యమంతా వ్యాపించింది. 4వ శతాబ్దంలో రోమన్ రాజులు ఈ మతాన్ని స్వీకరించారు. తరువాత యూరప్ ఖండమంతా వ్యాపించింది."మార్టిన్ లూథర్" అనే మతగురువు క్రైస్తవ మతాన్ని సంస్కరించి 16వ శతాబ్దంలో 'ప్రొటెస్టెంట్' అనే క్రీస్తుమతాన్ని క్రొత్తగా స్థాపించాడు. దీనితో క్రైస్తవులు రెండు భాగాలుగా విడిపోయారు. క్రైస్తవ మతంలో ఇపుడు 460 శాఖలున్నాయి. ఒక్క అమెరికాలోనే 223 శాఖలున్నాయి. 'ప్రొటెస్టెంట్స్', 'కాథలిక్స్' ఈ రెండు విభాగాలే క్రిస్టియన్ మతంలో ముఖ్యమైనవి.

ఇప్పటికి బైబిల్ గ్రంథం 1763 భాషల్లో ముద్రించబడింది. ఇది ప్రపంచ రికార్డ్.

క్రైస్తవ సిద్ధాంతాలు – నీ ప్రక్కనున్నవారిని ప్రేమించలేకపోతే నీవు దేవుని కూడా ప్రేమించలేవు. అధర్మపరులు, న్యాయం తప్పినవారు దైవ సేవకు పనికిరారు. దొంగతనం, వ్యభిచారం క్షమించరానివి. పేదలను, దీనులను, రోగులను సేవించేవారే నిజమైన జీసస్ భక్తులు – ఇటువంటి నీతులు ఎన్నో బైబిల్ చెబుతుంది.

క్రీస్తుపూర్వపు యూదు మతస్తులందరు 'మోజెస్'ను గొప్ప మతప్రవక్తగా భావిస్తారు. వీరు పాత బైబిల్ నిబంధన (క్రీ.పూ. 1300) అనుసరిస్తారు. యూదులు దేవుణ్ణి 'యెహోవా' అని పిలుస్తారు. యూదులకు జెరుసలేంలోని "వెయిలింగ్‌వాల్" పుణ్యస్థలం. వీరు విగ్రహపూజను అసలు అంగీకరించరు. హింసను ఇష్టపడరు.

క్యాథలిక్కులకు వాటికన్‌సిటీలోని 'పోప్' మార్గదర్శకుడు. పోప్ అంటే తండ్రి.

✦☆✦

'జంతుబలి' శాస్త్ర సమ్మతమా?

దేవుళ్ళకు ప్రాణబలి ఇవ్వటం అనాగరిక సంస్కృతి.

వేల సంవత్సరాలక్రితం మనుష్యులకు మాంసాహారమే ముఖ్యాహారంగా వుండేది. ఇపుడుమనం పాయసాన్నం వండి దేవునికి ప్రసాదం పెట్టినట్లుగానే అవిద్యావంతులైన ఆనాటి అనాగరికజనం జంతుబలిని సమర్పించి, తరువాత దాన్ని వండుకొని తినేవారు. ఆర్యసంస్కృతి మనదేశంలో ప్రారంభమైన తరువాత మాంసాహారం నిషిద్ధమైనదిగా భావించారు. కాని యజ్ఞయాగాదులలో మాత్రం ప్రాణివధకు ఆర్యుల సమ్మతి వుండేది.

క్రీ.పూ. 525 శతాబ్దంలో పుద్భవించిన బౌద్ధమతం జీవహింసను బాగా వ్యతిరేకించింది. యజ్ఞయాగాదులు పశుబలితో నిర్వహించటాన్ని బౌద్ధమతం

నిరసించింది. ఎందరో రాజులు, చక్రవర్తులు, పెద్దలు బౌద్ధమత ధర్మాలను మెచ్చుకొని బౌద్ధిజాన్ని స్వీకరించారు. ఈ సమయంలోనే యజ్ఞబలులు నిలిచి పోయాయి. బౌద్ధమతానికి తోడుగా జైనమతం కూడా హింసను సంపూర్ణంగా వ్యతిరేకించింది. దీనితో వైదికయాగాలు నిలిచిపోయాయాయి.

శ్లో॥ అహింసా సత్యమస్తేయం, శౌచమింద్రియ నిగ్రహః ।
దానం దమో దయా శాంతిః సర్వేషాంధర్మసంగ్రహః ॥

- యాజ్ఞవల్క్యస్మృతి

అహింసాజీవనం, సత్యనిష్ఠ, దొంగిలింపకుండటం, శుచిత్వం, ఇంద్రియ నిగ్రహం, దానగుణం, శాంతిపాలన, భూతదయ ఇవన్నీ మానవధర్మాలు.

రాతియుగంలో మనుషులు కేవలం మాంసమేతిని బ్రతికేవారు గదా! అది పాపంకాదా అనవచ్చు! అయితే ఆనాడు మనిషికి వావివరుసలు కూడా వుండేవికాదు. అదేవిధంగా ఇపుడు మనం జీవించగలమా! అప్పటి మనిషి మృగసమానుడు. మృగత్వం నుండి మనుష్యత్వానికి వచ్చాంగదా! ఆలోచించే మనసు, విద్య, వివేకం, విచక్షణా జ్ఞానం వచ్చాయిగదా! ఇపుడు కూడా ఆదిమానవుల జీవితం గడపటం మంచిదికాదు గదా!

ఇపుడు కూడా మారుమూల గ్రామాల్లో స్త్రీదేవతలకు, క్షుద్రదేవతలకు జంతుబలులను ఇవ్వటం జరుగుతూనే వుంది. దేవునిపేరుమీద ప్రాణులను వధించటాన్ని విద్యావంతులైన వారందరూ అడ్డుకోవాలి. దీనికి కుల మతాలతో సంబంధంలేదు. అయితే మాంసాహారు లందరూ చేపలు, మాంసం మొదలైన వన్నీ మానేసి కూరగాయలు మాత్రమే తినాలా? అని అనవచ్చు!

దేవాలయాలలో జంతుబలిని గురించి మాత్రమే చర్చించాను.

మీ అభిప్రాయం మీది.

✦☆✦

> మనిషి తన సుఖంకోసం, తన లాభంకోసం, తన కుటుంబ శ్రేయస్సు కోసం ప్రాణులను బలి యివ్వటం చాలా ఘోరమైన పద్ధతి. "అహింసా పరమోధర్మః" అహింసతో జీవించటంకన్నా మించిన ధర్మం మరొకటి లేదు.

దెయ్యాలు వున్నాయా?

అశాస్త్రీయ నమ్మకమే దెయ్యం !

ఎవరైనా ఒక మనిషి శారీరిక వాంఛలు తీరకుండాగాని పగ, ప్రతీకారంతో గానీ, తీరని ఏ కోరికలతోగాని, మరణించటం జరిగితే, వారి ప్రేతాత్మ అక్కడి వారిని ఆవహించి బాధిస్తుందని పూర్వీకుల నమ్మకం. ఈ దెయ్యాలు ఎక్కువగా గిరిజనప్రాంతవాసుల నమ్మకంలోనే వుంటుంటాయి. ఎవరినైనా 'నువ్వు దెయ్యాన్ని చూచావా!' అని అడిగితే "ముసుగేసుకొని వుంది చెట్లలోకి పరుగెత్తుకు పోయింది; మండే కొరివిలాగ వుంది' అని రకరకాలుగా చెబుతారు. కాని... యిదంతా మనో దిగ్భ్రమ! క్షణకాల బుద్ధివైకల్యం! ఒక్కొకసారి మనం ఒంటరిగా దారివెంట వెళుతుంటే మనవెనుకగా ఎవరో వస్తున్న భ్రాంతి కల్గటం సహజం.

దెయ్యాలు పట్టినవారు పిచ్చిపిచ్చిగా మాట్లాడటానికి కారణం ఏమిటని ప్రశ్నించవచ్చు. పిచ్చిపిచ్చిగా మాట్లాడటానికి దెయ్యమే పట్టనవసరంలేదు. మనం బస్‌స్టాండ్‌ల్లోనూ, రోడ్లమీద ఎందరో పిచ్చివాళ్ళను చూస్తుంటాం. వాళ్ళు చేసే పిచ్చిచేష్టలు, పిచ్చిమాటలు చూచి వారికి దెయ్యం పట్టిందనుకోవాలా!

అసలు దెయ్యాలు ఆడవారికి మాత్రమే ఎక్కువగా పడతాయి. ఎందువల్ల? బలమైన కోరికలు మనస్సులోనే అణచివేసుకొంటూ బ్రతుకవల్సిన దుస్థితి ఆడవారికి మాత్రమే వుంది. ఈ కారణంవల్ల మనోవైకల్యానికి లోనైనప్పుడు మెదడు దారి తప్పుతుంది. మెదడు సరిగా పనిచేయనపుడు ఎన్నో వికారాలు కల్గుతాయి. కొద్దిరోజులలో కొందరు మామూలు స్థితికి వచ్చేస్తారు. అంతేగాని చీపురుదెబ్బలవల్ల, వేపమండలతో హింసించినందువల్ల, విభూతివల్ల ఏమీ జరుగదు.

అభివృద్ధి చెందిన అగ్రరాజ్యాలలో కూడా ఈ దెయ్యాల భ్రమ వుందంటే ఆశ్చర్యం కలుగక మానదు. క్రీ.శ 14-16 శతాబ్దాల మధ్యకాలంలో ఇంగ్లాండు - పారిస్ - ఫ్రాన్స్ మొదలైన యూరప్ దేశాల్లో లక్షలకొద్దీ దయ్యాల మాంత్రికుల్ని కాల్చి చంపివేయటం జరిగింది. అన్ని మతాలలోకన్నా క్రిస్టియన్ మతంలోనే సైతాను (దెయ్యం) భయం ఎక్కువ.

దేవుడ్ని నమ్మినపుడు దయ్యాలను కూడా నమ్మాలిగదా అన్ని ప్రశ్నించే బుద్ధిమంతులు చాలామంది వున్నారు. దేవుడ్ని నమ్మటానికీ దెయ్యాన్ని నమ్మటానికీ చాలా వ్యత్యాసం వుంది. ఉపకారం చేసేది దేవత. అపకారం చేసేది దెయ్యం. రెండిటికీ వ్యత్యాసం వుంది గదా.

మూఢవిశ్వాసం, అజ్ఞానం వున్నచోట దయ్యాలు వుంటాయి.

విద్య, విజ్ఞానం, విమర్శ వున్నచోట దయ్యాలు వుండవు.

దెయ్యాలు వున్నాయో లేదో మీరే చెప్పండి.

✦☆✦

దైవ ప్రార్థనలో శృంగారం సమంజసమా?

శ్లో॥ "కమలాకుచ చూచుక కుంకుమతో
నియతారుణి తాతుల నీలతనో
కమలాయత లోచన లోకపతే
విజయీభవ వేంకట శైలపతే"

అంటూ శనివారం ఉదయమే రేడియోలో సుప్రభాతం వింటుంటాం ఇటువంటి శృంగార రసపూరితమైన సుప్రభాతానికి అర్థం అందరికీ తెలియక పోవచ్చు. కానీ హేతువాదులందరూ ఈ శ్లోకాన్ని విమర్శించటం చాలాసార్లు వింటున్నాం "ఓ వేంకటేశ్వర ప్రభో! రాత్రి శృంగార సమయంలో లక్ష్మీదేవిని కౌగలించుకొని పరున్నావు కాబోలు! కమలములవంటి ఆమె స్తనములు నీలపు రంగుగల నీ గుండెలకు గ్రుచ్చుకొని నీ వక్షస్థలం కందిపోయి ఎర్రగా అయింది. కమలలోచనా! నీకు విజయమగుగాక!" అని పై శ్లోకానికి అర్థం.

గోపీపీనపయోధర మర్దన చంచల యుగకరశాలీ
"ధీరసమీరే యమునాతీరే వసతివనే వనమాలీ... ॥

- జయదేవగీతగోవిందం

సంస్కృత కవులందరూ భక్తిరసంలో కూడ శృంగార రసాన్ని మేళవింపు జేశారు. అదే దారిని అనుసరించారు తెలుగుకవులు. "కాటుకకంటి నీరు

చనుకట్టుపయింబడ నేల యేడ్చెదో కైటభదైత్యమర్దనుని గాదిలి కోడల! యోమదంబ! యోహాటక గర్భురాణీ!" అని సరస్వతీదేవితో అంటాడు మహాకవి బమ్మెరపోతనామాత్యుడు.

సంస్కృత శ్లోక సాహిత్యంగాని, పద్యసాహిత్యంగాని తెలుగువారి కున్నంతగా దాక్షిణాత్యులకు లేదని చెప్పవచ్చు. అంతేకాక హిందూమతాని కున్నంత పురాణ సాహిత్యం వేరొక మతంవారికి లేదు. "అహం బ్రహ్మాస్మి" అని వైష్ణవులు, 'శివోహం' అని శైవులు అంటూ వుండటం మనం వినే వుంటాం. నేనే బ్రహ్మను, నేనే విష్ణు స్వరూపాన్ని, నేనే శివస్వరూపాన్ని అని చిద్విలాసంగా చెప్పుకొనే ధైర్యం హిందూమతంలో మాత్రమే వుంది. కాషాయ బట్టలు కట్టి, కుంకుమ బొట్టు పెట్టుకొని, మైకు ముందు కూర్చుని ఎవడు ఏం చెప్పినా జయజయ ధ్వానాలు పలికే సంప్రదాయంమనది. అందువల్లనే దశాబ్దానికొక బాబాగారు, శతాబ్దానికొక స్వామిగారు పుట్టుకొస్తున్నారు. ఇది మన ప్రారబ్ధం.

మనం "పంట" వదలివేసి "పరిగె"ను ఏరుకొంటున్నాం!

అతిపురాతన హిందూ సంస్కృతి నానాటికీ నశించిపోతోంది.

హిందూమతం ఇపుడు దిక్కులేనిది అవుతోంది

హిందువులకు హిందూమతంమీద ప్రేమ సన్నగిల్లుతోంది.

కొంతకాలానికి హిందూమతం అనేది వుండదేమోనని అనిపిస్తోంది.

ఎందుకిలా జరుగుతోంది? మనమెందుకిలా అవుతున్నాం??

హిందూమతంలోని 'అతిస్వేచ్ఛ' హిందూమత పతన కారణమేమో!

ఒక ముస్లిం ఏనాటికీ హిందూమతంలో చేరడు

ఒక క్రైస్తవుడు ఎప్పటికీ హిందూమత స్వీకారం చేయడు.

హిందువులు మాత్రం ఏ మతంలో చేరటానికైనా సిద్ధంగా వుంటారు.

సాటి హిందువులందరూ సమ్మతిస్తారు.

ఇది ఈనాటి హిందూమతం దుర్గతి! దుస్థితి!! దుర్వతి!!!

హిందువుల ప్రార్థనాగీతాలలో శృంగారం ఎందుకు చేరింది? వాఙ్మయ పండితులు, యుక్తాయుక్త విచార పరాయణులైన పండితులందరూ భక్తిరసానికి శృంగారాన్ని ఎందుకు జోడించారు అన్నదే మన ముందున్న ప్రశ్న.

ముందుగా మీకొక వివరణ ఇవ్వాలి

మన తల్లిని మన స్నేహితుని తల్లితోనూ, మన యింటిని మరొక యింటి తోనూ, మన భార్యను ప్రక్కింటివాని భార్యతోనూ, మన బిడ్డను ఎదురింటివారి బిడ్డతోనూ, నీ ఆర్థికస్థితిని మరొకరి ఆర్థికస్థితితోనూ, నీయింటి వంటను హోటల్ వంటలతోనూ పోల్చి చూడకూడదు. ఇది మానసిక నేరం. మనోదౌర్బల్యం.

మన మతాన్ని కూడా మరొక మతంతో పోల్చి చూడకూడదు.

ఎందుకంటే;

ఏ మతంలోని ఏ దేవునికీ భార్య, బిడ్డలు వుండరు. ఒక్క హిందూమత దేవతలకు మాత్రమే భార్యాసంసారాలు వున్నాయి. నిర్గుణుడు-నిరాకారుడు - నిరామయుడు - సర్వవ్యాపకుడు -ఆది మధ్యాంతరహితుడు- సర్వాంతర్యామి అని చెబుతూనే మన దేవుళ్ళకు ఇద్దరేసి భార్యల్ని అంటగట్టి ఆనందిస్తున్నాం! నిరాకారుడు (ఆకారమే లేనివాడు) అని చెబుతూనే విగ్రహాలు చెక్కించి గుడులు కట్టి కళ్యాణాలు జరిపించి బంగారు ఆభరణాలు తొడిగి సంతోష పడుతున్నాం! అంటే పరోక్షంగా దేవునికి శృంగార తత్వాన్ని అండగడుతున్నట్లే గదా!

శివలింగ స్వరూపమే శృంగార తత్వానికి అంటుకొని వుంది.

లింగాన్ని పురుషునిగానూ, లింగం క్రిందవున్న పానువట్టాన్ని స్త్రీగానూ, ప్రకృతీ పురుషుల ఏకత్వమే శివలింగ స్వరూపంగానూ భావించి ఆరాధిస్తున్నాం. అంటే 'హరప్పా మొహంజొదారో' కాలం నుండే (క్రీ.పూ 3000) మనం దైవత్వాన్నీ శృంగారాన్నీ సమ్మిళితం చేసి సృష్టి తత్వాన్ని ఆరాధించామన్నమాట!

చతుర్విధ పురుషార్థాలలో (ధర్మం - అర్థం - కామం - మోక్షం) కామం తరువాతనే మోక్షానికి స్థానం కల్పించబడింది. యోగివేమన కూడా 'కామి కానివాడు మోక్షగామి కాదు' అని కుండ పగిలినట్లు చెప్పాడు.

శృంగార జీవితాన్ని పరిత్యజించి జీవించే సన్యాసధర్మం మన మానవులందరికీ ఆమోదయోగ్యం కాదు. సనాతన ధర్మం యిందుకు అంగీకరించదు. సృష్టి ధర్మం శూన్యమవుతుంది. మనుషులందరూ సన్యాసధర్మస్వీకారం చేసినట్లయితే సృష్టిక్రమం నిలచిపోతుంది. అందువల్లనే పరివ్రాజక ధర్మాన్ని బ్రాహ్మణులకు మాత్రమే అప్పగించారు. అందరికీ జీవన ధర్మం బోధించాల్సిన బాధ్యత వీరిదే!

మానవులకు దైవనమ్మకం, దైవపూజ, దైవప్రియత్వం, దైవస్నేహం, విధిగా వుండాలి. కాని దైవమే సర్వస్వమూ కాగూడదు. సదా దైవధ్యానంలోనే కాలం గడుపుతూ వుంటే గృహకృత్యాలు ఎవరు నిర్వర్తించాలి? ఆహారం ఏ విధంగా లభిస్తుంది! ఈ లోకంనుండి పరలోకానికి మనం వెళ్ళేముందు మన రక్త, గోత్ర వారసులను సృష్టించి చక్కబరచి వెళ్ళటం మానవధర్మం. ఏ ధర్మం తప్పినా ఈ ధర్మం ఎవరూ తప్పటానికి వీలులేదు.

గృహస్థ బంధనానికి కారణం కామమే గదా!

మనిషి భగవత్ చింతనలోపడి భార్యాబిడ్డలను, బాధ్యతలను గృహసేవను విస్మరిస్తాడేమోనన్న బలమైన ఆలోచనవల్లనే దైవ ప్రార్థనలో శృంగార తత్వాన్ని పూర్వకవులు ప్రవేశపెట్టారని చెప్పవచ్చు! శృంగారం అనగానే అదేదో అంటరానిదిగా, మాట్లాడరానిదిగా, తలచుకొనరానిదిగా, అతి అభినయం చేస్తుంటారు చాలామంది! కామమే మనిషికి లేకుంటే యింతటి అభివృద్ధి వుండదు.

కామం తప్పుగాదు; వ్యభిచారం క్షంతవ్యమూ కాదు.

అందుకే ఒకప్పుడు బహుభార్యాత్వ సమాజాన్ని అంగీకరించారు.

సంతృప్త శృంగార జీవనం మనిషిని చైతన్యవంతునిగా చేస్తుంది.

మానవుడు యింతగా శ్రమపడటానికి కారణం కోరికలే!

కోరికల పరమావధి సుఖమే! కామపు పరమావధి కూడ సుఖమే!

అమలిన శృంగారం ఆమోదయోగ్యమే!

సూర్యోదయకాలంనుండి సూర్యాస్తమయ కాలంవరకూ వేదాంత చర్చల తోనూ, వైరాగ్య ప్రవచనాలతోనూ, భక్తి కార్యక్రమాలతోనూ జీవిత విలువలను విధ్వంసం చేసుకోకుండా, భక్తిమార్గం నుండి మనిషిని గృహస్థ జీవితంవైపుకి మరల్చటానికే దైవ పఠనంలో కూడా శృంగార తత్వాన్ని పైపూతగా పూశారు. అన్నమాచార్యుని గీతాలలో కూడా ఇది చక్కగా వినిపిస్తుంది. జయదేవుని సంస్కృత గీతాలలో కూడా శృంగారం పిల్లకాలువలా పారుతూనే వుంటుంది దేవుళ్ళకు భార్యలున్నపుడు శృంగార వర్ణనలు తప్పుగాదు. అందుకే మన మతానికి పరాయి మతాలకు పొంతన కుదరదు. ఇది దృష్టిదోషమే గాని సృష్టిదోషం కాదు.

మన భక్తిగీతాలలో శృంగారం వుందని సిగ్గుపడనవసరంలేదు. శృంగార మెంత వుందో అంతకుమించి తొంబదిరెట్లు వైరాగ్యం కూడా వుందన్నది. మరచిపోవద్దు. వంకాయకూరలో కరివేపాకు వున్నంతమాత్రాన వంకాయ కూరను కరివేపాకు కూర అనటానికి వీలులేదు గదా!

శృంగారం లేని జీవితం సంపూర్ణజీవితం అవుతుందా! శృంగారం ప్రతి ప్రాణికీ జన్మసిద్ధహక్కు. భూమి నిర్మానుషం కాకుండా వుండాలన్నా, ప్రాణి ప్రపంచం సదాకాలం వుండాలన్నా, చివరకు చెట్టు చేమ వుండాలన్నా, శృంగారం అత్యావశ్యకం. శృంగారం కూడా దైవకార్యమే. పరమ పవిత్రమైనదే.

✦☆✦

దైవ విగ్రహానికి అమూల్యాభరణాలు వుండాలా?

క్రీస్తు శకానికి పూర్వం 1600నాడు ఆర్యులు ఇక్కడి గంగాతీర ప్రాంతానికి వచ్చి నివాసాలు ఏర్పరచుకొన్నారు అని చరిత్ర చెబుతోంది. ఆర్యులు ప్రకృతినీ భూమినీ, అగ్నినీ, సూర్యునీ, ఇంద్ర - వరుణాది దేవతలను పూజించేవారు. దైవానికి రూపంలేదనీ శక్తివుందనీ నమ్మేవారు. అగ్నిని పూజించటం నిత్యకర్మగా వుండేది. యజ్ఞయాగాలు చేసేవారు. సంస్కృత, ప్రాకృత భాషలు మాట్లాడే వారు. ఈ విషయాలన్నీ వేదాలలో వున్నాయి. వెలుగునిచ్చే సూర్యుడు, నీటిని

వర్షించే వరుణుడు, ఆహారాన్నిచ్చే భూమి, వేడిని ప్రసాదించే అగ్ని, దేవతలకు రాజుగా భావించే ఇంద్రుడు వీరు మాత్రమే ఆర్యులకు ఆరాధకులుగా వుండేవారు. అపుడు గుడులుకాని, దేవతా విగ్రహాలు కాని, యింతమంది దేవుళ్ళుకాని లేరు.

మొట్టమొదటి సనాతన హిందూమతంలో విగ్రహారాధనలేదు.

క్రైస్తవ ముస్లిం మతాలు కూడా విగ్రహారాధనను అంగీకరించవు.

క్రీ.శ 500 నుండి మనకు విగ్రహారాధన ప్రారంభమై వుండవచ్చు.

ఈ విగ్రహపూజతో పాటే దేవాలయాల నిర్మాణం ప్రారంభమైవుండవచ్చు

హిందూమతంలో మూడుకోట్ల దేవుళ్ళు వెలిశారు. ఇప్పటికీ ఇంకా క్రొత్తక్రొత్తగా సాయిబాబా, అయ్యప్ప మొదలైన దేవుళ్ళు వెలుస్తూనే వున్నారు. ముమ్ముందు రోజుల్లో ఇంకా ఎందరో దేవుళ్ళు రాబోతున్నారు కూడ. ఇదొకపిచ్చి! అనాయాసంగా, హాయిగా ఏదో ఎవరో దేవుడు వరాలిస్తున్నాడని ఎవడో ఒకడు చెబితేచాలు; మరునాడే అక్కడికి ప్రయాణం. పాపం ప్రాచీన దేవతలైన విష్ణువు ఈశ్వరుడు ఈ క్రొత్తదేవుళ్ళ దెబ్బకి మరుగునపడిపోతున్నారు. (శాంతం పాపం) 'క్రొత్త ఒక వింత పాత ఒక రోత' అనే సామెత దేవతలకు కూడా వర్తిస్తూవుందా!

ఆభరణాల రక్షణకు కాలిబూట్లతో పోలీసులు కాపలా కాయవల్సిన అవసరం అంతకన్నాలేదు. 'దేవుని ఆభరణాలు దొంగలెత్తుకొనిపోయారు. అంటూ పేపరులో చదవాల్సిన దుస్థితి ఎంత బాధా కరం! భక్తులకు ఎంత మనోవేదన? దేవునిలోని దైవత్వానికి ఎంత చిన్నతనం! కలియుగదేవుడైన తిరుపతి వేంకటేశ్వరునికి భక్తకోటి సమర్పించే అమూల్యకానుకల్లో అవకతవకలు జరుగుతున్నా యంటూ దినపత్రికలో చదివినపుడు ఆస్తికభావనా పరులైన భక్తులకు ఎంతటి మనోవేదన! డబ్బు,

> దేవతా విగ్రహాలకు పూలహారాలతో కూడా పనిలేదు. హృదయాలను అర్పించాల్సిన దేవవిగ్రహాలకు కనకాభరణాలు ఎంతమాత్రమూ అవసరంలేదు.

బంగారం, వస్తువాహనాలు మనుషులకు కావాలిగాని, సర్వసంపదకూ, సర్వభాగ్యాలకూ అధినాథుడైన దేవునికెందుకు! "తిరుపతి స్వామి శ్రీమంతులకు మాత్రమే దేవుడన్న" అపఖ్యాతి వినబడుతూ వుంది. ఇది హిందూమతాభిమానులకు బాధ కల్గించే విషయం కాదా! దేవునికీ భక్తునికీ మధ్య పూజారులుండటమే ఒక దురదృష్టమైతే దేవునికి ఆభరణాలు తగిలించి ప్రతిభక్తుడినీ దొంగగా అనుమానించి చూస్తున్న ఈ దుస్థితికి ఎవరు ఏడవాలో నిర్ణయించాల్సింది దేవుడే!

✦☆✦

దేవదాసీలు దేవాలయాలకు అవసరమా?

స్వర్గలోకానికి అప్సరసలు అవసరమా! అన్నట్లుందీ ప్రశ్న. సరే! దేవాలయాలకు దేవదాసీలు వుండటంలోని ఔచిత్యమేమిటో పరిశీలిద్దాం.

క్రీ.శ. ఆరవ శతాబ్దం నుండి ఈ దేవదాసీపద్ధతి వున్నట్లు చారిత్రక ఆధారాలు వున్నాయి. అంటే మనకు వేయి సంవత్సరాల క్రితమే ఈ దేవదాసీ ఆచారం అభివృద్ధిలో వున్నట్లు తెలుస్తోంది. ప్రారంభ దినాలలో దేవదాసీలు వేశ్యలు కారు. దేవుని దాస్యంకోసం నియమించబడ్డ సేవకులు!

ఈ దేవదాసీలనే గుడిచేటినులు అంటారు.

ఆనాడు దేవాలయాల నిర్మాణ ప్రారంభం కాశీనుండే మొదలైనదని చెప్పవచ్చు. భారతదేశం మొత్తంలో 32లక్షల దేవాలయాలు వుంటే కాశీలో 1500 దేవాలయాలు వున్నాయి. (ఔరంగజేబు చాలా ముఖ్యమైన ఆలయాలను ధ్వంసం చేయించాడు) దేవాలయాలకు పూర్వం గుహాలయాలు నిర్మించబడ్డాయి. ఇవి మన దేశంలో 1.112 ఉన్నాయి

అప్పటి దేవాలయాల నిర్మాణవుద్దేశ్యం కేవలం దేవపూజకు మాత్రమే కాక; రాజకీయ, సాంస్కృతిక, సామాజిక, దైవిక కార్యక్రమాలకు వేదికగా వుండాలని భావించారు. దేవదాసీలు వివాహం చేసుకొనరాదన్న నియమం వుండేది. ప్రతిపున్నమికీ దేవాలయాల్లో దేవుని ఎదుట దేవదాసీలు నృత్యగానాలు

చేసేవారు. వీరందరికీ రాజాదరణ వుండేది. కొందరు దేవదాసీలు రాజకీయ రహస్య ప్రతినిధులుగా కూడా వుండేవారు. వీరికి ప్రత్యేక భవనాలు వుండేవి. నృత్య గానాలే వీరికి ముఖ్యవృత్తి. వీరు దేవుడినే భర్తగా భావించేవారు.

కాలక్రమంలో దేవదాసీలు శ్రీమంతుల భోగవస్తువులుగా మార్పు చెందారు. ఇహలోక సుఖాలకు తలవంచారు. రాజులకు వుంపుడుగత్తెలుగా స్థిరపడి పోయారు. కడుపుకోసం పడుపువృత్తి చేసినా నీతినియమాలు తప్పేవారు కాదు. మనదేశంలోని ఎన్నో దేవాలయాలు దేవదాసీలు కట్టించినవి వున్నాయి. ఎంతోమంది దేవదాసీలు దేవస్థానాలకు మాన్యాలకు యిచ్చినట్లుగా శాసనాలు వున్నాయి. మంచి చెడులు ప్రతిచోటా ప్రతివారిలోనూ వున్నాయి. వుంటాయి. దేవదాసీలలో చాలామంది కవయిత్రులు కూడా వున్నారు. వీరందరూ భాషా పాండిత్యంలోనూ, చిత్రకళలోనూ, సంగీతంలోనూ, గానంలోనూ, నృత్యం లోనూ, కవిత్వంలోనూ సిద్ధహస్తులే! (శృంగారంలో కూడా)

ప్రతిరోజూ దేవాలయానికి వచ్చి పూలహారాలు సమర్పించి దైవగీతాలు ఆలపించి హారతులందుకోవటం వీరి ముఖ్యవిధి. వీరికోసం ప్రత్యేకమైన గుర్రపుబండ్లు వుండేవి. వందల ఎకరాల భూమి వీరికోసం మాన్యాలు వుండేవి. రాజాశ్రయంతోపాటు రాజరక్షణ కూడా వీరికి వుండేది. ఈ దేవదాసీ మహిళ లందరూ శృంగార కళాపాండిత్యంలో రాటుదేలిన నీటురాండ్రు!

తమిళ ప్రాచీన గ్రంథమైన 'శిలప్పదిగారమ్'లో వీరిని గురించి తెలుసు కోవచ్చు. ఏ సంప్రదాయమైనా, ఏ ధర్మమైనా ప్రారంభంలో సదుద్దేశ్యమే వుంటుంది. కాలక్రమంలో వెర్రితలలువేసి దురాచారంగా పరిణమిస్తుంది. ఈ మాదిరిగానే దేవదాసీ వ్యవస్థతోపాటుగా దేవదాసీలు 'భోగంవారు'గా పరివర్తన చెందారు. దైవకార్యాలను పరిత్యజించి 'సానులు'గా మారిపోయారు. ధన సంపాదనే ధ్యేయమైపోయి అతికోర్కెలకు లొంగిపోయి సమాజంలో మర్యాదను కోల్పోయారు. ఈ సానులకు బిడ్డలుంటారుకాని భర్తలుండరు.

దేవదాసీలు లైంగిక దాసీలుగా మారటాన్ని గమనించిన దేవాలయ ధర్మా ధికారులు వీరిని శాశ్వతంగా దైవకార్యాలనుండి తొలగించారు. అంతే! వీరి జీవనపథం మారిపోయింది. స్వేచ్ఛా జీవితంతోపాటు సుఖాభిలాష పెరిగి

పోయింది విలాసపురుషులైన శ్రీమంతులకు సుఖాలను అమ్ముకొనే సానులు అయ్యారు.

మహారాష్ట్ర - కర్ణాటక - కేరళ రాష్ట్రాలలో అరవైవేలమంది దేవదాసీలు వున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. కాని వీరందరూ దేవదాసీలుకాదు. దేవదాసీల పేరుతో వ్యభిచారవృత్తి చేస్తూ జీవిస్తున్నవాళ్ళు. 18వ శతాబ్దంనుండీ వేశ్యావృత్తిని నిర్మూలించటానికి ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ఎంతగానో శ్రమిస్తున్నాయి. కాని ఫలితం శూన్యమేనని చెప్పక తప్పదు.

> దేవదాసీలకు సానులకు
> సంబంధమే లేదు.
> రాజకీయలబ్ధికోసం
> దేవదాసీలమని
> చెప్పుకోవటం అబద్ధం.
> దేవదాసీలకు
> వ్యభిచారం వృత్తికాదు!

నేటి ప్రభుత్వం మహారాష్ట్ర (బొంబాయి) లోని వేశ్యలకు లైసెన్స్‌లను మంజూరు చేయాల్సిన స్థితికి తలవంచింది. ప్రపంచ దేశాలు ఎంతటి కఠిన శిక్షలు అమలు చేసినా ఈ వేశ్యావృత్తిని అరికట్టలేక పోయాయి. ఢిల్లీ - బొంబాయి - బెంగుళూరు వంటి మహా నగరాలలో ఆడదేవదాసీలేకాదు; మగ దేవ దాసులు కూడా వున్నారు అంటే నమ్మబుద్ధి కావటంలేదు గదూ!

అన్ని మహానగరాలలో మగవేశ్యలు వున్నారు.

అదే ముస్లిం దేశాలల్లో వ్యభిచారానికి మరణశిక్ష విధిస్తారు.

వ్యభిచారం తప్పు! కాని బహుభార్యాత్వం తప్పు గాదు.

మద్యపానానికీ వ్యభిచారానికీ ప్రపంచదేశాలన్నీ తలలు వంచేశాయి. నైతికత, మనుష్యులలో వుండాలిగాని చట్టాలు శాసనాలు ఏం చేస్తాయి!

కాల్పనిక సుఖాలకు మనిషి ఎప్పుడూ బానిసే!

అందుకే

మనుషులే మారాలి !

✦☆✦

మ్రొక్కులు తీర్చకుంటే, కష్టాలు కల్గుతాయా?

మ్రొక్కులు మూఢవిశ్వాసానికి గుర్తులు !

శ్లో॥ నాదత్తే కస్యచిత్ పాపం, నచైవ సుకృతం విభుః ।
అజ్ఞానేనావృతం జ్ఞానం, తేన ముహ్యంతి జంతవః ॥

భగవద్గీతా 5-15

"పరమాత్మ ఎవరిపాపాలనుగాని, ఎవరి పుణ్యాలనుగాని స్వీకరించదు. ఎవరి పాప పుణ్యఫలాలను వారే అనుభవించాలి."

మన కష్టసుఖాలకు, మన అజ్ఞానానికి, మన కర్తవ్యలోపానికి దేవునికి భాగస్వామ్యం కల్పించి ముడుపులు కట్టి దండాలు పెట్టి కాళ్ళు ముడిచి కూర్చుంటే కష్టాలు తీరతాయా! కోరికలు నెరవేరుతాయా!! ముడుపులు కడితే తాత్కాలిక మనశ్శాంతి లభిస్తుందేమోకాని కష్టాలు ఎన్నటికీ తీరవు. దేవునికి లంచం ఇచ్చే ఆలోచన ఎందుకు వస్తుందో అర్థంకాదు. మనం అల్పులమై దేవునికూడా అల్పునిగా చేయటం తగనిపని!

ముడుపులు - మ్రొక్కులు కష్టాలు తీర్చవు.

కర్తవ్యం, వివేకం, పరిశ్రమలవల్ల మాత్రమే కష్టాలు తీరతాయి.

పుణ్యక్షేత్రాలకు వెళ్ళి తలవెంట్రుకలు సమర్పించటంలోని అంతరార్థం చాలామందికి తెలియదు. కుటుంబ నిర్వహణకోసం, సంసార బాధ్యతావిధిని నిర్వర్తించటం కోసం, అబద్ధాలు మోసాలు చేయాల్సిన అవసరంవల్ల పాపాలు కల్గుతాయి. ఆ పాపాలన్నీ తలవెంట్రుకలలో దాగి వుంటాయని ప్రాచీనంగా వస్తున్న నమ్మకం! పాపాలు పోగొట్టు కోవటానికే తలవెంట్రుకలను దేవునికి సమర్పించాలని శాస్త్రం.

"అవశ్యమనుభోక్తవ్యం గతం జన్మ శుభాశుభమ్" అని పురాణాలు చెబుతున్నాయి. గత జన్మలో మనం చేసిన పాపపుణ్యాలను ఈ జన్మలో అను భవించి తీరాలన్నది సనాతన విశ్వాసం. అటువంటప్పుడు ముడుపులు మ్రొక్కులు

దేవుడు దయాస్వరూపుడు. తన బిడ్డలకు తల్లిదండ్రులు అపకారం చేయరుగదా! తాను సృజించిన బిడ్డలకు దేవుడు కూడా అపకారం చేయడు. కాబట్టి మ్రొక్కులు తీర్చినా, తీర్చకపోయినా దేవునికి సంతోషమూ కల్గదు. బాధ కలగదు. మన అనుమానాలు అర్థం లేనివి.

వల్ల ఫలితముండదు. అమాయ కత్వంతో కష్టాల ఒరవడిలో కట్టిన ముడుపులను భగవంతుడు ఆశించడు. కష్టసుఖాలు మనుషలందరికీ సహజం. దేవుడు కావాలని ఎవరికీ కష్టాలు కల్పించడు. దేవునికి అందరూ బిడ్డలే! శ్రీమంతుడు, పేదవాడు, దుర్మార్గుడు, నీచుడు, నికృష్టుడు, ఉత్తముడు, గుణవంతుడు, త్యాగి, భోగి విరాగి, సన్యాసి, కుంటి, గ్రుడ్డి అందరూ దేవునికి సమానమే! పశువులు పక్షులు, పురుగులు, కూడా దేవునికి ప్రీతిపాత్ర ప్రాణులే!

✦☆✦

శ్రీహరిశ్చంద్రుడు భార్యను అమ్మటం న్యాయమా?

"సత్యమేవ సమస్యేత సత్యంహి పరమోగతిః"

సూర్యవంశపు హరిశ్చంద్రునిది అయోధ్యానగరం. తన కోసం ప్రత్యేకంగా స్వర్గాన్ని సృష్టించుకొన్న త్రిశంకుని కొడుకే హరిశ్చంద్రుడు. ఈతని కులగురువు బ్రహ్మర్షి వశిష్ఠుడు. శ్రీరాముడు ఈతని వంశంలోనివాడే. సువిశాల భరత సామ్రాజ్యాన్ని ధర్మమార్గాన నడిపించిన ఆరుగురు చక్రవర్తులలో హరిశ్చంద్రుడు, సర్వప్రథముడు. సత్యమార్గమే మనిషికి గొప్ప మార్గమనీ, సత్యవ్రతానికి మించిన వ్రతం మరొకటి లేదని నమ్మి. ఆచరించి చూపిన ధీరోదాత్తుడు. భారత జాతీయ స్థూపంక్రింద "సత్యమేవ జయతే" అన్న సూక్తి ఈయనదే. ఈ హరిశ్చంద్రుని స్ఫూర్తితోనే మోహనదాస్ కరంచంద్ గాంధీ మహాత్మాగాంధీ అయ్యాడు. అనేక వందలసార్లు ఈ విషయం గాంధీ చెప్పారు. బ్రిటిష్ చక్రవర్తులు సైతం హరిశ్చంద్ర కథవిని "గ్రేట్‌గ్రేట్" అంటూ చప్పట్లు చరిచారట!!

పురాణాలు, హరికథలు గతించిపోయి నాటకాలు సినిమాలు వచ్చిన తరువాత ఈ సత్యహరిశ్చంద్రుడు అవహేళనపాలై పోవల్సి వచ్చింది.

అవునుమరి! వేయి అబద్ధాలు ఆడైనా ఆలుబిడ్డల్ని పోషించాలి అనుకొనే ఈ రోజుల్లో ఈనాటివారికి హరిశ్చంద్రుడు అసమర్థుడుగా, దోషిగా కన్పించటం సహజమే!

తెలిసిన కథే అయినా సంక్షిప్తంగా చెప్పాల్సివుంది.

ఒకసారి స్వర్గలోకంలో ఇంద్రసభకు మహర్షిగణమంతా వచ్చారు. భృగు - అంగీరస - కశ్యప - అత్రి - అగస్త్య - వశిష్ఠ - విశ్వామిత్ర ఆదిగాగల ఎందరో తపోసంపన్నులు నిండిన ఆ సభలో "సత్యవ్రతదీక్ష' గురించిన చర్చ వచ్చింది. దేవేంద్రుడు ఆ సభలోని వారితో "మహర్షులారా! సృష్టిలోని సమస్త వ్రతాలలో సత్యవ్రతదీక్ష గొప్పది కష్టతరమైనది గదా! త్రికరణశుద్ధిగా సత్యవ్రతాన్ని పాటించేవారు ఎక్కడైనా ఎవరైనా వున్నారా" అని అడిగాడు. మానవులకే గాదు దేవతలకైనా ఎపుడో ఒకప్పుడు అబద్ధం చెప్పవల్సిరాక తప్పదు. కఠినమైన సత్యవ్రతాన్ని పాటించటం సాధ్యంకాదు గదా! మహర్షు లందరూ మౌనంగా వున్న సమయంలో వశిష్ఠ మహర్షి "సురలోకాధిపతీ! సత్యమే వూపిరిగా, సత్యమే సర్వస్వంగా, సత్యదీక్షను పాటించేవాడు భూలోకంలో ఒకడున్నాడు." అన్నాడు. ఇంద్రునితో పాటుగా అందరూ ఆశ్చర్యపోయారు. "వశిష్ఠమహర్షీ! మానవులలో అటువంటివారు వున్నారా! ఎవరతను? ఎక్కడున్నాడు" అని ప్రశ్నించాడు దేవేంద్రుడు. "అమరేంద్రా! అతను నా శిష్యుడు. సూర్యవంశపువాడు". వశిష్ఠుని మాటలు విశ్వామిత్ర మహర్షికి రుచించ లేదు. వశిష్ఠునితో వాదానికి దిగాడు. "ఆ హరిశ్చంద్రునిచేత నేను అబద్ధం పలికిస్తాను. వాని సత్యవ్రతాన్ని భంగం చేస్తాను. వశిష్ఠుని మాటలు పొల్లుమాటలని నిరూపిస్తాను" అంటూ విశ్వామిత్రుడు పంతం పూనాడు.

ఈ కారణంగా హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి శత్రువయ్యాడు.

అంతే! హరిశ్చంద్రునికి కష్టాలు ప్రారంభమయ్యాయి.

విశ్వామిత్రుడు హరిశ్చంద్రునివద్దకు వచ్చి తానొక మహాయాగం చేయబోతున్నాననీ యాగనిమిత్తమై ధనం కావాలని అడిగాడు. ఎంతకావల్సివస్తుందని

అడిగాడు హరిశ్చంద్రుడు. దానికి విశ్వామిత్రుడు "హరిశ్చంద్రా! ఒక మనిషి ఏనుగుమీద ఎక్కి ఒక రత్నాన్ని ఎంత ఎత్తుకు విసురుతాడో అన్ని వరహాలు కావాలి. నాతపోశక్తిచేత పైకి విసిరిన రత్నం క్రిందపడకుండా పైన శూన్యంలో అలాగే నిలచి వుంటుంది. అంతటి ధనమివ్వగలవా!" అన్నాడు. అంగీకరించాడు హరిశ్చంద్రుడు. "రాజా! ఈ ధనం నాకిపుడు అవసరంలేదు. అవసరం వచ్చి నపుడు వస్తాను. నీ దగ్గరే వుండనివ్వు" అని చెప్పి వెళ్ళి పోయాడు విశ్వామిత్రుడు.

కొన్ని రోజులు గడిచిపోయాయి.

ఒకరోజున హరిశ్చంద్రుడు వేటకోసం అడవికి వెళ్ళాడు (క్షత్రియులకు వేటవల్ల పాపం అంటకుండేట్లు అగస్త్యమహర్షి వరం ఇచ్చాడు) అడవికి వెళ్ళిన హరిశ్చంద్రునికి విశ్వామిత్రునిచే సృష్టింపబడ్డ యిద్దరు యువతులు తారసపడి తమను వివాహమాడ వల్సినదిగా కోరారు. హరిశ్చంద్రుడంగీకరించ లేదు. ఆ యువతులకు మద్దతుగా విశ్వామిత్రుడు వచ్చి హరిశ్చంద్రునికి నచ్చచెప్పినా హరిశ్చంద్రుడు వినలేదు. "విశ్వామిత్ర మహర్షీ! నా రాజ్య సర్వస్వమూ పరి త్యజించి ఇవ్వగలనుగాని ఈ యువతులను వివాహమాడి నా ఏకపత్నీ వ్రతానికి భంగం కల్గించను" అన్నాడు. అవకాశంకోసం ఎదురుచూస్తున్న విశ్వామిత్రుడు "సరే! రాజా! నీవిపుడు అన్నమాట ప్రకారం నీ రాజ్య సర్వస్వమూ నాకు దానం చేయాలి. ఆడినమాట తప్పరాదు" అంటూ హరిశ్చంద్రుని సర్వ రాజ్యాన్ని దానం చేయించుకొన్నాడు. సంతోషంగా దానమిచ్చాడు హరిశ్చంద్రుడు. సామాన్య పౌరునిగా నూలువస్త్రాలు ధరించి అంతఃపురం వదలి వెళ్ళబోతున్న సమయంలో విశ్వామిత్రుడు హరిశ్చంద్రుని అడ్డగించాడు. "ఒకానొకప్పుడు యాగ నిమిత్తం ధనమిస్తానని మాట ఇచ్చావు గదా! ఆ ధన మంతా నాకిప్పుడే కావాలి" అంటూ వత్తిడి చేశాడు. హతాశుడయ్యాడు హరిశ్చంద్రుడు.

"విశ్వామిత్ర మహర్షీ! నాకు కొంత గడువు ఇప్పించండి. మీ యాగార్థ ధనాన్ని మీకు ఒప్పిస్తాను. అంటూ కొంత గడువు తీసుకొన్నాడు హరిశ్చంద్రుడు. బాకీ వసూలు చేయటానికి నక్షత్రకుడనే మునిని హరిశ్చంద్రునితోపాటు పంపించాడు మహర్షి.

అయోధ్యానగరం నుండి వారణాసి (కాశి)కి భార్యాబిడ్డలతో నక్షత్రక సమేతంగా చేరుకున్నాడు హరిశ్చంద్రుడు. బాకీ తీర్చవల్సిన గడువు వచ్చింది. హరిశ్చంద్రుని భార్య చంద్రమతి. ఈమెకు తారామతి అనికూడా మరొక పేరువుంది. మహర్షి ఋణగ్రస్తుడై మనోవ్యధతో శుష్కించిపోయిన హరిశ్చంద్రుని దుస్థితిని చూచి చంద్రమతి బావురుమని ఏడ్చింది. సత్యనిష్ఠకోసం పడరాని పాట్లు పడుతున్న భర్తతో "స్వామీ! మహాచక్రవర్తులైన మీరు అల్ప ఋణగ్రస్తులై నిరంతర చింతతో వున్నారు. ఈ స్థితిలో నాకొక మార్గం గోచరిస్తూ వుంది. మీరుకోపించక నా మాట వినాలి. నేను మీ అర్ధాంగిని. మీ కష్ట సుఖాలలోనూ, కీర్తి అపకీర్తిలోనూ నేనూ భాగస్థురాలినే గదా! ఈ వారణాసిలో నన్ను విక్రయించి ఆ ధనాన్ని మహర్షికి ఇచ్చి ఋణ విముక్తులుకండి. సంకోచించకండి. మన సత్యవ్రతంకన్నా నాదాస్య వృత్తి ఏమంతటిది! అనిత్యమైన శరీరం సత్యవ్రతం కన్నా గొప్పది కాదు." అని భర్తయైన హరిశ్చంద్రుని ఒప్పించింది. భర్త కీర్తికి భంగం కల్గుతుందేమోనని భయపడి దాసిగా అమ్ముడుబోయింది. భార్యాపుత్రుల్ని గోల్పోయిన హరిశ్చంద్రుడు కూడా ఒక కాటికా పరికి దాసుడుగా అమ్ముడు బోయాడు. అఖండ మహా భారతావనికి చక్రవర్తియైన ఒక మహాపురుషుడు అతినీచ

హరిశ్చంద్రుడు భార్యను విక్రయించటం లోని అర్థం పరమార్థం ఈనాటి తరానికి అర్థంకాదు. ఈనాటి భార్యాభర్త లకు అసలు అర్థంకాదు. ఆనాటివారికి భార్య వేరు భర్తవేరు కాదు! ఆర్య సంస్కృతిని, ఆర్య సంప్రదాయాన్ని తులనాత్మకంగా అనుసరించి జీవించే మనుష్యులు వాళ్ళు. హరిశ్చంద్రుడు కేవలం తన భార్యను మాత్రమే అమ్మలేదు. అని నీచమైన ఛండాల దాస్యానికి అంగీ కరించి తాను కూడా అమ్ముడు బోయిన హరిశ్చంద్రుని వ్యక్తిత్వాన్ని అపహసించటం హిందువు లకు సిగ్గుచేటు కాదా! ఏ విలాసాలకో వ్యసనాలకో హరిశ్చంద్రుని సతీ విక్రయం జరుగ లేదు! ధర్మంకోసం, సత్యంకోసం, నీతి కోసం, నిజాయితీ కోసం నిష్ఠ కోసం, నియమంకోసం చంద్రమతీ విక్రయం జరిగింది.

వృత్తియైన కాటికాపరిగా జీవిస్తూ చివరకు తన భార్యను తన చేతులతో తానే తలతీయ వల్సిన స్థితిలోకూడా తన సత్య ధర్మాన్ని వదలలేదు. అంతటి మహోన్నతుడాయన. అంతటి ధీరవీరశూర ధీమంతమణిని "భార్యను అమ్ము కొన్న అసమర్థునిగా" చిత్రించి మాట్లాడటం ఏ భారతీయునికైనా ధర్మమా! ఈ హరిశ్చంద్రుడు మనదేశంలో కాకుండా మరొక దేశంలో జన్మించి వుంటే దైవావతారంగా కీర్తింపబడేవాడు కాదా! దేవాలయం కట్టించుకొనేవాడు కాదా! ఆలోచించి చూడండి.

సత్యవ్రత దీక్షకోసం పడరాని, పడగూడని కష్టాలు పడ్డ ఒక మహాత్ముని కథ విని కన్నీటితో అభినందనలు తెలుపవల్సిన మనం; హరిశ్చంద్రుని ఒక 'పోకిరి'గా భావించి ఎగతాళి చేయటం ఎంత విజ్ఞత! ఎంతటి సంస్కృతి!!

"నాస్తి సత్యాత్ పరం ధర్మః. నానృతాత్ పాతకం పరం"

ఆనాటి చంద్రమతీ విక్రయంలోని ధర్మం, మర్మం ఈనాటి చట్టాలకు ఈనాటి న్యాయస్థానాలకు, ఈనాటి న్యాయ శాస్త్రాలకు అందనిది. ఆలోచించ రానిది.

మనకు వాక్ స్వాతంత్ర్యం వుంది! వుంది కదా అని అజ్ఞానంతో ఒక మహోన్నతుని జీవితానికి మట్టి గొట్టటం మనవారికి మన దేశానికి మాత్రమే చెల్లింది. మరొక దేశంలో అయితే మరొకలా వుంటుంది. మన చరిత్రకు మన పురాణాలకు మన విశ్వాసాలకు అపచారం అవమానం చేసిన వారెవరైనా మరో విధంగా మూల్యాన్ని చెల్లించుకోక తప్పదు. సత్యమేవ జయతే!

సత్యం ధర్మః తపోయోగః సత్యం బ్రహ్మ సనాతనమ్ ।
సత్యం యజ్ఞః పరః ప్రోక్తః సర్వం సత్యే ప్రతిష్ఠితం ॥

✦☆✦

తిరునాళ్ళు జాతరలు ఎందుకు?

తిరునాళ్ళు అంటే ఊరి పండుగ.

జన సాంస్కృతిక వుత్సవాలనే తిరునాళ్ళు, జాతరలు అంటారు.

"తిరు" అంటే మంగళకరము అని అర్థం

"తిరునాళ్ళు" అంటే శుభకరమైన దినాలు అని అర్థం. తిరునాళ్ అనే పదం తమిళభాష నుండి తెలుగుకు సంక్రమించింది. 'జాతర' అనేది తెలుగుపదం.

సమస్త ప్రాణుల్లాగే మనుషులు కూడా ప్రాణులే అయినా, సృష్టిలో ఏ ప్రాణికీ లేని మేధాశక్తి మనికిషి మాత్రమే వుంది. అందుకే ప్రాణులన్నిటిలోకి మనిషే గొప్పవాడయ్యాడు. తనకన్నా ఎన్నోరెట్లు బలమైన ప్రాణుల్ని కూడా లొంగదీసుకొని సేవ చేయించు కొంటున్నాడు.

మనిషి వివేకం తెచ్చుకొని, భాష నేర్చుకొని, సుఖాలు తెల్సు కొన్న తరువాత వినోద విజ్ఞానాల వైపుకి దృష్టిసారించాడు. సంఘ జీవిగా మారాడు. సాంఘిక కట్టు బాట్లను ఏర్పరచుకొన్నాడు. సాంఘిక ఆచారాలు నియమాలు సజావుగా సాగాలంటే మనుషులకు భయం వుండాలిగదా! సరిగ్గా ఈ ఆలోచనా - స్థితిలోనే దేవుడు దేవా లయాలు మొదలయ్యాయి.

తిరునాళ్ళు ప్రారంభించిన వుద్దేశ్యం చాలా గొప్పది. పున్నమి

> తిరునాళ్ళ సమయంలోనే ఎంతో వస్తు మార్పిడి జరుగుతుంది. ఎన్నో గృహ అవసరాలు తిరునాళ్ళతో తీరేవి. ఊరు మొత్తం ఆనందం అనుభవించే వారు. ఈనాటి తరంవారికి ఏది కావల్సినా వెంటనే దొరుకుతుంది. ఆనాటి వారికి తిరుగలి నుండి రోకలి వరకూ దుప్పటి నుండి దుశ్శాలువ వరకూ ఉప్పు నుండి పప్పువరకూ తిరునాళ్ళలోనే వస్తు మార్పిడి తో లభించేవి.
>
> ఆనాటివారికి జాతరలు తిరునాళ్ళు చాలా ముఖ్యం.
>
> భక్తికీ, రక్తికీ తిరునాళ్ళు ఆనవాళ్ళు

దినాలలో మాత్రమే జరిగే తిరు నాళ్ళకు దూర దూరాలనుండి రక రకాల విజ్ఞానదాయకమైన హస్తకళా వస్తువులు, గృహోపకరణాలు, దుస్తులు అమ్మకానికి వచ్చేవి. పశువుల అమ్మకంతోపాటు కొనుగోలు కూడా నడిచేది. నృత్య, సంగీత కార్యక్రమాలు వుండేవి. రకరకాల వింతవింతైన తినుబండారాలు దొరికేవి. ఎప్పుడూ బయట ప్రజలను చూచి ఎరుగని నవయువతు లందరూ తిరునాళ్ళ నెపంతో బయటకు వచ్చేవారు. దేవుని ఉత్సవాలకు శ్రీమంతుడు పేదవాడు అనే వ్యవత్యాసం వుండకూడదు గాబట్టి అందరూ కలిసిపోయేవారు. ప్రతి యింటికీ బంధువులు వచ్చేవారు. చాలా కుటుంబాల్లో ఈ సమయంలోనే వివాహాలు నిశ్చయం అయ్యేవి. పాత తగాదాలు పరిహారం అయ్యేవి. ఆస్థి పంపకాలు కూడా ఇపుడే జరుపుతుండేవారు.

ఐదు/తొమ్మిది/పదకొండు రోజులుగా తిరునాళ్ళు జరుపుతుండేవారు. ఏ తిరునాళ్ళు అయినా చైత్ర వైశాఖ మాసాలలోనే జరుగుతాయి. స్త్రీశక్తిదేవతల జాతరలు అన్ని మాసాలలోనూ జరిపే ఆచారం వుంది.

✦☆✦

గురుకులం అంటే ఏమిటి?

ఋషి సాంప్రదాయాన్ని గురుకులం అంటారు

రుషి సాంప్రదాయమంటే వైదిక సంప్రదాయం లేదా ఆశ్రమ సంప్రదాయం అని చెప్పుకోవచ్చు. గురుకులంలో విద్యాబోధన ఎంత ముఖ్యమో సత్రవర్తన కూడా అంతే ముఖ్యం. ఉత్తీర్ణత కంటే ఉన్నతత్వం గొప్పదిగా గురుకులంలో భావిస్తారు. విద్య కేవలం విజ్ఞానాన్ని అందిస్తే, ప్రవర్తన అనేది మనిషికి సర్వతో ముఖాభివృద్ధి కల్గిస్తుంది అని గురుకుల నమ్మకం. ధర్మం, నీతి, శాంతి, వినయం, సద్గుణం, సద్భావం మొదలైనవన్నీ గురుకుల లక్షణాలు.

గురుకులాన్ని గురుపీఠం అని కూడా అంటారు. విద్యాపీఠం అని కూడా అనవచ్చు. గురుకులంలోని విద్యార్థులకు విద్యాశుల్కం (ఫీజు) వుండదు. గురుసేవ, గురుభక్తి విద్యా శుల్కంగా భావించబడుతుంది. ఈ గురుకులాల్లో ఒకప్పుడు

బ్రాహ్మణ క్షత్రియులకు మాత్రమే ప్రవేశం వుండేది. మహరాజుల ఆశ్రయంతో, రక్షణతో నడుస్తుండేవి. జనావాసాలకు దూరంగా నదీతీరాలలో ప్రశాంత వాతావరణంలో గురుకులం నిర్మించేవాళ్లు. మహారాజు బిడ్డడైనా గురుకుల పద్ధతులకు కట్టుబడి చదువుకోవల్సిందే. అయితే కొందరు బ్రాహ్మణ బ్రహ్మ చారులు సమీప గ్రామంలో భిక్షను స్వీకరించి గురుకులానికి సహాయపడుతూ విద్యనభ్యసించేవారు. శ్రీమంతుల ఇండ్లలో భిక్షను అర్థిస్తూ విద్యాభ్యాసం చేయటం ఆనాటి గురుకుల విద్యార్థులకు చిన్నతనంగా వుండేదికాదు. బ్రాహ్మణ పిల్లలకు చిన్నతనంలోనే ఉపనయనం చేయటంలోని కారణమిదే! ఉపనయనం కాకుండా భిక్షను స్వీకరించరాదు. ఉపనయనం కానివారికి దానం చేయరాదు. ఇది హైందవ ధర్మం.

ఉపనయనం అంటే జ్ఞానసిద్ధి
(బ్రహ్మత్వసిద్ధి)

ఇపుడు కూడా తిరుపతి - శ్రీశైలం - పుట్టపర్తి - మంత్రాలయం - కాళహస్తి -'ఇస్కాన్' హైదరాబాదు - బ్రహ్మంగారి మఠం మొదలైన చాలాచోట్ల గురుకులాలు వున్నాయి. ఉచిత భోజనం, ఉచిత విద్య ఈ గురుకులాల్లోని విద్యార్థులకు దొరుకు తున్నాయి.

ఇంగ్లీషు వ్యామోహంతో తమ బిడ్డల్ని కాన్వెంట్ స్కూళ్ళకు నడిపించే తల్లిదండ్రులకు గురుకులవిద్య అంటే కాకరకాయ కషాయమే.

> సూక్ష్మంగా చెప్పాలంటే కాన్వెంట్ స్కూళ్లలో గురువు గారు నిలుచుని వుంటే శిష్యులు హాయిగా కూర్చొని వుంటారు. కాని గురుకులంలో అయితే గురువుగారు కూర్చొని వుంటే శిష్యులు నిలుచుని వుండాలి.
>
> ఇపుడు మన విద్యాబోధన 'మెకాలే' పద్ధతిలో జరుగుతోంది.

అజ్ఞాన తిమిరాంధస్య - జ్ఞానాంజన శలాకయా ।
చక్షురున్మీలితం యేన తస్మైశ్రీ గురవే నమః ॥

✦☆✦

విద్య, వేదము, అన్నము విక్రయించకూడదా?

కూడదు !

ఇది పుణ్యభూమి ! ఇక్కడ అన్న విక్రయం జరుగకూడదు.

ఇది వేదభూమి ! ఇక్కడ వేదశాస్త్రాల విక్రయం వుండకూడదు.

ఇది ధర్మభూమి ! ఇక్కడ విద్యావిక్రయం చేయకూడదు.

ఇది కర్మభూమి ! ఎవరూ దుఃఖితులు కాకూడదు.

వేల సంవత్సరాలనాటి భరతదేశ సమాజం, భరత ప్రజ, భరతదేశ రాజరికం. పైన చెప్పిన సిద్ధాంతాలను తు.చ తప్పకుండా నియమనిష్ఠానిరతులై పాటించేవారని శాస్త్రాలు స్మృతులు చెబుతున్నాయి. వేయి సంవత్సరాలక్రితం వరకూ ఆహారాన్నీ విద్యనూ విక్రయించేవారు కాదిక్కడ! అంతెందుకు; ఈనాడు కూడా వేదపురోహితులు వివాహం చేయించినా, పూజాదికాలు చేయించినా ముందుగానే యింత ఇవ్వాలని బేరం చేయరు. ఎక్కడైనా ఎవరైనా పెండ్లి చేయిస్తే ఎంతిస్తారు? పూజ చేయించితే ఎంతిస్తారు? అని గనుక అడిగితే వాడు బ్రాహ్మణుడే కాదని అర్థం. అటువంటి అధమ బ్రాహ్మణునితో వివాహాది వైదిక కార్యక్రమాలు చేయిస్తే ఫలితం వుండకపోగా దురితం వస్తుంది.

ఈనాటి భోజన హోటల్స్, ఉపాహారశాలలు మన సాంప్రదాయంకాదు. అందువల్లనే భారతీయ ధర్మశాస్త్రం 'అతిధిదేవోభవ' అని చెబుతుంది. ప్రతి గృహస్థుడూ వర్ణకుల విబేధం లేకుండా ప్రతిరోజూ ఎవరో ఒక అతిథికి భోజనం పెట్టి దైవకార్యంగా సంతోష పడేవాడు. 'అన్నదాతా సుఖీభవ' అని భోజనం చేసిన అతిథి ఆశీర్వదించి వెళ్ళేవాడు. ప్రతి ప్రాణికీ ఆహారం అతిముఖ్య అవసరంగదా!

'విద్యాదానం మహత్తరం! మనం నేర్చిన విద్య మనతోనే నశించి పోకూడదు. ఒక విత్తనం నాటితే వేల విత్తనాలను మనకు అందించినట్లుగా మనం నేర్చిన విద్యను మన సమాజానికి అందించి విద్యా సంపన్నులను చేయటమే విద్యాపరమార్థం! మనిషికి విజ్ఞాన వివేకాల నందించే విద్యను

ధనాశతో విక్రయంసాగిస్తే నీవు జన్మించిన నీ సమాజానికి నీవేమి వుపకారం చేసినట్లు? నీ జన్మభూమికి నీ రుణం తీరేదెట్లు? 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపిగరీయసి' అన్న హితవాక్యం ధూళికి పోయినట్లే గదా! ప్రపంచానికే ఆదర్శవంతమైన దేశం మనది ఒకప్పుడు.

పాశ్చాత్యుల పాదార్పణతో భారత సంప్రదాయాలన్నీ హారతి కర్పూరమై పోయాయి. ఈనాటి విద్యార్థులు చదవటంలేదు. "చదువుకొంటున్నారు". ఈదేశ తీరుతెన్నులన్నీ మారిపోయాయి. మార్పు సహజమే. మార్పు కోరుకోవటమే మానవలక్షణం. మార్పు లేకుంటే మనమింత ప్రగతిని సాధించేవాళ్ళంకాదు. కాని.. మార్పుతో పాటుగా మానవత కూడా వుంటే ఎంత బాగుంటుంది! మానవత నిండిన మనుగడ మాత్రమే మనిషికి మహదానందాన్ని కల్గిస్తుందన్నది నిత్య సత్యం.

ఎన్నిదేశాలనైనా పర్యటించు। మన దేశాన్ని మాత్రం మరచిపోకు.!

ఎన్ని భాషలనైనా నేర్చుకో! తల్లి భాషను మరచిపోకు!

✦☆✦

మరణం ప్రాణులకు అవశ్యకమా?

శ్లో॥ జాతస్యహి ధృవోమృత్యుః ధ్రువంజన్మ మృతస్య చ ।
తస్మాదపరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి ॥ భగవద్గీతా - 2- 27

జన్మించిన ప్రతి ప్రాణికి మృత్యువు తప్పదు. ఇదే విధంగా మరణించిన ప్రతి జీవికి పుట్టుక కూడా తప్పదు. నిత్యసత్యమైన, నిస్సంశయమైన ఈ విధి విధానం గూర్చి దుఃఖించ తగదు అంటున్నది భగవద్గీత.

దుఃఖబద్ధమైన జీవితానికి మరణమే విముక్తి!

మరణం లేకపోతే మానవజీవితం ఎంత దుర్భరం!!! బాల్యం తెలియకుండా గడచిపోతుంది. యవ్వనం సుఖభోగాలతో నడచిపోతుంది. కౌమారం బాధలున్నా బాధ్యతలతో గడచిపోతుంది. మనిషికి చివరిదశయైన వార్ధక్యం అతి భయంకరమైనది. దేహం శక్తిని కోల్పోయి వుంటుంది. కనులు దృష్టిని

> మనిషికి మరణం తప్పక వుండాలి. తప్పక కావాలి. శిథిలమైన మన జీవిత స్థానాన్ని మరొకరికి ఇవ్వాలి. పండిన ఆకు రాలిపోయి క్రొత్త చిగురు వచ్చి నట్లుగానే సృష్టిధర్మాన్ని గౌరవించాలి. ఇది విధి నియమం. ఏ వస్తువైనా, ఏ ప్రాణి అయినా పుట్టటం అనే గుణం వుంటే తప్పకుండా గిట్టటం వుండి తీరుతుంది. శ్రీరాముడు మరణించ లేదా! శ్రీకృష్ణుడు మరణించ లేదా! ఏసుక్రీస్తు మరణించలేదా! మహమ్మద్ ప్రవక్త మరణించలేదా! సృష్టికి ప్రతిసృష్టి చేసిన ఎందరెందరో మహానుభావులు మరణించలేదా!

తగ్గించుకొంటాయి. మేధస్సు బల హీనమై జ్ఞాపకశక్తి నశిస్తుంది. జీర్ణ శక్తి వుండదు. అధికారం వుండదు. ఆర్జన వుండదు. తరభేదం (జన రేషన్‌గ్యాప్) వలన యువశక్తి యుక్తులముందు వార్ధక్యం చిన్న బోతుంది. ఎవరూ పట్టించు కోరు. మాటకు మన్నన వుండదు. అప్పటి వరకూ సర్వాధికారిగా వెలిగిన మనిషి నిరుపయోగిగా నిలిచి పోవల్సి వస్తుంది. దైన్యం ఆవరించి దుఃఖం కలచి వేస్తుంది. అశక్తుడైన మనిషి మరణాన్ని శరణు వేడతాడు. జీవితం వద్దు అనిపిస్తుంది. బ్రతుకు బాధ అనిపిస్తుంది. మృత్యుదేవత కోసం ఎదురు తెన్నులు చూచే పరమయాతనా స్థితి అది! నరాలకు బిగువు సదలిపోయి మల మూత్ర విసర్జన తెలియకుండానే జరిగిపోతుంది. అప్పటివరకూ అందరి పొగడ్తలకూ, ఆదరా భిమానాలకూ పాత్రమైన అదే మనిషి ఛీత్కారాలకూ చీదరింపులకూ తలవంచ వల్సిన దుస్థితి దాపురిస్తుంది.

మరణం జన్మధర్మం.

మరణం మనిషికి మిత్రుడు. జీవితమే శత్రువు.

అసతో మా సద్గమయ !

తమసోమా జ్యోతిర్గమయ !

మృత్యోర్మా అమృతంగమయ !

✦☆✦

ఒకే యింటి అక్కచెల్లెళ్ళను అన్నదమ్ములు వివాహమాడవచ్చా?

ఒకే తండ్రికి పుట్టిన అక్కచెల్లెళ్ళను ఒకే తండ్రికి జన్మించిన అన్నదమ్ములు వివాహం చేసుకోరు. దీనికి సరైన శాస్త్రాధారం లేదుగాని ఈ నియమం కొన్ని సాంఘిక సౌలభ్యాల కోసమేనని పండితాభిప్రాయం. అంతేకాక ఋగ్వేదాది వేదప్రమాణంగాని, స్మృతి ప్రమాణం గాని కనబడదు దీనికి. ఉత్తర భారతంలో మాత్రం ఈ నియమాన్ని పాటిస్తారు. నేటికీ.

ఈ నిబంధనకు సహేతుక కారణాలు కొన్ని వున్నాయి. ఈ ఆచారాలు సంప్రదాయాలు మానవహితం కోసం మనిషి సృష్టించుకొన్నవే గదా! అక్క చెల్లెళ్ళను అన్నదమ్ములు చేసుకొన కూడదనే నియమంతో పాటు కుండ మార్పిడి విధానం కూడా కొందరు అంగీకరించరు. కుండ మార్పిడి అంటే మన యింటి ఆడపడుచును వారికిచ్చి వారింటి ఆడపడుచును మనం తెచ్చు కోవటం అన్నమాట.

> ఒకే యింటిసోదరులు ఒకే యింటి అక్కచెల్లెళ్ళను చేసుకోవటం శాస్త్ర నిషిద్ధం కాకున్నా సామాజిక నిషిద్ధంగా భావించి చేసుకోక పోవటమే మంచిది. ఒకే యింటి ఆడపిల్లలు కోడళ్ళుగా వస్తే కుటుంబకలతలు వుండవను కోవటం భ్రమ. ఒకే రక్తం పంచుకొన్న అన్న దమ్ములే కత్తులు దూసుకొంటున్న ఈ కాలంలో కోడళ్ళు కలిసిమెలిసి వుంటారా! ఆర్థిక వ్యత్యాసాలు కలిసి మెలిసి వుండ నిస్తాయా! కాబట్టి నిషిద్ధాన్ని పాటించటమే మంచిదేమో!

ఈ నిషిద్ధాలకు కొన్ని సామాజిక కారణాలున్నాయి.

మన యింటి ఇద్దరు లేక ముగ్గురు ఆడపడుచుల్ని ఒకే ఇంటి వారికిచ్చి వివాహం చేస్తే అల్లుళ్ళనందరినీ సమాన స్థాయి లో చూడాలి. అందరికీ సమాన

నిష్పత్తిలో గౌరవ మర్యాదలు చేయాల్సి వుంటుంది. వారి కుటుంబంలో ఏ శుభకార్యం జరిగినా అనూహ్యరీతిలో ఖర్చువెచ్చాలను భరించవల్సి వుంటుంది. ఆడపిల్లల తండ్రికిది భరించరాని సమస్య గదా!

ఇదిలా వుంటే;

ఒకే యింటి ఆడపడుచుల్ని కోడళ్ళుగా తెచ్చుకొంటే కొడుకుల తండ్రికి వంద సమస్యలు. అక్కచెల్లెండ్రలో ఐకమత్యం పెరిగినా సమస్యే! ఐకమత్యం తగ్గినా సమస్యే! కన్నబిడ్డలు భార్యలమోహంలో పడిపోతే ఇంటి అధికారమంతా ఆ కోడళ్ళదైపోయి తన యింటికి తానే పాలేరు కావల్సివస్తుంది. ఇద్దరు కొడుకుల్లో ఒకడు చెడ్డవాడైనా, ఇద్దరు కోడండ్రలో ఒకరు చెడ్డవారైనా జరిగే నష్టాన్ని అందరూ భరించవల్సిన సమస్య రావచ్చు.

అక్కకూతుర్ని, మేనమామకూర్ని చేసుకోవటం కూడా నిషిద్ధంగా భావిస్తారు. ఆంధ్ర కర్నాటక రాష్ట్రాలలో కొంత భాగంవారు మాత్రమే అక్క కూతుర్ని వివాహమాడతారు. ఉత్తరభారతీయులు అక్కబిడ్డను సోదరీ సమానంగా భావిస్తారు. ముస్లి మతంవారు కూడా అక్కకూతురిని వివాహం చేసుకోరు. ముస్లిములది క్షేత్ర ప్రాధాన్యపద్ధతి. హిందువులలో కొందరు మేనత్తకూతుర్ని కూడా వివాహం చేసుకోరు.

✦☆✦

బిడ్డలు కలుగనివారు నాగశిలను పూజిస్తారేమిటి?

మన ఆంధ్రులు నాగజాతికి సంబంధించినవారన్న వాదన వుంది.

నాగశిలను పూజించటానికీ సంతానం కలుగటానికీ ఏ మాత్రం సంబంధం లేదు. రాతికి దణ్ణంపెడితే ఎక్కడైనా బిడ్డలు కలుగుతారా! ఆచారం అంటే కళ్ళుమూసుకొని నడిచే రాజమార్గంకాదు. ఎత్తుపల్లాలువుండే అరణ్యమార్గం. ఆలోచన కలిగిన ఆచారమే సువిచారం. ఆలోచనలేని ఆచారం దురాచారం. పిల్లలు కలుగటానికి నాగశిల కారణంకాదు. అయితే నాగశిల (పెనవేసుకొని వున్న రెండు సర్పాలు వున్న ప్రతిమ)ను పూజించే పద్ధతి మనకు ఎలా వచ్చిందో పరిశీలిద్దాం. సృష్టికార్యం (సంభోగం) ప్రాణులకు సహజప్రక్రియ. అయితే, నాగుపాములు సృష్టికార్యం జరుపుకొనే విధానం విచిత్రంగానూ, ఆవేశ పూరితం గానూ, అద్వితీయంగానూ వుంటుంది. ఒకదానిని ఒకటి పెనవేసుకొని రతి యుద్ధం చేస్తున్న విధంగా వుంటుంది. సంయోగం తరువాత గ్రుడ్లు పెట్టి 30 నుండి 60 పిల్లల్ని కంటుంది. అతి సంతానానికీ, అతి సంభోగానికీ నాగులు ప్రసిద్ధ జాతి. కాబట్టి ఈ రకంగానే నాగశిలను పూజించటం జరుగుతోంది. కొందరు సంతానం కోసం పొర్లుదండాలు పెడుతుంటారు చూచారా! పొర్లు దండాలవల్ల గర్భసంచిలోని దోషాలు పోతాయని 'సైన్సు' కూడా చెబుతున్నది. గర్భదోషం వున్న స్త్రీలకు పొర్లు నమస్కారాలు వుపయోగకరమేనని నిస్సందేహంగా అంగీకరించవచ్చు.

శ్లో॥ తాసామాద్యాశ్చ తస్రస్తు నిందిత్యేకాదవీ చ యా ।
త్రయోదశీచ తేషాస్తు, ప్రశస్తా దశ రాత్రయః ॥ మనుస్మృతి 3 । 17

స్త్రీ ఋతుమతి అయిన దినం నుండి నాల్గురోజులు వదలి ఐదవదినంనాడు భార్యతో కలవాలి. పదకొండవరోజు, పదమూడవరోజు, భార్యా సంగమం చేయకూడదు. పదహారవ రోజువరకు స్త్రీకి ఋతుకాలమనియు ఈ ఋతు క్రమాన్ని పాటిస్తే సంతానం కల్గుతుందనియు మనుస్మృతిలో చెప్పబడింది.

ఈనాటి శాస్త్రవిజ్ఞానం కూడా స్త్రీ బహిష్టు అయిన పధ్నాలుగవ రోజుగాని, పదిహేను, పదహారవ రోజుగాని స్త్రీకి అండం విడుదలయ్యేరోజులనీ, ఈ రోజులలో స్త్రీ పురుష సంగమం జరిగినట్లయితే సంతానోత్పత్తి జరుగుతుందనీ, చెబుతోంది. నెలకు పదిరోజులు మాత్రమే సంతానోత్పత్తి దినాలు.

ఈ ఋతుధర్మం పాటిస్తే పిల్లలు పుడతారుగాని, నాగశిలవల్ల పుట్టరు.

ఇంకొక విషయం!

స్త్రీ బహిష్టు అయిన రోజునుండి లెక్కించి 'ఆరు - ఎనిమిది - పది - పన్నెండు - పధ్నాలుగు - పదహారు' ఈ రోజులలో భార్యా సంగమం చేస్తే మగబిడ్డ పుడతాడనీ; 'ఐదు - ఏడు - తొమ్మిది - పదకొండు - పదమూడు - పదిహేను" ఈ రోజుల్లో భార్యా సంగమం చేస్తే ఆడబిడ్డ కల్గుతుందని శాస్త్రం.

శ్లో॥ యుగ్మా సుపుత్రాజాయంతే, స్త్రియో యుగ్మాసు రాత్రిషు ।
తస్మాద్యుగ్మాసు పుత్రార్థీ, సంవిశేదార్తవే స్త్రియమ్ ॥

✦☆✦

గోవును భూలోక దేవతగా పూజిస్తారెందుకు?

వేదకాలంనుండీ హిందువులు గోవులను దేవతా స్వరూపంగా భావించి పూజిస్తున్నారు. భారతీయులశక్తి, భారతీయుల సంపద, భారతీయుల బలం గోవులమీదనే ఆధారపడి యుండేది.

శ్లో॥ వరుణశ్చైవ గోమూత్రే, గోమయే హవ్య వాహనః ।
దధే వాయుః సముద్దిష్టః సోమఃక్షీరే ఘృతే రవిః ॥ పరాశరస్మృతి 21-39

గోమూత్రంలో వరుణుడు - గోమయంలో (పేడలో) అగ్నిదేవుడు - ఆవుపెరుగులో వాయుదేవుడు - ఆవుపాలలో చంద్రుడు - ఆవునేతిలో సూర్యుడు వున్నారు. ఆవు ముఖంలోనూ, ఆవు యోనివద్దనూ ఇష్టార్థదేవతలున్నారని మన స్మృతులన్నీ చెబుతున్నాయి. గోవును పూజించి ప్రదక్షణ ముమ్మారులు చేస్తే సర్వపాపాలు హరించిపోతాయని గూడా హిందువుల ప్రగాఢ నమ్మకం.

ఈ కాలపు శ్రీమంతుడు కోట్ల ఆస్థి కలిగివుంటేనే శ్రీమంతునిగా చెలామణి అవుతాడు. అందరూ గౌరవించి మర్యాదలు చేస్తారు. పూర్వకాలంలో అలా కాదు. ఎన్నివేల; లక్షల గోవులుంటే అంత శ్రీమంతునిగా గౌరవించేవారు. ఈనాటి భూస్వాముల కన్నా ఆనాటి గోస్వాములకు విశేష గౌరవం వుండేది. రాజగౌరవం లభించేది.

పూర్వకాలంలో గోస్వాములే మహా శ్రీమంతులుగా వుండేవారు.

చంచలమైన ధనానికి ఆ రోజుల్లో విలువలేదు.

గోధనమే ధనంగా భావించేవారు.

> గోవు మల మూత్రాదులలో (పెన్సిలిన్) రోగనిరోధకశక్తి వుంది.
>
> గోమాతను సేవించేవారికి లక్ష్మీ కటాక్షం సిద్ధిస్తుంది.
>
> గోవులకాపరికి ఆరోగ్యం ఆయుష్షు ఎక్కువగా వుంటుంది.

మహాభారతంలో విరాటరాజు గోధనాన్ని దుర్యోధనాదులు దౌర్జన్య పూరితంగా దోచుకొని పోవాలనుకొని అర్జునుని చేతిలో పరాభవం పాలవటం ఉత్తరగోగ్రణ కథలో (విరాటపర్వం) మీరందరూ వినేవుంటారు. గోధనంలేని రాజ్యం క్షీణించి పోతుందని అరిష్టాల పాలౌతుందని దుర్యోధనుని వుపాయం! ఆనాటి రాజులకు, శ్రీమంతులకు గోవులే ధనంగా వుండేవి. వస్తుమార్పిడికి కూడా ఆవులనే ఇచ్చేవారు.

పూర్వకాలపు స్త్రీలు బహుసంతానవతులుగా వుండేవారు. పుట్టినబిడ్డలకు తల్లిపాలు చాలినన్ని లభించేవికాదు. పసిబిడ్డలనుండి పెద్దవారి వరకూ ఆవుపాలే సంపూర్ణ ఆహారంగా సేవించేవారు. పసితనంలో ఆవుపాలు త్రాగినవారికి రోగాలు రావు. ఎందుకంటే ఆవుపాలు త్రాగిన వారికి ఎక్కువ రోగనిరోధక శక్తి వుంటుంది.

గోసంతానమైన ఎద్దులు పొలందున్ని ఆహారోత్పత్తికి సహాయపడేవి. అన్నదాత అయిన రైతు సోదరునికి అన్ని పనులలోనూ సహాయపడేవి గోసంతతి. యిటువంటి గోమాతను దేవతగా పూజించటం ధర్మమే గదా!

✦☆✦

దేవాలయాల్లో రావిచెట్టు, వేపచెట్టు ఎందుకుంటాయి?

వృక్షో రక్షతి రక్షితః

రావిచెట్టుకి అశ్వత్థవృక్షమనీ, బోధివృక్షమనీ పేర్లున్నాయి. దాదాపుగా దేవాలయాల్లో రావిచెట్టు లేదా వేపచెట్టు వుంటాయి. ఎక్కువచోట్ల రావి వేప కలిసి వుంటాయి. రావిచెట్టును పురుషునిగానూ, వేపచెట్టును స్త్రీగానూ భావించి పూజించటం ఎక్కువ. రావిని విష్ణు స్వరూపంగానూ, వేపను లక్ష్మీ స్వరూపం గానూ భావించి ప్రదక్షిణలు చేస్తుంటారు. ఈ జంట వృక్షాలను పూజిస్తే దాంపత్య దోషనివారణ కల్గి సంసారం అన్యోన్యంగా వుంటుందని హిందువుల నమ్మకం. రావివృక్షం గురించి 'పద్మపురాణం'లో వివరించబడింది.

రావిచెట్టులోని అణువణువూ నారాయణ స్వరూపమేనని ఆగమశాస్త్రాలు కూడా చెబుతున్నాయి. ఈ విషయాన్ని స్కందపురాణం కూడా చెబుతుంది. అందుకే శ్రీకృష్ణుని 'వటపత్రశాయి' అంటారు. పసిబిడ్డకు జోలపాడేటపుడు 'వటపత్ర శాయికి వరహాల లాలి' అని పాడుతూ నిద్రపుచ్చటం వినేవుంటా రందరూ. (ఈనాటి తల్లులు పాడటం లేదనుకోండి)

జ్యోతిష్య శాస్త్రంలో రావిచెట్టుకి ఓ ప్రత్యేకత వుంది. శనిదోషం పోవాలంటే ప్రతిరోజూ రావిచెట్టు నీడన నిలబడాలి. నమస్కరించాలి. కౌగలించుకోవాలి. ఈ విధంగా కొన్ని రోజులు చేస్తే శనిదోషం తొలగిపోతుందట.

రావిచెట్టు కొమ్మలతో యజ్ఞయాగాలు చేస్తారు.

సన్యాసులు రావిచెట్టు కర్రను దండంగా చేసుకొంటారు.

రావిచెట్టునీడన కాసేపు కూర్చుంటే బి.పి. తగ్గుతుంది.

రావిచెట్టుగాలి మంచి ఆలోచనలను కల్గిస్తుంది.

శుద్ధోధనుని కుమారుడైన సిద్దార్థుడు ఎన్నో సంవత్సరాలు ఎందరినో సేవించినా కలుగని జ్ఞానోదయం, రావిచెట్టు క్రింద విశ్రమించిన తరువాత

మహాజ్ఞానోదయం కలిగి 'బుద్ధుడు' అయ్యాడు. అందువల్లనే రావిచెట్టును 'బోధి వృక్షం' అంటారు. బౌద్ధమతస్థులకు ఈ చెట్టు మహాపవిత్రమైనది. శ్రీకృష్ణుడు చివరిదశలో ఈ వృక్షం క్రిందనే విశ్రమించి ప్రాణత్యాగం చేశాడు. ఈ వృక్షం ఆడ, మగ పువ్వులు పుష్పించి కాయలు కాస్తుంది.

> దివ్యశక్తులున్న వృక్షాలు కాబట్టి రావిచెట్టునూ వేపచెట్టునూ దేవాలయాలలో ప్రత్యేకంగా నాటి పూజిస్తారు. రావిచెట్టును ఇండ్లవద్ద నాటకూడదు. వేపచెట్టును యింటికి ముందు వెనుకా నాటితే మంచిది. ఈ రెండు చెట్లను లక్ష్మీనారాయణులుగా భావించి పెండ్లిళ్ళు కూడా చేస్తుంటారు.

వేపవృక్షం కూడా ఎన్నో ఔషధ గుణాలను కలిగిన దివ్యవృక్షం. వేప వృక్షంలో ఎన్నో ఔషధగుణాలు వున్నాయి. వేప ఆకును ఎన్నో రోగాలకు మందుగా వాడతారు. వేప చెట్టు గాలికి ఎన్నో రోగకారక క్రిములు నశించిపోతాయి. వేపాకులను నీటిలో వేసి కాచి త్రాగినా, స్నానం చేసినా చర్మ వ్యాధులు సూక్ష్మక్రిములు నశిస్తాయి. వేపచెట్టువంటి దివ్య ఔషధ వృక్షం భూలోకం మరొకటి లేదు.

✦☆✦

దశావతారాలలో కృష్ణావతారమే గొప్పదా?

శ్లో॥ ఏకం శాస్త్రం దేవకీ పుత్రగీతమ్
ఏకో దేవో దేవకీ పుత్ర ఏవ ।
ఏకో మంత్రస్తస్య నామాని యాని
కర్మాప్యేకం తస్య దేవస్య సేవా ॥

మాధవుడు మానవుడై పుట్టి మానుషభావంతోనే మహా మహిమలు చూపించిన మహదవతారం శ్రీకృష్ణావతారం! అన్ని అవతారాలు వేరు. ఒక్క కృష్ణావతారం వేరు. ఈ అవతారంలోని ప్రత్యేకత, విశిష్టత, ధర్మనిరూపణ

మరే అవతారంలోనూ కనిపించవు. చిలిపిపనులు, శృంగార చేష్టలు, రాసక్రీడలు రాక్షసవధలు, రాజకీయనైపుణ్యం, మాటనేర్పరితనం, ధర్మరక్షణం, దుష్టశిక్షణం దైవీభావం, మోహనత్వం, నాయకత్వం మరే అవతారంలోనూ కానరావు.

శ్లో॥ నమః కృష్ణాయ దేవాయ బ్రహ్మణేఽనంత మూర్తయే ।
యోగీశ్వరాయ యోగాయ త్వామహం శరణం గతః ॥

కృష్ణావతారాన్ని పరబ్రహ్మ స్వరూపమనీ, కృష్ణుడు పరమాత్మ అనీ, కృష్ణభక్తి విజయదాయకమనీ, కృష్ణారాధన సాంసారిక సుఖప్రదమనీ స్కాందపురాణం వివరిస్తూ వుంది.

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ॥

అని గీతాచార్య అభయ ప్రవచనం! ధర్మవివరణ ధర్మవిచారణ వదలిపెట్టి మనోవాక్ కాయ కర్మలతో నన్ను శరణు పొందిన వారిని సర్వపాపాలనుండీ సర్వదుఃఖాలనుండి నేను రక్షిస్తాను కాబట్టి నా భక్తులైన వారెవ్వరూ చింతించ వద్దు. అంటాడు యోగీశ్వరుడైన కృష్ణుడు.

'నేనే దేవుడను! ఆదిమధ్యాంత రహితుడైన పరమాత్మను నేనే! సర్వమూ నాలో పుట్టి నాలోనే నశిస్తున్నాయి. నేను కానిది ఏదీ లేదు. నేను వుండనిది ఎక్కడా వుండదు. అన్ని ప్రాణులు నాకు ప్రియ మైనవే! అన్ని జీవులలోనూ నేనున్నాను. సమదర్శనం కల్గిన బుద్ధివంతులు నన్ను తెలుసుకోగలరు. నాకు కులమతాలు లేవు. నేను ఎవరికీ చెందినవాడను కాను. నాకు ఆచారము లేదు. అంటులేదు. రూపం లేదు. పేరు లేదు. నేను అవ్యక్తుడను. బండరాయి మొదలు బుద్ధిమంతుని వరకూ నేనే

దశావతారాలలో 'నేనే దేవుడను' అని చెప్పినవాడు కృష్ణుడొక్కడే. శ్రీరాముడు తనవారికోసం దుష్టసంహారం చేస్తే శ్రీకృష్ణుడు లోకం కోసం దుష్టసంహారం చేశాడు. అందువల్ల కృష్ణావతారం విశిష్టమైంది.

సృష్టిస్తున్నాను. అగ్ని - ఆకాశం -భూమి-వెలుతురు - నీరు ఇవన్నీ నావల్లనే పుట్టవిస్తున్నాయి. నేనే సృష్టి కర్తను. నేనే వినాశకుడను. నమ్మినవారికి నేనున్నాను. నమ్మనివారికి నేనుండను" అంటూ దైవ స్వరూపాన్నీ, దైవతత్వాన్నీ వివరించి విశదీ కరించిన అవతారపురుషుదు కృష్ణుడు ఒక్కడే!

'కృష్ణం వందే జగద్గురుమ్.

✦☆✦

జ్యోతిష్యం నమ్మదగినదా?

భవిష్యత్తు ఏం జరుగనున్నదోనని ప్రతిమనిషికీ ఆతృత, ఆలోచన వుంటాయి. తెలుసుకోవాలన్న ఆకాంక్ష ప్రతివారికీ సహజమే. శత్రువులతో సతమతమయ్యే మంత్రులకూ, లాభనష్టాలు ఆలోచించే వ్యాపారులకూ అధికార ప్రాప్తికోసం ఉబలాటప డే ఉద్యోగులకూ, సరిగా చదవని విద్యార్థులకూ భవిష్యత్తు అంధకారంగా కన్పించే ఎంతో మందికి జాతకాలనూ, జ్యోతిష్యాన్నీ ఆశ్రయించక తప్పటంలేదు. చాలాదేశాలలో ఇపుడు జ్యోతిష్యాన్ని నిషేధిస్తున్నారు.

జ్యోతిష్యం నిజమేనని ఒకవేళ అంగీకరించినా, జీవిత సరళిని విపులీ కరించి చెప్పగల వుద్దండ పండితుడు ఒక్కడూ లేడు. "ఉదరం నిమిత్తం బహు కృతవేషం" అన్న సూక్తికి సరిపడిన పండితులే వీళ్ళందరూ.

దయచేసి జాతకాలను నమ్మవద్దు
కృషిని నమ్మండి! కష్టపడండి.!

అకస్మాత్తుగా ధనవంతులు కావాలని కోరుకోకండి.

'అదృష్టం' అంటే అవకాశం! అవకాశం కోసం ఎదురుచూస్తూ మీ కృషిని మీరు చేయండి. అక్కరకురాని ఆలోచనలు వదలండి. అత్యాశకు పోకండి. మీ జీవన సరళిని మార్చుకోండి. పొదుపును పాటించండి. జల్సాలకు పోకండి. గొప్పతనం కోసం వృథా ధనవినియోగం విరమించండి. అప్పుడు మీకు దేవుడు

సహకరిస్తాడు. నవగ్రహాలు మీరు వద్దన్నా తోడుగా వుంటాయి. సోమరిపోతుని, ప్రతిదానినీ విమర్శించేవాడినీ, సుఖాభిలాషినీ సంపదలు వరించవు.

అతి విమర్శలు మానుకొనండి !

అందరికీ మిత్రులు కండి !

అందరితోనూ ప్రియంగా మాట్లాడండి !

అపుడు దేవుడు మేలు చేస్తాడో లేదోగాని, మీ చుట్టుప్రక్కల వారందరూ సహకరిస్తారు.

దేవుడున్నాడు !

ఆయన కేవలం మీ ఒక్కరి సుఖాలను చూచే మీ బంట్రోతు కాదు.

అమెరికా ప్రెసిడెంట్‌గారి కారు అయినా పెట్రోలు లేకపోతే నడవదు. మనమెంత విద్యావంతులమైనా వినయంలేకుంటే గౌరవం దొరకదు. "ఇరుసున కందెన బెట్టక పరమేశుని బండియైన పారదు సుమతీ" అన్నాడు సుమతీకర్త. పరమేశ్వరుని బండికైనా "ఆయిల్" వేయకపోతే నడవదు సుమా!

హిట్లర్ నియంత అంతటి సామ్రాజ్యా వందలకొద్దీ జ్యోతిష్య పండితులు సూచనలిచ్చేవారు. చివరకు హిట్లర్ ఏమయ్యాడు. పరాభవంపాలై పోయి కన్ను మూసాడు. కాబట్టి నిన్ను నడిపించేది నీ కృషి! నీ మంచితనం! నీ ప్రవర్తన! నీ పట్టుదల మాత్రమే! జ్యోతిష్యంకాదు. పూజలు నైవేద్యాలు కాదు.

కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన ।
హేకర్మ ఫలహేతుర్భూ: మాతే సంగోస్త్వ కర్మణి ॥

✦☆✦

సృష్టికి మొదటి దంపతులు ఎవరు?

శ్లో॥ వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే ।
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ ॥ - రఘువంశం

'నారా' అంటే నీరు.

సృష్టిలో మొదట పుట్టింది నీరు. (నారా)

నీటినుండి మొదట ఉద్భవించినవాడు నారాయణుడు.

మొట్టమొదటి దంపతులు పార్వతీపరమేశ్వరులు

సృష్టికే మొదటి స్త్రీమూర్తి పార్వతి (శక్తి)

అందువల్లనే వివాహకార్యక్రమంలో వధువుచేత పార్వతీ పూజ చేయిం స్తారు. లక్ష్మీపూజగాని, సరస్వతీ పూజగాని చేయించరు. కారణమేమంటే సృష్టికి మొదటి వధువు శివపత్నియే గదా.

శ్రీకృష్ణుని ఆరాధ్య దేవత పార్వతీదేవియే

పార్వతిని 'ఈశ్వరి' అంటారు. పరమేశ్వరునిలో సగభాగం ఈమెదే నన్నమాట. శివలింగంలో "లింగం శివుడు. పానువట్టం పార్వతి" శివలింగాన్ని పూజిస్తే పార్వతీ పరమేశ్వరులనిద్దరినీ పూజించినట్లే. శివుడు లేకుండా పార్వతి, పార్వతి లేకుండా శివుడు వుండరు. శివపార్వతులు సంగమ రూపంగానే వుంటారు. శివలింగం సృష్టి సంకేతం గదా!

అన్యోన్య దాంపత్యాన్ని, అనురాగ జీవితాన్ని, శాశ్వత బంధాన్ని కోరు కొనేవారు శివపార్వతులను పూజిస్తారు. మీరు గమనించారా పార్వతీ ఆలయం ఎక్కడా వుండదు. పార్వతీదేవికి ఒక్కదానికే ఆలయం నిర్మించరు. శివునితో కలిపి శివాలయం వుంటుంది. మరలా దుర్గాదేవికి, చాముండేశ్వరికి, కాళికా దేవికి ఇతర శక్తిదేవతలకు ప్రత్యేకంగానే దేవాలయం వుంటాయి. దుర్గ, కాళి మొదలైన దేవీ అవతారాలు ఒంటరివే. ఈ అవతారాలకు శివప్రమేయం వుండదు. (వుండనక్కరలేదు).

> పార్వతీ పరమేశ్వరులను ఫోటోల రూపంలోగాని బొమ్మల రూపంలో గాని పూజించకూడదు. శివలింగ రూపంలోనే పూజించాలి. శివ లింగాన్ని పసుపుతో గాని పిండితో గాని మట్టితోగాని సృష్టిలోని దేనితో నైనా సృష్టించి పూజించవచ్చు.

మనిషికి వార్ధక్యజీవితంలో లక్ష్మీ సరస్వతులతో పనిలేదు. అంటే చదువు తోను, డబ్బుతోనూ అవసరం తక్కువ. పార్వతితోనే ప్రార్థనలన్నీ! పార్వతి శక్తిప్రదాత కదా! దేహం క్షీణించి నర నరాలు దుర్బలమైపోయి లేవలేని సమ యంలో కావల్సింది శక్తియే గదా! అంతే కాదు మోక్ష ప్రదానం చేయగల మహా శక్తి ఆమెకే వుంది. మరొకరికి లేదు గాక లేదు.

లయత్వానికి పార్వతీ పరమేశ్వరులిద్దరూ కర్తలే.

అతి తొందరగా భక్తులకు వరాల నిచ్చే తల్లిదండ్రులు ఆ పార్వతీ పర మేశ్వరులిద్దరే. భార్యా భర్తలకే బిడ్డల ప్రేమ తెలుస్తుంది.

✦☆✦

విజయదశమికి శమీపూజ చేస్తారేమిటి?

ముందుగా విజయదశమిని గురించి పరిచయం చేస్తాను. మొట్టమొదటగా త్రేతాయుగంలో శ్రీరాముడు రావణసంహారం ముగించుకొని అయోధ్యా నగరానికి వచ్చిన శుభసందర్భంగా విజయోత్సవం జరిగింది. ఆరోజు దశమీ తిథికావటంవల్ల 'విజయదశమి'గా ప్రసిద్ధి చెందింది. ఇది తొమ్మిది రోజుల వుత్సవం. ఈ విజయదశమి శక్తిస్వరూపిణి అయిన పరమేశ్వరికి యిష్టమైన రోజు అని చెబుతారు. ఈ విజయదశమి రోజున ఏ పనిని ప్రారంభించినా నిర్విఘ్నంగా జరుగుతుందని చెబుతారు. విజయదశమి దినం శ్రవణా నక్షత్ర యుక్తమై వుండాలి. సూర్యాస్తమయానంతరం నలభై ఎనిమిది నిముషాల తరువాత (ఒక ముహూర్తకాలం) పరమేశ్వరి అపరాజితగా వుంటుందని శాస్త్ర ప్రవచనం. ఆ సమయంలో చేసే పూజలు, ప్రారంభించే పనులు విజయాన్ని చేకూరుస్తా యని నమ్ముతారు.

కురుక్షేత్ర యుద్ధంలో పాండవులు విజయం సాధించింది కూడా ఈ రోజునే!

దేవ-దానవులు పాలకడలిని మథించిన సమయంలో ఎన్నో ఓషధీ వృక్షాలు దేవతా వృక్షాలు పుట్టాయి. ఆ విధంగా పుట్టిన దేవతా వృక్షాలలో శమీవృక్షం (జమ్మిచెట్టు) కూడా ఒకటి. "శమీశమయతే పాపం" శమీ వృక్షానికి భక్తిపూర్వకంగా ప్రదక్షిణలు చేస్తే చేసిన పాపాలు పోతాయట. శమీవృక్షాన్ని పూజించితే విజయం లభిస్తుందని పూర్వీకుల నమ్మకం. శమీ వృక్షం పరాదేవత ప్రతిరూపమని అందరి విశ్వాసం. శమీవృక్షం ఆకులు విషానికి విరుగుడుగా పని చేస్తాయంటారు. ప్రతిరోజూ ఈ చెట్టు నీడన వుండి ఈ చెట్టునుండి లభించే గాలి (ఆక్సిజన్) పీల్చటంవల్ల అండం సక్రమంగా విడుదల జరిగి సంతాన వతులు అవుతారని ఆయుర్వేదం చెబుతున్నది. మరొక విషయం! ఎక్కడ శమీవృక్షం వుంటుందో అక్కడి భూమిలోపల నీరు లభిస్తుందంటారు.

శమీవృక్షం విజయ సంకేతం.

కాబట్టి విజయదశమి రోజున విజయ సంకేతమైన శమీవృక్షాన్ని పూజించే సంప్రదాయం వచ్చింది. శ్రీకృష్ణుడు నరకాసురునితో యుద్ధానికి వెళ్ళేముందు శమీవృక్షాన్ని పూజించాడని కూడా చెబుతారు. జమ్మిచెట్టు (శమీవృక్షం) చేనులో వుడితే పీకి వేయకుండా రక్షిస్తుంటారు రైతులు. శమీ వృక్షం మనం విత్తనాలు వేస్తే మొలకెత్తదట. భూగర్భజలం వున్న చోటనే విత్తనం మొలకెత్తి వస్తుందంటారు పెద్దలు.

విజయదశమి రోజున శమీవృక్షాన్ని తాకినా, శమీపత్రిని(ఆకులను) చేతులతో ముట్టినా ధనసిద్ధి లభిస్తుందన్న నమ్మకం దక్షిణ భారతంలో బాగా వుంది. విజయదశమితో పాటుగా శమీపూజను కర్ణాటక రాజ్యంవారు ఘనంగా చేస్తారు.

మైసూరు విజయదశమి వుత్సవాలు చూచితీరాల్సిందే.

'శమీ స్పర్శమాత్రేణ సర్వతో జయమంగళమ్'

✦☆✦

హిందూమతం పితృస్వామ్య ప్రధానమా?

ప్రపంచపు అన్ని మతాలు పురుష ప్రాధాన్యతతోనే పుట్టాయి.

హిందూమతం అన్నిమతాలకంటే కొంత భిన్నత్వంతో పితృస్వామ్య వ్యవస్థను నిర్మించింది. స్త్రీలు ఆనాడు ఈనాడు దైహికంగా బలవంతులుకారు. ఎన్ని యుగాలు మారినా ఎంత విజ్ఞానం మనస్వంతమైనా పురుషాధిక్యతను కాదని స్త్రీ ముందుకు వెళ్ళటం ఎక్కడా జరగటంలేదు. మన ఆసియాఖండంలోనే కాదు అభివృద్ధి చెందిన ఐరోపాఖండంలో కూడా స్త్రీలు ఈనాటికీ వెనుకబడే వున్నారు. కనుచూపు మేరల్లో స్త్రీ సమానత్వం లభించే పరిస్థితులు లేవు.రావు!

పురుషాధిక్యతకూ, పితృస్వామ్యానికీ రవ్వంత తేడా వున్నా ఈ రెండూ ఒక్కటే! ఒక్కటే అయినా కూడా కొంత వ్యత్యాసముంది. అదేమిటో పరిశీలిద్దాం.

జన్మతః పురుషుడు బలమైనవాడు. ఈ సృష్టి నియమమే పురుషునికి బలాధిక్యతను ఆపాదించి ఇచ్చింది. సమస్త ప్రాణుల్లోనూ పురుషశక్తిని మనం చూడవచ్చు. ఆవు ఎంతటి గొప్పదైనా ఆబోతు ఎద్దు అంతటి శక్తిని సంపాదించ లేదు. మగ సింహానికి వున్న శక్తి ఆడసింహానికి వుండదు. ఇది సృష్టి నియమం!

'పితృస్వామ్యం' అంటే పితృజన్మప్రధానత్వం! తండ్రి తత్వాన్నీ, తండ్రి పూర్వీకుల అభిప్రాయసరళినీ, తండ్రి తరపువారి రక్షణా బాధ్యతనూ, తండ్రి ఆశా, ఆకాంక్షల నిర్వహణనూ, అనుసరిస్తూ ఆచరిస్తూ నెరవేరుస్తూ జీవించటమే పితృస్వామ్య వ్యవస్థకు పరమార్థం. కాబట్టే ఆడపిల్ల అత్తవారింటికి వెళుతుంది. మగపిల్లవాడు వెళ్ళడు. ఈ నియమాన్ని మార్చటం ఎవరికి సాధ్యం. ఎపుడు సాధ్యం?

ఆడవారికి అలంకరణమీద వున్న శ్రద్ధ స్వాతంత్ర్యంమీద వుండదు ఏం చేద్దాం!

అయితే స్త్రీలు తక్కువవారనీ, పురుషులు ఎక్కువవారనీ కాదు. భారత ఇతిహాసాలు మొత్తం స్త్రీల చుట్టూనే తిరిగాయి. కథలు కావ్యాలు స్త్రీలకోసమే రచింపబడ్డాయి. రామయాణం సీతవల్ల జరిగితే, భారతం ద్రౌపదివల్ల జరిగింది.

హిందూమతానికి బీజ (పురుష) ప్రాధాన్యాన్ని అంగీకరించారు. క్షేత్ర (స్త్రీ) ప్రాధాన్యాన్ని అంగీకరించలేదు. విత్తనం గొప్పదా భూమి గొప్పదా అంటే విత్తనమే గొప్పదన్నారు పూర్వీకులు. అందువల్లనే హిందూమతం పితృస్వామ్య ప్రధాన మైంది. దీనికి స్త్రీ సమాజం కించపడ వల్సిన పనిలేదు. ప్రతిదానికీ ప్రతివారితో పోటీ పడటం అవివేకం. పోటీతత్వంవల్ల హక్కులు లభిస్తాయిగాని అభిమానం లభించదు. ఆదరణ దొరకదు.

గృహానికి యజమాని తండ్రి. సంసార నియంత్రణతో పాటుగా సంసార పోషణా భారం, బాధ్యత తండ్రిదే. తండ్రి తరువాత ఈ బాధ్యత కొడుకు లదే! కూడబెట్టిన ఆస్థికే కాదు, అప్పులకు కూడా కొడుకులే బాధ్యత వహించాలని హిందూ ధర్మశాస్త్రం చెబుతోంది. అందుకే హిందూమతం పితృ స్వామ్య ప్రధానమయింది.

జీవితం ఒక మ్యాజిక్కు! తెలిసి బ్రతకటం లాజిక్కు!

✦☆✦

భర్త అసమర్థుడైతే భార్య మరొకరితో సంతానం పొందవచ్చా?

కఠినమైన ప్రశ్న యిది.

శాస్త్ర సమ్మతంగా సమాధానం చెబుతాను.

శ్లో॥ యస్తల్పజః ప్రమీతస్య క్లీబస్య వ్యాధితస్య వా ।
స్వధర్మేణ నియుక్తాయాం సపుత్రః క్షేత్రజః స్మృతః ॥

మనుస్మృతి 9 - 167

భర్త నపుంసకుడైనా, దీర్ఘరోగి అయినా, సంతానాభివృద్ధికి పనికి రాక పోయినా, భర్త సమ్మతితోగాని, పెద్దవారి సమ్మతితోగాని స్త్రీలు సంతానవంతులు కావచ్చు. అయితే సగోత్రీకులతోనూ, సదాచారవంతులైన వారితో మాత్రమే ఋతుసమయంలో పుత్రాపేక్షతో సంబంధం కల్గి వుండాలి. సంతానానంతరం ఈ సంబంధం పాపకరం. ఈ ధర్మపద్ధతిని 'నియోగం' అంటారు. ఈ విధంగా పుట్టిన బిడ్డ 'క్షేత్రజుడు' అవుతాడు. గోత్ర స్వీకారానికీ పిండ ప్రదానానికీ ఈ

పుత్రుడు అర్హుడే! మహాభారతంలో ధృతరాష్ట్రుడు పాండురాజు ఈ ధర్మ పద్ధతితోనే వ్యాసమహర్షికి జన్మించినా క్షేత్రజధర్మంతో క్షత్రియులయ్యారు. పాండవులు కూడా ఈ నియోగ పద్ధతివల్లనే కుంతి మాద్రిలకు పుట్టి క్షత్రియులయ్యారు పాండు పుత్రులయ్యారు.

శ్లో॥ దేవరాద్వా సపిండాద్వా, స్త్రియా సమ్యక్ నియుక్తయా ।
ప్రజేప్సితాధి గంతవ్యా సంతానస్య పరిక్షయే ॥ 9-59

ఒక తండ్రి బిడ్డలైన అన్నదమ్ములలో ఒకరు అకారణంగా సంతానహీనుడైతే సోదరుల వల్ల తన భార్యతో సంతానాన్ని పొందవచ్చు. ఇది తప్పుగాదు. ఒక సంతానానికి మాత్రమే పరిమితం. తరువాత మహా నిషిద్ధం. దీన్ని క్షేత్రప్రాధాన్య ధర్మం అంటారు. ఈ ధర్మాన్ని అన్ని స్మృతులు అంగీకరించాయి.

> ఏ శాస్త్రమైనా, ఏ ధర్మమైనా, ఏ ఆచారమైనా, మానవ హితం కోసం సత్ప్రవర్తన కోసం మానవ అభివృద్ధి కోసం రచింపబడ్డాయి. అయితే దురాచారపరులైన ఈనాటివారు శాస్త్రాలను తమ కనుకూలంగా దిద్దుకొని విపరీత వ్యాఖ్యానాలు సృష్టించటంవల్లనే చాలా సమస్యలు పుట్టాయి.

ఆనాడు వంశాభివృద్ధికి పెద్ద పీట వేయటం జరిగింది. వంశంకోసం సంతతి కోసం ఎంతగా పరితపించే వారో ఈ "నియోగధర్మం" తెలుపుతోంది. ఆ కాలంలో సంతానమే సంపదగా భావించే వారు. సంతాన బలమే సామాజిక బలంగా విశ్వసించి అభివృద్ధిపరచేవారు అపుడు అతి సంతానం గొప్పదైతే ఇపుడు మిత సంతానం గొప్పది అంటున్నారు నూరు సంవత్సరా లకే యింతటి మార్పు వచ్చింది.

స్త్రీ పురుష సంయోగం సంతానం కోసమే, సుఖాలకోసం కాదు.

గర్భద్వారం సరిలేనివారు, భర్తకు వీర్యాణువులలోపం వున్నవారు, ఎవరిదో పురుష వీర్యాన్ని గర్భంలోనికి ఎక్కించుకొని పిల్లల్ని కనటం సంతాన కేంద్రాల్లో చూస్తున్నాం. ఎవరిదో వీర్యంవల్ల పిల్లల్ని కనటం కన్నాసగోత్రీకుల వీర్యదానంతో సంతానాన్ని పొందటం ఉత్తమం గదా!

✦☆✦

భార్యను వివస్త్రగా చూడటం పాపమా?

"నాగ్నిం ముఖేనోపధమేత్ నగ్నాం నేక్షేత చ స్త్రియం"

పురుషుడు స్త్రీ శరీరాన్ని సంపూర్ణ నగ్నంగా చూడకూడదని ధర్మ శాస్త్రం చెబుతోంది. ఒకవేళ చూడవల్సి వస్తుందేమోనని పడకగదిలోని దీపకాంతి చాలా చిన్నదిగా వుండాలని పెద్దలు చెబుతుండటం కూడా గమనార్హం.

చూస్తే ఏం జరుగుతుందట! పాపం వస్తుందా!

తన భార్యను తాను చూడటంవల్ల పాపం రాదు. కాని నగ్నంగా చూడటం వల్ల పురుషునికి కామాసక్తి తగ్గిపోతుంది. విమోహం కలుగుతుంది. భార్యానురక్తి సన్నగిల్లి పోతుంది. దాంపత్యబంధం సడలిపోతుంది. సౌందర్యాన్ని ఎంతదాచి వుంచితే అంత అనురక్తి కల్గుతుంది. బయటపడవేస్తే ఆసక్తి తగ్గిపోతుంది.

సృష్టిలో ఏ ప్రాణులకూ లేని సిగ్గుపడేతత్వం ఈ మనుష్యులకేవుంది సిగ్గుతెలియగానే అవయవాలను కనుపించకుండా దాచుకోవాలనే ఆలోచన వచ్చింది. దాచుకోవటం మొదలుకాగానే పురుషునిలో కామాతురత ఎక్కువైంది. ప్రాణులన్నీ ఋతుసమయంలో నిర్ణీత సమయంలో మాత్రమే కలుసుకొంటాయి. మనుషులు అతి సంభోగాసక్తి గలవారు. కామాసక్తి మనిషిలో నిలిచి వుండాలంటే నగ్నంగా చూడకూడదు.

కేవలం నగ్నంగా చూడకుండటమే కాదు, స్త్రీ తలదువ్వుకొనే సమయంలోనూ, కండ్లకు కాటు పెట్టుకొనే సమయంలోనూ, ఆవులించే సమయంలోనూ, అన్నంతినే సమయంలోనూ,బట్టలు ధరించేటప్పుడూ, బహిష్టు సమయంలో ప్రసవవేదన పడే సమయంలోనూ భార్యను చూడకూడదు అని మను ధర్మశాస్త్రం.

> మహారసికుడైన వేమన తన ప్రియురాలు విశ్వదను నగ్నంగా చూడటం వల్లనే విరక్తి చెంది పరమయోగిగా మారిపోయి చివరకు దిగంబరుడయ్యాడు. నగ్న సంయోగం ఏదో ఒక నాటికి విరక్తికి దారితీస్తుంది. అతి కాముకత్వం కూడా సంసార విముఖతకు దారి తీస్తుంది.

స్మృతులైనా, శాస్త్రాలైనా, పురాణాలైనా జనహితం కోసమే వ్రాయబడ్డాయి. అయితే

ఆనాటికాలానికి అనుగుణంగా వ్రాయబడ్డాయి. కూరలో కరివేపాకు వేయటం తప్పనిసరి, కాని కరివేపాకుని తినాలన్న నియమం లేదు. తింటే తినవచ్చు తీసిపారవేయనూవచ్చు అది తినేవారి యిష్టం. తినరుగదా అని కరివేపాకును వేయటం మానుకోరు. ధర్మాచరణ కూడా అంతే! చెప్పటం శాస్త్ర విధానం! అనుసరించాలా వద్దా అనేది జనాభీష్టం.

మనుస్మృతి వ్రాసిన మనువుకైనా మరొకనికైనా ఆనాటి ధర్మప్రకారం ధర్మసూత్రాలు వ్రాయటం తప్పుకాదు. కాలం మారింది కాబట్టి తదనుగుణంగా ధర్మాలను మార్చుకోవటం ప్రజలవంతు.

మనువు మానవ విద్వేషికాదు! ఇది నా అభిప్రాయం.

ఎవరెన్ని స్మృతులు వ్రాసినా మనుస్మృతిని మించి వ్రాయలేదనేది నిర్వివాదం.

మనుస్మృతిని మాత్రమే ఆచరించాలనటం మహానేరం.

✦☆✦

హిందూమతం స్త్రీకి స్వేచ్ఛను ఇవ్వలేదా?

ఎవరు? ఎవరన్నారు? ఎవరు చెప్పారు?

హిందూమతం స్త్రీకి కల్పించిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ఆర్థికసమానత్వం, ప్రేమాదరణలు మరొక మతం స్త్రీకి కల్పించలేదు. హిందూ చరిత్రను చూడండి! వేల సంవత్సరాల నాడే హిందూమతంలో స్త్రీకి స్థిరభద్రత కల్పించారు పూర్వీకులు.

అసలు స్వేచ్ఛ అంటే ఏమిటి?

స్వాతంత్ర్యం అంటే ఏమిటి?

భారతీయ హిందువులైన స్త్రీ పురుషులందరూ ఆలోచించాల్సిన విషయమిది.

హిందూ స్త్రీని హిందూమతం అణగద్రొక్కిందా?

ఆర్యనారిని సనాతనమతం అణచి వేసిందా?

ఎవరు! ఈ తప్పుడు సిద్ధాంతాన్ని ప్రతిపాదించెందెవరు?

ఆర్యులు అనాగరికులా? హిందువులు మూర్ఖులా! స్వార్ధపరులా! లాలసులా! పరపీడనా పరాయణులా? ఎవరికంటే తక్కువ వారు హిందువులు ????

నాగరికత లేని రోజుల్లోనే నాగరికులు హిందువులు.

స్వధర్మ పరాయణులు హిందువులు.

హైందవ ధర్మశాస్త్రానికి పునాదులు వేసినవాడు మనుమహర్షి! మనువు బ్రాహ్మణ పక్షపాతి అనీ, శూద్రకులశత్రువనీ, సర్వస్త్రీజాతి శత్రువనీ, ఈనాడు మనం మనుమహర్షిని దూషిస్తున్నాం. తిరస్కరిస్తున్నాం. అవహేళన చేస్తున్నాం. మనుమహర్షి వేల సంవత్సరాలనాడు, త్రేతాయుగ ధర్మంగా మనుస్మృతిని రచించాడు. మనువు తాను రచించిన స్మృతిలో శూద్రకులస్థులను చాలా హీనంగా చిత్రీకరించాడు. బ్రాహ్మణవర్గాన్ని అతిగౌరవించాడు. కులాల ప్రకారంగా న్యాయవిచారణ చేయాలనీ, శూద్రులకు వేదశ్రవణం కూడా తగదనీ, సేవకాజీవనమే తగినదని చెప్పాడు. ఆనాటి కులధర్మాలు ఏవిధంగా వుండేవో తెలియదుగాని మనుధర్మం శూద్రవర్ణానికి చెప్పలేని బాధ కల్గించిన మాట మాత్రం నిజం. సహించరాని తప్పుచేసిన మనుమహర్షి నిందార్హుడే!

కాని; హిందూధర్మశాస్త్రాలకు మనస్మృతియే పునాది. పరాశర, వ్యాస మహర్షులు కూడా మనుబాటలోనే నడిచారు. నేటి భారతీయ శిక్షాస్మృతి'కి చాలావరకు మనుస్మృతియే ఆధారంగా చేశారు.

స్త్రీ స్వాతంత్ర్య విషయంలో ప్రతివారూ మనుస్మృతిలోని ఆనాటి ఈ శ్లోకాన్ని చెబుతారు -

శ్లో॥ పితారక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే ।
రక్షంతి స్థవిరే పుత్రాః నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి ॥ 9-3

బాల్యంలో తండ్రి, యవ్వనదశలో వివాహమాడిన భర్త, వార్ధక్యస్థితిలో కన్నబిడ్డలు స్త్రీని రక్షిస్తారు కాబట్టి స్త్రీకి స్వాతంత్ర్యం అక్కర్లేదు. అని చెప్పాడు మనువు. ఈ ఒక్క శ్లోకంతోనే స్త్రీ వ్యవస్థను నిర్ణయించవచ్చా?

అదే మనువు ఇంకొక విషయం కూడా చెప్పాడు స్త్రీ విషయంలో -

శ్లో॥ యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతాః
యత్రైతాస్తు నపూజ్యంతే సర్వాస్తత్రా ఫలాక్రియాః ॥

మనుస్మృతి 3-56

శ్లో॥ సంతుష్టో భార్యయా భర్తా, భర్త్రా భార్యా తథైవ చ ।
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్ర వైధ్రువం ॥

మనుస్మృతి 3-60

ఎక్కడ స్త్రీలు గౌరవింపబడతారో దేవతలు అక్కడ మాత్రమే వుంటారు. స్త్రీలు గౌరవింపబడనిచోట ఎటువంటి శుభములు జరుగవు. భర్తవల్ల భార్య, భార్యవలన భర్త ఎల్లపుడూ సుఖంగావున్నచోట శాంతి సుఖభోగాలుంటాయని చెప్పాడు మనుమహర్షి. ఎంత గొప్పమాట యిది! ఇటువంటి సూక్తులు చాలా వున్నాయి.

వేల సంవత్సరాలనాడే ఇతర మతాలలోనూ లేని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు హిందూమతం స్త్రీలకు కల్పించింది. ఫ్రాన్స్ పశ్చిమజర్మనీ - స్పెయిన్ - ఇటలీ - జపానులలో ఉద్యోగం చేసే స్త్రీలు పెండ్లిచేసుకొన్నా, గర్భం ధరించినా చేస్తున్న ఉద్యోగం మానివేస్తామని ముందుగానే వ్రాసి యివ్వాల్సి వుంటుంది. జపానులో 30 సంవత్సరాలు నిండిన స్త్రీలను ఉద్యోగాలనుండి తొలగిస్తారు.

ముస్లిం దేశాలైన సౌదీఅరేబియా - నైజీరియా - కువైట్ - బహ్రేన్ మొదలైన తొమ్మిది దేశాలలో స్త్రీలకు ఓటువేసే హక్కు లేదు. ఇటలీ దేశంలో 1963 వరకు స్త్రీలు గవర్నమెంట్ వుద్యోగాల్లో వుండే హక్కులేదు. జపాన్ ఫ్రాన్స్ ఇటలీ మొదలైన దేశాల్లో 1946 వరకు ఆడవారికి ఓటింగ్‌హక్కు లేదు.

ఇస్లాంమతం, "స్త్రీలకంటే పురుషులే గొప్పవారు" అని చెబుతుంది. ఈనాటికీ ముసుగు ధరించకుండా బయటకు వచ్చేహక్కుగాని ఒంటరిగా బజారుకి వచ్చే హక్కుగాని ముస్లిం స్త్రీలకు లేదు. ఏ దేశంలోనూ లేదు. విడాకుల విషయంలోనూ అంతే!

"స్వాతంత్ర్యమంటే విచ్చలవిడితనం కాదు"

పాశ్చాత్యదేశాలలో స్త్రీలు పురుషులు పదేసిమార్లు పెండ్లిచేసుకొని పదేసిమార్లు విడిపోతుంటారు. ఇది స్వాతంత్ర్య మన వచ్చా! పటిష్టమైన వివాహబంధం లేకుంటే అనుబంధాలకు అర్ధమేముంటుంది. పశు పక్షుల స్థితికి మనం మారిపోవటం అభి లాషణీయమా! హైందవస్త్రీగా పుట్టటం స్త్రీజాతికి గర్వ కారణం కాదా!

హిందూమతంలో విద్యాధిదేవత సరస్వతి స్త్రీ ధనాధిదేవత లక్ష్మి స్త్రీ! శక్త్యధి దేవత పార్వతి స్త్రీ ఈ త్రిమాతలే సర్వస్వానికి మూల దేవతలు. స్త్రీలకు ఇంతటి మహా ద్భాగ్యాన్ని కల్పించిన హిందూ మతం గొప్పది కాదా! మనంద రకూ అన్నాన్ని సృష్టించి ఇచ్చే భూమిని స్త్రీ రూపంలో గౌర వించే హిందూత్వం మహత్తరం కాదా!

స్త్రీకి మాత్రమే కాదు మగవాడికి కూడా అతిస్వేచ్ఛ సమర్ధనీయంకాదు. సమాజ చట్టంలోనే అందరూ బ్రతకాలి. అపుడే అందరికీ గౌరవమర్యాదలు దక్కు తాయి. మానవుడు సమాజజీవి. సమా జానికి అంటిపెట్టుకొనే జీవించాలి. సమాజ నియమాలనూ నిబంధనలనూ గౌరవించాలి. ఈ విషయంలో ఎవరికీ స్వేచ్ఛ వుండదు. ఇవ్వబడదు.

✦☆✦

ఒక్కస్త్రీకి ఒక పురుషుడు అనే ధర్మం సనాతనమా?

సనాతన ధర్మపు అధునాతన న్యాయమిది.

ప్రకృతిదత్తంగా జన్మతః అతికాముకత్వం విశృంఖలత్వం, అతిస్వేచ్ఛ, శరీర దారుఢ్యం పురుషజాతికి సంక్రమించాయి. దీన్ని ప్రశ్నించటానికి ఎవరికీ కుదరదు. పశువులలోనూ పక్షులలోనూ పురుష ప్రాణులదే పైచేయిగా మనం చూడవచ్చు. ఇది సృష్టి ధర్మం. సృష్టి ధర్మాన్ని ఎవరు ప్రశ్నించగలం? ఏనుగు పెద్దదిగానూ, దోమ చిన్నదిగానూ ఎందుకున్నాయి అంటే సమాధానం

ఎక్కడుంది? పురుషులకు మాత్రమే బట్టతల ఎందుకు వస్తుంది అంటే ఏమని చెప్పాలి? పురుషతత్వంకూడా అంతే.

ఒక స్త్రీకి ఒకే పురుషుడు వుండాలన్న నియమాన్ని ఏనాడో మనువు - గౌతముడు - ఆపస్తంబ - బౌధాయనాదులు ధర్మశాస్త్రాలలో చెప్పారు. కాని కొన్ని వందల సంవత్సరాలక్రితం మాత్రమే ఆచరణకు వచ్చిందిది.

1955లో హిందూవివాహచట్టం ఏకపత్నీ ధర్మాన్ని చట్టబద్ధం చేసింది.

ఈ హిందూచట్టప్రకారం ఒక పురుషుడు ఒక భార్యను మాత్రమే కలిగి వుండాలి.

నేటికీ ముస్లిం మతస్థులకు నలుగురు స్త్రీలను పెండ్లి చేసుకొనే హక్కు వుంది.

ప్రాచీనకాలంలో వ్యభిచారాన్ని నిరోధించటానికి బహుభార్యాత్వాన్ని హిందూమతం అంగీకరిస్తూ వచ్చింది. ఇతర మతస్థుల దౌర్జన్యాన్ని అరికట్ట టానికి బహుసంతతి వుండాలన్న ఆలోచనతోగూడా ఒక పురుషుడు ఎక్కువ మంది భార్యలనూ సంతానాన్నీ కలిగి వుండటానికి అంగీకరించారు పెద్దలు. బహు కుటుంబీకులకు ఆకాలంలో ఎంతో గౌరవమర్యాదలు వుండేవి. కాల క్రమంలో బహుభార్యాత్వం పురుషుని శారీరిక, మానసిక, ఆర్థిక, కుటుంబిక పరిస్థితులను దెబ్బతీస్తుందని గ్రహించారు. ఏకపత్నీత్వమే జీవనాభివృద్ధికి తోడ్పడగలదని గ్రహించిన బ్రాహ్మణవర్ణం ముందుగా బహుభార్యాత్వాన్ని నిషేధించి ఏకపత్నీత్వాన్ని స్వీకరించారు. క్షత్రియవర్ణం తప్ప మిగిలిన జాతులన్నీ ఏకపత్నీత్వాన్ని అనుసరించాయి.

ప్రపంచ ధర్మాలన్నిటికన్నా ముందుగా ఏకపత్నీ ధర్మాన్ని గొప్పదిగా మానవాళికి చాటిచెప్పింది భారతీయ వైదికమతం. త్రేతాయుగపు శ్రీరాముడిని భారతీయులముందు నిలిపి వివాహధర్మ పవిత్రతను ప్రజలకు తెలియచెప్పారు పూర్వీకులు.

దీనిలో భాగంగానే ఈనాటి మనపెళ్ళి మంత్రాలు స్థిరీకరించబడ్డాయి. "ధర్మేచ, కామేచ, అర్థేచ, మోక్షేచ నాతిచరామి" అని వివాహ సమయంలో

పెండ్లికొడుకుచేత చెప్పించటంలోని అంతరార్థం ఏకపత్నీ వ్రతధర్మాన్ని శాశ్వతం చేయటం కోసమే.

రెండుమూడువేల సంవత్సరాలక్రితం ఈ పెండ్లి మంత్రాలు లేవు.

ఏకపత్నీ ధర్మస్థాపనమే వివాహవిధి పరమోద్దేశ్యం

ఏకపత్నీవ్రతస్థుడైన శ్రీరాముని మందిరం గ్రామగ్రామానికీ విధిగా ఏర్పరిచిన వుద్దేశ్యం కూడా ఒక పురుషుడు ఒకే భార్యకు పరిమితం కావాలని.!!!

✦☆✦

రాజులకు భార్యలు ఎందరైనా వుండవచ్చా?

ఇపుడు రాజులు లేరు! రాజ్యాలు లేవు.

వర్తమానానికి గతమే పునాది కాబట్టి గతాన్ని నెమరువేసుకోవటంలో తీయదనం వుంటుంది. పూర్వీకుల దూరదృష్టి బుద్ధికుశలత మనకు తెలుస్తుంది. ఆచారం పేరున దాగివున్న ఆలోచనలేమిటో గూడా తెలుస్తాయి.

"రాజానో బహువల్లభాః" అన్నాడు కాళిదాసు.

పెంచిపోషించగల ఆర్థికస్థోమత, అనుభవించి ఆనందింపజేయగల గట్టి ఆరోగ్యభాగ్యం. మాటచెల్లించుకోగల నేర్పరితనము వున్న రాజులు, జమీందార్లు ఎంతమందినైనా భార్యలుగా పొందే అవకాశం పూర్వం కాలంలో వుండేది. ఇలా ఎక్కువమంది భార్యలను కలిగి వుండటాన్ని ఇంగ్లీషులో 'పాలిగమీ' అంటారు.

క్రీ.పూ. మూడవశతాబ్దికి చెందిన చైనా చక్రవర్తి చిన్‌షీ యాంగ్‌కి 13.140 మంది భార్యలు వుండేవారట. సాలమన్ రాజుకి 700 మంది భార్యలు కాక 300 మంది ప్రియురాళ్ళు వుండేవారట. అక్బరు చక్రవర్తికి ఐదువేలమంది ప్రియురాళ్ళు వుండేవారట. క్రీ॥శ॥ 1420 ప్రాంతంలో విజయనగర సామ్రాజ్యాన్ని, పాలించిన రెండవ దేవరాయలకు పన్నెండువేలమంది భార్యలు వుండేవారట. మొరాకోదేశపు "మౌలి ఇస్మాయిల్" (1672-1727) గారికి

> దేవతల తరువాత
> మనిషే గొప్పవాడు.
> అందువల్లనే మానవజన్మ
> మహత్తరమైందని
> చెబుతారు.
> బహుభార్యాత్వం కన్నా
> ఏకపత్నీ నియమమే గొప్పది,
> విలువైనది, సుఖమైనది.

543 మంది భార్యలు వున్నారు. హైద్రాబాదు నవాబుగారికి 310మంది భార్యలు వుండే వారట మరి! 'ఎస్కిమో' తెగలవారిలో ఈ బహు భార్యా పద్ధతి ఇంకా ఈనాటికీ వుంది. మామూలు మానవులకే వేలవేలమంది భార్య లుండగా దైవాంశ కల్గిన శ్రీకృష్ణునికి పదహారు వేల ప్రియురాండ్రు వుండటంలో ఆశ్చర్యం ఏముంది!

ఇంతేసిమంది భార్యలుండే అవకాశం రాజులకు మాత్రమే ఎందుకు వుంది అంటే; అప్పటి రాజులకు అంగబలం, అర్థబలం పుష్కలంగా వుండేవి. వాళ్ళు ఏం చేసినా అడిగే ధైర్యం సామాన్యప్రజలకు వుండేది కాదు. రాజులు కామపరవశులై ప్రజల ఆడపిల్లల వెంటపడి వేధించకుండా వుండటం కోసం ఈ అవకాశం వారికి మాత్రమే కల్పించారు అప్పటి బుద్ధిజీవులు.

బలవంతుల కామప్రవృత్తినుండి బలహీనుల్ని ఈ విధంగా రక్షించారు.

మహరాజులకైనా మామూలు వారికైనా బహుభార్యాత్వం ఒకరకంగా తప్పుగాదు గానీ వేశ్యాలంపటత్వం మాత్రం మహానేరం. పరాయిగృహిణులమీద ఆశపడటం క్షమించరాని ఘోరనేరం. ఏ నియమాలు అయినా సంప్రదాయాలైనా మన క్షేమంకోసం మన అభివృద్ధికోసం మనం నియమించుకొన్న అడ్డుగోడలు మాత్రమే. నియమరహిత జీవితంవల్ల మనిషి పతనమైపోతాడు. బంధాలు బాంధవ్యాలు వుండవు. మాటలు నేర్చిన పశువులా మిగిలిపోవాల్సి వస్తుంది.

✦☆✦

దానధర్మాలవల్ల పుణ్యం కల్గుతుందా?

"దానం కలియుగే ధర్మః"

శ్లో॥ తపః పరం కృతయుగే త్రేతాయాం జ్ఞానముచ్యతే
ద్వాపరే యజ్ఞమేవాహుః దానమేకం కలౌయుగే ॥

పరాశరస్మృతి 1-25

శ్లో॥ ధర్మః శ్రేయః సముద్దిష్టం శ్రేయోభ్యుదయ లక్షణం
అస్య సమ్యగనుష్ఠానాత్ స్వర్గో మోక్షస్య జాయతే ॥ - భవిష్యపురాణం

శ్లో॥ ధర్మఏవ హతోహంతి 'ధర్మోరక్షతి రక్షితః'
తస్మాద్ధర్మో న హంతవ్యం మా నోధర్మో హతోవధీత్ ॥

మనుస్మృతి 8-15

నీకు వున్నదానిలో కొంతభాగం లేనివారికిచ్చి సహాయపడమని చెబుతుంది వేదం. స్మృతులు కూడా ఇదే విషయాన్ని చెబుతాయి. పురాణాలు - ఇతిహాసాలు కూడా దానగుణానికి మించిన దైవత్వం లేదనీ, ధర్మాన్ని రక్షించమనీ బోధిస్తాయి.

కృతయుగంలో తపస్సు - త్రేతాయుగంలో ఆత్మజ్ఞానం - ద్వాపరయుగంలో యజ్ఞయాగాలు - కలియుగంలో దానధర్మాలు గొప్పవని పరాశర స్మృతి చెబుతోంది. దానధర్మ పరుడైన మనిషికి స్వర్గలోకమూ మోక్షము సిద్ధిస్తాయని భవిష్య పురాణం చెబుతున్నది. ధర్మాన్ని నీవు కాపాడ గల్గితే ధర్మం నిన్ను కాపాడుతుంది. ధర్మానికి నీవు హానిచేస్తే నిన్ను నాశనం చేస్తుందని మను స్మృతి చెబుతోంది. శ్రీకృష్ణుడు గీతోపదేశంలో కూడా ఇదే విషయం చెబుతాడు.

> మానవతా హృదయం
> నీకు లేకుంటే నీవెంతటి
> ధనవంతుడవైనా
> ప్రయోజనా శూన్యమే.
> దేవునికిచ్చే కానుకలన్నా
> దానంచేసే పైసా మిన్న!
> దానధర్మాలవల్ల పుణ్యం
> వస్తుందో రాదోగాని
> నీగుండెలోనుండి
> ప్రేమతత్వం
> వస్తుంది.

దాన ధర్మాలవలన పుణ్యం వస్తుందా! స్వర్గ లోకంలో నాకు సింహాసనం లభిస్తుందా! అనే

ఆలోచనలకన్నా, మానవతా దృష్టితో, వివేచనా ధర్మంతో ఆలోచించవల్సిన దొకటుంది.

'లక్షాధికారైన లవణమన్నమె గాని మెరుగు బంగారంబు మ్రింగబోడు'

లక్ష ఎకరాలున్న భూస్వామి అయినా తినేది గుప్పెడు మెతుకులే గదా! పూర్వజన్మ సుకృతం వల్ల ఈ జన్మలో మనకు సంపదలు లభించి వుండవచ్చు. అదృష్టదేవత కరుణించి వుండవచ్చు. పది తరాలవారికి సరిపడేటంత సమృద్ధి వుండి వుండవచ్చు. కాని....

నీవు మనిషివి. వివేకం కల్గినవాడివి. ఆలోచించగలబుద్ధి వున్న ప్రాణివి. నీతోటి మనిషి, నీతోపాటు నీ సమాజంలో జీవిస్తున్న మనిషి ఆకలిబాధతో అలమటిస్తూ "అమ్మా" అని కేకవేస్తే స్పందించాల్సిన అవసరం నీకు లేదా! పశువులు పక్షులు కలిసి ఆహారాన్ని పంచుకొంటాయి. అంతమాత్రం అభిమానం నీ సమాజంలోని నీ మనిషిమీద నీకు వద్దా? ఏడంతస్థులమేడ నీకున్నా నీవు పరుండే స్థలంమాత్రం చిన్నదే సుమా!

✦☆✦

ఆడపిల్ల ప్రథమ ఋతుమతికి వేడుకలు చేస్తారెందుకు?

దీనికి శాస్త్రబద్ధమైన సమాచారం లేదు. కాని తర్కబద్ధమైన సమాధానం వుంది. ఆడపిల్లలు పదకొండవ సంవత్సరం నుండి పదునాల్గవ సంవత్సరం లోపుగా సాధారణంగా ఋమతి అవుతారు. ఇది సృష్టి నియమం.

సర్వసాధారణమైన ఈ సృష్టినియమానికి ఎంతో అబ్బురంగా వేడుకలు ఎందుకు జరిపించాలి. ఇదేదో అనాగరిక ఆచారం కాదా! అని మనకు అని పిస్తుంది. కాని ఈ కార్యక్రమంలో మనమెరుగనిమర్మం ఒకటుంది.

జమిందారీ విధానం వైభవంగా నడుస్తున్న రోజుల్లో జమీందారీ ఆడ పడుచులు ఋతుమతులైనపుడు తిథివార నక్షత్రాలను సరిచూచి గ్రహ శాంతులు అన్నదానాలు చేసే ఆచారం విధిగా నడిచేది. ఆడపిల్ల రజస్వల కావటం అంటే

మాతృత్వానికి సిద్ధమైందన్న మాట! సృష్టిని స్థిరీకరించే స్త్రీగా రూపు దిద్దుకొన బోతున్నదన్నమాట! జన్మనిచ్చే మాతృదేవతగా మారనున్నదన్న మాట! శుభ భూయాత్; భద్రం భూయాత్; శ్రీః భూయాత్; సమస్త సన్మంగళాని భవంతు; అంటూ కులపెద్దలచే, బంధుమిత్రులచే గురుపూజ్యులచే, ఆశీర్వచనా లిప్పించే ఆచారాన్నే వేడుకగా చేస్తారు. ఇదీ, ఈ వేడుకలోని పరమార్థం. వేడుకలు చేయకుంటే అరిష్టం మాత్రం కలుగదు.

ఇంకొక విషయమేమంటే;

1929లో శారదా చట్టం వచ్చి బాల్యవివాహాలను నిలుపుచేసింది. అంతకుముందు కాలంలో "అష్టవర్షాభవేత్ కన్యా" అనే సంప్రదాయం మనకు వుండేది. అంటే; ఎనిమిది సంవత్సరాలవయసు వచ్చిన ఆడపిల్లను 'కన్య' అని పిలిచేవారు. బాల్యావస్థపోయి కన్యగా మారుతుందన్నమాట. కన్యాత్వం రాగానే ఋతుమతి కాకుండానే ఆడపిల్లలకు పెండ్లిండ్లు చేసేవారు. పెండ్లి జరిగిన మూడు నాలుగేండ్లకు అమ్మాయి ఋతుమతి అయ్యేది. ఈ శుభవార్తను అమ్మాయి అత్తింటివారికి బంధువులకు తెలియజెప్పే శుభవేడుకనే డబ్బున్నవారు ఘనంగా, మధ్యతరగతివారు మామూలుగా, పేదవారు నిరాడంబరంగా జరుపు కొనేవారు.

మరొక విషయమేమంటే;

'ఆడపిల్లకు పెండ్లి చేయాలంటే ఆరుజతల చెప్పులు అరిగి తీరాలి' అనే సామెత వుండేది. ఋతుమతి అయిన ఆడపిల్లను మంచి యింటికి కోడలిగా పంపాలని ప్రతి తల్లిదండ్రులు ఆలోచిస్తారు; ఆశపడతారు. ఆడపిల్ల తండ్రి వరాన్వేషణలో పడి ఆవూరు ఈవూరు తిరగాల్సి వచ్చేది. ఇప్పటిలాగా ఆరోజుల్లో వాహనసౌకర్యాలు లేవుగదామరి! ఈ శ్రమనుండి బయటపడాలంటే ఆడపిల్ల రజస్వల కాగానే బంధుమిత్రులందరికీ తెలియపరచి పండుగ జరిపించితే ఎవరొకరి ద్వారానైనా మంచి వరుడు దొరుకుతాడని, భారం తీరిపోతుందనీ, ఆడపిల్ల ప్రథమ ఋతుమతీ వేడుకలు చేసే సంప్రదాయం వచ్చింది.

✦☆✦

తొమ్మిదవ 'అంకె' గొప్పదంటారేమిటి?

సంఖ్యాశాస్త్రంలో తొమ్మిదవ అంకెను 'బ్రహ్మసంఖ్య' అంటారు

'దైవసంఖ్య; వృద్ధిసంఖ్య; అని కూడా అంటారు.

'పురాణ సంఖ్య' అని కూడా పేరుంది.

ఈ తొమ్మిదవ సంఖ్య గొప్పదనమేమిటో పరిశీలిద్దాం -

మీరు ఏదైనా మీ యిష్టం వచ్చిన సంఖ్యను తీసికొని ఆ సంఖ్యను తొమ్మిది చేత హెచ్చించండి. హెచ్చించిన ఫలితాన్ని మొత్తం కలిపి ఏకసంఖ్యను చేయండి. తొమ్మిది వస్తుంది.

123456789×9 = 1111111101 మొత్తం అంకెలను కలిపి చూడండి.

'తొమ్మిది' అవుతుంది.

ఈ విధంగా ఎంత చిన్న ఎంత పెద్ద సంఖ్యనైనా తొమ్మిదిచే హెచ్చించండి.

ఇలాగే తొమ్మిదవ ఎక్కాన్ని కూడా పరీక్షించండి. శేషాలను కలిపిచూడండి. కృతయుగ సంవత్సరాలు 17.28.000-త్రేతాయుగం 12.96.000-ద్వాపరయుగం 8.64.000 ఏ యుగపు సంవత్సరాలు కలిపినా తొమ్మిదే వస్తుంది. నాల్గుయుగాలను కూడినా అంతే !

ఇది తొమ్మిదవ అంకెకుమాత్రమే వున్న ప్రత్యేకత!

సున్నా తీసివేస్తే మనకున్న అంకెలు మొత్తం తొమ్మిదేగదా!

మహామహేతిహాసమని పేరుపొందిన మహాభారతం మొత్తం తొమ్మిదవ సంఖ్యతో ముడిపడివుంది. మహాభారతంలోని పర్వాలు 18, మహాభారత యుద్ధ దినాలు 18, మహాభారత సైన్యం 18 అక్షౌహిణులు, భగవద్గీత అధ్యాయాలు 18. (ఒకటిని ఎనిమిదిని కలిపితే తొమ్మిది అవుతుంది)

భగవాన్ వ్యాసమహర్షి రచించిన పురాణాలు కూడా పద్దెనిమిది.

ఒకటినుండి తొమ్మిది వరకు మొత్తం అంకెలు కూడితే 'తొమ్మిది' వస్తుంది.

1+2+3+4+5+6+7+8+9 = 81, 8+1=9

మనిషి శరీరానికి వున్న రంధ్రాలు కూడా 'తొమ్మిది'.

సర్పానికి తప్ప సృష్టిలోని ప్రతిప్రాణికీ తొమ్మిది రంధ్రాలుండవల్సిందే.

గంటకు	3.600	సెకండ్లు	-	3+6+0+0	=	9
రోజుకి	1.440	నిముషాలు	-	1+4+4+0	=	9
నెలకు	720	గంటలు	-	7+2+0	=	9
సంవత్సరానికి	360	రోజులు	-	3+6+0	=	9
60 సంవత్సరాలకు	720	నెలలు	-	7+2+0	=	9
60 సంవత్సరాలకు	21.600	రోజులు	-	2+1+6+0+0	=	9

తొమ్మిదవ సంఖ్యను ప్రేమించేవారు ఆరవ సంఖ్యను ఇష్టపడరు. తొమ్మిదిని మృత్యుంజయ సంఖ్యగా భావిస్తారు. బిడ్డ తల్లి గర్భంలో వుండేది 270 రోజులు. 2+7+0=9 ఇన్ని కారణాలుగా తొమ్మిది గొప్పది.

✦☆✦

గంగానది పరమ పవిత్రమా?

గంగానదిని విష్ణుపుత్రి అంటారు.

విష్ణుపాదోదకం సర్వపాపహరం కదా!

"అకాలమృత్యుహరణం! సర్వవ్యాధి నివారణం! సమస్తపాపక్షయకరం! విష్ణు పాదోదకం! పావనం శుభం!" అనే మంత్రోచ్చారణ చేసి తీర్థాన్ని ఇస్తారు. మనకున్న భారతీయ నదులన్నిటిలోకి గంగానది విశిష్టమైనదిగా చెబుతారు. ఎందుకంటే గంగాదేవి శ్రీమన్నారాయణుని పాదాలచెంత జన్మించి భగీరథుని దివ్యప్రయత్నం వలన శ్రీపరమేశ్వరుని జటాజూటానికి చేరి అక్కడనుండి భూమి మీదకు వచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. పరమపావని పతితపావని గంగాదేవి.

ఈమె విష్ణుపుత్రి! ఈశ్వర పత్ని!

అందువలనే సర్వపాపాలను పోగొట్టే దివ్యశక్తి వచ్చిందీమెకు.

గంగానదిని 'సురనది' అంటారు. సురనది అంటే దేవతల నది అని అర్థం. మహాభారతంలోని భీష్మాచార్యుడు ఈమెకు జన్మించినవాడే. గంగా తనయుడు కావటంవల్లనే అస్ఖలిత బ్రహ్మాచర్యంతో పవిత్రజీవనం గడిపాడు. భీష్ముని 800 సంవత్సరాల జీవితకాలంలో 675 సంవత్సరాలు వేద వేదాంగ విద్యలు నేర్చుకొన్న సర్వవిద్యా పారంగతుడు. పరమపునీత అయిన గంగాదేవి గర్భవాసాన జననం కావాలని కోరుకొని ఆమెకే జన్మించి జన్మపునీతం చేసుకొని ధన్యుడయ్యాడు.

గంగాజలం దివ్య ఓషదుల సమ్మిళితం

మొట్టమొదట ఆర్యులు గంగాతీర ప్రాంతాలలోనే జీవించారు.

ఆర్యులకు గంగానది కన్నతల్లితో సమానం.

"జిస్‌దేశ్‌మె గంగాబెహతీహై ఓ దేశ్‌హమారా" అని సగర్వంగా ఉత్తర భారతీయులందరూ చెప్పుకొంటారు. వారణాసికి (కాశీ) అంతటి దివ్యశక్తి గంగానదివల్లనే లభించిందంటారు పండితులు. గంగాదేవి శివపత్నిగా భావింపబడుతున్నా వైష్ణవులకే ఆమె ఆరాధ్యదేవత అయింది. ఈనాటికీ చాలామంది తమ పెద్దల అస్థికలను గంగానదిలో కలిపి వస్తుండటం అందరికీ తెల్సిన విషయం.

> గురుడు మేషరాశిలోకి ప్రవేశించినప్పుడు గంగా పుష్కరాలు జరుగుతాయి. పన్నెండు సంవత్సరాలకొకసారి జరిగే ఈ పుష్కరాలకు భారతదేశం నలుమూలల నుండి కోట్లాది ప్రజలు గంగాస్నానం చేస్తారు. శైవమతస్థులు వైష్ణవమతస్థులు ఈ పుష్కరోత్సవంలో పాల్గొని పితృదేవతలకు తర్పణాలు దానాలు ఇస్తారు.

పవిత్రతకు మారు పేరు గంగ ! -
భారతీయుల పుణ్యనది గంగ !

వర్షాలు వచ్చినా రాకపోయినా ఏ నదులైనా ఎండిపోతాయేమోగాని

గంగానది ఎండదు.

సజీవనది గంగానదీమతల్లి.

ఉత్తరభారత గంగను దక్షిణభారతానికి నడిపించాలంటున్నారు మేధావులు.

ఆ శుభసమయం రావాలని ఆశిద్దాం.

సర్వ భారతం సస్యశ్యామలం కావాలని ప్రార్థించుదాం.

✦☆✦

వ్యాసమహర్షి దైవ స్వరూపుడా?

'వ్యాసో నారాయణో హరిః'

అసలు ఈయన పేరు 'కృష్ణద్వైపాయనుడు'

భూత భవిష్యద్వర్తమానాల నెరిగిన మహా పౌరాణికుడు.

మహర్షి - తత్వవేత్త - పండితుడు - వైదికుడు - ప్రజ్ఞాశాలి - పరిత్యాగి - ధర్మశీలి - స్థితప్రజ్ఞుడు - వేదవేది - జ్ఞానమూర్తి - పరిశీలకుడు - సంయమి - ఈ వ్యాసమహర్షి గురించి ఏం చెప్పినా ఎంత చెప్పినా చాలా తక్కువే అవుతుంది.

ఋషులకే ఋషి ఆయన !

పండితులకే మహా పండితుడాయన !

మహాభారత ప్రారంభంలో వ్యాసమహర్షి పరిచయం ఇలా చేశాడు నన్నయ -

ఆ॥ వివిధ వేదతత్వవేది వేదవ్యాసుడాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై పరగుచుండ జేసె భారతంబు

శ్రీమన్నారాయణాంశతో, కారణజన్ముడై జన్మించిన వేదవ్యాస మహర్షిని గూర్చి చెప్పటం నావంటి అల్పులకు అసాధ్య విషయం గదా!

ప్రపంచ రచనా చరిత్రలో మహాభారతమంతటి పెద్ద ఇతిహాసాన్ని యింత వరకు ఎవరూ వ్రాయలేదు. పదిలక్షల ఒకవేయి శ్లోకాలతో రచింపబడిన శ్రీమహాభారతం 'గిన్నిస్ రికార్డ్'. భారతమంతటి పెద్దగ్రంథం పుట్టదు. వేద వేదాంగాల విషయాలన్నిటినీ పామర జనంకోసం వ్యాసమహర్షి భారతంలో పొందుపరచి రచించాడు. అందుకే మహాభారతం 'పంచమవేదం' అని పూజింప బడుతోంది. ఏ ఇతిహాసంలోనైనా శస్త్రాలే వుంటాయి. కాని భారత గ్రంథంలో శస్త్రాలతో పాటుగా 'శాస్త్రాలు' కూడా వున్నాయి.

ఈయన బ్రహ్మర్షి వశిష్ఠునకు ముదిమనుమడు. పరాశర మహర్షికి పుత్రుడు. శక్తిమహర్షికి మనుమడు. శుకమహర్షికి కన్నతండ్రి. గృహస్థుగా

పడివున్న వేదరాశిని సమీకరించి సమీక్షించి సంక్షిప్తంచేసి నాలుగు భాగాలుగా ఋగ్వేద - యజుర్వేద - సామవేద - అధర్వణ వేదాలుగా మనకు అందించిన వేదవ్యాసుడీయన. ఉపనిషత్తులను వ్రాసిందీ ఈ పుణ్యమూర్తే! పద్దెనిమిది పురాణాలను వ్రాసింది కూడా ఈ వ్యాస మహర్షే! శ్రీమహాభాగవత రచనాశిల్పి కూడా ఈయనే! "వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వం' అంటారందుకే! వైదిక మతానికీ భారతీయతత్వానికీ ఆర్యప్రాభావానికీ మూలపురుషుడీయన. హైందవ జాతికి కులగురువు ఈయనే!

"నమోస్తు తే వ్యాస విశాలబుద్ధే
ఫుల్లార విందాయత పద్మనేత్ర !"
"వ్యాసం వశిష్ఠనప్తారం శక్తేః పౌత్ర మకల్మషమ్
పరాశరాత్మజం వందే శుకతాతం తపోనిధిమ్ ॥"

✦☆✦

కలికాలం అంటే, కానికాలమా?

కలౌహి పాపబాహుళ్యం దృశ్యతే స్మర్యతే పి చ। - పరాశరమాధవీయం

శ్లో॥ సీదంతి చాగ్నిహోత్రాణి గురుపూజా ప్రణశ్యతి
కుమార్యశ్చ ప్రసూయంతే తస్మిన్ కలియుగే సదా ॥ పరాశరస్మృతి

సీ॥ పదునారు వర్షముల్ పరమాయువయ్యెడు; ధరణీశ కలియుగాంతమునవినవె
ఏడు నెన్మిదియును ఏండ్లప్రాయంబున, బ్రజలుద్భవింతురు భామినులకు
ద్రవిణ విహీనులై దాతయొక్కడులేక అన్యోన్యతస్కరులగుదురెందు
నెరిగెడివారును నెంతయు క్రూరులై చెనసి పాపంబు సేసెదరు నూవె,

తే॥ అన్నవిక్రయ మొనరింతు రఖిలజనులు, వేదవిక్రయులగుదురు విప్రవరులు
పణ్యయోనులయగుదురు పద్మముఖులు, కష్టతరమైన అక్కలికాలవేళ
- మహాభారతం ఆ॥పర్వం. 4.302

శాస్త్ర లిఖితమైన కలియుగం గూర్చి చెబుతాను

యుగయుగానికీ ధర్మ విషయాలలో మార్పులు, చేర్పులు జరుగటం సామాన్యమే! చతుర్యుగాలలో చివరిదైన కలియుగపు మార్గమే వేరు!

మనమున్న ఈ కలికాలం సమయం
నాల్గు లక్షల ముప్పైరెండువేల సంవత్సరాలు.

ఇప్పటికి ఐదువేల సంవత్సరాలకు పైగా (5108) గడచిపోయాయి.

ఒక యుగపు ధర్మం మరోయుగానికి అధర్మంగా అన్పిస్తుంది.

దీనినే యుగధర్మం అంటారు.

ఈ కలికాలంలో ధర్మధేనువు ఒంటికాలితో నడుస్తుంది - కలియుగపు అంత్యానికి ధర్మమే శూన్యమైపోతుంది - అధర్మమే రాజ్యమేలుతుంది. పాలకులు దొంగలుగా అవుతారు - ప్రజలు క్రూరులుగా మారతారు - క్షణిక సుఖాలకు క్షణిక సంతోషాలకు మానవులు దాసులైపోతారు - దేవుడిని నమ్మరు - దేవాలయాలకు వెళ్ళరు - వేదవిద్యలను ఎగతాళిచేస్తారు - ధార్మిక వ్యక్తుల్ని అవమానిస్తారు - పురాణాలను, ధర్మగ్రంథాలను తగుల బెడతారు - మద్యపానం సర్వసాధారణమై స్త్రీ పురుషులందరూ వ్యసనాలకు బానిసలైపోతారు - వావివరుసలు మరచిపోతారు - వయోధర్మం విడచిపెడతారు - సంభోగమే పరమావధిగా, ధనమే దైవతంగా జీవిస్తుంటారు - మానవతా విలువలు మట్టి గలసి పోతాయి - స్త్రీలందరూ అర్థనగ్నంగా తిరుగుతారు - పతివ్రత అన్న మాటకు విలువే వుండదు - ఒక స్త్రీకి ఎందరో పురుషులు ఒక పురుషునికి ఎందరో స్త్రీలు కామసుఖాల నిస్తుంటారు - ఆలుమగల బంధానికి అర్థమే వుండదు - వివాహాలకు వేదమంత్రాలతో పనివుండదు - కన్నబిడ్డల వివాహాలకు తల్లిదండ్రుల అనుమతి వుండదు - అనుబంధాల అవసరం ఎవరికీ వుండదు - మాటలు వచ్చిన పశువుల్లా జీవిస్తుంటారు - పురాణాలను ఇతిహాసాలనూ అబద్ధాల పుట్టగా అసహ్యించుకొంటారు - ప్రతి ఇల్లూ నాటక మందిరంలా తయారౌతుంది - పిల్లల అవినీతి కార్యాలకు పెద్దలు కూడా తాళం వేసి సహ కరిస్తారు - సోదర సోదరీ బంధాలు మరచిపోతారు - కన్నబిడ్డలకు తల్లిదండ్రులే లైంగిక విద్యలు బోధిస్తారు-వ్యభిచారమూ, మద్యపానమూ సాధారణ

విషయాలుగా భావిస్తారు - తండ్రిని కొడుకు గౌరవించడు. భర్తను భార్య గౌరవించదు - భార్యను భర్త ఆదరించడు - బిడ్డలను తల్లిదండ్రులు ప్రేమించరు - మనుష్యులకు ప్రకృతి సహకరించదు - భూమి ఫలించదు. ఔషధాలకు లొంగనిరోగాలు, వైద్యులకే అంతుబట్టని జబ్బులు మానవుల జీవితాలను అతలాకుతలం చేస్తాయి - మనుష్యుల ఆయుర్దాయం తగ్గిపోతుంది - శరీరశక్తి క్షీణిస్తుంది - పొట్టివారైపోతారు - వర్షాలు వుండవు - వృక్షాలు లతలు కాల గర్భంలో కల్సిపోతాయి - సముద్రాలు పోటెత్తి జనజీవితాలను అస్తవ్యస్తం చేస్తాయి - కృత్రిమపండ్లు ఫలాలు సృష్టింపబడతాయి - కృత్రిమ ఆహారధాన్యాలు సృష్టింపబడతాయి - బ్రహ్మసృష్టికి విలువ వుండదు - బ్రహ్మసృష్టిని ఎగతాళి చేస్తారు - పురుషుడు లేకుండానే ఆడది తల్లి అవుతుంది - పురుషశక్తి నిర్వీర్యం అవుతుంది. భూమి పంటలు పండదు - త్రాగునీరు ఎవరికీ లభించదు - ఈనాటి ప్రాణులు ఎన్నో నశించి పోతాయి -ప్రాణి పక్షులతో మానవులెవరికీ అవసరం వుండదు -

> బ్రహ్మసృష్టిని కూడా తలవంచింప జేసే మేధోశక్తి మనిషి స్వంతం అవుతుంది. మానవుని విజ్ఞాన సంపత్తికి దేవాదిదేవతలే విస్తుబోతారు. బ్రహ్మసృష్టికి విశ్వామిత్రుడు ప్రతిసృష్టి చేశాడు గదా!
> విశ్వామిత్ర సృష్టికి మరో ప్రతిసృష్టిని మానవులు చేస్తారు. పూలు లేకుండా కాయలు కాయిస్తారు. మనుషులు లేకుండానే వాహనాలు నడిపిస్తారు.
> మేఘాలు లేకుండానే వర్షాలు కురిపిస్తారు.

మానవుని ఆయుర్దాయం కేవలం పదారు సంవత్సరాలకే పరిమితం అవుతుంది. ఐదారు సంవత్సరాలకే ఆడపిల్లలు బిడ్డల్ని కంటారు-పగటికి రాత్రికి వ్యత్యాసం తెలియదు -మూడు సంవత్సరాలకే ఆడపిల్లలు ఋతుమతులు అవుతారు. భారతీయ విద్యలన్నీ భూగతమౌతాయి - దేవుడనేవాడు వుండదు. పరభాష, పరవేషం, పరానుకరణ మాత్రమే పరమ పదంగా భావిస్తారు.

వేదమంత్రాలను శృంగార గీతాలుగా ఆలాపిస్తారు. కన్నబిడ్డలు తల్లిదండ్రుల్ని కాముకులుగా నిర్ణయిస్తారు - వర్ణధర్మాలు వాడిపోతాయి. వాత్స్యాయన సూత్రాలకుమించిన

కామసూత్రాలు కరతలా మలకంగా వుంటాయి - సమయాసమయాలు మరచి కామక్రీడలు జరుపుతుంటారు - ఎవరి భార్యవారికే స్వంతమనే నియమం ఎవరికీ వుండదు - మితిమీరిన సుఖలాలస గతితప్పిన కామాతురత, మతిలేని ఆలోచనలు మానవగతిని మార్చివేస్తాయి- కామసుఖాలను అమ్ముకోవటం సర్వసాధారణమై సమాజ మాన్యత తోడు నిలుస్తుంది - పశుసంతతి పూర్తిగా నశిస్తుంది.

ఇదీ; కలియుగపు కలికాలపు విశ్వరూపం !

చిత్ర విచిత్ర పోకడలతో, అమానుష భావనలతో మనుష్యులు ప్రవర్తి స్తుంటారు కాబట్టి కలికాలాన్ని కానికాలంగానే భావించాలి.

"కాలాయ తస్మై నమః"

✦☆✦

అంతిమ సంస్కారంలో మొలత్రాడు కూడా వుండకూడదా?

ఈ ప్రశ్నలోనే సమాధానం దాగి వుంది.

అయ్యో! ఇదేనా జీవితం! ఇంతేనా జీవితం! చివరకు మిగిలిందేమిటి?

. మనిషి మరణించిన తరువాత మొలత్రాడు కూడా వూడబెరికి మట్టి చేస్తారు. లేదా దహనం చేస్తారు. ఎలా వచ్చాడో అలాగే సంస్కారం చేస్తారు. దిగంబరంగా ఈ భూమికి వస్తారు. దిగంబరంగానే భూమిని వదలి వెళతారు.

అయితే జీవితార్థం ఏమిటి?

ఈ భవబంధాలకు అర్థం పరమార్థం ఏమిటి?

ఈ జీవన చదరంగానికి విలువ ఏమిటి?

ఈ జీవితమింతేనా?

అవును! కన్నుతెరిస్తే జననం! కన్నుమూస్తే మరణం!

జననం ప్రారంభం! మరణం ప్రారబ్ధం!

చావుకీ పుట్టుకకూ మధ్య వుండే సమయమే జీవితం!

"పుట్టబట్టలేదు! చావబట్టలేదు! నడుమ బట్టకట్టనగుబాటుకాదోకో" అన్నాడు వేమన. దిగంబరుడు కాబట్టి వేమనకవి అలా చెప్పి వుండవచ్చు. వేదాంతులకు సన్యాసులకు బట్టలక్కర్లేదు. వారి ప్రపంచం వేరు. కాని నాగరిక సమాజంలో నడిచేవాడికి బట్టలు కావాల్సిందే.

మనిషి మరణించిన తరువాత అంతిమ సంస్కారం (శవసంస్కారం) చేయబోయే ముందుగా స్నానం చేయించి క్రొత్తబట్ట కడతారు. భూ స్థాపితం చేయబోయే ముందు బట్టలు తీసివేసి మొలత్రాడు కూడా తీసివేసి మట్టి చేస్తారు. ఈ విధంగా చేయటం లోని అంతరార్థం ఏమిటంటే బ్రతి కున్న కాలంలో ఎన్ని పనులు చేసినా ఎంత కూడబెట్టినా మరణించిన తరువాత మొలత్రాడు కూడా నీకు చెందదు. నాదినాది అనుకున్నదేదీ నీతో రాదు. నీతో వచ్చేదీ మరణించిన తర్వాత కూడా నిన్ను అంటి పెట్టుకొని వుండేది 'ధర్మం' ఒక్కటే సుమా!

దేహాన్ని విడచిన జీవుడిని మోక్షానికి నడిపించేవి ధర్మనిష్ఠ సత్యదీక్ష ఈ రెండు మాత్రమే! ఓ మనిషీ! బ్రతి కున్నంతకాలం పెళ్ళాం బిడ్డల కోసం అన్యాయ అక్రమాలు చేసి, ఎందరినో మోసగించి ధనం సంపాదించి మరణించిన ఈ వ్యక్తిని చూడు! ఈ శవాన్ని చూచైనా తెలివి తెచ్చుకో మనిషీ! భార్య వాకిలిదాకా, కొడుకు కాటిదాకా మాత్రమే రాగలిగారు. జీవంలేని దేహంమట్టి కాబోయే ముందు కట్టుబట్టలే కాదు; మొల త్రాడు కూడా మిగల్చటంలేదు చూచావా!

"చచ్చిన వీడిని చూచైనా బ్రతికున్న వారు బుద్ధితెచ్చుకోండి' అని అన్యా పదేశంగా చెప్పటమే దీని వుద్దేశ్యం.

శ్లో॥ మృతం శరీరముత్సృజ్య కాష్ఠలోష్ఠ సమంక్షితౌ
విముఖా బాంధవా యాంతి, ధర్మస్తమనుగచ్ఛతి ॥

✦☆✦

కొడుకులు లేనివారికి శ్రాద్ధ కర్మలు ఎవరు చేయాలి?

శ్లో॥ పున్నామ్నో నరకాద్యస్మాత్ త్రాయతే పితరం సుతః ।
తస్మాత్ పుత్ర ఇతిప్రోక్తః స్వయమేవ స్వయం భువా ॥ 9-138

"పున్నామ నరకాత్ త్రాయతే ఇతి పుత్రః" అంటే పున్నామ నరకంనుండి రక్షించువాడు పుత్రుడు అని అర్థం. కన్నతండ్రే పుత్రుని రూపంలో భార్యాగర్భం నుండి జన్మిస్తాదని శాస్త్రం. తండ్రి ప్రతిరూపమే పుత్రుడు కాబట్టి తండ్రి సంపాదించిన సర్వసంపదలకు, తండ్రి గోత్రానికి, తండ్రి బాధ్యతలకు, కీర్తిప్రతిష్ట లకు వారసుడు అవుతున్నాడు పుత్రుడు. (శ్రాద్ధకర్మలు వేదసమ్మతంకాదు. ఆత్మకు చావులేదు)

పురుషుని మరణానంతరం జరిపే శ్రాద్ధకర్మలకు కూడా పుత్రుడే అర్హుడు.

శ్రాద్ధాది మరణక్రియలకు స్త్రీలు అర్హులు కారు.

పుత్రులు కలుగకుంటే, లేక సంతానమే కలుగకపోతే, ఒకవేళ పుత్రులు వున్నప్పటికీ శ్రాద్ధకర్మలు చేయటానికి వీలుగాకుంటే, కర్మకాండలు ఎవరు చేయాలి? చేయటానికి అర్హత ఎవరికుంటుంది? ఎవరు చేయవచ్చు? దత్త పుత్రుడు చేయవచ్చు. ఒకవేళ దత్తపుత్రుడు కూడా లేకపోతే ఎవరుచేయాలి? పౌత్రుడు (కొడుకు కొడుకు) చేయవచ్చు. పౌత్రుడు లేకపోతే...? పౌత్రుడు (కొడుకుబిడ్డ) లేకపోయినపుడు దౌహిత్రుడు (కూతురి కొడుకు) మాత్రమే శ్రాద్ధకర్మలకు అర్హుడు అవుతాడు. ఇది శాస్త్ర సమ్మతమే!

దంపతులకు మగబిడ్డ పుట్టకుంటే కూతురి కొడుకును దత్తత తీసికొన వచ్చు. ఇది ప్రాచీన సంప్రదాయం. ఈ దత్తతకు స్మృతుల అంగీకారం వున్నది. మగబిడ్డలు కలుగనివారు తమ కూతురి వివాహసమయంలోనే దౌహిత్రుని దత్తత విషయంలో ఒప్పందం చేసుకోవటం అనేది అనాది సంప్రదాయం. మహాభారతంలో అర్జునునికి చిత్రాంగదకూ పుట్టిన బభ్రువాహనుడు ఈ ఒప్పంద ప్రకారమే తాతగారికి దత్తత ఇవ్వబడ్డాడు. ఈ కారణంగానే కురుక్షేత్ర యుద్ధానికి బభ్రువాహనుడురాలేదు.

శ్లో॥ పౌత్ర దౌహిత్ర యోర్లోకే విశేషో నోపపద్యతే ।
దౌహిత్రోపి హ్యముత్రైనం సంతారయతి పౌత్రవత్ ॥

కొడుకు బిడ్డకూ, కూతురిబిడ్డకూ వ్యత్యాసంలేదు. కూతురి కొడుకు మాతామహునికి (తాతగారికి) పిండకర్మలకు అర్హుడేనని మనుమహర్షి చెప్పాడు. మగబిడ్డడే కావాలనీ, మగబిడ్డ కలుగలేదనీ, దంపతులు బాధ చెందాల్సిన పనిలేదు. కూతురి బిడ్డనే కొడుకుగా చేసుకొని తరించవచ్చు గదా!

దీనినే క్షేత్రప్రాధాన్య పద్ధతి అంటారు.

ధృతరాష్ట్ర పాండురాజులు తమ తండ్రికి పుట్టలేదు. కాని క్షేత్ర ప్రాధాన్యతతో క్షత్రియులయ్యారు. పాండవులెవరూ పాండురాజుకి జన్మించలేదు. అయినా పాండుపుత్రులుగానే సమాజం అంగీకరించింది. అంటే ఇక్కడ క్షేత్ర ప్రాధాన్యమే గాని బీజప్రాధాన్యత లేదు. ఈ విధంగానే కూతురి కొడుకు శ్రాద్ధకర్మలకు వారసుడు అవుతున్నాడు. సన్యాసులకు శిష్యులే పుత్రసమానులు.

✦☆✦

ఆడపడుచుచేతనే పెండ్లికొడుకును చేయిస్తారెందుకు?

మన హైందవ సాంప్రదాయాలన్నీ దూరదృష్టితో మొదలయ్యాయి.

వివాహంతోటే ఆడపిల్లకు పుట్టింటి అనుబంధం, హక్కు తెగిపోతాయని కొందరు భావించటం నిజం! ఈ మనోభావాన్ని గుర్తెరిగిన పెద్దలు ఆడపడుచు స్థానాన్ని ఆచారపూర్వకంగా భద్రపరిచారు. శుభాశుభ కార్యాలలో ఆడపడుచుకి అగ్రస్థానం కల్పించారు. మన పూర్వీకులకు ఎంతటి దూరదృష్టి వుందో చూచారా!

సోదరుల పెండ్లికి 'ఆడపడుచుకట్నం' ఇవ్వటం అందరకూ తెల్సిందే.

అంతేకాదు; శుభకార్యాలలో ఆడపడుచు అధికారం హర్షదాయకమే మరి!

వివాహంతోటే ఆడపిల్ల అనుబంధం అమ్మానాన్నలతో దూరంకాదు. మరికాస్త పెరుగుతుంది కూడ. అత్తగారింట్లో కోడలిస్థానంలో నడవాల్సిన తీరూ

తెన్నూ తెలియపర్చ వల్సిన బాధ్యత అమ్మా నాన్నలదే. క్రొత్త దంపతుల మధ్య తలెత్తే ప్రణయకోపాలు, చిరుసమస్యలు చక్కబరచవల్సింది కూడా అమ్మా నాన్నలేగదా!

ఆడపిల్లకు వుండే ఒక ప్రత్యేకమైన విలక్షణమేమంటే, పెండ్లికాబోయే ముందురోజు వరకూ అమాయకత్వంతో కనిపించిన అమ్మాయి మొగుడిచేతిని తాకగానే ఆరిందాలాగ అయిపోతుంది. ఒక్కరోజులోనే అనుభవజ్ఞురాలై పోతుంది. ఆలంబన అందగానే ఆడది మరోరూపానికి మార్పుచెందుతుంది.

కల్యాణ శుభకార్యంలో ఆడపడుచుచేతనే చాలా శుభకార్యాలు చేయిస్తారు. లాంచనాలు పేరుతో కూడా ఆడపడుచుకి చాలా ముట్టచెబుతారు. పెళ్ళి కొడుకును చేసిన దగ్గరనుండి గర్భాధాన కార్యక్రమందరకూ, అల్లుడు కూతురు ఇద్దరూ అన్ని వ్యవహారాలు చూడటం పరిపాటి.

ఈ సంప్రదాయాన్ని పూర్వీకులు ఎందుకు పెట్టారంటే; ఆడపిల్లకు పెళ్ళిచేసి బాధ్యతలు దులిపేసుకొని చేతులు కడుక్కొనే మనుషులు ఎందరో వున్నారు 'ఆడపిల్లంటే అక్కడిపిల్ల. మగపిల్లవాడే మన పిల్లవాడు' అనుకొనే ఛాందసులు ఎక్కువే వున్నారు మన సమాజంలో. వాకిలికి పచ్చతోరణం కట్టటం దగ్గరనుండి వరునికి కల్యాణ తిలకం దిద్దేవరకూ, పెళ్ళిపీటలమీదకు వరుని తీసుకువెళ్ళటం నుండి తలంబ్రాలు పోయించేవరకూ, ఆడపడుచుదే అధికారమంతా.

> ఏకారణంచేతనైనా అన్నదమ్ములు ఆడపడుచును అలక్ష్యం చేస్తారేమో, అవమాన పరుస్తారేమోనని పూర్వీకులు శుభకార్యాలలో ఆడపడు అవసరాన్ని కల్పించారు. సంప్రదాయాలలోని సంస్కారం ఇదేమరి!

ఆడపిల్ల ఎంత శ్రీమంతుల ఇంటికి కోడలైనా, భర్తమీద తనకెంత మమతాను రాగాలున్నా, తానెంత స్థితిపరురాలు అయినా పుట్టింటివారి అభిమానంకోసం పుట్టింటి కానుకల కోసం ఆశపడటం సహజం.

అందుకే ఆడపిల్లను పుట్టింటి మహాలక్ష్మి అంటారు.

మెట్టినింటి గృహలక్ష్మి కూడా మరి.

✦☆✦

గృహిణికి కాలిమెట్టెలు నల్లపూసలు ఎందుకు? తాళిబొట్టుకి అర్థమేమిటి?

మన ధర్మాలలో ఆచారాలలో, మంచి ఆలోచన వుంది.

మన శాస్త్రాల్లో, సంప్రదాయాలలో మంచి సిద్ధాంతం వుంది.

వివాహానంతరం యువతి గృహిణిగా మారుతుంది. కుమారి స్థానం పోయి శ్రీమతి అవుతుంది. అర్ధాంగిగా రూపాంతరం చెందుతుంది. తనలోని సగభాగం భర్తకిచ్చి భర్తలోని సగభాగం తానుపొందుతుంది. "యాన్త్యేవం గృహిణీపదం యువతయో వామాఃకులస్యాధయః" అన్నాడు కాళిదాసు. కుమారిగా తండ్రి యింట నున్నపుడు ఎవరితో మాట్లాడినా, ఎవరిని చూచి నవ్వినా, ఎవరితో స్నేహం చేసినా, చిన్నతనంగా చెల్లిపోతుంది.

వివాహిత స్త్రీకి ఎన్నో అడ్డుకట్టలున్నాయి.

గృహిణీ ధర్మం కత్తిమీద సామువంటిది.

మంచి చెడులు తెలియాలి. చేయదగినదేదో, చేయకూడనిదేదో తెలుసు కోవాలి. మాట నేర్పరితనంతోపాటు మంచితనం జతచేయాలి. పరపురుషుల విషయంలో ఎలా ప్రవర్తించాలో నేర్చుకోవాలి. తన యింటిగుట్టు తల్లిదండ్రులతో కూడా చెప్పకూడదు. పుట్టింటివారిని అత్తింట పొగడకూడదు. స్వంత సోదరుల తోనైనా ఎక్కువ సమయం ఏకాంతంగా వుండకూడదు. అత్తింటి బంధువులను గౌరవించాలి. అందరికీ తల్లిలాగ వుండాలి. తలలోని నాలుకలా అందరినీ ఆకట్టుకోవాలి. సహనం నేర్చుకోవాలి. శాంతమూర్తి కావాలి. గృహధర్మాచరణకు మించిన తపస్సు గృహిణికి మరొకటి లేదు. గృహధర్మమే గృహిణికి ముక్తి మోక్షాలనిస్తుంది.

గృహిణికి కాలిమెట్టెలు ఎందుకు?

నల్లపూసలు, మంగళసూత్రం ఎందుకు ధరించాలి?

పరపురుషులు తలవంచి చూచినా, తలఎత్తి చూచినా ఆమెగృహిణి అనీ, మరొకరికి స్వంతమనీ, ఇంకొకరి అర్ధాంగిగా జీవిస్తున్నదనీ, ఆమెను

కామదృష్టితో చూడరాదనీ, హాస్యోక్తులు పలుకరాదనీ, అందరికీ ఆమె మాతృ సమానురాలనీ, గౌరవనీయ దృష్టితో ఆమెను చూడాలనీ, సోదరీ భావంతో ఆమెతో మసలుకోవాలనీ, మానసికంగా గానీ, మాటపూర్వకంగా గానీ, క్రియా పూర్వకంగా గానీ, ఆమెను మాతృభావంతో చూడాలనీ, పూర్వీకులు గృహిణికి ఈ అలంకారాలు ఇచ్చారు. ముఖం చూడగానే నల్లపూసలు కన్పించాలి. గుండెలు చూడగానే మాంగల్యం కన్పించాలి. చీర అంచులను చూడగానే కాలిమెట్టెలు కన్పించాలి.

పరపురుషులు గృహిణిని కామదృష్టితో చూడదలచినా ఈ వస్తువులు కన్పించగానే వికారం తగ్గిపోతుందనే సంస్కార భావంతో పెద్దలు ఈ పద్ధతిని రూపొందించారు. రెండువేల సంవత్సరాలక్రితం మనకు మాంగల్యం లేదు. కాలిమెట్టెలు నల్లపూసలు లేవు. కలియుగ ధర్మప్రకారం కలిప్రభావానికి భయపడి ఈ ఆచారాలను పూర్వీకులు కల్పించారు. ఆ ఆలోచనే ఆచారమయింది.

• మన పెద్దల మేధోశక్తికి ఎన్ని వందనాలు చేసినా రుణం తీరదు గదా!

✦☆✦

వాస్తు శాస్త్రం నిజమా?

వాస్తు శాస్త్రం శ్రీమంతుల శాస్త్రం.

మామూలు వాస్తుకీ మయబ్రహ్మ వాస్తుకీ చాలా తేడాలున్నాయి.

వాస్తు శాస్త్రాన్ని బ్రాహ్మణులు చెప్పరాదు. జ్యోతిష్యమూ చెప్పరాదు.

వాస్తు శాస్త్రానికి నమ్మకమే మూలస్తంభం.

వాస్తుశాస్త్రం అబద్ధమనీ, ఆధార రహితమనీ, ఆచరణయోగ్యం కాదనీ నేను చెప్పను. కుటుంబంలో జరిగే ప్రతిదానికీ వాస్తు మాత్రం కారణం కాదు. ఇదొక మూఢనమ్మకం. లేదా ఇదొక మంచి నమ్మకం కూడా కావచ్చునేమో! అదేమిటో కాస్త పరిశీలిద్దాం. విధిని నమ్మినవాడు వాస్తును నమ్మరాదు.

వాస్తు - జ్యోతిష్యం - సాముద్రికం బ్రాహ్మణులు చెప్పరాదని ధర్మశాస్త్రం.

బాణామతి (చేతబడులు) కూడా బ్రాహ్మణులకు నిషిద్ధమే.

ఎందుకంటే; బ్రహ్మావిద్యాపరులు క్షుద్రవిద్యలను ఆశ్రయించి బ్రతుకకూడదు.

మనం అనుభవించే కష్టాలన్నీ మనం మనచేతులారా సృష్టించుకొన్నవే. మన దుఃఖాలన్నీ మనం కొని తెచ్చుకొన్నవే. మనకు వచ్చిన నష్టాలు కూడా మన తొందరపాటువల్లగానీ, మన సోమరితనంవల్లగానీ, మన అహంకారం వల్లగానీ, మన తెలివి తక్కువ తనంవల్లగానీ వస్తుంటాయి. వాస్తువల్ల కాదు.

> చేవ్వనిదయులేనందువల్లగానీ,
> వాస్తు వలనగానీ ఏమీ జరగవు.
> బాగాలేనిది వాస్తు గాదు;
> నీ ఆలోచనలు బాగాలేదు.
> నీ బుద్ధిని ముందు సరిదిద్దుకో!
> నీ కోపాన్ని తగ్గించుకో!
> నీ ఆవేశాన్ని శాసించుకో!
> అశాంతిని అర్పేసుకో!
> విజయం నీ యింటి వాకిట
> నీ కోసం నిలబడుతుంది.

ఈ ప్రపంచంలోని కోటీశ్వరు లెవ్వరూ హస్తసాముద్రికాలనూ, జ్యోతిష్యాన్నీ, వాస్తు పండితులనూ నమ్మరు. కృషిచేయటం నేర్చుకో! నీలోపాలేమిటో సరిదిద్దుకో! నీవెక్కడ తప్పటడుగు వేస్తున్నావో తెల్సుకో! విమర్శలను గౌరవించు! ఆలోచించు! నీ తప్పులను అంగీకరించు! అపుడు నీవు వద్దువద్దన్నా విజయమార్గంలో నడుస్తావు.

(కఠినంగా చెబుతున్నందుకు క్షమించాలి)

ఆగ్నేయంలోవంట-నైరుతిలో పంట -ఈశాన్యంలో గంట-వాయువ్యంలో పెంట ఇది వాస్తు దిశా నిర్దేశం. వాస్తు పండితులు విదిక్కుల గురించే (ఆగ్నేయ, నైరుతి-ఈశాన్య-వాయువ్య) ఎక్కువగా చెబుతుంటారు. ఇది అతిగా నమ్మదగినది కాదు.

వేయి సంవత్సరాల క్రితం వాస్తుశాస్త్రం లేదు. లేదనికాదు. వుంది. ఎవరూ ఆచరించేవారు కారు. అభివృద్ధి దేశాలలో వాస్తుశాస్త్రం లేదు. మరి! వారెలా అభివృద్ధి చెందారు? దేవుణ్ణి నమ్మినవాడు తప్పకుండా దెయ్యాన్ని కూడా నమ్మాలి.

శ్లో॥ కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన
హేకర్మఫలహేతుర్భూః మాతే సంగోస్త్వ కర్మణి ॥

"వాస్తు ఎప్పుడూ నీ ఆస్తిపాస్తులను పెంచలేవు."

✦☆✦

దీపావళికి పటాసులు కాల్చాలా?

దీపావళికీ పటాసులకీ సంబంధంలేదు.

ఆనాటి ద్వాపరయుగంలోని దీపావళికీ కలియుగం బాణసంచాకి సంబంధంలేదు.

సంబంధంలేదు గాని ఫలితం వుంది.

వెలుగు జ్ఞానానికి గుర్తు. సంతోషానికి ప్రతీక.

చీకటిని దూరంచేసే "దీపం" వివేకానికి సంకేతంగా భావిస్తారు.

క్రీస్తుశకం తొమ్మిదవ శతాబ్దంలో చైనాదేశస్థులు బాణసంచాను తయారు చేయటం కనిపెట్టారు. 15వ శతాబ్దం నుండీ ఇది అన్నిదేశాలకు పాకింది. భారతదేశంలో కేవలం ఐదువందల సంవత్సరాలనుండి మాత్రమే బాణసంచా తయారుచేస్తున్నారు.

ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు సత్యభామా సమేతుడై నరకాసురుని వధించి పదహారువేలమంది కన్యలను చెరనుండి విడిపించి ద్వారకా పట్టణానికి తీసికొని వచ్చాడు. శ్రీకృష్ణుని ఈవిజయానికి గుర్తుగా దీపావళిని జరుపుకొంటున్నాం.

దీపావళిని జరుపుకోవటంలో ఒక శాస్త్రీయ లాభంవుంది. ఆశ్వయుజ మాసానికి వర్షాకాలం ముగుస్తుంది. శరదృతువులో జరుపుకొనే దీపావళి సమయం నాటికి భూమినుండి లక్షోపలక్షల క్రిమికీటకాలు పుట్టివుంటాయి. మనుష్యులకూ పశువులకూ పంటలకూ విపరీతమైన హానికల్గిస్తాయి. ఈ క్రిమికీటకాల నివారణకోసం బాణసంచా వెలిగించే సంప్రదాయాన్ని రూఢి చేశారు పూర్వీకులు. బాణసంచా నుండి వచ్చేగంధకం పొగకు ఎన్నోకీటకాలు మనకు తెలియకుండానే నశించిపోతాయి.

దీపావళికి దీపాలు వెలిగించటానికి గతకాలంలో ఆముదంనూనెను వాడేవారు. ఇప్పుడు రకరకాల నూనెలు వచ్చాయి. ఆముదపుదీపం నుండి వచ్చేపొగ ఆరోగ్యదాయకం. వాతావరణాన్నికూడా ఆముదంపొగ శుభ్ర పరుస్తుంది. నూనెదీపాలు వెలిగించటంవల్ల కీటకాలు వెలుతురుకి ఆకర్షింపబడి

నూనెప్రమిదల్లోపడి మరణిస్తాయి. ఈదీపాలను చాలామంది కార్తీకమాసం ముగిసేవరకూ ప్రతిరోజూ పెడుతుంటారు.

టపాసుల శబ్దానికి కూడా క్రిములు నాశనమౌతాయి.

దీపావళి పండుగ శ్రీమంతుల పండుగ. రైతులచేతిలో డబ్బువుండని సమయంలో వస్తుంది. అయినా పసిపిల్లల సంబరం కోసమైనా ఈపండుగను హిందువులందరూ చేస్తారు. ఈదీపావళి అమావాస్యనాడు ధనలక్ష్మీపూజ చేస్తారు. లక్ష్మీపూజకు ఈఆశ్వయుజ అమావాస్య చాలా ప్రశస్తమైనది. ఉత్తర భారతీయు లందరూ అతివేడుకగా ఈపండుగను జరుపుకుంటారు. వ్యాపార లాభనష్టాలను పరిశీలిస్తారు. లక్ష్మీపూజకు ఏకాంత అయినా బంగారం వెండి ఖరీదు చేస్తారు. పాటలు పాడుతూ కోలాటనృత్యం చేస్తారు. అంగళ్ళలో లక్ష్మీపూజ చేసి మిఠాయి పంచుతారు.

✦☆✦

శుభకార్యాలు మాఘమాసంలోనే వుంటాయేమిటి?

ఉత్తరాయణ పుణ్యకాలంలో మాఘమాసం వస్తుంది.

శీతోష్ణాలు సమంగావుండి ఆహ్లాదకరంగా వుండేమాసమిది. మాఘ మాసంలో పెండ్లిజరిగితే కార్తీక మార్గశిర మాసాల్లో బిడ్డపుడతాడు. కార్తీక, మార్గశిరాల్లో పుట్టిన పాపలు ఆరోగ్యంగా వుంటారు. అందరూ వ్యవసాయపు పనులు లేకుండా యింట్లోనే వుంటారు. తల్లిబిడ్డల క్షేమసమాచారాలు చూడ డానికి ఎంతోవీలుగా వుంటుంది. వైశాఖంలోవివాహం జరిగితే మాఘ మాసంలో బిడ్డలు పుడతారు.

పుష్యమాసంలో పంటచేతికి వచ్చి డబ్బులువుండేకాలం. పుష్యం తరువాత వచ్చేమాసం మాఘమాసం కాబట్టి మాఘమాసం మధురమాసం అంటారు పండితులు. మాఘమాసం శుభకార్యాలకు, మార్గశిరం భక్తికార్యాలకు శుభప్రద మైనది.

ఆషాఢంలోనే పొలంపనులు ప్రారంభం జరుగుతాయి కాబట్టి కొత్త పెళ్ళికొడుకు ఇంటిధ్యాసను వదిలి పొలంపనుల్లో మునిగిపోతాడు. కష్టపడాల్సిన యువకులు భార్యా వ్యామోహంలో పడితే పొలం పనులు ఎవరు చేయాలి! ఆహారాన్ని కుటుంబానికి ఎలా సమ కూర్చాలి! అన్నీ సమస్యలే అన్నీ ఇబ్బందులే కలుగుతాయి. ఈ కారణం గానైనా వివాహాలకు మాఘమాసమే మంచిది.

మాఘమాసంలో నదులనీరు చెరువులనీరు పరిశుభ్రంగా వుంటుంది. ప్రకృతివల్ల ఎటువంటి తొందరలు వుండవు. వర్షాలుగాని ఎక్కువ వేడితో ఎండలుగాని ఎక్కువ చలిగాని వుండ వన్నమాట. మనదేశం వ్యవసాయ దేశం. వ్యవసాయమే మనకు ముఖ్య వృత్తి. కాబట్టి ఏపండుగలైనా, శుభ కార్యాలైనా రైతుపరంగా నిర్ణయించారు. దేశాభివృద్ధికి కృషికార్మికులే ముఖ్యమని మన పూర్వికులెపుడో గుర్తించారు. కాబట్టి తిరునాళ్ళు జాతరలు పండుగలు పెళ్ళిళ్ళు కృషిపరంగా, కృషికుల సౌలభ్య పరంగా వుండేట్లు నిర్ణయించారు.

మాఘమాసంలో కాయగూరలు విరివిగా దొరుకుతాయి.పండ్లు ఫలాలు కూడా అంతే! మాఘమాసంలో వివాహం జరిగితే తరువాత ఎండాకాలం వస్తుంది. సూర్యశక్తివల్ల ప్రాణులలో సంయోగేచ్ఛ కలుగుతుంటుంది. కాబట్టి నూతనదంపతులకు అనురాగం అభివృద్ధి చెందుతుంది. మాఘమాసం నుండి ఆషాడమాసానికి ఆరునెలలు సమయంవుంది. నవవధువు మాఘంలో గర్భవతి అయితే ఆరవనెలలో పుట్టింటివారు ఆడపిల్లను తమయింటికి తీసికొనివెళతారు. ఎలాగూ ఆషాఢంలో క్రొత్తఅల్లుడు అత్తవారింటికి వెళ్ళడు.

అపుత్రాః పుత్రిణః సంతు
పుత్రిణః సంతు పౌత్రిణః
అధనాః సధనాః సంతు
జీవంతు శరదశ్శతమ్

✦☆✦

"దేహో దేవాలయః" అంటే ఏమిటి?

దేహానికి మించిన దేవాలయం లేదు.

అంతరాత్మకు మించిన దేవుడు లేదు.

> **వేదం అంటే ప్రబోధం**
> అజ్ఞానం నుండి సుజ్ఞానానికి,
> చీకటిలో నుండి వెలుతురికి
> నడిపించే దివ్యచైతన్యం
> పొయ్యి వెలిగించుకొనే
> విషయం నుండి
> అణువిజ్ఞానందాకా వేదంలో వుంది.
> విత్తునాటటం దగ్గరనుండి
> పంట దాచుకోవటం దాకా
> వేదంలో వుంది.
> జననం నుండి మరణందాకా
> ఎలాజీవించాలో
> వేదం నిర్దేశిస్తుంది.

మనం వెదికే దేవుడు, మనం చూడాలనుకొంటున్నదేవుడు, మనం పూజించాలనుకొంటున్న దేవుడు, మనం కృతజ్ఞతలను చెల్లించుకోవాలనుకొంటున్న దేవుడు గుడి గోపురాలలో లేదు. నిలువెత్తు విగ్రహాలలో లేదు. పుణ్యక్షేత్రాలలో లేదు.

మరి దేవుడెక్కడున్నాడు?

నీలో వున్నాడు. నీమనసులో వున్నాడు. నీ అణుఅణువులో వున్నాడు. ప్రశాంతతలో వున్నాడు. కరుణలో వున్నాడు. త్యాగంలో వున్నాడు. ప్రేమలో వున్నాడు.

మనసుద్వారా దేవునికి దగ్గర కాగలంగాని మంత్రాలద్వారా కాదు.

కరుణ ద్వారా దేవుని దయపొందగలంగాని కానుకల ద్వారాకాదు.

ఇపుడు సాగుతున్న హైందవ పద్ధతులు వేదసమ్మతం కాదు. వేదాలలో ఎక్కదాకులాలు లేవు. అంటరానితనం లేదు. ఎక్కువ తక్కువలులేదు. మనుషులు కోసం వేదం పుట్టింది. మానవోద్ధరణ కోసం వేదాలు సృజింపబడ్డాయి. హిందువులుగా వున్నామేగాని వేదాల గురించి తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఎవరికీ లేదు.

మనకు తెల్సిందల్లా మనల్ని మనం తిట్టుకోవటమే! ఇదేమనదురదృష్టం.

"ప్రజ్ఞానం బ్రహ్మ" అంటున్నది ఋగ్వేదం.

"అహం బ్రహ్మాస్మి" అని చెబుతోంది యజుర్వేదం.

"తత్త్వమసి" అని వివరిస్తోంది సామవేదం.

"అయామాత్మా బ్రహ్మ" అని బోధిస్తోంది అధర్వణ వేదం.

మన వేదవిజ్ఞానం ఎంత గొప్పది!

మన వేదప్రబోధం ఎంత విశిష్టమైనది!!

తరగని వేదసంపద మనకుంది. తరించగల వేదజ్ఞానం మనకుంది.

తెలుసుకోగలిగిన సమయమే మనకులేదు.

"వేదం" అంటే పూజలకు పెళ్ళిళ్ళకు చదివేమంత్రాలు కాదు.

"వేదం" అంటే ఉదయం టి.వి. లలో వినే ప్రసంగాలు కాదు.

"వేదం" అంటే క్యాసెట్లలో వినే సుప్రభాత స్తోత్రాలు కాదు.

మీరెప్పుడైనా వేదాలు చదివారా! కనీసం తెలుసుకొన్నారా!

అగ్రవర్ణంవారే వేదాలు చదవాలన్న నియమం వేదాలలో లేదు.

వేదనాదం అందరిదీ.

వేద జ్ఞానం అందరిదీ.

వేద విజ్ఞానం ఎవడబ్బ సొమ్ము కాదు.

ఏ ఒక్క జాతికీ స్వంతకాదు.

సర్వజన హితంకోసం సర్వజీవాళి సముద్ధరణ కోసం దైవమిచ్చిన జ్ఞానమది.

వేదం సమస్త హిందూ కులబంధువుల ఆస్తి! హక్కు!

మనం హిందువులం! మనం బంధువులం!

"దేహమే దేవాలయమని చెప్పటం ఏమతానికి సాధ్యం!?!

అహో!! మహోన్నతమైన ఈసంస్కృతికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలం!

దైవకార్యక్రమాల్లో మీరెపుడైనా "మంత్రపుష్పం" విన్నారా! వినండి చెబుతాను. ఈమంత్రపు అర్థాన్ని మీకు వివరంగా వివరిస్తాను.

"యచ్చకించిజ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతే పివా
అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థిత:
అనంత మవ్యయం కవిగ్ం సముద్రేన్తం విశ్వశంభువం
పద్మకోశ ప్రతీకాశగ్ం హృదయం చాప్యధోముఖమ్
అధోనిష్ట్యా వితస్యాన్తే నాభ్యా ముపరి తిష్ఠతి
జ్వాలమాలా కులంభాతి విశ్వస్యాయతనం మహత్
సంతతగ్ం శిలాభిస్తు లంబత్యా కోశ సన్నిభమ్
తస్యాంతే సుషిరగ్ం సూక్ష్మం తస్మిన్సర్వం ప్రతిష్ఠితమ్
తస్యమధ్యే మహానగ్ని ర్విశ్వార్చిర్విశ్వతో ముఖ:
సోగ్ర భుగ్వి భజన్ తిష్ఠన్నాహార మజర: కవి:
తిర్యగూర్ధ్వ మధశ్శాయి రశ్మయస్తస్య సన్తతా
సంతాపయతి స్వందేహం ఆపాద తలమస్తక:
తస్యమధ్యే వహ్ని శిఖా అణీయోర్ధ్వా వ్యవస్థిత:
నీలతోయద మధ్యస్థా ద్విద్యుల్లేఖేవ భాస్వరా
నీవార శూక వత్తన్వీ పీతాభా స్వత్యణూపమా
తస్యా: శిఖాయామధ్యే పరమాత్మా వ్యవస్థిత:
సబ్రహ్మా సశివ: సహరి: స ఇంద్ర: సలక్షర: పరమస్వరాట్"

ఈమంత్రార్థం వింటే దేహం దేవాలయం ఏవిధంగా అయిందో తెలుస్తుంది.

మనం చూస్తున్న వింటున్న ఈసర్వప్రపంచ మంతటా పరమాత్మ వున్నాడు. అంతం లేని నాశనంకాని సృష్టిస్థితి లయ కారకుడైన ఆపరమాత్మను ధ్యానింతుము గాక!

కంఠమునకు క్రింద, నాభి(బొడ్డు)కి పన్నెండు అంగుళముల పైన హృదయ కమలం వుంది. ఆహృదయ కమలం అనంతమైన ప్రకాశంతోవుంది. ఇదియే పరబ్రహ్మము. ఆకమలములో తమ్మి మొగ్గవంటి హృదయం వుంది. ఇదిక్రిందికి (అధోముఖంగా) వేలాడుతూవుంది. దీనిలోనే జగత్తు ప్రతిష్ఠింపబడివుంది.

సుషుమ్నానాడికి మధ్యగా వున్నట్టి దీని హృదయకాంతులు నలువైపులా ప్రసరిస్తుంటాయి. శరీర చలనానికి ఇదేమూలం.

సుష్మమ్నానాడికి మధ్యలోనున్న హృదయకమలంలో జఠరంవద్ద ఈ ప్రకాశవంతమైన కాంతి ప్రభావం శరీరమంతా వ్యాపించి దేహాన్ని ఎల్లపుడూ వేడిగా వుంచుతుంది. ఈఉష్ణజ్వాల (అగ్నిజ్వాల) వల్లనే బుద్ధి మనస్సు పని చేస్తున్నాయి. ఆహారాన్ని జీర్ణపరచి అన్ని అవయవాలకూ విభాగించే క్రియాశక్తి ఇక్కడే వుంది.

ఈ తమ్మిమొగ్గవంటి హృదయంలో వరిముల్లు అంతటి పరిమాణంగల, మెరుపుతీగ వంటి పసుపుపచ్చని రంగుగల దివ్యకాంతి, అణుసమానమై వర్ధింప వీలులేనట్లుగా వెలుగుతూ వుంది. చూడజాలని ఈదివ్య కాంతికి మధ్యన పరమాత్మవుంది. (దీనినే పరంజ్యోతి అంటారు)

ఈ పరమాత్మయే బ్రహ్మ! ఈ పరమాత్మయే శివుడు!

ఈ పరమాత్మయే విష్ణువు! ఈ పరమాత్మయే ఇంద్రుడు!

ఈపరమాత్మ నాశనం లేనిది. సర్వోత్తమమైనది. స్వయంప్రకాశం కలది గొప్పది. ప్రణవ స్వరూపమైన పరబ్రహ్మ ఈహృదయంలోనే వున్నాడు. సర్వ సర్వంసహా శక్తికి ఇదే మూలం.

అందుకే ఋగ్వేదం ప్రజ్ఞానమే బ్రహ్మ అని చెబుతున్నది! అహం బ్రహ్మాస్మి అని యజుర్వేదం చెప్పేదానికి కూడా అర్థం ఇదే! తత్త్వమసి (తత్+త్వం+అసి) నీవే ఆ పరబ్రహ్మ వంటున్నది సామవేదం! అయ మాత్మా బ్రహ్మ. అంటున్న అధర్వణార్థం కూడా ఇదే. ఈ ఆత్మయే బ్రహ్మ.

మరి 'దేహం దేవాలయం' కాదా! - మన హృదయంలో దేవుడు లేడా!

మన గుండెల్లో దేవుడున్నాడు.

గుళ్ళల్లోలేదు.

> మనిషికి సుఖాన్నిచ్చేది మనస్సు. డబ్బుకాదు. అసంతృప్తితో నలిగిపోయే మనిషిని పట్టుపరుపులు కూడా నిద్రపుచ్చలేవు. నీ మనస్సుకి మించిన మంచి మిత్రుడు మహాశత్రువు మరొకరు లేరు. అన్నిటికీ నీమనస్సే కారణం.

సత్యం దేవుడు! దయదేవుడు! మంచి దేవుడు! మానవత్వం దేవుడు! ధర్మం దేవుడు! దానం దేవుడు! నీతి దేవుడు! నియమం దేవుడు! శాంతి దేవుడు! దేవునికోసం కొండకోనలు ఎక్కాల్సిన పనిలేదు. తీర్థాలు తిరగాల్సిన పనిలేదు. నీమనసు చంచలమైనపుడు నీవు అపనమ్మకాల పుట్టవైనపుడు, నిన్ను నీవే నమ్మనపుడు దేవుడు నీకెక్కడా కనుపించడు. అసలు నీవే దేవునికి కనుపించవు. ఇదినిజం.

కానుకలకు, కొబ్బరికాయలకు, మంత్రాలకు దేవుడు ప్రసన్నంకాడు.
దేవుడు లంచాలు తీసుకోడు! పూజలకు పొంగిపోడు అతి కోర్కెలను
మన్నించడు.

✦☆✦

లక్ష్మీదేవి కమలంలో వుండి ప్రక్కనే ఏనుగులు వుంటాయేంటి?

శ్లో॥ పద్మాసనే పద్మహస్తే సర్వలోకైక వందితే
నారాయణ ప్రియేదేవి విష్ణువక్షస్థలాలయే
క్షీరసాగర సంభూతే కమలే కమలప్రియే
పాహిమాం కృపయాదేవీ సర్వసంపత్ప్రదాయనీ॥

దేవదానవులు క్షీరసాగరాన్ని మథించినపుడు జన్మించి విష్ణువును వరించిందామె! సర్వలక్షణ సంపన్నురాలైన ఈసుందరవతికి "లక్ష్మి"అని నామ కరణం చేశారు. సమస్త సంపదలకు అధిదేవతగా చేశారు! దేవతలందరూ! లక్ష్మీదేవి చిత్రపటాన్ని చూచారు గదా!

పాలనురుగు వంటి దేహఛాయ, త్రిలోకైకసౌందర్యం, ఈమెకు స్వంతం! చిరునవ్వు నిండిన ముఖంతో, సర్వాలంకార భూషితయై, గజరాజులు తోడుగా నాలుగుచేతులతో, కమలాసనంపై కూర్చొని వుంటుంది. చేతులలో ఏ

ఆయుధాలు వుండవు. కలువపూలను మాత్రమే చేతధరించి వుంటుంది! ఈ ధనాధిదేవత!

దేవతలకు నాలుగుచేతులు ఎనిమిది చేతులు వుండటం మనం శిల్పాలలో ఫోటోలలో చూస్తుంటాం. అంటే అంతటి శక్తివుంది అని అర్థం! లక్ష్మికి సరస్వతికి నాలుగు చేతులు వుంటే పార్వతి(శక్తి)కి ఎనిమిది చేతులు వుంటాయి. డబ్బుకన్నా, విద్య కన్నా, భుజబలం చాలా గొప్పదని అర్థం.

ధనలక్ష్మికి స్థిరత్వం లేదు. ఒకరి దగ్గర ఒకచోట స్థిరంగా వుండదు. లక్ష్మిచంచల మనస్సు గలది. స్థిరమైన జీవితంకూడా లేదు. అయితే వున్న నాలుగురోజులు ఉయ్యాల లూగిస్తుంది. అందరినీ అన్నిటినీ దాసోహమని పిస్తుంది. తనశక్తి ఏమిటో ఎంతటిదో చూపిస్తుంది. అందుకే డబ్బుకు లోకం దాసోహం అంటారు. "ధనం మూల మిదం జగత్" అంటారు. లక్ష్మికి నాలుగు చేతులుండే కారణం యిదే!

> లక్ష్మీదేవికి రెండువైపులా ఏనుగులు ఎందుకుంటాయంటే, గజబలం ఎంతగొప్పదో ధనబలం కూడా అంత గొప్పదని మనం తెలుసుకోవ టానికి. ఒక్కరోజుకి వాడిపోయే కలువ పూవులో లక్ష్మీదేవి దర్శన మిచ్చే కారణం. "ధనం శాశ్వతం కాదు. ఏదో ఒకరోజు మాయమై పోతుంది. అని అందరికీ తెలియ చెప్పటానికే! నీటి అలలకూ, చిన్న గాలికీ, ఊగి పోయే కలువకు అర్థ మేమంటే ధనం నిలకడుగా వుండదు అని.

తన చంచలత్వాన్ని అందరికీ తెలియపర్చటానికే శ్రీమహాలక్ష్మీ నీటి కొలనులో వున్నతామరలో కూర్చొని వుంటుంది. నీటిలో వున్న కలువపూవు నిశ్చలంగా వుండదు. చిన్నగాలికే అటూఇటూ ఊగిసలాడుతుంది. కలువపూవు నీటిలో వున్నంతసేపే నిగనిగలడుతుంది. నీటినుండి బయటకు తీయగానే వాడి వత్తలైపోతుంది. డబ్బుకూడా పెట్టెలో భద్రంగా వుంటేనే మనిషికి శక్తి వుంటుంది. బయటకు తీసి ఖర్చుపెట్టేస్తే మనిషికి శక్తి సన్నగిల్లుతుంది. అన్ని విధాలుగా మనిషిక్రుంగి పోతాడు.

✦☆✦

సరస్వతి రాతిమీద కూర్చుంటుంది. నెమలి, హంస, ప్రక్కనే ఎందుకు నిలబడి వుంటాయి

దక్షిణభారతీయ చిత్రకళకు రాజారవివర్మ జీవంపోశాడు. ఉత్తరభారతీయ దేవతా చిత్రాలకు దక్షిణ భారతీయ చిత్రకళకూ ఎంతో వ్యత్యాసం వుంటుంది. ఆభరణ విన్యాసం. వస్త్రవిన్యాసం, కేశాలంకరణలు కారణం కావచ్చు. పురాణ చిత్రాలకు అనన్యమైన అద్వితీయ రూపకల్పన చేసిన గొప్పవ్యక్తి ప్రముఖ చిత్రకారుడు "వడ్డాది పాపయ్యగారి" రుణం ఏమిచ్చినా తీర్చుకోలేనిది.

బ్రహ్మపత్నియైన సరస్వతి తెల్లని వస్త్రాలు ధరించి శ్వేతపద్మంలోకూర్చుని మాణిక్య వీణను మీటుతూ వుంటుంది. ఈమెకు శరదృతువు అంటే ఇష్టం. మూలా నక్షత్రం సరస్వతీ నక్షత్రంగా భావిస్తారు. ముత్యాల సరాలు ధరించే ఈమెకు హంస వాహనం. నెమలిపింఛం అంటే ఇష్టంకూడా.

అందరు దేవతలు కమలపుష్పంలో కూర్చున్నట్లుగా బొమ్మలు (చిత్రాలు) వేస్తారు గదా! కమలపుష్పం నిలువులోతు నీటిలో బురదలోపుడుతుంది. నీటిలో వున్నా కమల పుష్పానికి నీరు అంటుకోవు. నీటికి నానదు. చీకటి అంటే ఇష్టముండదు. వెలుగు వుంటేనే వికసిస్తుంది. అందుకే దీనిని జ్ఞానపుష్పంగా హిందువులు గౌరవిస్తారు.

సరస్వతీదేవి రాతిమీద కూర్చుని వుండటానికి ఒక సంకేతం వుంది. సరస్వతి సర్వవిద్యలకు అధిదేవతగదా! శక్తిసంపదలు స్థిరంకావు. ఏదో ఒక నాటికి హరించుకు పోతాయి. విద్యబండరాయిలా సుస్థిరమైనది. అనేవిషయం తెలియపర్చటానికే సరస్వతిని రాతిబండమీద కూర్చోబెడతారు. ఆమె హంసనే వాహనంగా ఎంచుకోవటానికి కారణమేమంటే హంసజ్ఞానపక్షి. పాలలో నీరుపోసి హంసముందు పెడితే పాలనుమాత్రమే త్రాగుతుందట హంస. పాలను నీటిని కలిపిన తరువాత ఆరెంటినీ వేరుచేయటం సాధ్యమా! కాదుగదా! కాని హంస మాత్రమే వేరుచేసి త్రాగుతుందట. అంటే విద్యవల్ల వివేకం. విజ్ఞానం లభిస్తాయని తెలియజేయటానికి ఆమె హంసవాహని అయింది. ఇక: నెమలి

ఆమెవద్ద ఎందుకుంటుంది. అంటే: సమస్త ప్రాణులు ఆడమగ కలిసి సంభోగం చేస్తాయి. కాని నెమలికి సంభోగం వుండదు. పవిత్రపక్షి యిది. మగనెమలి కంటినీటిని త్రాగి గ్రుడ్డు పెడుతుంది. రతిక్రియ జరుపని పక్షి యిదొక్కటే. విద్య పవిత్రమైనదని తెలియజెప్పటానికే నెమలిని సరస్వతి వద్ద చిత్రిస్తారు.

విద్యనిగూఢ గుప్తమగువిత్తము రూపము పూరుషాళికిన్
విద్యయశస్సు భోగకరి విద్యగురుండు విదేశబంధుడున్
విద్య విశిష్ట దైవతము విద్యకుసాటి ధనంబు లేదిలన్
విద్యనృపాల పూజితము విద్యనెరుంగనివాడు మర్త్యుడే?

✦☆✦

వధూవరులకు అక్షింతలు వేసి నమస్కరిస్తారెందుకు?

విివాహం అనేది ఒక ధర్మసంస్కారం.

వివాహాన్ని ఒక పవిత్ర ధర్మంగా భావిస్తారు హిందువులు.

వివాహంతోనే జీవితానికి సార్థకత, సంపూర్ణత లభిస్తుందంటారు పెద్దలు. వివాహం అంటే ఒక అమ్మాయి ఒక అబ్బాయి జతకట్టటంకాదు. వివాహమంటే ఒక పవిత్రమైన ధర్మకార్యం. అందుకే వేదమంత్రాలతో గురుబంధువుల సమక్షంలో వైదికధర్మ విధితో, సంప్రదాయ బద్ధంగా జరిపిస్తారు. మహావేడుకగా జరిపిస్తారు.

వివాహం ఒక అపూర్వమహోత్సవం. అద్భుతమైన ధర్మకార్యం. జీవితాంతం మరువరాని, మరుపురాని, మరువగూడని మహత్కార్యం. దీని గురించి ఎంతచెప్పినా తక్కువే అనిపిస్తుంది. సముద్రంలోని ఉప్పునీ, పొలంలోని మామిడినీ కలిపి ఆవకాయ పెట్టినట్లుగా; అక్కడి అమ్మాయినీ ఇక్కడి అబ్బాయినీ కలిపిముడివేసి బంధించి బంధం ఏర్పరిచే అద్వితీయ విధానం ఈ వివాహం. ఈ బంధానికి అర్థం చెప్పటం నిర్వచించటం ఎవరికి సాధ్యం! ఎలాసాధ్యం!!

A.C. No. 93180

స్త్రీ పురుషుల జీవితంలో ఇదొక మధుర దివ్యానుభూతి! ఏ కవుల కలానికీ అందని అనంతానంద రసానుభూతి! ఇదొక మహత్తర ధర్మావిష్కరణ!

వివాహంలోని పరమార్థాన్నీ, చరితార్థాన్నీ, విజ్ఞతా ధర్మాన్నీ, మనకు విశదం చేయటానికే బ్రహ్మ, విష్ణు-మహేశ్వరులకు భార్యలను సృష్టించాల్సి వచ్చింది వేదమహర్షులకు! ఏమతంలోనూ లేని భార్యాభర్తల దేవతలు మనకు మాత్రమే వున్నకారణం వివాహధర్మాన్నీ, సతీపతుల బంధాన్నీ, మనం తెలుసుకోవాలనే! అందుకే హిందూమతం హిందూధర్మం విడాకులను అంగీకరించదు.

హిందూమతం వివాహ విచ్ఛేదనాన్ని అంగీకరించదు.

నిజమైన హిందువులు వివాహ విచ్ఛేదనాన్ని ఒప్పుకోరు.

ఇది హిందూమతం గొప్పదనం.

వివాహ సమయంలో వరుడు శ్రీమన్నారాయణునితో సమానం. కాబట్టే నారాయణ స్వరూపుడైన వరునికి కాళ్ళుకడిగి కన్యాదానం చేస్తారు. అంతేగాని అల్లునికి కాళ్ళు కడగరు. కూతురి కాళ్ళు కడిగే సంప్రదాయం ద్రావిడుల్లో ఈనాటికీ వుంది. వరుడు పరమ శివుడైతే వధువు శ్రీమహాగౌరి. వరుడు నారాయణుడైతే వధువు శ్రీమహాలక్ష్మి.

అందువల్లనే నూతన వధూ వరులకు అక్షతలు వేసి శ్రీలక్ష్మీ నారాయణ స్వరూపులుగా భావించి నమస్కరించటం హిందూ సాంప్ర దాయం.

మన వివాహబంధమెంత పవిత్రమైనదో ప్రపంచం మనల్ని చూచినేర్చుకోవాలి.

లక్షలు ఖర్చుపెట్టి పందిళ్ళు వేయించి విందుభోజనాలు పెట్టే తల్లిదండ్రులు వివాహం అంటే ఏమిటో, ఎంత పవిత్ర మైనదో, ఎంతటి మహిమ వుందో తమ బిడ్డలకు తెలియజెప్పాలన్న ఆలోచన ఎందుకు చేయటంలేదు! వివాహానికి నాయకులను పిలిచి నమస్కారాలు పెడుతున్నారేగాని గురువులను, ధర్మ బోధకులను, పండితులను ఎందుకు మరిచిపోతున్నారో ఎంతకూ అర్థం కావటం లేదు. ఇది బాధాకరం! ఇది వేదనా విషయం!

వివాహ పవిత్రత తెలియక పోవటంవల్లనే ధోవతి కట్టుకోవటం మానివేసి ప్యాంట్ వేసుకొనే మాంగల్యం కడుతున్నాడు పెండ్లికుమారుడు! ఈదుస్థితి ఇతర రాష్ట్రాల్లో ఇంతగా లేదు. వివాహకార్యక్రమాన్ని వేదవిధిగా నిర్వర్తించాల్సిన పురోహితులు పొట్టకూటికి ప్రాకు లాడటంతో పవిత్రకార్యక్రమం కాస్తా పతన స్థితికి జారింది. వివాహం శృంగార కార్యక్రమంగా మారిపోతున్నది.

వివాహానికి ముందుగా వరునికి మంగళస్నానం చేయించి వివాహ మండపంలో కూర్చోబెట్టి "దైవపితృ ఋణాపాకర హేతు ధర్మప్రజోత్పన్నసిద్ధి ద్వారా, శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం, వివాహాఖ్యం సంస్కార కర్మ కరిష్యే" అని సంకల్పమంత్రం చెబుతారు, దీని అర్థమేమంటే: ధర్మమార్గాన బిడ్డలను కనటం వల్ల పరమేశ్వరుడు సంతోషిస్తాడనీ పితృదేవతలు సంతృప్తి చెందుతారనీ, దీనివల్ల పితృఋణం తీరుతుందనీ వివాహ సంస్కార కర్మను చేయుచున్నాము అనిమంత్రార్థం.

ఇక వధువు తండ్రి కన్యాదానం చేయబోయే సమయాన దీక్షాకంకణం ధరించి. "మమ సమస్త పితృణాం నిరతిశయ ఆనంద బ్రహ్మలోక ఆవాప్త్యాది కన్యాదాన కల్పోక్త ఫలావాప్త్యయే అనేనవరేణ అస్యాంకన్యాయాం అము త్పాదయిష్యయాణ సంతత్యా, ద్వాదశావరాన్, ద్వాదశ పరాంశ్చ పురుషాన్. పవిత్రీకర్తుం. ఆత్మనశ్చ లక్ష్మీనారాయణ ప్రీతయే బ్రహ్మవివాహ విధినా, ఏతత్ కన్యాదానం కరిష్యే" అని సంకల్పం చేసి వధువు తండ్రి తనకుమార్తెను వరునికి ధారపోస్తూ" కన్యాం కనక సంపన్నాం. కనకా భరణైర్యుతాం. దాస్యామి విష్ణవే తుభ్యం బ్రహ్మలోక జిగీషయా. విశ్వంభరా స్సర్వభూతాస్సాక్షిణ్యః సర్వ దేవతాః ఇమాంకన్యాం ప్రదాస్యామి పితృణాం తారణాయచ" అంటూ కన్యాదానం చేసే ఈ మంత్రార్థాన్ని కూడా సంక్షిప్తంగా చెబుతాను.

"ఈ వివాహం సంస్కారానికి దయచేసిన పెద్దలారా! నాకుమార్తె అయిన ఈకన్యామణిని బ్రహ్మవివాహ విధిగా శ్రీమన్నారాయణ స్వరూపుడైన ఈవరునికి ధర్మప్రజోత్పత్తి కోసం దానమిస్తున్నారు. ఈపుణ్యకార్యంవల్ల నాతాత ముత్తాతలైన పన్నెండు తరాల పితృదేవతలకు పుణ్యం లభించుగాక!

"ఓ వరుడా! సర్వదేవతల సాక్షిగా సర్వభూతాల సాక్షిగా నాపుత్రికను నీకు విధి పూర్వకంగా వేదమంత్ర సహితంగా దానమిస్తున్నారు. ఓ విష్ణు స్వరూపుడవైన వరోత్తమా! దీనివల్ల నాకు బ్రహ్మలోక ప్రాప్తికలుగు గాక!"

చిన్నచిన్న దానాల వల్లనే పుణ్యం లభిస్తుందిగదా! నూరుసంవత్సరాల జీవితంకోసం పుత్రసంతాన ప్రాప్తికోసం అప్పటిదాకా పెంచిపెద్దజేసి కాపాడి రక్షించి కన్యాదానం చేస్తున్న కన్యాపితృకి ఎంతపుణ్యం రావాలి! తప్పకుండా స్వర్గప్రాప్తి కలుగవల్సిందే. పిల్లనిచ్చిన మామగారిని పుల్లాయిగాడి క్రింద జమకట్టే పనికిరాని వెధవ అల్లుళ్ళకు ఈమంత్రార్థం వినిఅయినా బుద్ధివస్తుందేమో!

✦☆✦

దేవాలయానికి వెళ్ళినప్పుడు కొంతసేపు కూర్చొని రావాలా?

స్థిరచిత్తంతో, ఐహికత్వాన్ని మరిచి, మౌనధ్యానంతో, కొంత సమయం దేవాలయంలో కూర్చోవటం శాస్త్రసమ్మతం, దేవాలయంలో అంటే దేవునికి ఎదురుగా అనికాదు. దేవాలయ ప్రాంగణంలో ఎక్కడైనా కూర్చోవచ్చు.

ఆలయ ప్రవేశానికి కొన్ని నియమాలున్నాయి.

ఆలయం ప్రవేశించ బోయేముందు నీమనస్సు ప్రశాంతంగా వుండాలి. నీఅంతస్థును హోదాను, గొప్పతనాన్ని పలుకుబడినీ, అక్కడ ప్రదర్శించరాదు. కోపాన్ని, అహంకారాన్ని, ఆధిక్యతనూ దేవాలయాల్లో చూపించకూడదు. దేవునికి ధనవంతుడూ దరిద్రుడు ఒక్కటే నన్నవిషయం మరువకూడదు. పూజారికి లంచమిచ్చి నీ ఆధిక్యప్రదర్శన చేయకూడదు. దాంభికత్వాన్నీ పరిజ్ఞానాన్నీ ప్రదర్శించకూడదు.

దేవుని ముందు కుప్పిగంతులు వేయరాదుగదా!

దేవుడు అందరికీ దేవుడే! దైవకార్యాలకు అందరూ పెద్దలే! దైవప్రీతికి అందరూ పాత్రులే! దైవపూజకు అందరూ అర్హులే! దైవదర్శనానికి అందరూ

సమానమే. ఈ సద్విషయాన్ని తెల్సుకొని అభిమానించి అనుసరించి ఆచరించిన వాడే దేవుని ప్రేమకు అర్హుడు.

దేవుడు శ్రీమంతుల ఇంటిమనిషి కాదు. దేవుడు అధికారుల ఆస్థి కాదు.

దేవుడు ప్రజాసేవకుల సొత్తు కాదు.

దేవుడు దీనుల మనిషి! దేవుడు దుఃఖితుల మనిషి! దేవుడు దరిద్రుల మనిషి! దేవుడు పీడితులమనిషి! దేవుడు నిరుపేదల మనిషి!

ఇది శాస్త్రసత్యం

పట్టుబట్టలు కట్టి. నామాలు పెట్టి. మాలలు ధరించిన దాంభికులకు, అధికారదర్పంతో అహం నిండిన మనస్సుతో ఆధిక్యతను ప్రదర్శించే పాలకులకు, ఆర్థిక దర్పంతో ధనాధిక్యతతో గొప్పదనం చూపించే శ్రీమంతులకూ అసలు దేవుడు ప్రసన్నం కాదు.

దేవునిముందు ఆధిక్యతను ప్రదర్శిస్తే దైవనిందనతో సమానమే.

మనందేవుని సేవకులమైతే దేవుడు దీనుల సేవకుడు. దీనప్రియుడు.

శుష్క భక్తితో, ఆడంబర తత్వంతో దేవాలయాలకు వెళ్ళొద్దు. మితిమీరిన కోర్కెలతో, మితిదప్పిన ఆశలతో, ధర్మరహితమైన ఆకాంక్షలతో దేవుని దర్శించటం మహానేరం. ఘోరపాపం! అత్యాశను దేవుడు మన్నించడు.

ఆలయానికి వెళ్ళి అరగంట సేపైనా కూర్చొని ధ్యానించకపోతే నీవు భక్తుడివికావు. అర్పణాభావమే దేవుని కిచ్చే గొప్పకానుక!

పూలదండలకు, కొబ్బరికాయలకు, ధూపదీపాలకు, కానుకలకు దేవుడు సంతోషించడు. దేవునికి కావల్సింది నీమనస్సు! నీప్రేమ! నీఆరాధన! నీవిశ్వాసం! నీశరణాగతి!

నీవు అనుభవించే సమస్తం ఆయన నీకు ప్రసాదిస్తే నీవేం యివ్వగలవు! ఆయనకు!

✦☆✦

మంచివారికి కష్టాలు, చెడ్డవారికి సుఖాలు వుంటున్నాయెందుకు?

"అవశ్యమనుభోక్తవ్యం, గతంజన్మ శుభాశుభం"

మంచివారికి మాత్రమే కష్టాలు వస్తున్నాయి! చెడ్డవారందరూ సుఖంగా వున్నారు!

ఇంటినిండుగా
ఆహారపదార్థాలున్నవాడు
సుఖవంతుడుకాదు,
కడుపు నిండుగా
ఆకలి వున్నవాడే సుఖవంతుడు!
అందమైన భార్యవున్నవాడు
అదృష్టవంతుడు కాదు,
అనుభవించ గల్గిన ఆరోగ్యం
వున్నవాడే అదృష్టవంతుడు!
అధికారహోదాలుండటం
గొప్పదనంకాదు.
కంటినిండుగా మైమరచి
నిద్రపోయేవాడే గొప్పవాడు!
ఖరీదైనభవంతి జీవితం
సంతృప్తికరం కాదు.
కట్టుకొన్న దానితో కన్నబిడ్డలతో కల్సి
వున్నదాన్ని పంచుకొని తినటమే
సంతృప్తి!
జేబునిండుగా డబ్బు వంటినిండుగా
జబ్బు వున్నవాడు సుఖవంతుడా!
కాదుగదా!

ఈ ప్రపంచంలో దరిద్రంతో జీవించే వారందరూ మంచివారు-మేడలు మిద్దెలు కట్టుకొని భోగభాగ్యాలతో వున్న వారందరూ చెడ్డవారు-అని అనుకోవాలా! ఇది అసూయాభావం! ఇది అజ్ఞానంతో కూడిన ఆలోచన!

మనది కర్మసిద్ధాంతం!

"గత జన్మలోని పాపపుణ్యాల ఫలితమే ఇప్పటిజన్మ' అని నమ్ముతాం. తల్లితండ్రుల పాపపుణ్యాలను కూడా బిడ్డలు అనుభవించి తీరుతారుని కూడ నమ్ముతాం. ఈకర్మ సిద్ధాంతమే హిందూ మతానికి పునాది.

ఇక్కడొక చిన్నఆత్మవిమర్శ
చేసుకొందాం.

అసలు; సుఖంఅంటే ఏమిటి!

కష్టం అంటేఏమిటి!

జేబునిండుగా డబ్బు, వంటినిండా నగలు, స్వంతకారుల్లో షికార్లు, ఖరీదైన భవనాల్లో నివాసం, ఇంట్లో పని

మనుషులు, దర్జాలు, హోదాలు ఇవేగదా సుఖమంటే! అసలు సుఖానికి నిర్వచనం, సుఖానికి రహదారి, ఇవేవీకాదు. మనకంటికి కనిపించేవన్నీ సుఖాలు కానేకావు. ఈవిషయం చాలామందికి అర్థంకాదు. అర్థమయేటంతగా ఆలోచించరు. డబ్బుతో అన్నీ పొందవచ్చు. అన్నీకొనవచ్చు. అన్నీ అనుభవించవచ్చు, అనుకొంటారు. అంతా అబద్ధం.

అనుకూలవతియైన భార్య, అదరించే బిడ్డలకంటే ఆస్తులు గొప్పవా!

"కష్ట సుఖాలు" ఆలోచించే మనసులోనే వున్నాయి.
క్యాష్ బ్యాగుల్లో లేవు.
కొన్ని దశల్లో కొన్నివిషయాలు అర్థంకావు. అనుభవముంటేనే బోధపడతాయి.

కర్మసిద్ధాంత ప్రకారం గత జన్మలోని పుణ్యకార్యాలవల్లనే ఈజన్మలో సుఖాలు అనుభవిస్తారు. శ్రీమంతులుగా జన్మిస్తారు. ఇది నిర్వివాదం. ఎవరికో ఏదో వున్నదని నీకున్నదాన్ని చిన్నచూపుచూడవద్దు. నీకున్నదే నీకు గొప్పది. మహారాజుగారి భార్య త్రిలోకసుందరి అయితే నీకు లాభమేమిటి? దాహం తీర్చలేని మహాసముద్రంకన్నా దప్పికతీర్చే గ్లాసుడు నీళ్ళు గొప్పవి.

మంచివారికి ఎపుడూ మంచే జరుగుతుంది. ఇది పరిపూర్ణ సత్యం. దేవుడు దయామయుడు. ఏదోవిధంగా తనబిడ్డలను రక్షిస్తుంటాడు.

✦☆✦

దేవాలయాలు తప్పని సరిగా వుండాలా?

దేవుడు నీలోనే వున్నాడని తెల్సుకొనగల్గినపుడు దేవాలయంతో పనిలేదు.
అందరిలోనూ దేవుడున్నాడని తెల్సుకోగలిగినా దేవాలయాలతో పనిలేదు.
ప్రాచీన మునులకు రుషులకు దేవాలయాలు లేవు.

ఆనాడుకాని, ఈనాడుకాని, సన్యాసులు, తత్వజ్ఞానులు, కర్మయోగులు, యతులు, వానప్రస్థులు, ఆశ్రమాలను, ఆకులకుటీరాలను నిర్మించుకొని భగవదారాధన చేస్తుంటారే తప్ప దేవాలయాల్లో వుండరు.

జైన బౌద్ధమతాలు విగ్రహారాధనను అంగీకరించలేదు.
మహమ్మదీయమతం అసలు అంగీకరించదు.

దేవుని విషయమై మనిషికి నమ్మకం కల్గించటానికీ, దేవుని యెడల మనిషికి ఏకాగ్రత కలుగటానికి, దేవుడు ఎక్కడున్నాడని ప్రశ్నించటానికి వీలు లేకుండ టానికీ, ధార్మిక విషయాలను మనుష్యలందరికీ చెప్పటానికీ పారమార్థిక తత్వాన్ని సదా మనస్సులలో నిలుపు కోవటానికీ, సంసారిక తాపత్రయంనుండి కొంత సమయమైనా దూరంగా వుండటానికీ, జ్ఞానులు యోగులు మొదలైన మహాత్ముల పరిచయాలు కలుగటానికీ, వైదికధర్మాలను వేదప్రవచనాలను తెలుసుకోవ టానికీ, భావోద్వేగాలతో పొంగిపొరలే మనస్సును నియంత్రించి మంత్రించుకోవ టానికీ నాకెవ్వరూలేరని నిర్వేదానికి లోనైనప్పుడు నాకుదేవుడు తోడుగా వుంటాడన్న ఆత్మధైర్యాన్ని కల్గించుకోవటానికీ, ధార్మికవిధులు, దైవవిశ్వాసాలు స్థిరంగా వుండటానికి దేవాలయాలు కావాలి.

అసలు దేవాలయాల వుద్దేశం ఒక బొమ్మను నిలబెట్టి హారతులు ఇవ్వటం కానుకలు వేయించుకోవటంకాదు. దైవదర్శనానికి దబ్బు వసూలు చేయటం కాదు. దైవప్రసాదాలను వ్యాపారంగా లాభాలకు అమ్ముకోవటంకాదు. అయోగ్యు లైన అర్చకస్వాముల్ని నియమించటం కాదు. అమాయక భక్తజనాన్ని కసురు కోవటం, దౌర్జన్యం చేయటం, ధనమున్న శ్రీమంతులకే దర్శనం కల్గించటం, దేవాలయాల సంప్రదాయమైతే ధార్మికభక్తులు దేవాలయాలకు వెళ్ళరు. దైవ సన్నిధిలోనే తారతమ్యాల గుడింపు జరుగుతూ వుంటే మరికొంత కాలానికి హిందూమతం బక్కచిక్కి పోకతప్పదేమో!

మనం వివేకంలేని "గొర్రెబుద్ది" నుండి బయటకు రావాలి. వేదాలు తప్పని సరిగా తెలుసుకోవాలి. వేదాలను సరళవ్యవహారిక భాషకు అనువాదాలు (యధేచ్చా వ్యాఖ్యానాలు లేకుండా) జరిపించాలి. దీనికి ధార్మిక సంఘాలు, ఉదారులైన సంపన్నులు పుణ్యం కట్టుకోవాలి. సేవాభావంతో ఎవరోఒకరు ముందుకురావాలి. సంస్కృత భాష కనుమరుగై పోయినట్లుగా కొద్ది సంవత్సరాల లోనే తెలుగు భాషకూడా మాట్లాడటానికే తప్ప వ్రాయనూ చదవనూ ఈనాటి యువకులకు చేతకాకపోవచ్చునేమోనని పిస్తున్నది. కాబట్టి సంస్కృత పండితులు

బ్రతికుండగానే ధార్మికగ్రంధాలు సరళభాషకు దిగుమతికావాలి. దేవాలయాలు ధార్మిక స్థలాలుగా వుండాలేగాని మార్మిక స్థలాలుగా మారకూడదు.

✦☆✦

ప్రభవ-విభవ సంవత్సరాలు అరవై మాత్రమే ఎందుకున్నాయి?

అరవై సంవత్సరాల కొకసారి మనోధర్మాలతో పాటుగా మానవధర్మాలు మార్పు చెందుతుంటాయి. బుద్ధిశక్తి కూడా అరవై సంవత్సరాలు మాత్రమే నిరాఘాటంగా వుంటుంది. అరవై తరువాత క్రమంగా జ్ఞాపకశక్తి క్షీణించి పోతుంది. శరీరంలోని కండలన్నీ కరిగిపోవటం ప్రారంభిస్తాయి.

అరవై సంవత్సరాల లోపల మృత్యుశక్తి ఒకసారి తన ప్రభావం చూపి స్తుందట. అంటే ఏదోవిధమైన ఏదోరకమైన ప్రాణాపాయం దగ్గరగా వచ్చి వెళ్తుందన్నమాట! అరవై తరువాత ప్రతి పదిసంవత్సరాలకు మృత్యుశక్తి పల కరిస్తూనే వుంటుంది.

అందుకే అరవైసంవత్సరాలకు 'షష్టిపూర్తి' చేస్తారు.

ప్రభవ 'నామ' సంవత్సరంతో ప్రారంభమై "అక్షయనామ' సంవత్సరంతో అరవై సంవత్సరాలు ముగుస్తాయి గదా. మరలా ప్రభవ ప్రారంభమైనట్లుగానే మనుషులకు అరవై సంవత్సరాలు నిండిన తరువాత 'బాల్యావస్థ' ప్రారంభ మౌతుంది. అంటే చిన్నపిల్లల్లా ప్రవర్తిస్తుంటారు.అకారణంగా అలగటం, అవీ ఇవీ తినాలని అడగటం, చిన్నచిన్న దొంగతనాలు చేయటం, ఎక్కువసేపు నిద్రబోవటం, సమయాసమయాలు చూడకుండా పడుకోవటం, చిన్నచిన్న అబద్ధాలు ఆడటం, చిన్నవిషయానికే ఆనందపడటం, కోపం తెచ్చుకోవటం, చేస్తుంటారు. ఎక్కువసార్లు భోజనం చేయటానికి ఆశపడుతుంటారు.కన్నీళ్ళు పెట్టుకొంటుంటారు. ఇటువంటి బాల్యచేష్టలన్నీ అరవైనుండి ప్రారంభ మవుతాయి.

అరవై నుండి తన బిడ్డకు తానే బిడ్డగా మారిపోతాడు తండ్రి.

వార్ధక్యంలో స్త్రీవ్యామోహం, అధికారదాహం వదలివేయాలి. కుటుంబబాధ్యతను కొడుక్కి అప్పగించాలి. మంత్రిగా మాత్రమే సలహాలనిస్తూ వుండాలి గాని అధికారాన్ని చలాయించకూడదు. మనస్సును దైవకార్యాలకు సత్ చింతనకూ పరమార్థ, పుణ్య కార్యాలకు మళ్ళించాలి. (మరలించుకోవాలి)

అరవై సంవత్సరాల అంతరార్థమిదే!

ప్రతికొడుకు అరవైసంవత్సరాలకు వచ్చిన తండ్రిని తనబిడ్డలతో సమానంగా చూచుకోవాలని ధర్మశాస్త్రం. అందరి తల్లిదండ్రులకూ అంతటి అదృష్టం వుండబోదుగదా!

పురుషశక్తి అరవైసంవత్సరాలకు అంతమైపోతుంది.

ఆరుపదుల జీవితాన్ని ఎవరైతే ఆనందంగా గడుపుతారో వారి జీవితం ధన్యమనే చెప్పవచ్చు. ఆధన్యజీవితపు జ్ఞాపకార్థమే బిడ్డలు మనమళ్ళు బంధువులు మిత్రులు అందరూకల్సి "షష్టిపూర్తి" పండుగను చేసి సంబరాలు పంచుకుంటారు.

వేదాలు అరవైసంవత్సరాలను మాత్రమే నిర్దేశించిన కారణమిదే.

"శతమానం భవతు " అని చెప్పేది ఆశీర్వచనం మాత్రమే.

✦☆✦

పూర్వకాలంలో వేశ్యావాటికలను ఎందుకంగీకరించారు?

ధర్మ - అర్ధ - కామ - మోక్ష అనే చతుర్విధ పురుషార్ధాలకు ఎంతటి ప్రాముఖ్యత వుందో, అంతకు మించిన మానవుని ముఖ్యావసరాలు మూడు వున్నాయి. ఆ మూడు ఏమిటంటే-:

"నిద్ర - ఆకలి - సంభోగం"

ఈ మూడింటి తరువాతనే మనిషికి ఏమైనా కావాలి.

ఈ విషయాన్ని ఎవరైనా కాదంటే వాడికన్నా అజ్ఞాని లేనేలేడు.

మన సమాజం మనల్ని వైజ్ఞానికంగా పెరగనివ్వలేదు. మూఢత్వం మూర్ఖత్వంతోనే మనం పెరిగి అజ్ఞానులమయ్యాం. మనమనస్సు ఒకటి. మనమాట వేరొకటి! మన ఆశ ఒకటి, మనమాట ఇంకొకటి!

'వేశ్య' అనగానే అందరికీ వుబలాటం పుడుతుంది.

'వేశ్య' అనగానే అందరిలోనూ ఆరాటం పుడుతుంది.

'వేశ్య' అనగానే అందరికీ చెప్పలేని వుత్సాహం వస్తుంది.

'వేశ్య' అనగానే అందరికళ్ళు నలుమూలలా వెదుకుతాయి.

ఏమిటిది? ఎందుకు!

అందరికీ చీకటిసుఖాలు కావాలి! అందరికీ వెలుతురు మర్యాద కావాలి.

అంతే కదా! ? !

నిద్రాహార మైధునాల్ని జయించిన వారింతవరకూ జన్మించలేదు.

అటువంటి ప్రాణి యింతవరకూ సృష్టిలో పుట్టలేదు.

అందుకే మనదేవుళ్ళందరికీ భార్యలున్నారు.

ఒక విషయం గుర్తించాలి! కామం (సెక్స్) తప్పుగాదు! అవసరం!

వ్యభిచారం తప్పు!

పరస్త్రీ వ్యామోహం మహానేరం.

అన్నం తినటం ఎలానేరంగాదో, కామసుఖాల నాశించటం కూడా నేరంకానేకాదు.

మనపూర్వికులు స్త్రీలందరికీ "పాతివ్రత్యం వుండాలని ఎపుడు శాసనం చేశారో, అపుడే వేశ్యావాటికలకు అనుమతిని కూడ ఇచ్చారు." సమాజానికి వేశ్యావాటికల అవసరమున్నదా ! పురుషుల నిరంకుశత్వ ధోరణికి వేశ్యగృహాలు ప్రతీకలు కావా! ఇది స్త్రీలజీవితాలతో ఆడుకోవటం కదా! అనేప్రశ్నలెన్నో మనకు కలుగవచ్చు. కాని-

కొన్నింటిని నిలుపుదల చేయటం ఎవరెవరికీ సాధ్యంకాదు.

ఏకొంతైనా నియంత్రించటమే మంచిమార్గం.

మద్యపానాన్ని నిరోధించటం ఎవరికి సాధ్యమైంది? మద్యం మనిషికి అవసరమే కాదు. శ్రీకృష్ణుడంతటి మహనీయుడే మద్యపానాన్ని యాదవ సమాజంలో నిరోధించలేక పోయాడు. తనకళ్ళముందే సమస్త యాదవకులం మద్యమదోన్మత్తులై నరుక్కొని చస్తూవుంటే మిన్నకుండిపోయాడు. చూస్తుండి పోయాడు.

మద్యవ్యసనానికి మించినది కామవ్యసనం.

వేశ్యా గృహాలకు పట్టణాలలో ఒకవీధికి వీదేవుండేది. ఆవీధిని భోగం బజారు అనిపిలిచేవారు. వేశ్యలందరూ నృత్యశాస్త్రం, సంగీతశాస్త్రం అభ్యసించే ఆచారం వుండేది. దేవాలయాల్లో వీరికి మాన్యతవుండేది. మాన్యాలుకూడా వుండేవి. ప్రతిపున్నమికీ తిరునాళ్ళకీ నృత్యప్రదర్శనలు ఇచ్చేవారు. వీరికి దేవదాసీలని మరో పేరువుంది.

ఆనాటి బుద్ధివంతులు మేధావులు కామవిలాసాలకు మాత్రమే వీరిని ఎందుకు అంగీకరించారంటే, బలహీన కుటుంబాల స్త్రీలకు రక్షణకోసం! ఈనాటి రక్షణా వ్యవస్థకూ ఆనాటి రక్షణావ్యవస్థకు అజగజాంతర వ్యత్యాసం వుంది. అప్పటి సామాజిక ధర్మాలు న్యాయాలు కూడా వేరుగా వుండేవి. బలవంతుల దృష్టినుండి సంసారికి స్త్రీలను రక్షించుకోవటానికి మరొకమార్గం లేని సమయంలో వేశ్యా వాటికలకు అంగీకరించవల్సి వచ్చింది. ఆనాటి సామాజికధర్మం ఈపద్ధతికి తల ఆడించింది. వేశ్యల యిండ్లలో వుండే స్త్రీలు వైద్యులుగా కూడా వ్యవహరించేవారు. సుఖరోగాలకు మందులిచ్చేవారు. స్త్రీల కాన్పుల విషయాలలో వైద్యులుగా సేవకులుగా కూడా వుండేవారు. 'వీరిని

> ఎవరుపడితేవారు వేశ్యలు కావటానికి వీలులేదు. భోగకులస్థులైన స్త్రీలకు మాత్రమే ఈఅవకాశం వుండేది. ఈకులంలో పుట్టిన ఆడపిల్లలకు చిన్నతనం నుండే నృత్యాన్నీ సంగీతాన్నీ జారతనాన్నీ నేర్పేవారు. ఊరివృమ్మడి క్షేత్రాలను శాశ్వత జీవనాధారంగా ఈ భోగ కులస్థులకు ఇచ్చేవారు. వీటినే మాన్యాలు అంటారు. ఈ భోగకులస్థులందరూ కామశాస్త్ర కళాపండితురాళ్ళే.

'మంత్రసానులు' అనేవారు. 'సాని' అంటే వేశ్య. వేశ్యలను సానులు అని పిలిచేవారు.

శ్రీమంతులకు, భార్యాహీనులకు, కాముకులకు, ఈవేశ్యలు శరీరసుఖాల నందించే వారన్నది నిజం. కాని వేశ్యలుకూడా కొన్నినీతి నియమాలను పాటించేవారు. వేశ్యాజీవితం గడుపుతూనే వివాహం చేసుకొని జీవించేవారు. వివాహితులుగా వుంటూనే వేశ్యాధర్మాన్ని సాగిస్తుండేవారు. కొందరు అందగత్తెలు రాజాశ్రయం పొందేవారు. రాజసుఖాలు అనుభవించేవారు. నృత్య గానాలే వీరికి తెల్సిన విద్యలు.

పాలకుల దృష్టి ప్రజలమీద పడరాదనే వేశ్యావాటికలు సృష్టింపబడ్డాయి.

దీన్ని ఆనాటి సామాజిక భద్రతగానే పరిగణించాలి.

✦✫✦

ఒకే గోత్రీకుల మధ్య వివాహాలు ఎందుకు చేయరాదు?

శ్లో॥ సప్తమాత్పచం మార్ధీమాన్ యఃకన్యాముద్వహేన్నరః।
గురుతల్పీన విజ్ఞేయః సగోత్రాన్ చైవ ముద్వహన్॥ - ధర్మసింధు

తండ్రి తరుపున ఏడులతరాలలోగాని, తల్లితరపున ఐదు తరాలలోగాని సగోత్రీకులైన వారిని వివాహం చేసికొనరాదు. అట్లుచేసికొన్నచో తల్లిని (గురుపత్నిని) వివాహం చేసికొన్నంత పాపం సంభవిస్తుంది.

సనాతన సంప్రదాయంలో యజ్ఞయాగాలు మొదలైన వైదిక కర్మలకు, వివాహాది శుభకార్యాలకు, శ్రాద్ధాది పితృకర్మలకు తప్పనిసరిగా గోత్రం, ప్రవర తప్పనిసరిగా తెలియపర్చవల్సి వుంటుంది. మనందరి గోత్రాలకు ఎనిమిది మంది మహర్షులు మూలపురుషులుగా వున్నారు. అగస్త్యమహర్షి- భరద్వాజ మహర్షి - గౌతమమహర్షి- వశిష్టమహర్షి - కాశ్యపమహర్షి - భరద్వాజమహర్షి - అత్రిమహర్షి - జమదగ్నిమహర్షి ఈ ఎనిమిది మంది మహర్షులు మనకు గోత్రపురుషులు.

ఏ గోత్రం వారు ఆ గోత్రంవారికి రక్తసంబంధీకులు అవుతారు.

ఈ ఎనిమిదిమంది గోత్రపురుషులకు కలిపి నలభైతొమ్మిది మంది ప్రవర పురుషులున్నారు. సంతానోత్పత్తి క్రియకు (దాంపత్యానికి) ఒకే గోత్రీకులు అయి వుండ రాదు. ఒకే ప్రవర వున్నవారు కూడా దాంపత్య బంధానికి పనికిరారు (వివాహం కుదరదు)

వధూవరులు ఒకేగోత్రం కలవారైనా, ఒకే 'ప్రవర' వారైనా అన్నాచెల్లెళ్ళవుతారు.

ఒకే గోత్రీకులకు బిడ్డలుపుడితే పరమదుర్మార్గులవుతారు.

సగోత్రీకుల వివాహబంధం కంటే వర్ణాంతర వివాహమే మేలైనది.

సగోత్రీకులు, సప్రవరీకుల మధ్య మాత్రమే కాకుండా మేనత్తకూతురిని, అన్నగారి మరదలిని (వదిన చెల్లెలిని) మేనమామ కూతుర్ని కూడా వివాహం చేసుకోకూడదని ధర్మశాస్త్రం చెబుతోంది. తండ్రితరపు రక్తసంబంధీకులు ఏడుతరాలవారు, తల్లితరపున రక్తబంధువులు ఐదుతరాలవారు కాకుండా వున్న కన్యను పెండ్లిచేసుకోవాలని అన్నిశాస్త్రాలు చెబుతున్నాయి. అక్కకూతురిని పెండ్లిచేసుకోవటం కూడా ధర్మాచారం కాదు.

> దూర సంబంధీకులైన భార్యాభర్తలకు పుట్టే పిల్లలు ఆరోగ్యంగానూ, తెలివిగలవారుగానూ, సౌందర్యవంతులుగానూ వుంటారనేది మాత్రం నిజం. సగోత్ర సంబంధాలను పురాణాలు, స్మృతులు, అన్నీ వ్యతిరేకిస్తున్నాయి.

> "పైతృష్వసేయీాం భగినీం, స్వస్త్రీ యాం మాతురేవచ. ఏతాస్తి స్రస్తుభార్యేర్థే, నో పయచ్ఛేత బుద్ధిమాన్"

అనగా తండ్రిగారి చెల్లెలి బిడ్డను (మేనత్త కూతురు) తల్లిగారి చెల్లెలిబిడ్డను (పినతల్లి కూతురు) వివాహ మాడరాదు.

కుండమార్పిడి వివాహాలుకాని, ఒకే పందిరిలో రెండు పెళ్ళిళ్ళుగాని నిషిద్ధం.

✦☆✦

పితృదేవతలకు శ్రాద్ధకర్మలు, సంవత్సరీకం చేయవల్సిందేనా?

ఈప్రశ్న ఎంత కఠినమైనదో సమాధానమంత నిష్ఠురమైనది.

ఏది ఏమైనా ఈప్రశ్నకు సమాధానం బహుకష్టతరం.

ఎందుకంటే:

మనం చెబుతున్నది ఒకటి! ఆచరిస్తున్నది మరొకటి!

(ఆర్యాచార్యులందరూ క్షమింతురుగాక)

శ్లో॥ వాసాంసి జీర్ణాని యథా విహాయ - నవాని గృహ్ణాతి నరోపరాణి!
తథా శరీరాణి విహాయ జీర్ణాన్ - అన్యాని సంయాతి నవాని దేహీ!!

"మానవుడు చిరిగిపోయి పనికిరాని దుస్తుల్ని విసరివేసి మరొక క్రొత్త దుస్తుల్ని ఏవిధంగా ధరిస్తుంటాడో, అదేవిధంగా జీర్ణమై చిక్కిశల్యమైన ముసలి శరీరం వదలివేసిన 'ఆత్మ' మరొక దేహంలో ప్రవేశిస్తుంది.

చనిపోయిన మనపెద్దల 'ఆత్మలు' అలాగే ఆత్మరూపంలో తిరుగుతూ వుండవు. ఈ దేహాన్నుండి మరొకదేహానికి మరొక దేహంనుండి ఇంకొక దేహానికి మారుతూ వుంటాయి. మరణానంతరం మనిషి ఆత్మఅలాగే వుండిపోదు. మరొకప్రాణి దేహంలోనికి వెళ్ళిపోతుంది.

శ్లో॥ దేహినోస్మిన్ యథా దేహే - కౌమారం యవ్వనం జరా!
తథా దేహాంతర ప్రాప్తిః - ధీరస్తత్ర న ముహ్యాతి!!

మనిషి జన్మించిన తరువాత శిశుస్థితి నుండి బాల్యానికీ, బాల్యదశనుండి యవ్వ నానికీ, యవ్వనం నుండి వృద్ధాప్యానికి, వృద్ధాప్యంనుండి మరణానికి ఏవిధంగా మారు తుంటాడో ఆవిధంగానే ఈదేహంలోని ఆత్మ ఒకదేహంనుండి మరొకదేహానికి నిరంతరం ప్రయాణిస్తూనే వుంటుంది. ఈ జీవధర్మానికి ధీరులైన మనుష్యులు దుఃఖపడరు.

శ్లో॥ జాతస్యహి ధృవోమృత్యుః ధృవంజన్మ మృతస్యచ
తస్మాదర్థ పరిహార్యేర్థే నత్వం శోచితుమర్హసి॥

జన్మించిన వానికి మరణం తప్పదుగాక తప్పదు. అదేవిధంగా మరణించిన వానికి మరలా జన్మించటం కూడా తప్పదు. ఈచావుపుట్టకలకు దుఃఖించరాదు. అంటాడు గీతాచార్యుడు.

మరణించినవారి ఆత్మ వెంటనే మరొక దేహంలోనికి వెళుతుంది.
ఆత్మ దేహాన్ని వదలిన తరువాత ఆత్మకూ దేహానికీ ఏ సంబంధమూ లేదు.
నిరంతరంగా సాగే ఆత్మప్రయాణానికి ఈ దేహం ఒక చిన్నమజిలీ మాత్రమే
దేహంలో జీవుడున్నంత వరకే ఈసంబంధాలుంటాయి.

అలాగైతే

మనిషి మరణించిన తరువాత పితృకర్మలు చేయటంలో అర్థమేమిటి?

ఆత్మ దేహసంబంధాన్ని వదలుకొన్న తరువాత మనసంబంధం కూడా వదలు కొన్నట్లేగదా! శ్రాద్ధకర్మలు, సంవత్సరీకాలు, జయంతులు చేయటంలో అర్థంలేనట్లే గదా! మరణించినవారి ఆత్మశాంతికిచేసే పనులన్నీ (దానాలు మొదలైనవి) నిజం కానట్లేగదా!

వేదాలు శ్రాద్ధకర్మలను అంగీకరించలేదు.
అస్థికలను పవిత్రనదుల్లో కలపటంకూడా శాస్త్రసమ్మతం కాదు.

పుత్రుడు పున్నామనరకం నుండి తప్పిస్తాడని చెప్పటం వేదసమ్మతంకాదు. పిండప్రదానాది కార్యక్రమాలను భారతం మొదలైన ఇతిహాసాలు (పురాణాలు కాదు) అంగీకరించటం నిజమేకాని వేదాలు సమ్మతించలేదు. ఇపుడు జరుగుతున్న శ్రాద్ధకర్మలకు మత్స్యపురాణమే ఆధారం. పురాణాలు పౌరుషేయాలు.! వేదం అనేది అపౌరుషేయం.! కాబట్టి వేదసమ్మతమే విహితమైనది.

మహాభారతయుద్ధానంతరం వ్యాసమహర్షి పేరున కొందరు ప్రబుద్ధ శిఖామణులు అన్ని పురాణాలనూ, స్మృతులనూ వారికిష్టం వచ్చినట్లుగా దిద్ది తమకు అనుకూలం చేసుకొన్నారు అని, చరిత్రకారులు చెబుతునారు. (కాని)

మహాభారతయుద్ధానంతరమే విగ్రహారాధన ప్రారంభం జరిగింది. అవైదికమైన ధర్మాలు ఆచారాలు మొదలయ్యాయి.

శ్రీ భగవాన్ వ్యాసమహర్షి పేరున పురాణాలను దిద్దటం వ్రాయటం జరిగింది ఇతిహాసాలను కొంత మార్చటం కూడా జరిగింది. ఆపాప ఫలితమే యిపుడు కొందరు అను భవిస్తున్నారు.

యజుర్వేదంలో-

"యథేమా వాచం కల్యాణి అవధాని బ్రహ్మా రాజన్యాభ్యామ్ శూద్రా యచ ఆర్యాయచ స్వాయచ అరణా యచ" అని పవిత్ర వేద వాక్యం.

శ్రాద్ధాది కర్మకాండలు, మాస కర్మలు, సంవత్సరీకాలు వేద పండి తులు, పురోహితులు జీవనా ధారం కోసం దాదాపు రెండువేల సంవత్స రాల నుండి జరుపుతున్న కార్య క్రమం మాత్రమేనని చెప్పవచ్చు.

> వేదాలను స్వయంగా పరమాత్మ మనకిచ్చాడు. వేదాలను ఏ కవీ వ్రాయలేదు. ఏరచయితా సృష్టించ లేదు. అని మనందరకూ తెల్సినదే గదా! యజుర్వేదంలో: వేదవిజ్ఞానం మానవ్వ అందరికోసంగా చెప్ప బడింది. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రు లకు, స్త్రీపురుషులందరికీ వేదవిజ్ఞానం ప్రసాదిస్తున్నట్లు చెప్పబడింది. పర మాత్మని ఆదేశాన్నీ సందేశాన్ని ఎవరికీ తెలియకుండా కొందరు త్రొక్కి పట్టి వేదవిద్యను ఎవరికీ అంద కుండా చేశారు. ఇటువంటి కారణాల వల్లనే సంస్కృత భాష మృతభాషగా అయింది.

శ్రాద్ధకర్మలు జరుపకూడదని చెప్పటం నా వుద్దేశ్యం కానేకాదు. 'వేదశృతం' కాదని మాత్రమే చెప్పదలిచాను. ఎవరిష్టం వారిది కదా!

✦☆✦

'మనుస్మృతి' మనుధర్మాలు అంటే ఏమిటి? మనువు ఎవరు?

మనకు పద్నాలుగు మంది మనువులున్నారు.

మనుస్మృతి రచించిన మనువును స్వయంభూ మనువు అంటారు.

ఈ పదునాలుగు మనువులలో స్వయంభూ మనువు మొదటివాడు. బ్రహ్మకుమారుడు

ఈ మనుమహర్షిని ఈనాటి బుద్ధిజీవులందరూ బ్రాహ్మణ పక్షపాతి అనీ, స్త్రీ జనవిరోధి అనీ, దళిత శత్రువు అనీ విమర్శించటం అన్నిచోటులా వింటూనే వున్నాం. అయినా మనహిందూ చట్టాలను ఈ మను ధర్మశాస్త్ర ప్రకారమే రచించారు. మనకు స్మృతులు వందకుపైగా వున్నా మనుధర్మశాస్త్రాన్నే ఆధారం చేసుకొని 'ఇండియన్ లా అండ్ ఆర్డర్' ను బ్రిటిషర్స్ తయారు చేయటం జరిగింది.

ఇప్పుడు మనం పాటించే ఆచారాలన్నీ మనుధర్మ శాస్త్రానివే!

ఈమనుమహర్షి వేదవ్యాసమహర్షికి చాలా సంవత్సరాలు ముందువాడు. అంటే రామాయణ మహాభారత రచనలకు ముందే మనుస్మృతి వుండివున్నదన్న మాట!

మనుధర్మాలు ఏమిటి?

ఏం చెయ్యాలి! ఏం చేయకూడదు!

మనుమహర్షి చెప్పిన శాస్త్ర,ధర్మాలను, హిత అహితాలను, చెబుతాను.

-ముందుగా నేను చెప్పదలచినది-

స్త్రీలకు ధార్మిక స్వాతంత్ర్యం ఇవ్వరాదనీ, ఇవ్వకూడదనీ మనువుచెప్పలేదు. స్త్రీదేవతనీ, స్త్రీని గౌరవించాలనీ, స్త్రీని సంతోషంగా వుండేటట్లు చూడాలని చెప్పాడు.

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతాః" అన్నాడుమనువు. కులవధువును నిర్లక్షం చేస్తే కులనాశనం జరుగుతుందన్నాడు మనువు.

చతుర్వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ-వైశ్య-శూద్ర వర్ణధర్మనిర్ణయంలో శూద్ర వర్ణానికి న్యాయం చేయలేదన్న విషయం మాత్రం బాధాకరమే. ఏదిఏమైనా హిందూధర్మ వ్యవస్థ మొత్తం ఈనాటికీ మనుధర్మశాస్త్రా ధారంగానే వుంది. శూద్రవర్ణాల వారు కూడా మనుధర్మశాస్త్రాన్నే అనుసరించి ఆచరిస్తున్నారు. ఇదే మనుస్మృతి గొప్పదనం.

- మనుధర్మ శాస్త్రం ఏమిటంటే -

వివాహం స్వజాతీయులలోనే జరగాలి - వధువు సలక్షణంగా వుండాలి - తండ్రికి సంబంధించిన ఏడుతరాలతోనూ, తల్లికి సంబంధించిన ఐదు తరాలతోనూ కన్యకు సంబంధం వుండకూడదు- వధువు పొడగరి గానీ పొట్టిగా కానీ వుండకూడదు - శరీరంనిండా వెంట్రుకలు వుండకూడదు - పెద్దనోరు, పొట్టిముక్కు వుండకూడదు - అతిపెద్ద స్తనాలు వుండకూడదు - చిన్నకళ్ళు వుండకూడదు. అన్నలు తమ్ముళ్ళు లేని వధువు పనికిరాదు - కన్యాశుల్కం ఇవ్వకూడదు - వరదక్షిణ తీసికొనకూడదు-పెద్దలు నిర్ణయించిన వధువే ఉత్తమ మైన గృహిణిగా భావించాలి - అష్టవిధవివాహాలలో బ్రాహ్మీ వివాహమే మంచిది - గాంధర్వ (ప్రేమ) వివాహాలు యోగ్యమైనవికాదు - అత్తమామలను (వధువు తల్లిదండ్రులను) తన తల్లిదండ్రుల్లా గౌరవించాలి - వధువుకి సంబంధించిన పుట్టింటి వారికానుకలు వధువుకి మాత్రమే చెందుతాయి - వివాహమాడిన భర్త నపుంసకుడైతే భార్య మరొక సగోత్రీకుడైన వానితో బిడ్డను పొందటం పాపంకాదు - ఏపరిస్థితిలోనూ వివాహం విచ్ఛేదనం అంగీకారం కాదు - భార్యను ఒంటరిగా విడచి భర్త దేశసంచారం చేయకూడదు-గృహిణి గృహంలో సంతోషంగా వుంటేనే సంపదలు వస్తాయి - పురుషుడు ఏ సమయంలో ఎక్కడున్నా భార్య ఋతుసమయానికి వచ్చి ఆమెతో శరీర సుఖాలు పంచుకోవాలి -పగటి సమయాలలో భార్యతో సంభోగం చేయకూడదు - బంధువులు ఇంట్లో వుండగా కాని, బంధువుల ఇంటికి వెళ్ళి నపుడుగాని భార్యతో కలిసి నిద్రించరాదు -చిన్నవారు ఏకాంతంగా వున్నపుడు వారికి భంగం కల్గించరాదు - అమావాస్య పూర్ణిమ, అష్టమీ తిధులలోనూ పండుగల దినాలలోనూ, భార్యాసంగమం చేయ కూడదు - భార్య ఋతుమతిగా వున్నపుడు భార్యను సమీపించకూడదు - భార్యనైనా బలత్కారంగా అనుభవించకూడదు -అక్కకూతుర్ని, మేనత్తగారి

కూతుర్ని, మేనమామ కూతురిని వివాహం చేసికొనకూడదు - వివాహం నిశ్చయం జరిగిన తరువాత మాట తప్పకూడదు - ఆడపిల్ల ఋతుమతి అయిన మూడు సంవత్సరాలకు పైగా వివాహం జరుపకుంటే ఆయువతి తనకిష్టం వచ్చిన వారిని వరించవచ్చు-

బిడ్డ పుట్టిన పదిహేను రోజులలోనే నామకరణం చేయాలి - నదులపేర్లు (గౌతమి కావేరి త్రివేణి గంగ) గాని, వృక్షముల పేర్లుగాని (చంప మల్లిక మందార) ప్రాణుల పేర్లు (నాగమ్మ, నాగయ్య, చిలకమ్మ, పులిరాజు,నందిని) గాని బిడ్డలకు పెట్టకూడదు. మృదువైన, అందమైన, మంగళకరమైన, పిలువ టానికి సులభంగా వుండే పేరును పెట్టాలి- పసిపాపకు నాల్గవ నెలలో సూర్య దర్శనం చేయించాలి - ఆరవనెలకు అన్నం తినిపించాలి - ఒకటి లేక మూడవ సంవత్సరాలలో వెంట్రుకలు తీయించి, చెవులు కుట్టించాలి - తరువాత విద్యాభ్యాస ఉపనయనాలు - ఉపనయనం లేకుండా బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు వివాహం చేసికొనరాదు - పెద్దలు గురువులు, వృద్ధులు, అధికారులు మొ॥కి నమస్కరించి గౌరవించాలి-పెద్దలు నిలబడివుండగా చిన్నవారు కూర్చుని సంభాషించకూడదు-పెద్దవారిని పేరుతో పిలవకూడదు-తండ్రిగారి అన్న దమ్ములు అక్కచెల్లెళ్ళు, మరియు తల్లిగారి అక్కచెల్లెళ్ళు అన్నదమ్ములు వీరందరూ జననీ జనక సమానులు - భార్యతల్లితండ్రులను కూడా స్వంత తల్లిదండ్రులతో సమానులుగా గౌరవించాలి-విద్యనేర్పిన గురువు, కులపెద్ద, గ్రామాధికారి, వైద్యుడు వీరుసదా అభివందనీయులు.

కాల్వలు, నదులు, చెరువులు, తోడులేకుండా, లోతుతెలియకుండాదిగి స్నానం చేయకూడదు - ఒంటరిగా ఎక్కడికీ ప్రయాణించ కూడదు - ఎప్పుడూ హాస్యప్రసంగాలు చేయకూడదు - నిజంతెలియక నిందించకూడదు - పరస్త్రీల విషయాలు చెప్పుకొనకూడదు - అమావాస్య దినాలలోనూ, ఉరుముల వర్షం పడుతున్నపుడు, బంధువులు మరణించిన సమయాలలోనూ విద్యాభ్యాసం చేయరాదు.

శరీరము మాట మనస్సు పరిశుభ్రంగా వుండాలి-పెద్ద ధ్వనితో సంభాషించ కూడదు - ప్రియంగా మాట్లాడాలి అలాగని అసత్యం చెప్పకూడదు. సత్యం

చెబుతున్నానని బాధకల్గించకూడదు. బాధ కల్గుతుందేమోనని అసత్యం చెప్పకూడదు - మాట్లాడటం ఒకగొప్పకళ ఈకళను అందరూ అభ్యసించాలి - ధర్మాన్ని న్యాయాన్ని ఎవరైనా ఎవరికైనా చెప్పవచ్చును-దారిన నడుస్తున్నపుడు ముసలివారికి అంగవికలురకు, స్త్రీలకు, తలమీద బరువుతో వున్నవారికి అధికారులకు, పెద్దలకు, ప్రక్కకు తప్పుకొని దారివదలాలి-స్త్రీలతో, తోడబుట్టిన దానితో గాని, కన్నతల్లితో గాని హాస్యసంభాషణలు మంచిదికాదు - ఇంటిలో ఒంటరిగా వుండకూడదు - పదేపదే అద్దంలో ముఖం చూచుకొన కూడదు -మాటిమాటికీ వస్త్రధారణ మార్చకూడదు - పొగడ్తలకు పొంగి పోకూడదు - పొగడ్తలను వినకూడదు - ఎవరినీ ఎక్కువెక్కువగా అభిమానించి ఆరాధించ కూడదు - అతివినయము అన్నివేళలా మంచిదికాదు - నీచులవద్ద కానుకలు స్వీకరించకూడదు - మిత్రులను ఎల్లపుడూ ఇంటికి ఆహ్వానించ కూడదు - మిత్రులయింటికి ఎల్లపుడూ వెళ్ళకూడదు-మూర్ఖులకు, సోమరులకు, జూదరులకు, తిరుగుబోతులకు ఎపుడూ సహాయము చేయకూడదు. సహాయము పొందకూడదు-విద్యార్థి దశలో అలంకరణ ప్రియత్వం వుండకూడదు - ఎంతటి స్థితిలోనూ గురువులను అవమానించకూడదు. అపహాస్యం చేయకూడదు - సూర్యోదయం తరువాత నిద్రించరాదు-వృద్ధులు, రోగులు ఎపుడైననూ నిద్రించ వచ్చును-రాత్రులలో వీధులవెంట తిరుగరాదు - ప్రాణాపాయ స్థితిలో తప్ప ఎపుడూ అప్పు చేయకూడదు - ఋణబాధలేనివాడే మహాశ్రీమంతుడు -ఎక్కువ కాలం భార్యను పుట్టింట వుండనీయకూడదు - సోమరితనము, సంభాషణా ప్రియత్వం (ముచ్చట్లు చెప్పటం) పురుష లక్షణం కాదు - మాతాపితృ సేవవలన మహాపాపికూడా పుణ్యవంతుడౌతాడు - తల్లిదండ్రులను బాధించిన వాడు మరుజన్మలో పందిగా పుడతాడు-

సగోత్రీకులతో వివాహము పనికిరాదు - వివాహాలలో ఎనిమిది విధాలు వున్నాయి అన్నిటికన్నా పెద్దలు నిర్ణయించిన వివాహమే (బ్రాహ్మీవివాహం) గొప్పదిగా దేవతలు ఆశీర్వదిస్తారు - ఆడవారిధనాన్నీ బలహీనుల ధనాన్నీ పసివారిధనాన్నీ అపహరించిన వాడు కుక్కగా పుడతాడు - డబ్బులకు అన్నాన్నీ, నీటినీ, న్యాయధర్మాలను, అమ్ముకొన్నవాడు గాడిదగా జన్మిస్తాడు - వావివరసలు మరచి కామించినవాడు కుష్ఠురోగిగా పుడతాడు-

భర్త బ్రతికుండగానే పరుపురుషుని వల్ల పుత్రుడు పుడితే, ఆబిడ్డను 'కుండలకుడు' అంటారు. భర్తమరణించిన తరువాత పరపురుషుని వల్ల బిడ్డపుడితే వానిని 'గోలకుడు' అంటారు. వీరిద్దరూ ధర్మసంతతికాదు. భోజన సమయంలో ఆహార పదార్థాలను ఒంటిచేతి సహాయముతో (ఒంటిచేతితో) వడ్డించకూడు - అతిధులకు వంటకాలను వడ్డించేటపుడు అవిఏమిటో చెప్పి వడ్డించాలి - శుభకార్యాలలో గాని, అశుభకార్యలలోగాని ముందుగా ఉప్పును వడ్డించటం ఆర్యాచారం - అకారణంగా ఉపవాసాలతో గృహస్థులు శరీరాన్ని శుష్కింప చేయరాదు - అన్నిధర్మాలలోకెల్లా శరీర ఆరోగ్యధర్మం మొదటిదిగా తెలియాలి - శరీరమాద్యం ఖలుధర్మసాధనమ్' అని ధర్మసూక్తి - పిసినారి తనంతో దేహాన్ని దండించి, నోటిని బంధించి, తానుతినక మరొకరిని తిననీయక లోభిగా జీవించకూడదు - అధికసుఖాపేక్షతో, అధిక ధనాశతో, అశాంతజీవనం గడుపకూడదు - శాంతి లేనివానికి తృప్తిలేనివానికి సుఖంలేదు-

సంగీతం, నృత్యం, గానం, అభినయం మొదలైన కళలు కులహీనులకు (ద్విజాతులకు) రెండుకులాల వారికి పుట్టినవారికి మాత్రమే (భోగంవారికి మాత్రమే) - నృత్య గానాలతో ధనసంపాదన చేయరాదు - గృహస్థుడు సర్వాలంకారాలతో శుచి వస్త్రాలతో, సుగంధ లేపనాదులతో సౌందర్యవంతునిగా వుండనిచో స్త్రీ తిరస్కారానికి గురికావల్సి వస్తుంది - గృహిణి కూడా శుచి వస్త్రాలతో ఆకర్షణీయంగా వుండాలి-

మధ్యాహ్నపు సూర్యుని చూడరాదు - పశువులను కట్టివేసిన త్రాటిని దాటరాదు- వర్షం వస్తునపుడు పరుగెత్తరాదు - నీటిలో తన ప్రతిబింబాన్ని చూడరాదు - ఋతుమతీ సంగమం చేయరాదు - భార్య అన్నంతినేటపుడు ఆవలించేటపుడు భర్తచూడరాదు-భార్య తనకంటికి కాటుక పెట్టుకొనే సమయంలోనూ, తలదువ్వుకొనేటపుడు భర్త పరిశీలనగా చూడరాదు - నగ్నంగా స్నానం చేయరాదు-దారిలోనూ, గోశాలలోనూ, దున్నినపోలంలోనూ, కాలువల లోనూ, పుట్టలవద్దనూ, పాడుబడిన ఇండ్లలోనూ, నిప్పులోనూ, నడుస్తూగాని నిల్చునిగాని మూత్ర విసర్జన చేయరాదు- మాట్లాడుతూ మలమూత్ర విసర్జన చేయరాదు-

నోటితో నిప్పును ఊదకూడదు - భార్యస్నానం చేసేటపుడు నగ్నంగా చూడరాదు - చేతులను కాళ్ళను నిప్పుతో కాచుకొనకూడదు - నిప్పును మంచం క్రింద పెట్టరాదు - సాయంసంధ్య సమయంలో తినకూడదు నడవ కూడదు నిద్రపోకూడదు - కాలితో నేలమీద గీతలు గీయకూడదు - తనమెడ లోని హారాన్ని తనచేతులతో తానే తీయకూడదు - నీటిలో ఉమ్మివేయ రాదు -ఇంటిలో ఒంటరిగా నిద్రించకూడదు-పెద్దవారు నిద్రిస్తున్నపుడు నిద్రాభంగం చేయరాదు-శుభకార్యాలకు పిలువకుండా వెళ్ళకూడదు - తెల్లవారు ఝామున అర్ధరాత్రి సమయాన భోజనం చేయకూడదు - కడుపు నిండుగా ఆహారం సేవించకూడదు - నూనెలేని కూర తినరాదు-చేతులు పట్టినీరు త్రాగరాదు (పాత్రలో పోసుకొని త్రాగాలి) మృగముల ధ్వని పక్షులు ధ్వని అనుకరణ చేయరాదు-కంచు(లోహం) పళ్ళెంలో కాలుకడుగకూడదు - ఇష్టం లేని పళ్ళెంలో భుజించకూడదు - పాదరక్షలు ఒకరివి మరొకరు వుపయోగించ రాదు -అనారోగ్యంతోనూ ఆకలితోనూ వున్న జంతువులను బండికి కట్టిబాధించ రాదు - ఆవులచేత బరువులు మోయించటం వ్యవసాయ పనులు చేయించటం మంచిదికాదు - పశువులను కర్రతో కొట్టి వేధించటం శుభంకాదు - ఎద్దులను, గాడిదలను బండికికట్టి మోయలేని బరువువేసి బాధించినవాడు మరుజన్మలో పిచ్చివాడై పుడతాడు - విరిగిపోయిన పీటను వుపయోగించరాదు - నోటితో చేతిగోళ్ళను కొరకరాదు - ఇపుడు సుఖాన్నిచ్చి తరువాత బాధించే ఏపనినీ (ఆహారం, జూదం, మద్యం, వ్యభిచారం, పాపం, దూషణం) చేయరాదు - గోవుపీపుమీద ఎక్కకూడదు - జడనుండి క్రిందికి వ్రేలాడునట్లుగా స్త్రీలు పూలను పెట్టుకొనరాదు (ఇది వేశ్యల పద్ధతి) - రాత్రి సమయాలలో చెట్లక్రింద నిద్రించ కూడదు - ఇంటిలో కాలక్షేపానికైనా జూదం ఆడకూడదు - కాలి చెప్పులను చేతితో పట్టుకొని నడువకూడదు - మంచంమీద కూర్చొని భోజనం చేయ కూడదు - ఆహారపాత్రను చేతితో ఎత్తిపట్టుని తినకూడదు - నువ్వులు కలిపిన ఆహారాన్ని రాత్రిపూట తినకూడదు -నగ్నంగా నిద్రించరాదు - కాళ్ళు కడుక్కొని నిద్రించకూడదు-మలమూత్రాలను పరీక్షగా చూడరాదు-వెంట్రుకలు, ఎముకలు, బూడిద, కుండపెంకులు, వరిధాన్యపుపొట్టు, ప్రత్తికాయి పొట్టు వీటిమీద నిలబడితే ఆయుక్షీణం-రెండుచేతులతో తలను సవరించుకోకూడదు

-స్నానానంతరం నూనె రాయకూడదు-మాంసవ్యాపారి వేశ్య, మద్యం విక్రయించేవాడు, వ్యభిచారం చేయించేవాడు ఈనలుగురి వద్ద ప్రాణాపాయ సమయాల్లోనైనా ధనాన్ని తీసికొనకూడదు - బంగారాన్ని ఎపుడూ తాకట్టు పెట్టకూడదు - భర్తమరణించిన స్త్రీధనానికి ఆశపడరాదు-సూర్యోదయ సమయాల్లో మాత్రమే చేయవల్సిన పనులను ఆలోచించాలి-రహస్యాలను స్త్రీలకు చెప్పరాదు -విద్యార్థులు అస్పష్టంగా చదువకూడదు-అర్థరాత్రి పాఠాలు చదువ రాదు-వేదాధ్యయనం ఉషఃకాలంలోనే చేయాలి-భోజనం చేసిన తరువాత స్నానం చేయకూడదు-స్నానం చేసిన నీటిమీద నిలబడరాదు- ఎప్పుడూ శత్రు సహాయాన్ని కోరకూడదు - తనపేదరికానికి తానే నిరాశపడ కూడదు- వాస్తు శాస్త్రాన్ని జ్యోతిష్యాన్ని వృత్తిగా పెట్టుకొని ధనసంపాదన చేసి జీవించరాదు - గోష్పాదం (పిలక) లేని బ్రాహ్మణునిచే శుభకార్యాలు చేయించ రాదు - తన చేతులతో ఎప్పుడూ మర్మాంగాన్ని ముట్టుకొంటూ వుండరాదు - ప్రతిసారి సారికీ తలవెంట్రుకలను సరిచేసుకొంటూ వుండకూడదు- కురూపులను చూచి నవ్వరాదు.- దుర్వార్తలను పాపకర్మలను విన్నపుడు చూచినపుడు కుడి చెవిని కుడిచేతితో స్పృశించాలి- ఇంటిలోపల కాళ్ళు కదుగరాదు - మల మూత్ర విసర్జన (ఎటాచ్ బాత్‌రూం) ఇంటిలోపల జరుగరాదు. ఇది దరిద్రానికి దుః ఖానికి సంకేతం-మలవిసర్జన స్నానం, దేహాలంకారం, పళ్లుతోమటం, దైవపూజ, క్షవరం, ఈపనులు మధ్యాహ్న సమయంలో చేయరాదు - పండుగ సమయాలలో పెద్దలను దర్శించి పండ్లుఫలాలను సమర్పించాలి దీనివల్ల శుభము కీర్తి ఆయుష్షు పెరుగుతాయి - ఇంటికెవరైనా గురుబంధువులు వచ్చినపుడు ఆదరించి గౌరవించాలి. అహంకారం చూపరాదు-శత్రువులైనా మనయింటికి వచ్చినపుడు సమాదరించాలి. ద్వేషం చూపరాదు-ప్రతిదానికీ యితరుల సహాయం కోర కూడదు-బంధువుల మిత్రుల ఇండ్లలో ఎక్కువరోజులు నివసించరాదు- కన్నకూతురింట, తోబుట్టువు యింట ఎక్కువ రోజులు గడుపరాదు - పరులదయనూ, పరుల అన్నాన్నీ పరుల ఆశ్రయాన్నీ కలలోగూడ పొందగూడదు - గోవు, గుర్రం, గాడిద, పంది, పిల్లి, కుక్క, ఈ ఆరుప్రాణుల్ని గ్రామప్రాణులు అంటారు వీటిని రాయితోను, కర్రతోనూ హింసించరాదు - కోపంవల్ల నీకు ఎవరూ వశులుకారు. కాబట్టి కోపత్యాగం అన్నిత్యాగాలకంటె గొప్పది - నీకున్న

దానిలో కొంత, నీకు మిగిలిన దానిలో కొంత మంచివారికి సహాయం చేయాలి -అపాత్రులకు (సోమరి, జూదరి, వ్యసనపరుదు) దానం ధర్మం చేయరాదు -ఇంటి సేవకులు ఎల్లవేళలా నిద్రిస్తుండరాదు - ఆహార పదార్థాలను తానొక్కడే తినరాదు - అతికాముక భావనలు కలిగి వుండరాదు - కళాకారుల యిండ్లకు వెళ్ళరాదు. వారిండ్లలో భోజనాదులు చేయరాదు-జలదానం. అన్నదానం, విద్యాదానం శాస్త్రదానం, వస్త్రదానం ఇవి గొప్పదానాలు-భక్ష్యమాంసాలలో - చిలుక పావురం పిచ్చుక కొంగ కోతి పిల్లి ముంగిస కప్ప కాకి గ్రద్ద, గాడిద, గుర్రం, గేదె, కోయిల, నెమలి, కుక్క, నక్క, గుడ్లగూబ మొదలైన ప్రాణుల మాంసం తినరాదు - శుభకార్యాలకు మాంసాహారం మంచిదికాదు

శిశువు పల్లతో పుట్టటం ప్రేగు మెడన వేసుకొని పుట్టటం తల్లి గర్భం నుండి కాళ్ళతో బయటకు రావటం. ఇవి అశుభ జననాలు కాబట్టి హోమ శాంతిని జరిపించాలి -రెండు సంవత్సరాలు నిండని బిడ్డ మరణిస్తే దహనం చేయక ఖననం (సమాధి) చేయాలి. శ్రార్ధకర్మల అవసరంలేదు - గోత్రీకులు రక్తసంబంధీకులు మరణిస్తే బ్రాహ్మణులకు పదిరోజులు - క్షత్రియులకు పన్నెండురోజులు, వైశ్యులకు పదిహేనురోజులు, శూద్రులకు నెలరోజులు అశుచిదినాలు. శుభకార్యాలు చేయరాదు-ఆత్మహత్యతో మరణించినవారికి శ్రాద్ధాదులు పిండప్రదానాలు చేయరాదు - (అశుచి దినాలలో కూరలలో కొందరు తీపి, పులుపు, ఉప్పు, కారం వీటిలో ఒకదానిని ఆనాల్గు రోజులు మానివేస్తారు)

మను మహర్షి చెప్పిన ధర్మాలను ఆచారాలను సంప్రదాయాలను ధార్మిక విధులను బ్రాహ్మణులు ఆచరిస్తారా? ఎంతమంది ఆచరిస్తారు!! నూటికి వేయికి లక్షకు కోటికి ఒక్కరైనా ఆచరిస్తున్నారా! ఈస్థితిలో అగ్రవర్ణాలను మను వాదులనటంలో అర్థమేమిటో తెలియటంలేదు. ఒకప్పుదు ఆంగ్లేయులు మనల్ని విభజించిపాలించటం అనే దుర్నీతితో మనందరినీ విభజించి కులద్వేషాలు పుట్టించారు. ఇపుడు మనవారనుకొన్న మనరాజకీయవాదులు మననందరినీ విభజించిపాలిస్తున్నారు. వీరందరూ మనయింటి శత్రువులు. వీళ్ళను పార ద్రోలటం. ఎవరికీ సాధ్యంకాదు. ఒకనాటికన్నా ఈనాడుకులతత్వం విపరీత పోకడలు పోతోంది. శూద్రవర్ణమే ముక్కలు చెక్కలుగా విడిపోయి శూద్రులే

కులబేధాలను అనుభవిస్తున్నారు. అగ్రవర్ణంవారు ఎపుడూ ఏనాడూ ఏయుగం లోనూ ఇతరవర్ణాలతో పోరాటాలకు దిగలేదు. రక్తపాతం సృష్టించిన దాఖలాలు లేవు. ఈనిజాన్ని అందరూ అంగీకరించాల్సిందే. విద్యావినయాలతో, ఆచార క్రమశిక్షణతో మూడువర్ణాలవారిని అతిక్రమించి ముందు నిలిచిన బ్రాహ్మణ వర్ణానికి జోహారులర్పించాల్సిందే!

(ఈనాటి సమసమాజానికి సంబంధించని ధర్మాలు, కొన్ని కలియుగానికి ఆచరణ యోగ్యంకాని ధర్మాలను, రాజమహారాజులనాటి కాలానికి సంబంధించిన కొన్ని రాజధర్మాలను వ్రాయకుండా వదలివేస్తున్నాను. ఇది న్యాయమనియే నేను భావిస్తున్నాను. ఇందుకు క్షంతవ్యుణ్ణి)

అందరికీ జన్మనిచ్చే స్త్రీ సదాపూజ్యురాలు - పతిరహితగా పూజాకార్యం మొదలైన వైదిక కార్యాలను చేయరాదు -స్త్రీలు (తల్లి, భార్య, కూతురు) ఇంటి యజమానికి తెలియకుండా ఏవ్యవహారములు చేయరాదు-పురుషరక్షణ లేకుండా స్త్రీలు స్వతంత్ర జీవనం సాగించరాదు - గృహకార్యాలలో నేర్పరులైన తరువాతనే యువతులకు వివాహం చేయాలి - కూతురు ప్రవర్తనా విషయా లన్నిటికీ తల్లిబాధ్యురాలుగా వుంటుంది - స్త్రీలకు గృహవిషయాలలో మంత్రిగా, ఆహారవితరణలో తల్లిగా, కుటుంబ సమస్యలలో క్షమామూర్తిగా, గృహకలహా లలో న్యాయదేవతగా, కుటుంబ సర్వస్వంగా గృహిణీ ధర్మాన్నీ స్త్రీలు పాటించాలి - ఇంటి యజమానికి చెప్పకుండా ఉపవాసవ్రతాలు చేయకూడదు - ఎల్లపుడు అద్దంలో తనను చూచుకొనరాదు - వీధిగుమ్మం వద్ద నిలబడి వుండరాదు - పనిలేక ప్రక్కింటికి వెళ్ళరాదు - తనయింటి విషయాలను పుట్టింట చెప్పరాదు -పుట్టింట గొప్పలను అత్తింట చెప్పరాదు-భర్త తరుపున బంధువులను ఆదరంగా చూడాలి -అత్తమామలను తల్లిదండ్రుల్లా గౌరవించాలి - భర్తయింటికి వచ్చు సమయానికి నిద్రిస్తూ వుండకూడదు - వృద్ధులకు పసివారికి ముందు భోజనం పెట్టాలి-ఇంటిపనిచేసే సేవకులతో ఇంటిసమస్యలు చెప్పరాదు - పొరుగింటి సమస్యలను వేరొకరితో చర్చించకూడదు - పుట్టినింట ఎక్కువ రోజులు వుండి పోకూడదు - కన్నబిడ్డల నడవడికలను గమనిస్తూ బుద్ధులు నేర్పాలి - ఒంటరిగా

దేవాలయానికైనా వెళ్ళరాదు - భర్తకు తెలియకుండా అప్పులు చేయటం వస్తువులు కొనటం అమ్మటం చేయరాదు -చెప్పుడు మాటలు వినరాదు - మెచ్చుకపు మాటలాడే వారిని, ఇతరులగూర్చి గొప్పలు చెప్పేవారిని, చాడీలు మోసేవారిని దగ్గరకు రానీయరాదు - భర్తతో అబద్ధాలు చెప్పటంవల్ల కన్నబిడ్డలు అలుసుగా తీసుకొని లంచకోరులవుతారు - పొరుగింటవారితో తగువులాడరాదు -బొట్టు లేకుండా యింట్లో తిరగరాదు - వెంట్రుకలు విరబోసుకొని తిరగరాదు- భర్తఇంట లేనపుడు స్వంతసోదరునితోనైనా ముచ్చట్లు చేయరాదు - దైవభక్తి పేరుతో గుడులు గోపురాలు తిరగరాదు - తల వెంట్రుక లను కత్తిరించరాదు - ఇంట్లోని ప్రతివిషయాన్ని భర్తతో చెప్పి అశాంతికి గురి చేయకూడదు - భర్తకంటె ముందుగా నిద్రించకూడదు - పాడైపోయిన ఆహార పదార్థాలను వడ్డించకూడదు - ఆహారవస్తువులను యధేచ్ఛగా వండి పారవేయ కూడదు - వంట సమయాలలో బయటకు వెళ్ళరాదు - నీటిని వృధాచేయరాదు - పరిశుభ్రతను మరువరాదు - ఉప్పు, నూనె, పసుపు నేలమీద పడనీయరాదు - పనివారల కష్టసుఖాలను విచారించటం సహాయం చేయటం మరువరాదు -కాలుమడతవేసుకొని కూర్చొనరాదు - మత్తు పదార్థములను ముట్టరాదు -మాసిన చిరిగిన బట్టలను ధరించరాదు -అతిగా మాట్లాడరాదు - అకారణంగా నవ్వరాదు - వంటపాత్రలను కాలితో తన్నరాదు - ఇంటికి (గదికి) మధ్యభాగాన నిద్రించరాదు - ఆసనం మీద కూర్చుని కాళ్ళువూపరాదు - నడుస్తూ పదేపదే కుడిఎడమల వైపులకు చూడరాదు - భర్తకు ముందు నడువరాదు- భర్తకు కుడివైపున నిల్చొనరాదు, కూర్చొనరాదు - జడను గుండెలమీదకు వేసుకొనరాదు - మాటిమాటికి చీరను సర్దుకొనరాదు - పమిటను కూడ పదేపదే సర్దుకొనరాదు - సుగంధద్రవ్యాలను (అత్తరు) అన్ని వేళలా అలముకొనరాదు - సభ్యతను దాటి అలంకరించుకొనరాదు-రోజు కొక్కరికి అయినా అన్నధర్మం చేయాలి-వట్టి అన్నం (కూర-పచ్చడి లేకుండా) ధర్మం చేయకూడదు -దాహార్తులకు మంచినీరు లేదనరాదు-ఇంటినీడన కూర్చున్నవారిని అదలించరాదు - అతిసంపాదనకు భర్తను ఒత్తిడి చేయరాదు - బిడ్డలకు భర్తపై ఫిర్యాదులు చేయరాదు - భర్త అసమర్థతను, పేదరికాన్ని బంధువులముందు, పరులముందు ఎత్తిచూపకూడదు

– కన్నబిడ్డల తప్పులను దాచకూడదు – భర్త అనురాగం కోసం (పిచ్చినాటు మందులు) రహస్య ఔషధా లను ప్రయోగించరాదు – ఇవి స్త్రీల ధర్మాలు.

నిద్రిస్తున్న వానిమీద, పరుగెత్తిపోతున్న వానిమీద నమస్కరిస్తున్న వానిమీద, బలహీనునిమీద, రోగగ్రస్తులమీద, అంగవికలునిమీద, ప్రతీకారం తీర్చుకొన రాదు –ఆడవారిమీద, బిడ్డలమీద తల్లిదండ్రులమీద, గురువులమీద అపనిందలు వేయరాదు –బలవంతులతోనూ, ధనవంతులతోను, పాలకులతోను, నాయకుల తోను, కక్షలు పెట్టుకొనరాదు–బలవంతునకు అప్పు ఇవ్వరాదు, తీసికొనరాదు –మద్యవ్యాపారి మాంసవ్యాపారి వీరితో ఆర్థిక లావాదేవీలు వుండ కూడదు – చిన్నచిన్న విషయాలు పరిష్కరించుకోవాలిగాని న్యాయస్థానాలకు వెళ్ళరాదు – ఇంటిపనిచేయు స్త్రీలను, కూలికి వచ్చిన స్త్రీలను, ఆపదలోవున్న స్త్రీలను, భర్తలేని స్త్రీలను, అవివాహిత యువతులను, బిక్షమెత్తు స్త్రీలను, మూగస్త్రీలను, ధనానికి లోబరుచుకొనిగాని, భయంపెట్టిగాని సంభోగించరాదు – పాపకార్యా లను చేయుటయే కాదు, పాపపు ఆలోచనలు కూడ నరకమే.

ధనధాన్య మానప్రాణ రక్షణ కన్నా స్త్రీరక్షణ గొప్పది. కులస్త్రీని సంరక్షించి పోషించలేని వాడు బ్రతికివున్నా మరణించినవానితో సముదు – స్త్రీ సంపాదనను ఆశించువాడు వీధికుక్క కన్నా హీనుదు – స్త్రీలను పరులకు తార్చువాడు పందికన్నా నీచుదు.

'స్త్రీ' మానవజాతికి మూల ధనము.

హిందూజాతి బీజప్రధానమైనది. జాతివిషయంలోగాని కులవిషయంలో గాని బీజమే (పురుషుడే) ప్రధానం. పురుషుడు ఒకకులం స్త్రీమరొక కులం అయినవారికి సంతతికల్గితే తండ్రికులమే సంతతికి వర్తిస్తుంది. క్షేత్ర (స్త్రీ) ప్రాధాన్యత వుండదు.

పరాశరునికీ మత్స్యగంధికీ పుట్టిన కృష్ణద్వైపాయనుదు (వ్యాసమహర్షి) బ్రాహ్మణుడయ్యాడు. ఆపద్ధర్మంవల్ల కుంతీదేవి మాద్రీదేవి దేవతలకు బిడ్డలను కన్నా పాండురాజ పత్నులు కావటంవల్ల క్షత్రియులయ్యారు. దేవవేశ్య అయిన

మేనకాపుత్రి శకుంతలా దుష్యంతులకు పుట్టిన భరతుడు క్షత్రియుడే అయ్యాడు. ధృతరాష్ట్రునికీ వైశ్యస్త్రీకి పుట్టిన విదురుడు వైశ్యుడు కాలేదు. క్షత్రియుడే అయ్యాడు.

కాని ఆపద్ధర్మ సంతానం ఒక్కొకసారి క్షేత్రప్రాధాన్యతనూ పొందవచ్చు. ఇటువంటి సంతతి ఎపుడో ఎక్కడో కాని కనుపించదు. మహాభారత యితి హాసంలో అంబికా అంబాలికలకు వ్యాసమహర్షి వల్ల జనించిన ధృతరాష్ట్ర పాండురాజులు క్షేత్రప్రాధాన్యంతో క్షత్రియులయ్యారు. ఈక్షేత్రధర్మాన్ని పశుధర్మం అంటారు. పశుమృగాలలో బీజప్రాధాన్యత వుండదు. ఆవుకి పుట్టిన లేదూడ ఆబోతు వెంటవెళ్ళదు. తల్లితోనే వుంటుంది.

వైదిక వివాహ హిందూ సంస్కృతి స్త్రీలకు ద్వితీయవివాహాన్ని అంగీ కరించలేదు. (ఇదిప్రాచీన సంప్రదాయం. ఇప్పటిదికాదు) వివాహమైన తరువాత సంతానం కలుగకుండానే భర్తమరణిస్తే ఆస్త్రీకి దిక్కేవరు? ఆమె బ్రతుకేమిటి? సంతానం కలుగకుండానే భర్తమరణిస్తే, ఆస్త్రీ ఆపద్ధర్మంగా సంతానార్థిగా భర్తసోదరులతో సంతానాన్ని పొందవచ్చునని మనుస్మృతి చెబుతున్నది. అయితే ఆస్త్రీకి కామలాలసత్వం వుండరాదు. ఒక్కబిడ్డకు మాత్రమే ఆపద్ధర్మ అనుమతి వున్నది. ఈవిధంగా పుట్టినవాడు క్షేత్రజ ధర్మంతో మరణించిన తండ్రికి వారసుడు.

కన్య ఋతుమతి అయిన మూడుసంవత్సరాలకు కూడా తల్లిదండ్రులుగాని, కన్యాసోదరులుగాని వివాహం చేయనట్లయితే ఆకన్య తనకునచ్చిన మెచ్చిన పురుషునితో ఎవరి అనుమతి పొందకుండానే వివాహం చేసుకోవచ్చు. ఇదిపాపం కాదు. ధర్మమేనంటున్నాడు మనువు.

తండ్రి మరణానంతరం పిత్రార్జిత ఆస్థిని అందరూ భాగాలు పంచు కొన్నట్లయితే కొడుకులందరూ భాగాలుగా తీసుకొన్న ఆస్థిలో ఇరవైఐదవ భాగాన్ని (నాలుగింట ఒకభాగాన్ని) ఆడపడుచులకివ్వాలి. స్త్రీధనం కింద ముందుగా నేయిచ్చినట్లయితే ఆడపిల్లలకు భాగం వుండదు.

కొడుకు మాత్రమే కులం వుద్ధరిస్తాడన్నది నిజమే కాని. పుత్రసంతతి లేకపోతే పిండం వేసేదిక్కువుండదని చాలామంది అభిప్రాయం. కొడుకు లేకపోయినా కూతురికొడుకు (దౌహిత్రుడు) శ్రాద్ధకర్మలు చేయటానికి అర్హుడు. పెద్దకూతురి కొడుకు చేత కర్మకాండలు జరిపించాలి. పెద్దకుమార్తె కొడుకు చిన్నవాడైతే, రెండవకుమార్తె మూడవకుమార్తె కొడుకులచేత శ్రాద్ధకర్మలు జరిపించాలని ధర్మశాస్త్రం. శ్రాద్ధకర్మచేసిన దౌహిత్రునికి తాతగారి ఆస్థిలో భాగం ఇవ్వాల్సివుంటుంది.

దత్తతస్వీకారానికి సగోత్రీకుడే ఉత్తమం. బిడ్డలు కలుగరన్న నిశ్చయంతో ఒకరిని దత్తతగా తీసికొన్న తరువాత బిడ్డలు కలిగితే, దత్తత తీసికొన్నవానికి కూడా సమభాగం ఇవ్వాల్సివుంది. స్వంతబిడ్డలు వున్నారుగదా అని దత్తపుత్రుని బయటకు పంపటానికి వీలులేదు.

సంసారిక జీవితం గడుపుతున్న పురుషుడు పన్నెండు విధాలుగా పుత్రులను పొందవచ్చునని శాస్త్ర ధర్మ వివరిస్తున్నది. ఈపన్నెండు రకాల పుత్రులలో 'ఔరసుడు' (భార్యకు తనవల్ల పుట్టినవాడు) ముఖ్యుడు. మిగిలిన పదకొండు మంది 'ఆపద్ధర్మపుత్రులు: ఈఆపద్ధర్మ పుత్రులు కూడా పుత్రసమానులే. ఔరసపుత్రునిలా అన్ని అధికారాలు వుంటాయి. పన్నెండుగురు పుత్రులగురించి వివరిస్తాను-

1. గురు బంధువుల సమక్షంలో అగ్నిసాక్షిగా తాళికట్టిన భార్యకు తనవల్ల పుట్టినవాడు 'ఔరసపుత్రుడు'
2. దీర్ఘరోగం వల్లగానీ, అశక్తత వల్లగానీ, అసమర్థతవల్లగానీ, ప్రమాదంవల్ల గానీ తాను సంతానోత్పత్తికి అనర్హుడైతే: ఇంటి పెద్దల అంగీకారంతో తనగోత్రపువారివల్ల తనభార్యకు సంతతికలిగేట్లు చేయటం తప్పుగాదు. ఈవిధంగా పుట్టినవాడు క్షేత్రజపుత్రుడు".
3. తమకు యిక సంతతి కలుగదని నిశ్చయించుకొని తమకులంలోని (తమయింటి పేరున్న సగోత్రీకులైన) మరొక దంపతుల బిడ్డను వైదిక ధర్మప్రకారం శాస్త్రవిధిగా తమకొడుకుగా స్వీకరించవచ్చు. ఈకొడుకు దత్తతపుత్రుడు.

4. కొడుకుగా స్వీకరించకపోయినా పుత్రస్థానాన్ని ఇవ్వకపోయినా కన్నబిడ్డలా ప్రవర్తిస్తూ గుణవినయుడు. అభిమాని ఆత్మీయతా మనస్సున్నవానిని కూడా పుత్రునిగా పొందవచ్చును. ఇతడు 'క్షత్రియపుత్రుడు'.

5. తనభార్య తనకు తెలియకుండా: ఆమెమరొకరి బలాత్కారానికి, భయానికి, ఆపదకులోనై ఆమె ప్రమేయం లేకుండానే గర్భం ధరించి పుత్రుని ప్రసవిస్తే ఆబిడ్డడు 'గూఢోత్పన్న పుత్రుడు'

6. ఎవరో ఏకారణంగానో ఒకబిడ్డనుకని అనాధగా వదలివేసి వెళితే, ఆబిడ్డను మనంస్వీకరించితే,వాడు 'ఆపద్ధర్మపుత్రుడు'

7. వివాహానికి ముందు పుట్టింటవున్నపుడు కన్యాదశలో రహస్యంగా మరొకరి వల్ల పుట్టినవాడు 'క్షేత్రజపుత్రుడు'

8. కన్యగా వున్నపుడు బాల్యచాపల్యం వలన, లేదా ఉత్సుకత వలన, అమాయ కత్వం వలన గర్భవతియై బిడ్డకు జన్మనిస్తే, వివాహానంతరం భర్తకు తెలిస్తే అతడు 'సహోఢపుత్రుడు"

9. దారిద్రం వలన, పరదేశప్రయాణం వలన, పాలనా క్షీణత వలన, బహు సంతతి వలన కన్నతల్లిదండ్రులే బిడ్డను అమ్మితే ఆ బిడ్డడు 'క్షతపుత్రుడు'

10. విధవకు పుట్టినవాడుగాని, లేక భర్త త్యజించిన స్త్రీకి పుట్టినవాడుగాని 'పునర్భవ పుత్రుడు'.

11. ప్రమాదం వల్లగానీ, వుపద్రవం వల్లగానీ, ఆత్మహత్యలవల్లగానీ, తల్లి దండ్రులకు దూరమై లభించిన బిడ్డ 'స్వయందత్తపుత్రుడు'

12. వర్ణసంకరం వల్లగానీ, బ్రాహ్మణ, శూద్రవర్ణ స్త్రీపురుషులకు గాని జన్మించి అన్యకారణాలవలన తల్లిదండ్రులచే పరిత్యజింపబడి లభించిన బిడ్డ 'పరవశపుత్రుడు'

ఈ పన్నెండు మందినీ పుత్రులుగానే స్వీకరించవచ్చును. కాని ఔరసపుత్రుడే అందరికన్నా శ్రేష్టుడు. ఈ పన్నెండు విధాల పుత్రులకు శ్రాద్ధపిండ తర్పణ అర్హత, సంపదహక్కు కులమాన్యత అన్నీ వుంటాయి. ఈ పుత్రుల సర్వ

హక్కులను ఏన్యాయ పీఠం ప్రశ్నించవీలులేదు. గురుబంధువర్గాలు విమర్శించనూ వీలులేదు.

శ్లో॥ సాచేదక్షత యోనిఃస్యాద్గత ప్రత్యాగతాపివా।
పౌనర్భవేన భర్త్రాసా పునః సంస్కార మర్హతి॥

మనుస్మృతి. 9-176

మనుమహర్షి దూరదృష్టికి ఇదొక నిదర్శనశ్లోకం. ఆడపిల్లల కన్యాప్రాయం కలలగోపురం! అనుభవరాహిత్యమైన ఆలోచనలు ఎక్కువ. అపరిపక్వ స్థితిలో ఆకర్షణకు లోబడి ఎవరితోనైనా ఎక్కడికైనా వెళ్ళిపోయినపుడు ఆమెకు ఆమెగా తిరిగిరావటంగానీ తీసుకురావటంగానీ జరిగితే ఆకన్య వివాహ సంస్కారానికి అర్హురాలే. అంటున్నాడు మనువు.

పరాశర, నారద, గౌతమ, వశిష్ఠాది పద్దెనిమిది స్మృతులు వున్నా మను స్మృతికి వున్న ప్రఖ్యాతి ఏస్మృతికీ లేదు. ఈనాడు మనుస్మృతి ఇంతటి నిరాదరణకు గురికావటానికి గలకారణమేమంటే శూద్రవర్ణానికి ఒకన్యాయం బ్రాహ్మణవర్ణానికి ఒకన్యాయం చెప్పబడింది. బ్రాహ్మణ పక్షపాతంగా న్యాయ ధర్మాలు చెప్పటంతో ఈనాటి తరంవారి నిరశనకు గురిఅయింది. పరాశరస్మృతి, గౌతమస్మృతి, నారదస్మృతి, వశిష్ఠస్మృతి అన్ని స్మృతులు కూడా బ్రాహ్మణులను దైవసమానులుగానే చెప్పాయి. శూద్రవర్ణాన్ని తక్కువగానే అంచనావేశాయి. కాని మనుస్మృతి విమర్శలను ఎదుర్కొన్నంతగా ఏస్మృతీ ఎదుర్కొనలేదు. కాయలున్న చెట్టుకేగదా రాళ్ళదెబ్బలు!

శ్లో॥ కృతేతు మనుధర్మశ్చ త్రేతాయాంగౌతమఃస్మృతిః
ద్వాపరే శంఖలిఖితశ్చ కలౌపరాశరః స్మృతిః॥

పద్దెనిమిది స్మృతుల్లో మనుస్మృతి కృతయుగానికి, గౌతమస్మృతి త్రేతా యుగానికి, శంఖలిఖితస్మృతి ద్వాపరయుగానికి, పరాశరస్మృతి కలియుగానికీ, వర్తిస్తుందని పండితోక్తి. అయితే మనుస్మృతి అంత విపులంగా పరాశరస్మృతి లేదు. ఇది నిర్వివాదాంశం.

ఒక్క విషయం- ఈవైజ్ఞానిక కాలంలో శాస్త్రాలు-ధర్మాలు తెల్సుకోవల్సిన అవసరం వుందా? అని ప్రశ్నించేవారు చాలామంది వున్నారు. పాశ్చాత్య సంస్కృతినీ, పాశ్చాత్య వేషధారణనూ, పాశ్చాత్య భాషనూ ప్రేమించి ఆచరించే వారికి ఈశాస్త్రధర్మాలతో పని లేదేమో! బ్రతుకు దెరువుకోసం జీవన భృతికోసం సామాజిక మర్యాద కోసం వేషభాషలలో మార్పుతెచ్చుకొన్నా: మన రక్తగతంగా వచ్చిన సంప్రదాయాలు మనం వద్దనుకొన్నా మనల్ని వదలిపెట్టవు. హిందూ ధర్మం సజీవగంగ! ఏపరిస్థితుల్లోనూ ఎండిపోదు! మహమ్మదీయమతం, క్రైస్తవ మతం ఈ రెండుమతాలు హిందూమతంమీద మహాదాడి చేశాయి. హిందూ మతం ఎన్నో ఆటుపోట్లును ఎదుర్కొన్నది. ఎందరి దౌర్జన్యాలనో చూచింది. వజ్రపర్వతంలా అలాగే నిలిచివుంది. వుంటుంది! వుండాలి!

ఇది ఈవిధంగా ఎందుకు చేయాలి? ఇదిఎందుకు చేయకూడదు? ఈ విధంగా చేయాలని చెప్పిందెవరు? అని ప్రశ్నించే యువతరానికి జవాబుగా ఇంత పెద్ద సమాధానం వ్రాయాల్సి వచ్చింది.

✦☆✦

కళాజీవనం దరిద్రమా?

కళాకారులు శారీరకశ్రమ చేయరు. శ్రమరహిత సంపాదనను అభిలషిస్తారు. అనాయాసంగా ధనం సంపాదించే వారికి అహం ఎక్కువ. డబ్బువిలువ తెలియదు. కళాకారులు తామేదో స్వర్గం నుండి భూమికి దిగి వచ్చినట్లు భావించుకొంటుంటారు. పొగడ్తలను ఇష్టపడతారు. వాస్తవ జీవితం వీరికిష్టం వుండదు. కల్పనాలోకంలోనే బ్రతకటం వీరికిష్టం. సుఖజీవితంకోసం ఏంచేయటానికీ సంకోచించరు. డబ్బుకోసం మనస్సునీ శరీరాన్ని కూడా తాకట్టుపెట్టటానికి వెనుకాడరు.

నృత్యం గానం సంగీతం మొదలైన విద్యలు గంధర్వ విద్యలుగా చెబుతారు. గంధర్వులకు బాధ్యత క్రమశిక్షణ శీలజీవనం, వాస్తవిక దృష్టి, శ్రామిక విధానం, స్థిరత్వం, వంటి వేవీ వుండవు. సుఖజీవనమే ప్రధానధ్యేయంగా వుంటారు.

చంచల మనస్కులు కావటంవల్ల బహుభర్తృత్వం సాధారణ విషయంవీరికి! అలంకార ప్రియత్వం ఎక్కువ. గృహస్థ జీవితానికి ఇవేవీ పనికిరావు.

శ్లో॥ మృగయాక్షో దివాస్వప్నః పరివాదః స్త్రియోమదః
తౌర్యత్రికం వృథాట్యాచ, కామజో దశకోగుణః!!

మాంసాహార ప్రియత్వం, పగటినిద్ర, స్త్రీవ్యసనం, నృత్యం, గీతం, వాద్యాభిలాష, ఊరూరతిరగటం, జూదం, మద్యపానం, నిందారోపణం ఈ పది లక్షణాలు కళాకారులకు సహజం. దరిద్రదేవతకు ఈపదిలక్షణాలు ప్రియ మైనవి. సంసారిక జీవనానికి పనికిరానివి. ప్రపంచం నిద్రమేల్కొనే సమయానికి కళాకారులు నిద్రకుపక్రమిస్తుంటారు. లోకం నిద్రబోయే సమయానికి వీళ్ళు నిద్రలేస్తారు. రాత్రిజీవనం వీరిది.

> ప్రశస్త జీవనం కావాలనుకునేవారు కళాకారులుగా వృండకూడదు. కళాభిమానం మంచిదే! కళాపోషణ మంచిదే! కళా జీవితం మాత్రం మంచిది గాదు. కళాకారుల భార్యలు మంచి జీవితం గడుపలేరు. కళాకారుల బిడ్డలకు మంచి నడవడిక లభించదు.

ముఖంలో కాంతి, దేహంలో శక్తి, శరీరానికి యవ్వనం వున్నంతవరకూ సత్కారం, వయస్సు తగ్గితే ఛీత్కారం! చాలామంది కళాకారులు, జీవితపు చివరిదశలో అతినీచంగా జీవించటం అందరికీ తెల్సిందే!

అందుకే పూర్వీకులు ఈ కళారంగానికి ప్రత్యేకవర్గాన్ని నియమించారు. వీరిని భోగంవారు, రంగసానులు, భోగినులు, దేవదాసిలు అనిపిలిచేవారు. వాద్య నృత్య గీతాలాపనలలో వీరు సిద్ధహస్తులు. జీవితం సగం గడచిన తరువాతనే వీరికి వివాహం జరిగేది. ఇపుడు వీరుకూడా ఈ కళాజీవితాన్ని పూర్తిగా వదలివేశారు. సక్రమజీవితం గడుపుతున్నారు.

కళను ఆరాధించి, ఆస్వాదించి గౌరవించండి. కళాజవితం కోరుకోకండి.

✦☆✦

"దుఃఖం" ఒక యోగమా?

అందరికీ బాధలు కష్టాలు వుంటాయి.

ఈలోకంలో అందరూ ఇబ్బందుల్ని ఎదుర్కొంటుంటారు.

కాని; అందరూ వెక్కివెక్కి ఏడ్వలేరు.

కష్టం వచ్చినపుడు ఏడ్వగలగటం ఒకవరం! దేవుడు ఏడ్వగల్గిన అవకాశాన్ని అదృష్టాన్ని ఒక్కమనిషికి మాత్రమే ఇచ్చాడు. మేధస్సుతోపాటు కష్టాల్ని:కష్టాలను సహించుకొనే ఆయుధంగా దుఃఖాన్ని, ఇచ్చాడు దేవుడు. చిన్న సమస్యకే ఏడుస్తారు ఆడవారు. ఏడుస్తారు కాబట్టే ఎంతటి సమస్యనైనా భరించేస్తారు. కన్నీటితో సమస్యలు పరిష్కారంకావు. కాని మనసుమాత్రం తేలికపడి బాధ బరువు తగ్గుతుంది. ప్రశాంతత లభిస్తుంది. ఇదిమాత్రం నిజం.

కష్టాలు రావటాన్ని ఎవరూ ఒప్పుకోరు. కష్టాలను సంతోషకర విషయంగా ఎవరూ అంగీకరించరు. కష్టాలు రెండు రకాలున్నాయి. ఒకటి శారీరకమైన కష్టం. మరొకటి మానసికమైన కష్టం. శారీరకమైన కష్టానికి చెమటరూపంలో శరీరం ఏడుస్తుంది. మానసికమైన కష్టానికి కన్నీటిరూపంలో కళ్ళు ఏడుస్తాయి. కన్నీరు కూడా స్వేదమే గదా!

గుండెల నిండుగా ఏడ్వ గల్గిన వాళ్ళు సమస్యలకు భయపడి ఆత్మహత్య లకు ప్రయత్నించరని పరిశోధనలో తేలింది. బాధలను మనసులో దాచు కొన్నకొద్దీ సమస్య జటిలంగా తయారవుతుంది. ఆత్మీయులతో నైనా బాధను పంచుకోవాలి లేదా తలుపులు వేసుకొని ఒంటరిగానైనా ఏడ్వాలి. ఇలా చేయటంవల్ల శరీరం లో "టాక్సిన్లు" బయటికివచ్చేస్తాయి. ఉల్లిపాయలు కొసేటపుడు వచ్చే

> దుఃఖంలేక పోతే సంతోషం విలువ తెలియదు. ఎండలేకపోతే నీడవిలువ తెలియదు. నీఅంతట నీవుగా దుఃఖాన్ని కోరుకోవద్దు. తెచ్చుకోవద్దు. దానంతట అదిగా సంభవించినపుడు యోగంగా మౌనంగా అనుభవించు. దుఃఖం నిన్ను ఏమీచేయలేదు. సరిగదా శరణా గతి పొందుతుంది. దుఃఖంలో నీకు ఎన్నో సత్యాలు తెలుస్తాయి. జీవన సాక్షాత్కారం లభిస్తుంది. చెప్పేది యిదే!

కన్నీరు "ఇరిటేషన్" వలన వస్తాయి. దుఃఖంవల్ల వచ్చే కన్నీరు "ఎమోషన్" వల్ల వస్తాయి. ఎమోషనల్ వల్ల వచ్చే కన్నీటివల్ల మానసిక వత్తిడి దూర మవుతుంది.

విషాదాన్ని ఒకయోగంగా భావించగలిగితే మనిషి మనీషి అవుతాడు! మహర్షి అవుతాడు! యోగం అంటే అకల్పిత అదృష్టం! యోగం అంటే సాధన! యోగి అంటే సాధకుడు.

అనగ అనగరాగ మతిశయిల్లుచునుండు తినగతినగ వేప(వేము) తియ్య నుండు. సాధనమున పనులు సమకూరు ధరలోన" అన్నాడు వేమన. కష్టాలను నవ్వుతూ అంగీకరించిచూడు! అపుడు ఆకష్టమే సుఖంగా మారుతుంది. సమస్య లను నిర్లక్ష్యం చేసి ముందుకువెళ్ళు! ఆసమస్య దానంతట అదే పరిష్కార మార్గానికి వచ్చేస్తుంది.

✦☆✦

హిందువ్యులు 'విడాకులు' తీసికొనవచ్చా?

వివాహ విచ్ఛేదనం హిందూ సంప్రదాయంకాదు.

దంపతులను విడదీయగల శక్తి ఒక్కమరణానికి తప్ప మరొకరికి లేదు.

విడిపోవాలనుకుంటె విడిపోయి, కలవాలనుకుంటే కలుసుకోగల్గితే పెళ్ళికి వేదమంత్రాలెందుకు?

పెళ్ళికి గురు, బంధువులతో పనేముంది?

మనకు నూరు స్మృతులు (ధర్మగ్రంధాలు) వున్నాయి. నాలుగు పవిత్ర వేదాలున్నాయి. బ్రహ్మసూత్రాలున్నాయి. పద్దెనిమిది పురాణాలున్నాయి. రెండు మహా ఇతిహాసాలున్నాయి. ఎక్కడ వెదికినా వివాహం విచ్ఛేదనం కనుపించదు.

వివాహం ఒక ధార్మిక పవిత్ర ఒప్పందం.

ఈ పవిత్ర బంధాన్ని త్రెంచగల శక్తి సృష్టికర్తకేలేదని మన నమ్మకం.

అందుకే పురుషుని 'భర్త' అనీ భార్యను' అర్ధాంగి అంటాం మనం.

హిందూమతం వివాహాన్ని 'సంస్కారం' అని చెబుతున్నది.

విడాకులు ఎందుకు తీసుకోకూడదు? యిష్టంలేని సంసారం చేయటంవల్ల ఎవరు సుఖపడతారు? వైరుధ్యంతో కలిసివుండటం కన్నా విడిపోయి జీవిచటం సుఖకరంగదా! అని ఈనాటి వారందరూ వాదిస్తారు.

ఈవాదన తప్పు! ఈవాదం సరికానేకాదు!

అన్యోన్య జీవితం గడపాల్సిన సతీపతులు విడాకులదాకా ఎందుకు వస్తున్నారు? నూరేండ్ల పంట కావాల్సిన వైవాహిక జీవితం మూడునాళ్ళ ముచ్చటగా ఎందుకు మారుతున్నది? వివాహ బంధానికున్న బలం యింతేనా? వేలాదిమంది అందించిన ఆశీర్వాద బలం ఇంతేనా? వేదమంత్రాల ప్రభావం ఇదేనా???

దీనికి కారణం మనం: మనచుట్టూ వున్న వాతావరణం

మనలో విద్యావంతులే ఎక్కువగా విడాకుల బారిన పడుతున్నారు.

దీనికి కారణాలు చాలావున్నాయి.

వివాహం అంటే ఏమిటో, మన పిల్లలకు మనం తెలియజెప్పటం లేదు. వివాహ ధర్మం ఏమిటో, వివాహం ఎందుకు కావాలో, వివాహం గొప్పదన మేమిటో ఏ తల్లిదండ్రులు ఏబిడ్డలకు చెప్పగలుతుతున్నారు? వివాహ పవిత్రత ఎవరికి తెలుసు?

వివాహమంటే స్త్రీ పురుషుల లైంగికక్రియ కాదు!

కామసుఖాలు పొందటానికి వివాహమే అక్కర్లేదు.

వంశాభివృద్ధి కోసం ఋణ విమోచనార్థం జరిగిన వివాహం

వివాహమంటే బరువు దించుకోవటంకాదు. వివాహమంటే కట్నాలు గుంజేయుటం కాదు. వివాహమంటే అబ్బాయి అమ్మాయి కలిసి పరుండటం కాదు.

వివాహమంటే స్త్రీ పురుషులకు జరిగే ధార్మిక సంస్కారం.

ఏ అపోహలకు అనుమానాలకు ఆగ్రహాలకు తావులేని పవిత్రప్రయాణం.

విచ్ఛిన్నమైతే పుట్టిన బిడ్డలగతేమిటి? జీవిత పయనానికి అర్థమేమిటి? సార్థకత ఏమిటి?

జీవితం సమస్యల పుట్ట! కష్టాలగుట్ట! బాధలకట్ట!

పరిష్కారం ఎడబాటు తిరుగుబాటు మాత్రం కాదు.

✦☆✦

బ్రాహ్మణులు మాంసం ఎందుకుతినరు?

మనల్ని సృష్టించినవాడు మనం బ్రతకటానికి ఎన్నో వృక్షజాతులను, పండ్లను, కాయగూరలను, కందమూలాలను, దుంపలను, ధాన్యాలను,తీపి, పులుపు, కారం, చేదు, వగరు రుచులను అందించే శాకాలను సృష్టించి ఇచ్చాడు. ఇదినిజమేగదా! మాంసాహారం కోసం ప్రాణివధ ఎందుకు చేయాలి?

మనంతినే ఆహారాలు మూడురకాలు

సత్వగుణ ఆహారం, రజోగుణ ఆహారం, తమోగుణ ఆహారం.

బియ్యం,జొన్నలు, గోధుమలు, కూరగాయలు, పండ్లుపాలు, ఆకుకూరలు దుంపకూరలు మొదలైన శాకాలను తక్కువ వుప్పుపులుపు కారాలతో తినటం సాత్విక ఆహారం. (సత్వగుణ ఆహారం)

కోడి, మేక, లేడి మొదలైన సాధుప్రాణుల్ని చంపి, వండితినే ఆహారం రజోగుణ ఆహారం! వుల్లిపాయకూడా దీనిలోనికే వస్తుంది.

ఊరపంది, ఎద్దు, గేదె, గుర్రం, ఒంటె మొదలైన పశుప్రాణుల్ని చంపి మసాలాదినుసులు వేసి వుప్పుకారాలు బాగా దట్టించి మద్యం త్రాగుతూ తినేఆహారం తమోగుణ ఆహారం.

సాత్వికాహారం కన్నా రజోగుణ ఆహారం చెడ్డది. రజోగుణ ఆహారంకంటే తమోగుణ ఆహారం మహాచెడ్డది. మనం తినేఆహారాన్నిబట్టి మనప్రవర్తన, మనస్సు, మనబుద్ధి, మన ఆలోచనలు ఆధారపడి వుంటాయి. మనభాష కూడా ఆహారం మీదనే ఆధారపడి వుంటుంది.

ఏ ఆహారమైనా వండిన నాలుగుగంటలలోపుగా తినాలని శాస్త్రం.

మాంసాహారం కోరికలను పెంచుతుంది. కాముక భావనలను రెచ్చ గొడుతుంది. మూర్ఖత్వాన్ని అజ్ఞానాన్ని వృద్ధిచేస్తుంది. ధార్మిక విషయాలకు దూరంచేస్తుంది. అహంకారాన్ని రాక్షసగుణాలను పెంచుతుంది. మాంసాహారం వల్లదయాగుణం నశించి పోతుంది. ఈకారణాల వలన బ్రహ్మజ్ఞానం నశించి పోతుంది. అందుకే బ్రాహ్మణులు మాంసం తినకూడదు.

హత్యలు, దోపిడీలు, మానభంగాలు, అన్యాయాలు, మోసాలు, గొడవలు, కొట్లాటలు చేసేవారిలో నూటికి తొంభై ఐదుగురు మాంసాహారం, మద్యపానం అలవాటు వున్నవారేనని తేలింది.

'జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహిమె పార్వతీ' అని అన్నానికి నమ స్కరించి భోజనం ప్రారంభించటం మన సంప్రదాయం! మనంతినే అన్నం శక్తినీ, బుద్ధినీ, జ్ఞానాన్నీ ప్రసాదించాలి. కోప తాపాలను కాదు.

> బ్రాహ్మణులే కాదు ఏజాతి వారైనా మాంసాహారం తినటం మంచిది కాదు. ఆహారానికి కులానికి సంబంధం లేదు. సాత్విక జీవితాన్ని కోరుకొనే వారు శాకాహారం తినటం మంచిది. ఉప్పు కారం పులుపు లను కూడా తగ్గించటంవల్ల మనలోని రజోగుణాన్ని దూరం చేసుకోవచ్చు.

✦☆✦

శివుని మాత్రమే లింగరూపంలో దర్శించారెందుకు?

లయకారకుడైన శివుడు స్థిరస్వరూపుడు.

స్థితికారకుడైన విష్ణువు బహురూపుడు.

జంబూద్వీప భరతఖండంలో శైవమే పురాతన మన్నవాదన ఒకటి వున్నది.

(1920 నాటిమొహం జొదారో, హరప్పా త్రవ్వకాల్లో కొన్ని శివలింగాలు దొరికాయి. కుడ్య చిత్రాలలో శివలింగ చిత్రాలు కనబడ్డాయి. భారతదేశానికి ఆర్యులు రాకపూర్వం, అంటే క్రీస్తుపూర్వం 3000-1750 నాటి మొహంజొదారో నాగరికతనే సింధూనాగరికత అంటున్నాం. (ఈ మొహం జొదారోపట్టణం ఇపుడు పాకిస్తాన్‌లో వుంది) ఆర్యులు క్రీస్తుపూర్వం 1600 సంవత్సరాలపుడు భారతదేశానికి మధ్యఆసియా నుండి వచ్చారని చరిత్రకారులు చెబుతున్నారు.)

మనం దర్శిస్తున్న శివలింగం స్త్రీ

"లింగం" పురుష స్వరూపం – లింగ

స్త్రీ స్వరూప

సృష్టి స్వరూపమే శివలింగం – నామమ

> ప్రకృతి (స్త్రీ) పురుషుల సంయోగమే సృష్టి! భూమి ప్రకృతి. ఆకాశం పురుషుడు! విత్తనం పురుషుడు భూమిస్త్రీ! ప్రకృతీ పురుషుల సంయోగం వల్లనే మనకు ఆహారం లభిస్తున్నది. వీరిద్దరి కలయిక మనకు జీవనాధారం అవుతోంది. ఒక ఆడ ఒకమగ సంగమం వల్ల సృష్టి నిరంతరంగా జరుగుతూ వుంది. వీరిద్దరిలో ఏ ఒకరు లేక పోయినా సృష్టి నిలిచిపోతుంది. ప్రపంచ శూన్యం అవుతుంది. ఈ భూమిమీద ఏప్రాణీ వుండదు. చిన్న పురుగు కూడా వుండదు.
>
> స్త్రీ పురుష సంయోగమే
> సర్వసృష్టికి మూలం!
> ఈజ్ఞానాన్నే శివలింగంలో
> దర్శిస్తాం.

దేవు
ఆయ
దివ్యా
దేవా
గదా!
కోసం
నిజమై
అన్నీ

లింగ

నిలం
మైల
తమ
శివ
శివ
కోవ

శ్లో॥ వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్ర
జగతః పితరౌవందే, పార్వతీ ప

✦☆✦

ివలింగం స్త్రీపురుషుల సృష్టిసంకేతం

పం – లింగం క్రిందవుండే "పానుపట్టం"
స్త్రీ స్వరూపం.

ం – నామము రూపము లేనివాడు దేవుడు.

షుల
్రకృతి.
పురు
ంషుల
హారం
ంయిక
ంింది.
ం వల్ల
ుతూ
ం లేక
ుంది.
ం. ఈ
. చిన్న

ం

లో

దేవునికి నాలుగుచేతులు, చేతు లలో ఆయుధాలు, శిరస్సున కిరీటం మెడలో దివ్యాభరణాలు వుండే దేవుని ప్రతిమను దేవాలయాల్లో, ఫోటోల్లో చూస్తుంటాం గదా! ఈ రూపాలను పామర జనం కోసం పండితులు సృష్టించిన రూపాలు. నిజమైన దేవుని చూచిన వారెవరూ లేరు. అన్నీ ఊహాకల్పితాలే!

శివాలయాలలో ఎక్కడా
శివునిప్రతిమలు వుండవు.

భృగుమహర్షి శాపంవల్ల శివుడు లింగరూపంగా పూజింపబడుతున్నాడు.

శివాలయాలు ఎక్కడున్నా శాంతి నిలయాలుగా వుంటాయి. శివుడికి మడి, మైల, అగ్రజాతి, అధోజాతి అన్న తారతమ్యాలు లేవు. ఏశివాలయంలోనైనా శివ లింగాన్ని మనచేతులతో స్పృశించి శివ శక్తిని పొందవచ్చు. శివోహం అనుకోవచ్చు! ఇదే శైవాచారం.

త్తౌ వాగర్థ ప్రతిపత్తయే!
కే, పార్వతీ పరమేశ్వరా!!

✦☆✦

కర్తవ్యాన్ని విస్మరించి విధివ్రాత అనుకొంటూ కూర్చోవటం 'కర్మయోగం' కాదు. కష్టాలకు కృంగిపోకుండా సుఖాలకు పొంగిపోకుండా తన కర్తవ్యకార్యాన్ని విడువకుండా జీవితాన్ని సాగించటమే కర్మయోగం. చిన్నచిన్న సమస్యలకే చిందరవందర అయ్యేవారికీ, వుద్వేగంతో చలించి పోయే వారికీ కర్మయోగం సాధ్యంకాదు. స్థితప్రజ్ఞ, దైవగౌరవం, ధర్మనిష్ట వున్నవారికే సాధ్యం ధీరులకు, మహాత్ములకు మహర్షులకు మాత్రమే కర్మయోగం సాధ్యం.

"కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన
హేకర్మ ఫలహేతుర్భూః మాతే సంగోస్త్వ కర్మణి॥ -భగవద్గీతా

✦☆✦

అన్ని విషయాలలోనూ "సత్యమే" చెప్పాలా?

శ్లో॥ సత్యం సత్య సదాధర్మః, సత్యం ధర్మః సనాతనః
సత్యమేవ సమస్యేత, సత్యం హి పరమాగతిః॥
సత్యం ధర్మస్తపోయోగః, సత్యం బ్రహ్మ సనాతనం
సత్యం యజ్ఞః పరఃప్రోక్తః, సర్వం సత్యేప్రతిష్ఠితమ్॥

సత్యము గొప్పది. ఉత్తములైన వారు సత్యధర్మాన్నే పాటిస్తారు. సత్యము సనాతనమైనది. సత్యముదైవసమానం. సత్యమే పరమధర్మము. సత్యమే తపస్సు. సత్యమే పరబ్రహ్మము. సత్యపాలన యజ్ఞఫలమిస్తుంది. జ్ఞానము విజ్ఞానము దైవము ధర్మము మోక్షము అన్నీ సత్యములోనే వున్నవి.

అన్నివిషయాలలోనూ అన్నివేళలా అందరివద్దా సత్యమే పలకాలా! అబద్దము చెప్పనేకూడదా! అని ప్రశ్నించవచ్చు. సత్యధర్మానికి కూడా కొన్ని సమయాలు సందర్భాలు వున్నాయి అని చెప్పవచ్చు!

పసిపిల్లవానికి అన్నంపెట్టే తల్లి "అమ్మో! బూచాడు వస్తున్నాడు. అన్నం తినకపోతే నిన్నుపట్టుకుపోతాడు" అంటుంది. ఎన్నెన్నో అబద్దాలు చెప్పి అన్నం తినిపిస్తుంది. ఇది అసత్యనేరం కాదు.

ఒక భార్యతో ఒకభర్త సంతోషపూర్వకంగా "నువ్వుచాలా బాగుంటావోయ్! నువ్వంటే నాకెంత యిష్టమో తెల్సా! నిన్ను చూడకుండా నేను ఒక్కరోజు కూడా వుండలేను" అని ఆమెను మెప్పించటంకోసం అబద్దాలు చెబుతాడు. ఇది అసత్యదోషం క్రిందరాదు.

దేవుని పూజించేటపుడు పురోహితుడు మంత్రాలు చదువుతుంటాడు గదా! ఆ శ్లోకాలలో చెప్పిన విధంగా మనం ఒక్కటికూడా చేయం. ఎలాగంటే "పూగీ ఫలస్య కర్పూరై: నాగవల్లీ దళైర్యుతం ముక్తాచూర్ణ సమాయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతామ్. తాంబూలం సమర్పయామి" అని తాంబూలాన్ని దేవుని ముందు పెడతాడు. ఓస్వామీ! కర్పూరము ముత్యాలపొడి వక్క మొదలైన సుగంధ ద్రవ్యాలతో నిండిన తాంబూలాన్ని సమర్పిస్తున్నాము స్వీకరించు" అని ఆశ్లోకానికి అర్థం. కాని ఆతాంబూలంలో ముత్యాలపొడి కర్పూరం లాంటివి. వుండవు. ఇది అసత్యం కదా! దేవునికే అసత్యం చెప్పవచ్చా అంటే: పూజమొత్తం పూర్తి అయిన తరువాత "మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం పరాత్పరా యత్పూజితం మయా దేవ పరిపూర్ణం తదస్తుతే" అని మరొక శ్లోకంచదివి నమస్కరించమంటాడు. ఈశ్లోకానికి అర్థమేమంటే ఓస్వామీ! మేము ఉచ్చరించిన మంత్రాలలో దోషాలున్నాయి. భక్తిక్రియా దోషాలున్నాయి. అన్నిటినీ క్షమించు పరాత్పరా" అని అర్థం.

ఇటువంటివి అసత్య దోషాలుగా పరిగణించకూడదు.

సత్యం బ్రూయాత్ ప్రియంబ్రూయాత్
న బ్రూయాత్ సత్య మప్రియమ్!
ప్రియం చనా నృతం బ్రూయాత్
ఏష ధర్మ: సనాతన:॥ మనుస్మృతి 4-138

సత్యమే చెప్పాలి. సంతోషకరమైనదిగా చెప్పాలి. సత్యమేగదా అని అప్రియంగా చెప్పకూడదు. సంతోషకరంగా వుండాలని అబద్ధం చెప్పకూడదు. సత్యమే చెప్పాలి. ప్రియంగా చెప్పాలి. అబద్ధం చెప్పకూడదు. ఇది ధర్మశాస్త్రం.

సత్యాన్ని గురించిన చిన్న కథ చెబుతాను.-

"ఒక అడవిలో లేడిపిల్లను పులి వెంబడించింది. లేడి పిల్ల పరుగెత్తుకొంటూ వచ్చి అక్కడున్న ముని ఆశ్రమంలోని చెట్టువెనుక ప్రాణభయంతో దాక్కొన్నది. వెంబడించి వచ్చిన పులికి లేడిపిల్లజాడ తెలియక అక్కడవున్న మునీశ్వరుని అడిగింది. "మునీశ్వరా! నాకు ఆహారం కావల్సిన లేడిపిల్ల ఇటువచ్చింది. ఎక్కడదాగున్నదో చెప్పండి. అని పులి అడిగింది. అబద్ధం చెప్పకూడదు. సత్యమే చెప్పాలిగదా అని ఆమునీశ్వరుడు "పులిరాజా! నేను మునివృత్తిలో వుండి అసతాన్ని చెబితే పాపం వస్తుంది గదా! అబద్ధం చెప్పను. నీవు తరుముకొని వచ్చిన లేడిపిల్ల అదిగో ఆచెట్టుచాటున దాక్కొంది" అనిచెప్పాడు. ఇంకేముంది; ప్రాణభీతితో గజగజలాడుతున్న లేడిపిల్లను ఒక్క వుదుటున నోటకరచి చంపేసింది పులి. మునీశ్వరుడు ఎన్నో సంవత్సరాల నుండి సాధించుకొన్న తపోశక్తి ఈనిజం చెప్పటం వల్లనే నాశనం అయిపోయింది. మునీశ్వరుడు చెప్పింది సత్యమే అయినా పాపాన్ని అనుభవించాల్సి వచ్చింది. సాధుజంతువును రక్షించాల్సింది పోయి మరణకారకుడయ్యాడు గదామరి!

> ఒక్కొక్క విషయంలో సత్యం కన్నా అబద్ధం గొప్పది! అపకారం కలిగించే సత్యానికన్నా ,ఉపకారం కలిగించే అబద్ధమే పుణ్యప్రదం అవుతుంది. కాబట్టి సత్యం చెప్పటం మాత్రమే గొప్పగాదు. వివేకంతో చెప్పే సత్యమే గొప్పది. అపకార బుద్ధితో చెప్పే సత్యం అబద్దానికి మించిన పాపం కల్గిస్తుంది. మనం సత్యం చెప్పామా అసత్యంచెప్పామా అనే దానికన్నా అపకారం చేశామా ఉపకారం చేశామా అనేదే ముఖ్యం.

"దుష్ట శిక్షణ కోసం,ధర్మరక్షణ కోసం అబద్ధం చెప్పినా తప్పుకాదు."

శ్రీకృష్ణుడు దుర్యోధన దుశ్శాసనాదులను అధర్మ పద్ధతిలోనే చంపించాడు. ఒక చెడిపోయిన అవయవాన్ని నరికి తీసివేసి మిగిలిన అవయవాలను రక్షించటం ఉపకారమేగదా! అధర్మాన్ని అధర్మంతోనూ, మోసాన్ని మోసంతోనూ, కత్తినికత్తితోనూ ఎదుర్కొనటం తప్పుగాదు. ధర్మమే!

సత్యం శివం సుందరం.

✦☆✦

"ధర్మోరక్షతి రక్షితః" అంటే ఏమిటి?

ఇది మనుస్మృతివాక్యం.

ధర్మఏవ హతోహంతి "ధర్మోరక్షతి రక్షిత:"
తస్మాద్ధర్మో నహంతవ్యో మానోధర్మోహతో వధీత్॥

-మనుస్మృతి 8-15

ధర్మాన్ని నీవు చంపివేస్తే ధర్మం నిన్ను చంపుతుంది. ధర్మాన్ని నీవు రక్షిస్తే ధర్మం నిన్నురక్షిస్తుంది. కాబట్టి ధర్మపతనం జరగకుండా కాపాడవల్సిన బాధ్యత మానవులకున్నది.

ధర్మాన్ని మనం రక్షిస్తాం సరే: ధర్మంమనల్ని రక్షించటమేమిటి?

మనకులంలో, మనజాతిలో, మనయింటిలో, మనం ఒక ఆచారాన్ని పాటిస్తూ వస్తున్నాం. అదే ఆచారాన్ని మనపిల్లలు పాటిస్తారుగదా! ఉదయమే లేచి ఇంటిముందు ఊడ్చి నీరుచల్లి ముగ్గువేయటం మనకు ఎవరునేర్పారు? పెద్దల సంప్రదాయాన్ని మనమూ చేస్తూవస్తున్నామా! లేదా! దీన్నే సంప్రదాయ రక్షణ అంటారు. మనం ఇలా ఎందుకు చేయాలో ఎవరికీ తెలియదు. ఎప్పటి నుండో చేస్తున్నాం. ఇపుడూ అదేవిధంగా చేస్తున్నాం అంటారు. ఇలాచేయటం శుభోదయానికి ఆహ్వానం పలకటం అన్నమాట!

'మనల్ని కన్నతండ్రి వయోవృద్ధుడై శక్తిహీనుడైన తరువాత మనబిడ్డ మాదిరిగానే చూచుకొంటాం. మలమూత్రాలను అసహ్యించుకోకుండా ఎత్తి పోస్తాం. గౌరవంగా, ప్రేమగా, దేవునిలా ఆదరిస్తాం'-ఇదియే ధర్మం.

మనం తాళికట్టి అర్ధాంగిగా స్వీకరించిన భార్య ఎంతటి బుద్ధివంతురాలైనా తెలివి గలదైనా 'నీవుమాఅమ్మమాటను గౌరవించాలి. మాఅమ్మను జాగ్రత్తగా చూచుకోవాలి' అనిచెబుతాం.-ఇది ధర్మం.

ఇంటిలో దేవుని మందిరం పెట్టి ప్రతినిత్యం పూజచేసి నీకుంటుంబం వారిచేత కూడా చేయిస్తూ నీబిడ్డలకు చెబుతావు. చూడండి! మనం తప్పుచేస్తే దేవునికి కోపంవస్తుంది. మనకు పాపం చుట్టుకొంటుంది. తప్పుచేసిన

> నీవు నీసమాజంతో, నీ కుటుంబం తో, నీ బంధుమిత్రులతో, నీ బిడ్డ లతో ఎలా నడుచుకొంటావో, నీ బిడ్డలు కూడా అలాగే నడుచు కొంటారు. నీవు అధర్మపరుడవైతే నీ బిడ్డలు నీలాగే అవుతారు. నీవు ధర్మపరుడవైతే నీ బిడ్డలు కూడా ధర్మపరులవుతారు. కాబట్టి - ధర్మాన్ని రక్షించు! ధర్మం నిన్ను రక్షిస్తుంది.

వారందరూ నరకానికి వెళతారు. పెద్దల్ని, తల్లిదండ్రుల్ని, గురువుల్ని మనం గౌరవించాలి. అనిచెబుతావు. నీవు దేవుని విశ్వసిస్తున్నావు. కాబట్టే నీబిడ్డలు కూడా దేవుడిని విశ్వసిస్తారు. - ఇది ధర్మాచరణ. ధర్మరక్షణ.

అంటే......?

నీవు నీ తల్లిదండ్రుల్ని ఆదరించి చూపెడితేనే నీకు కూడా నీబిడ్డలు నీవృద్ధాప్యంలో సేవచేస్తారు. అవును గదా! నీవు ధర్మాన్ని రక్షించావు గాబట్టి నీవు రక్షించుకొన్న ధర్మం నిన్ను రక్షించ బోతున్నదన్న మాట!

✦☆✦

దేవుడు ఎక్కడుంటాడు?

జ్ఞానివై నీవు చూడగల్గితే అన్ని చోటులావున్నాడు!

ధనవంతునిలో, పండితునిలో, వేశ్యలో, బిక్షకునిలో, పశువులో, పురుగులో వున్నాడు.

ఇందుగలడందు లేడను సందేహము వలదు. ఎందెందు వెదకి చూచిన అందందే గలదు. చూడగలిగిన శక్తి, చూచే మనోనేత్రం నీకుంటే అంతా దైవమయమే! శ్రీమద్భాగవతం రచియిస్తున్న పోతనామాత్యునికి కూడా ఇదే సందేహం వచ్చిందట! అపుడు ఆదేవదేవుడే దిగివచ్చి "అల వైకుంఠ పురంలో, నగరిలో, ఆమూల సౌధందు దాపల, మందార వనాంతరామృత కరః ప్రాంతేందు కాంతోపలోత్పల పర్యంక రమావినోది" నని చెప్పి వెళ్ళాడట!

ఆహా! దైవ భక్తులందరి అనుమానం తీరిపోయింది. సరే: ఇదిలా వుందనిద్దాం-

మనది వైదికమతం. వేద ధర్మమే మనజీవన ధర్మం. చతుర్వేద నిర్దేశనమే మనజీవనపథం. వేదం చెప్పినదే మనందరికీ మోదం! ఆమోదం! దేవుని గురించి వేదమిలా చెబుతుంది-

"యచ్ఛకించి జ్జగత్సర్వం దృశ్యతే శ్రూయతేపివా॥అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణస్థితః॥ అనంతమవ్యయం కవిగ్ం సముద్రేన్తం విశ్వసంభవమ్। పద్మకోశ ప్రతీకాశగ్ం హృదయం చాప్యధోముఖమ్॥అధోనిష్ట్యా వితస్త్యాన్తే నాభ్యాముపరి తిష్ఠతి। జ్వాలమాలాకులంభాతి విశ్వస్యాయతనం మహత్॥ సంతతగ్ం శిలాభిస్తులంబత్యాకోశ సన్నిభమ్। తస్యాన్తే సుషిరగ్ం సూక్ష్మం తస్మిన్సర్వం ప్రతిష్ఠితమ్॥ తస్యమధ్యేమహానగ్ని ర్విశ్వార్చి ర్విశ్వతో ముఖః సోగ్రభుగ్వి భజన్ తిష్ఠన్నాహార మజరఃకవిః తిర్యగూర్ధ్వ మధశ్శాయీ రశ్మయ స్తస్యసన్తతా॥ సన్తాపయతి స్వందేహ మాపాదతలమస్తకః తస్యమధ్యేవహ్ని శిఖా అణీయోర్ధ్వా వ్యావస్థితః నీలతోయద మధ్యస్థా ద్విద్యుల్లేఖేవ భాస్వరా। నీవార శూకవత్తన్వీ పీతాభా స్వత్యణూపమా। తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మావ్యవస్థితః సబ్రహ్మా, సశివ, స్సహరి, స్సేంద్ర స్సోక్షరః పరమస్స్వరాట్॥"

మనకంటికి కనబడే సృష్టి అంతాదేవుని మయమే. నారాయణ స్వరూపమైన ఆతనిని ప్రార్థించెదముగాక! కంఠమునకు క్రిందిభాగమున నాభికి (బొడ్డు) పన్నెండు అంగుళములపైన హృదమకమలం వుంది. ఈ కమలము అధో ముఖముగా వుండి అన్నినాడులకు సంబంధమున్నది. దీనికి మధ్యగా ఒక రంధ్రము వున్నది. దీనిలోగల దివ్యాగ్ని బహుజ్వాలతో వుండి అన్ని అవయము లకు ఆహారశక్తిని ఇస్తున్నది. ఈదివ్యాగ్ని కిరణములు నాల్గుదిశలా వ్యాపించి చైతన్యము గలిగించుచున్నవి. ఈహృదయకమలములో వరిముల్లువంటి సూక్ష్మమైన అగ్ని మెరుపుతీగలా వుండి వెలుగుతున్నది. ఈ అగ్నియే బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, ఇంద్ర మొదలైన పేర్లుగల పరమాత్మ. ఈఅగ్ని నాశనము లేనిది. స్వయంప్రకాశము గలది.

ఇదియే దేవుడు.

✦☆✦

తల విరబోసుకొని తిరుగకూడదా?

తల విరబోసుకోవల్సిన పరిస్థితులు కొన్ని వున్నాయి. వెంట్రుకలు విర బోసుకొని భార్య భర్తకు కనిపించకూడదని శాస్త్రం. అలా కన్పించటం రాబోయే ఆపదలకు సూచనగా భావించాలని స్మృతుల వాక్యం.

నానాటికీ కాలం మారుతోంది గాబట్టి యిటువంటి నమ్మకాలు కూడా తుప్పు పట్టిపోతున్నాయి. గత సంవత్సరానికీ ఈ సంవత్సరానికీ ఎన్నో మార్పులు కనబడుతున్నాయి గమనించారా! అందరి జీవితాలు సినిమా మాధ్యమం అయి పోతున్నాయి. ఇప్పటి విపరీత పోకడలకు విచిత్ర విన్యాసాలకు చిత్రరంగమే దోషిగా వుంటున్నది. వెంకటేశ్వర సుప్రభాతంతోనూ, నమశ్శివాయ మంత్రం తోనూ అర్ధనగ్న దుస్తులతో ప్రేమపాటలు పాడుతుంటే ఎవరైనా నోరెత్తి అడిగిన వారున్నారా? ఇతర మతస్థులైతే మనలా మౌనంగా వుండేవారా?!? 'మేధావులు, బుద్ధిజీవులు చచ్చిపోయిన దేశం మనది". ఈ దేశంలో హిందూమతం మైనారిటీ మతం! నోటిలో హిందుత్వం, గుండెల్లో మందత్వం, కళ్ళలో అంధత్వం.

ఏం చేద్దాం హిందుత్వం అనాథ అయింది.

గంధర్వ కాంతలకు తల విరబోసుకోవటం విరహ సంకేతం

మానవకాంతలకు తలవిరబోసుకోవటం శోక సంకేతం

స్త్రీ అయినా పురుషుడైనా తల విరబోసుకొని తిరుగటం మంచిదికాదు.

✦☆✦

ఇంటిముందు కలాపి ఎందుకు చల్లాలి?

సూర్యోదయానికి ముందే కలాపి చల్లాలి.

సూర్యుడు ఉదయిస్తున్న సమయంలో కలాపి చల్లకూడదు.

కొన్ని మతాచారాలను ఎందుకు ఏమిటి అని ప్రశ్నించకూడదు. అలాగని ఎందుకో తెలుసుకోకుండా వుండకూడదు. ఒకానొకప్పుడు మనదేశంలో గురుకులాల్లోని విద్యార్థులు భిక్షమెత్తి గురువుకి సమర్పిస్తూ విద్యాభ్యాసం చేసేవారు. గ్రామపురోహితుడు బౌద్ధబిక్షువులు కూడా "భవతీ భిక్షాందేహీ" అని గృహస్థులను అర్థించేవారు. "అతిథిదేవోభవ" అన్న సంస్కృతి మనది. బియ్యం/జొన్నలు/రాగులు మొదలైన ఆహార ధాన్యంతోపాటుగా కూరగాయలు కూడా ధర్మాచారంగా దానంచేసేవారు గృహస్థులు.

ఆవుపేడతో కలాపిచల్లి రంగవల్లులు దిద్దిన యింటిముందు మాత్రమే ధర్మభిక్షను అర్థించేవారు. ఏ యింటిముందైనా కలాపిలేకుండా వుంటే ఆ యింటిలో ఏదో అశుభం జరిగివుంటుందనీ, యింటిలోనివారికి తీవ్ర అనారోగ్యం కలిగి వుంటుందని అర్థం చేసుకొని ముందుకి సాగిపోయే అవగాహనా పద్ధతి వుంది. కాలక్రమేణా యిదొక ఆచారమయింది.

ఆవుపేడను నీటిలో కలిపి కలాపి చల్లడంవల్ల రోగకారకక్రిమి ఇంటిలోనికి ప్రవేశించకుండా వుంటుంది. రకరకాల రంగవల్లులు (ముగ్గులు) ఇంటి యిల్లాలి కళాత్మక దృష్టినీ, కళాప్రావీణ్యాన్ని తెలియజేస్తాయి. వండివార్చటమే కాకుండా పూర్వస్త్రీలకు కళానైపుణ్యం దండిగా వుండేది.

✦☆✦

ఏడ్చేమగవానినీ, నవ్వే ఆడదానినీ నమ్మకూడదా?

పురుషుడు ధీరోదాత్త మనస్కుడు. స్త్రీ కుసుమ కోమల మనస్విని.

ఇద్దరివీ వేరువేరు స్వభావమైన మనసులు.

ఎంతటి కష్టంలోనూ మగవాడు వెక్కివెక్కి ఏడ్వడు. నాలుగు కన్నీటి బొట్లు కార్చేసి మౌనమై పోతాడు. ఆడది పురుష విరుద్ధమైన స్వభావురాలు. చిన్న విషయానికే గుండెలు బాదుకొంటుంది. శోకాలు తీస్తుంది. పదిమందినీ పిలుస్తుంది. ఏడుస్తూనే మనసులోని భావాలను మాటల్లో చెబుతుంది. ఇది స్త్రీ తత్వం.

మగవాడు ఏడ్వలేడుగాని గట్టిగా పదిమందికి వినిపించే విధంగా నవ్వుతాడు. మళ్ళీ మళ్ళీ నవ్వుతాడు. పగలబడీ నవ్వగలడు; వికటాట్టహాసము చేయ గలడు. స్త్రీ నవ్వుతుందిగాని చిరునవ్వు మాత్రమే నవ్వుతుంది. పెద్దపెద్దగా నవ్వదు. కారణమేమంటే స్త్రీలకు సంకోచ మెక్కువ.

ప్రతి విషయానికీ ఏడ్చేమగవాడినీ, ప్రతి మాటకూ నవ్వే ఆడదానినీ నమ్మరాదని పెద్దలు చెబుతారు. కుటుంబ పరివారానికి కంతటికీ ధైర్యం చెప్పవల్సిన మగవాడు అనాధస్త్రీలాగ ఏడుస్తూ కూర్చుంటే సంసారం సాగదు. అందరూ డీలాపడిపోతారు. ఇక ప్రతి విషయానికి ఆడది నవ్వుతూ వుంటే పరస్త్రీలు పురుషులు తప్పుగా అర్థం చేసుకొంటే మగవాడి జీవితం నవ్వుల పాలైపోతుంది గదా.

✦☆✦

శ్రీ కృష్ణుని తలమీద నెమలి పింఛం ఎందుకుంటుంది?

శ్రీకృష్ణుడు అనగానే సామాన్య జనానికి ఆయన అష్టభార్యలు, పదహారువేల ప్రియభామినులు, గోపికా జనం ఠక్కుమని గుర్తుకురావటం సహజం. హిందువులకందరికీ మొట్టమొదటగా మనసులో స్ఫురించే ఆయన శృంగార రూపమే! అవునుమరి;

ఏ అవతారమూర్తికీ లేనంతమంది భార్యలు కృష్ణునికి వున్నారు.

శ్రీకృష్ణుడు కాముకుడా?

నాస్తికులే కాదు; ఆస్తికులు కూడా కృష్ణుని కామస్వరూపునిగానే భావిస్తుంటారు కృష్ణతత్వాన్ని ఎవరూ తప్పుగా భావించరాదనీ, ఆయన భోగిగా కనిపించే యోగీశ్వరుడని తెలియజెప్పటానికే కృష్ణునికి సిగలో నెమలి పింఛం వుంటుంది. పవిత్రతా సూచకంగా గోమాత వుంటుంది. (ఎద్దు వుండదు)

'నెమలి' పరమ పవిత్రతకు చిహ్నం!

శ్రీకృష్ణుడు కాముక జన్ముడుకాదు; కారణజన్ముడు. నరకాసురుడు భైరవపూజ నిమిత్తంగా, పాతాళగృహంలో పదహారువేల రాచకన్యల్ని ప్రపంచం నలుమూలలనుండీ అపహరించుకొని వచ్చి బంధించాడు. ఎన్నో ఏళ్ళనుండి ఆ కన్యలందరూ పాతాళ చెరలో జీవన్మరణాన్ని అనుభవించారు. నరకాసుర వధానంతరం పదహారువేల కన్యలకూ విముక్తి కల్పించి, నరకాసురుని కొడుకైన భగదత్తుడ్ని ప్రాగ్జ్యోతిష రాజ్యానికి రాజును చేసి కన్యకా మణులందరినీ వారివారి రాజ్యాలకు పంపించవల్సినదిగా ఆదేశించాడు కృష్ణుడు.

> ఈ సృష్టిలో ఆడమగ కలిసి సంభోగించేయని ప్రాణి నెమలి ఒక్కటే! మగ నెమలి కంటి నీటిని త్రాగి ఆడనెమలి గ్రుడ్ను పెడుతుంది. ఈ పవిత్ర పక్షి ఈకలు తలపై ధరించిన కారణం తన పవిత్రతను లోకానికి తెలియచెప్పటానికే! శ్రీరాముడు ఏకపత్నీ వ్రతుడు కాబట్టి ఈ అవసరం ఆయనకు లేదు.

కాని ఆ రాచకన్యలెవరూ తమ తమ స్వస్థలాలకు వెళ్ళటానికి యిష్టపడలేదు. ద్వారకానగరానికి వచ్చి కృష్ణునితో వుండిపోవటానికి నిశ్చయించుకొన్నారు. కృష్ణుడు వలదని వారించినా ఫలితం లేకపోయింది. చివరకు అందరూ ఆత్మాహుతికి సిద్ధపడ్డారు. విధిలేక వారినందరినీ స్వీకరించాడు కృష్ణుడు. కృష్ణ సాహచర్యాన్ని వరంగా పొంది జన్మించినవారు ఆ కన్యలందరూ.

కృష్ణుని ప్రమేయంలేకుండానే వారందరూ కృష్ణసతులయ్యారు.

అంతేగాని కృష్ణుడు భోగలాలసుడు కాదు.

అన్ని మతాలవారికి నెమలిపింఛం పవిత్రమైనదే. ముస్లింలు కూడా దర్గాలలో నెమలి ఈకలను వుంచుతారు. నెమలి పవిత్రతను గుర్తించిన భారత ప్రభుత్వం నెమలిని జాతీయ పక్షిగా గుర్తించింది.

నమో బ్రహ్మణ్య దేవాయ సర్వజీవహితాయ చ
జగద్ధితాయ కృష్ణాయ గోవిందాయ నమో నమః

✦☆✦

"వైద్యో నారాయణో హరిః" అంటే ఏమిటి?

వైద్యుడు దైవస్వరూపుడు.

ఈ శరీరం బాగున్నపుడు ఎంత గొప్పదో, రోగాల పాలైనపుడు అంత నీచమైనదిగా కన్పిస్తుంది. ఇదొక ఎముకల తడిక! రక్త, మాంస, శ్లేష్మ, మూత్ర, మల పూరితమైన దుర్గంధ దేహం ఇది.

'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం'

వైద్యుడు దేవునితో సమానమని చెప్పటానికి మరొక ముఖ్యకారణం కూడా వుంది. పురుషులనైనా స్త్రీలనైనా వైద్యుడు చేతితోతాకి కళ్ళతో చూచి పరీక్షించ వలసి వుంటుంది. కొన్ని కొన్ని రోగాలకు ముట్టరాని అవయవాలను కూడా ముట్టవలసి వుంటుంది. చూడరాని రహస్య అవయవాలను చూపించవల్సి వుంటుంది. ఇటువంటి సమయంలో స్త్రీలు సంకోచపడుతుంటారు. సిగ్గుపడు

తుంటారు. తప్పుగా భావిస్తుంటారు. మరోవిషయ మేమంటే గృహిణులైన స్త్రీలను వైద్యునిచేత పరీక్షింప చేయటానికి పురుషులు కూడా వైద్యుని సందేహించే సమయాలు కూడా కలగ వచ్చు. అకారణంగా వైద్యుని ప్రవర్తనను చెడుగా కూడా భావించ వచ్చు గదా! కాబట్టి ఇటువంటి ఆలోచనలు ఎవరికీ కలుగ కూడదనే పూర్వీకులు వైద్యుని దేవునితో సమానమైనవాడని చెప్పారు.

> సమస్త ధర్మసాధనాలలోకి శరీర రక్షణే ముఖ్యమైనదని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. అంటే, మనిషి ఆరోగ్యవంతుడుగా వుంటేనే జీవితంలో దేనినైనా సాధించగలడు. ఏ సుఖాన్ని అయినా అనుభవించగలడు. కోట్లాది రూపాయలున్న వాడు శ్రీమంతుడు కాదు. మంచి ఆరోగ్యమున్నవాడే నిజమైన ధనవంతుడు. ఇటువంటి ఆరోగ్యాన్ని సమకూర్చి ఇచ్చేవాడు దైవస్వరూపుడే గదా! అందుకే "వైద్యో నారాయణో హరిః" అంటారు.

భారతీయ వైద్యం ఆయుర్వేదం

ఆయుర్ 'వేదం' అని ఎందుకన్నారంటే వైద్యశాస్త్రం కూడా వేదశాస్త్రాలతో సమానమైన పవిత్రత గలది గాబట్టి. క్షీరసాగర మధనం జరిగినపుడు 'ధన్వంతరి' అనే పేరుగల్గిన నారాయణ స్వరూపుడు అమృతభాండం ఒకచేతిలోనూ ఆయుర్వేదశాస్త్రం ఒక చేతితోనూ ధరించి వచ్చాడు. తదనంతర కాలంలో అశ్వినీదేవతలు ఈ ఆయుర్వేదాన్ని బ్రహ్మదేవుని ద్వారా గ్రహించి దేవ వైద్యులయ్యారు. భూలోకంలోని అనేక ఔషధవృక్షాలకు సృష్టికర్తలయ్యారు.

వైద్యుడు చిన్నవాడైనా గౌరవించాలి. చిన్నకులంవాడైనా నారాయణ స్వరూపునిగా భావించి నమస్కరించాలి. మనకు యిష్టంవున్నా లేకపోయినా వైద్యుని సలహాలను సూచనలనూ ఆచరించి తీరవల్సిందే. ప్రతి గ్రామానికి దేవాలయం లేకున్నా పరవాలేదుగాని వైద్యాలయం మాత్రం వుండి తీరాలి. మంత్ర తంత్రాలను నమ్మి వైద్య శాస్త్రాన్ని తిరస్కరించగూడదని శాస్త్రం.

✦☆✦

గణేశచవితి గణపతిని నిమజ్జనం చేయాలా?

వేదకాలంలో గజముఖుడైన గణపతి లేడు.

వేదాలలో ఈ గణపతి కనిపించడు.

హిందూమతంలో విగ్రహపూజ ప్రారంభమైన తరువాత ఈ గణపతి సృష్టి జరిగి వుండవచ్చు! గజాననుని గురించి బ్రహ్మావైవర్త పురాణంలోనూ, వామన పురాణంలోనూ చెప్పటం జరిగింది. అగ్నిపురాణంలోనూ గణేశుని గురించిన ప్రస్తావన వుంది. వీరశైవులు లింగార్చనలో గణపతిని ముందుగా ప్రార్థించరు. దైవగణాలకు అధిపతి ఇంద్రుడే కావటం వలన చతుర్వేదాలలో ఇంద్రప్రస్తావన వుంది. ఇంద్రుని గణాధిపతిగా పూజించటం వేదకాలంలోని యజ్ఞయాగాలలో జరిగేది. "ఇంద్ర" అనేది మనిషి పేరుకాదు. పదవిపేరు. 'ఇంద్ర' అనే పేరు ఒక దేవతదికాదు. కాని మూడువేల సంవత్సరాలనాటి 'వైదిక మతాన్ని' అయోగ్యులైన పండితులు తమ స్వార్థానికి వాడుకొని కలుషితం చేశారు. ఆనాటి పాపమే ఈనాటికి శాపమై ఇప్పటి తరంవారిని పీడిస్తున్నది. 'గతం గతః' ఈ విషయాన్ని వదిలేద్దాం.

> గణేశ వుత్సవాలు రాజకీయ లబ్ధికోసం ప్రారంభమయ్యాయి. భారత దేశానికి స్వాతంత్ర్యం లభించక పూర్వం హిందువుల నందరిని ఒకచోట సమావేశం చేయటానికి గణపతి వుత్సవాలను ప్రారంభించటం జరిగింది. గణపతి వుత్సవాలనే ఎందుకు చేయాలి? వేరే దేవుళ్ళు లేరా? అనే అనుమానం కలుగవచ్చు. హిందువులలో శైవులు, వైష్ణవులు అనే బేధాలు వున్నాయి గదా. శివుని ఉత్సవాలకు వైష్ణవులు ఆసక్తి చూపించరు. విష్ణు ఉత్సవాలకు శైవులు సహకారం అందించరు. గణపతి అయితే శైవ వైష్ణవులకు అంగీకారంగా వుంటుందని గణపతి వుత్సవాలను ప్రారంభించటం జరిగింది.

చవితి గణపతిని నిమజ్జనం చేయాలా? ఎందుకు చేయాలి?

గణపతి నిమజ్జనం గురించి ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా తమకు తోచిన విధంగా చెప్పటం జరుగుతూ వుంది. నిమజ్జనానికి ముఖ్యకారణం ఒకటున్నది. వివరంగా చెబుతాను.

గణపతి వుత్సవాలకు పందిరివేసి పూజించే ప్రతిమను మట్టితో చేస్తారు. ఈ ప్రతిమకు యంత్రపూర్వక స్థాపన వుండదు. కేవలం కొన్ని రోజులకోసమే ఈ బొమ్మను పెట్టటం జరుగుతుంది. ఉత్సవాల అనంతరం ప్రతిమా నిమజ్జనం చేయకపోతే ప్రతిరోజూ ఎవరు పూజచేయాలి! తాత్కాలికంగా వేసిన పందిరి ఎన్నిరోజులు వుంటుంది? మట్టిబొమ్మ గాబట్టి కొద్దిరోజులకే కాలు చేతులు విరిగి వికృతం అయిపోతుందిగదా! విరిగిపోయి వికృతమైన రూపాన్ని పూజించకూడదు గదా! స్థలం కూడా తాత్కాలికమే గదా!

అందువల్ల గణేశ చవితి గణపతిని నిమజ్జనం చేయాలి.

ఈ గణేశ వుత్సవాల విశేషమేమంటే కులమత బేధాలు మరచి అన్ని కులాలవారూ పాల్గొని గణపతిని దర్శించటం గొప్ప విశేషం.

✦☆✦

దేవుళ్ళకు జంతు వాహనం ఏమిటి?

దేవలోకంలోని మహిమాత్ములైన దేవతలకు భూలోకంలోని సామాన్య జంతువులు వాహనంగా వుండటం అందరికీ ఆశ్చర్యకరంగానే వుంటుంది.

శక్తి పురుషులైన దేవతలకు ప్రాణివాహనాలతో పనివుందా?

పనిలేదు.

మరి అయితే పశుపక్ష్యాదులు దైవవాహనాలుగా ఎందుకున్నాయి? దుర్గాదేవికి సింహం - పరమశివునికి ఎద్దు - విష్ణుమూర్తికి గ్రద్ద - బ్రహ్మకు హంస - లక్ష్మికి గుడ్లగూబ - సరస్వతికి నెమలి- యమునికి దున్న -

వేదకాలంలో సంవత్సరానికి నలభై ఐదు వర్షాలు కురిసేవట! మీకు నమ్మకం లేకపోయినా నమ్మి తీర వల్సిందే! సమృద్ధ పశుమేత వుండటం వలన ప్రాణిసంతతి పెరిగిపోతూ వుండేది. కాబట్టే అపుడు మాంసాహారం సర్వజన సామాన్యంగా వుండేది. ఎవరూ ప్రాణిహింసగా భావించేవారుకాదు. దేవుడు మనకోసం సృష్టించి ఇచ్చున్నట్లుగా భావించేవారు.

ఇంద్రునికి ఏనుగు – పార్వతికి పులి – శనీశ్వరునికి కాకి – కామాక్షికి చిలుక – భైరవునికి కుక్క – చంద్రునికి కుందేలు – కుబేరునికి తాబేలు – వరుణునికి లేడి – సూర్యునికి గుర్రం – వినాయకునికి ఎలుక – షణ్ముఖునికి నెమలి ఈ విధంగా చాలామంది దేవానుదేవతలకు భూలోక ప్రాణులు వాహనాలుగా వున్నాయి.

బుద్ధావతారం (క్రీ.పూ. 563 – 483) వరకూ ఆర్యద్రావిడులందరూ మాంసాహారులే. బ్రాహ్మణులు కూడా యజ్ఞయాగాల సమయంలో బలిపశువు మాంసం పవిత్రమైనదిగా భావించి తినేవారు. మహర్షులలో కూడా కొందరు మాంసం తిన్న దాఖలాలు వున్నాయి. ఇక మరి శూద్రాది జాతుల విషయం వేరుగా చెప్పనక్కర్లేదు గదా!

క్రీస్తు జననంనాటికి భూమిమీద వున్న మనుషులు (ప్రపంచజనాభా) మొత్తం కేవలం పదికోట్లు మాత్రమే! అపుడు విపరీతమైన అడవులు భూమినంతా ఆక్రమించి వుండేవి. అంటే వేదకాలంనాడు ప్రపంచ జనాభా ఒక్కకోటికన్నా తక్కువగా వుండేదంటే మనకు నమ్మశక్యం కాదు. కాదంటే కాదు! ప్రతినెలకు నాలుగు గొప్ప వర్షాలు కురిసేవి. అంటే వారానికి ఒక వర్షం కురిసేదన్నమాట. పోనీ యిదైనా నమ్మగలమా! లేదు. నమ్మలేం!

బుద్ధుని రాకతో హింసాప్రదమైన యజ్ఞయాగాలు నిలిచిపోయాయి. అహింసా ధర్మం ప్రారంభమైంది. జీవహింసను మాన్పించి మాంసాహారం నుండి హిందువులను శాకాహారంవైపుకి మరలించటానికి మూగజీవాలను దేవుళ్ళకు వాహనాలుగా చిత్రించవల్సి వచ్చింది. దేవుళ్ళ వాహనాలైన ప్రాణుల్ని చంపరాదని బోధించటానికి ఇలా చేయవల్సి వచ్చింది "అహింసా పరమో ధర్మః".

✦☆✦

కోర్కెలతో దేవుని పూజించటం మంచిదా?

ప్రతిఫలాపేక్షతో దేవుని పూజించరాదు.

మనిషి కోర్కెలకు అంతం ఏమిటి? ఎప్పుడు??

వయోవృద్ధునికి యవ్వనం కావాలని వుంటుంది. పది ఎకరాలు పొలం వుంటే నూరు ఎకరాలు కావాలనీ, నూరు ఎకరాలు వుంటే వేయి ఎకరాలు భూమి కావాలని వుంటుంది. లక్షాధికారికి కోటీశ్వరుడు కావాలని కోరిక వుంటుంది. నిద్రించటానికి కావల్సింది ఆరడుగుల స్థలమే అయినా ఏడంతస్తుల మేడ కావాలని కోరిక పుడుతుంది. కారున్నవాడు కూడా తనకు విమానం కావాలని ఆశపడతాడు. రాష్ట్రాధిపతి దేశాధిపతి కావాలని ఆశపడుతుంటాడు. నూరు సంవత్సరాల జీవితం అనుభవించినా ఇంకొక నూరేళ్ళు బ్రతకాలని కోరిక వుంటుంది.

ఆశలకు అంతం లేదు.

భూమిమీదున్న సముద్రజలం అంతా తీపినీరు కావటం కుదరదు.

కోరిన కోర్కెలు తీర్చకపోతే దేవుణ్ణి ఎందుకు పూజించాలి? పండ్లను ఇవ్వని చెట్టుకి నీరెందుకు పోయాలి? అని అనుకోవచ్చు.

"అవశ్యమను భోక్తవ్యం గతం జన్మ శుభాశుభమ్"

దేవునికి మన మందరమూ సమానమే కదా! అలాంటపుడు ఒకడు పేదగా, మరొకడు శ్రీమంతుడుగా, ఒకడు అందగాడుగా, ఇంకొకడు కురూపిగా ఒకడు ఆరోగ్యవంతుడుగా, మరొకరు కుంటి, గ్రుడ్డి, మూగవారుగా ఎందుకు వుంటున్నారు? అంటే, గత జన్మలో చేసిన పాప, పుణ్యాల ఫలితంగా ఈ జన్మలో వారివారి కర్మ ఫలితాను అనుభవిస్తున్నారని చెబుతోంది

నీవు చేరవల్సిన గమ్యానికి దారిచూపించటమే దేవుని కర్తవ్యం. కష్టపడి నడచి వెళ్ళటం, వెళ్ళకపోవటం నీ యిష్టం. నీ కష్టసుఖాలకు నీవే కారణ మవుతున్నపుడు దేవుని కోరాల్సిన పనిలేదు గదా!

గీతాశాస్త్రం. నీవు యిపుడు పూజించే పూజలు, పుణ్యకార్యాలు దానధర్మాలు వచ్చే జన్మకు ఫలితాన్నిస్తాయి. ఈ జన్మకోసం నీవు దేవునితో ఏమి మొర పెట్టుకొన్నా ఫలితం వుండదు. కాబట్టి పిచ్చికోర్కెలతో నీవు దేవుని పూజించటం మంచిది కాదు. తపస్సు చేసి బ్రహ్మ, మహేశ్వరులవల్ల వరాలు పొందిన వారందరూ గతజన్మకార్యకారణంగానే సాధించ గలిగారు.

మంచి ప్రవర్తనకు మించిన దైవపూజ లేదుగాక లేదు.

శ్లో॥ యోనహృష్యతి నద్వేష్టి నశోచతి నకాంక్షతి ।
శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్యః సమే ప్రియః ॥

కోరికలు లేని, దుఃఖపడని, ద్వేషించని, సంతోషపడనివాడు, మంచినీ చెడునూ సమానంగా భావించేవాడు, నా ప్రియమైన భక్తుదు! అన్నాడు గీతా కృష్ణుడు.

✦☆✦

నాగులచవితికి పుట్టలో పాలు పోయాలా?

ఆంధ్రులు నాగజాతికి సంబంధించిన వారన్న నమ్మకం వుంది.

'విశ్వామిత్ర సంతతి' అనేవారూ వున్నారు.

శ్రావణమాసంలో వచ్చే నాగులచవితికి పుట్టలోపాలు పోయటం, పుట్టచుట్టూ ప్రదక్షిణలు చేయటం, రకరకాల ఆచారాలు పురాతన ఆచారంకాదు. మధ్యకాలంలో వచ్చిన విచిత్ర ఆచారం యిది. అసలు పాములు పుట్ట పెట్టవు. చెదపురుగులు పుట్ట బెడితే ఆ పుట్టలోకి పాములు చేరి నివాసం వుంటాయి. అయితే ప్రతి పుట్టలోనూ పాము లుండవు. ప్రతిపాముకీ మనిషిని చంపగలిగే శక్తిమంతమైన విషం వుండదు. పాము కాటువేసిందని తెలియగానే కాటుపడిన మనిషికి ప్రాణభయం పట్టుకొంటుంది. భయంతో చలించిపోతాడు. గుండె పనితీరులో మార్పు సంభవించి రక్తనాళాలు నాడులు స్థంభించి పోతాయి. ఈ స్థితిలో మనిషికి మరణం వస్తుంది. పాముకాటుకి పూర్వపురోజుల్లో మంత్రాలు వేస్తే చాలామంది బ్రతికేవారని పెద్దవాళ్ళు చెబుతుంటారు. పాముకాటు తిన్న

మనిషికి, మంత్రాలమీద నమ్మకం మంత్రంవేసేవారిమీద గురివుంటే చని పోవటం దాదాపుగా జరుగదు.

నాగులచవితికి పుట్టలో పాలుపోయాలా? అలా చేస్తే మంచి జరుగుతుందా? పోయకపోతే పాములు ప్రతీకారం చేస్తాయా? ఇటువంటి అనాగరిక ప్రశ్నలు తలలో తిరగటం గ్రామీణులకు సహజం. పుట్టలో పాలుపోయటం అనేది ఒక అసంబద్ధ ఆచారం. మనం పుట్టలో పోసే పాలు మట్టిలో యింకిపోతాయనీ తెలిసీ, ఇంకిపోతుండటం కళ్ళారా చూచికూడా మహిళలు పాలు పోయటం మానుకోరు. అజ్ఞానానికి మందువుందేమోగాని మూర్ఖత్వానికి మందు వుండదుగదా!

భారతదేశంలో ఎన్నో వంశజాతులు వున్నాయి. మహాభారతంలో ఈ విషయం వివరంగా వుంది. ఈ జాతులలో నాగజాతి ఒకటి. 'నాగాల్యాండ్' వారినే నాగజాతిగా పిలిచేవారని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ జాతివారికి పట్టుదల ప్రతీకారం ఎక్కువ. వీరి గుణతత్వాలనే నాగుపాములకు అంటగట్టారు.

నాగశిలకు నమస్కారాలు చేసేవారే నిజమైన నాగునుకొట్టి చంపేస్తారు. పాములు పగబట్టి చంపుతాయనీ, పన్నెండు సంవత్సరాల వరకు ప్రతీకారవాంఛ నాగులకు వుంటుందని మనవారందరి నమ్మకం. ఇదంతా అబద్ధం. పాములు పగ బట్టటం అనేది పుక్కిటి పురాణం. జానపద కథల కల్పితం. పురాణకథల మాయాజాలం. పాముపుట్టలో పాలు పోయటం అజ్ఞానం! అమాయకత్వం!! అసలు పాములు పాలు త్రాగవు.

> పాములు అన్ని ప్రాణుల వంటివే! అయితే మనిషిని చంప గల్గిన విషం పాములకు మాత్రమే వుంటంతో అనేక కథలు పుట్టాయి. పాములు అనవసరంగా ఎవరినీ కాటు వేయవు. తమకు అపకారం జరుగుతుందన్న ప్రాణభయంతో పడగ విప్పి కాటు వేయటానికి ప్రయత్నిస్తాయి. పాములు కూడా మనిషికి స్నేహితులే! మన భయం మనదైతే వాటి భయం వాటిది.

✦☆✦

దానాలు బ్రాహ్మణులకు మాత్రమే చేయాలా?

"బ్రహ్మజ్ఞానాత్తు బ్రాహ్మణః' అంటున్నది శాస్త్రం.

ఇపుడు మనం చూస్తున్న బ్రాహ్మణకులంవారినందరినీ బ్రాహ్మణులు అనుకొంటున్నాం. వీరందరూ జన్మ బ్రాహ్మణులు. కర్మ బ్రాహ్మణులు కారు.

లోకంలో ఏ మనిషైనా తాను తన కుటుంబం క్షేమంగా వుండాలని మాత్రం కోరుకొంటాడు. అవునుగదా! బ్రాహ్మణుడైనవాడు స్వహితంవదలి లోకహితం లోకక్షేమం కోసం దేవుని ప్రార్థిస్తాడు. (ప్రార్థించాలి). ఇది నిజమైన బ్రాహ్మణ లక్షణం. లోకం క్షేమంగా వుంటేనే గదా తనకు దానధర్మాలు లభించేది!

సర్వేత్ర సుఖిన: సంతు - సర్వేసంతు నిరామయా:
సర్వే భద్రాణి పశ్యంతు - మా కశ్చిత్ దు:ఖ మాప్నుయాత్ ॥
అపుత్రా పుత్రిన: సంతు పుత్రిన: సంతు పౌత్రిన:
అధనా: సధనా: సంతు జీవంతు శరదశ్శతం ॥

"జన్మనా జాయతే శూద్ర:
కర్మణా జాయతే ద్విజ:"

జన్మవల్ల శూద్రత్వం వస్తుందిగానీ బ్రాహ్మణత్వం రాదు. బ్రాహ్మణత్వాన్ని కార్యసాధన వల్లనే సాధించుకోవాలి. శూద్రునికి జన్మించినవాడు శూద్రుడు; క్షత్రియునికి జన్మించినవాడు క్షత్రియుడు; వైశ్యునికి జన్మించినవాడు వైశ్యుడు అవుతారు. కాని, బ్రాహ్మణునికి జన్మించినంతమాత్రాన బ్రాహ్మణుడు కాడు. బ్రాహ్మణునికి వున్నన్ని కఠిన కట్టుబాట్లు నియమ నిబంధనలు మరెవ్వరికీ లేవు.

నిజ బ్రాహ్మణుడు దేవుని ప్రార్థించే విధానం యిదే. "అందరూ అన్ని చోటులా సుఖంతో వుందురుగాక! అందరూ ఆనందముగా వుందురుగాక! అందరూ రక్షితులై వుందురుగాక! ఎవరికీ దు:ఖము కలుగకుందుగాక! సంతానహీనులైన వారికి సంతతి కలుగుగాక! పుత్రవంతులకు పౌత్రులు (మనుమలు) కలుగుగాక! దరిద్రులకు ధనము సిద్ధించుగాక! అందరూ నూరు సంవత్సరములు జీవింతురు గాక!" అని లోకకల్యాణం కోసం సర్వ జనహితం

కోసం 'బహుజన సుఖాయ బహుజన హితాయ' అంటూ స్వార్థత్యాగం చేసేవాడే బ్రాహ్మణుడు.

తన సుఖాన్ని తన కుటుంబశ్రేయస్సునూ విడిచిపెట్టి తాను వుండే గ్రామక్షేమాన్ని లేక తాను నివసించే పట్టణక్షేమాన్ని, చివరిగా దేశక్షేమాన్ని కోరుకొనే త్యాగమూర్తినే బ్రాహ్మణుడు అంటారు. వేదపండితుడ్ని మనం పురోహితుడు అంటా. 'పురం' అంటే గ్రామం 'హితుడు' అంటే క్షేమాన్ని కోరేవాడు. పురోహితుడు అంటే గ్రామశ్రేయోభిలాషి అని అర్థం. పూర్వకాలం లోని మహర్షులు అందరూ బ్రాహ్మణులే! లోకశ్రేయస్సు కోసం వాళ్ళ సుఖాలు విడచి తపస్సులు చేసి మనకు మహత్తరమైన శాస్త్రాలు రచించి యిచ్చారు. మనుష్యులకు జీవన విధానాన్ని బోధించారు. ఈనాడు మనం అనుభవించే ఎన్నో సుఖాలకు కారణం వాళ్ళే! దానధర్మాలు వేదపండితులకు మాత్రమే చేయాలి.

✦☆✦

కుక్కను కొట్టకూడదా?

కుక్కను 'సారమేయం' అంటారు.

వేల సంవత్సరాలక్రితం మానవుడు అరణ్య నివాసిగా వుండేవాడు. ఇన్నిన్ని గ్రామాలు ఇన్నేసి పట్టణాలు అపుడు లేనేలేవు. నదీతీరాలలో గుంపులు గుంపులుగా గుడిసెలు నిర్మించుకొని నివసించేవారు. ఈనాడు మనకు వున్నన్ని సమస్యలు ఆనాటి మనుష్యులకు లేవు. అప్పటి వారి సమస్యలు రెండే రెండు. ఒకటి ఆహారం! రెండు రక్షణ! ఇంతేవారి సమస్యలు. ఈ రెండు సమస్యలకూ పరిష్కారంగా దొరికింది 'కుక్క' అనే ప్రాణి.

ఆ రోజుల్లో నూటి తొంభైమందికి మాంసమే ముఖ్యాహారం. వేటకువెళ్ళి మృగాలను వేటాడి ఆహారం సంపాదించాలి. లేడి-దుప్పి - కుందేలు - అడవి కోడి - పంది మొదలైన జంతువులతోపాటు పరుగెత్తి కొట్టటం చాలా కష్టం గదా. ఆ సమయంలో మనిషికి కుక్క సహకరించేది. వేటాడవలసిన ప్రాణిని

పరుగెత్తి అడ్డగించి పట్టుకొనేది ఆ విధంగా మనిషికి శునకం స్నేహమయింది. ఆహార సంపాదనకు ఆసరా అయింది.

రెండవది రక్షణ! మనుషులందరూ ఒక్కొక్క గుంపు ఒక్కొక్కచోట నివాసముంటూ ఈ గుంపులోని ఆడవారిని ఆ గుంపువారు, ఆ గుంపులోని ఆడవారిని ఈ గుంపువారు అపహరించుకొని పోయేవారు. ఒక్కోసారి క్రూర మృగాలు చంపటానికి వస్తుండేవి. అటు వంటి ఆపదసమయాలలో కుక్కలు భౌభౌ మంటూ అరచి నిద్రలేపి హెచ్చరించి రక్షించేవి. ఈ విధంగా కుక్క గృహబంధువు అయింది. స్నేహం అయింది. అందుకే కుక్క మాంసం తినరాదని నిషేధించారు. కుక్కకు బంధువైన నక్కమాంసం కూడా ఎవరూ తినరు. కుక్కను చంపరు. కాలితో తన్నరు. రాయితో కర్రతో కొట్టరు. కుక్కలు దొంగతనం చేస్తాయి. ఎపుడు చేస్తాయి? రాత్రింబగలు ఇంటిని కాపలా కాచే కుక్కకు పట్టెడన్నం పెట్టకపోతే ఆకలి కడుపును నింపుకోటానికి దొంగతనం చేస్తాయిమరి. నేరం కుక్కదికాదు ఆకలిది.

> ప్రకృతిలో సంభవించబోయే ఉపద్రవాలను ముందుగానే కుక్క గుర్తిస్తుంది. భూకంపాలు తుఫానులు ఉల్కాపాతాలు సునామీలు మొదలైన అపాయాలను గుర్తించే ప్రకృతి కాలజ్ఞానం కుక్కకు వుంది. కుక్కను కొన్ని రాష్ట్రాలలో బ్రహ్మజ్ఞానిగా భావించి పూజించి తీయని పదార్థాలను ఆహారంగా పెట్టే ఆచారం నేటికీ వుంది. కుక్కను కాలభైరవుడు అంటారు అందుకే! జావాద్వీపంలో కుక్కే దేవుడు!

ఆరుమైళ్ళ దూరంలో జరుగుతున్నదానిని కూడా కుక్క గుర్తించగలదు అంటారు. దొంగనూ దొరనూ తెలుసుకోగల్గిన పరిజ్ఞానం కుక్కకు మాత్రమే వుంది నేరపరిశోధనా విభాగంలో శునకదళం ప్రభుత్వానికి చేస్తున్న సేవ మరువరానిది కదా! సరైన ఆహారం లభించనపుడే కుక్కలు తినరానివి తింటాయి. మంచి ఆహారం వుంటే సింహంతో సమానంగా వుంటాయి. కుక్కల్ని గ్రామసింహాలని కూడా అంటారు. దయచేసి కుక్కల్ని కొట్టకండి.

✦☆✦

స్త్రీలు - శూద్రులు 'వేదాలు' చదువకూడదా?

"సర్వమానవహితంకోసం వేదాలు ఆవిర్భవించాయి.
'వేదం' అందరిది!
'వేదం' ఏ ఒక్కరి స్వార్జిత సంపత్తు కాదు.
వేదాలను ఎవరూ రచించలేదు.
అపౌరుషేయమైన వేదసంపత్తును ఎవరూ 'మాది' అనటానికి వీలులేదు.
నియమపరుడైన ప్రతివానికీ వేదాలమీద అధికారం వుంది.
భాష - సంస్కృతి - విజ్ఞానం - వికాసం - ఏ ఒక్కని స్వంతమూ కాదు.
పగలు - రాత్రి - ఏ ఒక్కరికోసమూ కాదు,
దేవుడు నీకోసమే వుంటే నీవే పూజించుకో!
వేదాలు నీకోసమే పుడితే నీవే ఆచరించు! మాకు చెప్పకు!"
అంటున్నది ఈనాటి యువత.

"యధేమా వాచమ్ కళ్యాణీ అవధానీ జనేభ్యః. బ్రహ్మారాజన్యాభ్యామ్ శూద్రాయచ. ఆర్యాయచ. స్వాయచ. అరణాయచ" "నేను నాలుగు వేదాలను బ్రాహ్మణ - క్షత్రియ - వైశ్య - శూద్రపురుషులకు నాలుగు వర్ణాల స్త్రీలకు ఈ పవిత్ర వేదవాణిని ప్రసాదిస్తున్నాను" అని దేవుడు బహుజన హితంకోసం వేదాలను సృష్టించి ఇచ్చాడు. -యజుర్వేదం

అసలు వేదాలు ఎలా పుట్టాయంటే -

అచంచల నిష్ఠాగరిష్ఠులైన ఆర్య ఋషులు అతీంద్రియ శక్తులతో ఆత్మజ్ఞానంతో సాక్షాత్కరించుకొన్న పవిత్రజ్ఞానానికి 'వేదం' అని నామకరణం చేశారు. ఈ 'వేదవిజ్ఞానం' దైవదత్తంగానే భావించారు. ఆకారణంగానే "వేదాలు అపౌరుషేయాలు" అనే నిర్ణయం జరిగింది.

పరోపకారులు జ్ఞానమూర్తులు, త్యాగజీవనులు, ధర్మబుద్ధులు అయిన ఆర్యరుషుల విజ్ఞాన సర్వస్వమే వేదం.

సృష్టిలోని సర్వజనులకు అందవల్సిన, చెందవల్సిన పవిత్ర వేదవిజ్ఞానాన్ని వ్యాసమహర్షి మరణానంతరం స్వార్థ పరాయణులైన కొందరు పండితులు తమ జాతికి అనుకూలంగా తమ సంతతి సౌభాగ్యంకోసం వున్నవి తీసివేసి లేనివి సృష్టించి వైదిక ధర్మాన్ని మట్టిలో కలిపివేశారు. వేదాలను సమగ్రంగా చదివితే ఈ విషయం తెలుస్తుంది. పట్టరాని కోపం వస్తుంది. నరికి వేయాలన్నంత రోషం వస్తుంది. అందుకే వేదాలను దాచివుంచారు.

> వేదాలను అమాయకులైన స్త్రీలు చదువరాదని శాసనం చేశారు. శూద్రవర్ణానికి అన్యాయం జరిగిపోయింది. వేదకాలంలో శ్రీమతి గార్గి, శ్రీమతి మైత్రేయి మొదలైన స్త్రీలు వేదపండితులే! వేదం అందరిది. విశ్వమానవ జనావళిది. స్త్రీలు శూద్రులు అందరూ వేదం చదవాలి. తెల్సుకోవాలి. అప్పుడే హిందూమతం బ్రతుకుతుంది.

✦☆✦

గుడిలోని పూజారికి కానుక లివ్వాలా?

పూర్వకాలంనాటి రాజులు - జమీందారులు - ధనికులు పాపనివృత్తి కోసం, హిందూధర్మ రక్షణకోసం, కీర్తికోసం, ప్రజాహితంకోసం, ప్రజలు పరధర్మాలపాలై పోతారేమోనన్న ఆలోచనతో దేవాలయాలు నిర్మించారు. ప్రతిష్ఠించిన దేవతామూర్తులకు ఎనలేని ఖ్యాతినీ మహిమనూ ప్రచారం చేయించి హిందూధర్మ రక్షణకు సహాయపడ్డారు. వారందరికీ నమస్సులు!!

దేవాలయాలు నిర్మించటం ఎంత తేలికపనో, ఆలయాన్ని, నిర్వహించటం అంతకష్టం! కొన్ని రోజులకు దేవాలయ నిర్మాణం పూర్తి అవుతుంది. తదనంతరం ఆలయ నిర్వహణే ఎంతో ముఖ్యం. ప్రతినిత్యం నైవేద్యం సమర్పించటం, దీపారాధన చేయటం, భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించటం, పరిశుభ్రతను కాపాడటం, ఇవన్నీ చిన్న విషయాలు కావు గదా! ఆలయ నిర్వహణకు భూములను మాన్యాలుగా ఇచ్చేవారు. ఇచ్చిన భూములు అకాల వర్షాల వలన, అతి

వర్షాలవలన, క్రిమికీటకాల వలన, పక్షుల వలన, సక్రమమైన ఆదాయం అందేదికాదు. దేవాలయాన్ని నమ్ముకొని సేవలు చేసేవారికి సంతృప్తభోజనం లభించేదికాదు.

దారిలేని ఈ సమస్యాత్మక స్థితితో -

పూజారికి కానుకలు సమర్పించే పద్ధతిని ప్రారంభించారు.

అంతేకాని;

గుడిపూజారికి తప్పనిసరిగా కానుకలు ఇచ్చి తీరాలన్న నియమం లేదు.

కాని;

నీ దైవసేవకునికి నీకు తోచినంత ధర్మంచేయటంలో తప్పేమిటి?

అన్నిటికీ డబ్బుకావాలి కాబట్టి అందరికీ డబ్బుకావాలి. ఇది లోక నియమం గదా! కొద్ది సంవత్సరాల క్రితం ప్రతి వ్యవసాయదారుడు తనకు పండిన పంటలో ప్రథమభాగాన్ని పంట లభించిన తీరునుబట్టి దేవాలయ పురోహితునికి సమర్పించుకొనేవాడు. రాబోయే సంవత్సరం ప్రకృతి ఉపద్రవాలు రాకుండా చూడమని దేవుని ప్రార్థించేవాడు.

ఆంగ్లేయులు మనల్ని పాలించి వెళ్ళిన తరువాత ధనికులలోనూ దరిద్రుల లోనూ ఆలోచనా విధానం మారింది. భక్తినీ, ముక్తినీ ప్రేమనూ, అనుబంధాన్నీ, ఆత్మీయతనూ, అభిమానాన్నీ, అనురాగాన్నీ డబ్బుతోనే తూకంవేసి కొంటున్నాం. దేశవిధానమే మారిపోయింది. ధనముంటే దేన్నైనా కొనగలమనే పిచ్చితనం అంటుకొంది.

భావనా దారిద్ర్యం మనల్ని ఆవహించింది. మన సంస్కృతి చచ్చిపోతున్నది. పరసంస్కృతి మన పంచ చేరుతోంది. మన తనాన్ని మనం మరిచిపోతున్నాం. పర దాస్యాన్ని కోరుతున్నాం. పరదేశాన్ని అభిమానిస్తున్నాం.

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపిగరీయసి"

✦☆✦

భార్య భర్తకు ఎడమవైపుగానే ఎందుకుండాలి?

పురుషుడు చేసే అన్ని కార్యాలలోనూ భార్య ఎడమప్రక్కన వుండాలని లేదు. కొన్ని ధార్మిక కార్యాలకు మాత్రమే ఈ పద్ధతి వుంది.

శ్లో॥ అభిషేకే రథారోహే, దంపతే శయనే తథా ।
శ్రద్దే స్నాన తథా దానే, పత్నీ తిష్ఠతి వామత: ॥

అభిషేక కార్యక్రమాలలో, ప్రయాణాలలో, ఒకే మంచంమీద నిద్రించే టపుడు, పుణ్యస్నాన సమయాలలోనూ, దానధర్మాలు చేసే సమయం లోనూ భార్య భర్తకు ఎడమవైపున వుండాలి. వివాహ సమయంలో కన్యాదానం చేసే టపుడు, విగ్రహప్రతిష్ఠ, యజ్ఞయాగాల, సమయాలలో భార్య భర్తకు కుడి వైపున వుండాలి అనేది శాస్త్ర నియమం.

సృష్టికర్త తాను సృష్టిప్రారంభం చేసేటపుడు తన కుడిభాగంనుండి పురుషుణ్ణి ఎడమభాగంనుండి స్త్రీని సృష్టించాడట. బైబిల్‌లో కూడా స్త్రీని ఎడమవైపు గుండె ఎముకనుండి, పురుషుని కుడివైపు గుండె ఎముకనుండి దేవుడు సృష్టించాడని వ్రాయబడి వుంది. అన్ని మతాలు కూడా సృష్టి విషయంలో ఒకే అభిప్రాయం కల్గి వుండటం విశేషం. పురుషునికి ఎడమవైపుగా స్త్రీ వుండాలని చెప్పటంలో ఒక సున్నితమైన రహస్యం దాగివుంది. పురుషునికి గుండె వుండేది ఎడమవైపుననే గదా! అర్ధాంగియైన స్త్రీని తన హృదయభాగాన నిలుపుకోవాలని శాస్త్రం చెబుతోందన్నమాట! శ్రీమహావిష్ణువు కూడా లక్ష్మీదేవిని తన ఎడమభాగాన దాచుకొన్నాడట. ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరులు ఒకే రూపంగా ఒకరిలో ఒకరు లీనమై వుంటారు గదా! పరమేశ్వరుని ఎడమ భాగమంతా పార్వతీదేవి లీనమై వుంటుంది.

మనిషి స్పందనకూ సాన్నిహిత్యానికి జీవనవికాసానికీ ఎడమ భాగం పనిచేస్తుంది కాబట్టి స్త్రీని ఎడమవైపుగా వుంచుకోవటం ఎంతో సముచితం. మానవుని కుడి ఎడమ భాగాలకు వ్యత్యాసం వుంది. కుడి భాగంలోని అవయవా లన్నీ దృఢంగా బలంగా కష్టించటానికి అనుకూలంగా వుంటాయి. ఎడమ

భాగంలోని అవయవాలు అన్నీ కూడా సుకుమారంగానూ సహాయస్థితి గలవిగానూ వుంటాయి. మనం తినే ఆహారం ఎక్కువగా నమిలి కష్టపడేది కుడివైపు దవడ దంతాలు మాత్రమే! ఇది మనకు తెలియకుండానే జరుగుతుంది. స్త్రీ పురుషులిద్దరూ ఒకే మంచంమీద నిద్రించేటపుడు పురుషుడు తనకుడి చేతిని స్త్రీమీదవేసి నిద్రలో కూడా స్త్రీని రక్షించుకొంటూ నిద్రబోతాడు. ఇవన్నీ మనకు తెలియకుండానే అప్రయత్నంగా జరుగుతుంటాయి. అందుకే ఆమె అర్ధాంగి.

అందుకే "పురుషుని ఎడమభాగం స్త్రీ' అంటున్నది శాస్త్రం.

✦☆✦

భోజనం మౌనంగా చేయాలా?

నిద్ర ఆహారం మైధునం ఈ మూడు విషయాలలో మౌనంగానే వుండాలి. అంటే ప్రశాంతంగా వుండాలన్నమాట. ఇది శాస్త్రం.

ఆహారం తినే సమయంలో మాటల్లోపడితే ఎంత తింటున్నామో తెలియదు. ఎక్కువగా తిన్న ఆహారం శక్తిని కల్గించదు. కాకపోగా విషతుల్యంగా మారే అవకాశం వుంది. త్వర త్వరగా తినే ఆహారం రుచి తెలియదు. సరిగా జీర్ణం కాదు. భోజనం చేసే సమయంలో అనావశ్యక విషయాలలో పడితే ఏదో ఒక గొడవ జరుగవచ్చు. భోజనానికి అర్ధాంతర ముగింపు జరుగవచ్చు. ఇంటిలోని వారందరూ ఈ గొడవతో ఒక్కోసారి మండే కడుపుతోనే పడుకోవల్సి రావచ్చు.

భోజనం మౌనంగా ఎదుకు చేయాలంటే ప్రశాంతంగా భుజించే ఆహారమే శక్తిని కల్గించి అమృతంగా మారుతుంది. నరనరాలకు పుష్టినిస్తుంది. మనం రోజుకి లక్ష రూపాయలు సంపాదించినా నాలుగు ముద్దల అన్నంకోసమే గదా! అంతటి ముఖ్య అవసరాన్ని ఆదుర్దాగా ముగించటంలో అర్ధమేమిటి? టి.వి. చూచుకొంటూ, పేపరు చదువుకొంటూ ఆహారపదార్థాలను కడుపులోనికి కుక్కుతూ వుంటే రుచి సరిగా తెలియక పోగా అజీర్తి కలిగి కొంత కాలానికి జీర్ణావస్థ దెబ్బతిని ఇకముందు తింటానికేం వుండదు.

✦☆✦

దైవబలం లేకుంటే మానవశక్తి సహకరించదా?

దైవబలం లేకుంటే మానవశక్తి సహకరించదు.

మానవశక్తి లేకుంటే దైవబలం సహకరించదు.

ఈ రెండూ నిజమే!

కట్టెలు వుండాలంటే అగ్ని కావాలి. అగ్ని మండాలంటే కట్టెలు కావాలి. పరస్పర సంబంధ విషయాలివి. బియ్యం అన్నంగా మారటానికి నిప్పు కావాలి నీరూ కావాలి. విత్తనం మొక్కగా మారటానికి భూమితోపాటు నీరు కూడా కావాలి.

హేతువాదం మానవకృషి ముఖ్యమంటుంది.

భక్తివాదం దైవబలమే ముఖ్యమంటుంది.

ఒకే ముఖ్యవీధిలో రెండు షాపులు ఒకే వ్యాపారం చేస్తున్నా ఒక షాపుకే జనం గుమిగూడి వుంటారు. ఇది వ్యక్తిలోపమా! శక్తిలోపమా! యుక్తి లోపమా!

మన జీవితంలో ఎప్పుడో ఒకసారి అందరికీ వచ్చే అనుమానమే ఇది.

మనసావాచా కర్మణా భూమినే నమ్ముకొని పగలు రాత్రి కష్టించి ఎండా వానలను లెక్కచేయక వ్యవసాయ కర్మను సాగించే రైతుబిడ్డ ప్రకృతి వైపరీత్యానికి సర్వనాశనమై పోతుంటాడుగదా! ఏమిటిది! ఎవరితప్పు?

కష్టపడి పండుకొన్న అన్నంలో బల్లి పడితే ఎవరిది తప్పు!

చెరువునిండా నీరు వుండటం ముఖ్యం కాదు. దిగి త్రాగటానికి నాలుగు మెట్లుండాలి. దీనినే అదృష్టమనీ, తెలివితేటలు అనీ అంటుంటారు.

ఏకాగ్రత, నమ్మకం, పట్టుదల, కలిగిన మానవశక్తికి దైవశక్తి సహకరించి తీరుతుంది.

✦☆✦

సంక్రాంతికి 'పశుపూజ' ఎందుకు చేస్తారు?

పశుసంపద జాతి సంపద.

పశుసంపద సమృద్ధిగావుంటే కరువు కాటకాలు ఏమీ చేయలేవు. పూర్వకాలంలో ఎక్కువ పశుసంపద వున్నవానిని 'గోస్వామి' అని పిలిచేవారు. భూస్వామి కన్నా గోస్వామి ధనవంతుడుగా వుండేవాడు. ఈనాడు వర్తక వ్యాపారాలు చేస్తున్న వైశ్యవర్ణంవారు గోస్వాములే! దక్షిణ భారతంలోని శ్రేష్ఠిని ఉత్తరభాతంలో గోస్వామి అంటారు.

సంక్రాంతి పండుగనాడు రైతు సోదరులందరూ తమ పశువుల కొమ్ములకు రంగువేసి వేడినీటి స్నానం చేయించి పసుపు కుంకుమలతో పూజించి అప్పుడే పండిన కొత్త బియ్యంతో పాయసం వండి తినిపిస్తారు.

ఔను! పశువులకూ రైతులకూ విడదీయరాని బంధం గదా.

సంక్రాంతి పండుగనాటికి రైతన్నల యిండ్లన్నీ ధాన్యరాశులతో కళకళలాడు తూంటాయి. సంవత్సర శ్రమ ఫలితం అది. చిన్న చిన్న కొండలుగా కనిపిస్తున్న ధాన్యరాశు లను చూచుకొని రైతులందరూ ఆనందంతో మైమరచిపోతారు.

నిజమే కాని; ఈ సంపదకు కారణం ఎవరు?

పశువులే గదా!

ఎండవానలలో తోడుగా నిలిచి, పొలందున్ని, తన పేడనే పొలానికి ఎరువుగా ఉపయోగించి, తన సంసారానికి ఆపద్బాంధవులుగా నిలిచిన పశువు లను పూజించటంలో ఎంత మధురమైన అర్థం వుంది!! ఎంతటి తీయని భావన వుంది!! ఎంత విడదీయరాని ఆత్మీయత వుంది!!

ఆ పశువుల కష్టంతోనే గదా తన కూతురి పెళ్ళిని చేయగలిగాడు! ఆ పశువుల శ్రమతోనేగదా పెద్ద కొడుకును చదివించాడు! ఆ పశువుల పరిశ్రమ తోనే గదా కన్నతండ్రికి వైద్యం చేయించాడు! ఆ పశువుల సహాయంతోనే గదా తన సంసారం సుఖసారమై నడుస్తోంది! పనికిరాని గడ్డిని తిని పాలు

పెరుగులను తమ కంచాలకు నింపిన పశువులను ప్రేమ మీరా పూజించటంలో కృతజ్ఞత ఎంతో వుంది.

అవిద్యావంతులకున్న కృతజ్ఞతా భావం, ప్రేమబంధం సంబంధ బాంధవ్యం విద్యావంతులకు వుండవు. తెలియవు. పశుజాతి వుంటేనే బలమైన ఆహారం మనకు లభిస్తుంది. "తిండి కలిగితే కండ కలదోయ్ కండ గల వాడేను మనిషోయ్" అని చెప్పిన కవి వాక్కులు నిజంగదా!

సంక్రాంతి ఒక విశేషమైన విశిష్టమైన పండుగ. మార్గశిరమాసం పుష్యమీ నక్షత్రంలో సూర్యుడు మకరరాశి లోనికి వస్తాడు. ఆనాటి నుండీ ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభ మౌతుంది. అంటే సూర్యుని నడక దక్షిణమార్గంనుండి ఉత్తరమార్గానికి మారుతుందన్న మాట. చలి క్షీణించి పోయి సూర్యప్రతాపం ప్రారంభమవు తుంది. ఇదే సంక్రాంతి విశేషం.

✦☆✦

"మడి" అనే పద్ధతి ఏమిటి?

అన్నం తిన్నవాడు నిద్రపోతాడు

అన్నం తిననివాడూ నిద్రబోతాడు

సగం ఆహారం తిన్నవాడు నిద్రబోడు.

ఈ 'మడి' అనే ఆచారం కూడా అంతే! సగం పరిజ్ఞానంతో ఆచారాలు జరిపేవారు, మడి పేరుతో దూరంగా తొలగిపోయేవారు, ఏ మాత్రమూ వేదపరిజ్ఞానం లేనివారే! మిడిమిడి జ్ఞానంతో వున్నవారే! సమసమాజంలో గొప్పవారుగా పేరుపొందాలనుకొనేవారే!!!

ఆలోచనలేని ఆచారం యిది.

'తడి' బట్టలతో 'మడి' వస్తుందా!

బ్రహ్మజ్ఞాన శూన్యత్వం యిది

శరీరంమీద నాలుగు చెంబులనీరు పోస్తే మడివంతులవుతారా! శరీరం లోపలి మలం, మూత్రం, కఫం చీము, దుర్గంధం, లాలాజలం, ఎక్కడికి

పోతాయి? మాటలో శూద్రత్వం; మనసులో శూద్రత్వం, ఆత్మీయతలో శూద్రత్వం.... ఇన్ని శూద్రత్వాలను వంటినిండా కప్పుకొని తడిబట్టతో మడి వచ్చిందంటే ఎలా!?! మడి వస్తుందో రాదోకాని జలుబు మాత్రం వస్తుంది.

ఈనాటి బ్రాహ్మణవర్గంలో నూటికి ఒక్కరికి కూడా వేదమార్గం తెలియదు.

కొన్ని పురాణాలు మాత్రమే తెలుసు!

పురాణాలన్నీ వేద సమ్మతం కావు.

భగవాన్ వ్యాసమహర్షి రచించిన పురాణాలను కాదు ఇపుడు చదివేది మనం.

పురాణాలను, స్మృతులను ఎవరికిష్టం వచ్చినట్లువారు మార్చేశారు.

వేదాలను ఎవరికీ తెలియకుండా చేశారు.

పవిత్ర సంస్కృత భాషను స్వంత భాషగా చేసుకొన్నారు.

హైందవ జాతికి ద్రోహం చేశారు.

మహోజ్వలమైన సంస్కృతాన్ని మృతభాషగా చేశారు.

ఏం జరిగినా, ఏం చేసినా, ఎన్ని చేసినా ఈనాటి జనస్రవంతి ఈ మడి వాదులందరినీ తమలో కలుపుకొని సాగటానికి సర్వసిద్ధంగా వుంది. కాని ఈ జనారణ్యంలో కలిసి జీవించటానికి వారెవరూ సిద్ధంగా లేరు. నరనాడుల్లో జీర్ణించుకొని పోయిన అంధవిశ్వాసాలు ముందుకు సాగనివ్వటం లేదు. ఇది దౌర్బల్యం! ఇది దుర్బలత్వం! ఇది దౌర్భాగ్యం!

మన భాష, మన సంస్కృతి, మన వున్నతి, మన ఋషి విజ్ఞానం మన శాస్త్రపాండిత్యం మన బిడ్డలందరికీ అందించటంలో విఫలం అయ్యాం. ఆకారణంగానే ఈనాటి యువతరం పాశ్చాత్య దేశాలవైపు ఎదురు చూస్తోంది. విదేశ సంస్కృతిని గుండెలకెత్తుకొని పరుగులు పెడుతున్నది.

మనకిపుడు కావల్సింది ఆచారం కాదు. ఆలోచన.

✦☆✦

పాతివ్రత్యం స్త్రీలకు మాత్రమే ఎందుకు?

ఇది మంచి ప్రశ్న - అందరూ తెల్సుకోవాల్సిన ప్రశ్న.

పాతివ్రత్యం స్త్రీలకు మాత్రమే వుండాలని ఎవరు చెప్పారు? ఏ శాస్త్రంలో వుంది?

ఒకవేళ ఏ శాస్త్రంలోనైనావుంటే అది పరమ తప్పుడు శాస్త్రం.

హిందూమతం ఏకపత్నీ వ్రతాన్నే ప్రోత్సహించింది.

అందుకే రాముడు దేవుడయ్యాడు. రాముని దేవునిగా చెప్పటానికి ఇదే ఆధారం.

అవును నిజమే! మరి; కృష్ణునికి అంతమంది భార్యలెందుకున్నారు?

ముందుగా పాతివ్రత్యం అంటే ఏమిటో తెల్సుకోవాలి

ఐదుమంది భర్తలున్న 'ద్రౌపది' మహాపతివ్రత! కన్యాతనంలో కర్ణునికి జన్మనిచ్చి, తరువాత ఇంద్ర, వాయు, ధర్మదేవునివల్ల బిడ్డలు పొందిన 'కుంతీదేవి' పతివ్రత! పరాశర మహర్షివలన వ్యాసునికి జన్మనిచ్చి తరువాత శంతనుని పెండ్లాడిన 'సత్యవతి' పతివ్రత! దేవేంద్ర సంగమం జరిపిన 'అహల్య' పతివ్రత! వాలి సుగ్రీవులతో సంసారం చేసిన 'తార' పతివ్రత.

అవును! వీరందరూ పతివ్రతలే!

పాతివ్రత్యానికీ పరపురుష సంగమానికీ చాలా వ్యత్యాసం వుంది.

వ్యభిచారానికీ పాతివ్రత్యానికీ తేడా ఎంతో వుంది.

ఆదికాలంలో మనిషి జ్ఞానవంతుడైన తరువాతనే స్త్రీలందరికీ పాతివ్రత్య పద్ధతిని మహర్షులు ప్రవేశపెట్టారు. దీనివల్ల మానవులకు మేలే జరిగింది. (స్థలాభావంవల్ల వివరించి చెప్పలేక పోతున్నందు మన్నించాలి)

పాతివ్రత్యమంటే పతితోనే జీవించటమనే నియమం. అలాకాకుండా స్త్రీ స్వేచ్ఛాకాముకత్వంతో జీవిస్తే తదనంతర పరిణామాలేమిటి? పుత్రపుత్రికా సంతతికి దిక్కెవ్వరు? తోడెవ్వరు? మనిషికి జీవితంకంటే భద్రత ముఖ్యం గదా! మనం మనకోసం జీవించే జీవితకాలంకన్నా మన బిడ్డలకోసం జీవించే

జీవితకాలం పెద్దది. మన భద్రతకన్నా మన బిడ్డల భద్రతే ముఖ్యంగా భావిస్తాం. అందుకోసం అహర్నిశలూ శ్రమిస్తాం. కష్టపడి బిడ్డలకోసం కూడబెడతాం.

భర్తలేని స్త్రీకి భద్రత ఏమిటి? తండ్రి తెలియని బిడ్డలకు దిక్కెవ్వరు?

అందుకే స్త్రీకి పాతివ్రత్యాన్ని పెట్టారు. మగవాడు సంభోగం చేసి వెళ్ళిపోతాడు. తరువాత కష్టాలన్నీ స్త్రీకేగదా! ఆడది పశువుకాదు. మృగంకాదు. తన బిడ్డల్ని తానే పెంచుకొనే కుక్క పంది పిల్లి వంటి హీనప్రాణికాదు. గర్భం స్త్రీకి వస్తుందిగాని పురుషునికి రాదు. పుట్టిన బిడ్డకు పురుషుడు పాలిచ్చి పెంచడు. కామమే జీవన పరమార్థంకాదు. జీవన మౌల్యాలు ఎన్నోవున్నాయి. స్త్రీకి పదిమంది భర్తలు వుండకూడనిది అందుకే. పురుషునికి స్త్రీకి జీవనవ్యత్యాసం వుంది.

శృంగార సంభోగ విషయాలలో పురుషుడు హీనుడు! స్త్రీ దేవత!

అందుకే స్త్రీలకు 'పాతివ్రత్య నియమం' చెప్పింది శాస్త్రం.

పురుష పక్షపాతం కాదు.

✦☆✦

మాతృభూమి, మాతృభాష, అన్నీటికీ తల్లిపేరెందుకు?

"నమాతుః పరదైవతా"

తల్లినిమించిన దైవంలేదు. తల్లినిమించిన గురువులేదు. తల్లిని మించిన హితుడులేదు. తల్లిని మించిన పరతత్వం లేదు. తల్లిని మించిన వస్తువులేనే లేదు.

ప్రతి జీవికీ తల్లే పరమాత్మ.

ప్రపంచంలో ఏసంస్కృతీ నేర్పని, నేర్పలేని మాతృగౌరవమిది. భారతీయులకు తల్లి దైవసమానం.'మాతృదేవోభవ' అని చెప్పిన హిందూధర్మాన్ని, సంస్కృతిని, సంస్కారాన్ని చేతులెత్తి నమస్కరించాలి.

పితృస్వామ్య సంస్కృతిలో తల్లికిచ్చిన గౌరవమిది.

పరమాత్మా! మళ్ళీ జన్మవుంటే నన్ను ఇక్కడే పుట్టించు అంటూ వేడు కోవల్సిన పుణ్యభూమియిది. మాతృభూమి, మాతృభాష, మాతృసంస్కృతి, అంటూ తల్లి ఎంతగొప్పదో ఎంతవిలువైనదో తెలియాలంటే తెలుసుకోవాలంటే ప్రతిస్త్రీ ఈ భూమిలోనే జన్మించి తీరాలి. ఇక్కడే తల్లి కావాలి. విద్యకు అధిష్ఠాన దేవత సరస్వతి! ధనానికి మూలదేవత లక్ష్మి! బలానికి ఆధిదేవత పార్వతి! విద్య, ధనం, బలం ముఖ్యమైన మూడింటికీ ప్రసాదనా దేవతలు స్త్రీమూర్తులే కావటం స్త్రీలకిచ్చిన గౌరవం.

> మాతృదేవోభవ! పితృదేవోభవ! ఆచార్యదేవోభవ! అతిథి దేవోభవ! అని చెబుతుంది, భారతీయ ధర్మం. తండ్రి గురువు బంధువులు అందరి కన్నా తల్లికే ప్రథమస్థానం ఇచ్చారు. వేదకాలపు ఋషులు.

ప్రతి మనిషికీ “తల్లే ప్రథమ గురువు” ప్రతిబిడ్డ మొదటి పాఠాలు తల్లివద్దే నేర్చు కొంటాడు. ప్రతిశిశువు తననోటి నుండి మొదటిసారిగా చెప్పే మాట “అమ్మ” అని! (కాని ఈనాటి తల్లులందరూ ‘అమ్మా’ అని పిలిపించుకోవటానికి సిగ్గు పడుతున్నారు. ఇది పాశ్చాత్య పైత్యం) మనకెంత వయసు వచ్చినా తల్లి దగ్గరకు వెళ్ళేసరికి పిల్లలమైపోతాం. ఎంతటి గుప్తరోగాన్నైనా ముందుచెప్పేది తల్లికే! తల్లివున్నా మరణించినా దగ్గర లేకపోయినా సరే చిన్నదెబ్బ తగలగానే ‘అమ్మా’ అని అమ్మనే పిలుస్తాం. ప్రపంచంలో ఎక్కడైనా చెడ్డకొడుకు చెడ్డకూతురు వుంటారేమోగాని చెడ్డతల్లి వుండదని పెద్దలు చెబుతారు.

ఆడతనానికి వున్న ఆత్మీయత మగపురుగుకి వుండదు. ఆడపిల్ల పెరిగి తల్లికి స్నేహితురాలవుతుంది. మగవాడు పెరిగి తండ్రికి శత్రువు అవుతాడు. ఇది జీర్ణించుకోలేని నిజం. అంగీకరించలేనిసత్యం.

భార్యగానైనా, తల్లిగానైనా, చెల్లిగానైనా, అక్కగానైనా, బిడ్డగానైనా, ఆడది మాత్రమే ఆత్మీయతలను పంచగల్గిన కల్పవృక్షం. భర్తమరణించినా ఆడది సుఖం గానే జీవిస్తుంది. భార్య మరణించిన తరువాత మగవాడు దిక్కులేని వాడవుతాడు. అందుకే భర్తకంటె భార్యచిన్నదిగా వుండాలన్నారు పెద్దలు.

✦☆✦

పార్వతీదేవిని "దుర్గ" అని ఎందుకంటారు

త్రిమాతలైన లక్ష్మీపార్వతీ సరస్వతులలో మహాశక్తియైన పార్వతీదేవి పెద్దది.

ఈ సర్వ సృష్టికి పెద్దముత్తైదువ.

అణు,రేణు, తృణ, పిపీలి కాదులనుండి బ్రహ్మాండానికి శక్తి సంధాత్రి.

రుషిమునిగణ సంరక్షిణి.

వేదకాలంలో "రురుడు" అనే రాక్షసునికి ఒక పుత్రుడు పుట్టాడు. వానిపేరు "దుర్గముడు" పెరిగి పెద్దవాడై విద్యాబుద్ధులను నేర్చిన తరువాత దైత్యవంశజుల దుర్గతి. దేవతలమహోన్నతి చూచి మధన పడసాగాడు. దేవదానవు లిద్దరూ కశ్యప ప్రజాపతికి బిడ్డలై వుండీ సోదరులైన రాక్షసులను బాధించి వధించి వేయగల శక్తి దేవతలకు ఏవిధంగా వచ్చిందోనని ఆలోచించసాగాడు. దానవ కుల పెద్దలు "దేవతల సర్వశక్తికీ వేదాలే కారణ" మని దుర్గమునికి బోధించారు.

దుర్గముడు వజ్రసంకల్పంతో అచంచల దీక్షతో చాలా సంవత్సరాలు పరబ్రహ్మను గూర్చి తపస్సు చేసి బ్రహ్మ సాక్షాత్కారాన్ని సాధించాడు. ఏంవరం కావాలో కోరుకోమన్నాడు బ్రహ్మ. "బ్రహ్మదేవా! నీముఖాల నుండి వెలువడి నీహస్తగతమైన వేదాలను నాకు ధారాదత్తం చేయాలి. ఎవరూ వేదగానం చేయ కూడదు. అందరూ వేదాలను మరిచిపోవాలి" అని దుర్గముడు. వరం కోరు కున్నాడు. అన్యమార్గం లేక అనుగ్రహించాడు పితామహుడైన బ్రహ్మ.

నాటితో దేవ, బ్రాహ్మణ గణాలందరికీ వేదాలు గుర్తురాక యజ్ఞయాగాలన్నీ నిలిచి పోయాయి. దేవతలకు హవిస్సు అందక శక్తిహీనులై పోయారు. నదీ నదాలు ఎండిపోయాయి. వర్షాలు లేక వృక్షజాతి క్షీణించింది. రుషులు దేవతలు సర్వశక్తి స్వరూపిణీ యైన పార్వతీమాతను ప్రార్థించారు. ఆమహామాత ప్రత్యక్షమై ఆకలితో అలమటిస్తున్న రుషులందరికీ శక్తివంతమైన శాకాలను (ఆకుకూరలు) ఇచ్చి తినిపించింది. అశాకాలను తిన్న ఋషులకు మంచిశక్తి లభించింది. అందరూ పార్వతీశక్తిని" శాకంబరీ దేవి"గా స్తుతించారు. ఆనాటినుండీ సాత్వి

కాహారానికి 'శాకాహారమని' పేరువచ్చింది. (గోంగూర, తోటకూర, పాలకూర, బచ్చలికూర, మెంతికూర మొ॥ అన్నీ శాకంబరీ దేవి ప్రసాదమే).

శక్తి స్వరూపిణి దుర్గముడి సంహారానికి నిశ్చయించుకొంది. అపుడు ఆ శక్తి స్వరూపంనుండి కాళిక, భైరవి, శాంభవి, త్రిపుర మొదలైన శక్తులు ముప్పై రెండుమంది పుట్టి దుర్గముడి రాక్షససైన్యాన్ని సంహరించటానికి బయలు దేరారు. సైన్యనాశనానికి తొమ్మిది రోజులు పట్టింది. శక్తిస్వరూపంతో పార్వతీ మాత సింహవాహనాన్ని అధిష్ఠించి దుర్గముడి పైకి వెళ్ళింది. అచంచల ధైర్యంతో ఎదుర్కొన్నాడు దుర్గముడు. చివరకు శక్తి స్వరూపిణి దుర్గముడిని చంపివేసింది. దుర్గముడి వర ప్రభావం పోయి అందరికీ వేదజ్ఞానం పునః లభించింది.

దుర్గముడిని వధించిన కారణంగా పార్వతిని "దుర్గ" అని పిలుస్తారు.

✦☆✦

వేదాలు ఎందుకు? ఏ వేదం ఏం చెబుతుంది?

వైదిక మతానికి వేదాలే మూలం - వైదిక మతమే హిందూ మతం
హిందూమతమే భారతీయ మతం
వేదాలను దేవుడే స్వయంగా మనకు ప్రసాదించాడని మన నమ్మకం.
యుగాలు నాలుగు వున్నట్లుగానే వేదాలు కూడా నాలుగు.
ఋగ్వేదం - యజుర్వేదం - సామవేదం - అధర్వణవేదం

- ఋగ్వేదం -

ఋగ్వేద మంత్రాలను 'ఋక్కులు' అంటారు. అందువల్ల ఈ వేదాన్ని ఋగ్వేదం అంటారు. ఇరవైఒక్క శాఖలున్న ఋగ్వేదంలో రెండు శాఖలు మాత్రమే వున్నాయి. ఈ వేదంలో వ్యవసాయ విధానాలు - వ్యాపార ధర్మాలు - యారీ - ఓడలు తయారుచేసే పద్ధతి - రైలుబండి తయారుచేసే - మొదలైన అత్యాధునిక సర్వశాస్త్ర జ్ఞానం ఈ ఋగ్వేదంలో

- యజుర్వేదం -

కృష్ణయజుర్వేదం, శుక్లయజుర్వేదం అని రెండు భాగాలు. ఈ యజుర్వేదంలో కర్మసిద్ధాంతం -గణితశాస్త్రం - ఆరోగ్యశాస్త్రం - అంతరిక్షశాస్త్రం - సృష్టిరహస్యం - బ్రహ్మవిద్య మొదలైన శాస్త్రాలున్నాయి.

- సామవేదం -

సామవేదం అంటే గానవేదం అన్న మాట. ఈ వేదాన్ని పాటలు పాడినట్లుగా గానం చేయవచ్చు. వేయి శాఖలు కల్గిన సామవేదం అన్ని శాఖలూ లేవు. కేవలం ఒకే ఒక శాఖ లభిస్తూవుంది.

- అధర్వణ వేదం -

తొమ్మిది శాఖలు వున్న ఈ వేదం యిపుడు ఒక శాఖమాత్రమే వుంది. సృష్టి రహస్యం - బ్రహ్మవిద్య - దైవప్రార్ధన - నియమాలు - బ్రహ్మచర్యం - దేవోపాసన మొదలైన శాస్త్రాలున్నాయి.

అనంత వేదరాశిని పరాశరమహర్షి పుత్రుడైన వ్యాసమహర్షి నాలుగు భాగాలుగా చేశాడు. చతుర్వేదాలు సంపూర్ణంగా మనకు లభించుటలేదు. ఇది మన ప్రారబ్దం. ఈ నాలుగువేదాలకూ నాలుగు "ఉపవేదాలు" వున్నాయి.

- ఉపవేదాలు -

1. ఆయుర్వేదం 2. ధనుర్వేదం 3. గాంధర్వ వేదం 4. అర్ధవేదం.

ఆయుర్వేదం వైద్యశాస్త్రానికి, ధనుర్వేదం యుద్ధశాస్త్రానికి, గాంధర్వవేదం నృత్యగానాలకు, అర్ధవేదం ధనసంపాదనకు వుపయోగించే శాస్త్రాలు.

వేదాలు మానవులకోసం, మానవ వికాసంకోసం సృష్టించబడ్డాయి. దురదృష్ట విషయమేమంటే వేదాలకు "పేటెంట్ హక్కుల్ని" జర్మనీ దేశం హస్తగతం చేసుకొంది. ఇది ఆశ్చర్యమూ అవమానమూ కలిగించే విషయం.

✦☆✦

మనుస్మృతి సంస్కృతి మంచిదా?

స్మృతి అంటే ధర్మం.

పరాశర, గౌతమ, నారద యాజ్ఞ వల్క్య అత్రి మొదలైన స్మృతులు లెక్క లేనన్ని వున్నా, పద్దెనిమిది స్మృతులకే గౌరవాదరాలు వున్నాయి. మను - పరాశర-వశిష్ఠ-శంఖ- లిఖిత - అత్రి-విష్ణు-హరిత-యమ-అంగీరస -ఉశన-సంవతర్తన-బృహస్పతి- కాత్యాయన -దక్ష -వ్యాస - యాజ్ఞ వల్క్య - శాతాతప - అనే పద్దెనిమిది స్మృతి శాస్త్రాలు అంగీకార యోగ్య మైనా మనుస్మృతిని లక్షల సంవత్సరా లకు నెట్టి వేసినా మను మహర్షి చెప్పి నంత విపులంగా ఏ స్మృతులూ లేవు.

> ఆనాటికాలంలో వ్రాసిన ప్రతిదాన్నీ ముద్రించే సౌలభ్యం లేదు. తాళ పత్రాలే శరణ్యంగా వుండేరోజులవి. వ్యాస మహర్షికి ముందే మనుస్మృతి తాళపత్ర గ్రంధంగా వుండేది. కుల పిచ్చి పట్టిన కొందరి మూర్ఖులవల్ల మనుస్మృతి స్వరూపమే మారి పోయింది. ఈ నిజాన్ని ఈనాటి మహా పండితులందరూ అంగీకరి స్తున్నారు. విమర్శిస్తున్నారు.

మనమిక్కడ తెల్సుకోవల్సిన విషయం ఒకటుంది.

వ్యాస పురాణాలనూ, మను స్మృతి వంటి ధర్మగ్రంధాలనూ, చాలా మంది పండితులు స్వార్థపరులు మార్పులు చేసి చేర్పులు కూర్పులు కల్పించారు. చతుర్వర్ణాలలో మాయని మత్సరాన్ని పెట్టారు. నాలుగవ వర్ణాన్ని యిష్టం వచ్చినట్లు చిత్రీకరించారు.

మనుస్మృతి మొత్తం మనుమహర్షి వ్రాసింది కాదు.

వేదాలలోలేని, వేదాలు చెప్పని, వేదాలు అంగీకరించని ఈ కుల మహా మ్మారిని సృష్టించిందెవరు? మానవ హితం కోరిన మహర్షులు కాదు. అడవులలో ఆకులు కందమూలాలు తిని జీవించే సన్యాసులకు వర్ణ విబేధాలు కల్గించే అవసరం వుండదు. తమ బ్రతుకులు చెల్లటానికీ, తమ సంతతి బ్రతకటానికీ పురాణాలనూ స్మృతులను మార్చివేశారు. రకరకాల దేవుళ్ళను సృష్టించారు.

అనేక మూఢనమ్మకాలను కల్పించారు. వండుకొని తినేముందు బియ్యంలోని రాళ్ళనూ మట్టిగడ్డలనూ, వడ్లనూ ఏరిపారవేసి శుభ్రపరిచినట్లుగా మనుస్మృతిలోని కొన్ని అనంగీకార శ్లోకాలను తొలగిస్తే అంతటి గొప్ప ధర్మశాస్త్రం మరొకటి వుండదు.

సంస్కృతభాష అందరికీ అన్ని వర్గాలవారికీ లభ్యం కానందువల్లనే వేదాలు నాదాలుగా మిగిలిపోయాయి. శ్రీసామాన్యుని చేరలేకపోయాయి. చివరకు సంస్కృతమే మృతభాషగా మిగిలిపోయింది.

అవకాశంవుంటే, ఆలోచనాతత్వం వుంటే, అవలోకనాభావంవుంటే, ఒకసారి సావధానంగా మనుస్మృతిని యిష్టంగా చదవండి.

మనువులోని మహనీయతను దర్శించండి.

✦☆✦

స్వర్గ - నరకాలు నిజమేనా?

స్వర్గం అంటే సంతోషం! నరకం అంటే దుఃఖం!

మనిషి మరణించిన తరువాత కర్మఫలం అనుభవిస్తాడు. పాపాలు చేసినవాడు అనేక నీచాతినీచమైన జన్మలు ఎత్తుతాడు. క్రిమికీటకాలుగా పుడతాడు. హీనబాధను అనుభవిస్తాడు అంటున్నది ధర్మశాస్త్రం. ఇది కృత త్రేతాయుగాల పద్ధతి! ద్వాపర కలియుగాల ధర్మం వేరుగా వుంటుంది.

ఈ కలియుగ పాపఫలం అలా కాదు. ఈజన్మలో చేసిన పాపాన్ని ఈ

> ధర్మమార్గాన నడిచేవాడికి ధనం వుండదు. సుఖం వుంటుంది. పచ్చడి మెతుకులనైనా హాయిగా కడుపు నిండా తిని కంటినిండా నిద్రపోతాడు. సంతృప్తిగా జీవిస్తాడు. దేహశ్రమ వుండటంవల్ల రోగాలు రావు. మృత్యువు కూడా త్వరగా దగ్గరకు రాదు. భార్య ప్రేమగా చూస్తుంది. బిడ్డలు దేవునిలా పూజిస్తారు. ఇంత కన్నా స్వర్గం ఎక్కడ ఉంటుంది. ఇంతకు మించిన సుఖం స్వర్గం ఏమీ లేదు. ఆరోగ్యానికి మించిన ఐశ్వర్యం లేదు గాక లేదు.

జన్మలోనే అనుభవించాలి. ముందు జన్మకు మోసుకొని వెళ్ళే అవకాశం లేదు. కలియుగం వేగయుగం. ప్రతిదీ వేగంగానే జరుగుతాయి. ఎందుకంటే 'చచ్చిన తరువాత దొరికే నమ్మకంలేని స్వర్గం కన్నా, ఈ నిముషాన ఇపుడు దొరికే సుఖమే మిన్న' అనే అవివేకులే ఈ యుగంలో ఎక్కువ.

"పాపాలు, మోసాలు, దౌర్జన్యాలు చేసేవారందరూ సుఖంగానే వుంటున్నారు. మంచిని నీతిని ధర్మాన్ని నమ్మిన వారికే కష్టాలు కలుగుతున్నాయి. అసలు దేవుడెక్కడున్నాడు! దేవుడుంటే ఈ విధంగా ఎందుకుంటుంది" అనుకొనే వారు మనలో చాలామంది వున్నారు. ఈ ఆలోచనా విధానం తప్పు. తప్పులు చేస్తున్నవారు శిక్షను అను భవిస్తూనే వుంటారు. అయితే అది మనకు తెలిసే విధంగా చూచే విధంగా వుండదంతే!

అన్యాయంగా అపర శ్రీమంతుడైనవాడు కారుల్లో తిరుగుతాడు. పెద్ద పెద్ద భవంతులలో వుంటాడు. ఇది మన కళ్ళకు కన్పించే విషయం. కాని మనకు తెలియని నూరారు సమస్యలు వాడ్ని నలిపి వేస్తుంటాయి. లోలోపల ఏడుస్తూనే పైపైకి దర్జాలు చూపిస్తుంటాడు. షోకులు పోతుంటాడు. దర్పాలు ప్రదర్శించేస్తుంటాడు. వాడి నిజజీవితంలోకి తొంగి చూస్తే నిజానిజాలు తెలుస్తాయి. బయట వున్నపుడు ఎంతోమందికి దడ పుట్టిస్తాడు; ఇంట్లో పెళ్ళాం పిల్లలు మాట వినరు! రంభ లాంటి భార్య వుంటుంది సుఖపడేందుకు ఆరోగ్యం లేదు! కావల్సినన్ని నోట్ల కట్టలు వుంటాయి; ఏం తిన్నా జీర్ణం కాదు! నిద్రించటానికి ఎ.సి రూములు మెత్తని పరుపులు వుంటాయి. సుఖంగా ఒక్క గంట కూడా నిద్రపోలేడు! నడవటానికి కీళ్ళనొప్పులు; కూర్చోవటానికి గ్యాస్ట్రబుల్, తినటానికి అజీర్ణం; తినకపోతే ఆకలి! ఇది నరకం కాదా! ఇంతకు మించిన నరకం ఏముంది?

సుఖం అంటే డబ్బుకాదు. బంగళాలు, కార్లు కాదు.

ధర్మపరమైన సామాన్య జీవితమే స్వర్గం.

✦☆✦

పూర్వం దశావతారాల్లో "బుద్ధావతారం" లేదా?

సిద్దార్ధుడే జ్ఞానవంతుడై బుద్ధుడయ్యాడు

ఇపుడు నేపాల్‌దేశంలో వున్న 'కపిలవస్తు' బుద్ధుని జన్మస్థలం. క్రీస్తు పూర్వం 563 - 483 బుద్ధుని జీవితకాలం. జైనమతస్థాపకుడు మహావీరుడు కూడా బుద్ధుని కాలంవాడే (569 - 527).

క్రీస్తుకు పూర్వం వేయి సంవత్సరాలపుడు భారతదేశంలో యజ్ఞయాగాదులు విపరీతంగా నడుస్తుండేవి. బ్రాహ్మణవర్గం మహోన్నతంగా వుండి రాజగౌరవాలందుకొంటున్న రోజులవి. అప్పటికి కృష్ణావతారం ముగిసి తొమ్మిదివందల సంవత్సరాలైంది.

ఆనాడు హిందూమతంలో యింతమంది దేవుళ్ళు లేరు.

వేదాలలో జ్ఞానకాండ, కర్మకాండ అని రెండు విబాగాలున్నాయి. వేద పండితులందరూ కర్మకాండను జీవనోపాధిగా చేసుకొని జ్ఞానకాండను వదిలి వేశారు. యజ్ఞయాగాదులకు మాత్రమే పనికివచ్చే వేదజ్ఞానం వరకు పదిల పరచుకొని కంఠపాఠం చేశారు.

బుద్ధుడు జ్ఞానవంతుడయ్యేనాటికి భారతదేశపు యజ్ఞాలలో యాగాలలో పశుబలులు యధేచ్ఛగా జరుగుతుండేవి. ఈ జంతుబలిని బుద్ధుడు తీవ్రంగా నిరసించాడు. తన శిష్యవర్గంతో దేశమంతా పర్యటించి ఆనాటి వేదసంస్కృతిని తీవ్రంగా విమర్శిస్తూ తన అహింసావాదాన్ని సర్వజనావళికి వినిపించి కులమత బేధం లేకుండా లక్షలాదిమందిని తన శిష్యులుగా చేర్చుకొన్నాడు. విగ్రహ పూజను, జంతుబలులను వ్యతిరేకించి యజ్ఞయాగాలను నిలిపి వేయటంలో సంపూర్ణంగా కృతకృత్యుడయ్యాడు. బుద్ధుని ప్రభంజనం వైదిక మతాన్ని ఒక వూపు వూపింది. ఎందరో రాజులు జమిందారులు బౌద్ధమతాన్ని స్వీకరించారు. బుద్ధుని తత్వజ్ఞానానికి ఎందరో పండితులు సనాతన వాదులు ముగ్దులై దాసోహమయ్యారు. అష్టాంగ ధర్మాన్నిస్వీకరించారు. అష్టాంగ ధర్మం అంటే ఎనిమిది శరీర ధర్మాలను పాటించటం.

1. మంచి దృష్టి. 2. మంచి సంకల్పం 3. మంచి మాట 4. మంచి పని 5. మంచి జీవితం. 6. మంచి వ్యాయామం 7. మంచి జ్ఞానం 8. మంచి సమాధి. ఈ ఎనిమిది అష్టాంగమార్గం అని అంటారు.

యజ్ఞాలను, యాగాలను, విగ్రహపూజను, మంత్రాలను బుద్ధుడు అంగీకరించలేదు. బుద్ధుని అహింసామార్గాన్నే జైనమతం కూడా అవలంభించింది. హిందువులు ఎందరో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారు. మన దేశమే కాకుండా తూర్పు ఆసియా ఖండమంతా వ్యాపించింది. ఈనాడు ప్రపంచ బౌద్ధుల సంఖ్య 35 కోట్లు. ప్రపంచ మతాలన్నిటిలోకి బౌద్ధమతం గొప్ప మతం. ఈ మతంలో కులవిభేదాలు స్త్రీ పురుష వ్యత్యాసాలు వుండవు. ఇన్ని ఎన్నెన్నో కారణాలవల్ల విష్ణు అవతారాలలోనికి బుద్ధావతారాన్ని తీసుకొన్నారు. దాదాపు వేయి సంవత్సరాలక్రితమే జరిగి వుంటుంది. "అహింసా పరమోధర్మః".

✦☆✦

లక్ష్మికి వున్నంత గౌరవం సరస్వతికి లేదేమిటి?

శ్లో॥ కేయూరాణి నభూషయంతి వపుషం హారా న చంద్రోజ్వలా
న స్నానం నవిలేపనం నకుసుమం నాలంకృతా మూర్ధజాః
వాణ్యేకా సమలంకరోతి వపుషం యా సంస్కృతా ధార్యతే
క్షీణ్యంతే, కిల! భూషణాని సతతం వాగ్భూషణం భూషణమ్ ॥

మనిషికి ఎన్ని బంగారు ఆభరణాలున్నా అవి ధరించినపుడు మాత్రమే అందాన్ని యిస్తాయి. విద్యా అనే ఆభరణం మనిషికి సదా ఆభరణంగా వుండి కీర్తిని గౌరవాన్ని తెచ్చిపెడుతుంది.

ధనవంతుడు తన వూరికే గొప్పవాడు. విద్యావంతుడు దేశానికే గొప్పవాడు.

ధనంతో ఫలం కొనగలం! ఫలితాన్ని కొనలేం!

లక్ష్మీదేవి సరస్వతికి అత్తగారు అవుతుంది గదా! అత్తగారి అధికారం ఎంతటిదైనా కోడలి అధికరణం తక్కువదేమీ కాదు. ధనం ఏ కారణంగానైనా

తరిగిపోవచ్చు. విజ్ఞానం నానాటికీ పెరగటమే గాని తరిగిపోవటం వుండదు. ధనాన్ని దాయాదులు భాగం పొందవచ్చు. విద్యను ఎవరూ భాగం పంచుకోలేరు. ఎవరూ దొంగిలించలేరు. ఏనుగు ఎంత పెద్దది అయినా తొండం చిన్నదైనా దేని విలువ దానిదే మరి. అవునుగదా!

అజ్ఞానవంతులున్నచోట సరస్వతి వుండదు. అందుకే సరస్వతీ మందిరాలు, సరస్వతీ ఆలయాలు మనకు లేవు. విద్యావంతుల హృదయమే సరస్వతీ మందిరం. ఆమెకు అదే తగిన స్థలం.

ధనకాముకజగత్తులో ధనవంతుడే భగవంతుడు. కాని వివేక ప్రపంచంలో విద్యావంతుడే సృష్టికర్త. విజ్ఞాన జగత్తులో ప్రజ్ఞావంతుడే పరమాత్మ. మదంతో మేధస్సు రాదు. ధనంతో విజ్ఞానం రాదు.

ఈనాడు మనం అనుభవిస్తున్న సుఖాలన్నీ మేధావంతులు విజ్ఞానులు ప్రసాదించినవే గాని ధనవంతులు ఇచ్చినవి కాదు. ఈ మాత్రం జ్ఞానం కలిగినవాడు ఎవడైనా విద్యావంతునికి నమస్కరించి గౌరవిస్తాడు.

జ్ఞానశక్తికి మించిన మరొక శక్తి ఈ జగత్తులో లేదు.

ఏడంతస్తుల మేడకట్టినా తానుండబోయేదీ, తనకు కావల్సిందీ ఆరడుగుల స్థలం మాత్రమే గదా అన్న జ్ఞానం కలిగిననాడు తపనపడిపోతాడు తల్ల క్రిందులైపోతాడు. తనకుతానే గులకరాయిలా కన్పిస్తాడు.

ధనం క్షణం కన్పించే మెరుపుతీగ. విద్య తనవారందరికీ వెలుగు చూపించి నడిపించే దారిదీపం. మెరుపుకున్నంత కాంతి దీపానికి వుండదు. దీపానికి వున్న ప్రయోజనం మెరుపుకి వుండదు. డబ్బుతో మందులు కొనవచ్చు. వైద్యుని కొనలేవు. ఒకానొక సమయంలో వైద్యుని కూడా కొనవచ్చు వైద్య విజ్ఞానాన్ని కొనలేవు.

విజ్ఞానమే సరస్వతీమాత! ఎవరైనా భార్యను కొనగలరు. తల్లినిమాత్రం కొనలేరుగదా!

✦☆✦

అలిగి అత్తవారింటికి వెళ్ళకూడదా?

తనవారిమీద అలిగి అత్తింటికి వెళ్ళకూడదు!

తన పుట్టినిల్లు వదలి భార్య పుట్టింటికి వెళ్ళేవాడు మూర్ఖుడు.

'అన్నదమ్ములు చావు కోరితే బావమరుదులు బ్రతుకు కోరతారు' అనే సామెత మనకే వుంది. కాని, ఉత్తరభారతదేశంలో 'ఘర్ మే సాల ఖేత్ మే నాలా" వుండకూడదంటారు. అంటే "ఇంట్లో బావమరది, పొలంలో వాగు వుండ కూడదు" అని అర్థం. మహాభారతంలో ధృతరాష్ట్రుడు బావమరదియైన శకునిని యింట్లో పెట్టుకోవటంవల్లనే తీరని నష్టాన్ని అనుభవించాడు కాబట్టి బావ యింటికీ బావమరుదుల యింటికీ చుట్టం చూపుగానే వెళ్ళాలేగాని శాశ్వతంగా వుండిపోవటానికి వెళ్ళరాదని ధర్మశాస్త్రం.

మన సంప్రదాయంలో ఇల్లరికం వెళ్ళటం అనే పద్ధతి ఒకటుంది. అత్తమామలకు మగసంతానం లేక ఆడపిల్ల ఒక్కతే వుంటే అల్లుని ఇల్లరికం తెచ్చుకోవటమనే సాంఘిక సంప్రదాయం వుంది. కాని యిది పరాశ్రయ జీవనమే అవుతుంది. పరులయింట బ్రతకటమంటే సర్వ స్వాతంత్ర్యాన్నీ పోగొట్టుకొని తాకట్టు జీవితం గడపటమే గదా! ఆర్థిక, వైయక్తిక, ధార్మిక, సాంఘిక, మానసిక, స్వేచ్ఛల్ని మనకుమనమే దోపిడీ చేయించుకోవటమే అవుతుంది.

అలిగి అత్తవారింటికి, చెడి చెల్లెలింటికి వెళ్ళరాదని ఈనాటికీ పెద్దలు చెబుతుంటారు. పెద్దలమాట ఏదైనా అనుభవ పూరితంగానే వుంటుంది గదా! పూర్వకాలంలో తప్పుచేసిన కొడుకుని సంవత్సరకాలం అత్తవారింటికి పంపించే వారట. అప్పటికీ సరికాకపోతే మరొక ఆరునెలలు వుంచేవారట.

అత్తమామలు చెడ్డవారని చెప్పటం వుద్దేశ్యంకాదు. అత్తమామలు తల్లి దండ్రులతో సమానమైనా, అల్లుడు కొడుకుతో సమానమైనా మనసుల్లో వుండే వ్యతిరిక్తధోరణి పనిచేస్తూనే వుంటుంది. అభిప్రాయ భేదాలు వస్తూ, చిన్నపుచ్చు కోవటం జరుగుతూనే వుంటుంది. పుట్టింట వున్న భార్యకు ఎంత వద్దనుకొన్నా

అహంకారం ఆవహిస్తూనే వుంటుంది. ఫలితంగా భార్యాభర్తల మధ్య అనురాగం సన్నగిల్లిపోయి దాంపత్య సుఖాలు దూరమవుతాయి. పురుషునికి సహజంగా వుండే అహం దెబ్బతినిపోతుంది. తల్లిదండ్రులు తిట్టినా దులుపుకొని వెళ్ళేవానికి అత్తమామలు ఒక్క చిన్నమాట అన్నా అతి పెద్ద అవమానం జరిగినట్లుగా అనిపిస్తుంది. ఇది సర్వసహజ గుణం. దీనికి మందులేదు.

అత్తవారింట్లో అర్ధాంగిదే పెత్తనంగా వుండటం, ప్రతి చిన్న విషయానికీ అత్తమామలు తమకూతురినే సమర్థించటం, పురుషాధిపత్యం జీర్ణించుకోలేదు. ఫలితంగా విడిపోవటాలు జరుగుతాయి. దీని ఫలితం పుట్టిన పిల్లలు అనుభవించాలివస్తుంది గదా!

✦☆✦

ద్వైత - అద్వైత మతాల వ్యత్యాసమేమిటి

జీవాత్మ - పరమాత్మ వేరువేరని చెప్పటం ద్వైతమతం.

పరమాత్మ - జీవాత్మ ఒక్కటేనని చెప్పటం అద్వైతమతం.

అద్వైతమతాన్ని శంకరాచార్యులు స్థాపించారు. (క్రీ.శ. 788-820) విశిష్ఠ అద్వైత మతాన్ని రామానుజాచార్యులు క్రీ.శ. (1017-1317) స్థాపించారు.

మధ్వాచార్యులు ద్వైతమతాన్ని (క్రీ.శ. 1238-1317) స్థాపించారు.

అద్వైత స్థాపకుడైన శ్రీశంకరాచార్యులు మహావేదాంతి! ద్వైతమతస్థాపకుడైన శ్రీ మధ్వాచార్యులు తర్క మీమాంస పండితుడు! శ్రీరామానుజాచార్యులు విశిష్టాద్వైత వేదాంతి! శంకర రామానుజులు ఇద్దరూ తమిళులే! మధ్వాచార్యులు కర్ణాటక దేశస్థుడు.

శంకరాచార్యుల అద్వైత సిద్ధాంతం పండితులను ఆకర్షించిందేకాని సామాన్యులకు విశదపరచటంలో సఫలం కాలేకపోయింది. మనకు కనుపించని పరమాత్మ, మనలోవుండే జీవాత్మ, ఒక్కటే అయినపుడు యిక పాపపుణ్యాల

విచక్షణ పాపపుణ్యాల విభాగం ఏమిటో సామాన్యులకు అర్థంకాలేదు. సామాన్యులకే గాదు విద్యావంతులకే కొన్ని అనుమానాలు అలాగే వుండి పోయాయి. వివరణ యిచ్చేవారు వివరించి చెప్పేవారు లేరు. శంకరాచార్యుల తరువాత వచ్చిన రామానుజాచార్యులు వీర అద్వైతుడు. పరమవీర వైష్ణవ ప్రియుడు. శైవమతమంటే ఈయనకు సరిపడేదికాదు. పదకొండవ శతాబ్దంలో కొన్ని శైవదేవాలయాలను వైష్ణవదేవాలయాలుగా మార్చిన వైష్ణవ భక్తుడీయన. ముఖ్యాతి ముఖ్యమైన ఉదాహరణ ఏమిటంటే ఈనాటి తిరుపతి తిరుమల దేవస్థానం మొదట శైవాలయంగా వుండేదట. వేంకటేశ్వరుడు పురుషమూర్తి కాదనీ, మహాశక్తిదేవతను రామానుజాచార్యులు రాత్రోరాత్రికి మార్పించివేశాదనీ, శక్తి విగ్రహానికి వున్న పది చేతులలో ఎనిమిది చేతులను నేర్పరులైన శిల్పుల ద్వారా తీయించి కన్నులు కన్పించకుండా తిరునామాన్ని పూయించాదనీ, ఇప్పటికీ వేంకటేశ్వరుని ప్రతిమకు చేతిగాజులు కాళ్ళపట్టీలు సన్నని నడుము, స్త్రీ వక్షస్థలము వున్నాయనీ వీరశైవులు వాదిస్తుంటారు. రామానుజాచార్యుదే వేంకటేశ్వరుని కథను కల్పించి ప్రచారం చేయించాదనీ చెబుతారు. 11వ శతాబ్దానికి పూర్వం వేంకటేశ్వరుడు అనే దేవుదు లేదనీ, వేంకట + ఈశ్వర వేంకటేశ్వరునిగా పాపభయంతో ఈశ్వర నామాన్ని మిగిల్చి వుంచారని వాదిస్తున్నారు. 'లోగుట్టు పెరుమాళ్ళకెరుక' అనే సామెత ఈ విషయానిదే.

ద్వైతమతం అద్వైతమతం ఈ రెండు మతాలు, హేతువాద భావాలతోను, అవైదిక సిద్ధాంతాలతోనూ వున్న బౌద్ధ ధర్మాన్ని, దాదాపుగా భారతదేశంనుండి తరిమివేయటంలో సఫలీకృతమయ్యాయని చెప్పక తప్పదు. బుద్ధుడ్ని దశావతారాలలో చేర్చుకొన్నా, బౌద్ధ దేవాలయాలు బుద్ధభక్తులు మనకు కనిపించక పోవటంలోని మర్మం ఇదే! బౌద్ధమతం హిందూమతమై వుండి హిందూదేశమైన భారతదేశంలో పేరుకుమాత్రమే వుంది.

✦☆✦

తండ్రిదొక కులం, తల్లిదొక కులమైతే బిడ్డదే కులం?

భారతదేశం పితృస్వామ్య ప్రధాన దేశం. కొన్ని కొన్ని ప్రాంతాలలో మాతృ స్వామ్యం కూడా వున్నప్పటికీ పితృస్వామ్యమే ప్రధానంగా పరిగణనలో వుంది. ఇప్పుడుకూడా ఇదే నడుస్తూ వుంది. భార్యాభర్తలు హిందూమతస్థులై వుండి వేరువేరు కులాలవారైనా, లేక పురుషుడు ఆరోగ్యవంతుడై సంభోగశక్తి లేకగాని, ప్రమాద కారణాలవల్ల సంభోగక్రియకు పనికిరాకగాని, భర్త అంగీకారంతో మరొకరివల్ల గర్భవతి అయినా, ఆ బిడ్డ తండ్రి కులానికే సంబంధించినది అవుతుంది. ఇది ధర్మశాస్త్ర పద్ధతి.

పాండవులు నియోగధర్మంతో కుంతీదేవికీ మాద్రీదేవికి పుట్టారు. పాండురాజువల్ల జన్మించకపోయినప్పటికీ పాండవులే అయ్యారు. ఇక్కడ మనకు మరొక సందేహం కలుగవచ్చు. అదేమిటంటే ధృతరాష్ట్రుడు పాండురాజు కూడా నియోగ ధర్మంతోనే బ్రాహ్మణుడైన వ్యాసమహర్షికి పుట్టారు గదా! ధృతరాష్ట్ర పాండురాజులు బ్రాహ్మణులు కాలేదుగదా అనే సందేహం రావచ్చు స్త్రీపురుష సంయోగానికి ముందే ఒక ఒప్పందం జరిగివుంటే ఒప్పంద ప్రకారమే పుట్టిన బిడ్డకు కులం సంక్రమిస్తుంది. ఇది కూడా ధర్మశాస్త్ర నియమమే. ధృతరాష్ట్ర, పాండురాజులు 'క్షేత్రజులు' అని అంటారు. కన్యగా వుండి కుంతికన్న కర్ణుడ్ని 'సహోఢుడు' అని అంటారు.

నైష్ఠిక బ్రహ్మర్షి అయిన వశిష్ఠ మహర్షి దేవవేశ్య ఊర్వశికి పుట్టాడు. అంతమాత్రాన తల్లికులం వశిష్ఠునికి సంక్రమించలేదు. ద్రౌపదీదేవి ద్రుపద దంపతులకు పుట్టలేదు. యజ్ఞగుండం నుండి జన్మించింది. అయినా ద్రుపదుని కూతురే అయింది. సీత కూడా జనకరాజుకి భూమిలో దొరికింది. అయినా జనకపుత్రిగానే కీర్తిపొందింది. జనకుని కుమార్తె జానకి. ద్రుపదుని కుమార్తె ద్రౌపది. దశరథుని కొడుకు దాశరథి. ఈ విధంగా ఈ పద్ధతి కొన్నిచోట్ల కను పించదు. ఇది పరిగణనలోకి రాదు.

హిందువులది పితృస్వామ్యమైతే, మహమ్మదీయలది మాతృ ప్రధాన్యత మతం. మనం చిన్నాన్న సంతతినీ చిన్నమ్మ సంతతినీ పెండ్లిచేసుకోం. మహమ్మదీయులు అక్కబిడ్డను చెల్లిలిగా భావిస్తారు. మాతృస్వామ్యత గాబట్టి చిన్నాన్న బిడ్డల్ని పెండ్లి చేసుకోవచ్చు. మనకున్నన్ని కులాలు మహమ్మదీయలకు లేవుగదా!

అయోగ్యుడైనా, అసమర్థుడైనా, భర్తవున్నా, వదిలివేసినా, మరణించినా బిడ్డకు తండ్రికులమేగాని తల్లికులం రాదు. తండ్రి వంశం తండ్రిగోత్రం, తండ్రిప్రవర బిడ్డకు సంక్రమిస్తాయి. తొమ్మిది నెలలు మోసి తనరక్తం బిడ్డకు నింపి జన్మనిచ్చినా తల్లికులం బిడ్డకురాదు. ఇప్పటికి యిలా వుంది! ముందుకాలంలో కులాలు పోయి మార్పులు వస్తాయేమో! చూద్దాం!

✦☆✦

బాబాలు, స్వాములు, దేవుని దూతలా?

మనదేశంలో స్వాములకూ, బాబాలకు కొదవలేదు. పంటవదలి పరిగి కోసం ఎగబడే తత్వం మనది. పరమాత్మను మరచిపోయి పరివ్రాజకులకోసం ఎగబడటమే ఎక్కువ. ఎందుకిలా జరుగుతున్నదంటే, చెప్పగలిగిన సమాధానం ఒక్కటే! అతిత్వరగా ధనం సంపాదించాలి. అతిత్వరగా అభివృద్ధి సాధించాలి. అతిత్వరగా పదవులు పొందాలి. శాంతి, సుఖం, ఆనందం, అభిలాష, అతిత్వరగా పొందగలగాలి.

ఎంత అవివేకం యిది! ఎంత అక్రమం యిది! త్వరగా లభించేది త్వరగా నాశనమై పోతుంది. ఒక్కరోజులో పుట్టే కీటకాలు ఒక్కనాటితోనే మరణిస్తాయి. అత్యంత వెలుగును ప్రసాదించే మెరుపుతీగ క్షణకాలం మాత్రమే వుంటుంది. పంది మూడు నెలల్లో పిల్లల్ని కంటుంది. పదిహేను సంవత్సరాలకు మించి జీవించలేదు. కుందేలు నెలరోజులకే పిల్లలు పెడుతుంది. రెండేళ్ళకు మించి జీవించదు. అంటే ఆలస్యంగా లభించేది చాలాకాలం వుంటుంది అని ప్రకృతి మనకు పాఠాలు చెబుతోంది. గమనించండి.

ప్రజ్ఞావంతులు, ఆత్మజ్ఞానం కలవారు, కర్మయోగులు, తత్వజ్ఞానులు, స్థితప్రజ్ఞులు, బాబాలను స్వాములను ఎన్నటికీ నమ్మరు. దేవునికి దూతలు, రాయబారులు, మధ్యవర్తులు వుండరు.

"దేవుడు" అంటే ప్రసాదించేవాడు. స్వీకరించేవాడు కాదు.

సృష్టి స్థితి లయ కారకుడైన పరమాత్మను మరచిపోయి గారడీ స్వాములను నమ్మ కండి. దేవుని నమ్మేవారు, నమ్మకం కలవారు ఒక్క విషయం ముందు తెల్సుకోవాలి -

"దేవుడు" అంటే ఏమిటి? ఎవరతను?

"దేవుడు" ఎక్కడ వున్నాడు? వుంటాడు?

మీరు దేవుని వునికిని కనుగొనాలంటే మీకొక మార్గం వుంది. శరీరం అలసి పోయేంతగా స్నానం చేయండి. ఎవరితోనూ ఏ విషయాలు చర్చించకండి. మనసులో ఏ విధమైన చెడు మంచి ఆలో చనలు రానీయకండి. మీరొక్కరే ఏకాంతంగా వుండి, అలజడి మరచి, పనులు విడచి, ఒక్కగంట సమయం మీకోసం కేటాయించు కోండి. ఒక జ్యోతిని వెలిగించి దానిముందు కూర్చొని నిశ్శబ్దంగా కొంత సమయం కనులు మూసుకొని ఉచ్ఛ్వాస నిశ్వాసలను స్థిరం చేయండి. మనస్సును కేంద్రీకరించి మహా మౌనం దాల్చి మహర్షులైపొండి. కొన్ని రోజులకి మీకు ఆత్మ సాక్షాత్కారం లభించి తీరుతుంది. మీ ఆలోచనా విధానం నడవడిక మాటతీరు మారి పోతుంది. దైవత్వం తెలుస్తుంది. నీలో నీకు తెలియని ఒక మహాశక్తి ప్రవేశిస్తుంది. నీ నోటిమాట దైవ వాక్యంగా నిలుస్తుంది. 'అహం బ్రహ్మోస్మి' అంటూ ఆత్మజ్ఞాన సిద్ధిని నీకు నీవే పొందుతావు.

> ఈ పురాణాలను కల్పిత కథలను నమ్మకు. వేదమార్గం గొప్పది. ధర్మం గొప్పది. నియమం గొప్పది. ఆచరణ గొప్పది. దొంగస్వాముల్ని బాబాలను నమ్మవద్దు.

✦☆✦

రుద్రాక్షల మహిమ ఏమిటి?

పవిత్ర రుద్రాక్షలను స్త్రీ పురుషులందరూ ధరించవచ్చు!

విష్ణుభక్తులకు యజ్ఞోపవీతం ఎంతటిదో, శైవభక్తులకు రుద్రాక్ష అంతటిది. బ్రహ్మ సంతతిగా చెప్పుకొనే శైవ వైష్ణవులందరికీ రుద్రాక్ష ధారణీయమే. చతుర్వర్ణాలవారికీ రుద్రాక్షమాల ధరించదగినదే. వైష్ణవ సంప్రదాయాలకున్న మడి ఆచారాలు, సంప్రదాయ బంధనాలు శైవులకు లేవు. భారతదేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలనూ కులాచార విధిలేకుండా ఎవరైనా చేతులతో ముట్టి ఆత్మానందాన్ని పొందవచ్చు. శైవ సంప్రదాయాని కున్న మహాసౌభాగ్యమిది.

ద్రవిడ దేశంలో శ్రీబసవేశ్వరుడు శైవసాంప్రదాయానికి క్రొత్త దారులు వేశాడు. కులమత వివక్ష లేకుండా కడజాతిని కూడా కనికరించి శివలింగ ధారణ చేయించి లింగాయతులను చేశాడు. శైవ మతానికి ఎంతో సేవ చేశాడు. ఇదొక మతక్రాంతి. శైవ సంక్రాంతి!

> రుద్రాక్షలు తెలిసి ధరించినా తెలియక ధరించినా రుద్రాక్షల మాహాత్మ్యం అనుభవంలోనికి వస్తుంది. తప్పుడు మార్గాన నడిచేవారు, సత్ప్రవర్తన లేనివారు, దురాచార మనస్కులు రుద్రాక్షలు ధరిస్తే పరివర్తన చెంది సన్మార్గులు అవుతారని భారతీయ విశ్వాసం. స్కంద పురాణం కూడా ఇదే చెబుతుంది. రుద్రాక్షలు ధరించ టానికి నిజంగా ముహూర్తాలు నక్షత్రాలు చూడనవసరంలేదు. మంచి మనస్సు కల్గటమే మంచి ముహూర్తం.

రుద్రాక్షకు ఐదుముఖాలు మూడు ముఖాలు ఆరు ఏడు ముఖాలు ఇలా రకరకాలుగా వుంటాయి. ఆ రుద్రాక్ష గొప్పది ఈ రుద్రాక్షకు మహిమ ఎక్కువ అని అబద్ధపురాణాలు చెప్పే అర్ధపండితులు ఎందరో వున్నారు. ఇవన్నీ కల్పిత కథలు. మనకు లభించే రకరకాల ముఖాల రుద్రాక్షలు హస్త నైపుణ్యంతో చెక్కినవి. మనిషికి భక్తి దైవనమ్మకం ముఖ్యంగాని రుద్రాక్ష ముఖ్యం కాదని గుర్తించాలి. నమ్మకం మంచిదే. మూఢనమ్మకం మంచిది కాదు. భక్తిని మించిన 'తిక్క' మంచిది కాదు. అమ్మ మనకు పాలు యిస్తుంది. అమ్మకు మనం పాలివ్వం. దేవుడు మనకు అన్నీ యిస్తున్నాడు; ఇస్తాడు; నీవేమీ దేవునికి సమర్పించ నక్కర్లేదు.

రుద్రాక్షలను వుంగరాలలో ధరించరాదు. రుద్రాక్షమాలతో భార్యా సంగమం చేయకూడదు. ఒకరి రుద్రాక్షలను మరొకరు ధరించ కూడదు. రుద్రాక్షమాలను ధరించి నిద్రపోకూడదు. స్త్రీలు ఋతు సమయాలలో తీసి వేయాలంటారు. (ఋతుక్రమం స్త్రీ సహజం. దీనిపై నాకు నమ్మకం లేదు)

దయచేసి పొట్టకూటి కోసం వ్రాసిన పుక్కిటి పురాణకథలు నమ్మవద్దు.

పురాణాలు ఏవీ వేదసమ్మతం కావు.

అమాయక జన సముదాయానికి మతంపేర, కులంపేర, దేవుళ్ళపేర, భక్తిపేర, ధర్మంపేర, పిచ్చిపిచ్చి ఆంక్షలు, నమ్మకాలు పెట్టి కడుపులు నింపుకొనే సోమరివ్యక్తులు ఎందరో వున్నారు. ఎవరినీ నమ్మవద్దు.

దేవుడిని నమ్మండి! దురాచారాలను విశ్వసించకండి!

✦☆✦

ఈనాటి స్మృతి శాస్త్రాలు ఎవరు రచించారు?

ప్రపంచానికి ప్రపంచమే గర్వించ దగిన శాస్త్రసంపద మనకు వుంది. ఇందులో అనుమానమేలేదు. కాని..... బాధాకరమైన విషయమొకటుంది. శాస్త్రాలని చెప్పుకొనే పురాణాలన్నీ వ్యాస భగవానుడే వ్రాయలేదు. వేయి సంవత్స రాలక్రితం మనకు ముద్రణా సౌలభ్యం లేదు. వేదాలు, ఇతిహాసాలు, స్మృతులు, శాస్త్రాలు పురాణాలు మొత్తం తాళపత్ర గ్రంథాలలో బహుకొద్దిమంది వద్ద వుండేవి. ఆ బహుకొద్దిమంది చెప్పింది మనకు శిరోధార్యంగా వుండేది. వ్యాస మహర్షి పేరుమీద కొందరు స్వార్థ

> దేవుడున్నాడు. దేవుడు దయామయుడు. బ్రాహ్మణులమీద ప్రేమ, కడజాతి వానిమీద ద్వేషం, ఆయనకుండవు. పూర్వజన్మలోని పాపపుణ్యాల ఫలితంగానే ఈ జన్మలోని హెచ్చు తగ్గులు వస్తాయని వేదవాక్యం. పరిశుభ్రతలో హెచ్చు తగ్గులున్నాయిగాని మన జన్మలో హెచ్చుతగ్గులు లేవు.
>
> దేవుణ్ణి నమ్మండి! పనికిమాలిన స్వాముల్ని నమ్మకండి!

పరులు పురాణాలు సృష్టించింది మాత్రం అక్షర సత్యం. మహనీయులైన ఈనాటి పండితులు ఈ నిజాన్ని అంగీకరిస్తారు. మనుమహర్షిపేరుమీద రచించిన స్మృతులు నలభై రకాలుదొరికాయి అంటే ఇవన్నీ ఎవరు వ్రాశారు?

సంస్కృతమూల రామాయణానికీ తెలుగు, కన్నడ, తమిళ, హిందీ మొదలైన భాషల రామాయణాలకూ ఎంతెంతో వ్యత్యాసాలు వున్నాయి. మహాభారతమూ అంతే! మన పురాణకథలన్నీ సామాన్య ప్రజలకందరికీ నాటకాలద్వారా చలన చిత్రాల ద్వారా అందాయి. మాయా బజార్ చిత్రం అంతా కల్పితమే. చలన చిత్రాలలోని దేవేంద్రుడు పనికి రాని దద్దమ్మలా వుంటాడు. నందమూరి తారక రామారావు శ్రీకృష్ణపాండవీయం చిత్రం తీశారు గదా! ఆ చిత్రంలోని చాలా సన్నివేశాలు అభూతకల్పన. దాన వీర శూర కర్ణలోని కొన్ని దృశ్యాలు కూడా అవాస్తవమే. ఈ రెండు చిత్రాలకు కన్నడలోని 'తురంగా భారతం' కథ ఆధారం.

ఈ విధంగానే పురాణకథలనూ, ఇతిహాసాలనూ నిన్న మొన్నటివారు కల్పించి వ్రాస్తే, ప్రాచీన స్మృతులనూ శాస్త్రాలనూ ధర్మాలనూ అగ్రవర్ణాలవారు చొప్పించి వ్రాశారు. ఒకరు రచియించి మరొకరిపేరు పెట్టారు. చెట్టుపేరును చెప్పి కాయలు అమ్మేశారు. మనం నమ్మి కొనేశాం.

ఎవరైనా ఒక్క విషయం గుర్తుంచుకోండి.

మనకు ముక్కోటి దేవతలు లేరు. మనకు నాలుగు వర్ణాలు లేవు. నలభై కులాలు లేవు. వేల ఆచారాలు లేవు. చెట్టులు పుట్టలు కొండలు నదులు ఇవన్నీ దేవుళ్ళు దేవతలు కారు. చెట్లు పుట్టలు కొండలు మనకోసం పుట్టవు. నదులు మనకోసం ప్రవహించవు. చెట్లు మొలకెత్తటం, నదులు ప్రవహించటం వాటి వాటి ధర్మాలు.

✦☆✦

నవరాత్రులు విశిష్టత ఏమిటి

నవరాత్రులంటే తొమ్మిది రాత్రులు.

మనం స్త్రీ-పురుషదేవతల్ని వేర్వేరుగా పూజిస్తాం కాని ఆ ఇద్దరూ ఒక్కటే. అందుకే కాళిదాసమహాకవి **"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థః ప్రతిపత్తయే। జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ॥"** అంటూ శిరస్సు వంచాడు.

సంఖ్యలన్నింటిలోనికి 'తొమ్మిదవ' సంఖ్య దైవసంఖ్యగానూ, బ్రహ్మ సంఖ్య గానూ చెబుతారు. ఆశ్వయుజంలో దేవీనవరాత్రులు, చైత్రమాసంలో వసంత నవరాత్రులు, భాద్రపదమాసంలో గణపతి నవరాత్రులు అన్నీ తొమ్మిది రాత్రులు జరిపే దైవోత్సవాలే! తిరుమలలో వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు కూడా తొమ్మిది రోజులే జరుపుతారు.

మహర్షులు, తపస్వులు, యతులు, వాస్తు నిపుణులు, ఖగోళశాస్త్రజ్ఞులు, ఆగమశాస్త్ర పండితులు, వైదికాచార్యులు, అందరూ తొమ్మిదిని దైవశక్తి సంఖ్య గానే భావించి గౌరవించటం అందరికీ తెల్సిందే.

భాద్రపద ఆశ్వయుజ మాసాలలో ఆచరించే నవరాత్రులు శ్రేయోదాయక మైనవి. ఎందుకంటే క్రొత్తనీటితో నదీనదాలు ఎంతో కొంత కల్మషపూరితంగా వుంటాయి. అనారోగ్యాన్ని ఉదర సమస్యలను కల్గిస్తుంటాయి. ఈ మాసాల్లో దేహశ్రమ తక్కువగానూ ఆకలి ఎక్కువగానూ కూడా వుంటుంది. సస్య శాకా హారాల్లో క్రిములు కనబడకుండా వుండి ఆహారంద్వారా కడుపులోనికి ప్రవేశించి అనారోగ్య కారకాలు అవుతుంటాయి. కాబట్టే గణపతి నవరాత్రులనూ దేవీ నవరాత్రులను దగ్గర దగ్గరగా ఈ మాసాలలోనే నియమించటం జరిగింది. ముఖ్యంగా రాత్రులలో జరిపే ఈ నవరాత్రుల పూజోపాసన కార్యక్రమా లకు తప్పనిసరిగా వుపవాసం వుండి తీరాలి. రాత్రి సమయాలు భోజనం నిషిద్ధం. ఈ వుపవాసక్రియవలన శరీరం శక్తిని పుంజుకుంటుంది. 'దేహదండన' వల్ల తమోశక్తి హరించి దివ్యతేజస్సు నరనరాలకు ప్రాకుతుంది. ఆయుఃశక్తి వృద్ధి చెందుతుంది.

శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక మాసాలల్లో ఎక్కువగా వ్రతాలు పూజలు వుపవాసాలు పుణ్యస్నానాలు ఏర్పరచటంలోని మూల వుద్దేశ్యం యిదే! మార్గశిర మాసానికి మనిషి బలంగా స్థిరంగా వుంటాడు గాబట్టి మార్గశీర్ష మాసాన్ని విష్ణుమాసంగా చెబుతారు. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ "మాసానాం మార్గశీర్షో హం" అంటాడు. పన్నెండు మాసాలలో మార్గశిరమాసం విష్ణుప్రియమైనది.

శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తీకాలు నాలుగు స్త్రీల వ్రతాలకు నోములకు, ఉపవాసాలకు సంబంధించిన నెలలే! ఈ నాలుగు నెలల కాలం స్త్రీలు భగవత్కార్యాలలో పవిత్రంగా వుండి పురుషులకు దూరంగా వుండటంవల్ల ఎండలు మంటలు రేపే వైశాఖమాసంలో కాన్పు రాకుండా తప్పించవచ్చుననే మహర్షుల దూరదృష్టికి శతకోటి వందనాలు!

✦☆✦

విజాతి వివాహాలకు సనాతన మన్నన వున్నదా

మానవకులం నాలుగు భాగాలుగా విడివడి పోవటానికి కారణం చిన్నా గొప్ప తారతమ్యంకాదు. శ్రీమంతుడు పేదవాడన్నకారణం కాదు. భూమికి గుర్తులుపెట్టి గట్లు పోసి సేద్యం చేసుకొనే రోజులు కావవి. ఈనాటి రంగు కాగితాల రూపాయలే కాదు బంగారు నాణ్యాలు కూడా లేనిరోజులవి. ఆహారమే ముఖ్య సాధనంగా జీవించే రోజులవి. విద్య - రక్షణ - వ్యాపారం - వ్యవసాయం అనేవి నాలుగు ధర్మాలు. ఎవరికి ఏ ధర్మం యిష్టమో ఆ ధర్మాన్ని ఆశ్రయించారు. ఇది బలవంతంగా జరిపించిన ధర్మ పరిగ్రహణం కాదు. ఈనాడు మనకు వున్న 'కులపిచ్చి' ఆనాడు లేదని చెప్పటానికి శాస్త్రీయ ఆధారాలున్నాయి. ప్రారంభంలో నాలుగు వర్ణాలుగా (వర్గాలుగా) విడివడిన మన హైందవ జాతిని ఇన్ని వందల కులాలుగా విడదీసిందెవరు? విడి పోయిందెందుకు? అందరూ వేలాది సంవత్సరాలనాటి వర్ణవిభజనను గురించి మాట్లాడుతారు. హిందూ

మతంలో 3000 సంవత్సరాల క్రితం చతుర్వర్ణ వ్యవస్థ ఏర్పడితే; ఈనాడు భారతదేశంలో కులాలు, ఉపకులాలు కలిపి 16000 వరకూ వున్నాయి. నాలుగు వర్ణాలకు పదహారువేల కులాలు అయ్యాయి.

కొన్నివందలమంది మాత్రమే ఆనాటి అగ్రవర్ణం.

కొన్నికోట్లమంది ఈనాటి ఉగ్రవర్ణం. మహోగ్రవర్ణం. ఆనాడు పాండిత్య ప్రాతిపదికగా అగ్రభాగాన ఒకరుంటే, కులప్రాదిపదికన ఈనాడు మరొకరున్నారు. 'చక్రవత్ పరివర్తంతే సుఖ దుఃఖ సుఖానిచ"!

వేదకాలంలో విజాతి వివాహ మన్నన వుంది. వశిష్ఠమహర్షి వూర్వశీ పుత్రుడు. వ్యాసమహర్షి విజాతి పుత్రుడు. భరత చక్రవర్తి విజాతి పుత్రుడు. పాండవ సంతతి విజాతి సంతతి. భీష్ముడు విజాతి సంతతివాడు. అరుంధతీ వశిష్ఠుల వివాహం విజాతి వివాహమే. ఊర్వశీ పురూరవులు - సత్యవతీ శంతనులు - యయాతి శర్మిష్ఠ - ఉషా అనిరుద్ధులు - ఈ రకంగా ప్రఖ్యాత పురుషులెందరో మరొక జాతి స్త్రీలను వివాహమాడి అర్ధాంగి స్థానం ఇచ్చారు. కులంకన్నా గుణమే గొప్పదని సమాజానికి తెలియజెప్పారు. జాతికన్నా నీతి గొప్పదని భావించారు. ఆనాటి జాతి సమైక్యతలో తొందరతనం, తొట్రుబాటు, అపరాధభావం, కాముకత్వం మొదలైనవేవీ లేవు. రుష్యశృంగ మహర్షికి దశరథుడు తన కుమార్తె నిచ్చి కన్యాదానం చేయలేదా! ధృతరాష్ట్రుడు వేశ్యస్త్రీవల్ల "యుయుత్సు"ని కనలేదా! కౌరవదాసికి వ్యాసుని వల్ల జన్మించిన విదురుడు కౌరవకుటుంబీకునిగానే వుండలేదా!

అయితే; ఇక్కడొక చిన్నమలుపు వుంది.

బ్రాహ్మణుడు క్షత్రియ వైశ్య శూద్రస్త్రీలను వివాహమాడవచ్చు. క్షత్రియుడు వైశ్య శూద్రస్త్రీలను వివాహమాడవచ్చు. కాని బ్రాహ్మణస్త్రీని వివాహమాడటం నిషేధించారు. ఇతర వర్ణాల వారికి.

✦☆✦

రావణుడు మహాపండితుడా?

దేవతలు రాక్షసులు అన్నదమ్ములు.

కశ్యపప్రజాపతికి అదితీదేవివల్ల దేవతలు, దితీదేవివల్ల రాక్షసులు పుట్టారు.

దేవదానవులిద్దరూ కశ్యపబ్రహ్మకుమారులే!

పరమేష్ఠి పుత్రుడైన పులస్త్యబ్రహ్మవంశంవాడే లంకాధిపతి రావణబ్రహ్మ!

రావణుడు తల్లి కైకశీ ఆదేశంతో బ్రహ్మను గూర్చి ఘోరతపస్సు చేసి యక్ష - కిన్నర - కింపురుష -దేవ - దానవ-సిద్ధ-సాధ్య- గరుడ - గంధర్వ - నాగ - నభశ్చరాది గణాలెవ్వరిచేత మరణం లేకుండునట్లుగా వరంపొంది; 'రావణుడు' అనే శివుని ప్రశంసను పొందాడు.

ఆనాటినుండీ "రావణబ్రహ్మ"గా స్థిరనామం వచ్చింది.

"రావణుడు" అంటే మహా పట్టు దలగలవాడని అర్థం. ఈయన మహా పండితుడు! ద్రావిడ సామ్రాజ్యాధి నేత! అనుపమాన శివభక్తుడు! నవ వ్యాకరణా లైన కావ్య - వ్యాకరణ - రాజనీతి - దండనీతి-అర్థశాస్త్ర-గణిత- ఆయుర్వేద -శిల్ప-గాంధర్వ శాస్త్రాలలో పండి తుడు! అతల వితల సుతల రసాతలాది పైలోకాలకు, భూలోక భువర్లోక సువర్లోక మహాలోకాది క్రింది లోకాలకు అధినేత! సర్వ సంగీతవాద్య నిపుణుడు. అతి పరాక్రమశాలి! పరమశివునికే చుట్టపు పట్టంగట్టిన శైవాచార పరాయణుడు. అనుదినమూ నవకోటి శివలింగా

> ఎంతటి విద్యాపాండిత్యాలు వున్నా కాసింత వివేకం లేకపోతే ఏమ వుతుంది? కాస్తంత వ్యసన పర వశతవుంటే ఏం జరుగుతుంది? వివాహిత ధర్మస్త్రీలను బంధించి బాధించితే అంతిమ పరిణామం ఎవరికైనా ఎలా వుంటుంది? వీర విక్రముడైన లంకాధిపతి చివరకు కోతి మూకలచేత భంగపడి పోయిన ఒకే ఒక కారణం పరస్త్రీ వ్యామోహం!
>
> ఇదే రామాయణ నీతి సూత్రం.

భిషేకం చేసే అకలంక భక్తుడు. దేవేంద్రాదులచేత ఊడిగం చేయించు కొన్న మహావిక్రమశాలి. లంకాపట్టణాన్ని స్వర్ణ, రత్నాలతో మయబ్రహ్మచేత నిర్మింపజేసుకొన్న ధీశాలి. బ్రహ్మజ్ఞాని, మహాపండితమ్మన్యుడు.

అయితే;

యుక్తాయుక్త విచారవంతుడు, సర్వశాస్త్ర పండితుడు, వేద వేదాంగా లను వివరించి విప్పిచెప్పగల బ్రాహ్మ ణోత్తముడైయుండి స్త్రీ వ్యామోహమనే ఒక్క బలహీనతకు బలైపోయాడు. సూర్యాగ్ని గోళంవంటి రావణకీర్తి బూడిదకుప్పగా మిగిలిపోయింది.

మృత్యుదేవతను జయించగల శక్తివుండీ, మృత్యుపాశానికి తలవంచాడు.

కాముకత్వం ఎంత చెడ్డది!?!

వ్యసనపరత్వం ఎంత క్రూరమైనది!?!

అవును. అంతే!

✦☆✦

దేవునికి కొబ్బరికాయనే ఎందుకు కొట్టాలి?

మంచినీటికీ, ఉప్పునీటికీ పెరిగే వృక్షంయిది!

ఆహారానికీ, ఔషధానికీ, పనికివచ్చే కాయ యిది!

ఆకునుండి పీచువరకూ సర్వోపయోగ వృక్షం యిది!

దేవునికి కొబ్బరికాయనే కొట్టాలన్న నియమంగాని నిబంధనగాని ఎక్కడా లేదు. లేతవయసు నుండీ పండువయసు వరకూ నీటిని నిక్షిప్తం చేసుకొనే కోనేటికాయ ఈ కొబ్బరికాయ! వెంట్రుక దూరేటంత సూక్ష్మమైన సన్నని రంధ్రం వుండదు; లోపల మహాబందోబస్తు వుంటుంది. కాని కాయలోనికి నీరు ఏ దైవమాయతో వస్తాయో తెలియదు.

ఉష్ణ ప్రదేశాలల్లోనూ, చల్లని వాతావరణంలోనూ, ఇసుక నేలల్లోనూ, చవుడు భూముల్లోనూ, రేగడి మట్టిలోనూ, అన్ని రుతువులలోనూ, సంవత్సర

ప్రాంతం లభించే ఫలం ఈ నారికేళం. చాలారోజుల వరకూ నిలిచివుండేది కూడా కొబ్బరికాయే!

ఈ ఔషధగుణాలెరిగిన పూర్వ రుషులు కొబ్బరికాయను దైవకార్యాలకు వినియోగించటం ప్రారంభించారు. దైవ కార్యాలకు వినియోగించినప్పుడే దేవుని ప్రసాదంగా పేదసాదలందరికీ అందు తుంది. దైవ ప్రసాదం కాబట్టి ఎవరూ వద్దనిచెప్పటానికీ వీలులేదు. దేవుని దగ్గర కొబ్బరికాయను కొట్టినపుడు సగం చిప్ప మాత్రమే మనకిచ్చి మిగిలిన దానిని భక్తులకు పంచటం ఆలయ ఆన వాయితీగా ప్రవేశపెట్టారు. పూర్వం అన్ని పండ్లు తిన్నట్లుగా కొబ్బరికాయను తినటానికి అందరూ యిష్టపడేవారు కాదు. కారణం ఏమంటే, గట్టిగావుండే పీచును చేతివ్రేళ్ళతో తీయటానికి కుదరదు. పీచు తీసిన తరువాత కొబ్బరి టెంకెను తొలగించి కొబ్బరిని తినాలి. ఆ కొబ్బరికూడా మామిడిపండులా తియ్యగా మధురంగా వుండదు. గట్టి కొబ్బరి అయితే చాలాసేపు నమలవల్సి వస్తుంది. ఇదీ కొబ్బరికాయ సమస్య.

> బుద్ధి తీక్షణతకు కొబ్బరి దివ్యామృతంగా పనిచేస్తుంది. ఏదో విధంగా ప్రతిరోజూ కొబ్బరిని తినే వారికి తెలివితేటలు, చాకచక్యమూ వస్తాయి. జ్ఞాపకశక్తి వేగవంతంగా వుంటుంది. ఈ కారణంవలననే దీని నూనెను తలకు మర్దించుకోవటం! ఈ కొబ్బరినూనెకు నేతిలో వున్నంత శక్తి పదార్థాలు వుండటం వల్లనే చలికాలంలో నేతిమాదిరి గానే పేరుకొని పోతుంది.

ఆగమశాస్త్రాలను తు.చ. తప్పకుండా అనుసరించే తిరుమల దేవాలయంలో కొబ్బరికాయను కొట్టటంలేదు. ఇదొక ఆగమవిప్లవం! కొబ్బరి పంట ఎక్కువగా వున్న ప్రదేశంలోని వారందరూ తెలివితేటలలో ముందు వుంటారు. ఉదాహరణకు కేరళ రాజ్యమే! పూర్వీకులు మనచేత అన్ని దైవకార్యా లకు కొబ్బరికాయనే ఎందుకు కొట్టించారో తెల్సింది గదా! కొబ్బరి, కొబ్బరినీరు మనకెంతో మేలు కల్గిస్తాయి. కాబట్టి దేవునికి కొబ్బరికాయనే కొట్టండి. అందరూ కొబ్బరికాయ అంటారేగాని కొబ్బరిపండని ఎందుకనరోమరి!

✦☆✦

విశ్వకర్మ ఎవరు?

సృష్టిప్రారంభంలో, పరమేష్ఠి మానసపుత్రులలో మొదటివాడైన అంగీరస బ్రహ్మకు బృహస్పతి - ఉతథ్యుడు - సంవర్తుడు అనే ముగ్గురు కుమారులు. 'యోగసిద్ధి' అనే ఒక కుమార్తె కలిగారు.

అంగీరసబ్రహ్మ తన కుమార్తె యోగ సిద్ధాదేవిని బ్రహ్మవంశజుడైన ప్రభాసవసుబ్రహ్మ కిచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు విశ్వప్రజా కల్యాణ కారకుడైన 'విశ్వకర్మ' ఏకైక పుత్రునిగా జన్మించాడు. దేవగురువు బృహస్పతికి మేనల్లుడే ఈ విశ్వకర్మ.

విశ్వకర్మకు ప్రహ్లాదుని కుమార్తె 'రచనాదేవితో వివాహం జరిగింది. ప్రహ్లాదుని కుమార్తె అంటే హిరణ్యకశిపుని మనుమరాలు. విశ్వకర్మకూ రచనకూ మహామేధావంతుడు అయిన 'విశ్వరూపుడు' అనే కుమారుడు పుట్టాడు. ఈ విశ్వరూపుడు రాజనీతిలో బృహస్పతిని శుక్రాచార్యుని మించిన నిశిత బుద్ధి గలవాడు. ఒకసారి బృహస్పతికీ దేవతలకు మాట పట్టింపులు వచ్చాయి. బృహస్పతి కోపంతో దేవతల గురుత్వాన్ని పరిత్యజించి వేశాడు. దేవతలందరూ కల్సి విశ్వకర్మ కుమారుడైన విశ్వరూపుడిని తమకు గురువుగా నియమించు కొన్నారు. కొంతకాలం యిలా గడిచింది.

విశ్వరూపుడు దేవతలకు గురుస్థానంలో వుంటూ, దేవదానవుల జన్మ వైరాన్ని అణచి వేయాలని భావించాడు. కార్యసాధన కోసం దానవులతో స్నేహంగా వుండటం ప్రారంభించాడు. విశ్వరూపుడు రాక్షసులతో మిత్రత్వంగా వుండటం చూచిన దేవేంద్రుడు శత్రుస్నేహాన్ని భరించలేకపోయాడు. అకారణంగా విశ్వరూపుని సంహరించివేశాడు.

పుత్రుని మరణవార్తవిని విశ్వకర్మ క్రోధంతో వుడికిపోయాడు. ఇంద్రుని నిర్జించటానికి సంకల్పించుకొని బ్రహ్మకోసం తపస్సు ప్రారంభించాడు. కొద్దినెలల తరువాత విశ్వకర్మకు ఆత్మజ్ఞానం కలిగింది. తను ఇంద్రనాశనంకోరి తపస్సు చేయటం తప్పు అని గ్రహించాడు. కాని, తపస్సును మధ్యలో నిలిపివేయటానికి

కుదరదుగదా! సందిగ్ధంలోపడిపోయి చివరకు తపోమంత్రాన్ని మార్చివేశాడు. అప్పటివరకు "ఇంద్రశ్శత్రో వర్ధస్య" అనే తపోమంత్రాన్ని ఇంద్రా! శత్రో వర్ధస్వ" అంటూ మార్చేశాడు. మంత్రార్థమే మారిపోయింది. ఇంద్రుడు రక్షింపబడ్డాడు. కాని, ఇంద్ర సంహరణార్థం కలుగబోయే విశ్వకర్మ పుత్రుడు అల్పాయుష్కు డయ్యాడు. విశ్వకర్మ మహోన్నత త్యాగమిది! దూరదృష్టి యిది! సంస్కార భావమిది!

విశ్వకర్మ తపోఫలంగా రచనాదేవికి 'వృతుడు' అనే మహావీరుడు జన్మించాడు. వృతుడు పెరిగి పెద్దవాడై సమస్త ధనుర్విద్యలనూ కరతలామలకం చేసుకొన్నాడు. వందల మంది వీరులతో తానొక్కడే నిలబడి కలబడి విజయం సాధించే వృతుడు అంటే అందరికీ భయమే.

ఈ వృతుడినే వృతాసురుడు అంటారు.

దేవేంద్రుడు అకారణంగా తన అన్న విశ్వరూపుని వధించిన విషయం తెల్సుకొని రాక్షసవీరుల సహకారంతో దేవేంద్ర సింహాసనం ఆక్రమించాడు వృతాసురుడు.

తపోశక్తితో పుట్టిన వృతాసురుడు మామూలు ఆయుధాలకు మరణించడని తెల్సుకొన్న దేవేంద్రుడు వజ్రసదృశమైన దివ్యాయుధంకోసం ఆలోచించాడు. క్షీరసాగర మధన కాలంలో దేవతల ఆయుధాలన్నీ తీసుకెళ్ళి 'దధీచిమహర్షి' వద్ద దాచివుంచారు. విష్ణుదేవుని సలహానుసరించి దధీచిమహర్షి వద్దకు వెళ్ళా రందరూ. ఎన్నో సంవత్సరాలనుండి దేవతల దివ్యాయుధాలు తన ఆశ్రమంలో వుండటానికి యిష్టపడని దధీచిమహర్షి దివ్యాయుధాలను మంత్ర జలంతో తడిపి ఆ దివ్య జలాన్ని త్రాగి ఆయుధాలన్నిటినీ జలస్థాపితం చేశాడు. ఇపుడు ఆ మంత్రశక్తి దధీచి ఎముకలలో నిక్షిప్తమై వుంది. దేవతల దీనావస్థను చూడలేక దధీచి "దేవేంద్రా! చింతించవద్దు. మహాశక్తి పూరితమై వజ్రతుల్యమైన నావెన్నె ముకతో వజ్రాయుధాన్ని చేయించి వృతాసురుని వధించు." అని చెప్పి ప్రాణత్యాగం చేశాడు.

దధీచి వెన్నెముకతో వజ్రాయుధాన్ని తయారుచేసి ఇవ్వవల్సిందిగా విశ్వకర్మను ప్రార్థించారు దేవతలు. స్వర్గక్షేమానికీ, పుత్రక్షేమానికీ మధ్య నలిగి పోయాడు విశ్వకర్మ. వజ్రాయుధం తయారుచేసినట్లయితే తన కుమారుడు మరణించటం తథ్యం గదా! ఆలోచించి ఆలోచించి స్వర్గలోక హితం కోసం కొడుకైన వృత్రాసురుని కోల్పోవటం మంచి దనుకొన్నాడు. వజ్రాయుధాన్ని సృష్టించి యిచ్చాడు విశ్వకర్మ.

విశ్వకర్మ సృష్టించి ఇచ్చిన వజ్రాయుధంవల్ల వృత్రాసురుడు కన్ను మూశాడు.

లోకహితంకోసం కన్నబిడ్డనే బలిదానం చేసిన మహోన్నతుడు విశ్వకర్మ! త్యాగమూర్తి విశ్వకర్మ! గుణశీలి విశ్వకర్మ!!

విశ్వకర్మకూ రచనాదేవికి "సంజ్ఞాదేవి" అనే ఆడబిడ్డ కలిగింది. ఈమెను సూర్యునికిచ్చి పెండ్లి చేశాడు. సూర్య ప్రతాపానికి సంజ్ఞాదేవి తాళ లేక పోయింది. అపుడు విశ్వకర్మ తన మంత్ర శక్తిచేత సూర్యుని ప్రతాప శక్తి నుండి ఒక చక్రాయుధాన్ని, ఒక త్రిశూలాన్ని సృష్టించాడు. దీనితో సూర్యుని శక్తి సన్నగిల్లింది.సంజ్ఞాదేవి సంతోషించింది.

ప్రతి సంవత్సరం సెప్టెంబరు 17వ తేదీ విశ్వకర్మ జయంతి.

విష్ణువుకు సుదర్శనచక్రాన్ని, ఈశ్వరునికి త్రిశూలాన్ని, బ్రహ్మకు ఘంటాన్ని, దేవతలకు పుష్పక విమానాన్ని, మహాశక్తికి దివ్యరథాన్ని, దేవేంద్రునికి అమరావతీ నగరాన్ని, విశ్వకర్మ సృష్టించి యిచ్చాడు. మను, మయ, శిల్పి, త్వష్ట, దైవజ్ఞ అను ఐదుగురు "నిర్మాణ బ్రహ్మలు" విశ్వకర్మకు రచనా దేవికి పుట్టిన బిడ్డలు. అపూర్వమైన "ఆదిమ వాస్తుగ్రంథం" విశ్వకర్మ రచించినదే. సమస్త చేతివృత్తుల వారికి ఈయనే మూలపురుషుడు.

✦☆✦

ముఖ జ్యోతిష్యం అంటే ఏమిటి?

ఇంగ్లీష్‌లో దీన్ని 'ఫేస్‌రీడింగ్' అంటారు.

దీనినే 'భావసాముద్రికం' అని కూడా వ్యవహరిస్తారు.

ఈ జ్యోతిష్యం చెప్పేవారికి మనోజ్ఞానం (సిక్త్‌సెన్స్) వుంటుంది. ఒక వ్యక్తి ముఖ కవళికలను, కంటిచూపులోని శక్తినీ, మాట్లాడేపద్ధతినీ, ముక్కు తీరునూ, వస్త్రధారణనూ, పలువరుసనూ, పెదాలనూ, కనుబొమలనూ, భుజాల తీరునూ, నిలుచునే/కూర్చునే పద్ధతినీ ముందుగా ఒక అంచనా వేస్తారు. నవ్వే విధానం కూడా పరిశీలిస్తారు. మెడ పొడుగును చూపులతోనే కొలుస్తారు. చేతులనుగాని చేతిరేఖలనుగాని పరిశీలించరు. కొద్ది సమయం ఆలోచించుకొని మన జీవితం గురించి చెప్పటం మొదలు పెడతారు. మనలోని లోపాలనూ మనలోని విశేషాలను పుస్తకం చదివినట్లుగా చదివేస్తారు. దాదాపుగా ఎనభై శాతం నిజమే చెబుతారు.

అయితే; చెప్పేవాడు మంచివాక్ శక్తి కలవాడై వుండాలి. వినేవారిని మంత్రముగ్ధులను చేయాలి. వినేవాని కళ్ళలోనికి బహుసూటిగా చూస్తూ సావధానంగా సందర్భోచితంగా స్థిర ప్రజ్ఞతో చెప్పాలి. చెప్పేటపుడు ఎదుటివాని ముఖకవళికలను భావప్రకటనను గమనిస్తుండాలి.

ఇదొక వశీకరణ విద్యలాంటిది. అనుభవమే దీని మంత్రం. మనో విజ్ఞానమే దీని యంత్రం. సాధన చేస్తూ పోతుండాలి. కొన్ని రోజులకు ఇది కైవశమవుతుంది. దీనికి తొందరపాటు వుండకూడదు.

దీనినే మరికొందరు మరొక రకంగా కూడా చెబుతారు. తొమ్మిది సంఖ్య లలో ఒక సంఖ్యను, కొన్నిపూలలో ఒక పూవును, కొన్ని రంగులలో ఒక రంగును, కొన్ని రుచులలో ఒక రుచిని అడిగి తెల్సుకొంటారు. తొమ్మిది సంఖ్య లలో ఒక్కొక సంఖ్యకు ఒక్కొక తత్వం వుంది. పూలలో ఒక్కొక పూవుకు ఒక్కొక గుణం వుంది. రంగులలో ఒక్కొక రంగుకు ఒక్కొక్క విశేషం వుంది. రుచులలో ఒక్కొక రుచికి ఒక్కొక ధర్మం వుంది. వీటనిటినీ కలబోసి విశ్లేషించి మన

జీవిత నడవడికను చెబుతారు. ఇది కూడా నూటికి ఎనభైపాళ్ళు నిజమే కన్పిస్తున్నట్లుంటుంది.

బాబాలు – స్వాములు – గురువులు – పై విధంగానే చెబుతుంటారు. ఇలా చెప్పటానికి మాయమంత్రం అక్కరలేదు. ఎదుటి మనిషిని అర్థం చేసుకో గలిగిన కొంత సామర్థ్యం, కొంత మాటకారితనం వుంటే చాలు! శక్తి సామర్థ్యాలు మాత్రమే చాలవు. వేషమూ, వేషానికి తగ్గ భాష వుంటేనే నమ్మకం పుడుతుంది. వేషధారణను నమ్మగలిగితేనే నోటిమాట చెవికెక్కుతుంది. ఇదొక తాంత్రిక విద్య

ఏ తిథులు విధిని మార్చలేవు.

ఏ మంత్రమూ బ్రతుకు తీర్చలేదు.

✦☆✦

'అంతర్వాణి' అంటే ఏమిటి

ప్రతిప్రాణిలోనూ అంతరాత్మ అంతర్వాణి అంతఃశక్తి అనేవి వుండి తీరుతాయి. అయితే కొందరు ఈ నిక్షిప్తశక్తిని గమనించరు. గమనింపుకి వచ్చినా పట్టించుకోరు. పట్టించుకొన్నా పరిశీలించరు.

మనం చాలాసార్లు చాలా విషయాల్లో మనకు తెలియకుండానే అంతర్వాణి మాటను వింటుంటాం. ఈ అంతర్వాణినే 'అంతరాత్మ' అని కూడా వ్యవహరి స్తుంటాం. మనం చేసే మంచి పనికీ చెడ్డపనికీ మనలోని అంతరాత్మ స్పందిస్తూ సలహాలనిస్తూ వుంటుంది. మహాయోగులు దీనినే "హృదయకమలం" అని కూడా చెబుతుంటారు.

మనల్ని ఒకేరోజున పదిమంది భిక్షగాళ్ళు ధర్మం అడుగుతారు-మనం లేదు లేదంటూనే ఒకరిద్దరికి ధర్మం చేస్తాం. అంతమందిని కాదని ఏ ఒక్కరికో ఎందుకు ధర్మం చేశాం? అంటే మనం మనలోని అంతర్వాణి మాటను అంగీ కరించామన్నమాట.

మనం మనమిత్రుని దగ్గర అప్పు అడగటానికో, లేదా ఇచ్చిన బాకీని తీసుకొని రావటానికో బయలుదేరుతుంటాం. మనలోని అంతర్వాణి పని జరుగదని వెళ్ళటం దండగ అని చెబుతుంది (పని జరుగదేమోనని అనుమానం కల్గుతుంది) అయినా మనం బయలుదేరతాం. తీరా వెళ్ళేసరికి బాకీ అడగాల్సిన మిత్రుడు బాధల్లో వుంటాడు. మనల్ని చూడగానే బావురుమంటాడు. నోరు మూసుకొని తిరిగి వచ్చేస్తాం. లేదా మనం వెళ్ళేసరికి మనకు కావల్సిన వ్యక్తి యింట్లో వుండడు. ఏదో ఒకటి జరిగి మనపని పూర్తికాదు. మనిషిని మున్ముందుగా హెచ్చరించేదే అంతర్వాణి.

'సహసా విధాదీత తనక్రియాం! అవివేకః పరమాపదాం పదం'

అన్నారు మన పెద్దవాళ్ళుకూడా 'ఏ పనిచేసినా కాస్త ఆలోచించరా' అంటుండటం మనకు సుపరిచితమే గదా! ముందుకు దూకబోయేముందు కాస్త అంతర్వాణిని గమనించు, నీకు నీవే రాజువై పోతావు. అన్నింటా విజయం సాధిస్తావు. నీకిష్టమున్నా కష్టమైనా అప్పుడపుడూ ఆర్షవిజ్ఞానం గురించి కాస్త ఆలోచించు! భారతీయ తత్వజ్ఞానం గురించి తెల్సుకో!

> మనంచేసే కొన్ని తప్పుడు పనులకు మనలోని 'వాణి' మనల్ని హెచ్చరిస్తూ వద్దువద్దని చెబుతూ వుంటుంది. కాని, మనం లెక్కచేయం. మన అంతరాత్మ మాట విననందుకు ఫలితం తర్వాత తెలుస్తుంది. ఏడుస్తాం బాధపడతాం. కకావికలమైపోతాం. రక్షించేవారి కోసం ఎదురుచూస్తాం. ఎంతెంతో నష్టపోతాం. అంతర్వాణిని ధిక్కరించిన ఫలితమిది.

మీరేపని చేయబోతున్నా, మహత్కార్యానికి మొదటి అడుగు వేయబోతున్నా, మరొకరి తలను నరుకబోతున్నా కాసిని నీళ్ళు త్రాగి ఒక్క పది నిముషాలు కనులుమూసి అంతర్వాణిని అవలోకించండి!

✦☆✦

షష్టిపూర్తి వేడుక ఎందుకు?

అందరూ జరుపుకోవల్సిన వేడుక యిది.

అరవైయ్యవ సంవత్సరపు అనుభూతికి ఎన్ని రహస్యాలు! ఎన్ని అనుభవాలు! ఎన్నెన్ని పల్లవింపులు ఎన్నెన్ని మేళవింపులు! ఎన్నెన్ని ఊహల ఉయ్యాలలు! అందుకే 'గతము తలచీ వగచేకన్నా సౌఖ్యమే లేదు" అన్నాడు సముద్రాల. తెలియని భవిష్యత్తుకన్నా తెలిసిన గతమే మిన్న అన్నాడు ఉమర్‌ఖయ్యాం.

అరవై సంవత్సరాలవయసంటే ముప్పైఅయిదు సంవత్సరాల దాంపత్యానుభవం! అంతకుమించిన లోకానుభవం! కొడుకులు, కోడళ్ళు - కూతుళ్ళు, అల్లుళ్ళు-మనుమలు, మనుమరాళ్ళు-అన్నతమ్ముళ్ళు-బంధువులు మిత్రులు -వదినలు మరదళ్ళు-సేవకులు యజమానులు-ఎందరెందరో అందరూ కల్సి 'శుభమస్తు' అని అభినందనలు తెలిపే మధుర వేడుక షష్టిపూర్తిమహోత్సవం!

షష్టిపూర్తి ఎందుకు చేసుకోవాలి?

మనిషికి ఇరవై సంవత్సరాలు బాల్యం, ఇరవై సంవత్సరాలు కౌమారం, ఇరవై సంవత్సరాలు యవ్వనం, ఈ అరవై సంవత్సరాలు ముగిసిన తరువాత మిగిలింది అనుభవపూర్ణమైన వార్ధక్యమే! అరవైఏండ్ల నాటికి జీవితంలో చూచిన ఎత్తుపల్లాలెన్ని! చవిచూచిన కష్టసుఖాలు ఎన్ని! మింగలేక మింగిన బాధలెన్ని! అయిన వారివల్ల కాని వారివల్ల అనుభవించిన నరకాలెన్ని! భార్య చీరకొంగుతో తుడుచుకొన్న కన్నీళ్ళెన్ని! కొడుకు దుడుకుచేష్టలకు కుమిలిపోతూ గడిపిన నిద్రలేని రాత్రులెన్ని!

> గతాన్ని ఒక్కసారి వెనుదిరిగి చూచుకొని, పగలు పంతాలు మరచిపోయి, కోపతాపాలు ప్రక్కకు నెట్టి, దూరమైన బంధువుల్ని మరచిపోయిన మిత్రుల్ని సాదరంగా పిలిపించుకొనే వేడుక యిది. యవ్వన మదంతో చేసిన ఎన్నో తప్పుల్ని సరిదిద్దుకొని క్షమాభిక్షను నవ్వుతూ కోరుకొనే ప్రక్షాళనా సమయమిది. ఇంత చక్కని సదవకాశం మరలా జీవితంలో ఏ మనిషికీ రాదు. అందుకే షష్టిపూర్తిని అందరూ చేసుకోవాలి.

ఈ షష్టిపూర్తిని 'ఉగ్రరథశాంతి' అని కూడా అంటారు.

మనిషికి అరవై సంవత్సరాల తరువాతికాలమంతా సమస్యామయమే. శరీరంలోని ఏ అవయవమూ సరిగా పనిచేయదు. రోగాల గూడుగా మారిపోతుంది. మారిపోతున్న కాలానికి మార్చుకోలేని మనస్తత్వంతో మిగిలిపోవల్సి వస్తుంది. షష్టిపూర్తినాటికి మనం తీసుకోవల్సిన ఎన్నో నిర్ణయాలు పూర్తి చేయాలి. ఇంతకాలం మనల్ని నమ్ముకొని జీవించిన అర్ధాంగికి మంచి జీవనమార్గం ఏర్పరచాలి. ఆడపడుచులకు చివరిగా చీరసారెలు పెట్టాలి. అందరినీ ఆశీర్వదించాలి. ఇదే షష్టిపూర్తి!

అందరికీ అందని మధురానుభూతి షష్టిపూర్తి.

✦☆✦

మరణించినవారిని వూరేగిస్తారెందుకు?

కన్ను తెరిస్తే జననం! కన్ను మూస్తే మరణం!

తెరవటానికీ మూయటానికీ మధ్యవున్న సమయమే జీవితం.

జీవితం ఎంత చిన్నది !

మనం మేల్కొనివున్నా నిద్రిస్తూవున్నా జీవితం కరిగిపోతూనే వుంటుంది.

రోజురోజుకీ మనం మరణానికి దగ్గరగా వెళుతూనే వుంటాం.

గడచిన ప్రతిరోజూ మనల్ని మరణానికి దగ్గరగా నెట్టివేస్తుంది.

బ్రతకటం కోసం ప్రతిరోజూ పదిసార్లు ఆలోచిస్తుంటాం. కాని మరణాన్ని గురించి నెలకు ఒక్కసారైనా ఆలోచించం. ఆలోచించటానికి ఎంతో భయపడుతుంటాం. అటువంటి ఆలోచనలనే మనస్సులోనికి చొరబడనీయం. చావు తప్పదని తెలిసీ తప్పించుకోలేమని తెలిసీ మరణానికి భయపడతాం. ముసలితనమే లేకుంటే మనిషి ఇంకెంత హంగామా చేసేవాడో మరి! మనిషి మరణించిన తరువాత వూరేగించటంలోని అర్థం పరమార్థం ఏమిటి? చాలా మంది దీన్ని ఒక సాంఘిక ఆచారంగానే భావిస్తుంటారు. దీనిలో ఒక నిగూఢార్థం దాగివుంది.

"ఓ మనిషీ! జీవితం చాలా చిన్నదోయ్! ఎప్పుడూ నీకోసం నీ భార్యకోసం నీ బిడ్డలకోసం సాధించాలనీ, సంపాదించాలనీ, సర్దిపెట్టాలనీ, ప్రోగు చేయాలనీ తపనపడుతున్నావేగాని నీ చుట్టూ నీతో పాటుగా నీ పొరుగువారు కొందరున్నారని మరచిపోతున్నావేం? నీవు చస్తే నిన్ను కాటికి మోసుకొని తీసుకెళ్ళటానికి నిన్ను తగులబెట్టి పూడ్చిపెట్టటానికి పదిమంది కావాలి సుమా! లేకపోతే చివరి ఊరేగింపుకూడా లేకుండా అనాధ శవంలాగ అంతిమయాత్ర చేయాల్సి వస్తుందోయ్! ఒకరితో నాకేంపని అనుకోకు! అందరిలో ఒకడిగా జీవించు!" అనే నగ్నసత్యం, జీవితనిజం దాగుంది.

అంతేకాకుండా -

శవాన్ని ఊరేగిస్తూ డబ్బులు చల్లుతారు. ఎందుకో తెలుసా! "వీడు సంపాదించిన ధనమేదీ వీడు తీసుకొని వెళ్ళటంలేదు. అందుకే వీధుల వెంట చల్లు తున్నాం" అని పరోక్షంగా ప్రజ లందరకూ చెప్పటమే దీని పర మార్థం.

అందుకే మరణించినవారిని ఊరేగిస్తారు.

ఎన్నో సంవత్సరాలు అందరిలో ఒకడిగా, అందరికీ ఆత్మీయుడిగా మనందరి మనిషిగా వుండి, ఈనాడు మనందరినీ వదిలి కానరాని తిరిగిరాని లోకాలకు పయనమై పోతున్న మనిషిని ఊరందరూ ఒక్కసారి చివరిసారి కన్ను లారా చూచుకోవద్దా! మంచిమనిషిని మరొక్కసారి స్మరించుకో వద్దా! ఎవరి జీవితమైనా ఇంతేనయ్యా! ఏదో ఒకనాటికి మనం కూడా మనవాడి దారి అను సరించిపోవల్సిందే గదా! ఇది నాలుగు రోజుల జాతర! మూడునాళ్ళముచ్చట! రెండురోజుల పండుగ! ఒకనాటి సంత! అనే సమాజ జ్ఞానోదయం అందరికీ కలగాలన్న నిగూఢధర్మం కూడ వుంది.

✦☆✦

రామాయణ భారతాల నీతి ఏమిటి?

రామాయణం పితృభక్తికీ, భారతం భ్రాతృభక్తికి ఉదాహరణలు.

"రామో విగ్రహవాన్ ధర్మః" అంటున్నది ఆర్యజాతి. "మూర్తీభవించిన ధర్మమే శ్రీరాముడు' అని వేలాది సంవత్సరాలనుండి నమ్ముతూ వస్తున్నది మన హైందవ సంస్కృతి. మనిషికన్నా మతం గొప్పదనీ, దార కన్నా ధర్మం గొప్పదనీ, జనాభీష్టమే రాజాభీష్టమని నమ్మినవాడు రాముడు! ఆత్మధర్మానికీ రాజధర్మానికీ వంతెన కట్టినవాడు రాముడు! తాను కరగిపోతూ జనావళికి వెలుగును పంచినవాడు రాముడు! భారతీయుల జీవనాడి రాముడు!

రావణుడు వేద వేదాంగవేత్త. బ్రహ్మవంశంలో పుట్టినవాడు. సృష్టి ఎరుగని రాజకీయ దురంధరుడు. సర్వవిద్యాపండితుడు. పరమశివభక్తుడు. ఏమైతేనేం; ఎన్ని కళ్గి వుంటేనేం; స్త్రీవ్యామోహంతో పతనమైపోయాడుగదా! పరస్త్రీ వ్యామోహం ఎంతటివానికైనా ప్రాణాంతకమేనన్న పరమనీతి యిది! విభీషణుడు అన్నగారైన రావణునితో కలహించి రామునితో చేరటం ఒకరకంగా భ్రాతృ ద్రోహమే! రావణుని మరణ రహస్యం విభీషణుడు శత్రువులకు తెలిజేయకుంటే రావణుని సంహరించటం సమస్య గానే వుండేది. అందుకే "ఇంటి గుట్టు లంకకు చేటు" అంటారు మన పెద్దలు. ఎంతటి విషమ స్థితిలోనూ సోదరులు కలహించ కోరాదన్న నీతిని యిక్కడ గ్రహించ వచ్చు.

భారతం భ్రాతృభక్తికి అద్దంలాంటిది.

అన్నదమ్ముల అనుబంధం తెలుసుకోవాలంటే భారతం చదవాల్సిందే!

> రామాయణానికి రాముడు కథా నాయకుడైతే భారతానికి కృష్ణుడే కథా నాయకుడు. రాముడు కృష్ణుడు ఒక నాణ్యానికి వున్న బొమ్మ బొరుసు లాంటివారు. రామాయణ కావ్య మంతా రాముని కోసమే! మహా భారతం అలా కాదు; కృష్ణుని కథా నాయకత్వం నడుస్తూనే ఎందరో కథా నాయకులుగా కన్పించి పోతుంటారు. ప్రతి సన్నివేశంలో ఒక నీతి కని పిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే సమస్త నీతి సారమే మహాభారతం.

రామాయణ భారతాలు రెండూ ఇతిహాసాలు. పురాణాలు కాదు. ఊహకు అందగలిగినదితిహాసం! కేవలం ఊహతోనే నమ్మేది పురాణం. మహాభారత నీతులను నాలుగు వాక్యాలలో చెప్పటం ఎవరికి సాధ్యం! భారతీయుడైన ప్రతివాడు భారతాన్ని చదివితీరాలి. ఒకసారి కాదు పదిసార్లు చదివితేనే విషయం బోధపడుతుంది. మనిషి జీవితంలోనికి నడచివచ్చే కష్టదుఃఖాలకు పరిష్కారం భారతంలో దొరుకుతుంది. మళ్ళీ మరొకసారి చెప్పే మాటేమిటంటే భారతం చదవండి. భారతమంటే కౌరవపాండవుల కథకాదు. నీ కథ! నా కథ! మనచుట్టూ వున్నవారి కథ! గడచిన తరాలవారికథ! రానున్న తరంవారి కథ! అదే భారత కథ.

✦☆✦

గాయత్రీ మంత్రార్థమేమిటి?

మననాత్ త్రాయతే ఇతిమంత్రః (సదాజపించుటవల్ల రక్షించేది మంత్రం)

గాయత్రీ దివ్యమంత్రం ఋగ్వేదంలో మూడవ మండలం అరవైరెండవ సూక్తంలో చెప్పబడింది. దీని ఋషివిశ్వామిత్రుడు అరవైరెండవ సూక్తంలోని పదవమంత్రం గాయత్రి.

ఈ మంత్ర ఛందస్సు – గాయత్రి

"యః సవితా సూర్యః ధియఃకర్మాణి ప్రచోదయాత్ ప్రేరయతి తస్య సవితుః సర్వస్యా ప్రసవితుర్దేవస్య ద్యోతమానస్య సూర్యస్య తత్ సత్ విదృశ్య మానతయా ప్రసిద్ధం వరేణ్యాం సర్వైః సంభజనీయం భర్గః పాపానాం తాపకం తేజోమండలం ధీమహి ధ్యేయతయా మనసా ధారయేమ"

ఏ సూర్యుడు కర్మలకు (పనులకు) ప్రేరణ కల్గిస్తున్నాడో ఆ సూర్యదేవుడే సర్వసృష్టికర్త. ప్రత్యక్షదేవత. సర్వసాక్షి. ఆతనిని మేం పూజించి భజించుతాం. భర్గుడు (సూర్యుడు) సర్వపూజనీయుడు. సర్వపాప తారకుడు. తేజోమండలుడు. అతనిని ధ్యానించి మనసులో నిలుపుకొందుముగాక! (ఇది సాయణ వ్యాఖ్యానం)

ఇక శంకరాచార్యులవారి వ్యాఖ్యానం చెబుతాను -

"సర్వదేవాత్మనః సర్వశక్తేః సర్వావభాసక తేజోమయస్య పరమాత్మనః సర్వాత్మక ద్యోత మానార్థ సర్వాత్మకత్వ ప్రతిపాదక గాయత్రీ మహామంత్రస్య ఔపాసక ప్రకారః ప్రకాశ్యతే। తత్ర గాయత్రీం ప్రణవాది సప్తవ్యాహ్యాసు ఉపేతాం శిరః సమేతాం సర్వవేదసారమితి వదన్తి।"

సర్వదేవాత్మకుడు, సర్వశక్తిమంతుడు, సర్వదర్శకుడు, తేజోమయుడు అయిన సర్వాత్మదర్శనకారకమైన సర్వాత్మక ప్రదిపాదిత గాయత్రీ మంత్రో పాసనా ప్రకాశమిది. గాయత్రి ప్రణవాది ఏడు వ్యాహృతులతో శిరస్సుతో వుండి సర్వవేద సారమని చెప్పబడు తున్నది. (ఆదిశంకరులు)

ఓం తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి
ధియో యోనః ప్రచోదయాత్।

మూడు పంక్తులు గలిగిన ఇరవై నాలుగు అక్షరాల గాయత్రీ మంత్రమిది.

"ఓ సర్వరక్షక ప్రాణాధార దుఃఖనాశక సుఖసచ్చిదానందరూపా! (ఓం భూర్భువస్వః) నీవు బ్రహ్మాండ వ్యాపకత్వం వహించి యున్నావు. (తత్స వితుర్వరేణ్యం) సర్వపాపవినాశకమైన నీ తేజస్సును ధ్యానించెదము. (భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్) నీవు మా బుద్ధికర్మలకు మంచి ప్రేరణ కలిగించి, ఉత్తమమమైన మార్గమున నడిపించెదవుగాక!" ఇదే గాయత్రీ మంత్రార్థం.

"దుర్లభా సర్వమంత్రేషు గాయత్రీ ప్రణవాన్వితా"

✦☆✦

విభూదికి, నామాలకు, మూడు గీతలు ఎందుకు?

త్రిసంఖ్య ధార్మిక సూచకం

11వ శతాబ్దానికి ముందు నిలువుగీతలు అడ్డగీతలు లేవు. పురుషులు గంధాన్ని స్త్రీలు కుంకుమ (ఎరుపు) రంగును హైందవ ధర్మసూచికంగా అలంకరించుకోవటం వుండేది. వ్యాసమహర్షి భారత, భాగవతాలను రచించిన తరువాత కొన్ని వందల సంవత్సరాలకు అత్యంత ప్రజాదరణను సంతరించు కోవటం జరిగింది. అంతకుముందు త్రిమూర్తులుకాక మరొక దేవాది దేవుడున్నాడని అందరూ నమ్మేవారు. వైష్ణవ పురాణాలు, కథలు ప్రాచుర్యం పొందిన తరువాత విష్ణువే సర్వాంతర్యామి అంటూ వైష్ణవజనం పామరులందరికీ బోధించటం ప్రారంభించారు. శివప్రియులకు ఈ బోధనలు ఎంత మాత్రమూ మింగుడు పడలేదు. వైష్ణవులతో దాడికి దిగారు. శివుడు గొప్పవాడని కొందరు; విష్ణువే గొప్పవాడని కొందరు విడివడిపోయి మతోద్రేకంతో అనేక దారుణ మారణాలకు పాల్పడ్డారు.

ఈ నిలువుగీతలు అడ్డగీతలు అపుడే ప్రారంభమయ్యాయి. ఎవరిమతం వారిని వారు గుర్తించటానికి వీలుగా అడ్డ-నిలువు సంకేతాలు ఏర్పరుచు కొన్నారు. భాగశః దాక్షిణాత్యులు శివమాతాన్ని అవలంబించారు. వైదిక ధిక్కారం చేశారు. ఈనాడు 'యూనిఫారం' ధరించినట్లుగా ఆనాడు నామాలు దిద్దు కొన్నారు రెండు మతాలవారు వారివారి గుర్తులకోసం! శైవవైష్ణవులు నుదుటిన మూడు గీతలే ఎందుకు వ్రాసుకొంటారనేది యిపుడు తెల్సుకోవల్సిన విషయం.

మూడు, పదమూడు, తొమ్మిది, పద్దెనిమిది ముస్లిములు అంగీకరించరు. అశుభ సంఖ్యలని వారి నమ్మకం. మూడు సంఖ్యను అసలు ఒప్పుకోరు. భారతీయ తాత్వికులు మూడు సంఖ్యను ధార్మిక సంఖ్యగా భావిస్తారు. ఇక తొమ్మిదిని బ్రహ్మసంఖ్యగా పూజిస్తారు. పద్దెనిమిది కూడా అంతే! వైష్ణవుల నామధారణగానీ, శైవుల విభూతి ధారణగానీ అంతరార్థం ఒక్కటే. అపమృత్యు దోషాలు తొలగిపోతాయని!

త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనం
ఉర్వారుకమివ బంధనా న్మృత్యోర్ముక్షీయ మామృతాత్ ॥

ఈ మంత్రం ఋగ్వేదం ఏడవ మండలంలోనిదని చాలామందికి తెలియదు. ఈ మంత్రకర్త వశిష్ఠ మహర్షి. ఈ మంత్రాన్ని పఠిస్తూ విభూతి ధారణను చేయాలి. ఇది మృత్యుంజయ మంత్రం. పండిన దోసపండు తీగనుండి తనకు తానే దూరమైనట్లు అపమృత్యువునుండి విముక్తి కలిగించు. అమరత్వం నుండి దూరం చేయకు ప్రభూ అని మంత్రార్థం. ద్వైత - అద్వైత - విశిష్ట అద్వైతాలను మూడింటినీ అంగీకరించటమే మూడు గీతలు.

> పరమాత్మయే సత్యమని ఒక గీత (అద్వైత)-పరమాత్మ జీవాత్మ ఇద్దరూ సత్యమని ఒక గీత (ద్వైత)-పరమాత్మ, జీవాత్మ సృష్టి సత్యమని ఒక గీత (విశిష్టాద్వైతం)

✦☆✦

బుద్ధుని 'అష్టాంగమార్గం' అంటే ఏమిటి?

నారాయణుని దశావతారాలలో బుద్ధావతారం ఒక అవతారంగా గుర్తించారు. మానవుని సర్వదుఃఖాలకు మనసే కారణమనీ, మనస్సు నియంత్రణలో వున్నవానికి దుఃఖం లేదనీ, అహింసా జీవనమే దైవారాధనతో సమానమని చెప్పినవాడు బుద్ధుడు. ఆయన ఉత్తమ జీవితానికి కావల్సిన ఎనిదిమి సూత్రాలను చెప్పాడు. అదే "అష్టాంగమార్గం".

1. ఏ విషయమైనా బాగా ఆలోచించిన తరువాతనే అంగీకరించి ఆచరించాలి. మొహమాటంతోగాని, భయంతోగాని, గౌరవంతోగాని అంగీకరించ కూడదు. ఇది మొదటి సూత్రం.
2. ప్రతి వ్యక్తికీ మంచి సంకల్పం వుండాలి. లోకహితంకోసం దీక్ష వహించాలి. మంచి సంకల్పమే మంచి దారిన నడిపిస్తుంది. ఇది రెండవ సూత్రం.
3. ఇతరులకు బాధకల్గించే, ఇతరులను నొప్పించే మాటలు మాట్లాడకూడదు. చాడీ మాటలు అబద్ధాలు చెప్పకూడదు. ఇది మూడవ సూత్రం.

4. ఈ ప్రపంచం ఏ ఒక్కరిదికాదు. అన్ని ప్రాణులకూ సమానహక్కు వుంది. కాబట్టి ప్రాణిహింస చేయకూడదు. ఇది నాలువ సూత్రం.

5. అందరూ మంచి జీవితాన్నే గడపాలి. దొంగతనం, వ్యభిచారం మోసం, అక్రమం, దౌర్జన్యం మొదలైనవాటికి దూరంగా వుండాలి. ఐదవ సూత్రమిది.

6. దేహాన్నీ మనస్సునీ బలంగానూ, ఆరోగ్యంగానూ వుంచాలి. మానసిక శ్రమ దేహదండన కలిగిస్తూ వుండాలి. ఇది ఆరవ సూత్రం.

7. దుఃఖాన్నీ, దురాశనూ, దురభిమానాన్నీ వదలివేయాలి. పిరికితనాన్ని దగ్గరకు రానివ్వకూడదు. ధర్మం మరువకూడదు. ఇది ఏడవ సూత్రం.

8. చివరి సూత్రం నిర్వాణం. దీనినే బోధిసత్వం అంటారు పుట్టు చావులకు అతీతమైన ఉన్నతస్థితి! భాషభావాలకందని దైవస్థితి! మనిషి పునీతుడై, శరీరంమీది వ్యామోహం వదలి లోకబంధం మరచి, మళ్ళీ తిరిగి రావటానికి ఈ జన్మను పరిపూర్ణం చేసుకోవాలి ఇది ఎనిమిదవ సూత్రం.

బౌద్ధ బోధనలన్నీ చార్వాక సిద్ధాంతం (నాస్తికత్వం)గా కనిపిస్తుంది. కాని నాస్తికమతంకాదు. జాతి వివక్షను బౌద్ధం అంగీకరించదు. బుద్ధుడు బోధించి "పంచశీల" అందరి మన్ననలను పొందింది.

1. ప్రతి ప్రాణినీ ప్రేమతో చూడు! జీవహింస చేయకు! మానవజన్మ గొప్పది.
2. ఇతరుల సంపదకు ఆశపడకు. డబ్బు మనిషిని నీచునిగా మారుస్తుంది.
3. అబద్ధమాడటం అతినీచప్రవృత్తి. చాడీలు చెప్పటం పరమనీచ ప్రవృత్తి.
4. వ్యభిచారం మహాపాపకార్యం. అతిపాపకార్యాలలో వ్యభిచారం మొదటిది.
5. మత్తు పదార్థాల సేవనంవల్ల మానవత నశిస్తుంది. మత్తుపదార్థాలవైపు చూడకు ఈ ఐదు సిద్ధాంతాలను "పంచశీల" అంటారు.

✦☆✦

ఉత్తరాయణం పుణ్యకాలమా?

వెలుగు - చీకటి

పగలు - రాత్రి

పున్నమి - అమావాస్య

ఉత్తరాయణం - దక్షిణాయణం

వయసు - వార్ధక్యం

ఎవరికైనా వెలుగు వెన్నెల పగలు ఇష్టమే. యవ్వనాన్ని యిష్టపడినంతగా వార్ధక్యాన్ని యిష్టపడరు. ఉత్తరాయణ సమయమూ అంతే! చైత్రమాసం నుండి భాద్రపదం వరకు పగలు. ఆశ్వయుజంనుండి ఫాల్గుణం వరకు రాత్రి. చైత్రమాసం నుండి ఆరునెలల కాలం ఉత్తరాయణం. ఇది ఉత్తమ కాలం. సమస్త జీవకోటి ఆరోగ్యంగా వుండే సమయం. పుణ్యక్షేత్రాలు, తీర్థయాత్రలు చేసే సమయం. హిమపర్వతాది కైలాస సానువులను దర్శించగల సమయం. లయ కారకుడైన పరమ శివుడు మేల్కొని వుండే సమయం ఉత్తరాయణకాలం.

ఇదే ఉత్తరాయణ పుణ్యకాలం.

ఉత్తరాయణం పుణ్యకాలం అంటే, దక్షిణాయణం పాపకాలం కాదు! సూర్యుడు ఉత్తరదిశగా సంచరించటంవల్లనూ, ఉత్తర దిక్కునూ, ఉత్తర భూములనూ పవిత్రంగా భావించటవల్లనూ, వేద జననం ఉత్తర భూముల్లో జరగటం వల్లనూ, హైందవ సంస్కృతి, జ్ఞాన విజ్ఞానం, భాష, నాగరికత ఉత్తర

ఆడది తల్లి అయిన తరువాతనే పుణ్యస్త్రీగా పిలుస్తారు. చెట్టు పూలు పూసి కాయలు కాస్తేనే ఫలదాతగా ప్రేమిస్తారు. ప్రకృతి పాత ఆకులను రాల్చి చిగురులువేసి కొమ్మలు పెంచి మధుర ఫలాలను అందించే మంచి సమయం ఉత్తరాయణం. పసిపాపలు ఎక్కువగా జన్మించేది ఉత్తరాయణం లోనే! కుమారీ మణులు పుష్పవతు లయ్యేది ఎక్కువగా ఉత్తరాయణం లోనే! స్త్రీ పురుషులకు కామోత్పత్తి కలిగేది ఈ ఉత్తరాయణం లోనే! ఎన్నో కారణాలవల్ల ఉత్తరా యణం పుణ్య కాలం అయింది.

భూములనుండే దక్షిణానికి రావటంవల్లనూ, సమస్త భాషలకూ తల్లియైన సంస్కృత భారతికి ఉత్తరభూమియే జన్మస్థానం కావటంవల్లనూ పరమపవిత్ర గంగానదీమ తల్లికి ఉత్తరమే పుట్టిల్లు కావటంవల్లనూ, సమస్త ఋషులకూ పండితవరేణ్యులకూ ఉత్తరభూములే ఆవాసనివాస స్థానాలు కావటంవల్లనూ, ముఖ్యంగా సూర్యనారాయణుడు ఉత్తరపథ చలనం చేయటంవల్లనూ ఉత్తరాయణ సమయాన్ని పుణ్యకాలంగా హిందువులు భావించారు. వర్షాలకు తడిసి చలికి బిగదీసుకొన్న భూమాత చేతులు విదలించుకొని సుషుప్త అవస్థ నుండి జాగృతికి వచ్చే సమయం ఉత్తరాయణం.

కురుక్షేత్ర యుద్ధభూమిలో బాణమంచంమీద పడిపోయిన భీష్ముడు ఉత్తరాయణం వచ్చిన తరువాతనే ప్రాణాలు వదిలాడు. యోగులు, యోగీశ్వరులు ఉత్తరాయణ సమయంలోనే మరణించటానికి యిష్టపడతారు.

✦☆✦

ద్రౌపది ధర్మవిజితయా?

పండితులకు గూడా మింగుడు పడని ప్రశ్న యిది.

భీష్మ ద్రోణ విదుర బాహ్లిక సోమదత్త భూరిశ్రవ నారద

కృప ధృతరాష్ట్రాదులే ద్రౌపది ధర్మవిజితత్వాన్ని తేల్చలేకపోయారు.

ధర్మరాజే తన స్వయంకృతాన్ని సమర్థించుకోలేకపోయాడు.

ఈ ధార్మిక ప్రశ్నకు కురు సభామందిరమే తెల్లబోయి చూచింది.

ధర్మపీఠమే మూగబోయింది.

ద్రౌపది కురురాజుకి ధర్మవిజితయా? అధర్మవిజితయా??

ఇంద్రప్రస్థ రాజరికంతోపాటు ధనధాన్య రత్నరాశులనూ అశేషగో సంపదనూ భృత్య అమాత్య సేవకా పరివారాన్నీ, దేవేంద్ర సములైన నలుగురు సోదరులనూ, చివరికి తనను తానే పందెంకాసి పరాజయం పాలయ్యాడు ధర్మరాజు.

ద్రౌపదిని పందెంకాసే హక్కు ధర్మరాజుకి లేదు.

ద్రౌపదిని పందెంగా స్వీకరించే హక్కు కురురాజుకి లేదు.

ఏ విధంగానంటే;

వేదధర్మం గృహస్త్రీని ఒక వస్తువుగానో, పెంపుడు జంతువుగానో అంగీకరించలేదు. కులవధువు గౌరవం, మర్యాద, కీర్తి, అభివృద్ధి, రక్షణ, పోషణ, పాలన, బాధ్యత, కులపెద్దలే చూడాల్సివుంది. ఈ విషయంలో ఎవరికైనా ఎంతవారికైనా మినహాయింపులేదు.

ధర్మజుడు ధర్మవిశారదుడే! అనుమానం ఆవగింజంతైనాలేదు. అవమాన స్థితిలో అపభ్రంశస్థితిలో పరాజయస్థితిలో ప్రాణసంకటస్థితిలో మరణ సమాన స్థితిలో ధర్మదేవతైనా దారితప్పుతుంది. విచక్షణా వివేకాలు మనిషినుండి మాయమైపోతాయి. ఆపత్కాలంలో ఆడే మాటకు చేసే పనికీ పాపం అంటుకోదు. అవమాన వివశత్వంలో దుఃఖ పరిష్వంగంలో పరమేశ్వరునికైనా వివేకం వుండదు. ప్రజ్ఞాశూన్యుడు చేసే పనులు పిచ్చిచేష్టలతో సమానంగదా! ధర్మజుడు ద్రౌపదిని పణంగా పెడుతున్నపుడే కురుప్రజాపరిషత్తు అభ్యంతరం చెప్పవల్సివుంది. భీమార్జున నకులసహదేవులు ధర్మజుని తమ్ములు కావటం వల్లనూ, ద్యూతక్రీడ సమక్షంలో వుండటంవల్లనూ, ద్యూతపణానికి అంగీకారం తెలుపటం వల్లనూ, ధర్మరాజు పందెం కాయటం న్యాయమే! కాని ద్రౌపదీదేవి ధర్మజునికి మాత్రమే అర్ధాంగికాదు. ధర్మరాజు ద్రౌపది అంగీకారాన్ని పొందలేదు. మరొకటేమంటే ద్రౌపదిని పందెం కాసే ముందుగానే ధర్మజుడు దుర్యోధనునికి దాసుడయ్యాడు. దాసుడు ప్రభువుతో జూదమాడటానికి అనర్హుడు. యుద్ధమూ, జూదమూ, స్నేహమూ, విరోధమూ సమస్థాయి వారితోనే వుండాలని ధర్మ నియమం. ధర్మరాజు ద్రౌపదిని పందెం ఒడ్డినా అంగీకరించటం దుర్యోధనుని నేరం. పందెం ఒడ్డటం ధర్మజుని నేరం ఇద్దరూ నేరస్థులే!

ద్రౌపదిమాత్రం ధర్మవిజిత కాదు.

✦☆✦

ఇంటికి 'సున్నం' ఎందుకు వేస్తారు?

మనిషికి చర్మం, ఇంటికి సున్నం, వుండకపోతే కుదరదు.

శరీరం రక్తమాంసాలకు కవచంలా వుండి ఎలా రక్షిస్తుంటో సున్నం కూడా గృహానికి రక్షణా కవచంలాగ వుండి రక్షిస్తుంది. గృహ నిర్మాణరంగంలోకి సిమెంట్ రాకపూర్వం మహరాజుల మందిరాలు, దేవాలయాలు రుబ్బుడు సున్నంతో నిర్మించేవారు. తాజమహల్ కుతుబ్‌మినార్ చార్మినార్ శ్రీరంగనాథ దేవాలయం కాశీదేవాలయం స్వర్ణమందిరం మొదలైన చారిత్రిక కట్టడాలన్నీ సున్నంతోనే నిర్మించారు. పూర్వకాలంనాటి ఆనకట్టలు, వంతెనలు కూడా సున్నంతోనే కట్టినవి యిప్పటికీ మూగ సాక్ష్యాలుగా నిలిచివున్నాయి సున్నానికి వున్న ఆయుర్దాయంలో ఐదవవంతు మాత్రమే సిమెంట్‌కి వుంది.

ఇండ్లకు సున్నం ఎందుకు వేయాలో చర్చించుదాం.

ఇటుకల యింటికైనా మట్టి యింటికైనా రాతికట్టడానికైనా బట్టీసున్నం వేయటం ఎంతో మంచిది. శుభప్రదమే కాదు ఆరోగ్యకరం కూడ. ఇంటిలోపల బయట తప్పకుండా సున్నమే వేయటం వల్ల ఎన్నో ఉపకారాలు వున్నాయి. సున్నం వేయటంవల్ల వేసవికాలపు ఎండవేడిమిని ఇంటికి తగులనీయదు. శీతాకాలపు అతి చల్లదనాన్ని కూడా ఇంట్లోకి రానివ్వదు. వర్షపు నీటిని గోడలు పీల్చనీయకుండా వర్షాకాలం నుండి కాపాడుతుంది. మూడు కాలాల్లోనూ సున్నం మనల్ని కాల ప్రభావం నుండి కాపాడుతుంది. ప్రతి సంవత్సరం సున్నం వేయటంవల్ల హాని కారక సూక్ష్మక్రిములు ఇంట్లోకి ప్రవేశించవు. ప్రవేశించినా నాశనమై పోతాయి.

> సున్నం వలన గదులలోని వెలుతురు రెట్టింపు అవుతుంది. సున్నంలోని తెల్లనిరంగు వల్ల మనసు ఉద్రిక్తతకు లోనుకాదు. ఆవేశం క్షణికకాలంలోనే చల్లారి పోతుంది. అతి తెలుపుకాని పాల వంటి రంగు కల్గిన సున్నం ఇంటి లోపలి గోడలకు ఉండటం వల్ల కళ్లకుండే శక్తి త్వరగా క్షీణించి పోకుండా వుంటుంది.

ఏ కారణంవల్లనైనా సున్నం రాలిపోయి ఆహార పదార్థాలలోనూ, త్రాగేనీటి లోను పడినా మంచేగాని చెడు జరగదు. సున్నం కొట్టినయింట్లో లక్ష్మీ సరస్వతులు ఇద్దరూ వుంటారు. ఇంట్లోనివారు ప్రశాంత జీవితం గడుపుతారు. అభివృద్ధి కలుగుతుంది. సున్నం వేయని ఇంట్లోనికి గృహప్రవేశం చేయకూడదు. ఇంటికి సున్నం వేయకుండా శుభకార్యం జరుపకూడదు.

కాలం మారిందో, మనం మారిపోయామో తెలియదుగాని, ఔషధ గుణాలతోపాటు రక్షణాశక్తి కలిగిన సున్నం యిపుడు మాయమైపోయింది. 'ఎలక్ట్రానిక్ కలర్స్' వచ్చాయి. మనస్సును గందరగోళంలో ముంచివేసే రంగులు యింటిలోప వేస్తున్నారు. రంగులు మనస్సుమీద వ్యక్తిత్వంమీద అదృష్టంమీద ప్రభావం చూపుతాయి. అందం కంటే ఆనందం గొప్పది కదా!

✦☆✧

చనిపోయినవారింటి దీపాన్ని చూడకూడదా?

మరణం దేహధర్మం

మన ఆప్తుడు – మన బంధువు – మన సంబంధీకుడు – మన స్నేహితుడు – మన మార్గదర్శి – మన కుటుంబ మిత్రుడు అనారోగ్యంతో, అకస్మాత్తుగా మరణించటం జరిగితే ఎక్కడి పనులక్కడ వదలి ఉరుకులు పరుగులు పెట్టి వెళ్ళటం సహజం. కన్నీరు మున్నీరుగా విలపించటం సహజం. ఆ మృత దేహాన్ని విడచి ముందుకు కదలలేనిమాట కూడా వాస్తవమే.

మృతుని వందలమంది బంధుమిత్రులు యింటినిండా గుమిగూడి పోతుంటారు. కనీసం కూర్చొనే స్థలం కూడా వుండదు. మనకందరకూ ఎపుడో ఒకసారి ఈ అనుభవం కలిగివుండవచ్చు కూడా! వచ్చిన వారందరికీ వసతులు ఎవరు చూడాలి? ఇంటిమనిషి మరణించిన దుఃఖంలో యింటివారుంటే దూరం నుండి వచ్చినవారికి వసతి సౌకర్యాలు చూచేదెవరు? అందరికీ పెద్దపెద్ద భవంతులు వుండవుగదా! బాధలో వున్నవారిని బాధించటం తగదు గదా!

ఏం చేయాలిమరి!

ఎవరూ ఆ రాత్రికి అక్కడ వసతి చేయకుండా వెళ్ళి పోవాలి.

ప్రతివారికీ వివరించి విశదీకరించి చెప్పేదెలా?

అందుకే

మృతుని యింటివారు తప్ప యితరులు మృతుని యింట్లోని దీపం చూడరాదని పెద్దలు ఆచారం విధించారు. జనం ఆచారాన్ని నమ్మినంతగా ఆలోచనను నమ్మరు. అందుకే ప్రతిదానినీ ఆచారంపేరిట సమాజంలో పెట్టేశారు.

శవసంస్కారానికి వెళ్ళినా వెళ్ళకపోయినా కర్మచేసే రోజున తప్పక వెళ్ళి రావాలి. వారింటి సమస్యలను ఆలించాలి. చేతనైతే సహకరిస్తానని ధైర్యం చెప్పాలి. మృతుని ఆత్మ అపుడు శాంతిస్తుంది.

కర్మరోజున కూడా మృతుని యింటి దీపం చూడరాదు మృతుని యింట్లో బస చేయరాదు. అనాదికాలంనుండీ వస్తున్న సంప్రదాయం. కొందరు పరాన్న జీవులు వుంటారు. శ్రమలేకుండా భోజన సౌకర్యాలు దొరుకుతూవుంటే ఇక ఆ యింటిని వదలరు. ఆ యింటివారు ఎంతటి కష్టాల్లో వున్నదీ ఆలోచించరు. ఎన్ని బాధలు పడుతున్నదీ గమనించరు. సమయానికి సరిగా అన్ని సదు పాయాలు సమకూరుతూ వుంటే చాలు.

ఇటువంటి విషయాలను దృష్టిలో వుంచుకొనే పెద్దలు మరణించినవారి ఇంటి దీపాన్ని బంధుమిత్రులు చూడరాదనే పద్ధతి పెట్టారు. ఇదే కాదు ఎన్నోవందల ఆచారాలు మనకున్నాయి. అన్ని ఆచారాల వెనుకా ఒక మంచి వివేచన వుంది. మంచి సత్కార్యం వుంది. మంచి ధార్మికత వుంది. అన్నింటినీ పిచ్చి ఆచారాలు మూఢవిశ్వాసాలు అని తృణీకరించకూడదు.

పాత పద్ధతులు చెడ్డవి కాదు: క్రొత్త పద్ధతులు మంచివీ కాదు.

క్రొత్త పద్ధతులు చెడ్డవి కాదు పాత పద్ధతులు మంచివీ కాదు.

✦☆✦

ఇంటిముందు తులసికోట ఎందుకు?

శ్లో॥ యన్మూలే సర్వతీర్థాని యన్మధ్యే సర్వదేవతా: ।
యదగ్రే సర్వవేదాశ్చ, తులసి! త్వాం నమామ్యహం ॥

దేవతలు దానవులు క్షీరసాగరాన్ని మథించిన సమయంలో తులసీ, జమ్మి, కల్పవృక్షం, పారిజాత వృక్షం, రావి, వేప వృక్షాలు పుట్టాయని పురాణాలు చెబుతున్నాయి. కల్పవృక్షం పారిజాతం దేవలోకానికి సంక్రమించాయి. తులసి, రావి, వేప, జమ్మివృక్షాలు భూలోక సంప్రాప్తమయ్యాయని పౌరాణికులు చెబుతారు. హిందువులకు ఈ నాలుగు వృక్షాలపై మమత్వం ఎక్కువ.

తులసిచెట్టు, రావి, వేప, జమ్మివంటి పెద్ద వృక్షం కాదు. నాలుగు అడుగులకు మించి పెరుగదు. ఇండ్లవద్ద వేపచెట్టును మాత్రమే పెంచుతారు. వేపకర్రను గృహోపకరణాలకు వాడుకోవచ్చు. వేపవిత్తనాలు రైతులకు క్రిమిసంహారకంగా కూడా వుపయోగపడతాయి. రావిచెట్టును కావాలని ఎవరూ ఇండ్లవద్ద పెంచరు. ఎందుకంటే మర్రిచెట్టులాగానే రావిచెట్టు కూడా దైత్యవృక్షం. మహావృక్షంగా పెరిగి ఇంటిగోడలను పడవేస్తుంది. పూలు, పండ్లను యివ్వదు. రావికలపను దేనికీ వుపయోగించరు. ఉపయోగం కూడా కాదు. జమ్మిచెట్టు తనకు తానుగా పుట్టి పెరగాలి అనే నమ్మకం వుండటంవల్ల ఎవరూ పెంచరు.

ఇంటిముందు తులసికోట పెడతారెందుకు?

తులసికోటను బ్రాహ్మణ వైశ్య క్షత్రియులు మాత్రమే యింటిముందు పెట్టి ప్రతి నిత్యం నీరుపోసి నమస్కరిస్తుంటారు. జంధ్యపు కులాలకు మాత్రమే ఎందుకు తులసి పరిమితమయిందో తెలియదు.

> తులసి ఆకులతో విష్ణువును పూజిస్తే త్వరగా ప్రసన్నుడవుతాడని కూడా నమ్మకం వుంది. తులసికోట యింటి ముందు వుంటే ఆ యింటిలోనికి భూత ప్రేతాలు రావని కూడా ఒక నమ్మకం వుంది. తులసి చెట్టు గాలి తగిలితే విషక్రిములు ఆ దరిదాపులకు రావు.

తులసివృక్షం ఆయుర్వేదరంగంలో మహత్తర స్థానం సంపాదించుకొంది. ఎన్నో అనారోగ్యాలకు తులసి దివ్యఔషధంగా వుంది. తులసిని లక్ష్మీ సమానంగా హిందు వులు పూజిస్తారు. తులసి వృక్షం ఇంటి ముందు వుంటే ఆ యింటికి దరిద్రం రాదని నమ్ముతారు. ప్రతినిత్యం తులసిని పూజించే స్త్రీలకు సౌభాగ్యం పదికాలాలపాటు చల్లగా వుంటుందనీ, పతిప్రేమకు పాత్రులు అవుతారనీ, తులసీ ప్రదక్షిణం చేసేవారికి ఆయుష్షు ఆరోగ్యం లభిస్తాయనీ భారతీయ స్త్రీ పవిత్ర విశ్వాసం. పసిపాపలకు జలుబు దగ్గు దురదలు వంటి అనారోగ్యాలు దరిజేరవు. విష్ణుమూర్తికి తులసిమాల అంటే ఎంతో యిష్టమని వైష్ణవులు విశ్వసిస్తారు. ఎండిన తులసి కొమ్మలను చిన్నచిన్న ముక్కలుగా కోసి పూసలుగా తయారుచేసి మెడలో ధరిస్తారు.

"నమోతులసి! నమోదేవీ! నమో విష్ణుప్రియే! శుభే!"

✦☆✦

ఇంటిపెద్ద మరణిస్తే శివాలయనిద్ర చేయాలా?

ఎవరికైనా ఎంతటివారికైనా మహాత్ములకైనా చండాలునికైనా మరణించటం తప్పదు. ఎన్ని యాగాలు చేసినా ఎంత తపస్సు చేసినా మరణాన్ని తప్పించుకొని మనగలగటం ఏ ప్రాణికీ సాధ్యంకాదు. అందరూ మరణిస్తారు. అందరూ మరణించవల్సిందే. "జాతస్య హి ధృవో మృత్యుః". పుట్టుక అనేది వున్న ఏదైనా గిట్టి తీరవల్సిందే. అందుకే కర్మయోగులు, తత్వజ్ఞానులు, మరణాన్ని దేహ ధర్మంగా భావిస్తారుగాని దుఃఖించరు. మనిషి గొప్పతనం మనిషి ప్రణాళికా తత్వం, మనిషి ధర్మబద్ధజీవితం, మనిషి చేసిన పుణ్యం, మనిషి మరణ దినాల లోనే తెలుస్తుంది అంటారు పెద్దలు. కుటుంబ సభ్యుల ఆత్మీయతల మధ్య బంధువుల ఆదరాలమధ్య ఇహలోక యాత్రను ముగించుకొన్నవాడే ధన్యజీవుడు. పుణ్యమూర్తి.

ఇంటిపెద్ద ఇహయాత్ర ముగిస్తే కొన్నిరోజులవరకూ ఇంటివారందరూ కకావిక స్థితిని అనుభవించాల్సిందే. మంత్రాంగం నడిపించిన మనిషి దూర

లోకాలకు వెళ్ళిపోతే సంసార సారథ్యం అయోమయమే గదా! రాజులేని రాజ్యంలో సైనికులే అధికారాలు ప్రదర్శిస్తారు. రాచరికాలు వెలగబెట్ట జూస్తారు. కుక్కల్లా కొట్లాడుకొంటారు. ఇంటి పరువును వీధికి లాగుతారు. మమతలను బాధ్యతలను ముక్కలుగా కోసి వాటాలు పంచుకోచూస్తారు.

ఇటువంటి స్థితిలో, మనశ్శాంతి మరుగైపోయి మనసుచలించిపోతుంది. పోయిన వారితో మనమూ పోదామనిపిస్తుంది. అభద్రతాభావం హృదయాన్ని కుదించి వేస్తుంది. ఈ సమయంలో మనశ్శాంతికోసం ఆత్మశక్తికోసం శివాలయంలో ఒక్కరోజైనా వుండివస్తే ధైర్యం లభిస్తుందని, పరిస్థితులన్నీ చక్కబడి ప్రశాంతత దొరుకుతుందని పండితులు చెబుతారు.

శివాలయంలో దేవుని దగ్గర కూర్చుని ఆలోచించుకొంటే దేనికైనా దేవుడున్నాడులే అనే ధైర్యం వస్తుందని ఈ సంప్రదాయం శాసించారేమో! మనిషికి మన వెనుక ఒకరున్నారు అన్న నమ్మకం ఎంతో శక్తినిస్తుంది. "ఉన్నది పుష్టి మానవులకు ఓ యదు భూషణ! ఆలజాతికిన్ తిన్నది పుష్టి" మనిషికి వుంటే శక్తి పశువుకి తింటే శక్తి అంటారు.

సంవత్సరానికొకసారి ఇంటిని భద్రపరచుకొని ఒక్కరోజు శివాలయంలో నిద్రించటం ఎవరికైనా మంచిదే. ఒంటరిగా కాకుండా నలుగురైదుగురు కల్సి నిద్రచేయటం శుభదాయకమే!

> శివుడు లయకర్త కాబట్టి శివాలయమే సూచించారు మన పెద్దలు. అంతే కాకుండా శివాలయాలలో వున్న ప్రశాంతత వైష్ణవాలయాల్లో వుండదు. ఒకరోజు ప్రశాంతతగా కూర్చుని ఆలోచించుకొంటే, సమస్యలన్నీ శ్రావణ మేఘాల్లాగ పరుగెత్తి పారి పోతాయి.
>
> అందుకే శివాలయ నివాసం చెప్పారు పెద్దలు.

✦☆✦

బ్రహ్మముహూర్త సమయం ఎప్పుడు

ఏదైనా మంచిపనికోసం బయలుదేరాలన్నా, ఏదైనా శుభకార్య నిమిత్తం పూరికి వెళ్ళాలన్నా బంధువుల ఇంటికి వెళ్ళాలన్నా మంచివారం తిథి నక్షత్రం రాహుకాలం దుర్ముహూర్తం చూడటం సర్వసాధారణం. ఏ రోజైనా బ్రహ్మ ముహూర్త సమయంలో రాహుకాలాలు చూడాల్సిన పని వుండదు.

బ్రహ్మ ముహూర్తానికి సమయం అంటే ఎపుడు?

సూర్యుని సారథిపేరు అనూరుడు. ఇతడు కశ్యపబ్రహ్మకు వినతాదేవికి జన్మించినవాడు. అనూరుడు అంటే కాళ్ళులేనివాడు అని అర్థం.

కశ్యపబ్రహ్మకు కద్రువ - వినత అని ఇద్దరు భార్యలు కద్రువ వినతలు సంతానం కోసం కశ్యపుని ఎంతగానో ఆరాధించి సేవలు చేశారు. కద్రువ తనకు వేయిమంది సంతానం కావాలని కోరుకొంది. వినత తనకు ఇద్దరే కొడుకులు చాలని అయితే వారిద్దరూ మహాకీర్తిమంతులు బలవంతులుగా వుండాలని కోరుకొంది. కశ్యపుడు వారిద్దరికీ వారివారి వరాలను అను గ్రహించాడు. కద్రువ వేయి అండాలను ప్రసవించింది. వినత రెండు అండాలను ప్రసవించింది. కద్రువకు తన వేయి అండాలనుండి ఆదిశేషుడు - వాసుకి - తక్షకుడు - కర్కోటకుడు మొదలైన వేయిమంది నాగులు జన్మించారు. వినత అండాలు ఎన్నిరోజులకీ పగులకపోయేసరికి ఆతురత పట్టలేక ఒక గ్రుడ్డును బయటకు తీసి కొద్ది చిదిమేసరికి దానినుండి పూర్తిగా అవయవాలు ఏర్పడని శిశువు బయట పడింది. వినత ఎంతో దుఃఖించింది. తపశ్శక్తివలన జన్మించిన ఆ శిశువు

> సూర్యోదయం కాకముందే అనూరుని చిరువెలుగు వస్తుంది. అదే బ్రహ్మ కాలం బ్రహ్మ ముహూర్తకాలం అంటారు. ఈ బ్రహ్మ ముహూర్త సమయంలో వర్జాలు రాహుకాలాలు వుండవు. చెడు నక్షత్రాలు పని చేయవు. ప్రతిరోజు ఈ సమయం శుభకాలమే వుంటుంది. పంచాంగాలు తిరగ వేయాల్సిన పని లేదు. ఈ సమయంలో జన్మించే బిడ్డలు మంచి లక్షణాలు కలిగినవారై వుంటారని ప్రాచీనుల నమ్మకం.

తన కాళ్ళు లేనందుకు దుఃఖించి ఐదు వందల సంవత్సరాలు తన సవతి కద్రువకు దాసిగా జీవించమని శపించాడు. తల్లీ కొడుకుల దుఃఖానికి కులవృద్ధుడైన బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై వినతను దండించి సగందేహంతో వున్న అనూరుని ఆశీర్వదించి సూర్యసమ కాంతితో వర్ధిల్లగలవని చెప్పి నీ శరీరకాంతి ప్రసరించినచోట దుష్టగ్రహాలు పని చేయవనీ, నీవు భూలోకంలో వుండే సమయాన్ని ఇకనుండి బ్రహ్మ కాలంగా అందరూ పరిగణిస్తారనీ వరమిచ్చాడు. అనూరుణ్ణి సూర్యుని సప్తాశ్వరథానికి సారథిగా నియమించాడు బ్రహ్మ దేవుడు.

వినతాదేవికి రెండవ అండం నుండి జన్మించినవాడే బలశాలి గరుత్మంతుడు.

✦☆✦

గోళ్ళను యింటిలోపల తీయకూడదా?

నాగరికత వాసనలు తెలియని పూర్వరోజుల్లో ప్రజాక్షేమం కోసం కొన్ని నిబంధనలు ఆంక్షలు పెట్టారు మేధావులైన పూర్వరుషులు. అతినాగరికత పెచ్చరిల్లిపోయిన ఈనాడు పాతచింతకాయ పచ్చడి పనికిరాదన్నట్లుగా పూర్వాచారాలనన్నిటినీ పెంటకుప్పమీదకు విసిరేస్తున్నారు అందరూ చైనా జపాన్ వంటి అగ్రరాజ్యాలు కూడా తమ సంస్కృతిని కాపాడుకొంటూనే నాగరికతా ప్రపంచంలో దూసుకొని వెళుతున్నారు.

పరభాషావ్యామోహం, పర నాగరికతా పిచ్చి, మనవారికే ఎక్కువ.

తెలుగు బిడ్డలకు మరీ మక్కువ.

అంటే; పరభాషాప్రేమ వద్దనికాదు. మీ భాషాసంస్కృతి మరువద్దని మాత్రమే మా కోరిక. దక్షిణభారతదేశంలో తమిళులకున్నంత మాతృభాషాభిమానం మనకున్నదా? మళయాళీలకు కన్నడిగులకు వున్న భాషాభిమానం మనకు వుందా? తమిళులకంటే మనందేనిలో ముందున్నాం??? అన్నిటిలో వెనకున్నాం.

మనం తిరుపతికి వెళ్ళినపుడు వెంట్రుకలు ఇచ్చే కారణంకూడా యిదే! దేవునికి వెంట్రుకలు సమర్పించుకొంటే పాపాలన్నీ పోతాయని పూర్వనమ్మకం.

> కాలిగోళ్ళను చేతిగోళ్ళను యింటి లోపల తీయకూడదు. అంతే కాదు వెంట్రుకలను ఇంటి లోపల కత్తిరించకూడదు. మనుష్యుల పాపాలు వెంట్రుకల లోనూ కాలి గోళ్ళలోనూ దాగి వుంటాయని చాలా మతాల వారికి విశ్వాసం వుంది.

గోళ్ళను వెంట్రుకలను ఇంటిలోపల తీయరాదని పెద్దలు చెప్పటంలో ఒక శాస్త్రీయ కారణం వుంది. మన గోళ్ళు ఆహారం రంగులో సులభంగా కలిసి పోతాయి. పొరపాటున ఇంట్లో తీసిన గోళ్ళు ఆహారపదార్థాలలో మిశ్రమమై పోయి కడుపులోనికి పోయే అవకాశం వుంది. అదేవిధంగా కత్తిరించిన చిన్న చిన్న వెంట్రుక ముక్కలు గూడా ఆహారం ద్వారా కడుపులోనికి వెళ్ళి ప్రేగులకు అంటుకొనిపోయే అవకాశం కూడా వుంది. కాలిగోళ్ళు కడుపులోనికి వెళ్ళి జీర్ణంకావు. మనిషికి అన్నీ జీర్ణించుకొనే జీర్ణవ్యవస్థ లేదు. జీర్ణంకాకుండా కడుపులో వుండిపోతే శాశ్వత ఉదర సమస్యలు రావచ్చు. అలా కాకుండా బయటకు మలద్వారం గుండా విసర్జింపబడినా, విసర్జించే సమయంలో లోపలి ప్రేగుకి హాని జరుగవచ్చు.

ఇంకొక కారణం ఏమంటే గోళ్ళలో విషం వుంటుంది. ఇంట్లో నేలమీద పారాడే పసిపాలకు గ్రుచ్చుకొని విషజ్వరాలు వచ్చే అవకాశాలు కూడా వుంటాయి. చిన్నపాపలు తెలియక నేలమీద పడివున్న గోరును బాల్యచాపల్యంతో మ్రింగవచ్చు. ఇటువంటి శాస్త్రీయ కారణాలు కూడా వున్నాయి.

ఏది ఏమైనా గోళ్ళను యింట్లో తీయకపోవటమే మంచిది. క్షవరం చేయించుకొని యింటికి రాగానే బట్టలు తీసి బయట దులిపేయాలి. వెంట్రుకలు శరీరానికి అంటుకొని వుంటాయి గదా! పరిశుభ్రంగా స్నానంచేయాలి.

✦☆✦

ఉపవాసాలు దైవప్రియమా?

శ్లో॥ క్లప్త కేశవ ఖశ్మశ్రుఃధాంతః శుక్లాంబరం శుచిః
స్వాధ్యాయే చైవ యుక్తస్య నిత్యమాత్మహితేషు చ ॥

- మనుస్మృతి 4-35

"శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అనేది ధర్మశృతి. వ్రతాలు, నియమాలు, పూజలు మొదలైనవాటి పేరుమీద అకారణ ఉపవాసం వుండ కూడదు. దేవుని ప్రేమించటం పూజించటం ఎంత మంచిదో మన శరీరాన్ని ప్రేమించటం కూడా అంతే మంచిది. నీకు సంక్రమించిన పాపాలకు, నీకు లభించబోయే పుణ్యాలకు శరీరానికీ ఏ సంబంధమూ బాంధవ్యమూ వుండదు. పాపాలు పుణ్యాలు చేసేది మన మనస్సు. శరీరం కాదు. ఆత్మకూ దేహానికీ సంబంధం లేనపుడు ఉపవాసాలతో దేహాన్ని దండించటం వివేకం లేని పని.

"చిత్తం చెప్పులమీద భక్తిదేవునిమీద" అన్నట్లుగానే దేహం దేవునిదగ్గర మనసు ఆకలి దగ్గరవుంటే ఫలితమేమిటి?

కాని.... ఒక్క విషయం!

ఉపవాసం దేహంలోని మలినాలను తొలగిస్తుంది అనేది నిజమే! అయితే ప్రశాంత సమయాలలోనే వుపవాసాలు చేయాలి. బంధువులు వచ్చినపుడు, మిత్రులు వచ్చినపుడు, దానధర్మాది కార్యాలు చేయవల్సివున్న సమయంలో, వుపవాసం వుండవల్సిన పనిలేదు. ధర్మశాస్త్రం అంగీకరించదు. దేహాన్ని కాపాడు కోవటం అన్ని ధర్మాలకన్నా గొప్ప ధర్మం.

దైవానికి దేవతార్చనకూ కావల్సింది మనస్సుగాని, ఉపవాస నియమం కాదు. చాలామంది 'నేను దేవుని పూజించకుండా పచ్చిగంగ కూడా ముట్టుకోను' అని బడాయి కబుర్లు చెబుతుంటారు. అలా చెప్పటం వారి అజ్ఞానమే గాని భక్తిమాత్రం కాదు.

దేవుణ్ణి సరిగా అర్థం చేసుకొన్న భక్తులే లేరు! దైవప్రియుల్ని పురాణాలు దారితప్పించాయని చెప్పటానికి నేను సంకోచపడవల్సిందేమీ లేదు! దేవుడ్ని

> భక్తి విషయాలకు దైవ కార్యక్రమాలకు ఉపవాసం చేయాలని ఎక్కడా లేదు. పాపకర్మలు చేసినవారికీ తప్పుడు పనులు చేసిన వారికీ మాత్రమే ఉపవాస శిక్ష విధించాలని స్మృతులు చెబుతున్నాయి.

మన పురాణాలు దెయ్యాన్నిగా చూపిస్తున్నాయి. భగవాన్ వ్యాసమహర్షి పేరున పురాణాలలో వున్నవి లేనివి యిరికించి పరమ పవిత్రమైన దేవునికి దెయ్యపు గుణాలు అంటగట్టారు. దేవుడు ఆగ్రహిస్తాడనీ అపకారం చేస్తాడనీ ఆపదలు కల్గిస్తాడనీ చెప్పటం దేవునికి చేసే అపకారమే! దేవుడు మన తండ్రి. క్షమించటమే ఆయనకున్న గుణం దుర్మార్గుడిని కూడా దగ్గరకు తీసుకొని ప్రేమించటమే ఆయనకు అలవాటు. దయ చేసి వంట చేసుకోవల్సిన నిప్పుతో వళ్ళు కాల్చుకోకండి'. సత్యనారాయణస్వామి కథలు నమ్మకండి. సత్యనారాయణుని పూజించండి.

✦☆✦

నాస్తికవాదం పాపమా?

నాస్తిక మతాన్ని చార్వాకమతమని అంటారు

హేతువాదమని కూడా అంటారు.

'అస్తి' అంటే వున్నదని, 'నాస్తి' అంటే లేదని సంస్కృతార్థం.

హేతువాదులు ధ్వజమెత్తి యుద్ధం చేసేది దేవునిమీద కాదు. దేవుని పేరుమీద జరిగే కార్యకలాపాల మీదనే వారు మండిపడుతుంటారు. క్రీస్తు పూర్వం నుండే ఈ నాస్తికమతం మన భూమిమీద వుంది.

> **క్రీస్తు కూడా దేవుని పేరుమీద జరిగే అక్రమాలను ఎదిరించాడు. అలా ఎదిరించటం వల్లనే రోమ్‌నగరపు మతాధిపతులు జీసస్‌కు శిలువ వేయించారు.**

స్వామి వివేకానందులు కూడా వైదికమతంలోని అకార్యాలను నిరసించారు.

బుద్ధుడు, మహావీరుడు వేదధర్మం పేరున జరిగే దురాచారాలను నిలుపు చేయించారు. కర్మతత్వం నుండి జ్ఞానతత్వానికి భారతీయులను నడిపించారు. బసవేశ్వరుడు వేదాచార బ్రాహ్మణుడై వుండి కూడా వైదిక తతంగాలను మోసపు ఆచారాలను నిరసించాడు. బ్రహ్మ సమాజంకూడా అవైదిక బ్రాహ్మణాచారాలను అంగీకరించలేదు రాజారామమోహనరాయ్ హిందూమతం మీద ధ్వజం ఎత్తాడు. స్వామీ దయానంద సరస్వతి వైదికమతాన్ని సంస్కరించి ధర్మపునరుద్ధరణ చేయాలని 'ఆర్యసమాజం' స్థాపించారు. 'రామకృష్ణమిషన్' కూడా వైదిక మూఢా చారాలను తొలగించి వేయాలని అవిరళ కృషి చేస్తూవుంది.

వేదం నేర్చుకోవాలంటే ముందుగా సంస్కృతం అభ్యసించాలి. వేదాన్ని అనుదాత్త ఉదాత్త స్వరిత దీర్ఘస్వరిత యుక్తంగా స్వరపఠనం చేయాల్సివుంది. స్వరయుతంగా వేదపఠనం చేయలేనివారు చేతగానివారు. నేర్చుకోనివారు పురోహితాన్ని చేయకూడదు. స్వరమే వేదానికి ప్రాణం. స్వరంలో ఏ మాత్రం తప్పు దొర్లినా అర్థం మారుతుంది. మంచి జరుగటంపోయి చెడు జరుగుతుంది. స్వరంతో పాటు పదవిచ్ఛేదనం కూడా తెలిసి వుండాలి. తే.....తూ..... అంటూ తుతూరి మంత్రాలు చదివితే పూజ చేయించేవారికి అరిష్టం జరుగుతుంది.

"ఇంద్ర శత్రో వర్ధస్య' = ఇంద్రుని శత్రువు వర్ధిల్లాలి.

"ఇంద్ర! శత్రోవర్ధస్య = ఇంద్రా! నా శత్రువు వర్ధిల్లాలి.

చూచారా! ఒకే వాక్యం ఎంతటి అర్థాలను ఇస్తుందో ఒకసారి గమనించండి.

నాస్తికవాదం పాపమా? అంటే ఆస్తికులకు పాపంగానూ, నాస్తికులకు న్యాయంగానూ కనిపిస్తుంది. తప్పు చేయటం పాపం! అన్యాయం చేయటం పాపం! తర్కం చేయటం పాపం కాదు.

> దేవుడు మనం ఊహించ లేనంతటి కరుణాశాలి. ఆయన ఆస్తికులనూ నాస్తికులనూ రక్షిస్తాడు. మోక్షాన్ని ప్రసాదిస్తాడు. కాని మోసం చేసే మాయ చేసే తంత్రగాళ్ళను మాత్రం శిక్షించి తీరతాడు. శ్రీహరి హిరణ్య కశిపునికి, దంతవక్త్రునికి, శిశుపాలునికి, హిరణ్యాక్షునికి మోక్షాన్ని ప్రసాదించలేదా!

✦☆✦

ప్రాచీన శాస్త్రగ్రంథాలు ఎవరు వ్రాశారు?

మన ప్రాచీన ఋషి పుంగవులందరూ శాస్త్రవేత్తలే!

పరిశోధనలకోసం జీవిత కాలమంతా పరితపించినవారే!

జగత్కల్యాణంకోసం బ్రహ్మచర్యం స్వీకరించి పాటుపడ్డవారే!

ఈనాటి మన సుఖాలన్నీ వారి త్యాగ ఫలితంగా మనకు లభించినవే!

మన భావాలకు భాష కల్పించి ఇచ్చింది ఆ పుణ్యాత్ములే.

వారందరికీ మనజాతి తరుపున వందనం! అభివందనం! ఈనాడు మనం చూస్తున్న అనుభవిస్తున్న, ఆనందిస్తున్న సమస్తమూ ఏనాడో మన ఋషులు కనిపెట్టినవంటే అంత త్వరగా నమ్మలేం! కాని నిజమైన నిజం. విమానాలనూ, విద్యుత్తునూ, దూరవాణి విశేషాలనూ మన ఋషులే కనుగొన్నారు. వైద్య శాస్త్రాన్నీ, ఆపరేషన్లనూ, ప్లాస్టిక్‌సర్జరీని మనవారే మొదట కనుగొన్నారు. విటమిన్లను కూడా మొదట గుర్తించింది భారతీయ ఋషులే! భూమి గుండ్రంగా వుందని (అండాకారంగా వుందని) గుర్తించింది కూడా భారతీయ ఋషులే! అతి కాముకత్వం, విశృంఖల శృంగారం అనేక రోగాలను సృష్టిస్తుందనీ, ఏదో ఒక నాటికి జీవితాన్నే బలి తీసుకొంటుందని మొదటగా గుర్తించింది భారతీయ ఋషులే! మానవపురోభివృద్ధికి ఆధ్యాత్మికరంగం కూడా అత్యావశ్యకమని గుర్తించింది భారతీయ ఋషులే! బహులైంగికత్వం వలన జాతివృద్ధి జరుగదనీ, శక్తిమంతులు, బుద్ధిమంతులు జాతికి దూరమైపోతారని, పురుషులకు ఏకపత్నీ వ్రతాన్నీ, స్త్రీలకు పాతివ్రతాన్నీ శాసించింది భారతీయ ఋషులే! శక్తిపూరకమైన 'బి' విటమిన్ కలిగిన వరి గోధుమ, జొన్నలను ప్రధాన ఆహారంగా అలవాటు చేసినవారు భారతీయ ఋషులే! మానవాభివృద్ధికి మనుషులే ముఖ్యంగాని ధనంకాదని బోధించింది భారతీయ ఋషులే! మనుషులకు ఉపకరించి సేవజేసే అడవి జంతువులను ఆవు, మేక, గుర్రం, పంది, కుక్క, పిల్లి, గాడిద, గేదె, కోడి, ఏనుగు, ఒంటె, మొదలైన శాకాహార సాధుజంతువులను జనావాసాలకు పెంపుడుగా చేసింది భారతీయ ఋషులే! స్త్రీ – పురుషునికి వివాహం అనే

సంబంధాన్ని సృష్టించింది భారతీయ ఋషులే! తోడబుట్టినవారితో కామ కలాపాలు నిషిద్ధమని మనుష్యులలో పవిత్రబంధాన్ని స్థాపించింది మన భారతీయ ఋషులే!

అలనాటి ఋషులందరికీ కోటానుకోట్ల అభివందనలు.

భరద్వాజ మహర్షి ఆకాశంలో ప్రయాణించదగిన రకరకాల విమానాల నిర్మాణం గురించీ, సముద్ర ప్రయాణానికి వుపయోగపడే పెద్దపెద్ద పడవలవంటి ఓడలగురించీ, భూమిమీద అతివేగంగా సంచరించగల మహారథాల గురించి యంత్రశాస్త్రాన్ని వ్రాశాడు.

అగస్త్య మహర్షి భూమి, విద్యుత్, సౌరశక్తి, అగ్నిశక్తి మొదలైన శక్తుల గురించి శక్తి శాస్త్రాన్ని వ్రాశాడు.

> ప్రపంచానికి ముందే మనకు
> నాగరికత నేర్పింది ఋషులు!
> ప్రపంచానికి ముందే మనకు
> జ్ఞానం నేర్పింది ఋషులు!
> జీవన విధానాలను
> నేర్పింది ఋషులే!
> వారందరూ బ్రహ్మచర్య దీక్షులే!
> జాతి అభివృద్ధి వారి లక్ష్యం.

అత్రిమహర్షి ఆకాశంలోని పరివర్తనలు, మేఘాల చలనాలు, వర్షాలు, మెరుపులు, పిడుగులు మొదలైనవాటి గురించి వాతావరణ శాస్త్రం వ్రాశాడు.

విశ్వామిత్ర మహర్షి రకరకాల అస్త్రాలు ప్రయోగించే విధానం, దీక్ష, సంగ్రహం, సిద్ధాంతం ప్రయోగం, అనే నాలుగు విభాగాలుగా రకరకాల ఆయుధాల నిర్మాణం గురించి వ్రాశాడు.

ధన్వంతరి, అగ్నివేశుడు, అత్రి భరద్వాజాదులు వైద్యశాస్త్రం (ఆయుర్వేదం) వ్రాశారు. వృక్షాలు లతలు, మొక్కలు మొదలైన వాటిని గురించి, వాటి వుపయోగాల గురించీ వ్రాశారు.

అశ్వనీ కుమారుడు (రసశాస్త్రం) ధాతుశాస్త్రంగురించి వ్రాశాడు. ఘన పదార్థాలను ద్రవీకరించటం ద్రవపదార్థాలను ఘనీకరించటం బంగారం వెండి రాగి మొదలైన లోహాల గురించి వివరించే శాస్త్రం యిది.

భరతముని సంగీతం, నాట్యం మొదలైన గాన నృత్యాలను వివరించే గంధర్వశాస్త్రాన్ని వ్రాశాడు.

కశ్యప మహర్షి ఇనుము మొదలైన లోహాలను వుపయోగించకుండా భవంతులు వంతెనలు తయారుచేయటం శిల్పాలు చెక్కటం వాటి కొలతలు మొదలైనవాటి గురించి వ్రాశాడు.

కండిక మహర్షి శబ్దశాస్త్రం వ్రాశాడు.

వాల్మీకి మహర్షి అక్షరలక్ష అనే సర్వశాస్త్రం వ్రాశాడు. దీనిలో సర్వశాస్త్రాలు వున్నాయి. గణితశాస్త్రం, ఖనిజశాస్త్రం, భూగర్భశాస్త్రం వాతావరణశాస్త్రం మొదలైనవెన్నో వున్నాయి.

సుకేశముని పాకశాస్త్రం వ్రాశాడు.

రత్న శాస్త్రాన్ని వాత్సాయనుడు వ్రాశాడు.

మతంగ ఋషి యోచనా శాస్త్రం వ్రాశాడు.

ఆర్యభట్టు 'సున్నా' కనుక్కోకముందు గణితం కష్టతరంగా వుండేది.

వేల వేల ప్రాచీన మహర్షుల శ్రమ ఫలితాన్ని మనమిపుడు ఎంతో హాయిగా అనుభవిస్తున్నాం. పూర్వకాలంవారిని ఈసడించి మాట్లాడుతున్నాం.

ఋషి సంప్రదాయాన్ని అవహేళన చేస్తున్నాం.

"ఎవరి అమ్మ ఎంత గుణంగా వున్నా,

మన అమ్మే మనకు పరమ దేవత కదా!"

✦☆✦

గురువు దేవునితో సమానమా?

గురువు దేవునితో సమానం కాదు!

గురువు దేవునికంటే ఎంతో ఎంతో గొప్పవాడు.

కేవలం దేవుడు నమ్మకంతో ముడిపడ్డవాడు.

మన 'శ్రీగురువు' కనులముందు కనిపించే మహనీయుడు.

మనిషి తన జీవితంలో తీర్చుకోలేనిది గురువుల రుణం ఒక్కటే. అందు వల్లనే 'మాతృదేవోభవ' 'పితృదేవోభవ' అన్న తరువాత 'ఆచార్యదేవోభవ' అని చెప్పి గురువు స్థానాన్ని తెలియజేసారు మన పూర్వీకులు. తల్లితండ్రి తరువాత స్థానం గురువుదే. దైవత్వాన్ని కూడా గురువు ద్వారానే దర్శించవల్సి వుంటుంది.

శ్లో॥ అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా
చక్షురున్మీలితం యేన తస్మైశ్రీ గురవే నమః ॥

అజ్ఞానమనే గ్రుడ్డితనానికి జ్ఞానమనే కాటుక నిచ్చి కనులు తెప్పించిన శ్రీ గురువులకు నమస్కారములు. అని శ్లోకార్థం.

బ్రిటిష్ పాలకుల రాకతో గురుకులాలు గురుకుల విద్యాభ్యాసాలు పోయాయి. "మెకాలేదొర" విద్యా పద్ధతితో గురుమర్యాదలు పూర్తిగా పోయాయి. పూర్వకాలం గురువుగారు కూర్చుంటే శిష్యులు నిలుచుని పాఠాలు వినేవారు. ఇపుడు కాలిబూట్లతో శిష్యులు కూర్చుని వుంటే గురువుగారు నిల్చుని పాఠాలు చెప్పాలి. (దీనినే 'మెకాలే' పద్ధతి అంటారు)

విద్య వ్యాపారమయిందీనాడు

ఎపుడైతే విద్యాబోధనకు విలువలు తగ్గి విద్యాలయాలు వ్యాపార సంస్థలుగా మార్పుచెందాయో అపుడే గురువులు గుండ్రాయిలుగా అయిపోయారు. గురువులందరు 'మాస్టార్'లు అయ్యారు. ఇపుడింకా కొద్దిగా క్రిందకు దిగి 'సార్'లు అయ్యారు.

అయ్యో! గురువా! నీకెంత దుర్గతి పట్టిందయ్యా

ఈ మార్పుకి శిష్యులే కారణంకాదు గురువులు కూడా ఎంతో కొంత కారణమవుతున్నారు. విద్యాలయాల్లో కూడా కులవివక్షను చూపిస్తున్నారు. వ్యాపారధోరణి ప్రదర్శిస్తున్నారు. ఇపుడు విద్యాలయాలు విజ్ఞాన నిలయాలు కావు. ఆర్జనా నిలయాలుగా మారి బ్రతుకుదెరువు మార్గాన్ని మాత్రమే బోధిస్తున్నాయి. "యథాగురు తథా శిష్య"

ఏది ఏమైనా గురుస్థానం గురువుదే కదా! గురువుని దేవునిగా భావించి సాగిలపడి దండాలు పెట్టకపోయినా ఏనాడైనా ఎప్పుడైనా ఎక్కడైనా ఎదురుపడితే అభిమానంగా పలకరించండి. గురువులు కోరుకొనేది ఇంతే. మనం గొప్పవాళ్ళ మయ్యామని ప్రయోజన పరులమయ్యామని వారికి తెలియజేసి చూడండి. హృదయపూర్వకంగా ఎంత సంతోషిస్తారో మీ కళ్ళతో మీరే చూడండి. ఏమైనా గురూపకారం మరువలేనిది కదా!

✦☆✦

ప్రతి పూజకూ ఆవుపాలు కావాలా?

శ్లో॥ గ్రీవా మస్తక సంధే తు తాసాం గంగా ప్రతిష్ఠితా
సర్వతీర్థమయో గావః సర్వతీర్థమయః తథా ॥

గోవుల కంఠములోనూ, పొదుగులోనూ, మూత్రములోనూ గంగాదేవి వుంది. శిరస్సు, గంగడోలు, కాళ్ళు, కళ్ళు, చెవులు, తోక మొదలైన గోవు సర్వ అవయవాలలోనూ సర్వదేవతలు వుంటారని హిందువులకు ప్రగాఢ నమ్మకం. కొన్ని నివారణలేని రోగాలకు గోమూత్రాన్ని ఔషధంగా కూడా త్రాగుతారు. గోవు మలమూత్రాలలో 'పెన్సిలిన్' వుందని కనుగొన్నారు. గోవు నోటినుండి వచ్చే నురుగును మానని వ్రణాలమీద రాస్తూ వుంటే ఎంతటి పుండు అయినా మానిపోతుందట.

అందుకే గోవును 'గోమాత' అని గౌరవపూర్వకంగా పిలుస్తారు.

ప్రతిపూజకూ ఆవుపాలే కావాలా అంటే, వైదిక ధర్మంకావాలని చెబుతోంది. ప్రతిదేవుని పూజకూ ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవునెయ్యి, ఆవుమూత్రం, ఆవుపేడ విధిగా కావాలని చెబుతారు పురోహితులు. పాలపాకెట్లు వచ్చే శాక ఆవులను పెంచటం పూర్తిగా మానేశారు. ఏ యింటి ముందు గోమాత వుంటుందో ఆ యింటిలో సర్వశుభాలు వుంటాయి. ఆవు పాలు కావాలంటే పట్టణాలలో పరదాడవల్సిన స్థితి వచ్చింది. గేదెపాలను పలుచగాచేసి ఆవుపాలు అని మోసం చేయటం మామూలే.

> ఆవుపాలను అమృతంగా భావిస్తారు. ఆవుపాలు త్రాగి పెరిగినవారికి తెలివి తేటలు ఎక్కువగా వుంటాయట. గేదెపాలలో వున్నంత కొవ్వు ఆవుపాలలో వుండదు. కాబట్టి పసిపాపలకు ఆవు పాలు సర్వశ్రేష్ఠం.

క్రొత్తగా కట్టిన యింటి గృహప్రవేశం జరపాలంటే గోమాత కావల్సిందే. ముందుగా గోవును ఇంట్లో త్రిప్పిన తరువాతనే అందరూ గృహప్రవేశం చేస్తారు. భారతీయ జన జీవితంతో గోవు జతపడి వుంది. ఏ పూజలోనైనా గో క్షీరంతో దైవాభిషేకం చేయాల్సిందే.

పూర్వకాలంలో భూస్వాములకు గోస్వాములకున్నంత మర్యాద వుండేది కాదు. మొదటి కాన్పుకి వచ్చిన కూతురు బిడ్డతోపాటు అత్తవారింటికి వెళ్ళేటపుడు రెండు గోవుల్ని పసిపాపకోసం కానుకగా పంపే ఆచారం వుండేది.

మహాభారత కథలో ద్రోణునికీ ద్రుపదునికీ గోవు వల్లనే గొడవ వచ్చింది. శాస్త్రాలు చెప్పవల్సిన బ్రాహ్మణుడు ఈ గొడవ వల్లనే శస్త్రాచార్యుడై క్షత్రియుడయ్యాడు. ఒక్క ఆవుకోసం మొదలైన వివాదం చిలికి చిలికి గాలివానగామారి ద్రుపదద్రోణుల మరణానికి దారి తీసింది.

విష్ణుమూర్తికి గోవులంటే యిష్టం. అందుకే గోవిందుడు, గోపాలుడు అంటారు. గోవులుండే చోటికి శనీశ్వరుడు రాడు. గోదానం కూడా గొప్పది.

✦☆✦

రకరకాల దేవుళ్ళ పటాలు వుండకూడదా?

దేవుని మందిరంలో రకరకాల దేవుళ్ళచిత్రాలు, బొమ్మలు, బాబాల ఫోటోలు, స్వాముల పటాలు వుండకూడదు.

వేదాలు విగ్రహాలను పూజించటం అంగీకరించవు.

ప్రపంచంలోని అన్ని మతాలకు ఒక్కడే దేవుడున్నాడు. మనం కూడా 'దేవుడు ఒక్కడే' అని చెబుతూ యింటినిండా దేవుని మందిరం నిండా రకరకాల దేవుడి బొమ్మలతో నింపేసి మనోనిశ్చలతను దూరం చేసుకొంటున్నాం. ఈ పద్ధతి ధ్యానానికి మంచిదికాదు. ఒక్కో వారాన్ని ఒక్కొక దేవునికి అంకితం చేసి మనసు మలినం చేసుకొంటున్నాం. నోటితో చెప్పింది మనసుతో ఆచరించలేకపోతున్నాం.

దేవుడు ఒక్కడేనని తెలుసు!

దేవునికి రూపమే లేదని తెలుసు!

దేవునికి పేరు లేదని తెలుసు!

దేవుడు సర్వాంతర్యామి అని కూడా తెలుసు!

ఇన్ని తెలిసిన మనకు; మన మనుసుకి నిలుకడలేదనీ, చంచలమనీ, తెలియదు.

మన యింటిలో చాలా అందంగా ఎంతో ఖర్చుపెట్టి దేవుని మందిరాన్ని కట్టిస్తాం! చూచినవారందరూ 'అహో ఎంతదైవభక్తులు!" అని మనల్ని పొగిడించుకోవాలన్న తపనే గాని మనమెంతటి భక్తులమో మన అంతరాత్మకే తెలుసు. పాపం! దేవుడు రాయిగా వుండిపోయి మిగిలిపోయాడు! దేవుడికి నోరులేదని దేవుని కూడా మోసగించటమేనా!

> నీవు దేవుడిని పూజించినా, దెయ్యాన్ని పూజించినా ఒక్కరినే పూజించు. ఆ ఒక్కరినే మనస్సులో నిలుపుకో! ఆ దైవ తత్వానికే మనసును అంకితం చెయ్! అపుడు నీవు మంచి ఫలితాన్ని పొందుతావు.

నల్లగుడ్డలు కడితేనో, ఎఱ్ఱగుడ్డలు కడితేనో, పసుపు గుడ్డలు కడితేనో, దేవుడు ఎగిరిగంతేసి కోర్కెలను తీర్చివేయడు. గుండెల నిండా సందు లేకుండా కోర్కెల్ని కూరివేసుకొని వంగివంగి దణ్ణాలు, నంగి నంగి నమస్కారాలు పెడితే దేవుడు ఎలా అంగీకరిస్తాడు? ఎందుకు అంగీకరించాలి? ఒకసారి 'స్వామీ దయానందసరస్వతి' స్థాపించిన ఆర్యసమాజానికి వెళ్ళిరండి! ఒకసారి 'రాజా రామమోహనరాయ్' స్థాపించిన బ్రహ్మసమాజానికి వెళ్ళిరండి. ఇంట్లోనే కూర్చొని 'స్వామి వివేకానందుని' బోధనలు చదవండి. దేవుని స్వరూపమేమిటో తెలుసు కోండి. బుద్ధుని బోధనలు ఒకసారి చదవండి! మహావీరుని జైనమత సూత్రాలు తెలుసుకోండి!

దేవుని మందిరంలో ఒకే ఒక దేవుని పెట్టుకోండి!
ఆయన తప్పకుండా మిమ్మల్ని రక్షిస్తుంటాడు.
శైవమతస్థులకు శివుడొక్కడే దేవుడు.

✦☆✦

మంగళసూత్రం బంగారానిదే వుండాలా?

నిజంగా, రెండువేల సంవత్సరాల క్రితం మనకు మాంగల్యం లేదు.

"మాంగల్య తంతునానేన మమజీవన హేతునా
కంఠే బధ్నామి సుభగే సంజీవ శరదశ్శతం"

అనేటువంటి శ్లోకం లేదు. సప్తపది వుంది. కన్యాదానం వుంది. అగ్నిసాక్షి వుంది. శ్రీరామచంద్రుడు సీతామతల్లికి మాంగల్యం కట్టేది చలన చిత్రాలలోనే! రాముని కాలంలో మాంగల్యధారణ లేదు. కన్యాదానం మాత్రం వుంది. ప్రమాణం వుంది.

ఈ నాటికీ కొన్ని రాష్ట్రాలలో మాంగల్య ధారణ లేదు.

ఆనాటి పెండ్లికి ప్రమాణమే ముఖ్యం! అంతే!
ఈనాటి పెండ్లికి మనసే ముఖ్యం! ఇంతే!!

ఆనాడైనా ఈనాడైనా పెండ్లి అంటే మూడుముళ్ళు, బాజాలు, లైట్లు, వేయిమందికి భోజనాలు, నగలు, కారులు, కట్నాలు, పట్టుచీరలు, కళ్యాణ

మండపాలు, వీడియోలు, గానాబజానాలు కాదు! వివాహం అంటే ఏమిటో, ఎందుకు కావాలో ఏ తల్లిదండ్రులైనా తమ బిడ్డలకు చెప్పారా!?!

విలువలు తెలియని వివాహానికి గెలువెందుకుంటుంది!

మరి అందుకే; విడాకులు అంటే ఎవరికీ భయంలేదు.

పెండ్లి అంటే -

ఒక ఒప్పందం!

ఇరుజీవిత కాలపు తిరుగులేని మహా ఒప్పందం!!

ఏకోర్టులూ, ఏ చట్టాలు, ఏ మనుష్యులు, ఏ సమస్యలు, ఏ కష్టాలు, ఏ దేవుడూ విడదీయరాని, విడదీయలేని, విడదీయగూడని, ఆత్మసాక్షి ఒప్పందం!

"వివాహం ప్రతివ్యక్తికీ ఒక మలుపు.

మరణించే వరకూ వుండవల్సిన తీయని వలపు."

అందుకే;

క్రైస్తవమతం విడాకులను అంగీకరించదు. మహమ్మదీయ మతం విడాకులను అంగీకరించదు. హిందూమతం ఏ స్థితిలోనూ విడాకులను అంగీకరించదు.

వివాహం చిన్న విషయ మేమో గాని విడాకులు మాత్రం చిన్న విషయం కాదు.

లోహాలన్నిటిలోనికి వన్నె తరగనిది నాశనం లేనిది బంగారం కాబట్టి తరువాత కాలంలో శాశ్వతంగా వుండాలని బంగారపుతాళి వాడుకలోనికి వచ్చింది. విలువైన వస్తువుగాబట్టి తాళి (మంగళసూత్రాలు) ప్రాముఖ్యత పెరిగింది.
తాళికీ బంగారానికీ సంబంధమే లేదు.

వివాహానికి మంగళ సూత్రం బంగారానిదే వుండాలా? మరొక లోహానిది పనికిరాదా! ఎందుకు పనికి రాదు? అని ప్రశ్నిస్తే -

"తాళి" అంటే తాళవృక్షపు (తాటి చెట్టు) ఆకులతో వివిధ రకాలుగా తయారుచేసే చిన్ని ఆభరణం వంటి దానిని 'తాళి' అంటారు. ఇది ద్రావిడుల ఆచారం. మనలాంటి తాళి ఉత్తర భారతీయులకు (ఆర్యులకు) లేదు.

✦☆✦

దేవుడెందుకు కనిపించడు?

ఎందుకు కనుపించడు!

దేవుడు తప్పకుండా కనిపిస్తాడు.

ప్రతివారికీ, ప్రతిరోజు, ప్రతిచోట, ఎక్కడో ఒకచోట కనిపిస్తుంటాడు

మనమే అతనిని గుర్తించటంలేదు.

ఒకసారి తొందరలో రోడ్డుకి అడ్డంగా వస్తూపోయే వాహనాలను గమనించ కుండా పరుగెత్తావు గుర్తుందా! నీవెనుకనుండి నీకు తెలియని నీకు సంబంధం లేని ఎవరో "బాబూ! బస్సువస్తోంది" అంటూ కేకవేశారు. గుర్తువచ్చిందా! ఆ కేక వేయించిందెవరో గుర్తించావా! **ఆయనే దేవుడు!**

మరొకసారి మోటార్‌సైకిలు ఎక్కి కుడి ఎడమలు గమనించకుండా పనితొందరలో దూసుకొని పోబోతుంటే కాకిబట్టలు వేసుకొన్న ఒక వ్యక్తి నిన్ను గట్టిగా మందలించాడు. గుర్తుకు వచ్చిందా! **ఆయనే దేవుడు!**

ఇంకొకసారి మతి చెడగొట్టుకొని మత్తుమందు త్రాగుతూ తూలిపోతుంటే 'సార్! ఇక చాలుసార్! ఇంటికి వెళ్ళండి" అంటూ నీకు చేతులు కట్టుకొని వినయంగా చెప్పాడొకడు! గుర్తుందా! **ఆయనే దేవుడు!**

మరలా ఒకసారి నడివీధిలో ఒకడి చొక్కాపట్టుకొని వాడిని నాలుగు గుద్దుతూ వానిచేత నాలుగు గుద్దించుకొంటూ క్రింద పడి పైనబడి చొక్కా చించుకొని వున్న సమయంలో దారినబోయే ఒకాయన "ప్లీజ్‌సార్! వదిలేయండి! తెలిసినవారు మీరు కూడా" అంటూ మిమ్మల్ని విడదీసి ప్రక్కకు నెట్టిన ఒక మనిషి గుర్తున్నాడా నీకు! **అయ్యో! ఆయనే మనిషిరూపంలోని దేవుడు!**

ఒకసారి మితిమీరిన కోపంలో నీ భార్యను పిడిగుద్దులు గ్రుద్దుతూవుంటే, గావుకేకలు వేస్తూ విడిచిపెట్టమని నీ కాళ్ళకుచుట్టుకొన్న వారెవరో గుర్తుపట్టావా!

ఆయనే! నీవారి రూపంలో నీకాళ్ళకు చుట్టుకొన్న దేవుడు! చూచావా! ఆయనకు చిన్నా పెద్దా బేధం లేదు. అందుకే నీ కాళ్ళు పట్టాడు. ఇన్నిసార్లు నీ వద్దకు తనంతతానుగా వచ్చినా గుర్తించలేదా!	దేవుడు దేవుడిలా ఎవరికీ కనిపించడు. ఏదో ఒక రూపంలో ఎవరినో ఆవహించి ఎవరిలోనో వుండి నీకు మంచి చేస్తుంటాడు. నిన్ను కాపాడుతూ వుంటాడు. నీవు అనుకొన్నపుడు రాడు. కన్నబిడ్డలంటే ఆయనకు అమితప్రేమ! నీవు కాదన్నా నీకు కనిపిస్తూనే వుంటాడు. అదే ఆయన పని!

మనిషిరూపంలో వస్తేనే చూడలేకపోయావ్. ఎంత పిచ్చివాడివి!

అనంతానంత దివ్యశక్తులతో వస్తే నీవింకేం చూస్తావ్?!?

అందుకే అసలు రూపంతో కనిపించడు నీకు.

ఒక్కోసారి మన జేబు ఎవరో కొట్టేస్తారు. దేవుడు వచ్చి రక్షించడు! అంటే ఆ డబ్బు నీకు చెందినది కాదన్నమాట! నీవెక్కడో, ఎపుడో, ఏదో, పొరపాటు చేశావన్నమాట! అందుకే వారి డబ్బు వారికోసం వెళిపోయింది.

✦☆✦

ఉప్పును దొంగిలించ కూడదా?

ఉప్పు శనీశ్వరుని సంకేతం.

ఉప్పును కాళ్ళతో త్రొక్కకూడదు దొంగతనం చేయకూడదు. ఉప్పును చేబదులుగా అప్పు తీసుకొనకూడదు. ఉప్పును చేతికి అందించకూడదు. ఉప్పు మూటలమీద కూర్చొనకూడదు.

పూర్వకాలంలో ఉప్పును సంగ్రహించటం చాలా కష్టంగా వుండేది. ఉప్పు లేని ఆహారపదార్థాలు వండటం కుదిరేది కాదు. తీపి పులుపు కారం లేకుండా చాలా ఆహారపదార్థాలు తయారుచేయవచ్చుగాని ఉప్పులేకుండా దిననిత్య ఆహారాలు తినటం కుదరదు. అందువల్ల ఆ రోజుల్లో ఉప్పు దొంగతనాలు జరిగేవి. ఎవరూ ఉప్పును దొంగిలించకుండా చేయటానికి ఉప్పును శనీశ్వర సంకేతంగానేకా, యమధర్మరాజు సంకేతంగా కూడా చెప్పి పామ రజనాన్ని భయపెట్టేవారు. రుచులన్నిటిలోకి గొప్పది ఉప్పు. ఈ ఉప్పు గొప్ప తనాన్ని గూర్చి భాస్కర శతకంలో ఒక పద్యం గుర్తుకొస్తోంది.

చదువది ఎంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణ సంయుతులెవ్వరు మెచ్చరెచ్చటన్
పదునుగ మంచికూర నలపాకము చేసిననైన నందు ఇం
పొదవెడు ఉప్పులేక రుచిపుట్టగ నేర్చునటయ్య భాస్కరా!

✦☆✦

పాలను త్రొక్కితే పాపమా?

మహాలక్ష్మీదేవి పాలలోనే పుట్టింది.

పాలు లక్ష్మీదేవికి నివాసస్థానం.

ఆ కారణంచేత పాలను త్రొక్కకూడదు.

ఒక చుక్కపాలు తయారుకావటానికి శరీరానికి ఎంతో శక్తి కావాలి! పాలల్లో ఎంతటి సంపూర్ణశక్తి వుంది! త్రాగిన వెంటనే మనిషికి శక్తిని సమకూర్చేది పాలు ఒక్కటే! ద్రవాహారంలోపాలు; ఘనాహారంలో చేప; ఈ రెండు ఆహారాలు అతివేగంగా శరీరానికి శక్తినిస్తాయి.

పాలు అమృతంతో సమానమైనవి. ఏ కారణంచేతనూ పాలు, పెరుగు, వెన్న, నేయి వృధా చేయటం పాపం. అందువల్లనే మన పూర్వజాతి జీవనోన్నతికి కారణమైన ఆవు, మేక (గొర్రె), గుర్రం ఈ మూడింటినీ చేతితో అదలించాలేగాని కర్రతో కొట్టటం మహాపాపం అని వేదశ్రుతి. ఆవునీ, మేకనీ, గుర్రాన్నీ కొట్టకూడదు. మన జాతి వికాసానికి తోడుగా వున్న ప్రాణులు ఇవే.

మనిషి తన మేధాశక్తితో తెలివితో సృష్టించలేనివి పాలు! పాలను కృత్రిమంగా ఏ మేధావీ సృష్టించలేడు. పాలలోని గొప్పదనం అదే! ఏ మాతృమూర్తి అయినా తన చేతితో గ్లాసుడు పాలు ఇచ్చిందంటే ఆమె మనకు స్వంత తల్లితో సమానమే. పాలు సమృద్ధిగా వున్న యింటిని శనీశ్వరుడు తన కడగంటితోనైనా చూడదట. పాలవాసన వున్న యింటికి దరిద్రదేవత రాదట!

✦☆✦

అద్దం పగిలితే అరిష్టమా?

అద్దం పగిలిపోగూడదు.

పగిలిన అద్దాన్ని యింటిలో వుంచకూడదు.

మరకలు పడి మాసిపోయి మసక బారిన అద్దాన్ని యింటిలో వుంచరాదు.

పగిలిన అద్దంలో ముఖం చూచుకొనకూడదు.

అద్దాలను ఇసుకతో తయారుచేస్తారు. ఇసుకను కొన్ని రసప్రక్రియలతో కరగించి శుద్ధిచేసి గ్లాసులను తయారుచేస్తారు. కొన్ని వందల సంవత్సరాల క్రితం ఈ ప్రక్రియ ఎంతో శ్రమతో కూడుకొని వుండేది. అద్దాలను 'బెల్జియం' దేశంనుండి చిన్నచిన్న పలకలుగా భారతదేశానికి ఓడలమీద తెచ్చేవారు. పగిలితే పనికిరాని వస్తువు అద్దమే గదా! కాబట్టి విలువైన అద్దాన్ని జాగ్రత్తగా వాడు కోవల్సివుంది. అతిసున్నితమైన వస్తువు అద్దం గాబట్టి అద్దం పగులకుండా చూచుకోవటానికి ఎంతో హెచ్చరికగా వుండాలి. అందుకోసమే అద్దం పగిలితే అరిష్టం వస్తుందని భయపెట్టేవారని భావించవచ్చు! అద్దం పగిలితే కాలిలో గ్రుచ్చుకొనే ప్రమాదం కూడా వుంది గదా!

అద్దం లక్ష్మీ స్థానమని మనవారి నమ్మకం. అద్దానికి లక్ష్మికి కొన్ని పోలికలు కూడా వున్నాయి. ఇద్దరిదీ స్థిరత్వ బుద్ధి కాదు. అద్దంలో ఎపుడూ ఒకే బొమ్మ నిలిచి వుండదు. లక్ష్మి కూడా ఎప్పుడూ ఒక చోట నిలిచి వుండదు.

✦☆✦

మంగళ శుక్రవారాలు డబ్బును ఎవరికీ ఇవ్వకూడదా?

ఇది ప్రాచీన కాలంనుండీ వస్తున్న ఆర్థిక సంప్రదాయం. ఈ సంప్రదాయం వెనుక ఒక నిగూఢార్థం వుంది. డబ్బును ఖర్చుపెట్టటమంత తేలిక కాదు సంపాదించటం! దాచి వుంచుకున్న ధనాన్ని బయటకు తీసి ఖర్చు చేసేస్తే మరలా కూడబెట్టటం కష్టం గదా!

ఏ యింటిలోనైనా కష్టపడి సంపాదించే దొకరైతే కులాసాగా ఖర్చుబెట్టే దొకరు. ఇటువంటి జల్సారాయుళ్ళను ఒకనాటివరకైనా నిలువరించటానికి మంగళ శుక్రవారాలు పనికివస్తాయిగదా! పున్నమి అమావాస్య రోజులలో కూడా ఇంట్లోని రూపాయిని బయటకు పంపించరు చాలామంది. కొన్నికొన్ని సాధించటానికి మనకు మనమే కొన్ని కట్టుబాట్లనూ, నియమాలనూ ఏర్పరుచు కోవాలి. లేకపోతేఏమీ సాధించలేని అసమర్థులమైపోతాం. మనకున్న చాలా సంప్రదాయాలు ఆచారాలు ఈ విధంగా మనకు మనం విధించుకొన్నవే! దీని వలన మంచేగాని చెడులేదు. ఆచారం ఒక్కటే తెలిసి వుంటే ఫలితం లేదు ఆలోచన కూడా వుండాలి. అత్యవసర సమయాలలో, అపాయకర సమయాలలో ఆచారాలను పాటించనవసరం లేదని శాస్త్రాలు, స్మృతులు చెబుతున్నాయి. కొన్నిటిని పోగొట్టుకొంటేనే కొన్నిటిని పొందగలం. ఆర్థిక లావాదేవీలకు ఆంక్షలు వుండటం మంచిదే. "సర్వేగుణాః కాంచన మాశ్రయంతి" వరాలిచ్చే శక్తి వున్నది గాబట్టే దేవునికి నమస్కారాలు పెడ్తున్నాం. మంగళ శుక్రవారాలలో నిజం లేదుగాని పాటించటం మంచిదేమరి!

✦☆✦

ఊళ్ళు తిరుగని మగవాడు, తిరిగే ఆడది చెడిపోతారా?

అయ్యా! తిరగటం అంటే గాలి తిరుగుళ్ళు దొంగతిరుగుళ్ళు తిరగటం కాదు. ఈనాడు మనకు ఎన్నో దినపత్రికలు, వారపత్రికలు, రేడియోలు, టి.వి.లు దేశంలోని విజ్ఞానాన్ని దినదినమూ అందిస్తున్నాయి. పూర్వరోజుల్లో ఈ అవకాశం అదృష్టం ఎవరికీ లేదు. వివాహానికి ముందుగా పురుషులు ఒకసారి దేశసంచారం చేసి రావాలి. అన్ని విషయాలను తెలుసుకోవాలి. వ్యాపార మర్మాలు, వృత్తి రహస్యాలు సమాజ నియమాలు అర్థంచేసుకొని రావాలి. విజ్ఞానవంతుడు కావాలి. ఆ తరువాత వివాహ ప్రయత్నం జరుగుతుంది. ఒక సంవత్సర కాలమైనా దేశాటన చేయాల్సి వుండేది. ఈ విధంగా దేశాటన చేసి ఎంతో కొంత సంపాదించుకొని వచ్చేవాడన్నమాట. యిటువంటి యువకులనే అందరూ మెచ్చుకొనేవారు. అర్హునిగా భావించేవారు

పురుషునిలాగ స్త్రీ తిరుగకూడదు.

బంధువుల యింటికే ఎక్కువగా వెళ్ళనిచ్చేవారు కాదు. బంధువుల యిండ్లలో ఎక్కువ స్వేచ్ఛ వుంటుంది. అంతవరకు కట్టుబాటు జీవితంలో వున్నవారు అకస్మాత్తుగా స్వేచ్ఛా జీవితానికి వస్తే తప్పు ఒప్పుల తేడా తెలియదు జరుగరాని తప్పులు జరిగితే జీవితమే శిథిలమైపోతుంది. మగవాడు చేసిన తప్పుకి ఫలితం అనుభవించడు. ఆడది చేసిన తప్పుకి ఫలితంగా గర్భవతి అవుతుంది. గర్భస్రావాలు జరిపించే అవకాశాలు ఆనాడు అంతగా వుండేవి కాదు. తెలిసీ తెలియని ఆడవారి వైద్యంతో మరణించటమే జరుగుతుండేది.

తిరిగి ఆడది చెడితే, తిరుగక మగాడు చెడతారంటారు.

✦☆✦

మనుషులు దిగంబరంగా జీవించకూడదా?

వానరుడు నరుడుగా పరివర్తన చెందని రోజులలో దిగంబర జీవితాన్నే గడిపాడు. జన్మసిద్ధంగా మేధోశక్తి కల్గిన మానవుడు మొదట ఆహారంకోసం పోరాటాలు జరిపేవాడు. తరువాత కామసుఖాలకోసం పోరాటాలు జరిపేవాడు. సాటి పశుపక్షులను చూచి సామూహిక జీవితానికి స్థిరపడిన తరువాత మెల్లమెల్లగా భాష నేర్చుకొని ఏకత్వంలో భిన్నత్వంగా గుంపుజీవితం గడుపుతూనే భార్యాపిల్లలతో వుండేవాడు. తరువాత తరువాత కుటీరాలు నిర్మించుకొన్నాడు. గుంపుజీవితాన్నుండి ప్రత్యేక జీవితానికొచ్చేశాడు. భాషా ప్రావీణ్యం ఏర్పడింది. దేవుడు ఏదో శక్తిరూపంలో వున్నాడని భావించాడు. ప్రకృతినే దేవుడుగా పూజించటం ప్రారంభించాడు. ఆహారాలను వండుకొని తినటం నేర్చేసుకొన్నాడు. కాని మానవునికొక చింత మిగిలిపోయింది. 'సంతతి అభివృద్ధి జరగటం లేదు' అనేదే చింత. సంతానాభివృద్ధికి మంత్రంగా నారచీరలు కట్టుకోవాలని ఋషులద్వారా తెల్సుకొన్నాడు. మొదటగా నారచీరలు కట్టుకొన్నది మగవాడే! స్త్రీలు దిగంబరంగానే వుండేవారు. తదనంతర కాలంలో స్త్రీ పురుషులిద్దరూ బట్టలు కట్టుకొన్నారు. అప్పటివరకూ కామసుఖాలపై విముఖత వున్న స్త్రీ పురుషులకు కామాతృత పెరిగి వంశాభివృద్ధి జరిగిందని "మానవ విశ్లేషణ" చెబుతోంది. మరలా దిగంబరత్వానికివస్తే మానవజాతి పతనమైపోతుంది. అభివృద్ధి వుండదు.

✦☆✦

మాతా పితృఋణం అంటే ఏమిటి ఏం చేయాలి?

ప్రతి మనిషి మాతృఋణం, పితృఋణం, ఆచార్యఋణం దైవఋణం, ఋషి ఋణం అన్ని ఋణాలను తీర్చవల్సిన విధి వుంది. జన్మనిచ్చి పెంచి పెద్దజేసి నందుకు మాతాపితృ రుణాన్నీ, విద్యను నేర్పి లోకజ్ఞానం నేర్పినందుకు ఆచార్యరుణాన్నీ, మన మనుగడకు సహకరిస్తున్నందులకు దైవరుణాన్నీ, శాస్త్రాలనూ, ధర్మాలనూ జీవన పరిజ్ఞానాన్నీ గ్రంథాలద్వారా ఇచ్చినందుకు రుషి రుణాన్నీ తీర్చుకోవల్సిన ప్రధాన బాధ్యత పురుషునికి వున్నది. ఇందు నిమిత్తమే వివాహం చేసుకోవాలని పూర్వీకుల తీర్మానం.

మాతా పితృఋణం అంటే తల్లిదండ్రుల బాకీ అని అనుకోవచ్చు ఒక రకంగా! ఎలాగంటే; పశుపక్షుల్లాగా కాళ్ళు రాగానే నిన్ను బయటకు నెట్టేయలేదు. నీవు ఆర్జన పరుడవయ్యేవరకూ నిన్ను పోషించారు. నిన్ను ఆర్జనపరునిగా చేశారు. నిన్ను చదివించటమో, పని నేర్పించటమో వారివారి స్థోమతును బట్టి ప్రయోజకుడిగా చేశారు. నీ భవిష్యత్తుకి ఒక తోడు కావాలని నీకు పెండ్లి చేశారు. నీ భార్యా బిడ్డలను కూడా కంటికి రెప్పలా కాపాడటానికి సిద్ధంగా వున్నారు. రూపాయికి రూపాయిని ముడివేసి నీకింత ఆస్థిని పోగుచేసి పెట్టారు. నీ ముక్కు తుడిచి, నీ మలమూత్రాలను కడిగి నిన్నింతగా చేసిన తల్లిదండ్రులకు సేవచేసి ఆదరించి అభిమానంతో చూచుకోవటమే మాతాపితృ రుణం తీర్చుకోవటం.

ఏం చేసినా తీరనిది తల్లిదండ్రుల రుణమే గదా!

✦☆✦

సృష్టిలో మానవుడే గొప్ప ప్రాణియా?

ముల్లోకాలలో మానవుడే గొప్ప ప్రాణి.

మానవుని మించిన మహనీయుడు లేడు.

ఈ మానవజన్మ మించిన జన్మ లేదంటే లేదు.

ఎందుకని? ఎలా? ఏ విధంగా? ఏమిటి?

నడవటానికి మాత్రమే కాళ్ళు, తినటానికి మాత్రమే చేతులున్నది మనిషికే!

ఆహారాన్ని వండుకొని రుచిగా తినేది మనిషిమాత్రమే.

ఉప్పు, పులుపు, కారం, తీపి, రుచులు కలిసిన మేళవింపు మనిషికి మాత్రమే తెలుసు. ప్రకృతి ఉపద్రవాలనుండి ఏ విధంగా తప్పించుకోవాలో మనిషికి మాత్రమే తెలుసు. తనకు కావల్సినదాన్ని ఏ విధంగా పొందాలో మనిషికి మాత్రమే తెలుసు. సుఖాలపైమెట్టు, కష్టాల క్రింది మెట్టు మనిషికి మాత్రమే తెలుసు. మండుటెండలో చల్లగా నిద్రబోవటం తెలుసు. ఎముకలు కొరికే చలిలో వెచ్చగా నిద్రించటం తెల్సు. వాయు విహారం తెలుసు. భూవిహారం తెలుసు. జలవిహారం తెలుసు. గగనంలో తేలి రావటం తెలుసు. రోదసిలో వుండి రావటం తెలుసు. విజ్ఞత తెలుసు! వివేకం తెలుసు! సృష్టించటం తెలుసు! ప్రతి సృష్టి చేయటం తెలుసు! సాధించటం తెలుసు! వాదించటం తెల్సు!

బ్రహ్మతో పోటీపడదగిన తెలివి గలవాడు మానవుడు

బాధపడవల్సిన విషయమేమంటే; తాను సాధించిన విజ్ఞానానికి తానే బలిపశువు అవుతున్నాడు. మెదడు పెరిగింది. మనసు తరిగింది. మితిమీరిన స్వార్థం మర్రిచెట్టులా పెరిగి చిన్న చిన్న మొక్కల్ని మెలవనీయకుండా చేస్తున్నది. ప్రతివ్యక్తికీ సార్వభౌముడినై పోవాలన్న తపన తాపత్రయం పెరిగిపోతున్న దశలో మానవతా విలువలు మట్టిలో కలిసిపోతున్నాయి. నీతిని పాటిపెట్టి సంస్కారాన్ని సమాధిచేసి భవంతులు కట్టేయాలని తపించి పోతున్నాడు. (ఈ అనాలోచిత తప్పువల్లనే బాబాలు స్వాములు పుట్టకొక్కుల్లా పుట్టుకొస్తున్నారు.)

మానవ కులక్షేత్రంలో పెరిగి నిలిచిన తుమ్మ మొక్కల్ని పీకి తులసి మొక్కల్ని నాటగలిగితే దేవతలే స్వర్గం వదులుకొని భూమికి దిగి వచ్చేస్తారు. మరొక మానవవేదం సృష్టించి ఇస్తారు.

ఎంతకాదనుకొన్నా ఎంత వద్దనుకొన్నా ఎక్కడో ఏ మూలనో చిన్న ఆశ మిణుకు మంటోంది. ఎప్పటికైనా ఈనాడు కాకపోయినా మరొక నాటికైనా వైజ్ఞానికంగా ఎదిగినట్లే మానసికంగా కూడా ఎదుగుతాడు. అంతటి ధీయుక్తి ధీశక్తి ఒక్క మనిషికే వుంది.

సృష్టిలో మానవుడే గొప్పవాడు!

మనిషి మనసుపెడితే అమరత్వాన్ని అయినా అవలీలగా సాధించగలడు. దేవాధి దేవతలనైనా అధఃకరించగలడు. అందుకే "జంతూనాం నరజన్మ దుర్లభం" అన్నారు మహర్షులు.

శ్లో॥ గాయన్తిదేవాః కిల గీతగాని
ధన్యాస్తు తే భారత భూమిభాగే
స్వర్గాపవర్గాస్పద మార్గభూతే
భవంతి భూయాః పురుషాస్సురత్వాత్॥ -విష్ణుపురాణం

భారతీయుల గురించి విష్ణు పురాణమిలా చెబుతోంది. "ఓ భారతీయులారా! స్వర్గలోకంలో మీ గురించిన పాటలను గంధర్వులు గానం చేస్తున్నారు. మీధన్యత్వాన్ని గురించి వేనోళ్ళ పొగడుతున్నారు. మీ మానవ జన్మ గొప్పది. విశిష్టమైనది. మిమ్మ మించిన వ్యక్తిత్వం దేవతలకు కూడా లేదు.

సర్వేత్ర సుఖినః సంతు సర్వేసంతు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యంతు మాక్వశ్చిత్ దుఃఖమాప్నుయాత్ ॥

మంగళమ్ ! !

మానవకోటికి విజయమగు గాక !
సత్యధర్మాలకు సిద్ధియగుగాక !
స్త్రీజాతి క్షేమాన జీవించు గాక
పాలకులు నీతిని నెలకొల్పుగాక !
ఆహార మందరికి లభియించు గాక !
నిరుపేదలకు ధనము సిద్ధించుగాక !
వానదేవుడు ప్రేమ వర్షించు గాక !
పండితులు గౌరవము పొందెదరు గాక !
సస్యశ్యామల ధాత్రి పులకించు గాక !
జాతి జన కలహములు నశియించుగాక !
అభివృద్ధి అనుదినము వృద్ధియగు గాక !
మన కులము మంచిగా జీవించుగాక !

సర్వేషాం
సుఖ శాంతిర్భవంతు !
శాస్త్ర పీఠం సమాప్తమ్

శాస్త్రపీఠం

మరొక్కమాట

ఇది నాస్తిక రచన కాదు!

మార్పు సృష్టి సహజం

నిజమే!

అసలు మార్పు అంటే ఏమిటి?

బంధాలనూ, బంధుత్వాలనూ, ఆర్థికావసరాలకు వాడుకోవటం - పరసంస్కృతిని మన సంస్కృతిగా మార్చుకోవటం- వృద్ధులను వృథా వ్యక్తులుగా భావించటం కూడా మార్పేనా? మార్పు అనేది ఇదే అయితే; మనకొద్దు !

మరొక్క మాట!

ఈ "శాస్త్రపీఠం" లోని అన్ని వ్యాసాలు నా స్వయం లిఖితం! ఈ వ్యాసాల రచనకు "గొల్లపూడి వీరాస్వామి సన్, పబ్లిషర్స్" కి ఏవిధమైన బాధ్యత లేదు! ఈ వ్యాసాలన్నీ గ్రంథాధారంగా వ్రాశాను.

అందరి విమర్శలకు సివిల్ క్రిమినల్ చర్యలకు నేనే బాధ్యత వహిస్తాను. మీ విమర్శలను, చట్టపరంగానూ, ఉత్తరపరంగానూ, ఆహ్వానిస్తున్నాను! అయితే.....

నేనున్నచోటనే వివాదాలను పరిష్కరించుకోవాలి.

అభివందనాలతో.....

రచయిత :

గుత్తికొండ వేంకటేశ్వర శర్మ

1-1-2008

జ్ఞానపీఠం

పాఠకదేవుళ్ళకు వందనం !

"శాస్త్రపీఠం" చదివారు కదా!

ఈ శాస్త్రపీఠానికి తరువాయి పుస్తకముగా జ్ఞానపీఠం ప్రచురింప బోతున్నాం.

హిందూధర్మంలోని వేలాది ఆచారాలకు, సాంప్రదాయాలకు సరియైన వివరణ నివ్వాలనీ, గతతరంలోని సాంప్రదాయ విలువల్ని ఈతరానికి అందజేయాలనీ, ఉన్న మా సంకల్పానికి ప్రతిరూపమే

"జ్ఞానపీఠం"

(తాళపత్ర గ్రంథముల నుండి గ్రహించబడినవి)

❖ దేవుని ముందు దీపం ఎందుకు వెలిగించాలి? ❖పాతివ్రత్యం కోల్పోయిన స్త్రీని పరిత్యజించాలా? ❖ప్రథమరాత్రి ప్రత్యేకంగా చేస్తారెందుకు? ❖ భారతీయులకు వాత్సాయన సూత్రాలు అవసరమా? ❖ మంచివారికి కష్టాలెందుకొస్తాయి? ❖వంటి చేతితో నమస్క రించవచ్చా? ❖ మనుష్యులకు రోగాలెందుకు వస్తాయి? ❖మానవ స్త్రీలకు మాత్రమే ఋతుక్రమం ఎందుకున్నది? ❖ స్త్రీలు మాత్రమే వైధవ్యం అనుభవించాలా? ❖ ప్రేమించి పారిపోయిన యువతికి పెండ్లి చేయవచ్చా? ❖ భిక్షకులు 'ధర్మం చేయండి' అంటారెందుకు? ❖ తండ్రియే కొడుకు రూపంలో పుడతాడా? ❖ పిల్లలు పుట్టనివారికి ఆయుష్షు తక్కువ వుంటుందా? ❖ శవయాత్రలో స్త్రీలు ఎందుకు పాల్గొనరు? ❖దేవతలకన్నా మానవులే గొప్పవారా? ❖అన్నా చెల్లెళ్ళు పెండ్లి చేసుకోకూడదెందుకు?

ఇంటువంటి ఎన్నెన్నో సందేహాలకు ప్రాచీన సాంప్రదాయ బద్ధమైన ఆధారాలలో సరళ సామాజిక జనభాషలో వ్రాయబడింది.

త్వరలో విడుదల ! కాపీలకు సంప్రదించండి !

మీకు తెలుసా? ...

అష్టాదశ పురాణాలలోనూ అసాధారణ ప్రత్యేకం కలిగిన ఏకైక పురాణం 'శ్రీగరుడపురాణం'

ఎందుకంటే ? ప్రతి మనిషీ జననం మొదలు మరణం వరకూ ఆచరించవలసిన ధర్మాలను గురించి దాదాపు అన్ని పురాణాలూ చెప్పాయి. మరణానంతరం ఆ మనిషి నిమిత్తం ఆచరించవలసినవి చెప్పే ఒకే ఒక్క పురాణం ఇదే.

పూర్వకర్మ వశాన పుట్టిన ప్రతిప్రాణీ, వివేకం మరచి చేసే అకార్యాల వల్ల, అకృత్యాల వల్ల పాపం మూట కట్టుకొని దాన్నే పరలోకపు పెట్టుబడిగా పట్టుకెళితే నరక ప్రాప్తి తథ్యం.

పుణ్యకార్యాచరణతో పునీతుడై, అగణిత పుణ్యరాశి పొంది, ఇహమందే కాక పర మందు కూడ సుఖించగల అవకాశం (స్వర్గం) ఈ మానవజన్మను సార్థకం చేసుకున్నవారికి మాత్రమే సాధ్యం. ఈ ఉత్తమ మానుష జన్మను సద్వినియోగం చేసుకోని వారికి /నానా పాపాలకు పాల్పడే వారికి

★ నరకాలు ఎన్నిరకాలు? ★ అక్కడ పడే యమయాతనలు?

★ యమ ధర్మరాజు ఆజ్ఞపై, అక్కడ యమభటులు విధించే రకరకాల శిక్షలు?

సచిత్రంగా దాదాపు 60 బొమ్మలతో కళ్లకు కట్టినట్లు వివరించే, అతి ప్రాచీన పురాణం - ఇప్పుడు తేట తెలుగు వచనంలో..... మీ ముందుకు వచ్చింది.

శ్రీగరుడ పురాణము

(ప్రామాణిక సంస్కృత మూలముతో సహా) వెల: 150-00

సరళ వచనం : శ్రీ భాగవతుల సుబ్రహ్మణ్యం

క్వాలిటి పేపర్ మరియు ట్రెడిషనల్ హార్డు బౌండు మరియు

అదనంగా 6 పంచరంగుల చిత్రాలతో

ఇంతకాలం ఈ గరుడ పురాణం తెలుగులో జటిలమైన ఆంధ్రానువాదాలతో - అరకొర వివరణలతో లభ్యమవుతూ వచ్చింది. తేట తెలుగు వచనంలో పూర్తి సచిత్ర విపుల వ్యాఖ్యతో తొలిసారిగా మీకు అందిస్తున్నవారు.....

గొల్లపూడి వీరాస్వామి సన్స్

కోటగుమ్మం-రాజమండ్రి © 246 52 53

శాస్త్రం!

దివ్యాస్త్రం వంటిది! జీవరక్షణ కల్గిస్తుంది!

శాస్త్రం! సువస్త్రం వంటిది! మానరక్షణ కల్గిస్తుంది!

ఎందరెందరో

భారతీయ దివ్యఋషులు,

దార్శనిక శక్తి కల్గిన మహర్షులు మేధో మధనంతో

మానవోన్నతి కోసం శాస్త్రాలు రచించారు.

తులనాత్మక దృష్టితో నియమాలు విశదపరచారు. నిజమే!

ప్రాచీనాచారాలను,శాస్త్ర శాసనాలనూ

అనుసరించి ఆచరిస్తున్నాం! కానీ,

శాస్త్రీయ కారణాలెవరికీ తెలియదు ! అయితే,

మీ అనుమాన నివారణకూ, శాస్త్రీయ వివరణకూ

ఈ గ్రంధాన్నోకసారి తెరిచి చూడండి!

ముందుగా
విషయ సూచిక నుండి
ప్రారంభించండి.!

రచయిత :

బ్రహ్మశ్రీ గుత్తికొండ వేంకటేశ్వర శర్మ